
# కిటికీలో ఆకాశం

(నవల)

విప్లవ్



శ్రీ
కౌముది
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 47




# 1

**రాధికకు** ఆ రాత్రి నిద్రపట్టడం లేదు. ఒకసారి చంద్రుడిని చూడాలనిపిస్తోంది. కానీ ఆకాశమంతా నల్లని మబ్బులే. పరాయి మబ్బులు. ఆమెకు చాలా కాలం తర్వాత మళ్ళీ ఈ రాత్రి అలా అనిపిస్తోంది.

అంతా పరాయిగా.

తనది కానట్లుగా.

తొమ్మిదేళ్ళ ఐదునెలలు. తాను ఈ దేశం వచ్చిన రోజును గుర్తుచేసుకుంది రాధిక. అందరిలాగే అప్పట్లో ఆమెకు అమెరికా ఇష్టం. కొంత మోజు కూడా. విమానం ఇక అమెరికా భూభాగం చేరడానికి కొన్ని నిముషాలుంది అనగా కిటికీలోంచి చూసిన క్షణం ఆమె జ్ఞాపకాల్లో మెదిలింది... ఆ మబ్బులేమిటో తనకు పరిచయం లేనివిగా అనిపించి గుబులుపడింది. ఒహాయో హాప్కిన్స్ ఏర్‌పోర్ట్‌లో నడిచినప్పుడు ఆ గాలి తనకు తెలిసిన, ఇష్టమైన డిసెంబరు చలిలా కాకుండా ఏమిటో పరాయిగా అనిపించింది. అందరూ నా నేల, నా భూమి అంటూ దేశం అంటే భూమి మాత్రమే అంటారు. కానీ రాధిక చిన్నప్పటినుంచీ ఆకాశాన్ని తనకు తెలిసిన స్నేహితుడిలా భావించేది. విశాఖ సముద్రం ఒడ్డున నిలిచినా, చార్మినార్ చౌరస్తా దగ్గర తలెత్తి చూసినా, తిరుపతి గుడి గోపురాన్ని మొక్కుతూ కళ్ళెత్తినా, గోదావరి నీటిలో కదిలే మబ్బుల ప్రతిరూపాలను చూసినా... ఆఖరుకి బొంబాయి (ఆమె ఆలోచనల్లో ఆ నగరానికి ఇంకా పేరు మారలేదు) బజారులపై అయినా, తాజ్‌మహల్ బ్యాక్‌గ్రౌండ్‌లో చూసినా ఆ ఆకాశమంతా తనకోసమే ఉన్న ఒక గొడుగులా అనిపించేది.

ఆమెకు చిన్నతనంలో ఎక్కువమంది నేస్తాలు లేరు. ఆమెను అర్థం చేసుకున్న వాళ్ళు లేకపోతే పోనీ కనీసం అర్థం చేసుకోవాలని ప్రయత్నించినవాళ్ళూ లేరు. అయినా అర్థం చేసుకోవడానికి ఆమె ఎవరని? ఆఫ్ట్రాల్ ఒక చిన్నపిల్ల. ప్రపంచంలో ఎందరో చిన్నపిల్లల మనసులను ఇగ్నోర్ చేసినట్లు ఆమెలో... పెరుగుతున్న మనసు ఉనికిని ఎవ్వరూ గమనించలేదు. అదుగో... ఆరోజుల్లోనే ఆకాశంతో ఆమె దోస్తీ మొదలైంది. పన్నెండేళ్ళ వయసులో... జడపట్టుకులాగిన మగపిల్లాడిని తరుముకుంటూ నది అంచున పరుగెత్తిన రోజు.... కాలిలో గుచ్చుకున్న ముల్లును వదిలించుకుని అలసటగా వగరుస్తూ వెనక్కు వాలిన క్షణమే గుర్తించింది ఆ ఆకాశాన్ని. అంతటి అనంతమూ ఆమె కళ్ళల్లో ఇరుక్కుపోయింది. అలా చాలాసేపు చూస్తూనే ఉండిపోయింది. తేలికపాటి వేళ్ళతో కదిలే మబ్బుల అంచులను గాలిలోనే గీసింది. మారే రంగులను కళ్ళలో కట్టుకుంది. తనతో పాటు ఆకాశాన్ని ఇంటికి తీసుకువెళ్ళి, కిటికీ అవతల ఒక పెయింటింగ్ కాన్వాస్‌లా వేలాడదీసింది.

ఆ కిటికీకిటికీ పక్కనే ఆమె మనసు ఎదిగింది.

వయసు పెరిగినప్పుడలా కిటికీలూ, వాటి అంచులను నిర్ధారించే గోడలు, వాటితో నిలబడ్డ ఇళ్ళూ మారాయి... కానీ అదే ఆకాశం కాన్వాస్‌పై రాధిక ఎన్నో ఊహించుకుంది, నిర్మించుకుంది. అంతటి ఆకాశం ఆమెకు పరాయిదైపోయింది.... ఇండియా దాటగానే. కానీ ఆ పరాయితనం ఎన్నో రోజులు కాదు.

కొత్తగా పెళ్ళయిన అమ్మాయికి భర్త అనే మగాడూ, `భార్య` అనే పోస్టు అసౌకర్యంగా ఉన్నట్లు ఆ అమెరికా ఆకాశం ఆమెకు నప్పీనప్పక ఇబ్బంది పెట్టాయి. అసలే ఆమెకు ఆ సమయంలోనే, భార్య పోస్టు వచ్చింది కూడా. పెళ్ళి చేసుకున్న రాజును తెలుసుకుని, తనవాడిగా చేసుకుంటూనే ఆ ఆకాశానికీ అలవాటు పడింది.

`నువ్వు ఇది కావాలి అని చెప్పు ఏం అయినా తెచ్చిస్తాను` అంటూ ఒక ముచ్చటైన క్షణంలో రాజు ఆమెను అడిగినప్పుడు... `ఆకాశం తెచ్చిస్తావా` అని ఆమె కోరింది. అతనికి జోక్ అనిపించి నవ్వేసాడు. చేసేదేమీలేక ఆమె కూడా నవ్వేసింది. మొత్తంగా సాధ్యం కాకపోయినా, కనీసం ఈ అమెరికా ఆకాశంలోంచి ఒక చిన్న ముక్కనైనా తీసుకెళ్ళాలి అనిపిస్తోంది రాధికకు. రెండు రోజుల్లో తాను తన స్వంత ఆకాశం కిందకు వెళ్ళిపోతుంది మరి. చల్లటి గాలి విరహంగా ఆమె మీద వీచింది. ఆమె మనసు చెదిరేలోగానే, వెనకనుండి కౌగిలించుకున్నాడు రాజు.

"ఏమిటి మేడం? ఏమైనా తపస్సు చేస్తున్నారా?" అతని ఊపిరి ఆమె చెవి వెనక వెచ్చగా తగిలింది. కౌగిట్లోనే సర్దుకుంటూ, అతని చేతులను తన చేతులతో నిమిరింది. అతనిలో ఆమెకు నచ్చే అంశాల్లో ఒకటి: అతని చేతుల మీది జుత్తు. ఆ విషయం ఆమె అతనికి ఎప్పుడూ చెప్పనేలేదు.

"నేనంటే సరే, ఏదో పిచ్చి విషయాలు ఆలోచిస్తూ ఉండిపోయా. నువ్వు డైనోసార్‌లా గురక పెడుతున్నావుగా. ఎప్పుడు లేచావ్?" అతని చేతిమీద జుత్తును పీకింది.

"అబ్బా... నొప్పేస్తుంది..." అంటూ ఆమెను విడిచి మంటపుట్టిన చేతిని పక్కాటెముకలమీద రుద్దుకుంటూ "రేపు ఏదో సర్జరీ ఉందికదా. నిద్రపోకపోతే ఎలా?" అంటూ ఆమెను లోపలకు పదమన్నట్లు చూసాడు. బాల్కనీలోంచి వెళ్ళబుద్ధికాక ఆకాశం వేపు చూసింది రాధిక.

"రాధీ..." ఆమెను భుజం పట్టుకుని తిప్పాడు రాజు.

"ఏంటీ?" చిరాకుపడింది ఆమె.

"సర్జరీ "

"ఆఁ సర్జరీనే. నువ్వా చేసేది?"

గతుక్కుమని బిక్కమొహం వేసాడు రాజు.

"అంతేలేమ్మా... నీకే వచ్చు మెడిసన్ అంతా అని..."

"రాజుగారూ... ఇది మెడిసిన్ కాదు... సర్జరీ..." అతని చెంపలు లాగింది ఆమె. ఆమె అలా చేస్తే.... ఆమెకు తాను ముద్దొస్తున్నట్లని అతనికి తెలుసు. మగవాడు కూడా సిగ్గుపడితే.... ఒకోసారి అందంగానే ఉంటాడు. ఆమె చేతుల్లోంచి ముఖం తప్పించేసుకుంటూ బెట్టు చేసాడు రాజు.

"ఏదో ఒకటి..... అన్నీ ఒకటే ....కాటన్ కంపు. జబ్బు తెలుపు" ముక్కుమూసుకుని బాల్కనీలోంచి బెడ్రూం లోకి తప్పుకున్నాడు రాజు. కోపంతో మండిపోయింది రాధిక.

"నీకు లక్షసార్లు చెప్పా. ప్రొఫెషన్‌ను ఇన్సల్ట్ చెయ్యొద్దని" కీచుమంటూ అతడిని అనుసరించింది. ఏం చేసైనా ఆమెను బాల్కనీలోంచి లాగెయ్యాలన్న ప్లాను పారినందుకు రాజు నవ్వుకుంటూ దుప్పట్లోకి దూరాడు.

"ఆఁ నువ్వు మాత్రం నా ప్రొఫెషన్‌ను అనలేదూ... మొన్న... మొన్న.." ఆ మొన్నటి సంఘటన గుర్తురాక ఇబ్బంది పడ్డాడు రాజు.

"నేనేమన్నానూ....?

ఆమెకూడా దుప్పట్లోకి పొదుగుకుంది.

"ఆదే.. ఆరోజు... కుమార్ మ్యారేజ్‌డే యానివర్సిరీ పార్టీకి వెళ్ళినప్పుడు.."

"అది కుమార్ ఒక్కడికే మ్యారేజ్ డే కాదు. రమ్యకి కూడా"

"అబ్బా.సర్లే వాడి మ్యారేజ్ డే  సౌమ్యది కాదా?"

"సౌమ్య కాదు రమ్య"

"చూడూ.... వేరే లేడీస్ పేర్లు కూడా గుర్తుపెట్టుకోలేని నేను దొరికినందుకు నువ్వు సంతోషించాలి"

"సంతోషం... సంతోషం.. టీవీ పెడదామా? ఇలియానా డాన్స్ సాంగ్ ఏమైనా వస్తోందేమో. నోరు తెరుచుకుని చూడొచ్చు తమరు"

"అరే! హీరోయిన్‌ను చూస్తే కూడా తప్పే?!  అయినా హీరోయిన్లు వేరు, రియల్ లైఫ్ లేడీసు వేరు" ఆమె తల కింద పోనివ్వడానికి తలగడ మీదగా చేయిపోనిచ్చాడు రాజు. అతనికి అవకాశం ఇస్తూ, కాస్త మెడ పైకెత్తి, అతని చేతిమీద తలవాల్చుకుంది రాధిక.

"ఏంటో తేడా?" అతని చేతిమీద ఒరుసుకోకుండా జుత్తును పక్కకు తప్పించుకుంది రాధిక.

"హీరోయిన్లను చూస్తే చాలు. భరించక్కర్లేదుకదా"

"వాట్‌డూయూ మీన్...?"

"ఇప్పుడు అదంతా చెపితే తెల్లారిపోతుంది. అసలే రేపు సర్జరీ..."

"మళ్ళీ అదేమాట! సర్జరీ చేసేది నేనైతే నీకెందుకంత టెన్షన్?"

"నీ కెరియర్ గురించి నాక్కాకపోతే ఎవరికి టెన్షన్?"

"ఇందాకే ఏదో అన్నారు రాజుగారు... కంపు హాస్పిటల్ అదీ ఇదీ అని... "అతని వేపు తిరిగి మళ్ళీ ఒక చెంప మీద గిల్లింది. ఆమెకు నచ్చినప్పుడే అతడిని 'రాజుగారు' అని పిలుస్తుంది. అతని పూర్తిపేరు. చాలా పెద్దది. చివరన సింపుల్‌గా ఉండే రాజుతోనే చెలామణీ అయిపోతాడు.

"అవును కంపే అనుకో... కానీ తప్పదు కదా"

"వాట్ డూ యూ మీన్? అలా అయితే అసలు ఈ కంపు డాక్టరీ చదివే నన్ను పెళ్ళెందుకు చేసుకున్నావ్"

"ఏం చేసేది మరి? టైం బ్యాడ్ అసలు నిన్ను రిజెక్ట్ చేద్దామనే అనుకున్నా.." కోపంతో చివుక్కున లేచింది రాధిక ."అసలు నిన్నెవ్వరు యాక్సెప్ట్ చేసారని పెళ్ళిచూపుల్లో?! " అతడి మీంచి దుప్పటిని తప్పించింది, యుద్ధానికన్నట్లు.

"బాబోయ్! నో ఫ్లాష్ బ్యాక్స్! ఇప్పుడెందుకు అవన్నీ" దుప్పటి లాక్కున్నాడు రాజు.

"లేదు... నే గమనిస్తూనే ఉన్నా... ఇల్లాంటి మాట ఫ్రీక్వెంట్‌గా అంటూనే ఉన్నావ్... ఈవాళ విషయం తేలిపోవాల్సిందే" రాధిక పట్టు వీడలేదు.

"పెళ్ళి చూపులప్పుడే కన్‌ఫాం చేసాను కదా. నీకు వీసా ఈజీగా వస్తుంది కాబట్టి అదొక అడ్వాంటేజ్... నువ్వు డాక్టర్ అవడం నా అదృష్టం. పైగా మా నాన్నకు ఇంజనీర్లు ఇష్టం ఉండరు అని"

"మరి నిన్నెందుకు ఇలా తయారుచేసారు?"

"ఇలానా? ఎలా?"

"అదే. ఆ చిప్స్ తినే సాఫ్ట్‌వేర్ పని నిన్నెందుకు చేయనిస్తున్నారు?"

"ఒకళ్ళు చేయనిచ్చేదేమిటి? అయినా మా నాన్నకు సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకూ పొలంలో నీళ్ళ బోరు వేయించే ఇంజినీరుకూ తేడా అప్పుడు తెలీదు. ఇప్పటికీ పెద్ద తెలీదనుకో. అయినా నేను మా గురువుగారు బిల్ గేట్స్ ఇన్స్పిరేషన్‌తో..."

"ఆగాగు. ఇక చెప్పకు స్వామీ. నాకు నిద్రవస్తోంది."

"అన్యాయం... నన్ను ప్రొవోక్ చేసి, తీరా ఇప్పుడు నా జాబ్ గురించి చెబుతూ ఉంటే నిద్ర అంటావా?"

"లేదు రాజుగారు. నిజ్జంగా నిద్రే" ఆవులింత నటించింది రాధిక. బిల్‌గేట్స్ చరిత్ర అంటే ఆమెకు అప్పటికే చచ్చేంత భయం పుట్టించాడు రాజు. చెప్పినదే మళ్ళీ మళ్ళీ.. దాదాపు పన్నెండేళ్ళు చెప్పి. "లేదు. నువ్వు వినాల్సిందే యూనో... ఈ రోజు సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ పడిపోతుందేమో అని నాలాంటి చిన్నా చితకా కంపెనీ వాళ్ళంతా భయపడుతున్నామా? కానీ మా గురువుగారి మీదే నా నమ్మకం..."

"రామరాజుగారూ... ప్లీజ్... నాకసలే రేపు సర్జరీ ఉంది. రిసెక్షన్ ఆఫ్ పోస్టీరియర్ ఫోస్సా ట్యూమర్... ఒద్దులే... పేరు వింటేనే భయపడతావు. కష్టం" నిద్రపోతున్నట్లు కళ్ళు మూసేసుకుంది రాధిక.

"అన్యాయం! ఇప్పుడే గుర్తుకు వచ్చిందా? నేనిప్పుడు ఎవ్వరితో మాట్లాడాలి?" అతనూ దుప్పటి మీదకు లాక్కున్నాడు.

"ఇలియానా ఫోన్ నెంబరు తెలీదా?"

"రాధిక పేరు నీకు సూటవ్వదు... రాక్షసి కరెక్టు" అంటూ ఆమెకు కొంత దూరం జరిగాడు రాజు. అతనిక నిద్రపోతాడని ఆమెకు అర్థం అయింది.

నిద్రలో పక్కన మనిషి తగిలితే అతనికి ఎందుకో అంతగా పొసగదు. అతనికి దూరంగా అంచుకు జరిగింది రాధిక. ఆకాశం కనిపించే బాల్కనీ వేపు తిరిగి పడుకుంది.

వాళ్ళు ఈ రోజు చాలా హుషారుగా ఉన్నట్లు వాళ్ళకే అనిపిస్తోంది. ఎంత సంతోషంగా ఉన్నా, సంపాదించినా, మధురంగా గడిపినా ఇన్నాళ్ళకు పరాయి దేశం వదిలి స్వంతగూటికి చేరుతున్నామనే భావన హుషారు తెస్తోందనీ వాళ్ళకు తెలుస్తోంది.

"రాధి..." నిద్రతో రాజు గొంతు చిక్కబడింది.

"ఊఁ"

"అబ్బాయికి అయితే సిద్దార్థ్ అనే పేరు బావుండదూ?"

రాధిక గుండెలయలో పొలమారింది. ఏం మాట్లాడాలో తెలియనట్లు మౌనంగా కళ్ళుమూసుకుంది. ఆమె నిద్ర నటించబోతోందని రాజుకు అర్థమైంది. ఆమె భుజంపై చేయి వేసి దగ్గరకు తీసుకుందామనుకున్నాడు. కానీ అతనిలోనే గుబులు అడ్డం పడి ఊరుకున్నాడు. బాల్కనీ అవతల...

ఆకాశం మౌనంగా మబ్బులను మోస్తోంది.

గత పదేళ్ళలో రాధిక ప్రాణాన్ని మోయడం ఇది ఐదవసారి. నాలుగు ప్రాణాలూ రెండుమూడు నెలల్లోనే ఇగిరిపోయాయి. గతం భవిష్యత్తును భయపెడుతుంది మరి.

❦ ❦ ❦

"దట్ వాజ్ ఎ స్కేరీ మొమెంట్" కాఫీ సిప్ చేస్తూ కళ్ళు పెద్దవి చేసుకుని భయపడింది జెన్నీ.

"ష్యూర్ ఇట్ వాస్" కిటికీ అవతల లేత ఎండలో రాత్రి మంచులో తడిసిన రేకులను ఆరబెట్టుకుంటున్న టులిప్ పువ్వుల నుంచి చూపు తిప్పుకున్న రాధిక, కాఫీ సెగలు తగిలి ఎర్రబారిపోతున్న జెన్నీ ముక్కును చూసి ఆశ్చర్యపడింది. మనిషి శరీరం కూడా పువ్వు అంత సుకుమారమా? పక్కా రాయల్ ఐరిష్ శరీరం జెన్నీది. పసుపు జుట్టు, నీలం కళ్ళు, చెక్కిన బుగ్గలు... ఇలా ముట్టుకుంటే మాసిపోతారనేంత సుకుమారంగా ఉంటారనే గర్వంతోనే ఈ తెల్లవాళ్ళు పాపం మిగతా మనుష్యులను అంత హీనంగా చూసారేమో

అనిపించింది రాధికకు. తనకు రేసిజమ్ గురించి తెలిసినప్పటి నుంచీ.. అంటే ఏడో తరగతిలో అమెరికా హిస్టరీ కాస్తంత చదివినప్పటినుంచీ... ఇలా ఆలోచిస్తూనే ఉంది.

క్లీవ్‌లాండ్ లోని ఒక ప్రముఖ హాస్పిటల్. న్యూరో సర్జికల్ బ్లాక్‌లో డాక్టర్స్ క్యాబిన్‌లో అలిసిపోయి ఉన్నారు వాళ్ళిద్దరూ. రాధిక న్యూరోసర్జన్. జెన్నీ ఆంకలాజికల్ సర్జరీ ఎక్స్‌పర్ట్, ఒక పదేళ్ళ పాప మెదడు కింది భాగంలో తొలుచుకుని వచ్చిన పోస్టీరియర్ ఫోసామెనిన్జియోమా అనే కేన్సర్ కణితిని తొలిగించే సర్జరీలో ఇద్దరూ దాదాపు మూడున్నర గంటలపాటు పోరాడి విజయం సాధించి అలిసిపోయారు. ఈవాళ్టితో ఈ హాస్పిటల్‌కూ తనకూ చెల్లిపోయిందని కాస్తంత డీలాగా ఉంది రాధిక. ఎన్నో పరీక్షలు, విజయాలతో ఆమెకు అక్కడ ప్లేస్‌మెంట్ వచ్చింది. కెరియర్ గ్రాఫ్‌లో చెప్పుకోవడానికి ఎంతో గొప్పగా ఉన్నా ఆమెకు ఎందుకో అక్కడి పనితనం పెద్ద తృప్తిని ఇవ్వలేకపోయింది. ఇక్కడి ఆకాశంలానే ఎంత దగ్గరైనా ఇక్కడి మనుష్యులు కూడా ఎందుకో పరాయిగానే అనిపిస్తారు ఆమెకు. వైద్యురాలిగా తాను పరిశీలించే శరీరాల రంగు, ఆ మనుష్యుల ప్రవర్తన, వేరే భాషలో ధన్యవాదాల మాటలయినా పరాయిగానే తోస్తాయి. తను, తన విద్య, తనకు వచ్చినపని... అన్నీ కాస్తయినా తనవారికి అందించాలి కదా. ఆ మాత్రం 'తన' అనే స్వార్థం లేకపోవడమే తనలో లోపం అనే ఆమెకు అనిపిస్తోన్న సమయంలోనే రాజుకు స్వంత రాష్ట్రానికి వెళ్ళి పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టుకోవాలనే ఆలోచన రావడం, హైదరాబాద్‌లోనే ఉన్న అతని స్నేహితుల ప్రోద్బలం తోడవడంతో ఆమె కోరిక తీరుతోంది. కానీ తీరా ఇక వెళ్ళిపోతున్నాం అనేప్పుడే వీటన్నిటినీ పోగొట్టుకుంటున్న భావన. కాస్తంత అమెరికాను తనతో పాటు తీసుకెళ్ళగలిగితే బావుణ్ణు అనిపిస్తోంది.

"వాట్ ఆర్యూ థింకింగ్? హేవ్ ఇట్" రాధిక పెదవి అంచు దగ్గరే ఆగిపోయిన కాఫీ కప్పును ఆశ్చర్యంగా చూసింది జెన్నీ. కప్పు పట్టుకున్న ఆమె వేళ్ళు కూడా గులాబీ రంగులోకి మారిపోయి ఉన్నాయి. ఇంత సుకుమారమైన శరీరతత్వం ఉన్న అమ్మాయి పుడితే ఎంత బావుంటుంది? అమ్మో! అసలే ఇక ఇండియాకు వెళ్ళిపోదామనుకుంటున్నాం. అక్కడి వేడికి ఆ పిల్ల ఏమైపోవాలి? రాధిక ఆలోచనలన్నీ ఆమె మోస్తున్న భవిష్యత్తు మీదకు మళ్ళాయి. ఆకాశం కింద తనూ, తనకు పుట్టబోయే పాప పడుకుని మబ్బులనూ, చుక్కలనూ చూస్తున్నట్లు, అప్పుడు రాజు వచ్చి నిద్రపోదాం అని గొడవ పెట్టుకున్నట్లు అనిపించింది.

"కమాన్ రాధికా. ఇట్స్ ఓవర్ నౌ. లెట్స్ నాట్ థింక్ ఎనీమోర్ ఆఫ్ దట్" జెన్నీ వెచ్చటి వేళ్ళతో ఆమెను కుదిపింది.

"వాట్? వాట్స్ ఓవర్?" తుళ్ళిపడింది రాధిక.

"ఓ! ఆర్యూ నాట్ థింకింగ్ ఆఫ్ సర్జరీ" కాసేపటిక్రితం తామిద్దరూ కలిసి చేసిన సర్జరీలో హఠాత్తుగా పేషెంట్ బ్లడ్ ప్రెషర్ పడిపోవడంతో టైంబాంబు పెట్టినట్టు హడావుడిగా సర్జరీ చేయాల్సిరావడం... ఆకంగారులో జెన్నీ ట్యూమరును పంక్చర్ చేసేయబోవడం కాస్తా రాధిక చొరవతో తప్పింది. ఆ తప్పే జరిగి ఉంటే కాన్సర్ కణాలన్నీ రక్తంలోకి స్ప్రెడ్ అయి సర్జరీ వృథా అవడమే కాక, పేషెంట్ పరిస్థితి ప్రమాదకరం అయి ఉండేది.

"యూనో...ది పేషెంట్స్ ఫాదర్ ఈజ్ ఎన్ అటార్నీ" జెన్నీ మళ్ళీ సర్జరీను గుర్తు చేసుకుంది.

ఆమె భయం రాధికకు అర్థమయ్యింది. రాధికకూడా పేషెంటు తండ్రితో మాట్లాడింది కానీ అతను లాయర్ అని ఆమెకు అప్పటివరకూ తెలియదు. అతను ఎవరైనా కానీ సర్జరీలో తప్పు జరిగితే, హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్, ప్రొఫెషనల్ నెగ్లిజెన్సీ కేసులతో హాస్పిటల్ ఇబ్బందిలో పడుతుంది. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సర్జరీ చేసిన వీరిద్దరినీ ఫైర్ చేయొచ్చు. వాళ్ళ కెరియర్‌కు అదొక బ్లాక్‌మార్కు కావొచ్చు. రాధిక ప్రాణం గురించి బాధపడితే, జెన్నీ తన కెరియర్ గురించి భయపడింది.

"ఇట్స్ ఓకే జెన్నీ... దిస్ కైండ్ ఆఫ్ థింగ్స్ వోన్ట్ హేపెన్ ఆల్ ది టైమ్స్" జెన్నీకి భరోసా ఇచ్చింది రాధిక.

నీరసంగా నిట్టూర్చి "మేబీ. ఎనీవే. దిసీజ్ యువర్ లాస్ట్ సర్జరీ హియర్. సొ హౌ విల్‌బీ యువర్ వర్క్ ఇన్ హోయ్‌రబ్బా?" తన సెల్‌ఫోన్ తీసుకుని ఓవర్‌కోట్ తొడుక్కోసాగింది జెన్నీ.

పగలబడి నవ్వింది రాధిక. "ఇట్స్ హై...ద...రా...బా...ద్..." ఆమెకు అర్థం అయ్యేట్లు విడమర్చి పలికింది. అప్పుడప్పుడూ తన దగ్గర హిందీ పాటలూ, హిందీ అక్షరాలతో నింపిన కొత్త తెలుగు సినిమా పాటలూ విని 'హాయ్ రబ్బా' అనే మాట అలవాటైపోయిన జెన్నీకి అది తన ఊరి పేరు కాదని ఇప్పటికే చాలా సార్లు చెప్పి విసిగిపోయింది రాధిక. దీని బదులు... హైదరాబాద్ పేరు మార్చడమే సులభమేమో. ఫారినర్స్ నోటివెంట హాయ్‌రబ్బా పిలుపుకు హైదరాబాద్ పేరుకూ పెద్ద తేడా ఉండదు కూడా.

భారతదేశంలో ముఖ్యమైన నగరాల్లో బ్రాంచ్‌లు ఉన్న ఒక కార్పొరేట్ హాస్పిటల్స్‌తో పనిచేసే అవకాశం చూస్తున్నానని వివరిస్తూ తన ఓవర్ కోట్ తొడుక్కుంది రాధిక.

"ఛారిటీ? దట్స్ గుడ్ సమ్ డే హోప్ ఐ విల్ ఆల్సో డూ లైక్ యూ" మెచ్చుకుంటూనే తన సెల్‌ఫోన్ చూసుకుని మురిసిపోయింది జెన్నీ. ఆమె బాయ్‌ఫ్రెండ్ నుంచి మెసేజ్ వచ్చి ఉంటుంది కాబోలు అనుకుంది రాధిక. దాదాపు రాధిక వయసే ఉన్నా సన్నగా ఉండడం వలన, మేకప్ వలన ముప్పయ్యేళ్ళ కంటే తక్కువదానిలా కనిపిస్తుంది జెన్నీ. ఇంకా డేటింగ్‌లూ, బాయ్ ఫ్రెండ్స్‌లాంటి వ్యవహారాలతో పెళ్ళికాని పిల్లలా వ్యవహరించడం ఏమిటా అని రాధికకు ఎప్పుడూ ఆశ్చర్యం.

"అయామ్ గోయింగ్ విత్... యూ నో..." ఎవరో కనుక్కోమన్నట్లు చూసింది జెన్నీ. ఇలాంటి విషయాలు తనకు చెప్పొద్దు మొర్రో అని రాధిక ఎంత మొత్తుకున్నా ఆమె వినదు. ఎప్పుడూ ఒకే మొగుడితో ఉన్నానని ఏడిపిస్తుంది పైపెచ్చు, స్నేహంతో ఉన్న చొరవ కొద్దీ.

"హౌ ఉడ్ ఐ నో" విసుక్కుంటూనే తన సెల్‌ఫోన్ చూసుకుంది. రాజు దగ్గర నించీ ఒక్క మెసేజ్ కూడా లేదు. అతనూ భర్త కాకుండా బోయ్‌ఫ్రెండ్ అయి ఉంటే మెసేజ్ పంపేవాడేమో అనిపించింది ఆమెకు.

"ఇట్స్ ది అనస్థీషియా గయ్" కళ్ళను చక్రాల్లా తిప్పుతూ నవ్వింది జెన్నీ. సర్జరీ అప్పుడు మత్తు మందులు ఇచ్చిన నల్లటి పొడవైన ఆఫ్రికన్ - అమెరికన్ డాక్టరు గుర్తుకు వచ్చాడు రాధికకు. జెన్నీకంటే అతను ఖచ్చితంగా ఐదారేళ్ళు చిన్నవాడే అయి ఉంటాడు. అసలు వీళ్ళిద్దరికీ డేట్ మీద వెళ్ళేంత పరిచయం ఎప్పుడు అయిందో ఆమెకు అర్థంకాలేదు. ఇంకా నయం అతను తనతోనే డేటింగ్ చేయబోలేదు. విసుక్కుంది రాధిక.

"ఓకే... అయామ్ లీవింగ్. గివ్ మీ ఎ కాల్ వెన్ యు ఆర్ లీవింగ్. ఐ వుడ్ లైక్ టు సీ యూ ఆఫ్ ఎట్ ఎయిర్‌పోర్ట్" హడావిడిగా రాధికను హత్తుకుని వీడ్కోలు తీసుకుంది జెన్నీ. ఆమె వెళ్ళిపోగానే ఏం చేయాలో తోచలేదు రాధికకు. ఇక గది, హాస్పిటల్ బిల్డింగూ, అన్నీ తనవి కాదుగా అనుకుని ఎదురొచ్చే పరాయి మనుష్యులను, పిల్లలను మెల్లగా చూసుకుంటూ బయటకు నడిచింది.

"హే హే.. రాధికా..." టకటక మని చెప్పుల చప్పుడు చేసుకుంటూ జెన్నీ వెంటపడేసరికి ఏమిటా అని చూసింది. "సారీ ఐ ఫర్గాట్... దిసీజ్ సంథింగ్ ఐ గాట్ ఫర్ యు" అంటూ గులాబీ రంగు పేకెట్ ఒకటి ఆమె చేతిలో పెట్టింది జెన్నీ.

"వాట్ ఈజ్ దిస్?" రాధిక ప్రశ్న పూర్తవక మునుపే... జెన్నీ ఆమెను విడలేనట్లు చూసి "యూ నీడ్ ఇట్ హనీ. ఐ విల్ మిస్ యూ. ఐ నెవర్ హేడ్ ఎ ట్రూ ఫ్రెండ్ థాంక్యూ" అంటూ గభాలున ఎలా వచ్చిందో అలానే టకటకమని వెళ్ళిపోయింది. రాధిక కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమెకు తనపట్ల అంత అభిమానం ఉందని అప్పటివరకూ తనకు తెలియనేలేదు. మూడున్నరేళ్ళపాటు కలిసి పనిచేశారు. చాలా సర్జరీల్లో ఒక్కటిగా పోరాడారు. జెన్నీ ఎప్పుడూ ఇలా అభిమానం వ్యక్తపరచనే లేదు. రెండవ భర్త విడిపోతూ మనసు గాయపరచినప్పుడు ఆత్మహత్యా ప్రయత్నం చేసిన జెన్నీని చనువు తీసుకుని చెడామడా తిట్టి ఒక రెండు రోజులపాటు ఆమెను తన ఇంట్లోనే ఉంచి జాగ్రత్తగా చూసుకుంది రాధిక. ఆ తర్వాత ఆమె అసలలాంటిదేమీ జరగనట్లు మారిపోయి రెండుమూడు నెలలలో కొత్త మగాడితో డేటింగ్ అంటూ వెళుతుంటే మనసు విరిగిపోయి అలా అయిపోయిందిలే అని ఊరుకుంది రాధిక. ఇప్పుడు పాపం, తను లేకపోతే ఈమె ఏమయిపోతుందో? పోనీ జెన్నీను కూడా ఇండియాకు వచ్చెయ్యమంటే? అన్నిటినీ తనతో పాటు

తీసుకువెళ్ళిపోవాలనుకుంటున్న తన మనస్తత్వానికి తనకే నవ్వు వచ్చింది రాధికకు. కారులో కూర్చోగానే, ముద్దొస్తున్న గులాబీ ప్యాకెట్ చిరిగిపోకుండా మెల్లగా విప్పి జెన్నీ ఇచ్చిన బహుమతిని చూసింది. నమ్మలేకపోయింది. కోపంతో ఎర్రబడిపోయింది. సిగ్గుతో కుచించుకుపోయింది.

ఫోన్ రింగయింది. జెన్నీ "లైక్డ్ ఇట్?"

మాటలు రాలేదు రాధికకు.

"యూ ఆల్వేస్ వండర్డ్ ఎట్ దిస్... ఈజ్‌న్ట్ ఇట్?" అల్లరిగా నవ్వింది జెన్నీ.

"యా.." ఇంకా తడబడుతూనే ఉంది రాధిక "బట్... ఐ నెవర్ వాంటెడ్ దిస్"

"హా... హిపోక్రెట్... ఆస్క్ యువర్ సెల్ఫ్"

జెన్నీ మాటలు నిజమేమో అని భయపడింది రాధిక. తనకు ఏం కావాలో చెప్పనివ్వకుండా తన మనసును తొక్కి పెట్టుకుందా?

"బట్... అయామ్ థర్టీ ఫైవ్ ఇయర్స్ ఓల్డ్" ఒక అభ్యంతరాన్ని చెప్పుకుంది రాధిక

"నో... థర్టీ ఫైవ్ ఇయర్స్ యంగ్" పసిగా నవ్వింది జెన్నీ

"అయామ్ మ్యారీడ్" ఇంకో అభ్యంతరం

"యువర్ హబ్బీ విల్ లైక్ ఇట్"

"మై బాడీ ఈజ్ నాట్ స్లిం లైక్ యువర్స్" జెన్నీ కూడా ముప్ఫై పై బడినా రెండూ పెళ్ళిళ్ళయినా నాజూగ్గా ఉంటుంది. తన బరువు గుర్తుకు చేసుకుంది రాధిక.

"యువర్ హార్ట్ ఈజ్ డెలికేట్"

అయినా హార్ట్... అదే మనసుకు కాదు కదా దీన్ని కప్పుకునేది. జెన్నీ ఇచ్చిన ఎర్రటి బికినీను చేతిలో నలుపుకుంది రాధిక. జెన్నీతో కలిసి.. బీచ్‌కు వెళ్ళినప్పుడు అందరూ బికినీల్లో ఉంటే కాస్తంత పల్చటి వదులు టీషర్టు వేసుకుని జీన్స్ ప్యాంటుతో ఉన్న తను తనకే అసందర్భంగా తోచింది. జెన్నీ ఎంతో చెప్పి చూసింది. బికినీ వేసుకోమని, అక్కడ ఎవరూ వింతగా చూడరనీ, కానీ రాధిక మనసులో ఎన్నో అడ్డుగోడలు. ఎంతో ఇష్టమైన ఆకాశం, సముద్రం ఎదురుగా కవ్విస్తూ రెచ్చగొడుతున్నా చిన్నప్పటినుంచీ ఒంటినిండా కప్పుకున్న బిడియం వదలలేదు. జెన్నీకి కూడా తెలియదు విషయం ఏమిటంటే... ఒకసారి రాజు చేత బికినీ కొనిపించుకుని కనీసం ఇంట్లో అయినా వేసుకుందామనుకుంది రాధిక. 'ఇవన్నీ మనకెందుకు' అని ఆమె మాట వెలిబుచ్చకముందే కొట్టిపారేశాడు రాజు.

"డోంట్ గెట్ లాస్ట్ ఇన్ థాట్స్ అగైన్. డిడ్ యూ సీ. దేర్ ఈజ్ సంథింగ్ ఎల్స్ ఇన్ ది ప్యాక్" ఫోన్‌లో గుచ్చింది జెన్నీ.

ఏమిటా అని చూసింది రాధిక. ఒక చిన్న సైజు అండర్ వేర్. చాలా చిన్నది, తన చేయి అంత ఉంది. ఇది ఎందుకని ఆశ్చర్యపోయింది.

"డోంట్ వర్రీ! దట్స్ నాట్ ఫర్‌యూ. నాట్ ఈవెన్ ఫర్ యువర్ హజ్బెండ్" జెన్నీ పక్కనుంటే ఆమె వేళాకోళానికి పట్టుకుని కొడదామనిపించింది రాధికకు.

"ఎయిట్ మంత్స్ లేటర్. వెన్ యూ గెట్ ఎ బాయ్ ఆర్ గర్ల్ అవుట్ ఆఫ్ యూ... ఫర్ దట్ బ్యూటిఫుల్ బేబీ" అల్లరిగా నవ్వుతూ వీడ్కోలు తీసుకుంది జెన్నీ.

బికినీనూ, పిల్లవాడి అండర్ వేర్‌నూ మార్చి మార్చి చూసుకుని నవ్వింది రాధిక. రెండూ అద్భుతాలుగానే తోచాయి. ఇంకో రెండు నెలలు దాటితే బికినీ సరిపోనంత తల్లినవుతాననిపించి ఆనందం, ఆత్రుత కలిసిపోయాయి రాధికలో.

"అంకుల్‌కు ఏం కొనాలో తెలియట్లేదు" షాపులోని వస్తువులన్నిటి వంకా అయోమయంగా చూస్తూ అప్పుడే పెరుగుతున్న గడ్డం తడుముకున్నాడు రాజు.

"ఫర్లేదులే... ఏదో ఒకటి కొనాలి అని రూలు లేదుగా" పిల్లలకు ఆటవస్తువులు ఉండే సెక్షన్ వేపు నడుస్తూ అంది రాధిక. రేపు హైదరాబాద్‌కు ప్రయాణం అనగా బంధువులు, స్నేహితులకు, తమకు ఇండియాలో దొరకవు అనుకున్న వస్తువుల షాపింగ్‌లో పడ్డారు ఇద్దరూ.

"అక్కడేముంటాయి.... అవన్నీ చిన్న పిల్లలకు" అంటూనే అనుసరించాడు రాజు.

గుర్రుగా చూసింది రాధిక. "తెలుసు సారూ. సాకేత్‌కు ఏమైనా చూద్దామని. పైగా కుసుమ మళ్ళీ కారీయింగ్" అంటూనే బొమ్మల వేపు దృష్టి సారించింది. సాకేత్ రాధిక తమ్ముడు జగన్ రెండేళ్ళ బాబు. కుసుమ జగన్‌ల పెళ్ళి అయిన మొదటి సంవత్సరానికే పుట్టేసాడు.

"అదేంటి... జగన్‌కు అస్సలు ప్లానింగ్ లేదు. మూడేళ్ళ మ్యారేడ్‌లైఫ్ లో రెండు పిల్లలా?"

"రెండు కాదు... ఇద్దరు... పిల్లలు వస్తువులు కారు" అతడి తెలుగును, బుద్ధిని కలిపి వెక్కిరించింది.

"సర్లే .... మ్యాటర్ అది కాదు. ఇప్పుడే ఇన్ని లిటిగేషన్స్ పెట్టుకుంటే... తర్వాత ఏం ఎంజాయ్ చేస్తారని...." ఇంకా ఏదో అనబోయి రాధిక కంట్లో కోపాన్ని చూసి తగ్గాడు రాజు.

"నీకు పిల్లలు ఇష్టం లేదా?" తీక్షణంగానే చూసినా ఆమె గొంతులో బాధ దాగలేదు.

"అది కాదురా. మన పరిస్థితి వేరు. జగన్ కథ వేరు కదా. ప్రతి కేసూ ఇండివిడ్యువల్ కదా" సంజాయిషీ ఇస్తూనే దగ్గరకొచ్చి అనునయంగా ఆమె చేతిని అందుకున్నాడు.

"కేసు, లిటిగేషన్. లాయర్ లాగా ఏంటీ పదాలు?" చిరాకు పడినా అతడి చేతిని వదలలేదు ఆమె.

"అదీ.... ఈ మధ్య .... కొత్త కంపెనీకి లీగల్ ఇష్యూస్ కోసం కొంచెం స్టడీ చేసాను" అంటూ ఆమెను తప్పించుకుని... "చూడు.. సాకేత్‌కు ఇది నచ్చుతుంది..." పెద్ద రోబోట్‌లాంటి బొమ్మను సమీపించాడు రాజు. రెండేళ్ళ పిల్లాడి సైజు కన్నా పెద్ద బొమ్మను కొందామంటున్న అతని తెలివిని ఇక భరించలేక "నేను చూసుకుంటాను. నువ్వు నీక్కావలసిన ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ చూసుకో" అంది అతనికి ప్రాణమైన ప్రాణం లేని వస్తువుల సెక్షన్‌ను చూపుతూ.

ముఖం వెలిగించేసుకుని అటు చూసి "అవునూ అంకుల్ కు ఏమైనా ఎలక్ట్రానిక్ ఐటమ్స్ ఇష్టమా?" అన్నాడు.

"అవంటేనే చిరాకు మా నాన్నకు. మనిషిని సోమరిపోతును చేసే ఆ వస్తువులు కనిపెట్టేవాళ్ళనూ, అమ్మేవాళ్ళనూ, కొనేవాళ్ళనూ ఏం చేసినా పాపం లేదంటారు" చిన్నప్పుడు ఇంట్లో టీవీ అయినా పెట్టుకోనివ్వని తండ్రిని గుర్తుచేసుకుంది. ఆయన ఆమెకెప్పుడూ ఒక తీక్షణమైన వ్యక్తిగానే తెలుసు. అసలాయన నవ్విన సందర్భాలే తక్కువ. తమ పెళ్ళి ఫోటోల్లో కూడా పక్కన ఊరికే ఉన్నాను అంటే ఉన్నాను అన్న చందాన నిలబడ్డ ఆయన రూపం రాజుకూ గుర్తుకు వచ్చింది.

"అలా కాదు. ఫార్మాలిటీ కోసమైనా ఏమైనా తీసుకెళ్ళాలి కదా. పోనీ ఆంటీకి, అంకుల్‌కూ కలిపి ఇంటికి పనికివచ్చే వస్తువు ఏమైనా సజెస్ట్ చెయ్యి" బుద్ధిగా అడిగాడు. అమ్మకు ఏం ఇష్టమా అని ఆలోచించింది. తాను వెళ్ళడం, తనకు ఇష్టమైన వంటలు చేసిపెట్టడం మినహా వస్తువుల మీద ఆమెకు ఏం ఇష్టం ఉందో స్ఫురించలేదు.

"వాళ్ళేమీ అనుకోరు. అంత ఫార్మాలిటీ అక్కర్లేదు రాజూ" భర్త పద్ధతి తెలిసీ చెప్పి చూసింది రాధిక.

"అలాక్కాదులే రాధీ. ఫార్మాలిటీస్ ఉండాలి. అదంతా నీకు అర్థం కాదులే.నా తిప్పలు నే పడతాను. మీ పేరెంట్స్‌కు నేను ఏం కొంటానన్నది నీకు చెప్పను. అలాగే మావాళ్ళకు నువ్వు ఏం కొంటావో నేను అడగను. నీ క్రెడిట్ కార్డ్ తెచ్చుకున్నావు కదా?" అన్నాడు

రాజు. రాధికకు వెగటుగా అనిపించింది. మానవ సంబంధాలన్నీ కూడా కంప్యూటర్ ప్రోగ్రాములా ... ముందే రచించినట్లు, ఈక్వేషన్‌లా చూసే అతని స్వభావం ఆమెకు అస్సలు నచ్చదు. పన్నెండేళ్ళ దాంపత్యంలో కొన్ని సార్లు చెప్పాలని చూసింది. కొన్నిసార్లు చెప్పగలిగింది. వింటాడు. ఒప్పుకుంటాడు. కానీ మారడు. తాను కూడా అతని తలిదండ్రులకు ఏదో ఒకటి కొనక తప్పదని, అదీ ఆమె అకౌంటులోనే కొనాలన్న భావాన్ని చాలా తేలికగా, సాధారణమైన వ్యాపారంలా మాట్లాడిన అతని తీరు ఆమె మనసును గాయపరచింది. ఆ విషయం అతనికి చెబుదామనుకుంది.

"ఐస్ క్రీమ్ తిందామా?" ఉల్లాసంగా పొంగుతున్న అతని గొంతు విని ఆ ప్రయత్నం మానుకుంది. ఇంకొంత సేపు వాదనలు, ఆ తర్వాత మామూలే కదా అనే నిర్వేదం ఆవహించింది ఆమెను. మనిషి మారొచ్చు కానీ అతని నైజం అంత సులభంగా మారుతుందా?

"రాజూ నాకు జెన్నీ ఒక గిఫ్ట్ ఇచ్చింది" ఐస్‌క్రీం కోన్ అందుకుంటూ చెప్పింది రాధిక.

"ఎవరూ? డైవోర్స్ ఇవ్వకుండా సూసైడ్ అటెంప్ట్ చేసింది.... ఆ జెన్నీనేనా?" యథాలాపంగా అన్నాడు రాజు. మళ్ళీ చివుక్కుమంది రాధిక మనసు. ఎదుటివారి సంబంధాల్లోని అపశృతులంటే జాలి లేకపోతే పోయె. కనీసం గౌరవమన్నా ఉండదే ఈ మనిషికి?

"అలా అనకు అని ఎన్నిసార్లు చెప్పాను?" దాచుకోలేకపోయింది రాధిక.

"అరే ఇప్పుడు నేనేం అన్నానని...? తను చేసిందే కదా. అయినా ఇందులో తప్పేం ఉంది? ఇక్కడ వీళ్ళ కల్చర్ కరెక్టే కదా" `కల్చర్` అనే మాట పలికేటప్పుడు అతని గొంతులో తొణికిన వేళాకోళం ఆమె గమనించకపోలేదు.

"అదేంటి సడెన్‌గా? వీళ్ళు అని వేరుగా మాట్లాడుతావ్? ఇన్నేళ్ళు ఇక్కడున్నాం కదా. ఇప్పుడు ఆలోచించలేం కదా. ఫర్ ఎగ్జాంపుల్ త్రీఫోర్ మ్యారేజెస్ చేసుకునే లేడీస్ మన కంట్రీలో ఎంతమంది ఉంటారు చెప్పు? ఈవెన్ మగాళ్ళు కూడా తక్కువే. మనకు అలాంటి బుద్ధులు లేవు కదా అని. అయినా ఇప్పుడు ఇదంతా ఎందుకు... ఎంతకూ జెన్నీ ఏం ఇచ్చింది?" అంటూ ఐస్‌క్రీం తినమన్నట్లు ఆమె చేతిని నోటి దగ్గరకు తోసాడు.

అతనిలా మాట్లాడటం ఆమె బాధపడటం కొత్తేమీ కాదు. కాకపోతే ఆమెకు అర్థంకానిదల్లా... అతని చులకన మనుష్యులంటేనా లేక మనసులంటేనా అనేది ఆమె తేల్చుకోలేకపోయింది.

"ఇంతకీ ఏం ఇచ్చిందోయ్" అన్నాడు రాజు ఆమెను మెత్తబరిచేందుకు. అతనలా `ఓయ్` అన్నప్పుడు ఆమెకు ఇంకా చిర్రెత్తుకొస్తుంది. చాలా కృతకంగా ప్రేమ చూపేందుకు అతనలా పిలుస్తాడని ఆమెకు ఖచ్చితంగా అనిపిస్తుంది.

"చెప్పవా డియర్" అతని ప్రేమలో కృత్రిమత్వం పెరిగిపోయింది.

తల తిప్పుకునే చెప్పింది: "బి...కి...నీ"

"వాట్" ఠపీమని అనేసి ఒక సెకను ఆమెకేసి చూసాడు. కళ్ళు కలిసాయి. ఏమంటాడో అని ఆమె రెప్పల మధ్య ప్రశ్నించుకుంది. ఫక్కున నవ్వేసాడు.

"బికినీనా? ఎవరేసుకోవాలని?" నవ్వును సాగదీసాడు. రాధికకు మాయమైపోవాలన్నంత అవమానం అనిపించింది. కానీ అలానే చూస్తూ కూర్చుంది. అతని నవ్వు పెదాల మీద తగ్గినా కళ్ళలో పోలేదు. నవ్వుతో మనసును విరగ్గొట్టవచ్చు అని ఆమెకు అప్పుడే తెలిసింది.

"ఏం చేద్దామనుకుంటున్నావ్.... దాన్ని" ఆమెకు దగ్గరగా వంగి రహస్యంగా అడిగినట్లు అడిగాడు.

ఏమీ చెప్పలేదు ఆమె.

ఆ రాత్రే చితికిపోయిన చిన్న ఆశను మడతపెట్టి జాగ్రత్తగా మళ్ళీ ప్యాక్ చేసేసింది. ప్యాకేజ్ లానే ఇండియాకు బయలుదేరింది. విమానం కిటికీలో మబ్బులను చూసి ఆశ్చర్యపడింది. వాటి దిక్కు వాటిదే మన దిక్కు అటే ఉంటే మనతో ఉన్నట్లే ఉంటాయి. మనం

దిక్కు మార్చుకుని మిగతావి మనతో రావడం లేదని బాధపడతాం. మబ్బులెలా ఉన్నా పైన ఆకాశం మాత్రం అలానే అంతులేకుండా ఉంది.

"ఏంటి బాధగా ఉందా?" పక్క సీటులో వెనక్కు వాలుతూనే ఆమె భుజానికి ఆనుకున్నాడు రాజు.

ఆమె జవాబివ్వకముందే అతనే అన్నాడు: "నాకూ అలానే ఉంది. ఎంత మనది కాదు అనుకున్నా అలవాటైపోయిన దేశం, లైఫ్ స్టైల్... హాలీడేస్‌లో చూడడం వేరు, పూర్తిగా బ్రతకడం వేరు కదా... ఎలా ఉంటుందో ఇప్పుడు ఇండియా లైఫ్" బడికి పోయే మొదటిరోజు ఏడుస్తాడు పిల్లవాడు. నాలుగు అయిదురోజుల్లో స్నేహితులు, చదువు మచ్చికయాక అమ్మ దగ్గరకెళ్ళాలంటే కూడా దిగులు పట్టుకుంది.

బడీ, అమ్మా ఒకే చోట కుదరవు ఎందుకో మరి. బడిలో స్నేహితుడికి దగ్గరైనట్లు అతడికి దగ్గరగా జరిగింది రాధిక.

"మనం మళ్ళీ ఫైవ్ మంత్స్‌కి వస్తామా సిక్స్ మంత్స్‌కా? " గోముగా అడిగాడు రాజు

"మళ్ళీ ఎందుకూ?"

"అదేంటి.... డెలివరీ ఇక్కడే అయితే సిద్దార్థ్‌కు సిటిజన్ షిప్ వచ్చేస్తుంది కదా" అతని లెక్కలు ఆమెకు విసుగు అనిపించింది. కానీ, కొట్టిపారేయలేని నిజం. "ఆరు నెలలు" అంటూనే ఆలోచనలోనే నిద్ర అలుముకుంది. రాజు కళ్ళు కూడా మూతలు పడ్డాయి. ఇద్దరూ ఒకే రకమైన కలలు చూసారు.

పరిపూర్ణత కోసం కలల్లోనే శిశువును చూసారు.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్" ఎయిర్ హోస్టెస్ పిలుపుతో కళ్ళు తెరిచాడు రాజు. పక్కన రాధిక లేని వెలితి వెంటనే గ్రహించాడు.

"కెన్ యూ ప్లీజ్ కమ్ విత్ మీ" మర్యాదగానే అయినా తొందరపెట్టింది ఎయిర్‌హోస్టెస్.

"వేర్ ఈజ్ మై వైఫ్" అంటుండగానే ఎయిర్‌హోస్టెస్ ముఖంలోని ఆందోళన గమనించి తనను రాధిక గురించే రమ్మంటోందని అర్థం చేసుకున్నాడు. మెత్తగానే అయినా వడివడిగా ఆమె టాయిలెట్ వేపు దారితీసే పద్ధతి చూసేసరికి అతనికి గుండె జారుతున్నట్లనిపించింది. ఊపిరి బిగపట్టుకుని ముందుకు సాగాడు.

లేడీస్ రూం తలుపు తెరిచి ఉంది. ఇంకొక ఎయిర్ హోస్టెస్ లోపల ఉన్న వారితో ఏదో అంటోంది. రాజు రాక చూసి ఆమె పక్కకు తప్పుకుంది. రాధిక బేసిన్ అంచుని పట్టుకుని గోడమీదకు వాలిపోయి ఉంది. గాభరాగా ముందుకు వెళ్ళాడు రాజు. అతడిని చూడగానే ఆమె కళ్ళు బేలగా వణికాయి. చెంపలు ఎండిపోయిన నది కింద బీటలు వారిన నేలలా భోరుమంటున్నాయి.

"ఆర్యూ ఆల్‌రైట్? ఏమైంది" అంటున్న అతని మీదకు సత్తువ లేనట్లు వాలిపోయిందామె.

"అయాం సారీ సర్. ఇట్ సీమ్స్..." తటపటాయించింది ఎయిర్‌హోస్టెస్.

"రాజూ... వేరే చీర తీసుకురా" పూడుకుపోతున్న గొంతును కూడదీసుకుంది రాధిక. ఆమె నుంచి వచ్చిపోయిన రక్తం వాసన అతని హృదయాన్ని కమ్మేసింది. అతనికి అర్థమయిపోయింది. పోయిన సిద్దార్థను గుర్తుకు తెచ్చుకోకూడదని ఇద్దరూ మూగగా ఒట్టేసుకున్నారు.

"మిస్‌క్యారేజ్ మస్ట్ బీ పెయిన్‌ఫుల్" ఇద్దరు ఎయిర్‌హోస్టెస్‌లూ గుసగుసల్లోనే ఆడమనసు పంచుకున్నారు.

# 2

"రైట్ సైడ్ గ్యాప్ వదలొద్దు అని చెప్పాగా"

"పాపం అతను వెనుక హారన్ కొడుతున్నాడురా"

"నువ్విలా అటూ ఇటూ కాకుండా వెళితే కొట్టరేంటి మరి... రైట్ రైట్" అరిచినంత పనిచేసాడు జగన్.

ఓవర్ టేక్ చెయ్యడానికి ప్రయత్నిస్తున్న కారుని రియర్‌వ్యూ మిర్రర్‌లోంచి గమనిస్తూ ఆ కారుకు ఆ అవకాశాన్ని లేకుండా చేస్తూ కుడివైపుకు డ్రైవ్ చేసింది రాధిక.

"ఇలాగే మెయిన్‌టైన్ చెయ్యవే. ఆ సిగ్నల్ దగ్గర రైట్ తీసుకో" అంటూ చిప్స్ ప్యాకెట్‌లో చెయ్యిపెట్టాడు జగన్.

"జంక్ ఫుడ్ వద్దన్నానా" అతన్ని కనిపెడుతూనే సిగ్నల్ దగ్గర రైట్ తీసుకోవడానికి కష్టపడింది రాధిక. ఏ నిముషమైనా మీదపడేట్లు వెనక అడ్డదిడ్డంగా దూసుకు వస్తున్న ట్రాఫిక్‌ను చూస్తుంటే కారులోంచి దిగి ఒక్కొక్కరినీ కొట్టాలి అన్నంత కోపం వస్తోంది ఆమెకు.

"కంట్రోల్ కంట్రోల్..." ఆమె చూపును గమనించిన జగన్ రెండు చిప్స్ ముక్కలను అందించాడు. అసహాయతను కరకరమనిపించింది రాధిక.

"అదేంటి తనను జంక్ తినొద్దని చెప్పి నువ్వే..." అంతసేపూ వెనుక సీట్లో గమనిస్తున్న కుసుమ ఆశ్చర్యపోతూనే ముందు సీట్లోని జగన్ భుజం పట్టుకు లాగి చిప్స్ ప్యాకెట్ లాగేసుకుంది.

"రెండు ముక్కలు తినడం వేరు... రెండూ ప్యాకెట్లు ఊదెయ్యడం వేరు కదా" జగన్ ముఖం కేసి చూస్తూ నవ్వింది రాధిక.

"ఇష్టమైన తిండి కూడా తినలేకపోతే బ్రతుకెందుకూ" తనకీ దుస్థితిని తెచ్చి పెడుతున్న తన పొట్టమీద క్రొవ్వును దాచుకోవడానికి చొక్కా సరిచేసుకుంటూ గుర్రుమన్నాడు జగన్. అతని చర్యను గమనించిన ఇద్దరు ఆడవాళ్ళు నవ్వేసారు. అతను ఉడుక్కున్నాడు. ఎంత వయసు పెరిగినా తమ్ముడిలో ఇంకా చిన్నతనం పోలేదేమిటా అని ఆశ్చర్యపోయింది రాధిక. చిన్నప్పుడు చాక్లెట్ కోసం ఏడిచేవాడు ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రి అయినా ఇలా జిహ్వాచాపల్యంలోనే ఉన్నాడేమిటా అని ఆలోచిస్తూ వెనుక కారుకు దారినివ్వకుండా డ్రైవ్ చేయసాగింది రాధిక.

హైదరాబాద్‌కు వచ్చిన మూడువారాల్లోనే ఇక్కడి గజిబిజి జీవితానికి మెల్లమెల్లగా అలవాటుఒపడుతోంది ఆమె. మొదట ఆ ట్రాఫిక్, దుమ్మూ ధూళి, పక్కవాడి అసౌకర్యానికి కొంచెమైనా చలించని జనాల పద్ధతి, పోష్ కాలనీల మధ్యలో పేదవాడి అగచాట్ల దృశ్యాలూ, స్కూళ్ళ పక్కన ఉన్న బూతు సినిమాల వాల్‌పోస్టర్ల ముందే నడుచుకు పోతున్న మధ్య తరగతి తల్లితండ్రులు, పనికొచ్చే వార్తలకంటే హైక్లాస్ పార్టీలు పేజ్‌త్రీలోనూ, ఒకరినొకరు అర్థం లేకుండా తిట్టుకునే రాజకీయాలు మొదటి పేజీల్లోనూ, హత్యలతో మధ్య పేజీలను నింపుతున్న న్యూస్ పేపర్లను, ప్రతి చిన్నపాటి క్రైమ్‌ను రోజంతా రిపోర్ట్ చేస్తూ ఎస్ ఎమ్ ఎస్ పోల్స్ నిర్వహిస్తున్న న్యూస్ ఛానెల్స్‌నూ, బూతు మాటలు - చేష్టలున్న సినిమాకు సకుటుంబ సమేతంగా వచ్చి చప్పట్లు కొట్టి కూల్డ్రింకులూ, పాప్‌కార్న్ కౌంటర్ దగ్గర డబ్బులు విసిరేస్తున్న విద్యావంతులనూ చూసి సరిగ్గా ఒక్క వారం బాధపడింది. రెండోవారం తిరిగి అమెరికా వెళ్ళిపోతే బావుండేమో అని ఆలోచించింది. మూడోవారం తలనొప్పితో ఆలోచించడం మానేసింది.

తల్లికాలేకపోయానన్న బాధనే భరించడం అలవాటైపోయిన ఆమెకు దేశమేమైపోతోందన్న ఆవేదనను అణుచుకోవడం అంత కష్టం కాలేదు.

అమెరికాలో ఎడమవేపు స్టీరింగ్ ఉన్న కారులో రోడ్డుకు కుడివైపు డ్రైవ్ చేయడానికి అలవాటు పడిన ఆమె ఇక్కడ కుడివేపు స్టీరింగు ఉన్న కారులలో రోడ్డుకు ఎడమవేపు వెళ్ళకుండా అడ్డదిడ్డంగా తోలడానికి అలవాటుపడుతూనే ఈ సమాజానికీ అలవాటుపడింది.

"గుడ్... ఇక నేను లైసెన్స్ ఇచ్చేస్తున్నాను" ఆమె డ్రైవింగ్‌ను మెచ్చుకున్నాడు జగన్ కారు వాళ్ళ అపార్ట్‌మెంట్స్‌కు సమీపించేసరికి.

"మీరు ఇవ్వటమేంటి  తనకు ఎప్పుడో లైసెన్స్ ఉందిగా.... అదీ అమెరికా వాళ్ళు ఇచ్చింది" మెల్లగా డోరు తీసుకుని దిగడానికి ప్రయత్నించింది కుసుమ. ఎనిమిదో నెల బరువుతో ఆమెకు ప్రతి అడుగూ ఆయాసమే.

"కాస్త తనకు హెల్ప్ చెయ్యొచ్చుగా జగన్" సెల్ ఫోన్‌లో మెసేజ్‌లు చూసుకుంటూ నిలబడిన తమ్ముడిని గుర్రుగా చూసింది రాధిక. ఎందులో సహాయపడాలా అన్నట్లు అయోమయంగా చూసాడు జగన్. చీరచెంగును కాలికింద పడకుండా సర్దుకుని దిగుతున్న కుసుమ కనిపించింది. సహాయం అవసరమయేంతగా ఆమె ఏం కష్టపడుతోందో అతనికి అర్ధంకాలేదు. అయినా అక్క చెప్పిందని కారు డోర్‌ను సుతారంగా పట్టుకున్నాడు.

"ఏమైనా ఫోటోకు ఫోజు ఇస్తున్నారా?" అతడిని చిరాకుపడుతూనే కుసుమవేపు వెళ్ళి నడుము దగ్గర తొలిగిపోతున్న చీరను సర్దుతూ దిగేప్పుడు ఆమె తల కారుకు తగలకుండా చెయ్యి అడ్డు పెట్టింది రాధిక.

"తనకిది ఫస్ట్ ప్రెగ్నెన్సీ ఏం కాదు" తన పద్ధతికి సంజాయిషీ ఇవ్వబోయిన జగన్‌ను కారులో షాపింగ్ బ్యాగ్స్‌ను తీసుకొమ్మన్నట్లు చూసింది రాధిక.

"కొంచెం ఎక్సర్సైజ్ చెయ్యడం మంచిదంటారు కదా" అంటూ వాటిని తనే అందుకోబోయింది కుసుమ. "నువ్వూరుకో కుసుమా.... మరీ మంచితనం పనికి రాదు. అసలే వీడు మహా సోమరి" తమ్ముడి వేపు ఉరిమి చూసింది.

"సరే అక్కయ్యగారూ. మీరు ఎంత ఫెమినిజంతో ఈ మనిషికి బ్రైన్‌వాష్ చేయాలనుకున్నా వేస్ట్. ఎందుకంటే వాష్ చెయ్యడానికి అక్కడేం లేదు" కుసుమ తలమీద సరదాగా మెట్టాడు జగన్. కుసుమ చిన్నబుచ్చుకుంటూనే నవ్వేసింది.

కుసుమ రాధిక వాళ్ళకు దూరపు బంధువుల అమ్మాయే. రాజమండ్రిలో పుట్టి పెరిగిన నిఖార్సైన గోదావరి. పెళ్ళి చేసుకునేటప్పుడు కాస్తంత 'ఎడ్యుకేటెడ్' అనే ముద్ర ఉంటే మంచిది అన్నట్లు లోకల్ కాలేజీలో డిగ్రీను కష్టపడి పాస్ అయ్యేట్లు చేసాడు ఆమె తండ్రి. జగన్‌కు సిటీ అమ్మాయిలంటే అట్టే సదభిప్రాయం లేదు. తండ్రి మాట ప్రకారం బుద్ధిగా చదువుకుని, రకరకాల పరీక్షల్లో ర్యాంకులకోసం కష్టపడి యవ్వనమంతా ఒక ఇంజినీరింగ్ కోర్సులోనే ఖర్చు చేసి, బెంగుళూరులోని ఒక అంతర్జాతీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థవారు కాలేజ్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లోనే అతడికి ఉద్యోగం వచ్చేయడంతో జీవితంలో ఇక సాధించాల్సింది మరేమీ లేదు అనేంత తృప్తిని పొందేసాడు. ఒక్క నెల బెంగుళూరు లోని ఆ ఉద్యోగంలో ఇమడటానికి ఇబ్బంది పడ్డాడు. ఆఫీసులో కొలీగ్ అమ్మాయిల్లో కొందరు సిగరెట్ త్రాగుతుంటే చూసి జడుసుకున్నాడు. మందు కూడా త్రాగుతారని తెలుసుకున్నాక అతని బుద్ధిమంతుని మనస్తత్వం చాలా బాధపడింది. దేవతలా కనిపిస్తుందని, చూస్తుంటే తల్లిలా ఉంటుందని... తాను 'ప్లెటోనిక్' గా ప్రేమించిన ఒక కొలీగ్ అమ్మాయి, రూముకు బోయ్ ఫ్రెండ్స్ పేరున దాదాపున ఆఫీసులో సగం అంది మగాళ్ళను తీసుకెళుతుందని తెలిసాక మనసంతా వికారం అయిపోయింది.

అమ్మాయిలందరూ తన తల్లిలా వంటింట్లో ఉండాలి, మహా అయితే అక్కలా సంపాదించినా బుద్దిగా పెళ్ళిచేసుకుని ఒక మగాడికి కట్టుబడి ఉండాలనడం తిరుగులేని శాసనంలా అనుకున్న అతను పెద్దగా చదువులేని, ఉద్యోగం చేయని అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. తండ్రి బంధువుల అమ్మాయి అయిన కుసుమతో పెళ్ళి చూపులు ఏర్పాటు చేసినప్పుడు, పెద్దలందరికీ దూరంగా మాట్లాడుతూ, ఆమె జీవితంలో ఏం కోరుకుంటుందని అడిగాడు. 'ఒక మంచి వైఫ్‌గా. మంచి మదర్‌గా ఉండాలి' అనుకుంటున్నానని

ఆమె తడుముకోకుండా చెప్పింది. పెళ్ళి జరిగిపోయింది. ఆమె కోరికలు చాలా చిన్నవి. నగలు, సినిమా, పార్కు, ఎగ్జిబిషన్, ముద్దుముచ్చట్లు, పిల్లలు. ఆమెకి కావాల్సింది అతనిస్తాడు. అతనికి ఆమె ఎదురు చెప్పదు.

తమ్ముడు మంచి మగాడా కాదా అనేది రాధికకు అర్థమే కాదు. భర్త మంచివాడేనని కుసుమ నమ్ముతుంది.

"ఫోర్ జీరో త్రీ పెయిటింగ్ అయిపోయిందట... ఒకరి చూసొద్దామా?" లిఫ్ట్‌లో నాలుగో నెంబరు మీద వేలు ఉంచుతూ అడిగాడు జగన్.

కుసుమ ముఖం వెలిగిపోయింది. "కిచెన్‌లో బ్లాక్ గ్రానైట్ వేయించాం. భలే ఉంది" రాధికనుద్దేశించి చెబుతూ తనే నాలుగో ఫ్లోరు బటన్ నొక్కింది. వంటగది అందాన్ని చూపించాలని ముచ్చటపడుతున్న 'హౌస్ వైఫ్' కుసుమను నిరుత్సాహపరచలేక నవ్వింది రాధిక. కుసుమకు ఒక అన్నయ్య ఉన్నాడు. గోదావరి నీటిని పీల్చుకుంటూ పచ్చగా పెరుగుతున్న పొలాలను చూసుకోవడానికి 'చదువుకున్నతనం' అడ్డొచ్చి, కొంత భూమిని అమ్మేసి విచ్చలవిడిగా పెరుగుతున్న హైదరాబాద్‌లో చిన్న చిన్న ఫ్లాట్‌లు కొని కొందరు స్నేహితులతో కలిసి బిల్డింగులు కట్టడం మొదలు పెట్టాడు వ్యవసాయం మోటు అనిపించిన అతనికి కంకర, రాళ్ళ మధ్య ఉన్నా డబ్బు కురుస్తుండేసరికి స్వర్గంలా అనిపించింది. మొదట అతడివి పిచ్చి చేష్టలు అని కొట్టిపారేసిన వారందరూ కూడా రెండు వెంచర్లు అయ్యేసరికి అతడిని మహాత్ముడిలా చూడడం మొదలు పెట్టారు. రాజమండ్రిలో వాళ్ళ కుటుంబానికి కాస్త పరిచయం ఉన్నవాళ్ళందరూ మాకో ఫ్లాటు కొంచెం తగ్గించుకుని ఇమ్మంటూ వెంటపడ్డారు. అందరినీ కలుపుకుపోయే స్వభావంకల అతను తగ్గించిన రేటు అని చెబుతూనే తాను అనుకున్న రేటుకే అమ్ముతూ, చెల్లెలన్న సెంటిమెంటుతో కుసుమకు మాత్రం యాభైవేలు తక్కువ ధరకు ఒక ఫ్లాటు అమ్మాడు. తనకంత మంచి అన్నయ్య ఉన్నందుకు మురిసిపోతూ, గోడలు కట్టినప్పటినుంచి ఒక్కొక్కటిగా మెరుగులు దిద్దుకుంటున్న ఇంటిని అందరికీ చూపించుకుంటోంది కుసుమ.

"ఇక్కడ ఏదైనా మంచి పెయింటింగ్ పెడదామనుకుంటున్నాం" డ్రాయింగ్ రూంలో టీవీ ఏరియా పక్కన గోడలో విశాలంగా ఉన్న ఖాళీని చూపించింది కుసుమ.

"నువ్వు ఇంకా పెయింటింగ్ వేస్తున్నావాక్కా?" చిన్నతనం గుర్తుకు వచ్చి అడిగాడు జగన్. వాళ్ళ అమ్మకు ఎంబ్రాయిడరీ, చీరల మీద పెయింటింగ్ చేయడం చాలా ఇష్టం. దినపత్రికల్లో వచ్చే ఆదివారం అనుబంధ పత్రికలను చూసి ఆమె చేస్తుంటే అక్కకూడా ప్రయత్నించడం, చేయి వణకకుండా బ్రష్ పట్టుకోలేని తనను చూసి ఇద్దరూ నవ్వడం అతని కళ్ళవెనుక మెదిలింది.

"లేదురా. మహా అయితే బ్రెయిన్ బొమ్మ వేయగలను. అది ఇక్కడ పెడితే బావుంటుందా?" న్యూరాలజీ పుస్తకాల్లో పడ్డాక వేరే వ్యాపకాలన్నీ పోయాయని బాధపడింది రాధిక.

"ఫర్లేదు... దాన్ని చూసయినా తనకు కొంచెం తెలివి వస్తుందేమో" అంటూ మళ్ళీ పెళ్ళాన్ని వేళాకోళమాడాడు జగన్. వాళ్ళ నవ్వుల్లోనే రాధిక సెల్ మోగింది.

"రాధీ.... అర్జెంటుగా ముంబై వెళ్ళాల్సివస్తోంది. నువ్వు ఇంకా జగన్ వాళ్ళింట్లోనే ఉన్నావా?" పరుగెత్తుతున్నట్లు అడిగాడు రాజు... ఫోన్‌లో.

"అదేంటి.. ఇప్పట్లో వెళ్ళక్కర్లేదన్నావ్? ఏమైనా సీరియస్?" రాధిక ఆతృతను గమనించి పక్కకు తప్పుకున్నారు కుసుమ, జగన్.

"అబ్బా.. ఏదో బిజినెస్ ప్రోబ్లం. సర్లే ఇంతకీ జగన్ దగ్గరే ఉన్నావా?" చిరాకు పడ్డాడు రాజు.

"ఆఁ" రాధిక ముభావం అయిపోయింది.

"సరే అయితే. నేను డైరెక్ట్‌గా ఇంటికెళ్ళి అటునుంచే ఏర్‌పోర్టుకు వెళతాను. నిన్ను పికప్ చేసుకుంటే ఈ ట్రాఫిక్‌లో ... ఫ్లైట్ మిస్ అవుతుంది. యూ టేక్ కేర్. ఓకే?" హడావుడి అతని గొంతులో

అతని ఆలోచన సబబే అనుకుంటూనే "ఏమైనా తిని..." అంటుండగానే ఫోన్ కట్ అయ్యింది. "అన్నయ్యా?" విన్నా విననట్లు అడిగింది కుసుమ. అవునంటూనే విషయం చెప్పింది రాధిక. "అబ్బా... అలా బిజీగా ఉంటూ... ఏరోప్లేన్స్‌లో తిరుగుతూ బిజినెస్... అన్నయ్య చాలా కష్టపడతాడు కదా" వంటగదిని చూసి మెచ్చుకున్నట్లు కళ్ళలో మెరుపులు పోసుకుంది కుసుమ.

"మరి కష్టపడకపోతే ఎలా? అయినా మా అక్కకంటేనా?" ఇక వెళదామన్నట్లు తలుపు పట్టుకున్న జగన్ "ఇక చూడు డ్రైవింగ్ నేర్చేసుకుంది. రేపట్నుంచి హాస్పటల్‌కు తనే వెళుతుంది. ఇక మనం గుర్తుకైనా రాము. అంతా పేషెంట్ల మయం" నవ్వుతూ "ఇక మన ఫ్లాట్‌కు వెళదామా" అని కుసుమ భుజం తట్టాడు. అదే కాంప్లెక్స్‌లో క్రింది అంతస్తులో పూర్తయిపోయిన ఒక ఫ్లాట్ లో ఉంటున్నారు వాళ్ళు. ఇప్పుడు కొన్నది పూర్తయాక ఇందులోకి మారి, క్రింది ఫ్లాట్ అద్దెకిచ్చి, ఆ అద్దె డబ్బుతో పిల్లలిద్దరి పేరు మీద బ్యాంక్ అకౌంట్ మొదలెట్టాలి అని కుసుమ ఆలోచన. ఇంట్లోకెళ్ళగానే వంటింట్లోకి దూరింది కుసుమ... భోజనానికి సిద్ధం కమ్మంటూ.

"నేనూ వస్తాను. మీ కొక అమెరికన్ డిష్ చేసిపెడతాను" అంటూ రాధిక కుసుమను అనుసరిస్తూనే "కానీ జగన్ నా బిజీ లైఫ్ సంపాదన గురించి కాదుకదా. పేషెంట్ల గురించి మాత్రం ఒక 'కన్సర్న్' కానీ ఫీజుకోసమే కాదు కదా. ఆపరేషన్ సక్సెస్ అయాక ఆ పేషెంట్లు, వాళ్ళ వాళ్ళు అంతా మమ్మలను ఎలా చూస్తారో తెలుసా. ఎంత తృప్తిగా ..." రాధిక మాటను మధ్యలోనే తుంచేసాడు జగన్.

"ఇవన్నీ చెప్పడానికేలే! మరయితే కార్పొరేట్ హాస్పిటల్స్ అంతంత బిల్స్ ఎందుకు ఇస్తాయి? సాటిస్ఫాక్షన్‌తోనే బ్రతకొచ్చుగా? నీకైనా మా ఐటీ వాళ్ళకీ, బావలా ఇంజినీర్స్‌కో ఇచ్చినట్లు జీతం ఇస్తేనే కదా ఆ ఆపరేషన్ చేస్తావు" ఫ్రిజ్‌లోంచి ఒక ఆపిల్‌ను తీసుకుని నిర్లక్ష్యంగా డైనింగ్ టేబుల్ దగ్గర చేరగిలబడ్డాడు జగన్.

రాధికకు తన తండ్రి అలా మాట్లాడడం, అన్నిటినీ డబ్బుతో కొలవడం తెలుసు కానీ, తమ్ముడు కూడా ఆయనలానే ఆలోచిస్తాడని ఇంతవరకూ అనుకోలేదు. పది రూపాయల నోటును మడిచేసి చేతివేళ్ళ మధ్య రబ్బరు బ్యాండుతో లాగి తనను కొట్టి ఆడుకోబోయినందుకు తండ్రి దగ్గర దెబ్బలు తిని 'ఇది కూడా పేపరే కదా' అని అడిగినవాడు వీడేనా? మనుష్యులందరూ ఎప్పటికీ చిన్నపిల్లలుగానే ఉండిపోతే ఎంత బావుంటుందో అనిపించింది రాధికకు.

"అలా అయితే తను అమెరికాలోనే ఉండిపోయి ఉండొచ్చు కదా. పాపం ఇక్కడ ఏదో ఛారిటి చేయాలనుకుంటోంది కదా... ఆ ఆశ్రమం వాళ్ళతో కలిసి" వంటగదిలోంచి తనకు మద్దతుగా వచ్చిన కుసుమ గొంతు విని ఆశ్చర్యపోయింది రాధిక.

"ఆ ... ఎన్నాళ్ళు చేస్తారు ఇవన్నీ. అయినా ఆ ఆశ్రమం వాళ్ళయినా ఊరికే ఏం చేయట్లా. కోట్లకు కోట్లు ఫండ్స్ వస్తున్నాయి. ఎవరికి తెలుసు అందులో ఎంత మింగేస్తున్నా...."

"స్టూపిడ్ జగన్. ఇంత పెసిమిస్ట్ అయిపోయావేంటి? మంచితనమే లేదంటావా లోకంలో" తమ్ముడి మీద కోపం అణుచుకోలేకపోయింది రాధిక. ఆమె మాటల్లోని తీవ్రతకు అతను కాస్త తగ్గాడు. ఆపిల్‌ను టేబుల్ మీద బొంగరంలా తిప్పాడు. వంటింట్లోంచి కుసుమ మసాలా వాసనలు పుట్టించింది. రాధిక మౌనంగా తలవంచుకుంది.

"ఇంతకీ నాన్నకు చెప్పావా?" తలదించుకుని తిరుగుతున్న ఆపిల్‌నే చూస్తూ గొణిగాడు జగన్.

"ఏ విషయం" రాధిక భృకుటి ముడిపడింది.

"అదే...ఆశ్రమం... ఛారిటీ..."

"అమ్మకు చెప్పాను."

రెండూ ఒకటే కాదని అక్కా తమ్ముళ్ళకిద్దరికీ తెలుసు.

"మరి నాన్న వైజాగ్‌లో ఎవరో తనకు తెలిసిన వాళ్ళ హాస్పిటల్‌లో నువ్వు 'రెఫరెన్స్ డాక్టర్'గా ఉంటే బావుంటుందని అనుకుంటున్నాడు" స్పష్టంగానే గొణిగాడు జగన్.

బాధపడింది రాధిక. "వాళ్ళు డబ్బులిస్తానన్నారా?" తండ్రి వ్యాపార దృక్పథం గుర్తుచేసుకుంది రాధిక.

"పాపం ఆయనను హర్ట్ చెయ్యొద్దు. రిటైర్ అయాడు కదా. మనం తనమాట వింటామో లేదో అని... ఇలా టెస్ట్ చేస్తుంటారు. అసలు ఈ ఫ్లాట్ కొనమని నన్ను బలవంత పెట్టింది తనే..."

స్వదేశానికి రాగానే మళ్ళీ తండ్రి అదుపాజ్ఞలు మొదలయ్యాయా అని బాధపడింది రాధిక. ఆమె ఆయన చెప్పినట్లు పెరిగింది, చెప్పిన చదువు చదువుకుంది, ఆయన ఒప్పుకున్నవే చేయగలిగింది, కాదన్నప్పుడు ఏం చేయాలో ఇంకా తెలుసుకోలేదు. తాను ప్రేమించాలో ద్వేషించాలో ఎప్పటికీ తేల్చుకోలేని మనిషి ఆయన నారాయణ మూర్తి.

"అమ్మాయ్... నీ స్నేహితురాలెవరో వచ్చిందమ్మా" నారాయణ మూర్తి గొంతు విని కంప్యూటర్ స్క్రీన్ మీంచి తల తిప్పింది రాధిక. తెరచి ఉన్న తలుపు దగ్గర తెరచీ తెరవని తలుపులా నిల్చుని ఉన్నాడు ఆయన.

"ఎవరు నాన్నా?" న్యూరాలజీ వెబ్‌సైటులోంచి లాగౌట్ అవుతూ కళ్ళజోడు తీసి కళ్ళు నలుముకుంది రాధిక. ఆయన ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపించాడు ఆమెకు. వయసు ముఖం మీద కొన్ని ముడతలనీ, కళ్ళకు జోళ్ళనూ ఇచ్చాయి కానీ ఎప్పటిలానే ఒక రూళ్ళకర్రలా నిల్చున్నాడు ఆయన. "ఎవరో... పేరు మర్చిపోయాను. అదే...కర్నూలు అమ్మాయి. సైకాలజీ" తనకు గుర్తున్న ఆమె పేరు, వృత్తిమాత్రం చెప్పబోయాడు నారాయణమూర్తి.

"సుష్మా వచ్చిందా?" స్నేహితురాలిని తల్చుకోగానే రాధిక ఉత్సాహంగా కదిలింది. సుష్మ, రాధిక... ఇంటర్మీడియట్‌నాటి నుంచి స్నేహితులు. నారాయణమూర్తికి ఆమె తెలియక కాదు. తాము విశాఖపట్టణంలో ఉన్నప్పుడు ఆమెను 'కర్నూలు అమ్మాయి' అనడం మొదలెట్టాడు. కూతురితో కలిసి ఆ అమ్మాయీ అదే వైజాగ్‌లో ఐదున్నరేళ్ళు మెడికల్ కాలేజీలో చదివినా, ఎన్నోసార్లు తన ఇంటికి వస్తూ పోతూ ఉన్నా సుష్మ గురించి ఏమీ గుర్తుంచుకోలేదు అతను. కూతురి స్నేహితురాలు. అంతకన్నా ఏమిటి అనే చులకన. ఆయన ఇసుమంతైనా మారకపోవడాన్ని తల్చుకుని ఆశ్చర్యపోతూనే డ్రాయింగ్ రూం వేపు అడుగులేసింది. సంవత్సరమైంది స్నేహితురాళ్ళిద్దరూ కలుసుకుని. రాధిక హైదరాబాద్ వచ్చినప్పటినుంచీ అనుకుంటూనే ఉంది సుష్మను కలవాలని. బెంగుళూరులో నిమ్‌హాన్స్‌లో సైకియాట్రిస్ట్ అయిన ఆమె, ఒక కాన్ఫరెన్స్ విషయమై మనీలాకు వెళడంతో కుదరలేదు. డ్రాయింగ్ రూంలోని సోఫాలో కూర్చుని రాధిక తల్లి పూర్ణిమ మాటలు వింటూ తలాడిస్తున్న సుష్మ పక్కనే ఆమె ఆరేళ్ళ కూతురుని చూసి కళ్ళు పెద్దవి చేసుకుంది రాధిక. 'ఎంత త్వరగా పెరిగిపోతారు పిల్లలు? తనకు మొన్నే పెళ్ళయినట్లు ఉంది కదా' అనుకుంది ఎనిమిదేళ్ళ క్రితం చూసిన పెళ్ళి తంతును గుర్తుచేసుకుంటూ.

"అదిగో... ఆంటీ..." కూతురును రాధికను చూపిస్తూ నవ్వింది సుష్మ.

"ఏయ్.. ఆంటీ ఏంటి.." నవ్వుతూనే వచి పక్కన కూర్చుని పాపను తనవేపు తీసుకుంది రాధిక. మొత్తంగా తల్లి ముఖమే వచ్చిందా అనేట్లు ఉంది ఆ అమ్మాయి.

"మనలో మనం ఎంత 'యంగ్' అనుకున్నా... లోకానికి మాత్రం 'ఆంటీ'లమే" నవ్వుతూనే రాధిక కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూసింది సుష్మ. ఆమె తనలో దేనికోసం వెదుకుతోందో గమనించిన రాధిక చప్పున తలతిప్పేసుకుంది.

"బూరెలు తీసుకురానా?" పూర్ణిమ వెంటనే రాధికను ఉద్దేశించి అడిగింది. అప్పటికే అతిధులముందు ఖాళీ అయిన ప్లేట్లను గమనించింది రాధిక. తల్లి చేసే వంటలన్నీ ఇష్టమే కానీ, అరగంటకోసారి ఏదో ఒకటి తినిపించాలని చూసే ఆమె ఆరాటం చూస్తే చిరాకువేస్తుంది. ఆప్యాయత కొద్దీ ఆ చిరాకును ప్రదర్శించలేదు.

"రెండే తెస్తానులే" అంటూ రాధికకు మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా వంటగదివేపు కదిలింది పూర్ణిమ.

"నాక్కూడా ఇంకోటి" మొహమాటం లేకుండా అరిచింది సుష్మ. పూర్ణిమ సంతోషపడిపోయింది. కాలేజీ రోజుల్లో అయితే సరాసరి వంటగదిలోకే వచ్చి పెనం మీంచి తీసుకుని తినేంత చనువున్న స్నేహితురాలు ఏమీ మారలేదని రాధిక కూడా సంతోషించింది.

"ఇంతకీ ఎలా ఉన్నావ్?" తల్లి పక్కకు వెళ్ళగానే గొంతు తగ్గించి సానుభూతిగా రాధిక చేతిని నొక్కుతూ అడిగింది సుష్మ.

"అయామ్ ఫైన్" గడిచిపోయిన అబార్షన్‌ను గుర్తు చేయొద్దన్నట్లు చూసింది రాధిక. కూతురి చేతికి ఆడుకోమన్నట్లు సెల్‌ఫోన్ ఇచ్చి, బాల్కనీలోకి వెళదామా అన్నట్లు సైగచేసింది సుష్మ.

బాల్కనీలో ఎర్రమందారాలు చిన్న మట్టి తొట్టెల్లో బిక్కు బిక్కుమంటున్నాయి. ఇంటి ఆవరణలో ఇరుక్కుని పెరుగుతున్న కొబ్బరి చెట్ల మధ్య పిచ్చుకలు చేరి ఊసులాడుకుంటునాయి. సాయంత్రం రాత్రిలోకి కరుగుతోంది.

"ఇంతకీ ఏంటి ప్రాబ్లం?" మృదువుగా రాధిక చేతిని చేతిలోకి తీసుకుంటూ అడిగింది సుష్మ. ముడివేసుకున జుత్తును విప్పార్చుకుంది రాధిక. గాలి చల్లగా పారింది. దూరంగా ఉన్న ఆకాశం దగ్గరైనట్లే అనిపించింది... స్నేహితురాలు పక్కన ఉంటే.

"ఏమో. మొదటి రెండుసార్లేమో జెనెటి డిఫెక్ట్ అన్నారు. నేనూ రాజూ కూడా పోన్లే అలాంటి పిల్లలు పుట్టకపోవడం మంచిదే అయిందనుకున్నాం" మెల్లగా అణిచేసుకున్న చేదు గతాన్ని తోడుకోసాగింది రాధిక. శ్రద్ధగా వింటునట్లు చూసింది సుష్మ. అందుకే రాధికకు ఆమె అంటే ఇష్టం. చాలా మంది స్నేహితులు, శ్రేయోభిలాషులు ఎన్నెన్నో సలహాలూ, సూచనలు చెపుతారు కానీ, అసలు మనసు పంచుకోనివ్వరు. వినరు.

"మూడోసారి నాకు చిన్న కారు యాక్సిడెంటు అయిందిగా. నాలుగోసారి ఎందుకు జరిగిందో ఎన్ని టెస్టులు చేసినా తెలియలేదు. చివరకు ఆటోఇమ్యూన్ డిసీజస్ ఉన్నాయేమో అని యాంటి బాడి టెస్టులు చేయించుకున్నాను. అంతా నార్మల్ కాబట్టే ఈసారి ఏమీ కాదు అనిపించింది" ఎంత కాదనుకున్నా రాధిక కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేసాయి...

"ఇక్కడున్నారా?" బూరెలు తీసుకుని వచ్చింది పూర్ణిమ. కళ్ళు దాచేసుకుంది రాధిక. అయినా కనిపెట్టేసేవాళ్ళే అమ్మలు. స్నేహితురాలితో మాట్లాడుకోవడం రాధికకు అవసరమన్నట్లు మౌనంగా వెళ్ళిపోయింది ఆవిడ.

"ఈసారి... సైకలాజికల్ స్ట్రెస్ అన్నారు. ప్లేన్ జర్నీ చేయాల్సింది కాదేమో" బూరెలోకి వేళ్ళు పొడుస్తూ కన్నీళ్ళు ఏడుపులోకి దూకకుండా అదుపు చేసుకుంది రాధిక.

"హే.. రాధీ.. నేను ఫ్రెండ్‌గా చెప్పాలో, సైకియాట్రిస్ట్‌గా చెప్పాలో తెలియట్లేదు కానీ... ఒకటి చెబుతాను ఏం అనుకోవుగా" ఆమెకు దగ్గరగా జరిగింది సుష్మ. రాధిక కూడా మంచి స్నేహితురాలల్లే వినింది.

"సీ... పిల్లలే లైఫ్ కాదు. యూనో **ఏదైనా మనకు దొరకని కొద్దీ దానిమీద వ్యామోహం పట్టుదలా ఎక్కువ అవుతాయి. చివరకు మన జీవితంలో సంతోషం అంతా నాశనం అయిపోతుంది కదా**"

"ఐనో. నిజ్జం. నాకు మొదట్లో పిల్లలంటే ఇంత పిచ్చి ఉండేది కాదు. మనం అంతా 'గ్రాంటెడ్'గా తీసుకుంటాం. చదువు అవుతుంది. కోరుకున్న పని దొరుకుతుంది. మ్యారేజ్ బావుంటుంది. మంచి పిల్లలు. అన్నీ ఖచ్చితంగా మనం అనుకునట్లే జరుగుతాయి అనుకుంటాం. నాకు అన్నీ అలానే జరిగాయి కూడా.. ఇదొక్కటే.." ఈసారి రాధికలో దుఃఖం లేదు. ఆవేదన. రాధిక నిజాయితీగా ఒప్పుకోవడం సుష్మకు నచ్చింది. సైకియాట్రిస్టుగా ఎక్కువమంది మనుష్యులలో ఆమెకు నచ్చనిది ఒక్కటే: తమ ఆలోచనాలోపాలను ఒప్పుకోరు.

"పోనీ... వై డోంట్ యూ ట్రై ఫర్ సరొగేట్ మదర్? ఒక నెలవరకూ కన్సీవ్ చెయ్యగలుగుతున్నావు కాబట్టి.. ఆ తొమ్మిది నెలలూ మీ బిడ్డను మోయడానికి ఎవరో ఒకరు దొరుకుతారు. ఇండియాలో అలాంటి ఆడవాళ్ళకు ఇప్పుడు అస్సలు కొదవ లేదు" తటపటాయిస్తూనే సలహా ఇచ్చింది సుష్మ.

"ఆ పనే చేయాలనుకుంటే ఇంతవరకూ ఆలస్యం చేసేదాన్ని కాదు కదా. నా లోపల ఒక జీవి పెరిగి పెద్దదవడం అనుభవించాలి అని ... జస్ట్.. తీరలేదు కాబట్టి ఆ కోరిక మరీ ఎక్కువ అవుతోంది" చీకటి అయిపోతున్న ఆకాశాన్ని చూసి నిర్వేదంగా నవ్వింది రాధిక.

"అయినా నా కోరిక కోసం ఇంకో ఆడదాన్ని ఎక్స్‌ప్లాయిట్ చేయలేను. పాపం తొమ్మిది నెలలు మోసాక డబ్బు తీసుకుని బిడ్డనివ్వమంటే ఆమెకు అంత సులభం కాదు. దీనికంటే అడాప్షన్ చేసుకుందామని ఆలోచిస్తున్నాను" రాధిక మాటలు ధైర్యంగా చిక్కబడుతున్నాయి. "రాజుకు ఇంకా చెప్పలేదు. తను వెంటనే ఒప్పుకోడు అనిపిస్తోంది, వేరే పిల్లలను దత్తత తీసుకోవడం అంటే. కానీ, ట్రై చేస్తా. ఒప్పించడం అంత కష్టం కాదులే" తనకు తనే చెప్పుకుంటున్నట్లు గొణిగింది రాధిక.

"హౌ ఈజ్ హి?" బూరె ముక్కను త్రుంచి రాధిక నోటికి అందించింది సుష్మ. అందంగా నవ్వుతూ, ఆ ముక్కనువేళ్ళతోనే తీసుకుంది రాధిక.

"తను కూడా చాలా అప్‌సెట్ అయ్యాడు. ఈసారి పేరు కూడా నిర్ణయించుకున్నాడు. 'సిద్ధార్థ్' అని. చాలా బాధపడ్డాడు. అది మరచిపోవడానికే అనుకుంటా.... ఏదో ఒక బిజినెస్ పని పెట్టుకుంటున్నాడు. ఇప్పుడు ముంబాయి వెళ్ళాడు" బాధను మరచిపోతూ మెల్లగా బూరెను కొరికింది రాధిక.

"ఇలా అడుగుతున్నాను అని ఏమనుకోకు... కానీ..." ఇష్టం లేనట్లు నసిగింది సుష్మ.

"ఏంటమ్మా? వచ్చినప్పటినుంచీ ఒకటే ఫార్మాలిటీస్? నోర్మూసుకుని అడుగు" దబాయిస్తూ నవ్వేసింది రాధిక.

సుష్మ ఇంకా సందేహిస్తూనే, "అలా కాదు. జెనరల్‌గా... నేను చూసిన పేషెంట్లు, కేసుల్లో... భార్య పిల్లలను ఇవ్వలేదనే సాకుతో మగాళ్ళు వేరే అఫైర్స్, రిలేషన్ షిప్స్..." మరింత నసిగింది.

రాధిక పకపకా నవ్వేసింది. సుష్మ చేతిమీద చరుస్తూ" రాజుకు అంత ఓపిక లేదు. నాతోనే భరించలేడు" ఇంకా నవ్వుతూనే ఉంది. ఆ నవ్వు అలానే ఉండిపోవాలని మనసులోనే కోరుకుంది సుష్మ.

"ఏంటి నన్ను పట్టుకుని అంతమాట అనిందా మీ ఫ్రెండు?" సెల్‌ఫోన్‌లో మెసేజ్ చేయడం ఆపేసి ఆశ్చర్యపోయాడు రాజు.

"నిన్ను పట్టుకోలేదు కానీ... అంత మాటా అనింది" నవ్వుతూ వెనుక వస్తున్న కారుకు దూరంగా కుడివేపు డ్రైవ్ చేయసాగింది రాధిక.

హాస్పిటల్‌కు మొదటిరోజు డ్యూటికెళ్ళేటప్పుడు తానే డ్రైవ్ చేయాలని రాధిక పట్టుబట్టడంతో, దారిలోనే ఉన్న తన ఆఫీస్ దగ్గర డ్రాప్ చేయమని ఒప్పుకుని కూర్చున్నాడు రాజు. ఉదయం ఎండలో చకచకా కదిలిపోతోంది ట్రాఫిక్.

"జోకులు చాల్లేవోయ్. నీకు తెలుసుకదా. కాలేజ్‌లో కానీ, అమెరికాలో కానీ నాక్కూడా కొందరు అమ్మాయిలు లైనెయ్యలేదూ? మా బాస్ పార్టీలో కూడా చూసావుగా... ఆ అమ్మాయి ... సుసాన్, నువ్వు ఉండగానే నాతో ఫ్లర్ట్ చేయలేదూ? నేను బుద్ధిగా బుద్ధుడిలా ఉన్నాను కదా?" ముఖం ముడుచుకున్నాడు రాజు.

"ఆ సుసాన్ బ్లాక్ అమ్మాయి కాబట్టి ఊరుకున్నావు. అదే మా జెన్నిఫర్‌లాంటి బ్లాండ్ అయితే తమరి బుద్ధి ఏపాటిదో తెలిసేది" సిగ్నల్ దగ్గర రెడ్‌లైట్ పడేసరికి బ్రేక్ తొక్కింది రాధిక.

"వాళ్ళకిప్పుడు బ్లాక్ క్రేజు కదా?"

"నీకు కాదు కదా. టిపికల్ ఇండియన్ మేల్‌వి కదా నువ్వు?"

"వాట్ డూ యూ మీన్?"

"బాగా గుర్తు చేసుకో, నా కలర్ బావుంటుందని ఎన్నిసార్లు మెచ్చుకోలేదు. ఛామన ఛాయగానో, బ్లాక్ గానో ఉంటే నన్నయినా చేసుకునేవాడివి కాదుగా నువ్వు"

"ఇదెక్కడి లాజిక్కు? నువ్వు అలా లేవు కదా?"

"ఒకవేళ అలా అయి ఉంటే?"

"నాన్సెన్స్. ఎవరైనా అప్పియరెన్స్‌ను ఇష్టపడతారు. లేదు అని చెపితే అది అబద్దం. నేనయినా మెల్లకన్ను, తొర్రిపళ్ళు, గూని... ఇలా ఉంటే నువ్వు నన్ను చేసుకునేదానివా?"

"యూనో.... అవన్నీ ఉంటే నువ్వు ఇంకా బావుండేవాడివి?" నవ్వేసింది రాధిక.

ఉక్రోషం వచ్చి మాటలాపేసాడు రాజు. కారు విండో మీద టకటకమనే శబ్దంతో తల తిప్పింది రాధిక. నల్లటి కోటెడ్ గాజు కిటికీ అవతల.... చేతిలో చిన్నపిల్లాడిని పెట్టుకుని, డబ్బులకోసం చేయిచాస్తోంది ఒకావిడ. ఆమె వయసు ఖచ్చితంగా యాభై పైనే ఉంటాయి. చేతిలోని బిడ్డ నెలల వయసు. బిచ్చం కోసం తెచ్చుకున్న బిడ్డ అని అర్థం చేసుకోవడానికి క్షణమైనా పట్టలేదు రాధికకు.

"రాజు... మనం తీసుకెళదామా?" అటే చూస్తూ అడిగింది.

చప్పున అర్థం చేసుకున్నాడు రాజు "వాట్ నాన్సెన్స్? పిచ్చెక్కిందా? ఎవరో ఏమిటో.... తెలుసుకదా... జబ్బులు ఉండొచ్చు, క్రిమినల్ జీన్స్ ఉండొచ్చు... అయినా.. మనకేం ఖర్మ? "గాభరాగా అంటూ పర్సులోంచి పది రూపాయలు తీసాడు రాజు. ఆ శిశువు వేపే చూసింది రాధిక. పెదవులు ఎండిపోయి ఉన్నాయి. తన మీదా, తన కారులోని ఎయిర్‌కండిషన్ మీదా, తన కారు మీద, బ్రతుకు మీదా, జనం మీదా, జీవితం మీదా ద్వేషం కోపం ఒకేసారి పుట్టుకొచ్చాయి ఆమెలో. ఆ పిల్లవాడు ఎందుకు అక్కడ అలా? తనకు పుట్టేవాడయితే ఇదే అద్దానికి ఇవతల ఏసీలో ఉండేవాడు కదా? ఎందుకు ఇదంతా ఇలా జరుగుతుంది? ఆమె ఆలోచనల్లో ఒక మనిషి మెదిలాడు. సంవత్సరాలపాటు తాను మరచిపోయిన వ్యక్తి. ఇక గుర్తుకు చేసుకోకూడదనుకున్న వ్యక్తి.

రాజు కాస్త కిటికీ దించి పది నోటును అందించాడు. బిచ్చగత్తె దృష్టిపథంలోంచి వెళ్ళిపోయింది. సిగ్నల్ పడిందని రాజు తొందరపెట్టేసరికి యాక్సిలరేటర్ తొక్కింది రాధిక "ప్లీజ్ రాధీ. డోంట్ థింక్ డెస్పరేట్... వి విల్ హేవ్ అవర్ ఓన్ ఛైల్డ్ నెక్స్ టైం...." రాజు చెప్పే మాటలు ఆమె తలకెక్కట్లేదు. ఊకొడుతూనే అతడిని అతని ఆఫీస్ దగ్గర డ్రాప్ చేసింది. ఆలోచనలను మరచిపోవడానికి వెంటనే డ్యూటీలో మనసు లగ్నం చేయడం మంచిదనిపించింది, హాస్పిటల్ దగ్గరకు చేరుకోగానే 'డబ్బు కోసమే కదా నువ్వైనా పనిచేసేది' జగన్ మాటలు ఆమెలో మెదిలాయి. పదినోటును అందుకున్న బిచ్చగత్తె వేళ్ళు గుర్తుకు వచ్చాయి. హాస్పిటల్ లాంజ్‌లో ఉన్న పేషెంట్లను గమనించింది. అందరూ ఎంతో కొంత డబ్బున్న వారిలానే కనిపిస్తున్నారు. కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉన్నామనే గర్వం, దర్పం కూడా తొణికిసలాడుతున్నాయి కొందరిలో. తెల్ల కోటు చేతిలో ఉన్న ఆమెను చూసి ఎదురుగా నడిచేవారు దారి ఇస్తున్నారు. ఆమె కోసమే ఎదురు చూస్తున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ మనిషి స్వాగతం పలికి ఆమె ఛాంబర్ వేపు దారి చూపుతూ నడిచాడు. మొదటి రోజు కాబట్టి ఫస్ట్ హ్యాండ్ పేషెంట్స్ లేరు అని, రెఫరల్ కేసులు కొన్ని ఉన్నాయని అతను చెబుతుండగా తన ఛాంబర్ బయట లాంజ్‌లో కూర్చున్నవారి వంక దృష్టిసారించింది. తాము సంప్రదించుకోబోతున్న డాక్టరు రాధికే అని తెలియని వాళ్ళు ఆమెను గమనించి ఊరుకున్నారు. కుర్చీల వరుస అవతల, వాటర్ ఫిల్టర్ సిస్టం దగ్గర ఒక చిన్న పిల్లవాడు గ్లాసులోని నీళ్ళు తొణికిపోకుండా జాగ్రత్తగా పెదవి దగ్గరకు తెచ్చుకుంటున్నాడు. అతడు కదులుతున్న పద్ధతిలో ఏదో తేడా అనిపించింది రాధికకు. ఆ పిల్లవాడి చేతిలోని గ్లాసుకు ఆసరాగా చేయిపెట్టి మోకాళ్ళ మీద వంగి ఉన్నాడు ఒకతను. తండ్రి కాబోలు అనుకుంది రాధిక. ఆమెకు అతని వీపు మాత్రమే కనిపిస్తోంది. కానీ వెనక నుండి అతని తల ఆమెకు సుపరిచితమైనట్లే తోచింది. ఇందాక తన ఆలోచనల్లో మెదిలిన గతం తాలూకు మనిషి తలలానే అనిపించింది దొప్పచెవులతో. ఆలోచనను కొనసాగనివ్వకుండా ఛాంబర్‌లోకి వెళ్ళి కూర్చుంది. ఎండలో పెదవులు ఎండిపోయిన శిశువు

గుర్తుకు వస్తుంటే ఏసీ ఇబ్బందిగా తోచింది. నర్సుకు చెప్పి మొదటి పేషెంటును పంపించమంది. తలుపు తోసుకుని వచ్చిన మనిషి, ఆమె గుర్తుకు చేసుకోకూడదనుకున్న అతను. ఎప్పుడూ లేనిది ఈవాళే ఇతడిని తాను తలుచుకోవడమేమిటి, తలుచుకున్న కొన్ని క్షణాల్లోనే అతడు ఎదురుపడమేమిటి? రాధికకు ఊపిరాడలేనంత అయోమయం.

లోపలకు వచ్చిన మనిషి రాధికను చూడగానే పోల్చుకున్నాడు. ఇద్దరి కళ్ళూ సంతోషంతో విప్పారాయి. బయట తాను చూసింది ఇతనినే అర్థం చేసుకుంది రాధిక. ఆ పిల్లవాడు అతని చేతిని గట్టిగా పట్టుకుని వస్తున్నాడు.

"ఇంటి పేరు ఉండడంతో ఈ డాక్టరు నువ్వు అనుకోలేదు" ముందుగా పెదవి విప్పాడు అతను. ఆశ్చర్యం, ఆనందం, ఉద్వేగం కంపించాయి ఆ మాటల్లో.

అతనేనాడూ తన కులం, గోత్రం, ఇంటిపేరూ అడగలేదు అని ఆమెకు తెలుసు. లోకంలో చాలా మందికి అతను కృష్ణచైతన్యగానూ, చైతన్యగానూ తెలుసు. రాధికకు మాత్రం అతను 'చే'

అతని చేయి పట్టుకుని వస్తున్న పిల్లవాడిని సంభ్రమంగానే చూస్తూ కుర్చీలోంచి లేచింది రాధిక.

"జూనియర్" నవ్వుతూ, రెండు చేతులతో ఆ పిల్లవాడిని పైకెత్తి ఆమె టేబుల్‌కు ఎదురుగా ఉన్న కుర్చీలో నిలబెట్టాడు. పదేళ్ళ క్రితం చూసిన 'చే' ను ఇంకో పాతికేళ్ళ క్రితం ఎలా ఉండేవాడో చూసినట్లు అనిపించింది రాధికకు. ఆ అబ్బాయి కళ్ళు లేతగా ఉన్నాయి. అమాయకత్వంతో వణుకుతూ. ఛె లానే దొప్ప చెవులు, పసితనపు బుగ్గలు. గుండె ఉబ్బితబ్బిబ్బవుతుండగా, అపురూపమైన అతి తేలికైన వస్తువును ముట్టుకోబోతున్నట్లు అతనికి తన చేతిని అందిస్తూ... "ఏం పేరు" అడిగింది రాధిక. ఎంత అణుచుకుందామనుకున్నా ఆమె గొంతు వణికింది.

చైతన్య ఇబ్బందిగా ముఖం పెట్టాడు. ఈ నిముషం రాకపోయి ఉంటే బావుండుననుకున్నాడు. కానీ జరిగిపోయిన నిముషాన్ని ఏం చేయాలో ఎవరికీ తెలియదు. రాధిక చేతిలోకి షేక్ హ్యాండ్‌లా తన చిన్న చేతిని అందిస్తూ తన పేరు చెప్పాడు ఆ అబ్బాయి:

"వివేకానంద"

ఊహించని మెరుపు మెరిసినట్లయింది రాధిక మదిలో.

"మనకు అబ్బాయి పుడితే వివేకానంద అని పేరు పెడదాం" చే చేతిలో గీతలు గీస్తూ తాను అన్న మాటలు ఆమె గతంలోంచి ఖంగుమన్నాయి.

# 3

"ఈ రోజు క్లయిమేట్ భలే ఉంది కదా" లేత ఎండను కళ్ళలో కట్టేసుకుంటూ అరచేతులతో చెంపలను వెచ్చబరుచుకుంది రాధిక.

"ఉంటే? తినేస్తావా?" సుష్మ పకపకా నవ్వేసరికి రాధిక చిన్నబుచ్చుకుంది.

"నీకస్సలు రొమాన్స్ లేదు లైఫ్‌లో" చిన్నబుచ్చుకుంటూన్న ముఖంతోనే క్యారియర్ ఓపెన్ చేసింది రాధిక.

"మరే! నీ దగ్గర ఎక్కువ ఉంటే నీ లంచ్ బాక్స్‌లోంచి కాస్త ఇయ్యి మరి..." మరో స్నేహితురాలు వెక్కిరింతగా నవ్వింది.

"ఏంటీ?" అయోమయంగా చూసింది రాధిక

"అదేనమ్మా...రొమాన్స్" సుష్మ రాధిక భుజం మీద పడి మరీ నవ్వింది. చుట్టూ ఉన్న స్నేహితురాళ్ళు అందరూ పక్షుల్లా నవ్వారు.

ఆంధ్రా మెడికల్ కాలేజీ క్యాంటిన్. మధ్యాహ్నం. లంచ్ బ్రేక్. అల్లరి పిల్ల డాక్టర్లు. క్యాంటిన్‌లో పనిచేసే, చదువుకోని మనుష్యులు వీళ్ళను చూసి సంతోషంగానే చిరాకుపడుతున్నారు. క్యాంటిన్‌లో కొత్తగా పెట్టిన థర్డ్‌హ్యాండ్ పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టీవీలో కొత్తగా వస్తున్న సాటిలైట్ ఛానెల్స్‌ను పరీక్షిస్తూ అబ్బాయిలంతా వాదులాడుకుంటున్నారు.

"ఉష్షూ ఉష్షూ... సైలెన్స్ లేడీసూ" పక్క టేబుల్ మీంచి ఒక అబ్బాయి అరిచాడు.

"నువ్వు నోర్మూసుకుని మీ అమ్మ పంపిన పులుసన్నం తినవోయ్ బుద్ధావతారం" సుష్మ అందరికీ వినబడేలా అరిచింది. అవతలి టేబుల్ దగ్గరున్న అబ్బాయిలంతా ఘొల్లుమన్నారు. బుద్ధావతారం టేబుల్ కిందకు తలదాచేసుకుని చెవులు మూసేసుకున్నాడు... ఇంకా ఏమేం వినాల్సొస్తుందో అని.

"ఊర్కోవే! బాధపడతాడు" సుష్మ భుజం వెనక చున్నీ గుంజి హెచ్చరించింది రాధిక.

"అవునా?" అంటూనే మళ్ళీ గొంతు హెచ్చించి "ఏంటీ బాధపడుతున్నావా? రాధిక చెబుతోంది" ఆ అబ్బాయి వేపు అరిచింది సుష్మ. ఆ అబ్బాయితోపాటు రాధికా తలపట్టుకుంది. నవ్వులు విచ్చలవిడిగా వ్యాపించాయి.

"ఆపండ్రా.... అన్న సాంగొస్తోంది" ఒక అబ్బాయి అరిచేసరికి చిరచిరమని అస్పష్టంగా ట్యూన్ అవుతున్న ఈటీవీ ఛానెల్‌ను నిలిపాడు ఒకడు.

"ఏం పాటరా, సూపర్... నా చిన్నప్పటి ఫేవరెట్" ఇంకో అబ్బాయి డ్యాన్స్ మొదలుపెట్టాడు... ఎన్టీయార్‌ను ఇమిటేట్ చేస్తూ. 'నిమ్మకూరు రోడ్డు దాటి నేవొస్తే..' పాట సౌండ్ పెంచేసారు. "పాపం కదా ఆయన" ఎవరో అమ్మాయి పాటను చూస్తూనే బాధపడింది.

ఎన్టీయార్ చనిపోయి వారం రోజులే అవుతున్నాయి... కొత్తగా వస్తున్న ప్రయివేట్ టీవీ ఛానెళ్ళు అతడి పాటలను, సినిమాలను వదలకుండా వేస్తూనే ఉన్నాయి. "అందుకేరా యాక్టర్స్ పాలిటిక్స్‌లోకి రాకూడదు. ఇంకా ఎక్కువకాలం బ్రతుకుతారు. నాగేశ్వరరావును చూడు... ఎంత హెల్దీగా" మేధావిలా ఫోజిస్తూ ఏదో థియరీ మొదలెట్టాడు ఒక అబ్బాయి. 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని...' పాట మారింది. రాధికకు ఆ పాట అంటే ఇష్టమూ, కోపం కూడా. ఎన్టీయార్ బానే ఉంటాడు కానీ ఆ జమున ఏమిటీ మరీ అలా హీరోకు దాసిలా అతడిని పొందడమే తన జీవిత పరమార్ధం అన్నట్లు పాడుతుందీ? అసలు ఇలాంటి పాటలు ఎలా రాస్తారో... ఇలాంటివి వినీ, చూసి తన అమ్మలాంటి వాళ్ళు నాన్న అంటే అంత భయంగా ఉంటారు అనుకుంది. అమ్మ గుర్తుకురాగానే ఆకలేసి బ్యాగ్‌లోంచి లంచ్ బాక్స్ తీసుకుంది.

"ఇంతకీ ఏం తెచ్చుకున్నావ్ ఇవ్వాళ" బాక్స్ తెరవడానికి రాధిక ఇబ్బంది పడుతుంటే దాన్ని ఆమె చేతుల్లోంచి లాక్కుని ఒక్క పట్టులో తెరిచేసింది సుష్మ. ఆమె వేళ్ళలోని బలానికి చుట్టుపక్కల ఉన్న మిగతా అమ్మాయిలు కళ్ళు పెద్దవి చేసేసారు.

"తనెవడిని చేసుకున్నాగానీ వాడి తలమీద జుట్టంతా ఇలా పీకెయ్యడం గ్యారెంటీ" ఒక అమ్మాయి జోకుకు అందరూ గొల్లుమన్నారు. టీవీ ఛానెల్స్‌లో సౌండ్ సరిగా రాక ఇబ్బంది పడుతున్న అబ్బాయిలు ఆ నవ్వుల తాకిడికి చిరాకు పడి... వీళ్ళ వంక కనుబొమలు ముళ్ళేసి, మూతులు ముడుచుకుని చూసి... అయినా వీళ్ళేమీ ఖాతరు చేయకపోవడంతో ఇక ఏమీ అనలేక ఊరుకున్నారు.

"మళ్ళీనా?" రాధిక తెచ్చుకున్న ఇడ్లీలను చూసి నీరసపడింది సుష్మ. హాట్ బాక్స్‌లో ఇంకా వెచ్చగా ఉన్న తెల్లటి ఇడ్లీలకు ఒకవైపు తెల్లటి చక్కెర, ఇంకోవేపు ఎర్రటి మిరపకాయ పచ్చడి. ఆ కాంబినేషన్ చూసి చూసి సుష్మకు విసుగొచ్చేసింది. మొదటి సారి అడిగితే: "పొద్దున ఇంట్లో కరెంటు పోయింది. మిక్సీ వేసేవరకూ ఆగితే లేటవుతుందని అమ్మ ఊరగాయ వేస్తుంటే నాన్న చూసి ఆడపిల్లల నాలుకలు కారాన్ని తట్టుకోలేవు, కడుపు మండుతుందని చెప్పి చక్కెర వేయించారు." అంటూనే చక్కెరలోకి ఇడ్లీ అద్దుకుంది రాధిక. ఆమెకు నాన్న నచ్చకపోయినా నాన్న చెప్పిన ఆ కాంబినేషన్ నచ్చేసింది. తర్వాత కరెంటు పోయినా పోకపోయినా లంచ్ బాక్స్‌లోకి

ఇడ్లీలు, దోశెలు పెట్టుకున్నప్పుడల్లా ఒక స్పూను చక్కెర వేసుకుంటూనే ఉంది. ఆమెను సుష్మ 'మళ్ళీనా?' అడిగిన ప్రతిసారీ "పొద్దున కరెంటు పోయిందే" అంటూ కథ మొత్తం చెప్పేస్తుంది. ఈసారి అడిగే సాహసం చెయ్యలేదు సుష్మ. "సరే తల్లీ చక్కెరతోనే తిను. నేను సమోసాలు పట్టుకొస్తాను" క్యాంటిన్‌లో చిరుతిళ్ళకు అలవాటు పడిన సుష్మ తన పుస్తకాల బ్యాగును కుర్చీలో వదిలి అబ్బాయిల గుంపులో ఎవడినో కళ్ళతోనే తిడుతూ ముందుకు కదిలింది. మిగతా అమ్మాయిలు క్యాంపస్ గాసిప్ మొదలెట్టారు. విసుగుగా తన బ్యాగులోంచి 'ఫార్మకాలజీ' పుస్తకం తీసి 'హార్మోన్స్' చదువుతూ ఇడ్లీ ముక్కను చక్కెరలో అద్దుకుంది. నాలుకకు తీపి తగులుతుండగానే... ముక్కుకు ఏదో ఘాటైన వాసన వేసింది. పక్కనే ఎవరో చరచరమని కదిలినట్లనిపించి తలతిప్పింది.

సుష్మ కుర్చీలో వదిలిన బ్యాగును తీసి కిందపడేసి కుర్చీ తీసుకుని పోతున్నాడు ఓ వ్యక్తి. కిందపడిన బ్యాగ్ కాస్త వాలి, నేలమీద ఉన్న పచ్చడి మరకలకు తాకింది. రాధిక కళ్ళు విచ్చుకున్నాయి. కోపంతో.

"దున్నపోతు" తిట్టుకుంటూనే బ్యాగ్‌ను తీసుకుని అంటుకున్న పచ్చడి మరకల కోసం వెదికింది.

ఆ వ్యక్తి వెనుతిరిగాడు. రాధిక గమనించలేదు.

"అయ్యయ్యో" బ్యాగ్‌కు పచ్చడిని చూసి తుడవబోయి తన వేళ్ళకు చక్కెరను చూసి కర్చీఫ్ ఎక్కడుందా అంటూ చూసింది. ఘాటువాసన మళ్ళీ దగ్గరైంది. ఊదారంగు ముతక కర్చీఫ్‌తో రెండు చేతులుబ్యాగును తుడిచాయి.

"సారీ అండీ... చూసుకోలేదు" ఆ వ్యక్తి మాట్లాడేసరికి ఘాటు మరింతై రాధిక ఉక్కిరిబిక్కిరైంది. ప్రపంచంలో రాధికకు అత్యంత అసహ్యమైన వాటిల్లో సిగిరెట్ ఒకటి. అతని ఘాటు ఆమెకు ఇప్పుడు అర్థమై, గాలి పీల్చుకోకుండా బిగపట్టుకుని "ఇట్స్ ఓకే" అంటూ బ్యాగ్‌ను అతని చేతులోంచి లాక్కుంది. అతనూ లాగాడు బ్యాగును.

"అరే... తప్పు నాదే కదా" అంటూనే బ్యాగు మీది మరకను పూర్తిగా తుడిచేసి అదే కర్చీఫ్‌ను తన ప్యాంటు జేబులో కుక్కుకున్నాడు. ఆ జేబులోంచి ఉబుకుతున సిగిరెట్ ప్యాకెట్ ఆమె చూపు దాటిపోలేదు. "ఫర్లేదండీ.." తడబడుతూనే అతని వేపు చూసింది. యాష్ ట్రేలోంచి మొలుస్తున్న బూడిదపువ్వులా అతని ముఖం.

పలకరింపుగా నవ్వాడు. పుస్తకంలో హార్మోన్స్ వేపు చూపు తిప్పేసుకుంది రాధిక. ఘాటువాసన పోలేదు.

"బైదివే... నేను దున్నపోతును కాదండీ" వినయంగానే పరిహాసం ఆడాడు అతను.

చటుక్కున బేల కళ్ళతో చూసింది రాధిక. 'సారీ' అనే మాట చెబుదామనుకున్నా నోరు పెగలనంత కంగారు పడిపోయింది.

"అయామ్ చైతన్య" పలకరింపుగా మళ్ళీ నవ్వాడు అతను.

రాధిక కళ్ళూ, పెదవులూ ఎండిపోయాయి. అతని ముఖం మీద తలుపు వేసేసినట్లు బెదురుగా చూసింది. "బాబూ... చే... మా అమ్మాయిల దగ్గరేంట్రా..." అబ్బాయిలగుంపులోంచి ఏదో అల్లరి గొంతుక అరిచింది.

వెళ్ళిపోతూ... రాధిక టిఫిన్ బాక్స్‌వేపు చూసాడు. చక్కెరను చూసి అతని కనుబొమలు ముడేసాడు. రాధిక బాక్సును అతని కళ్ళనుంచి దాచేందుకు కంచెలా చేతులు అడ్డం పెట్టుకుంది. ఘాటువాసన ఫక్కుమంటూ వెళ్ళిపోయింది.

"ఏంటే... ఇతనొచ్చాడు" సుష్మ గొంతు విని ఊపిరిపీల్చుకుంది రాధిక.

"ఇంతకీ ఎవరతను?" సిగిరెట్ వెళ్ళినవేపు చూడకుండానే అడిగింది.

"ఇంజినీరింగ్ కాలేజ్ అబ్బాయి. స్టూడెంట్ యూనియన్ లీడరు. మన ఫైనల్ ఇయిర్ స్టూడెంట్ శ్రీధర్ లేడూ.. అదే. మన మెడికోల రెప్రజెంటేటివ్ లీడర్... అతని ఫ్రెండ్.." చెబుతూనే ఒక సమోసాను రాధికకు అందించింది సుష్మ.

"అయితే ఇప్పుడు ఏమైనా స్ట్రైక్ చేయిస్తున్నారా ఇద్దరూ కలిసి?" కాలేజికి సెలవు వస్తుందా అని ఆలోచించింది రాధిక. ఆమె ఆలోచన కనిపెట్టి నవ్వింది సుష్మ.

"ఇప్పుడు స్ట్రైక్ చేసేంత ఇష్యూ సేంలేవుగా..." అంది సెలవు లేదే అని ఆమె కూడా బాధపడుతూ.

లంచ్ టైమ్ అయిపోయాక క్లాసుకు వెళుతుండగా మళ్ళీ గమనించింది రాధిక చైతన్యను, క్యాంటిన్ కు దూరంగా చెట్టు కింద కూర్చుని భోంచేస్తున్న, ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్‌లో శవాలు కోసే అతనితో. ఆ మనిషి పేరేమిటో కూడా రాధికకు తెలియదు. దాదాపు ఎవరూ అతనికో పేరు ఉండొచ్చు అని కూడా ఆలోచించరు. అతనూ ఎవ్వరివేపూ చూడడు. టేబుల్ మీది శవాలూ, చుట్టుపక్కల మనుష్యులూ తనకు ఒకటే అన్నట్లు తనపని తాను చేసుకోపోయే మనిషి. కానీ చైతన్య అతని భుజం మీద చెయ్యి వేసి మరీ మాట్లాడుతున్నాడు. శవాలు కోసే అతని చెమట ముఖంలో తాము ఎప్పుడూ చూడని సంతోషం. ఈ అబ్బాయి సిగిరెట్ తాగుతున్నా కూడా మంచోడేనేమో? రెప్పపాటులో అనిపించింది ఆమెకు. చైతన్య తనను గమనించినట్లు అనిపించి తల తిప్పేసుకుని నడుచుకెళ్ళిపోయింది.

జనవరి చివరి రోజుల్లో పుడుతున్న తొలి ఎండ ఆ మధ్యాహ్నం మల్లెపువ్వులా విచ్చుకుంది.

"బావున్నావా" చైతన్య వెచ్చగా నవ్వుతూ అడిగాడు

తెప్పరిల్లింది రాధిక. అతనేమీ పెద్దగా మారలేదు. ముఖ్యంగా అతని కళ్ళు అస్సలు మారలేదు. చూపు తిప్పుకుంది. అతని పక్కనున్న ఆ పిల్లవాడి కళ్ళు కూడా అవే. కాకపోతే ఇంకా ఎదగని పసికళ్ళు. ఎండ మొగ్గల్లా. తన తండ్రి ఎవరో పరాయి వ్యక్తితో పరిచయమునట్లు మాట్లాడుతున్నాడేమిటా అని ఆశ్చర్యంతో ఆ చిన్ని ముఖంలోని పెద్ద కళ్ళు మరింత విచ్చుకున్నాయి.

"ఇన్నాళ్ళూ ఇక్కడే ఉన్నావా?" అంతేలేని మూగ నిముషాలకు ఇబ్బంది పడుతూ అడిగాడు చైతన్య.

పసివాడి నుంచి చూపు తిప్పుకోలేకపోతోంది రాధిక.

"ఎందుకు ఆ పేరు పెట్టా..." 'వు' అనాలో 'రు' అనాలో కూడా ఆమెకు అర్థం కాలేదు ఆమె స్థితి అతనికి అర్థమైంది. అంతసేపూ ఏకవచనంలో చనువుగానే సంబోధించి తప్పు చేసానేమో అనుకుని బిడియపడ్డాడు.

విరిగిన మనసుల మధ్య అగాధంలోతు కాలం కూడా పూడ్చలేనంత.

"ఓ...సారీ... మరచిపోయా. యూఎస్ నుంచి వచ్చిన డాక్టర్. ఇదే ఫస్ట్‌డే అన్నారు. సర్ నేమ్‌తో ఉండేసరికి పేరును చూసి పోల్చుకోలేదు" వివేకానంద్‌ను పక్కన కుర్చీలో స్థిమితంగా కూర్చోబెడుతూ, రాధిక వేపు చూడకుండా అన్నాడు చైతన్య.

రెండు సంవత్సరాలు... ఒకరినొకరు మనసులో ఉన్న ప్రతి ఆలోచననూ పంచుకున్నారే కానీ బాహ్య ప్రపంచం ఎక్కువగా విలువనిచ్చే కులగోత్రాలూ, కుటుంబ ఆస్థుల వివరాలూ, ఇంటిపేర్లూ కూడా పెద్దగా పట్టించుకోలేదు వారిరువురూ.

"ఒహాయోలో ఉన్నాను. తొమ్మిది సంవత్సరాలు" మెల్లగా ప్రస్తుతంలో మసలడానికి అలవాటుపడింది రాధిక.

"ఓహో...పిల్లలు?" ప్రశ్నతోపాటే అతని చూపులు తన మెడ అంచునుంచి చీరచాటున జారుకుంటున్న తాళివేపు పడి నిర్వేదమయిపోవడం ఆమె గమనించకుండా ఉండలేకపోయింది. అతని భాషలో ఆ 'లైసెన్స్ థ్రెడ్', 'వివాహ సూచిక' తన మీద బరువుగా అనిపించింది. అసలు ఇతను పెళ్ళి ఎలా చేసుకున్నాడో?

జవాబు ఇవ్వలేని పరిస్థితిలో అడిగింది" "మీ వైఫ్?"

అతని ముఖం ఆమె తప్పుగా చదవలేదు. ఆ విషయం అతనికీ తెలుసు. అయినా అతను నటించ ప్రయత్నించాడు.

"చిన్న పర్సనల్ పనిమీద సింగపూర్ వెళ్ళింది" మరమనిషిలా చెప్పాడు. ఆమె కళ్ళ అద్దాలలో అతని నటన విఫలమై వెక్కిరించినట్లు అనిపించింది అతనికి.

ఇంకేం అడగాలో ఆమెకు తోచలేదు. చెప్పదలచని విషయాలను ఎంత గుచ్చి ఏం లాభం? ఆమెతో మాట్లాడేందుకు సరి అయిన మాటలేమిటా అతను బేరీజు వేసుకున్నాడు. వివేకానంద రాధికను ఇంకా విచిత్రంగా చూస్తునే ఉన్నాడు.

"ఇంతకీ ఏమైంది?" చైతన్య తన దగ్గరకు పేషెంటుగా వచ్చాడని ఆమెకు అప్పుడు స్ఫురించింది.

"నాకేం ప్రాబ్లం లేదు" అతని మాటలు ఆమె ఆదుర్దాను తగ్గించాయి. "కానీ, వీడికే..." వివేకానంద చిన్న చేతులలో బిగుసుకున్న ఒక ఆకాశం నీలం రంగు ఫైల్‌ను ఆమెకు అందించాడు. ఆమె గుండె వేగం హెచ్చింది. ఈ పసి అద్భుతానికి ఏం అయ్యి ఉంటుంది. సంవత్సరాల విద్య ఆమె వెన్నులో భయం పుట్టించింది. తాను చిన్నపిల్లల డాక్టరు కాదు. ఈ హాస్పిటల్‌లో అత్యంత ఖరీదైన, నిపుణురాలైన న్యూరో సర్జన్. అలాంటి తన దగ్గరకు ఈ ఆరేడేళ్ళ పసివాడిని ఊరికే పంపరు కదా. రెఫరెల్ ఫైల్‌ను వివేకానంద చేతుల్లోంచి అందుకుంటుండగా వేళ్ళను వణకకుండా అదుపు చేసుకుంది.

ప్రాణాలతో ముడిపడి ఉన్న వైద్య వృత్తిలో వ్యక్తిగత ప్రేమ నిషిద్ధం అని ఆమె ఎప్పుడో నేర్చుకున్న పాఠానికి మొదటిసారిగా సవాలును అనుభవిస్తోంది.

వివేకానంద కేస్ ఫైల్‌లో కూడా అతని తల్లి పేరు లేని వెలితిని గమనించి, మరింతగా చదివింది. కొన్ని నెలలుగా సాయంత్రాలు తలనొప్పితో బాధపడుతున్నాడని తెలియగానే ఉలిక్కిపడి వివేకానంద వేపు చూసింది. తన క్యాబిన్ గోడల మీద ఉన్న 'తల లోపలి మెదడు' బొమ్మ ఉన్న పోస్టరు వేపు కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు. అతని కంటి పాపలు అప్పుడే నీళ్ళలోంచి లాగేస్తున్న చేపపిల్లలా సన్నగా కంపిస్తుండటం కనిపెట్టింది రాధిక. ఒక దుశ్శకునం ఎదురైనట్లు విలవిలలాడింది ఆమె మనసు.

కేసు ఫైల్‌లో ఉద్విగ్నంగా లీనమైంది. రెండూ సార్లు దాదాపుగా మూర్ఛ వచ్చినట్లు పడిపోవడం, వాంతులతో వేరే డాక్టర్ దగ్గర చిన్నపాటి ట్రీట్‌మెంట్ తీసుకుని, అప్పటికీ తగ్గక రెండురోజుల క్రితమే తమ హాస్పిటల్‌కు తీసుకువచ్చిన ఆ అబ్బాయికి, కొన్ని పరీక్షలు చేశాకా ఆ అబ్బాయి పెరుగుదలను అడ్డుకుంటూ, కాళ్ళను, శరీరాన్ని గుంజేసేంత బలహీనపరుస్తూ అతడి మెదడులో ఏదైనా వ్యాధి ఉందా అనే అనుమానంతో రాధికకు రిఫర్ చేసారు. ఫైల్ మూసివేస్తుండగానే ఆమెకు వివేకానందలో ఏ లోపం ఉండొచ్చో చూచాయిగా తోచింది. ఇంత విజ్ఞానం సంపాదించుకున్నందుకు తనంటే తనకే కోపం పుట్టింది. తాను అనుకుంటున్న జబ్బు అతనికి ఉండకూడదని ప్రార్థిస్తూనే తన వేపు రమ్మన్నట్లు వివేకానందను వేళ్ళతో పిలిచింది.

బెరుకుగా తండ్రి వేపు చూశాడు.

"పదరా... ఆంటీ ఏం చేయదు... గుడ్ బోయ్ కదూ" యధాలాపంగా అంటూనే వాడిని చేతులతో రాధిక వేపు కదలమన్నట్లు జరిపాడు చైతన్య.

'ఆంటీ?'

రాధిక మనసు తెగింది. తాను మాట్లాడిన మాట తనకే నచ్చనట్లు చైతన్య ఇబ్బంది పడిపోయాడు. కానీ ఏం చేయగలడు? మాట్లాడేసాడు.

వివేకానంద రాధికను సమీపించాడు. ఇష్టానికి ముద్దు పెట్టకుండా పెదవులను అదుపుచేసుకోవడం చాలా కష్టం. రాధిక పెదవులను రాళ్ళు చేసుకుని అదుపు చేసుకుంది. గులాబీ రెమ్మలా ఉన్న అతడి చేతిని అందుకోగానే ఆమె తన ఉనికిని కోల్పోయేంత పరవశాన్ని అనుభవించింది.

"ఏం పేరు చెప్పూ" పసివాడి పలుకును వినేందుకు రాధిక చెవులు విచ్చుకున్నాయి.

"వీవా" అప్పుడే పుట్టిన పిచ్చుక రెక్కలు విదుల్చుకున్నట్లు ముద్దుగా పలికాడు. ఆశ్చర్యపోయింది రాధిక. "ముద్దు పేరు. స్కూల్లో అందరూ అలానే పిలుస్తారట" చైతన్య వివరించాడు. ఆముద్దు పేరు కూడా ఆమెకు ముద్దొచ్చింది.

"ఏ క్లాస్?"

"ఫస్ట్ క్లాస్" గర్వంగా ఒక వేలు చూపించాడు వీవా.

రాధిక కళ్ళలో నవ్వు తడిబారింది.

"క్లాసులో కూడా వాడే ఫస్ట్" చైతన్య ఇంకా గర్వంగా చెప్పుకున్నాడు. రాధిక ఇక సంతోషాన్ని అదుపు చేసుకోలేకపోయింది. ఫక్కుమంది. తడిలో మసకబారిపోతున్న ఆమె కళ్ళకు చైతన్య కూడా పసివాడిగానే కనిపించాడు. ఈ పిల్లవాడు తప్పిపోయి చాలాకాలం అయిందే?!

"గుర్తుందా... నువ్వు... పాస్ అవడానికి కూడా కష్టపడేవాడివి" సునాయాసంగా అతడిని ఏకవచనంలో సంబోధించేసింది రాధిక. గతంలోని మధుర క్షణాలు గుర్తుకొచ్చి సిగ్గుపడిపోయాడు చైతన్య. వీవాకు ఏమీ అర్థం కాలేదు. భారంగా తల వాల్చుకున్నాడు. కర్తవ్యం గుర్తుకు వచ్చింది రాధికకు.

"ఎక్కడ.. రా.. నొప్పి" ప్రేమిస్తూనే వృత్తివిధానం అనుసరిస్తూ వీవాను పరీక్షించసాగింది. ఆమె చేతుల్లో ఆ పసివాడిని చూస్తూ చైతన్య సంతోష పడ్డాడు. బాధపడ్డాడు. భయపడ్డాడు. వాడి గురించి ఆమె ఏం చెబుతుందా అని ఎదురుచూస్తూ కాలివేళ్ళ మధ్య నిముషాలను ఇముర్చుకుని కూర్చునాడు.

రాధికకు తన అనుమానం నిజమే అనిపించింనిది... వివేకానందను నిశితంగా పరీక్షించాక. ఆ పసివాడి మెదడు నుంచి పుడుతున్న నరాల దగ్గర ఏదో దురదృష్టం మాటు వేసి ఉన్నట్టు తోచింది ఆమెకు. కలవరాన్ని దాచేసుకుని వీలైనంత ప్రశాంతతను ముఖం మీద అద్దేసుకుంటూ చైతన్య వేపు తిరిగింది.

"ఏం భయపడక్కర్లేదు, బహుశా ఏం ప్రాబ్లం లేకపోవచ్చు... కానీ జస్ట్ టు రూల్ అవుట్ సంథింగ్స్..." ఇంకా ఖచ్చితంగా నిర్ధారంకాని భయాన్ని అతడికి చెప్పలేక, అతడి కళ్ళలోకి చూడలేక ప్రిస్క్రిప్షన్ బుక్‌లో ల్యాబ్ టెస్టులు వ్రాస్తూ "ఒక సీ.టీ., ఎమ్ ఆరై తీయిద్దాం... అసలు ఈసరికే తీయించి ఉండాలి హాస్పిటల్లో. బహుశా నాకు రిఫర్ చేస్తున్నారు కాబట్టి అక్కర్లేదు అనుకున్నారేమో ఇంతకు ముందు మీరు కన్సల్ట్ చేసిన పీడియాట్రీషియన్..."

"ఫర్లేదు. ఏమిటి ప్రాబ్లం చెప్పు" చైతన్య ఆమె మాటలకు అడ్డుపడ్డాడు. ఆమె తడబడింది. ఆమె చేతి పక్కనే నిల్చుని ఆమె చేతిలోని పెన్నూ, ఆమె వ్రాస్తున్న అక్షరాలను చదవాలని ప్రయత్నిస్తున్నాడు వివేకానంద.

నిస్సహాయంగా చైతన్య చూపులను ఎదుర్కొంది రాధిక. ఆమె జవాబు కోసం అతను ఎదురు చూస్తున్నాడు.

"ట్రస్ట్‌మీ. ఈ టెస్ట్స్ చేయిస్తే ఏవిషయమైనా కరెక్టుగా చెప్పొచ్చు. ఈ స్టేజ్‌లోనే భయపడటం అనవసరం" ఎందరో పేషెంట్లకు చెప్పిన మాటలనే చెప్పక తప్పలేదు ఆమెకు.

"భయమా? జరగాల్సినదేదైనా ఫేస్ చెయ్యక తప్పదు కదా. ఈవేళ కాకపోతే రేపు.... ఇంతకీ ఏం సస్పెక్ట్ చేసి ఈ టెస్ట్‌లు చేయమంటున్నట్లు"

అతని మొండి తనం ఏ మాత్రం తగ్గలేదు అనిపించింది ఆమెకు.

"కాంట్ బీ ష్యూర్. ఎ డెవలెప్ మెంటల్ డిజార్డర్ ఇన్ ఎ పార్ట్ ఆఫ్ బ్రైన్. ఆర్, ఎ ట్యూమర్" తను అనుమానిస్తున్న విషయాలను చెప్పక తప్పలేదు ఆమెకు.

అతని ముఖం పాలిపోయింది. వివేకానందను తన చేతుల్లో పొదుపుకున్నాడు.

"ఎనీథింగ్ సీరియస్?" అతని చిక్కటి గొంతు వణికింది.

"ప్లీజ్.... చే... టెస్ట్ రిజల్ట్స్ చూదాం" అప్రయత్నంగానే ఆమె చేయి అతడి చేతిమీదకు సాగింది.

అనునయానికీ స్పర్శకూ మధ్య ఒక ఘడియ నొక్కుకుపోయింది.

ఒప్పుదలగా అతను తలపంకించాడు.

"సో"... అన్నాడు... ఇక వెళ్ళడానికి కుర్చీలో కదులుతూ.

"హైదరాబాద్‌లోనే ఉన్నావా?" అంతసేపూ అతడి కుశల విశేషాలు కూడా కనుక్కోలేదని స్ఫురించింది రాధిక.

"ఆఁ..వీడు పుట్టినప్పటినుంచీ.." వివేకానందను ప్రేమగా దగ్గరకు హత్తుకుని చెప్పాడు. తండ్రి చేతులు నడుము దగ్గర తగిలేసరికి చక్కిలిగింతలు పెట్టినట్లు నవ్వాడు వాడు. ఒకసారి వాడిని అలా హత్తుకోవాలి అనే ఇంపల్స్‌ను అదుపు చేసుకుంది ఆమె. దాన్ని అణిచేసుకుంటూ "ఏం చేస్తున్నావ్?" అని మాట మార్చింది.

"ఇక్కడే...గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో చీఫ్ ఇంజినీర్‌గా..." ఆమె ముఖంలోకి చూడలేక చెప్పాడు చైతన్య.

'నేనా... ఉద్యోగమా...?' అంటూ నవ్విన ఛే ఆమె తలపుల్లో మెదిలాడు.

"సరే టెస్ట్‌లు చేయించుకుని మళ్ళీ కలుస్తాం" అంటూ ఇక బయలుదేరడానికి లేస్తూ, "బై చెప్పరా" అన్నాడు కొడుకుతో.

"బైబై...ఆంటీ..." అంటూ చెయ్యి ఊపాడు వీవా.

కలుక్కుమనిపించే పిలుపుకు అలవాటుపడిపోతూనే, వాడికి ఏదైనా ఇవ్వాలి అనిపించింది రాధికకు. అప్పుడప్పుడూ వచ్చే పసిపేషెంట్ల కోసం కొన్ని చాక్లెట్లు, చిన్న బొమ్మలు ఒక డ్రాలో పెట్టుకునేది ఆమె, తాను ఇంతకు మునుపు ఉన్న హాస్పిటల్‌లో. మొదటి రోజు కావడంతో ఈవేళ అవికూడా లేవు ఇక్కడ. అయినా 'పేషెంట్స్'కు ఇచ్చే వస్తువులు వీడికి ఇవ్వడమేమిటి? తలుపు తీసుకుని వెళ్ళబోతున్న వాళ్ళిద్దరినీ చూస్తుంటే ఆమెకు చప్పున స్ఫురించింది... ఒక బహుమతి.

"వీవా...వీవా... ఒకసారి రా" కంగారుగా పిలిచింది.

ఆమె చేతిలో చూపుతున్న వస్తువును చూసి కళ్ళు పెద్దవి చేసుకుని వచ్చాడు వాడు. వాడి మెడలో వేసింది. తన స్టెతస్కోపు. అయోమయంగా చూసాడు వాడు.

తన చెవిని తాకిన ఇయిర్ పీస్‌లను శుభ్రంగా తుడిచి, వాడి దొప్ప చెవుల్లో ఉంచి, డయాఫ్రమ్ ను వాడి లేత ఛాతీమీద సుతారంగా నొక్కింది.

చినుకు చప్పుడు విన్న ముత్యపు చిప్పలా విచ్చుకున్నాయి వాడి కళ్ళు, తన గుండెలయను వినేసరికి.

"థాంక్యూ" ఆర్ద్రతగా అన్నాడు చైతన్య

ఆ మాట ఎందుకు అన్నట్లుచూసింది రాధిక.

"ఇందుకు కాదు. నన్ను 'చే' అని పిలిచినందుకు. ఇప్పుడు అలా పిలిచేవాళ్ళెవ్వరూ లేరు" అంటూ వెనుతిరిగాడు చైతన్య.

తన గుండె చప్పుడు వినుకుంటూ వెళ్ళిపోయాడు వీవా. మిగిలిపోయింది రాధిక.

"ఏంటి ఈ టైంలో" టెలిఫోన్ రిసీవర్‌లోకి గుసగుసలాడుతూ చెవులవరకూ దుప్పటి కప్పుకుంది రాధిక. పరుపు మీద అంతా పుస్తకాలు, ఛార్ట్‌లతో చిందరవందరగా ఉండటంతో కాలికి ఏకాగితమూ తగలకుండా జాగ్రత్తపడుతూ గోడవారగా ఒదుగుకుంది. నిలకడగా కురుస్తున్న రాత్రివాన కిటికీ అవతల తెరలు తెరలుగా పరుచుకుంటోంది.

"ఊరికే... మాట్లాడాలి అనిపించింది" చైతన్య మాటలు ఆమెకు వెచ్చగా తోచాయి" అసలు ఈ ఫోన్‌లు ఇంత ఇన్‌కన్వీనియంట్‌గా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే సెల్‌ఫోన్స్ ఇండియాకు వస్తున్నాయట.. అవేవో త్వరగా మన చేతికి అందితే బావుణ్ణు." తాను కోరుకున్నప్పుడు మాట్లాడుకోనివ్వని టెలిఫోన్ వ్యవస్థ మీద చిరాకుపడ్డాడు చైతన్య. రాధిక గది తలుపు వేసి ఉందా అని చూసుకుంది. గడి పెట్టలేదు కానీ దగ్గరకే వేసి ఉంది. దుప్పట్లోంచి కదలబుద్ధికాక బద్దకించి, "నాన్నకు తెలిస్తే ప్రాబ్లం చే" తన చెవులకు కూడా వినిపించనంతగా మౌత్‌పీస్‌లోకి గుసగుసలాడింది.

"ఇంకా మేలుకునే ఉన్నారా?" అతనూ గుసగుసలాడాడు

"నువ్వెందుకోయ్ విస్పరింగ్?"

"నీకు కంపెనీ ఇద్దామని... ఇంతకీ మీ నాన్న నిద్రపోలేదూ?"

"ఏమో తెలియదు. ఏవో ఆఫీస్ ఫైల్స్ చూస్తున్నారేమో"

"మరి ఇండియాకు ప్రైమ్ మినిస్టర్‌లా కష్టపడిపోతారుగా మీ నాన్న..."

"చుప్... తను పనిచెయ్యకపోతే ఎలా? జాబ్ కదా"

"ఆ c స్టీల్ ప్లాంట్‌లో ఒక మేనేజర్ కాస్త తక్కువ పనిచేస్తే ఈ వైజాగ్‌లో స్టీమర్లు అన్నీ ఆగిపోతాయి మరి"

"హూ!చే ఈ దేశంలో ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు. వేస్ట్ ఫెలోస్ ... అని తమరేగా మొన్న ఆవేశపడ్డారు"

"అవుననుకో... ఓకే.... యూ ఆర్ రైట్... యువర్ డాడీ ఈజ్ గ్రేట్"

"గుడ్ కాబట్టి మరి... రేపు పొద్దున్న మాట్లాడుకుందాం"

"ఏయ్ ఏయ్ కట్ చెయ్యకు. మళ్ళీ ఫోన్ చేస్తాను. రింగ్ అయితే మళ్ళీ మీ నాన్న ఆన్సర్ చెయ్యొచ్చు. అప్పుడు డైరెక్టుగా ఆయన్నే అడుగుతా?"

"ఏమని?"

"మిస్టర్ ఫాదర్ ఆఫ్ రాధికా... మీ అమ్మాయి నా గర్ల్‌ఫ్రెండు. కాస్త పిలవండి అని" అతను ఎదురుగా లేడు, చూడలేడు అని దాచుకోకుండా సిగ్గుపడిపోయింది రాధిక

"సర్లే ఇంతకీ ఏం చేస్తున్నావ్?"

"ఏం చేస్తాను? చదువుకుంటున్నాను" చిరుకోపం నటిస్తూ గుసగుసలాడింది.

"ఏం చదువుతున్నావ్?"

"ఈఎన్‌టీ"

"ఓహో... అందులో ఏంటి?"

"లారింజియల్ కాన్సర్? ఏం నీకు బాగా తెలుసా?"

"హౌ అన్ రొమాంటిక్. ఈ వానలో తడిచి జలుబు తెచ్చుకోవాలి కానీ ఇలా గొంతు జబ్బులు చదువుతారా?"

"ఏయ్... తుడుస్తున్నావా? లోపలికెళ్ళు జలుబొస్తుంది"

"నాకు జలుబు వస్తే ఏం? నువ్వున్నావుగా?"

"ఉంటే? నేనేమైనా ముక్కునా? ఎవరి గాలి వాళ్ళే పీల్చుకోవాలి మిస్టర్"

"అదికాదు... నాకు ట్రీట్‌మెంట్ ఇవ్వచ్చు, తలనొప్పి వస్తే తలమీద ఏ జండూబామో రాయొచ్చు, తుమ్ములు వస్తే ఏ విక్సో ఛాతీకి రాయొచ్చు"

"అలా అయితే ఒక పిచ్చి కుక్కతో కరిపించుకో... ముప్పై రోజులు నా చేత ఇంజక్షన్స్ వేయించుకోవచ్చు"

"ఛీ. కస్సలు ట్రీట్‌మెంట్‌కూ, రొమాన్స్‌కూ తేడా తెలీకుండా పోతోంది. ఇంతకీ రేపు వస్తున్నావ్ కదా?"

"ఎక్కడికి?"

"సినిమా?"

"ఏం సినిమా?"

"ఒసేయ్ రాములమ్మా... అని ... బావుందట"

"బాబోయ్... ఏమైంది నీకు?"

"అరే నమ్ము.. నిజ్జంగా బావుందట.... తెలంగాణాలో సప్రెషన్ గురించి, నక్సలిజం, ఫ్యూడల్ సిస్టమ్స్ ఎక్స్‌ప్లాయిటేషన్స్..."

"హౌ రొమాంటిక్?"

అతను చిన్నబుచ్చుకున్న ముఖాన్ని ఊహించుకోగలిగింది రాధిక.

"పోనీ బీచ్‌కు" పట్టువదల్లేదు అతను.

"స్టాపిట్ చే! నాకు వన్‌వీక్‌లో ఎగ్జామ్స్"

"టూ మచ్. వారం రోజుల తర్వాత కదా!"

"హలో... ఇది మీ ఇంజినీరింగ్ కాదు. ముందురోజు బట్టీ కొట్టెయ్యడానికి"

"ప్రతి వాళ్ళదీ ఇదే కామెంట్. నేనే మెడిసిన్‌లో అయితే మీ ఫైవ్‌ఇయర్స్‌నూ ఒక నెలరోజుల్లో కంప్లీట్ చేస్తా.."

"అవును సార్... మీకు రెండు సబ్జెక్ట్స్ బ్యాక్ లాగ్స్ ఉన్నట్లున్నాయి"

"చంపేస్తా అవన్నీ గుర్తుచేసావంటే"

"అవును చే, ప్రపంచాన్నే మార్చెయ్యాలంటావ్ కదా, అంత విల్‌పవర్ ఉన్నవాడివి ఈ చిన్న ఎగ్జామ్స్ నీకో కష్టమా? ఆ ప్రొఫెసర్‌తో మంచిగా ఉంటే సరిపోతుంది కదా"

"నో వే... ఒక చిన్న ఎగ్జామ్స్ నీకో కష్టమా? ఆ ప్రొఫెసర్‌తో మంచిగా ఉంటే సరిపోతుంది కదా"

"నోవే... ఒక చిన్న ఎగ్జామ్స్ కోసం వాడు చెప్పిన తప్పును ఒప్పుకోవడమా? అయినా ఇంకో టూ మంత్స్‌లో వాడు రిటైర్ అవుతున్నాడు. ఇంకేం చేస్తాడు? క్లాసులో తప్పు చెప్పింది కాక దాన్ని ఎవ్వరూ  అబ్జెక్ట్ చెయ్యకూడదు అంటే ఎలా కుదురుతుంది?"

"అలా కాదు. నువ్వు బ్రిలియంటువు అనే విషయం నీకు తెలుసు కదా. అది చాలదూ? వాడు ఇడియట్ అని ప్రూవ్ చేయడమెందుకూ?"

"వాడు ఇడియట్ అనో, నేను బ్రిలియంట్ అనో ప్రూవ్ చేయడం కాదు. ఫ్యాక్ట్, కరెక్ట్‌నెస్ ఆర్ ది ఇష్యూస్ హియర్"

"ఆ ఫ్యాక్ట్‌ను నువ్వే ప్రూవ్ చెయ్యాలా?"

"నేను కాకపోతే ఎవ్వరో ఒకరు. ఎవరూ చేయలేదు కాబట్టి నేను. అందరూతంతారని గెలీలియో భూమి చదరం మైదానం కాదు ఒక గ్లోబ్ అని చెప్పకుండా ఉండగలిగాడా?"

అతని ఆవేశాన్నీ, గెలీలియో అనుభవించిన తిరస్కారాలనూ గుర్తుచేసుకుని భయపడింది రాధిక. అతని ఆవేశం తగ్గలేదు...

"మేధావులూ, చదువుకున్నవాళ్ళూ ఉరుకున్నప్పుడే.. ఇడియట్స్, మీడియోకర్స్, దద్దమ్మలు, చవటలు అందరూ నెత్తికెక్కి కూర్చుంటారు. నువ్వు చెప్పు... వాడెవడూ..... మీ అసిస్టెంట్ ప్రొఫెసరు... క్యాటరాక్ట్ సర్జరీ కూడా సరిగ్గా చేయలేడు అంటావే.."

"అవునూ... చాలా రఫ్‌గా చేస్తారు"

"'రు' ఏమిటీ... అలాంటివాడికి మర్యాదకూడానా? గవర్నమెంట్ హాస్పిటల్ కాబట్టి అలా ఎవ్వరూ అడగరనే కదా.."

"అలా ఏం లేదు. మిగతా అందరూ మంచి సర్జెన్సే కదా. ఇతనికి పాపం వచ్చినట్లు చేస్తారు"

"అలాంటివాడిని సపోర్ట్ చెయ్యడమేమిటి? చేతకాకపోవడం తప్పుకాదు. కానీ సరిదిద్దుకోకుండా, సరిగా నేర్చుకోకుండా 'నాకు వచ్చినట్లే చేస్తా' అని ప్రాణాలతో చెలగాటం ఆడటం తప్పు కదా"

"నువ్వూ అంతే కదా.... 'నాకు నచ్చిన ట్టే నేను ఉంటాను. ఎగ్జామ్స్ నాకు ఇష్టం వచ్చినట్లే రాస్తాను' అంటున్నావ్"

"కానీ నేను ఇంకొకరి లైఫ్‌తో ఆడుకోవడం లేదు కదా"

"నీ లైఫ్‌తో మాత్రం నువ్వే ఆడుకోవచ్చా?"

"ఐ నో హౌ టు కంట్రోల్ మై లైఫ్"

"........"

వాన ఆగకుండా కురుస్తూనే ఉంది. చలి పెరిగినట్లు అనిపించి దుప్పట్లోకి ఇంకొంచెం జారుకుంది రాధిక.

"సారీ... నాకు ఊరికే సలహాలు చెబుతుంటే కోపం వచ్చేస్తుంది" చైతన్య గొంతులో క్షమాపణ తొణికింది

"నీకోసమే కదా..."

"కరెక్టే... సారీ ఇంకెప్పుడూ చిరాకుపడను"

"ఆఁ చెప్తావ్... మళ్ళీ మామూలే"

"సరే... సారీ... సారీ... సారీ.... ఇంతకీ రేపు కలుస్తావా లేదా? ప్లీజ్"

"ఊఁ ట్రై చేస్తాను, కానీ నో సినిమా, బీచ్ ఓకే, కానీ టెన్ మినిట్స్ అంతే"

"అన్యాయం. హాఫ్ ఎన్ అవర్"

"ఫిఫ్టీన్ మినిట్స్"

"ట్వెంటీ?!"

"మరీ కూరగాయల బేరంలా అనిపించట్లా"

"ఏం చేసేది ... పేదవాడిని... మీరేమో యువరాణి"

మళ్ళీ సిగ్గుపడిపోయింది రాధిక.

"ఏయ్.. రేపు ఆ గ్రీన్ చీర కట్టుకు రావచ్చుగా"

ఆమె తనను గమనించట్లేదు అనుకుని అతను తన నీడలా తన వెనకే వీధి చివరవరకూ నడుచుకు వచ్చిన రోజు గుర్తుకు వచ్చింది ఆమెకు. తన అందానికి ఆవేళ కాస్త గర్వపడింది కూడా.

"ఆ డ్రస్ లో నువ్వు చా..లా.. బావుంటావు" అతని గొంతులో ఇష్టం విరహంతో విలవిలలాడింది. రాధికకు ఇక మాటలు లేకపోయినాయి. ఆమె గుండె జ్వరం వచ్చినట్లు పరుగెత్తింది.

"ఇంకా చెప్పాలంటే.... చాలా సె...క్సీ...గా ఉంటావు" సిగ్గులేకుండా సిగ్గుపడిపోయాడు అతను.

"స్టాపిట్ చే" రిసీవర్‌లోకి దూరిపోతున్న మెలికల ఫోన్ వైర్‌లను వేళ్ళకు చుట్టుకుని పులకరింతను అదుపు చేసుకుంది రాధిక

"నిజ్జం... రాధీ..."

"ప్లీజ్ చే..."

"సారీ... ఇఫ్ ఐ సౌండెడ్ ఇన్‌డీసెంట్..." చైతన్య బాధపడటం ఆమెకు నచ్చలేదు. మగవాళ్ళు ఒట్టి వెధవలు... ఏమీ అర్థం చేసుకోలేరు అనుకుంది.

"అది కాదు... నేను చదువుకోవాలి... ఇలా డిస్టర్బ్ చేస్తే ఎలా....?" రాత్రికి ఏ సుందరస్వప్నం నిద్రను చెడగొడుతుందో అని ఆమె భయపడింది.

"ఏంటో నాకు ఏం అర్థంకావట్లేదు.. ఇందులో డిస్టర్బెన్స్ ఏముంది"

"నీకు ఇలా అర్థం కాదులే... సరే ఇక ఉంటాను... రేపు మాట్లాడుకుందాం" వీడలేక వీడలేక ఆ రాత్రికి వీడ్కోలు చెప్పుకున్నారు ఇద్దరూ.

ఒళ్ళు విరుచుకుని పడుకున్న పుస్తకాలన్నిటినీ మూసివేసింది రాధిక. చదువుపై ఆమె మనసు ఎగిరిపోయింది. వర్షం వాసన మరింతగా మురిపిస్తుంటే గిలిగింతలు అనిపించి కిటికీ తలుపు వేసేందుకు లేచింది. పక్కన ఉన్న టేబుల్ మీద ఒక కప్పులో 'బోర్నవిటా' ఆమె మీదకు సెగలు కక్కుతోంది. తలుపు తెరుచుకుని ఉంది. చెమటలు పట్టాయి రాధికకు. చైతన్య మాటల మార్దవంలో మునుగుతూ పరిసరాలు మరచిపోయానని అర్థమైంది. గది తలుపు దగ్గర మనిషి మసిలిన అలికిడికి అప్రయత్నంగా తలతిప్పింది రాధిక.

ఆమెను తొలిచేసేట్లు చూస్తున్నాడు... జగన్.

"అమ్మ ... ఇమ్మంటే ఇందాక వచ్చా..." టేబుల్ మీది కప్పును చూపిస్తూ అన్నాడు" నువ్వు ఎ...వ..రి... తోనో మాట్లాడుతున్నావు అని డిస్టర్బ్ చెయ్యలేదు."

అతడివేపు చూడలేక ఆమె కనురెప్పలు దించుకుని బోర్నవిటా అందుకుంది. అమ్మకు తెలిస్తే ఏమంటుందో అనిపించింది తల్లి ఇచ్చిన ప్రేమ ఆమె గొంతు దిగుతుంటే.

జగన్ వెళ్ళిపోలేదు. "ఎవరక్కా?" ఆమె వేసుకున్న ఆఫ్థమాలజీ ఛార్ట్‌లలో కనుబొమ్మలు చూస్తూ చాలా యధాలాపంగా అడిగినట్లు అడిగాడు. అతను చాలా విన్నాడేమో అనిపించింది ఆమెకు. తమ్ముడు తన గురించి ఆరా తీసేంత పెద్దవాడా? ఆడపిల్లకు అయితే అంతేనేమో.

"ఫ్రెండు" కొంచెం ధైర్యంగా అతడి ప్రశ్నను ఎదుర్కొన్నా ఆమె మనసు మూలల్లో బెరుకు మెరమెరలాడింది.

చురుక్కుమని చూసాడు జగన్. "సరే.. ఫోన్ తీసుకెళ్ళి హాల్లో పెట్టెయ్యనా? పొద్దున నాన్న అడుగుతాడేమో" ముందు గదిలోంచి ఆమె మంచం వరకూ పాకి ఉన్న వైరును చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

నోరు పెగలక తల ఊపింది రాధిక.

ఫోన్ వెళ్ళిపోతుంటే చేతిలోకి అందుతున్న ఆకాశం జారిపోతున్నట్లనిపించింది ఆమెకు.

# 4

ఒక్కోసారి సంవత్సరాల తరబడి జీవితంలో చెప్పుకోదగ్గది ఏదీ జరజరగదు. ఏటిలో ఇరుక్కుపోయిన నీటిలా విసుగుపుడుతుంది మనసుకు.

ఎందుకు జరుగుతుందో కానీ గభాలున ఊహించనివేవో జరిగిపోయి.... ఒక్కరోజులోనే జీవితం ఏమైపోతుందో అనేంత భయమేసేస్తుంది. జలపాతంలోకి వచ్చేసాక ఇక ఆగి ఊపిరి పీల్చుకోవాలనుకోవడం నదికి మూర్ఖత్వమే అవుతుంది. వివేకానందను

చూసినప్పటినుంచీ తనలో ఏదో జలపాతం మొదలైనట్లు అనిపించింది రాధికకు. ఈ విషయం ఎవరితోనైనా చెప్పుకోవాలి అనే ఆశ, ఆత్రుత. చైతన్యను చూసిన సంతోషమో, వివేకానందలోని అమాయకత్వానికి ముచ్చటో... ఆమెలో ఒకటే ఉద్వేగం. ఈ భావనను అదుపు చేసుకుని మూడు రోజుల తర్వాత చేయవలసిన సర్జరీలకు సంబంధించిన పేషెంట్లను పరీక్షించి, హాస్పిటల్‌లో మొదటి రోజు డ్యూటీ ముగించుకుంది. బయటపడగానే తన సెల్‌ఫోన్ అందుకుని రాజుకు డయల్ చేసింది. 'యూజర్ బిజీ' అని సింగిల్ రింగ్‌తో సంకేతం వచ్చింది. చేసేదేమీ లేక మెసేజ్ పెట్టింది- ఇంటికి వెళుతున్నాను, ఎప్పుడొస్తావని. రొదపెడుతున్న సాయంత్రం ట్రాఫిక్‌లోకి కారు తీయగానే చాలాకాలం తర్వాత నిస్తేజమైన జీవితం గడుపుతున్న అనుభూతి కలిగింది ఆమెకు.

అమాంతంగా ఆకాశంలోకి ఎగిరిపోయి అక్కడినుంచి చూస్తే....

తాను ఎవరు?

ఈ చిందరవందర ట్రాఫిక్‌లో తనదీ ఒక కారులో ఇరుక్కుని సాగిపోతున్న జీవితమే కాదా? అసలు ఎందుకు అందరూ ఇలా హడావుడిగా బతికేస్తున్నారు? దేనికోసం? ఎవరైనా ఎవరని? ఈ మనుష్యులలో ఎవరైనా ఇలా చర్చించడం జరగకపోతే ఈ ప్రపంచం ఏమైనా ఆగిపోతుందా? నేను ఇప్పుడు ఉన్నాను. హఠాత్తుగా నేను లేకపోతే ఏమైపోతుంది ఈ ప్రపంచం? చాలా ఏళ్ళ క్రితం ఇంటర్మీడియట్ అప్పుడు ఇలాంటి ఆలోచనే కలిగింది రాధికకు. అమీబా, యూగ్లీనా అనే ఏక కణ జీవరాశుల గురించి చదివినప్పుడు. 'అమీబా'. దాని జీవితం ఒక్క కణమే దాని అవతారం. ఆ ఒక్క కణానికి కూడా ఒక నిర్దిష్టమైన రూపు అంటూ లేదు. తన జీవన పయనంలో అనుక్షణం మారిపోతుంటుంది. కానీ ఆ కాస్తంత జీవికీ ఆకలి, ఆహారం, బతకాలనే తపన.... అవన్నీ చాలదన్నట్లు 'రీ ప్రొడక్షన్ కూడా.' మనిషిలానో మిగతా చాలా ప్రాణుల్లానో మరొకరితో జతకట్టకుండా తనే అమాంతంగా రెండు ముక్కలై మరో కొత్త అమీబాకు జన్మనిస్తుంది.

"అంటే... మనం ఇంతసేపూ చదివింది ఒక్క అమీబా గురించి కాదా సార్. రెండు అమీబాలు ఒక్కదానిలా అతుక్కుని ఉన్నాయా?" రెండు జడలు వేసుకున్న పదహారేళ్ళ అమ్మాయిగా తను బోటనీ లెక్చరర్‌ను ప్రశ్నిస్తూ లేవగానే క్లాసులో అందరూ ఘొల్లుమన్న క్షణం రాధిక జ్ఞాపకాల్లో తేటపడింది.

"కాదమ్మాయ్! ఒకటి రెండుగా అవ్వటమే 'బైనరీ ఫిషన్' ఇట్ జస్ట్ డివైడ్స్ ఇట్స్ జెనెటిక్ మ్యాటర్ ఇన్ టు టూ" ఓపికగా సమాధానం ఇచ్చిన తన ఫేవరెట్ సైన్సు మాస్టారు గుర్తుకు వచ్చాడు రాధికకు.

"మరి ఒకటి రెండు అయినప్పుడు ఇంతకు ముందు ఉన్న పేరెంట్ అమీబా ఏమైపోయినట్లు సార్?" మొండిగా ప్రశ్నించిన రాధికకు సమాధానం చెప్పలేక ఆ సైన్సు మాస్టరు తికమకపడితే, పుస్తకాల్లో ఉన్నది బట్టిపట్టి పరీక్షల్లో రాసేసి మరచిపోక ఈ శాస్త్ర చర్చలెందుకని స్నేహితులందరూ ఆమెను విసుక్కున్నారు... ఒక్క సోడాబుడ్డి కళ్ళజోడు వేసుకున్న అబ్బాయి తప్ప.

"ఏమైందిలా అదోలా ఉన్నావ్?" చపాతీలు పెడుతూ అడిగింది పూర్ణిమ రాధిక పరధ్యానం గమనించి. రాజు కంపెనీ పనికోసం చెన్నై వెళుతున్నానని చెప్పడంతో త్వరగా భోంచేసి నిద్రపోదామనుకున్న రాధిక జ్ఞాపకాలతో నిముషాలు గడిపేస్తోంది. అమ్మా, నాన్న, పరిచయం అయిన సిటీ... అందరి మధ్యలోనే ఉన్నా చాలా పరాయిగా అనిపిస్తోంది ఆమెకు మళ్ళీ ఈ రోజు. విదేశాల్లో ఎక్కువకాలం ఉండి ఉండి స్వదేశమంటే విసుక్కునే ఎన్.ఆర్.ఐలా అయిపోయానా అని తన గురించి తానే అనుమానపడింది.

"మీరు అక్కడ ఉండేప్పుడు కూడా ఇలా విడివిడిగానే భోంచేసేవారా" అమాయకంగా అడిగింది పూర్ణిమ. "లేదులేమ్మా... అక్కడ పాపం తనే వంటకూడా చేసేవాడు అప్పుడప్పుడూ..." రాజును వెనకేసుకొస్తూ ఇక ఆ విషయం మాట్లాడటమెందుకన్నట్లు టీవీ ఆన్ చేసింది రాధిక.

"సరే కానీ, ఇంతకీ తను పెడుతున్న కంపెనీలో లాభాలు ఏ మాత్రం ఉంటాయి?" ఆమెకు వడ్డిస్తున్నట్లే పక్కన కూర్చుని అడిగింది పూర్ణిమ.

"సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ ఎప్పుడు ఎటు వెళుతుందో తెలియదు కదా. చెప్పడం కష్టమమ్మా" తల్లి వేపు చూడకుండానే సమాధానం చెప్పింది రాధిక.

"నేను మొన్న మాట్లాడాను రాజుతో. మళ్ళీ అమెరికాకు వెళ్ళిపోతే బావుణ్ణేమో అనికూడా అన్నాడమ్మాయ్" అంతసేపూ వెనకగా సోఫాలో కూర్చుని వారపత్రిక అడ్డుపెట్టుకుని అంతా వింటున్న నారాయణమూర్తి లేచి రాధికకు మరోపక్క చేరాడు.

వాళ్ళ ప్రవర్తన అర్ధం కాలేదు రాధికకు. "నాతో అలా ఏం అనలేదే?" భృకుటి ముడివేసింది. ఉద్యోగం చేయడం కన్నా స్వతంత్రంగా కంపెనీ పెట్టుకుని బాస్‌లా ఉండాలనే రాజు కోరిక ఆమెకు తెలియనది కాదు.

"అంటే... ఖచ్చితంగా వెనక్కు వెళ్ళిపోవాలి అనికాదు... ఏదో డల్‌గా కనిపించారు" తల్లిమాటలు విని రాజును తాను క్రిందటి రోజు చూసినప్పుడు ఎలా ప్రవర్తించాడో అని గుర్తుచేసుకుంది రాధిక. నవ్వుతూనే ఉన్నాడే?

"ఏమైనా 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రాబ్లమా' అని అడిగాను కూడా" నారాయణమూర్తి ఏం చెబుతున్నాడో రాధికకు అర్ధం అయ్యింది. తమకు ఏమైనా ఆర్ధిక సహాయం కావాల్సి వస్తే అందుకు ఏర్పాట్లు చేయడంలో ఆయనకు ఒకరకమైన తృప్తి. 'ఈగో సాటిస్ఫాక్షన్' కూడా.

"నాన్నా, అలాంటిదేం ఉండదు. నాకు తెలియదా?" ఇక మాటల్లేవు అన్నట్లు టీవీ వేపే సారించింది. ఏదో కొత్త తెలుగు సినిమా పాట. లేని ఉత్సాహం తెచ్చుకుని చూసింది.

రాజు ఏమిటీ... బిజినెస్ విషయాలు వద్దన్నా చెప్పి చెవి ఊదరగొట్టేవాడు... ఇలా అమ్మా నాన్నలముందు డల్‌గా మాట్లాడటమేమిటి? భోజనం పూర్తిచేసి మెసేజ్ చేసింది అతనికి... 'టుమారో వి విల్ టాక్ ఫర్ సమ్ టైం' అని.

మెసేజ్ టైప్ చేసుకున్నప్పుడు ఆమెకే నవ్వు వచ్చింది. మరీ ఇద్దరం ఫోజు పోతున్నామా? లేని బిజీతనాన్ని లైఫ్‌కు ఆపాదించుకుని? సరదా కబుర్లకూ టైం కుదరట్లేదు, పోనీ ముఖ్యమైన విషయాలు మాట్లాడుకోవాలన్నా అప్పాయింట్‌మెంట్సు? అయినా తానేనా ఇలా మారిపోయింది? అయినా మాట్లాడటానికి పర్మిషన్ అడగటమేమిటి? ఆ ప్రశ్న మళ్ళీ పదహారేళ్ళ ప్రాయం నాటి సంఘటనలోకి లాక్కెళ్ళింది ఆమెను.

"ఎక్స్‌క్యూజ్‌మీ రాధికా... నేను కొంచెం మాట్లాడొచ్చా?" ఒక సాయంత్రం కాలేజ్ నుంచి వెలుపలకు వస్తున్న తనను సోడాబుడ్డి కళ్ళజోళ్ళ అబ్బాయి వినయంగా పిలవడంతో ఆశ్చర్యపోయింది ఆమె. అతను తన క్లాస్‌మేట్ ప్రవీణ్. మామూలుగా అయితే అతడిని ఎవ్వరూ పెద్దగా పట్టించుకోరు. కానీ రాధికకు అతడంటే కాస్తంత ఆసక్తి. చాలా తెలివైనవాడని. క్లాసు ఫస్ట్ వస్తుంటాడని. మిగతా క్లాసంతా అతడిని ఒక 'ముద్దపప్పు' అనీ, చదువుకుని ఏ స్టేట్‌ర్యాంకో తెచ్చుకుని విదేశాలకు ఎగిరిపోయే రకం అనీ ఎగతాళి చేసి, ఆ అల్లరికి కూడా అతను బదులు ఇవ్వకపోవడంతో విసిగి ఊరుకుని వదిలేసారు. ఆ 'ముద్దపప్పు' అనే వర్ణన, అతని సోడాబుడ్డి కళ్ళజోళ్ళు, తనకూ అతనికీ మధ్య ఉన్న మార్కుల తేడా తప్ప మరేమీ తెలియదు రాధికకు. ఎప్పుడూ మాట్లాడింది కూడా లేదు.

"ఏంటి ప్రవీణ్" తమను ఎవరైనా చూస్తున్నారా అన్నట్లు చుట్టూ పరిశీలించి అడిగింది రాధిక. ఇంటర్ మీడియట్ పిల్లలంతా గోలగోలగా వెళుతున్న ఆ దారిలో ఎవరి గొడవలో వాళ్ళు ఉన్నారు. ఆ అబ్బాయి కళ్ళల్లో కూడా బెరుకు. పెదవులు ఎండిపోయినట్లున్నాయి.

"అమీబా గురించి నువ్వు ఒక డౌట్ అడిగావ్ కదా" వణుకుతున్న గొంతుతో అడిగాడు ప్రవీణ్.

అయితే ఏమిటన్నట్లు చూసింది రాధిక. "నాకూ అదే డౌట్ ఎప్పటినుంచో ఉంది" కళ్ళు మెరుస్తుండగా అన్నాడు ఆ అబ్బాయి.

సంతోషం అనిపించి నవ్వింది రాధిక. కానీ అంతకు మించి ఏం మాట్లాడాలో తోచలేదు. ప్రవీణ్ అందుకున్నాడు..

"కానీ నా డౌట్స్ అంటే నాకే భయం. ఎవ్వరినీ అడగను. అడిగితే నవ్వుతారని" రాధిక నవ్వలేదు.

అతనికి ధైర్యం పెరిగింది. "నువ్వు డౌట్ అడిగినప్పుడు కూడా అందరూ నవ్వారు కదా. అలాగే... చిన్నప్పటి నుంచీ నేను ఏదో ఒకటి అడుగుతుంటే అందరూ వెక్కిరిస్తారు"

జాలి పడలేదు రాధిక. అతని బాధ ఆమెకు పరిచయమే. **వెక్కిరింతకు గురైన ఇద్దరు పిల్లలు కలుసుకుంటే తొందరగా స్నేహితులైపోతారు.**

"ఈసారి అలాంటి డౌట్స్ ఇంకేవైనా వస్తే ఎవ్వరు నవ్వినా భయపడకుండా నాతో చెపుతావా?" ఆశగా అడిగాడు ప్రవీణ్.

"మరి నీ డౌట్స్ నువ్వు చెప్పవా?"

వాళ్ళ మధ్య మాటలు పెరిగాయి.

"అరిస్టాటిల్ బయోజెనిసి థియరీ చెపుతాడు కదా. అవునూ ఫిజిక్స్‌లో క్వాంటమ్ థియరీలో..." మాటలు తొలుచుకుపోయాయి.

కొన్ని నెలల్లోనే నాన్న ఇచ్చే పాకెట్ మనీలోంచి రూపాయి రూపాయి కూడబెట్టి అతని కోసం ఒక పెన్ కొనిచ్చింది. అతను ఒక స్కాల్పెల్ ఇచ్చాడు, ప్రాక్టికల్ పరీక్షలో కప్పలను అందుతోనే కోయమని. బాగా చదువుకుని పెద్దయాక, డార్విన్ జీవసిద్ధాంతానికి ప్రాణమిచ్చిన 'గెలపాగాస్' దీవికి వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు వచ్చాయి. బోటనీ పరీక్ష రాసి బయటపడ్డాక అదే సెంటర్‌లో పరీక్ష రాస్తున్న ప్రవీణ్ కనిపించడంలేదేమో అని వేచి చూసింది. ఎవరిని అడగగలదు? క్లాస్‌మేట్ అబ్బాయి ఎక్కడా అని వేరొకరిని అడిగితే ఇంకేమైనా ఉందా? ఇంట్లో టెలిఫోన్ ఉన్నా తనకోసం దాన్ని ఉపయోగించుకునేంత పెద్దదాన్నవ్వలేదని బాధపడుతూ మరుసటి రోజు ఎదుర్కోబోతున్న జువాలజీ పరీక్ష కోసం పుస్తకాల్లో మనసును లగ్నం చేసుకుంది. గంటకోసారి ఒక్కొక్క పాఠమే ముగిస్తూ ఆ అబ్బాయి ఎలా చదువుతున్నాడో అనుకుంది. సాయంత్రం ఎండతో ఆకాశం ఎర్రబడిపోతుంటే నారాయణమూర్తి పిలుపు వినిపించింది.

"ఏమ్మా... బాగా రాసావా పరీక్ష?" ఆపిల్ పండ్లు అందిస్తూ కుశలమడిగాడు ఆయన. మామూలు రోజుల్లో ఇంట్లో మనుషులున్నారని కూడా గుర్తులేనట్లు ఉండే ఆయన, రాధికకు పెద్ద పరీక్షలంటే మాత్రం బోర్డర్ దగ్గర సైనికుడిలా అప్రమత్తంగా ఉంటాడు. 'ఏంటి మూర్తిగారూ.... అమ్మాయికి స్టేట్‌ర్యాంకు వచ్చిందటగా' అని కొలీగ్స్ పొగిడితే వినాలని కోరిక. **ఏ మనిషికయినా జీవితంలో ఆశయాలు మారిపోతాయి. యుక్తవయసులో తానేదో సాధించాలి అనుకునే మనిషి అవి జరగనప్పుడు తన పిల్లలు అంతకంటే ఎక్కువ సాధించాలి అనుకోవడం సహజం.**

"అమ్మాయికి పెట్టు" అంటూ పూర్ణిమ చేతికి తాను కొనుక్కొచ్చిన పండ్లు అందిస్తూ "ఎవరమ్మా ఆ అబ్బాయి... మీ క్లాసేనా? ఈవేళ యాక్సిడెంట్లో పాపం చచ్చిపోయింది" అలసటగా కుర్చీలో కూర్చున్నాడు నారాయణమూర్తి.

రాధిక చెవులు అదిరిపడ్డాయి. "ఎవరు నాన్నా?" వణికిన ఆమె గొంతును నారాయణమూర్తి గుర్తుపట్టాడు

"అయ్యో... నీకు తెలీదా? అనవసరంగా చెప్పానే" కణతలు నొక్కుకుని నొచ్చుకున్నాడు.

ఆయన చెప్పకపోతున్నా రాధికకు ఖచ్చితం అనిపించింది. పరీక్ష దగ్గర కనిపించనిది ప్రవీణే. అది అసాధారణమే. ఏదో జరగకపోతేకానీ అతను రాకుండా ఉండడు. ఆ యాక్సిడెంట్‌లాంటిదేదైనా... అతనికి తప్ప ఇంకెవ్వరికైనా ఫర్లేదు అనిపించింది. మనిషిలో ఎంత వద్దనుకున్నా స్వార్థం మరొకరి చెడును కోరుకుంటుంది. 'తన'వారు బాగుంటే చాలు కదా.

"బీసెంటు రోడ్ దగ్గర బస్సు దిగేటప్పుడు స్లిప్ అయ్యి ఒక స్టూడెంట్ చచ్చిపోయాడని పెద్ద గొడవ. మధ్యాహ్నం అంతా ట్రాఫిక్ జామ్. ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ వెళుతూ తొందరలో అతనే దూకుడుగా దూకాడని డ్రైవరు, కాదు డ్రైవరే రాష్ అని జనం, మిగతా స్టూడెంట్స్. మీ కాలేజ్ స్టూడెంటే అని విన్నా పేరు గుర్తులేదమ్మా" ఇక చెప్పేదేమీ లేదన్నట్లు తన గదిలోకి వెళుతూ

"ఏం రోజులో ఏంటో. నువ్వు అవంతా ఏం ఆలోచించకుండా చదువుకో. రేపు ఎగ్జామ్స్‌కు నేనే స్కూటర్‌లో డ్రాప్ చేస్తాను... బస్సులు స్ట్రైకో ఏంటో" గొణుక్కున్నాడు నారాయణమూర్తి.

అరచేతుల్లోంచి జీవం జారిపోయినట్లనిపించింది రాధిక. దేవుడా! చచ్చిపోయాడా? ప్రవీణ్ అయి ఉండడులే. ఇంకెవరో అబ్బాయి. గుర్తుచేసుకుని, ఒక స్నేహితురాలికి ఫోన్ చేసింది, ఆమె అన్నయ్యకయినా విషయం తెలిసుండదా?

"రాధీ ... నీకు తెలుసా.... పాపం ప్రవీణ్" స్నేహితురాలి మొదటి మాటలు వినగానే ఇంకేం వినపడలేదు రాధికకు. అతని ముఖమే పదేపదే గుర్తుకువచ్చింది. సోడాబుడ్డి కళ్ళజోళ్ళ వెనకనుండి అతని కళ్ళు తనతో ఏదో మాట్లాడాలి అని ఎంతగా చూసేవో?

చెమట తుడుచుకుంటూ నిద్రలేచింది. గదిలో ఏసీ మిషన్ ఉనికిని చాటుకుంటూ బుస్సుమంటోంది. మెదడులో ప్రవీణ్ ముఖం ఇరుక్కున్నట్లు తలంతా భారంగా అనిపించిందామెకు. అతను తనకేం అవుతాడో అతను తన చుట్టే మసలుతున్నప్పుడెప్పుడూ తెలియలేదు. చచ్చిపోయాక సరిగా తెలియలేదు. సంవత్సరాలైనా అప్పుడప్పుడూ గుర్తుకు వస్తుంటే అనిపిస్తుంది: అతనంటే చాలా ఇష్టపడ్డానా? చచ్చిపోకుండా ఉంటే ప్రేమించేదాన్నా?

అతని గురించి విన్న రాత్రి ఆమె ఎక్కువసేపు ఏడవలేదు. మహా అయితే కొన్ని నిముషాలు. అతను చనిపోయినందుకు దుఃఖం కంటే కోపం వచ్చింది. సృష్టిమీద. 'నేను బయాలజీ, జెనెటిక్స్‌లో ఎక్స్‌పర్ట్ అయ్యి అసలు ఎవ్వరూ చావకుండా ఏదైనా చెయ్యొచ్చేమో కనుక్కోవాలి. మనిషికి చావే ఉండకూడదు' అనే కసితో బయాలజీ పరీక్ష రాసింది. మెడిసన్‌లో చేరాక శవాలు కోసేప్పుడూ అదే ఆలోచించింది. తన కోపం అర్థరహితమనీ, పసితనపు అమాయకత్వమనీ ఆమె త్వరగానే తెలుసుకున్నా.. ఇప్పుడు అనిపిస్తుంది... ఇన్ని కనిపెడుతున్నారు.... చనిపోయిన వారిని వెనక్కు తీసుకొచ్చేలా ఏదైనా కనిపెట్టొచ్చుకదా అనిపిస్తుంది.

నిద్రపట్టక కంప్యూటర్ ముందు కూర్చుని తనలాంటి వెర్రి ఆశలు ఉండేవారు ఎక్కడెక్కడ ఏమేం రాసారో అని 'గూగుల్' చూసింది.

ప్రపంచంలో అమాయకులకేం కొదువ లేదు.

ఎంతటి మేధావిలో అయినా పసివాడి కోరికలు, అర్థరహితమైనవి ఉంటాయి. ఇంటర్‌నెట్‌లో పోగై ఉన్న ఆ అమాయకుల బ్లాగులు చదువుతుండగ కాలింగ్ బెల్ చప్పుడుతో జ్ఞాపకాల లోకం నుంచి బయటపడింది రాధిక.

"అదేంటి నువ్వు నిద్రపోలేదా?" తలుపు తీసిన ఆమెను చూసి ఆశ్చర్యపోతూ పలకరింపుగా నవ్వుతూ లోపలకు వచ్చాడు రాజు. అతని ముఖంలోని అలసటను గమనించి వెంటనే ఫ్రిజ్ వేపు నడిచింది. ఎంత వేళకానివేళ అయినా స్వీట్లు, కార్బొనేటెడ్ కూల్‌డ్రింకులు ఇస్తే కాదనలేడు అతను.

"స్నానం చేస్తావా ?" ట్రిపుల్ బెడ్రూం ఫ్లాట్లో తల్లీ తండ్రీ ఉన్న గది దూరమే అయినా గుసగుసల్లోనే మాట్లాడింది రాధిక.

"చెయ్యాలని ఉంది... కానీ" ఆమె అందిస్తున్న బాదుషాను కొరుకుతూ "అస్సలు ఓపిక లేదు. తెలుసా... ఒకే రోజు మూడు సిటీలు తిరిగాను. చెన్నై, ముంబై.... అండ్ నౌ హోం" కొత్త సాహసం చేసినట్లు మురిసిపోతూ షర్టు విప్పాడు.

"ఏంటంత బిజీ బిజీ?" అతని నడుము పక్కన పేరుకుంటున్న కొవ్వును గమనిస్తూ "కొంచెం ఎక్సర్ సైజ్ కూడా చేయాలి" అంది.

"ఇదిగో... నేను నీ పేషెంటు కాను. ఆ డాక్టరు చూపులు చూడక" అంటూ టవల్ కట్టుకున్నాడు.

అతని స్నానం కోసం గీజర్ ఆన చేసి నీళ్ళలో వేడిని వేళ్ళతో చూడగానే అంతసేపూ వేధించిన జ్ఞాపకాల బరువంతా దిగిపోయినట్లనిపించింది ఆమెకు.

"అనుకున్నదానికంటే ఇన్వెస్ట్‌మెంట్ ఎక్కువయ్యేట్లుంది. కనీసం ఇంకొక కోటిన్నర. అంతా ఆ రాంకుమార్ వల్ల. అతనికి ఓన్‌గా వెంచర్ చేసేంత ధైర్యం లేదు, మధ్యలో డ్రాప్ అవుతాడు అని అప్పటికీ నేను అంటూనే ఉన్నా.... సంపత్ మరీ మరీ రెకమెండ్ చేసాడు... ఇప్పుడు మేమిద్దరం భరించుకోవాలి ఆ డెఫిసిట్. ఇట్లాంటప్పుడు ఏదైనా లీగల్ హాసిల్స్ వస్తే లోన్లు కూడా దొరకవు..." తనకే చెప్పుకుంటున్నాడో ఆమెకే చెబుతున్నాడో కానీ, రాజు మాటల్లో విషయం ఆమెకు అంతగా అర్థం కాలేదు.

మొత్తానికి డబ్బుదే కదా సమస్య తీరనిదేమీ కాదుకదా అనిపించింది.

"ఇంక వెలుపలకు రా.. నేను స్నానం చెయ్యాలి అనుకుంటుంటే నువ్వు నీళ్ళతో ఆడుకుంటున్నావా. వెళ్ళి నిద్రపో. పొద్దున సర్జరీలేం లేవా?" అంటూ ఆమెను లాగేస్తూ షవర్‌లోకి దూరాడు రాజు.

"రోజూ సర్జరీ అంటావేంటి...." ఆమె ఇంకా ఏదో అనబోయి షవర్ చప్పుడులో అతనికి వినబడవు అని ఊరుకుంది. నిద్రపోదామని ప్రయత్నించింది. గడియారంలో మూడున్నరకు జారిపోతోంది కాలం. రేపు మళ్ళీ చె కలుస్తాడా? వివేక్ రిపోర్ట్‌లు ఏం వస్తాయో? ఆ వేపున ఆలోచించకూడదు అనుకుంది. చావును తరిమి కొట్టడమే కాకుండా మూడ్ మారిపోయేందుకు కూడా ఏదయినా కనిపెట్టాలి మనుష్యులు.

"ఏంటీ ఇంకా నిద్రపోలేదా?" తల తుడుచుకుంటూ వచ్చాడు రాజు. అసలే తెలుపు మనిషి. ఒంటిమీద ఎక్కువ వెంట్రుకలు. నీళ్ళలో తడిసిపోయిన టెడ్డీబేర్ బొమ్మలా ఉన్న అతడిని చూసి ఫక్కున నవ్వింది.

"ఏంటి నవ్వుతున్నావ్? నా మ్యాన్లీనెస్ చూసి కుళ్ళుకుంటున్నావా?"

"వాట్?" అతని మాటకు అర్థం ఏమీటో తెలియలేదు ఆమెకు.

అతనికీ అర్థమయ్యింది దానికి అర్థం లేదని.

"రాధీ... ఇఫ్ యు డోంట్ మైండ్" మెల్లగా పరుపు మీద ఆమె వేపు వాలాడు. అతని శరీరం నుంచి ఉత్తేజం కోరుతున్న అలసట గుబాళించింది. అతని చేతులకు అనువుగా సర్దుకుంది రాధిక.

"ఇక్కడకు వచ్చాక డిఫరెంట్‌గా కనిపిస్తున్నావ్ నువ్వు" చెవిపక్కన మాట్లాడేప్పుడు కూడా గుసగుసలాడటం తెలియదు అతనికి. ఏదో కాన్ఫరెన్స్‌లో ఉన్నట్లు స్పష్టంగా చెబుతాడు. అతని మోచేతుల మీది వెంట్రుకలను స్పృశిస్తూ, వెంటాడే ఆలోచనలను దూరం చేసుకుంది రాధిక.

ఆమెతో ఉంటూ మధ్య మధ్య శారీరిక సుఖంలో కళ్ళు మూసుకున్నాడు రాజు. చాలా మంది కనిపించారు అతనికి. ఎయిర్ హోస్టెస్. సినిమా హీరోయిన్. బిజినెస్ అసోసియేట్ వాళ్ళ భార్య. మధ్య మధ్యలో రాధిక కాస్తంత సుఖం. ఆమెకూడా మధ్య మధ్యలో కళ్ళు మూసుకుంది. ఎవ్వరూ కనిపించలేదు. సుఖంలో శూన్యం. బయాలజీ ప్రకారం జరగాల్సింది జరిగింది.

"ఓ..అయామ్ సారీ. ప్రొటెక్షన్ ఏమీ తీసుకోలేదు" అలిసిపోయి పక్కన వాలాడు రాజు.

వేల వేల మగకణాలు తనలోని ఆడతనం కోసం కొట్టుకుంటున్నట్లనిపించింది రాధికకు. "ఇట్స్ ఓకే" తలగడకు ఒరుసుకోకుండా జుత్తు సర్దుకుంది.

"అది కాదు. ఇఫ్ సంథింగ్ హ్యాపెన్స్...." ఆమె కళ్ళలోకి చూసీ చూడక తడబడ్డాడు రాజు "పిల్లలు ప్రాబ్లం కాదు. బట్ ఆర్యూ రెడీ టు ఫేస్ ఇట్ అగైన్" సానుభూతిగా ఆమె భుజం పై చేయివేసాడు.

"స్టాపిట్ రాజూ. మాటిమాటికీ గుర్తుచెయ్యకు" కడుపులోపల మెరమెరలాడుతున్న భయాన్ని నొక్కుకుంది.

"అరే నేనేమన్నాను. ట్రయింగ్ టు బీ హెల్ప్‌ఫుల్" ఆమె భుజం మీద చేయి వేసి తనవేపు తిప్పుకున్నాడు రాజు. నాలుగు కళ్ళ మధ్య చూపులు నలిగాయి.

"ప్లీజ్ రాజూ... యు కెన్ నెవర్ అండర్ స్టాండ్ లూజింగ్ ఎ ఛైల్డ్ గ్రోయింగ్ ఇన్సైడ్ ఈజ్ సో. సో..." ఇక చెప్పలేక "అవన్నీ ఎప్పుడూ గుర్తు చేయకు" అంది రాధిక.

"రియల్లీ సారీ. ఐడింట్ మీన్ టు హర్ట్. బట్... ఏం జరిగినా 'ఫేస్' చెయ్యడానికి మనం సిద్ధంగా ఉండాలి కదా. రిస్క్ ఎసెస్‌మెంట్ తప్పు కాదు కదా" అతని మాటలు ఇక వినకూడదన్నట్లు ధ్యాస మరిలించేసింది రాధిక. కంప్యూటర్ ప్రోగ్రామర్లతో ఎక్కువసేపు గడిపితే మనిషి ఇలానే అయిపోతాడేమో. రిస్క్ అసెస్‌మెంట్స్. ఇన్‌ష్యూరిటీలు... తెగే మృదువైన మనసును అర్థం చేసుకుంటాయా?

రాజు ఇంకా ఏమిటో చెప్పాడు కొంత సేపు. యాంత్రికంగా ఊ కొట్టింది రాధిక. మళ్ళీ కావాలి.. మూడ్ మార్చే టాబ్లెట్.

పోనీ కాసేపు అతనితో మళ్ళీ సుఖం పొందితే?

తనంటే తనకే చిరాకు వేసింది రాధికకు. ఏమవుతోంది తన శరీరం? మనసు, ప్రేమ ఏమీ లేకుండా 'మేటింగ్'? జంతువు. మనిషి జంతువు.

✡ ✡ ✡

"మేటింగ్, రీ ప్రొడక్షన్ అంతా జువాలజీ కదా. అందులో సైకాలజీ ఏం ఉంటుంది?" సంవత్సరాల క్రితం చె వాదన, అందుకు అతడిని తాను తిట్టడం ఆమెకు గుర్తుకు వచ్చింది. ఎంత తేలికగా అనేసాడు, అంతటి మాట? వేళ్ళ మధ్య నశించిపోతున్న ఒక సిగిరెట్ పట్టుకుని పెద్ద భావకుడిలా సముద్రాన్ని చూస్తూ, ఇలాంటి మనసులేని మాట? అలల వెనుకకు పడిపోతున్న సూర్యుడి వెలుగులో అతని దవడలు సహారా ఎడారికి 'సాంపిల్స్'ల అనిపించాయి ఆమెకు. అరచేతుల్లో స్పృశించాలనే కోరికను అణుచుకుని

"మరి మనిషికెందుకు ఈ కట్టుబాట్లు? ఒక మగాడు ఒకే ఆడదానితో ఎందుకు ఉంటున్నాడు?" అతను గమనించకుండా ఇసుకలో కాస్తంత అతనివేపు జరిగింది రాధిక

"అవునా అలా ఉంటున్నారా మగాళ్ళు... ఎప్పటి నుంచి?" అతని చూపులో వెక్కిరింత ఆమెకు అర్థమయ్యింది.

"అఫ్‌కోర్స్. మీ మగాళ్ళకు అంత సిన్సియారిటీ ఎక్కడ ఉంటుందిలే? ఒకరికే కమిటెడ్ ఉండటం ఆడవాళ్ళకే తెలుసు"

"మీ ఆడవాళ్ళకు కదూ" మీ...ను సాగదీస్తూ నవ్వాడు చైతన్య. కోపం తన్నుకు వచ్చింది ఆమెకు.

"అవును 'మా' ఆడవాళ్ళే. ఏం అలా అనకూడదా?"

"లక్షణంగా అనొచ్చు. మహిళాలోకానికి లీడర్ కదా నువ్వు" తమవేపు గుడ్లప్పగించి చూస్తున్న టీనేజ్ పిల్లల వేపు తీక్షణంగా ఓ చూపు విసిరి బెదిరించాడు చైతన్య. అతని సంరక్షణ నచ్చి ఇసుకలో ఇంకొక్క రేణువంత దగ్గరగా జరిగింది ఆమె.

"అక్కడ దూరంగా ఉన్నారు చూడూ" సముద్రం వేపు వీపులు తిప్పుకుని మొక్కజొన్న కండెలు అమ్ముకుంటున్న ఒక జంటను చూపించాడు చైతన్య. "వాళ్ళు భార్యాభర్తలే అంటావా?" చనువుగా రాధిక భుజం మీద చేయివేస్తూ అడిగాడు.

కళ్ళను టెలిస్కోపులా సాగదీసుకుని గమనించింది రాధిక. ఇసుకపోత పోసిన శిల్పంలా ఉంది ఆమె... కరుకుగా, వేడిగా. ముఖమమతా గంటుపెట్టుకుని జొన్న పొత్తులను సరిగా వొలవనందుకేమో అతడిని తిడుతోంది. అతనేమో నవ్వుతూనే బీడీకాలుస్తూ సరేసరేనంటున్నట్లు తలవూపుతున్నాడు. హఠాత్తుగా విసుగువచ్చినట్లు ఆమె అతడి చేతిలోంచి కంకీలు లాగేసుకుని, వాటితోపాటు అతని

పెదాల మధ్య నుంచి బీడీ కూడా లాగేసుకుని పారేయబోతూ ఒకసారి చుట్టూచూసింది. ఎవరూ చూడట్లేదని నిర్ధారించుకుని, సముద్రం వేపు తిరిగింది. ఆమె ముఖం పక్కనుంచి దట్టమైన పొగ మేఘం జారింది. ఆమెను బ్రతిమిలాడుతున్నట్లు అతను ఆమె భుజం మీద చేయివేసాడు... ఒదిలించుకుంటున్నట్లే నటిస్తోంది కానీ ఆమె అతనికి దూరం జరగడంలేదు.

"ఖచ్చితంగా కపుల్ వీళ్ళు" బుగ్గలు వేడెక్కుతున్నట్లు అనిపించడంతో అరచేతులతో కప్పుకుంది రాధిక.

ఆమె సమాధానం తనకు తెలుసన్నట్లు నవ్వాడు చైతన్య. "ఏంటి కాదా?" కళ్ళు విప్పార్చుకుంది రాధిక.

గుండెలో అలలు రేగినట్లు పులకించాడు అతను.

"అదిగో అసలే ఈవినింగ్ చాలా రొమాంటిక్‌గా ఉంది. నువ్వు ఇలా ప్రొవొకేటివ్‌గా చూసావంటే నా బ్రహ్మచర్యం భగ్గుమంటుంది" ఆమె కళ్ళల్లోకే మాటలు వదిలాడు. రెప్పలు వాల్చేసి ఇసుకలో వేళ్ళు కదిలించింది ఆమె

"ఇంతకీ చెప్పు... వాళ్ళు హజ్బెండ్ అండ్ వైఫ్ కాదా?" ఇంకా సముద్రం వేపే చూస్తున్న ఆ మొక్కజొన్న అమ్ముకునేవారివంక తలతిప్పింది రాధిక

"అవుననుకో... కాకపోతే ఆమె ఎవరికో వైఫ్. అతను వేరేవాళ్ళ హజ్బెండ్"

"వాట్? నిజ్జంగా?"

"ఒట్టు" ఆమె తలమీద మెల్లగా చేయి నొక్కాడు అతను. అతని స్పర్శ నచ్చుతున్నా తొలగించుకుంది ఆమె

"నీకెలా తెలుసు?"

"అబ్బా ... లీవిట్... ఇంకొకళ్ళ పర్సనల్ విషయాలెందుకు?"

"ఆ బుద్ధి అసలు వాళ్ళను చూపించి కొశ్చిన్స్ వేయకముందు ఉండాలి. చెప్పు... నీకెలా తెలుసు"

"చూడు చూడు నీ క్యూరియాసిటీ... అంతా ఆడబుద్ధి"

"ఇంకోసారి అలా అన్నావంటే వెళ్ళిపోతా"

వాళ్ళిద్దరి నీడలూ కలిసేపోతున్నాయి.

"మీ హాస్పిటల్ లో ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్‌లో శవాలు కోసే సైదులు ఉన్నాడు కదా... అతని వైఫ్ ఆమె"

చైతన్యను తాను చూసిన మొదటి రోజు గుర్తుచేసుకుంది రాధిక. వాళ్ళ కుటుంబ విషయాలన్నీ ఇతనికెలా తెలుసో? ఆ మాటే అడిగింది.

"అబ్బా... ఒకసారి ఆ సైదులుకు ఏదో యాక్సిడెంట్ అయితే రేర్ బ్లడ్ గ్రూప్ కాబట్టి దొరకలేదు... నాకు తెలిస్తే నేను వెళ్ళి..."

"ఏ గ్రూప్"

"ఏబీ నెగిటివ్"

"అయ్యో... అయితే కష్టం కదా.... నీకెప్పుడైనా అవసరం అయితే..."

"ఛల్ హట్! ఇంకొకరి రక్తంతో నాకేంటి అవసరం"

"అలా అంటే ఎలా సార్. మనిషికి మనిషితో అవసరం రాకుండా ఉంటుందా. అసలే మీరు చే గువెరా వారసులు"

"వారసులేంటి? అభిమాని. ఫాలోయర్"

"ఏదో ఒకటి. రక్తం చిందించే ఉద్యమాలు ఏమేం చేస్తావో. అప్పుడు మళ్ళీ నీకు బ్లడ్ ఎక్కించాలంటే నాకే కదా తిప్పలు"

"మరి అయితే ఆ తిప్పలేవో నువ్వే పడి... ఏ ఆర్టిఫిషియల్ బ్లడ్‌లాంటి వస్తువో కనుక్కో"

"వద్దుబాబోయ్. ఇప్పటికే నేను కనుక్కోవాలనుకుంటున్న విషయాలు ఎక్కువయిపోయాయి. ఏయ్ ఏయ్ టాపిక్ మార్చొద్దు... ఇంతకీ ఆమె వేరేవాళ్ళ వైఫ్ అని నీకు తెలుసు... సరే. మరి అతని గురించి ఎలా..."

"తెలుసుకోలేకపోతే ఉండలేవా? ఆడబుద్ధి. ఆగాగు... అంత కోపంగా చూడకు. చూడు సూర్యుడు కూడా భయపడి సముద్రం కిందకు వెళ్ళిపోతున్నాడు"

ఉక్రోషంతో అతని భుజం గిల్లింది రాధిక. చీమకుట్టినట్లు తుడిచేసుకున్నాడు చైతన్య.

"అతను అదిగో ఆ పక్కనే ఇంకో బండి ఉందే.. దానిమీదే చేపలు కాల్చే ఆమె ఒకతుంటుంది. ఆమె అతని వైఫ్" అటువేపు చూస్తున్న రాధికకు కప్పేసిన ఒక బండి కనిపించింది కానీ అక్కడే చేపలూ లేవు, కాల్చి అమ్మే ఆవిడా లేదు. చైతన్యవేపు అనుమానంగా చూసింది.

"ఆమె రాలేదు ఏమీ అని అడగకు. నాకూ తెలీదు. బహుశా పెళ్ళాం రాలేదు కాబట్టే అతను ఈవిడితో రెచ్చిపోతున్నాడేమో" ముసురుకుంటున్న చీకటితో పుట్టుకొస్తున్న చిన్న చిన్న పురుగులను విదుల్చుకుంటూ అన్నాడు చైతన్య.

"తప్పు కదా" ముచ్చటగా, భావకులలా సముద్రం వేపు చూస్తూ ఉన్న ఆ జంటను చూస్తూ అంది రాధిక.

"మనము కూడా హజ్బెండ్ అండ్ వైఫ్ కాదు కదా మరి... ఇక్కడ" ఆమె భుజం మీద చేయిని ఒత్తిగిస్తూ చెవుల్లో గుసగుసలాడాడు చైతన్య.

'కానీ అవుతాం కదా. ఫ్యూఇయిర్స్‌లో" నమ్మకంగా అతని కళ్ళలోకి చూసింది. శరీరమంతా కరుకుగానే ఉన్నా అతని కళ్ళు మాత్రం పసిగానే ఉంటాయి. "వాళ్ళూ అవుతారేమో... మేబీ రీమ్యారేజ్ చేసుకుంటారేమో.... మనకేం తెలుసు" ఆమె చెవుల మీద వాలిపోతున్న కొన్ని వెంట్రుకులను మెల్లగా జరుపుతూ అన్నాడు

"డైవోర్స్ ఇస్తారా ఆల్రెడీ ఉన్న స్పౌజెస్‌కు?"

"ఇదిగో నన్ను యక్షప్రశ్నలు వెయ్యకు. వాళ్ళకేమైనా రిజెస్టర్డ్ మ్యారేజెస్, కోర్టులూ, ఆస్తుల గొడవలూ ఉంటాయా? ఉంటేగింటే పిల్లలుంటారేమోగానీ, అయినా పేద్ద బయాలజీ అంటే పడి ఛస్తావ్. ఒక మేల్ ఫీమేల్ కలిసి ఉండాలంటే ఇవన్నీ అడ్డమా? అసలు అది చెప్పడానికి వాళ్ళను నీకు చూపించి ఈ మంచి ఈవినింగ్‌ను నా పాలిట ఎగ్జాం టైం చేసుకున్నాను"

"అంటే.. అంతా బయాలజీనే కానీ సైకాలజీ ఏం లేదు అంటావ్?" కోపంగా అతన్నుంచి కాస్త జరిగింది. "అలా అయితే నీకు నేనెందుకు? ఇక్కడ చాలా మంది 'ఫీమేల్స్' ఉన్నారు కదా"

"ఎగ్జాట్లీ! అదే నాకూ అర్థం కావట్లేదు. వాళ్ళందరితో ఉండకుండా నీతోనే ఎందుకు ఉన్నానా అనేదే పజిల్‌గా ఉంది. పోనీ వాళ్ళతో ట్రై చేద్దామా అంటే నన్ను సముద్రంలో తోసేస్తారేమో అని భయం"

"ట్రై చేసి చూడు. వాళ్ళు కాదు నేనే నిన్ను తోసేస్తా" ఈసారి కోపంగా అతనికి దగ్గరైంది.

"హబ్బా" అతను మత్తుగా మూలిగాడు

"ఏమయింది?"

"నీకు అస్సలు ఏమీ తెలియదు. ఇక్కడ ఇలాంటి వయసులో ఉన్న మగాడు ఉన్నాడు. పైగా అతనికి రొమాంటిక్ బుద్దులు ఎక్కువ. అలాంటివాడికి దగ్గరగా జరిగేప్పుడు కాస్త కేర్‌ఫుల్‌గా నీ శరీరంలోంచి సాఫ్ట్ సాఫ్ట్ అందాలు కొన్ని తగలకుండా జరుగుదాం అనే సెన్స్ లేదు కదా" అన్నాడు ముఖమంతా చిలిపిగా నవ్వు పులిమేసుకుని.

ఎద ఝల్లుమంది రాధికకు. ఛాతీ చాటునుండి అతని గుండె తన గుండె తలుపు తడుతున్నంత దగ్గరగా వినిపించింది. మధ్యలో ముడుచుకుపోయిన కాసిని గుడ్డముక్కలు ఏం అడ్డుకుంటాయి? చున్నీ సర్దుకుంటూ దూరం జరగబోయింది.

"రాధీ... ఇఫ్ యూ డోంట్ మైండ్" హోరుమంటున్న అలలలోంచి అతని గుసగుసలకోసం చెవులు రిక్కించింది రాధిక.

"ఏదో ఒకటి తొందరగా ఆలోచించుకో..." అతను తనకు దగ్గరవుతుండడం గమనించి బిగుసుకుపోయింది. ఆమె కాలివేళ్ళ మధ్య ఇసుక ఇరుక్కుపోయి జారిపోజూస్తోంది.

"పెళ్ళి గిళ్ళి ఏం చేసుకైనా సరే... వి విల్ గో టు సం బ్యూటిఫుల్ ప్లేస్. ఏదైనా దీవి వెదుకుదాం. అక్కడ సముద్రం దగ్గర ఇల్లా కాదు. న్యూడ్గా..." ఆమె పులకరింతను అదుపు చేసుకుంటున్నా వీపులో చిన్నపాటి కంపనలు మొదలయ్యాయి. అతని చేతిలోని ఆరాటంలోని వణుకులో అవి కలిసిపోయాయి.

"వెన్నెల్లో... సముద్రం ఒడ్డున.. వి విల్ మేక్ లవ్.. ఏం ఒద్దా" ఇక వినలేనట్లు అతడి ఛాతీమీద చేతులతో కాస్త నెట్టింది.

"అబద్ధాలాడకు. నీకూ తొందరగానే ఉంది కదా" అతని అల్లరి సముద్రంలా ఎగసిపడింది.

✡ ✡ ✡

"ఆc రాజూ చెప్పడం మరచిపోయానూ.. " చిక్కటి పరదాలను ఛేదించుకుని పొద్దుటి ఎండ నేలమీద పడిపోతోంది.

"ఎవరూ?" దుప్పట్లో రాని నిద్రను, పోని అలసటనూ పోట్లాడుతూ అడిగాడు రాజు

అద్దంలోంచి అతనివంక చూసింది రాధిక. చైతన్య అనే పేరును అతను మరచిపోయే అవకాశమే లేదే? ఒక్కోసారి తెలిసీ తెలియనట్లు, గుర్తుకు వచ్చినా రానట్లు నటిస్తారు చాలామంది. రాజు పద్ధతి అదేనేమో అని అతడి ముఖాన్ని స్పష్టంగా చూసేందుకు వెనుదిరిగింది. అతని అయోమయం నిజమే అనిపించింది.

"అదే. 'నా ఫ్రెండ్' చై...త.... న్య" ఎంత ఎదిగిపోయావు? అతడిని ఫ్రెండ్ అని ఎంత సులభంగా అనేసావు? ఘోష పెడుతున్న అంతరాత్మను గొంతులో పిసికేస్తూ చెప్పింది రాధిక

"ఓహ్" రాజుకు నిద్రమత్తు వదిలిపోయింది

"ఆ చైతన్యేగా?" అతని కళ్ళు ఆమెలోకి దూసుకెళ్ళాయి

"అవును" ఆమె చూపులు తట్టుకున్నాయి

ఇక చూసుకోలేక ఇద్దరూ చెరో వేపు తిరిగేసారు. అతడు సిగిరెట్ పెట్టె అందుకున్నాడు. ఆమె హ్యాండ్ బ్యాగ్లో అబద్ధపు వెతుకులాట మొదలెట్టింది. ఇంకా ఏం చెబుతావో చెప్పమన్నట్లు అతను భారంగా నిట్టూర్చాడు.

"వాళ్ళ అబ్బాయిని తీసుకు వచ్చాడు" హ్యాండ్ బాగ్ జిప్‌ను వేసి, మళ్ళీ తెరిచింది రాధిక

"ఓ! అతని పెళ్ళెప్పుడయ్యింది?" సిగిరెట్ పొగలో అతని వెటకారం ఎగిరిపోయింది

"ఏమోలే. అన్నేళ్ళు అమెరికాలో ఉన్నాం కదా. మనకు ఇక్కడ ఏమీ తెలీట్లేదు" అతనే సమాధానం చెప్పుకున్నాడు

"ఆ అబ్బాయికి బ్రైన్‌లో ఏదో ప్రాబ్లం అనిపిస్తోంది" వివేకానందను గుర్తుకు చేసుకోగానే ఆమె బెదిరింది.

"అయ్యో! ఎనీథింగ్ సీరియస్?" నిజంగానే బాధపడ్డాను రాజు

అతనివేపు ఇప్పుడు మనస్ఫూర్తిగా చూసింది ఆమె.

"ఈ వేళ రిపోర్ట్స్ వస్తాయి. క్యాన్సర్ ఏమో అని డౌట్గా..." ఇక చెప్పలేకపోయింది.

"సీరియస్ కాదు కదా.. ఐమీన్... బ్రతుకుతాడుకదా" మళ్ళీ సిగిరెట్ పీల్చేసాడు రాజు. అతని వేపు చురచురా చూసింది. లాప్‌టాప్ అందుకుంటున్నాడు అతను. కంప్యూటర్ మాటలే కానీ భావాలు ఉంటాయా? బై చెప్పి బయలుదేరింది. అతను అలా అనకుండా ఉండాల్సింది. ఎంతైనా పాపం ఒక ప్రాణం కదా. ఏమో! చైతన్య వాళ్ళ అబ్బాయి కాబట్టి అలా అన్నాడా? లేదు లేదు... ఎవరి

గురించైనా అతను అంతే. 'రెండు పిల్లలు' అని వస్తువులకూ మనుష్యులకూ తేడా తెలీని రకం. కానీ ... కనీసం ఈ అబ్బాయి గురించి అయినా... మంచిగా అనొచ్చు కదా. ఎంతైనా చైతన్య అబ్బాయి కదా. ధ్యాసలోనే డ్రైవ్ చేస్తూ హాస్పిటల్‌కు వెళ్ళగానే ల్యాబ్‌కు డయల్ చేసింది రాధిక. వివేకానంద రిపోర్ట్స్ బావుంటే చాలు!

అట్టే ఏ దేవుడినీ నమ్మకపోయినా చాలామందిని మొక్కుకుంది కొన్ని ఘడియల్లోనే. ప్రవీణ్ కోసం ఫోన్ చేసిన క్షణం అచ్చంగా ఇలానే అనిపించిందేమో. కొన్ని సార్లు వినబోయే మాట ముందే తెలిసిపోతుంది. ఆమె అనుమానం తప్పు కాలేదు. వివేకానంద పసి మెదడులోని రక్తనాళాల అంచున కేన్సర్ పాకుతోంది. రిపోర్ట్‌లోని పేరును నిర్వేదంగా చూసింది రాధిక 'జువెనైల్ అన్జియోమా'

అందులోనూ ఒక అరుదైన రకం. అతి త్వరగా తాను ఆక్రమిస్తున్న మనిషిని ఏ స్థితికైనా నెట్టేయగల దుర్మార్గం ఉన్న చీడ.

✡ ✡ ✡

# 5

**"అయితే సర్జరీ** తప్పదా?" నిద్రలేని కళ్ళలోంచి ఉరకబోతున్న నీటి ఊటను నొక్కేసుకుంటూ అడిగాడు చైతన్య.

అప్పాయింటుమెంటు సమయానికి ఖచ్చితంగా వివేకానందను వెంటబెట్టుకుని వచ్చిన చైతన్యకు ఒక డాక్టరుగా తాను చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెప్పింది రాధిక. నిజం చెప్పేంత ధైర్యం తనకు వస్తుందని ఆ నిముషం వచ్చేదాకా ఆమెకే తెలియలేదు.

"ఆంటీ... నేను చూడొచ్చా" తన ఎమ్ ఆర్ ఐ స్కాన్ ఫిల్మ్‌ను లేత చేతి వేళ్ళతో తడుముకుంటూ అడిగాడు వివేకానంద. ఆ స్కాన్ రిపోర్ట్ అతనిది కాక ఇంకెవరిదైనా అయి ఉంటే ఎంతో బావుణ్ణని స్వార్థంగా కోరుకుంది రాధిక. మనిషి కోరుకున్నదల్లా జరిగిపోతే సృష్టి గొప్ప ఏముందీ? ముఖానికి నవ్వు పూసుకుని అతనికి స్కాన్ ఫిల్మ్‌ను అందించింది. తన మెదడు బొమ్మలను విస్తుబోతూ చూసాడతను.

"నానా... నానా... మొన్న ఇక్కడంతా ఫోటోలు తీసారు అవే కదా" ఛాతీ మీద ఫిల్మ్‌ను ఉంచుకుంటూ చైతన్యను అడిగాడు వాడూ. ఒత్తు లేకుండా నానా అనే వాడీ పిలుపు ఆమెకు చిత్రంగా ముద్దుగా అనిపించింది. చైతన్యకు మాటలు కరువై వాడిని అపురూపంగా తడుముకుంటూ తలఊపాడు.

"అవి అక్కడివి కాదు.... ఇదిగో... నీ తలలో బొమ్మలు... నువ్వు ఆ మిషన్‌లో ఇలా పడుకుని వెళ్ళి ఉంటావు కదా" హెడ్ స్కానింగ్‌ను వాడికి గుర్తుచేసింది రాధిక. తన తలలోంచి ఇన్ని బొమ్మలు ఎలా వచ్చాయో వాడికి అర్థం కాక, జుత్తులోకి వేళ్ళతో తడుముకుంటూ ఫిల్మ్ వంక మళ్ళీ మళ్ళీ చూసాడు.

"సర్జరీతో నయమైపోతుందా" చైతన్య గొంతులో అప్పుడే పుడుతున్న భయాన్ని రాధిక గమనించింది. వివేకానంద రిపోర్ట్‌లు చూసినప్పటినుంచీ ఆమెలో కూడా ఎన్నో ప్రశ్నలు. విధి విపరీతాల గమనాన్ని ఎవరైనా ఖచ్చితంగా ఎలా ఊహించగలరు?

"మోస్ట్లీ" నిజం చెప్పలేక, అబద్ధమాడలేక ఊగిసలాడింది రాధిక.

"అంటే?" అతను రెట్టించాడు.

రిపోర్ట్‌లను అతనికి చూపుతూ "చిన్న పిల్లల బ్రైన్‌లో వచ్చే చాలా క్యాన్సర్లకంటే ఈ టైప్ అంత డేంజరస్ కాదు. సర్జరీలో సింపుల్‌గా రిమూవ్ చేయొచ్చు. కాకపోతే... ఆ క్యాన్సర్ స్టేజ్, గ్రోత్... ఇంకెక్కడైనా ఏదైనా ప్రాబ్లం ఉందా అన్నీ చూసుకుంటే కానీ ఏ విషయమూ ఖచ్చితంగా చెప్పలేము. ఎవ్విరీ కేస్ ఈజ్ డిఫరెంట్ కదా"

"హి ఈజ్ నాట్ ఎ కేస్. మై సన్" గభాలున కోప్పడ్డాడు చైతన్య.

చప్పున తన తప్పు గ్రహించింది రాధిక. వివేకానందను దగ్గరకు తీసుకుంటూ క్షమాపణకోరబోయింది ఆమె.

"అయాం సారీ" చైతన్యే అనడంతో ఆశ్చర్యపోయింది.

"ఏ డాక్టర్ అయినా అలానే అంటారు కదా. నువ్వు కాబట్టి కోపాన్ని దాచుకోలేకపోయాను"

రాధికకు చాలా సంతోషమైంది. తమ మధ్య ఆత్మీయత ఏ మాత్రం తగ్గలేదు అని స్ఫురించింది ఇద్దరికీ.

"సర్జరీ నువ్వే చేస్తావా?" సందేహంగా అడిగాడు అతను.

ఏం చెప్పాలో తెలియలేదు ఆమెకు. తాను కాబట్టేగా ఇలా అడగగలుగుతున్నాడు?

"ఓ సారీ. అసలు సర్జన్ కాబట్టే కదా కన్సల్టెన్సీకు పంపారు. యూ ఎస్ లో చాలా సర్జరీలు చేసావా....?"

తన విజయవంతమైన ప్రొఫెషనల్ లైఫ్ గురించి తానే చెప్పుకోలేక ఇబ్బంది పడింది.

"అయామ్ హ్యాపీ" వివేకానందను ఆమె చేతుల్లో గమనిస్తూ అన్నాడు చైతన్య.

"నిన్ను ఎలా చూడాలనుకున్నానో అలానే చూస్తున్నాను" అతనిలో ఏదో గర్వం.

"రాధిక అనే అమ్మాయి నాకు తెలుసు అని చెప్పుకునేందుకు నేను ప్రౌడ్‌గా ఫీలయ్యేంత పే....ద్ద డాక్టర్ అవుతావు" తాను ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్‌కు వెళుతున్నప్పుడు పెన్నులు, పెన్సిళ్ళు బహుమతిగా ఇచ్చి పూజారిలా ఫోజు కొడుతూ ఆశీర్వదిస్తున్నట్లు పలికిన చే గుర్తుకు వచ్చాడు ఆమెకు. సంతృప్తిగా అనిపించింది. ఇంకా చాలా మాట్లాడాలి అనిపిస్తున్నా వివేకానంద భవిషత్తు ప్రశ్న ముల్లులా గుచ్చుకుంది ఇద్దరికీ. ***మనసు ఒక శాడిస్టు. కష్టకాలాల్లోనే తీపి జ్ఞాపకాలు గుర్తుకు తీసుకొచ్చి ఇబ్బంది పెడుతుంది.***

"చే ఏమీ అనుకోనంటే..." వివేకానందకు తన పెన్నూ పేపర్ ఇచ్చి అతడిని గీతల ప్రపంచంలో ముంచేస్తూ నసిగింది రాధిక: "వీవాకు ఇంకా చాలా టెస్టులు చెయ్యాలి. ట్యూమర్ టైప్ కన్‌ఫర్మ్ అయ్యాక ముందుగా కీమోథెరపీ సెషన్స్ ఇవ్వాలి, తర్వాత సర్జరీ.... ఒక నెలరోజులు ఖచ్చితంగా పడుతుంది. ఇక్కడే అడ్మిట్ చెయ్యాలి" చైతన్య అటెంటివ్‌గా వింటున్నాడని చూసుకుని కొనసాగించింది:

"తన మదర్ కూడా ఉంటే..." మాట ముగుస్తుండగానే చైతన్య ముఖకళవళికలు మసకబారిపోయాయి. వివేకానంద ఈ మాట ఎక్కడ విన్నాడో అన్నట్లు బెదురుగా అటు చూసాడు. పేపరు మీద వాలిపోయి గీసుకుంటున్న వాడిని చూసుకుని, గొంతు తగ్గించి "ప్లీజ్... తన ముందు ఇవన్నీ ఒద్దు. ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ ఎవ్విరిథింగ్. మీకు సర్జరీకు ఏమైనా ఫార్మాలిటీస్ కోసం సిగ్నేచర్స్ కావాలంటే కూడా నేను ఉన్నాను కదా..." అన్నాడు ఇక వేరే మాటకు అవకాశం లేనట్లు.

అతని మొండితనం ఆమెకు తెలియనిది కాదు. చెప్పాలనుకున్నది చెప్పకుండా ఉండలేడు, చెప్పకూడదనుకున్న దానిగురించి పెదవి పెగల్చడు. కానీ మొండితనంలో ఆమె అతనికి ఏ మాత్రం తీసిపోదు. చకచకా ఒక కాగితం మీద తన సెల్ నెంబరు రాసి అందించింది.

"మిగతా టెస్టుల కోసం అయితే రేపు కన్సల్ట్ చెయ్యొచ్చు.. అప్పుడయినా చెప్పలేనివి ఇంకేవైనా చెప్పాలంటే... కాల్ చెయ్యొచ్చు...."

ఫోన్ నెంబర్ల అంకెల మధ్య ఆమె ఎదురుచూపు అతడి సందిగ్ధం పోరాడుకున్నాయి.

✡ ✡ ✡

"తను రాదు"

"..."

"హలో.... హలో..."

"ఆ యస్... వింటున్నాను.... ఎందుకో ఏమిటో పూర్తిగా చెబుతావేమోనని"

"తనకు ఇష్టం లేదు"

"........."

"అదే.. తనకు ఏదీ ఇష్టం లేదు. నాతో రిలేషన్ షిప్. నేను..."

"మరి వీవా...."

"వాడు అంటే కూడా... తనకు... ఇష్టం లేదు... తను రాదు"

రాధికకు మనసంతా ఏదో వికారంగా తోచింది. బిడ్డ అంటే ఇష్టం లేని తల్లి ఉంటుందా? ఏం మాట్లాడటానికి ఆమె మెదడు పనిచెయ్యలేదు.

చైతన్య మొండితనం రెండు రోజులు నెగ్గింది. టెస్టులు చేయించడానికి వచ్చిన ప్రతిసారీ రాధిక ఇక ఏ వ్యక్తిగత విషయమూ అడగలేదు అతడిని. ఆమె ప్రతి మౌనం అతడిలో మాట్లాడాలి అనే కోరికను పెంచింది. నాలుగవరోజుకు అతడి వేళ్ళు అతడిపై తిరుగుబాటు చేసినట్లు ఆమెకు ఫోన్ చేయించాయి.

"నమ్మవు కదూ... ఐనో... అందుకే చెప్పలేకపోయాను....." ఫోన్‌లో అతడి బాధ ఘనీభవించడం ఆమె వినింది.

"కానీ... ఎందుకు?" ఏదో ఒకటి మాట్లాడకపోతే అతను కట్ చేస్తాడేమో అనిపించింది ఆమెకు.

"ఇప్పుడు అదంతా ఎందుకు చెప్పు... తను వస్తే మంచిది అన్నావ్. నువ్వు చెప్పిన రీజన్స్ కరెక్టే. కాకపోతే తను రాదు, లేదు అనుకుని ట్రీట్ మెంట్ కంటిన్యూ చేస్తే బెటర్" ఇంతకుమించి చెప్పేదేమీ లేదన్నట్లు అన్నాడతను.

ఆమెకు ఇంకే ప్రశ్నా తోచలేదు. ఫోన్‌లో రెండువేపులా అసహనం కొట్టుకు చచ్చింది.

"కెన్ ఐ మీట్ యు సమ్‌వేర్... అదర్‌దేన్ హాస్పిటల్" నసుగుతూ అడిగాడు చైతన్య. ఎంత వద్దనుకున్నా మనుష్యులు మాట్లాడుకోవాలంటే అప్పాయింట్ మెంట్లూ, పర్మిషన్లూ అడుగుతారే! అతని అవస్థ ఆమెకు సుస్పష్టం అయింది. హాస్పిటల్‌లో తన ఛాంబర్‌లోనే అయినా పర్సనల్ విషయాలు ఎలా చెప్పగలడు? ఆ వాతావరణంలో, వివేకానంద సమక్షంలో పాపం ఏం మాట్లాడగలడు? ఎక్కడ కలవగలదు అతడిని?

హఠాత్తుగా తనకంటూ ప్రపంచమే లేనట్లు తోచింది ఆమెకు.

ఈ ఇంటికి అతడిని పిలవగలదా? రాజు 'అనుమతి' తీసుకోవాలి కదా. కానీ ఇది తన ఇల్లు కూడా కదా. అతని స్నేహితులను తీసుకువస్తే నాకు ప్రతిసారీ చెప్పడే కానీ వచ్చిన స్నేహితులను పరిచయం అయినా చేస్తాడు. ఇతడిని ఏమని పరిచయం చేయను? 'చే' అనే వ్యక్తిని సాదరంగా ఆహ్వానిస్తాడా? తన తండ్రికి కూడా ఇతను తెలుసే. అమ్మ అయినా ఒప్పుకుంటుందా! అందరి దృష్టిలో అతనొక చెరిగిపోయిన కల. చచ్చిపోయిన జ్ఞాపకం, బ్రతికిరాకూడని గతం.

*మరచిపోవలసిన మనుషులను మరల అక్కున చేర్చుకునే స్వాతంత్ర్యం ఏ ఒక్క మనసుకైనా ఈ ప్రపంచం ఇస్తుందా?*

పరిస్థితులకు తాను బానిసో, తనకు తానే బందీనో రాధికకు తెలియలేదు కానీ.... అతని చిన్నకోరికను మన్నించేంత తెగింపు ఆమెకు ఆ క్షణమే రాలేదు.

"చే".... ఆమె పిలుపు పెదవుల మధ్యే ఇగిరిపోయింది. "ఇప్పుడు కొంచెం బిజీగా ఉన్నాను..." తనను తానే అసహ్యించుకుంటూ కొనసాగించింది "కెన్ యూ రైట్ టు మీ... ఈ మెయిల్....?" ఎంత ఎదిగిపోయాను! 'అతనితో మాట్లాడాలి... తెలుసుకోవాలి... కానీ వేరెవ్వరికీ తెలియకుండా ... చెప్పకుండా... 'రహస్యంగా', రేపు ఈ రహస్యమైనా బయటపడితే? ఇంత ధైర్యానికి దిగజారేంతటి పిరికితనం తనలోనూ ఉందని ఆమెకు ఇన్నాళ్ళూ తెలియలేదు.

"ఈ మెయిల్? హో....హో..." చైతన్య నవ్వాడు.

అవమానపడిపోయింది రాధిక. తను ఆ మాట అనాల్సింది కాదు. బహుశా ఆ ఆలోచనే తనకు కలగకపోయి ఉంటే బావుణ్ణు.

"సరేలే... ఏంటి ఐడీ" అతడి గొంతులోనూ ఓటమి.

నవ్వలేదు రాధిక. మరింత అవమానం అనిపించింది. *మనతోపాటు మనకు కావలసిన వాళ్ళు కూడా పిరికివాళ్ళు అయిపోవడం భరించలేనంత భారం. వాడిపోతున్న పూవు ఎండిపోతున్న ఆకును చూసి ఏం కన్నీరు కార్చగలదు?*

ఐడీ ఇచ్చి కంప్యూటర్ ముందు ఎదురు చూపుల ముగ్గు వేసుకుని కూర్చుంది. తన మెయిల్ అకౌంట్ ఓపెన్ చేయగానే జెన్నిఫర్ నుంచి మెయిల్ వచ్చింది.

"హాయ్ డియర్. హౌ ఆర్యూ. కాల్ మీ వెన్ యూ ఆర్ ఫ్రీ. సస్పెన్స్" అల్లరి వానలా మెయిల్ అంతా 'స్మైలీ' బొమ్మలు.

మసకబారిపోతున్న రాధిక ముఖంలోకి కాస్తంత ఆనందం విచ్చుకుంది ఆ మెయిల్ చూసి. అందుకేనేమో నవ్వు ముఖం చూస్తేనే సగం దిగులు పోతుందంటారు. టైం చూసుకుని... జెన్నీ ఇప్పుడు హాస్పిటల్ లోనూ, సర్జరీలోనో ఉంటుంది అనుకుని ఎస్ఎమ్ఎస్ ఇచ్చింది..... సస్పెన్స్ ఏమిటో చెప్పమని. వెంటనే జెన్నీ నుంచి కాల్.

"గెస్ వాట్. అయాం ఇన్ పారిస్" ఐఫిల్ టవర్ అంత ఎత్తు ఎగిసింది ఆమె గొంతులో అల్లరి. హాస్పిటలూ, డ్యూటీ వదిలేసిందా అని అర్ధం కాలేదు రాధికకు. ఆ మాటేఁ అడిగింది.

"ఐ టుక్ ఎ బ్రేక్. లాంగ్ లీవ్. ఐ వాంటెడ్ టూ డీ - స్ట్రెస్ మై సెల్ఫ్" తాను చేయలేకపోతున్న పనిని జెన్నీ చేస్తున్నట్లు చెబుతుంటే ఉత్సాహంగా వింది రాధిక.

"అయాం ఆన్ ఎ ట్రిప్. విత్ అర్నాల్డ్... యూనో ఆర్నాల్డ్.. రైట్? " ఘడియ విరామమైనా వదలకుండా గలగలమంటోంది జెన్నీ.

"నో...ఐ డోంట్ నో..." కొంపదీసి సినిమా హీరోనుంచి కాలిఫోర్నియా గవర్నర్ అయిన ఆర్నాల్డ్ స్వార్జనెగర్ కాదు కదా అని అనుమానించింది రాధిక. జెన్నీతో ఏదైనా సాధ్యమే.

"హేయ్... యూ నో హిమ్. హి ఈజ్ పేథాలజిస్ట్. యూ లైక్డ్ హిజ్ సెమినార్ అబౌట్..."

'ఆంకోజీన్స్' అని కేన్సర్‌కు కారణమయ్యే జన్యువుల గురించి తమ హాస్పిటల్‌లో ప్రెంజెంటేషన్ ఇచ్చిన యాభైఅయిదేళ్ళ లావాటి మనిషి రాధికకు గుర్తువచ్చాడు. పొట్టిగా, లావుగా, మందపు కళ్ళజోళ్ళలో అసలు ఎవరినీ గమనించనైనా గమనించనట్లు ఉన్న అతనేమిటి, తనకన్నా దాదాపు ఇరవై సంవత్సరాల పసిదైన జెన్నిఫర్‌తో పారిస్‌కు హాలిడే ట్రిప్ వెళ్ళడమేమిటి? తాను ఆమె నుంచి దూరమై వచ్చిన రెండు నెల్లల్లోనే ఇంత కథ ఎలా జరిగింది?

"అండ్ దె రీజ్ ఏ మచ్ మోర్ సర్ప్రైజింగ్ న్యూస్" ఊరిస్తున్నట్లు చెప్పింది జెన్నీ: "ఐ యామ్ ప్రెగ్నెంట్"

ఆశ్చర్యంతో మాట రాలేదు రాధికకు. "యూ ఆర్ మ్యారీడ్?" అడగకుండా ఉండలేకపోయింది.

"ఓ నో... నాట్ యెట్... బట్ వి ఆర్ ప్లానింగ్ ఇట్ ఇన్ దిస్ ట్రిప్ ఇట్సెల్ఫ్.... అండ్ గెస్ వాట్"

"కమాన్. నో బడీ కెన్ గెస్ ఎనీథింగ్ అబౌట్ యు..." ఉక్రోషంగా అనేసింది రాధిక

పకపకా నవ్వేస్తూ... "ఆఫ్టర్ దిస్ యూరప్ ట్రిప్ వి ఆర్ ప్లానింగ్ టు కమ్ టు ఇండియా హి వాంట్స్ టు సీ హిమాలయాస్ అండ్ సమ్ స్వామీస్.." చాలామంది విదేశీయుల్లానే ఆర్నాల్డ్‌కూ భారతదేశపు ఆధ్యాత్మికతపై ఉన్న ఆసక్తి గురించి చెప్పింది. "అండ్ దట్స్ వెన్ ఐ థాట్ ఆఫ్ మ్యారీయింగ్ ఇన్ యువర్ ట్రెడిషనల్ స్టైల్...."

జెన్నీలో ఎప్పుడూ కొత్త ఆలోచించే ఆ తత్వమే రాధికకు చాలా ఇష్టం. ఒహాయోలో రెండేళ్ళ క్రితం పెళ్ళిరోజుకు ఇచ్చి పార్టీలో తాను కట్టుకున్న ఎర్రటి చీరను చూసి మోజుపడి అల్లరి చేసి మరీ తన చేత ఒక చీర ఇప్పించుకుని కట్టుకోవడం నేర్చుకున్న జెన్నీ భారత సంప్రదాయ ప్రకారం పెళ్ళి చేసుకోవాలి అనుకోవడం ఎందుకో గొప్పగా అనిపించింది రాధికకు. కానీ హిమాలయాల్లో పెళ్ళి చేసుకుంటుందా? మరీ అంత రొమాంటిక్‌గా బ్రతకడం కొందరికే ఎలా సాధ్యమవుతుంది?

"ఐ విల్ టెల్ యూ వెన్ వీ ఫిక్స్ డేట్స్... యూ హావ్ టు బయ్ మీ ఎ శారీ... వింట్‌యూ..." ఆమె సంతోషం ప్రతి మాటకూ హెచ్చవుతోంది.

ఖచ్చితంగా తన పెళ్ళికి పెద్దరికం చేస్తానని రాధిక చేత ఒట్టేంచుకున్నాక...... "బైదివే... డీడ్ యూ ట్రై ది బికినీ... వాట్ డిడ్ రాజూ సే..." గుసగుసగా అడిగింది జెన్ని. రాజు అపహాస్యపు నవ్వు గుర్తుకు వచ్చి రాధిక మనసు వికలమయ్యింది.

"ఐ నో... యూ వోంట్ టెల్... బ్లడీ హిపోక్రెట్... ఎనివే ఎంజాయ్... ఐ విల్ గెట్ సమ్ ఓర్ స్కర్రైజస్ వెన్ అయామ్ దేర్..." అంటూ పక్కన ఎవరో తొందరపెడుతున్నట్లు వీడ్కోలు తీసుకుంది జెన్నీ. మంచి పాట మధ్యలోనే అయిపోయినట్లు అనిపించింది రాధికకు. జెన్నీ అంతే. ఆనందం వచ్చినా ఆవేశం అయినా ఆవేదన అయినా దబదబమని వర్షంలా అందరినీ తడిపేస్తుంది. పారిస్‌లో ఆర్నాల్డ్‌తో ఆమె ఎలా ఉంటుందా అని ఊహించుకో ప్రయత్నించింది రాధిక. ఐఫిల్ టవర్ పైనిలబడి సూర్యాస్తమయం బ్యాక్‌గ్రౌండులో ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటున్నారేమో! ఎంత కాదు అనుకున్నా ఆరడుగుల ఎత్తైన జాజితీగలాంటి జెన్నీ పక్కన గుమ్మడికాయలాంటి ఆర్నాల్డ్ రూపం నప్పినట్లు అనిపించలేదు. శారీరక అందం, బాహ్య సౌందర్యం అంతా వ్యర్థం ప్రేమకు మనసే ముఖ్యం అని అందరూ అంటారు కానీ అనుభవానికొచ్చేసరికి మాత్రం ప్రతివారూ పైపైమెరుగులను చూడకుండా ఉండలేరు. తాను కాస్తంత చూడచక్కగా ఉన్నాను కాబట్టే పెళ్ళి చేసుకున్నావని రాజును అప్పుడప్పుడూ తప్పు పట్టే తానే ఇలా ఆలోచిస్తున్నానేమిటని రాధికకే సిగ్గు వేసింది.

"అంతే మేడమ్... చెప్పడానికే మోరల్స్, ఎథిక్స్, ప్రిన్సిపుల్స్.... మనలో ఎన్ని లోపాలు ఉన్నా మిగతా అందరూ మాత్రం పర్ఫెక్ట్‌గా ఉండాలి అనుకుంటాం" రాధిక టిఫిన్ బాక్స్‌లో తెచ్చి ఇచ్చిన పూత రేకుల్లోంచి ఒకదాన్ని తీసుకుని దాని మడతలను విప్పి మధ్యన ఉన్న చక్కెర పొడిని బాక్స్‌లో ఒక మూల రాల్చాడు చైతన్య.

ఇరవైమూడవ పుట్టినరోజు సంధర్భంగా వేసుకున్న కొత్తబట్టలు ఉక్కపెడుతుంటే చున్నీ అంచుతో ముఖం మీదకు గాలి విసురుకుంది రాధిక. ఆ సంవత్సరం ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ఎక్కడెక్కడి ఉప్పునో విశాఖపట్నం అంతా విసిరేస్తోంది సముద్రం.

"వాటిని అలా కాదు తినడం" ముక్కుపుడకలా పుడుతున్న చెమట చుక్కను తుడిచేసుకుంటూ చైతన్య మీద గుర్రుమంది ఆమె. ఎంతో కష్టపడి తన పుట్టినరోజు నాడు తానే శ్రమ పడి చేసుకొచ్చిన పూతరేకులను అతను అలా అపరాధపరిశోధకుడిలా ముక్కలు ముక్కలుగా విడదీస్తుంటే ఆమెకు ఎండకంటే ఎక్కువ కోపం వచ్చేస్తోంది.

"నాకు నచ్చినట్లు నేను తింటాను. ఈ పొడి సెపరేట్‌గా తింటుంటే భలే ఉంటుంది... ఈ రేకులేమిటో టిష్యూ పేపర్స్‌లా పెదవుల మధ్య నలుగుతుంటే నాకు అంతగా నచ్చవు" అంటూనే ఒక పూతరేకును కొరికి ఆ రుచికి ఆస్వాదించకుండా ఉండలేకపోయాడు చైతన్య..

"నీకో విషయం తెలుసా... నువ్వు అంతగా ఇష్టపడి తింటున్నావే... అవి కూడా మా నాన్న మనీతో చేసినవే..." అసలు విషయం గుర్తుకుతెచ్చుకుంది రాధిక. చైతన్య ఆమె వేపు చురచురా చూసాడు. అతడి చూపుని ఖాతరు చెయ్యనట్లు ఆమె తన మెడలోని కొత్త బంగారు చైనును వేళ్ళ మధ్య ఆడిస్తూ ముఖం తిప్పుకుంది.

మధ్యాహ్నం ఎండ మరింత చుర్రుమంది. ఎవరూ రాని ఆ రోడ్డు వెంబడి దారి తప్పి వచ్చిన ఒక వట్టిపోయిన ఆవును లాక్కుపోవడానికి దానివెనుకే వచ్చిన బక్కపిల్లవాడు చెట్టు నీడలో బైక్ మీద ఉన్న వీరిద్దరినీ చూసి ఎవరైనా సినిమా హీరోహీరోయిన్లేమో అని అనుమానపడుతూ అక్కడక్కడే తచ్చాడుతున్నాడు. వాడిని రమ్మని సైగ చేసాడు చైతన్య. ఎండకు కళ్ళు చికిలించుకుని అయోమయంగా వచ్చాడు వాడు. డబ్బాలోని పూతరేకులను వాడికి అందించాడు చైతన్య. నమ్మలేనట్టు చూస్తున్నవాడికి ఫర్లేదు తీసుకొమ్మని చెప్పి చేతికి ఇచ్చాడు. ఆబగా ఒకముక్క కొరికి మిగతావాటిని రెండు చేతుల్లో జారిపోకుండా దాచుకుని గంతులేస్తూ వెళ్ళిపోయాడు వాడు. రాధికకు కోప్పడాలో, బాధపడాలో తెలియకుండా పోయింది.

"ఇప్పుడు నేను అన్నమాటలు బాధపడి వాడికి అవి ఇచ్చావా లేక...." ఆమె అనుమానం అడుగుతుండగానే

"ఏదో ఇవ్వాలని ఇచ్చేవాడినే అయితే ఒక పూతరేకే ఇస్తాను కానీ అన్నీ ఇచ్చెయ్యను కదా" తన వైఖరిని సమర్థించుకున్నాడు అతను.

కళ్ళ వెనుక ఉక్రోషం తన్నుకొచ్చింది ఆమెకు.

"ఎంత కష్టపడి చేసానో తెలుసా..." ఇక మాట్లాడలేనట్టు ఆమె గొంతుపూడుకుపోయింది.

"మరయితే ఆ మాట ఎందుకు అన్నావ్?" అతడేమీ వెనక్కుతగ్గలేదు.

"నువ్వేగా... మా నాన్న బర్త్‌డే గిఫ్ట్‌గా ఈ చైన్ ఇచ్చాడు అంటే... లంచం డబ్బులతో కొన్న బహుమతి అని హర్టింగ్‌గా మాట్లాడావ్" మెడలోని చైనును విసిరి నేలకేసి కొట్టాలన్నంత ఆవేశాన్ని అదుపుచేసుకుంటూ ఎగిసిపడింది ఆమె.

"హర్టింగ్‌గా ఉన్నా... అది నిజమే..." ఆమెను అక్కున తీసుకోవాలనే కోరికను నిగ్రహించుకుంటూ కోపం కొనసాగించాడు అతను.

"ఏంటీ నిజం? మా నాన్నకొచ్చే జీతానికి ఈ మాత్రం కొనివ్వలేడు అనుకుంటున్నావా? హౌ కెన్ యూ అక్యూస్ మై ఫాదర్ ఏజ్ ఎ కరప్ట్?" దెబ్బ తింటున్నది తన తండ్రి గౌరవమో, తన అభిమానమో ఆమెకే సరిగా తెలియట్లేదు. కానీ రెండూ ఒకటే అనిపించాయి. బెట్టు సడలించి ఆమె దగ్గరకు చేరి భుజం మీద చేయివేసాడతను. విసురుగా తోసేసింది రాధిక.

"కమాన్ ... ప్లీజ్... అపార్థం చేసుకోకు. నేను నిన్ను ఏమీ అనట్లేదు. ఇట్స్ నాట్ యువర్ ఫాల్ట్. మన పేరెంట్స్ బిహేవియర్‌కు మనం కారణం కాదు కదా. సపోజ్... మా నాన్నే మీ నాన్నలా ఏదైనా గవర్నమెంట్ జాబ్‌లో ఉంటే... తనకూ అలాంటి బలహీనతే కలిగి, తానూ లంచాలు తీసుకుని... ఇదుగో నాకీ డొక్కు సెకెండ్ హ్యాండ్ బైక్ బదులు... ఏకారో కొనిచ్చేవాడేమో. కానీ ఇక్కడ ప్రాబ్లం ఏంటంటే... మన ప్రిన్సిపుల్స్ ఏమవుతున్నాయ్ అని .... నువ్వే చెప్పు... మా నాన్న నాకు అలా ఒక కారు కొనిస్తే... దాన్ని నేను ఫ్రాడ్‌పొజెషన్‌లా చూసుకుంటూ, అందులో నిన్ను షికారుకు రమ్మంటే... నువ్వు వస్తావా?"

యధాలాపంగా అన్నట్లే వినిపించినా ఆ ప్రశ్న రాధికను చాలా కలవరపెట్టింది. నిజమే నీతి సూత్రాలను, పుస్తకాలనుంచి నేర్చుకున్న ఆశయాలను సవాలు చేస్తూ సులభంగా వచ్చే సుఖాన్ని కాదనడం చెప్పడానికి బాగానే ఉంటుంది కానీ ఆచరణలో ఎంత బాధ? తన మెడలోని బంగారు చైను ఒక చేదు ప్రశ్నలా చిరచిరమంటున్నట్లు అనిపించింది. ఆమెకు గెలుసు. వాళ్ళ నాన్న కాస్తో కూస్తో లంచాలు తీసుకుంటాడని. తాను టెన్త్‌క్లాసులో ఉన్నప్పుడే ఎవరో ఇంటికి రావడం, అతడికి కాఫీ అయినా ఇవ్వకుండా, తనను పరిచయం చేయకుండా చాలా ఫార్మల్‌గా మాట్లాడి, అతను వెళ్ళిపోయాక అమ్మ చేతికి డబ్బులు ఇచ్చి దాయమనడం గమనించిన రాధికకు అప్పుడు అర్థం కాలేదు అదంతా ఏమిటో. అమ్మను అడిగితే... నీ కెందుకే చిన్నపిల్లవు అని కసిరింది. తమ్ముడేమో తెలిసినా చెప్పలేనట్టు చూపులు తప్పించుకుపోయాడు. ఒక సంవత్సరమయ్యాకే తెలిసింది... చిన్నవాడైనా తమ్ముడికి ఉన్నంత లోకజ్ఞానం తనకు లేదని.... అవన్నీ లంచాలని. నాన్న 'మంచివాడు' కాదని కొన్ని రోజులు బాధపడింది. తనకు తానే ఎన్నో అబద్ధాలు చెప్పుకుని మోసగించుకోవాలనుకుంది.

ఆ డబ్బులు వాళ్ళు ఒద్దన్నా ఇస్తారేమో! పాపం నాన్న భయపడి ఆ డబ్బులు తీసుకుంటున్నాడంతే. ఆ డబ్బులు వాడుకోడు. ఏ దేవుడి హుండీలోనే వేసేస్తాడు. అమ్మకు కానీ తనకు కానీ ఆ డబ్బులతో ఏమీ కొనివ్వడు. మనిషి అవసరం అనుకుంటే తనకు తానే ఎన్నో అబద్ధాలు చెప్పుకోవచ్చు. అంతరాత్మను మోసం చేసుకోవడం అట్టే కష్టం ఏమీ కాదు. అదీ మనిషి నుంచి పుట్టేదే మరి. కాకపోతే ఆ విషయం ఇంకెవ్వరైనా ఆ గుర్తుకు తేస్తే ఎవ్వరికీ నచ్చదు. తనకు మంచి ర్యాంకు రాకపోతే డబ్బు పెట్టి సీటుకొనడానికైనా తన తండ్రి సిద్ధపడిపోయిన రోజే అర్థమయింది రాధికకు... చాలామందిలాగా తమకూ 'వెనకేసుకున్న' డబ్బులు ఉన్నాయి. ర్యాంకు వచ్చింది కాబట్టి సరిపోయింది కానీ అదే నాన్న తనకు కొన్ని లక్షలు పోసి ఒక డొనేషన్ సీటు కొనిస్తే.... తాను దాన్ని ఒద్దనగలనా అని అప్పుడప్పుడూ ఆమెకూడా ఆలోచించలేకపోలేదు.

"ఏంటి అలాంటి కారులోకి నేను రమ్మంటే వస్తావా నువ్వు?" చైతన్య ప్రశ్నకు ఉలిక్కిపడి తెల్లమొహం వేసింది.

"ఐ నో... దెన్....యూ వోంట్ ఈవెన్ లవ్ మీ ఎవర్" బైక్‌కు సెంటర్ స్టాండు వేసి పైన ఎక్కి కూర్చుంటూ అన్నాడు చైతన్య.

నిజమా? రాధిక చాలా తీవ్రంగా ఆలోచించింది. అవునేమో. మొదటిసారి అతడిని తిట్టుకుంది. మేనర్స్ లేని మనిషని. అదే అతను శవాలు కోసే మనిషితో స్నేహంగా ఉండటం... నిముషాల్లో అతనంటే మంచి అభిప్రాయం మార్చుకుంది. ***మనిషి చేసే ప్రతి చిన్న చర్య.... చివరకు ఒక దోమ తన మీద వాలుతుంటే దాన్ని కొట్టి చంపే పద్ధతిలో కూడా అతని నైజం తెలుస్తుంది. ఆ కాస్త చాలు ఇంకో మనిషిని ఆకట్టుకోవడానికైనా అసహ్యించబడడానికైనా.*** ఈ వేళ నాన్న లంచం డబ్బులతో కొని ఇచ్చాడేమో అనే అనుమానం కలిగిస్తున్న ఈ చైనును వేసుకోవడమేకాక, అందుకు సంతోషించడంలో తన వ్యక్తిత్వమే పతనమవుతోందా? లేక చే దృష్టిలో తన ఔన్నత్యం తగ్గిపోతోందా? రెండూ ఒకటే అనిపించాయి రాధికకు.

***తన దృష్టిలో తాను ఏమిటో అనేదానికంటే తనకు కావలసినవారి దృష్టిలో తనేమిటి అనేదే ఎవరికైనా ముఖ్యం.***

"ఇప్పుడు నేనేం చెయ్యాలి మరి" బంగారు చైనును వేళ్ళ మధ్య అయోమయంగా నలుపుకుంటూ తికమకపడిపోయింది రాధిక.

ఆమె బేలముఖం చూసేసరికి తన చిరాకు అంతా మరచిపోయాడు చైతన్య. బైక్ దిగి, చెట్టుకింద ఉన్న దిమ్మ మీద కూర్చున్న ఆమె పక్కన చేరి ముద్దుపెట్టుకునేందుకు బుగ్గమీదకు వాలాడు. ***భారతదేశపు ఆడదానికి రొమాన్సును తోసేయడం వయసులో పెరిగే ఒక 'ఇన్‌వాలెంటరీ రియాక్షన్'.*** అతను వెనక్కు తూలాడు.

"ఎన్నిసార్లు చెప్పాలి... పబ్లిక్‌లో ఇలాంటి వేషాలు వద్దని. నీకేం తెలుసు. ఎవ్వరైనా చూస్తే మా ఇంట్లో చాలా పెద్ద గొడవ.." ఆమె పెదవులకు చేయి అడ్డుపెట్టేసి కళ్ళతోనే క్షమాపణ కోరాడు చైతన్య. ముఖం అతని చేతిలోంచి లాగేసుకుని క్షమించేసింది. ఆమెను చూసి మళ్ళీ మోహం పెరుగుతుండగా అదుపు చేసుకోవడానికి కష్టపడ్డాడు అతను.

"ఇంతకీ ఇప్పుడు నేనేం చెయ్యాలి" పక్కదారి పడుతున్న వాదనలోంచి తన ప్రశ్నను వెనక్కు లాక్కుంది రాధిక.

"నువ్వే చెప్పు... ఏం చేస్తావ్?" ఆమె వ్యక్తిత్వంలోంచి పుట్టే పరిష్కారం కోసం అతనూ ఎదురు చూసాడు.

"ఈ చైన్‌ను ఎవరికైనా ఇచ్చేస్తే?"

"హుఁ.... అంటే ఎవరికని?"

ఆమె ఆలోచించింది. "అంటే... ఎవరికైనా మనీ అవసరం ఉండేవాళ్ళకు.... మే ... బీ.. దీన్ని అమ్ముకుని వాళ్ళు ప్రాబ్లంలోంచి బయటపడొచ్చు కదా"

సమాధానం చెప్పడం ఇష్టంలేదన్నట్లు అతను నేలచూపులు చూసాడు.

"పోనీ... ఏదైనా గుడిలో హుండీలో వేసేద్దాం..... ఆర్ డొనేషన్ బాక్స్...?" ఆమె కొంచెం ఉత్సాహంగా చెప్పింది.

అతను ఫక్కుమన్నాడు. "అంటే... పాపపరిహారమా?" అతను గొంతులోని మార్పుకు ఆమె చిన్నబోయింది.

"మనిషి అసలు దేవుడు అనే 'క్యారెక్టర్'ను తన అవసరానికే కనిపెట్టుకున్నాడేమో అనిపిస్తుంది ఇలాంటి ఆలోచనలు వింటే. చెయ్యకూడని పనులన్నీ చెయ్యడం ఆ తర్వాత కాస్త 'షేర్' ఇచ్చేసి రెండు చెంపదెబ్బలు, నాలుగు గుంజీళ్ళు, ఓ పూట ఉపవాసాలు.... ఇంకా రకరకాల మొక్కులూ చెల్లించేసుకుంటే... క్లీన్... మొత్తం సిన్స్ అన్నీ తుడిచిపెట్టుకుపోయి ఒక పరిపూర్ణమైన మనిషిగా మళ్ళీ మారొచ్చు..... ఎందుకూ? మళ్ళీ కొత్తపాపాలు చెయ్యడానికి. వాటి గిల్ట్ తప్పించుకోవడానికి మళ్ళీ మొక్కులు... భలే 'విషసర్కిల్'కదూ... అందులోకి వెళతామంటావా?" ఇంకా చెప్పబోయేవాడు ఎందుకో ఆగిపోయాడు.

"హమ్మయ్యా... అయిపోయిందా! మళ్ళీ ఏ కమ్యూనిస్ట్ సిద్ధాంతాలనో వీటికి జతచేసి 'దాస్ కాపిటల్' అంత పెద్ద బుక్కునూ చెబుతావ్ అనుకున్నా" తేలికగా నవ్వేసింది రాధిక.

"డోంట్ కాల్ మీ ఎ కమ్యూనిస్ట్... ఐ డోంట్ లైక్ దెమ్.... మనిషికి కాస్తంత స్వార్థం, తనది అనే ఫీలింగూ ఉండకపోతే ఎలా? నిస్వార్థబుద్ధి, సమానత్వం మనిషికి స్వతహాగా రావాలే కానీ తుపాకీ బెదిరింపుతో ఎలా వస్తాయి.... నచ్చకపోయినా 'డాక్టర్ జివాగో'లాంటివి చదివితే ...."

"ఆ చదివితే..."

"ఇదిగో ఇల్లా మజాక్ చెయ్యొద్దు"

"ఆ చేస్తే..." తనలోని సంఘర్షణ అంతా ఎందుకు పోయిందో కానీ హఠాత్తుగా తేలికయిపోయినట్లు అనిపిస్తోంది రాధికకు. మెడలోని గొలుసు తీసేసి పిడికిట్లో ఆడిస్తోంది. పాముపిల్లలా మెలికలు పడుతోంది అది.

"పోన్లే.. బర్త్‌డే రోజు మూడ్ ఎందుకు చెడగొట్టడం కానీ... ఈసారికి నీ ఇష్టం వచ్చినట్లు ఏ హుండీలోనో వేసెయ్..." రాజీకొచ్చాడు అతను.

"ఆ వేసేసి, మా నాన్నను క్షమించు దేవుడా అని ప్రార్థించేయాలా? అలాగే, ఇంకెప్పుడూ మా నాన్నకు లంచం తీసుకునే బుద్ధి రాకూడదని నువ్వు ఏమైనా మొక్కుకో..." సరదాగా కాళ్ళాడించింది రాధిక. ఆమెలో హఠాత్తుగా ఎగసిపడుతున్న హుషారును చూసి అతడు తికమకపడ్డాడు. ఆమె ఏదో నిర్ణయించుకుంది అని అతనికి అర్థమయ్యింది.

"థాంక్యూ చే.... ఈ బర్త్‌డేను నేనెప్పటికీ మర్చిపోను. దిస్ డిస్కషన్‌ని వి హేడ్.. చాలా మంచిది. ఇప్పుడు ఆలోచిస్తుంటే నేను ఎంత మారిపోయానో తెలుస్తోంది. నిజం తెలుసా... హాస్పిటల్‌లో ఎన్నెన్నో సఫరింగ్స్ చూసి, ఒకళ్ళ ప్రాణం అంటే అసలేమీ పట్టనట్లు ప్రవర్తించే కొందరు డాక్టర్లు, నర్సులు... అసలు ఈ సిస్టమ్.... చూసి వాళ్ళను తిట్టుకుంటూ నేనేమిటో చేసేసి వీళ్ళందరినీ మార్చేస్తాను, నువ్వూ నేనూ కలిసి ప్రపంచాన్ని ఉద్ధరించేస్తాం అనుకునేదాన్ని. కానీ ఆ మార్పు నాలో రానిదే వాళ్ళనెలా..." ఆమె కళ్ళలో తనను కోల్పోతున్నట్లు చూస్తుండిపోయాడు చైతన్య.

"ఈ చైనును నువ్వన్నట్లు ఏ ఛారిటీకో ఇచ్చేస్తే, రేపటికల్లా ఇదంతా మరచిపోతాను. మరోసారి ఏ పండుగరోజుకో మా నాన్న ఇలాంటిదో, ఇంతకంటే ఇంకా ఖరీదైనదేదో బహుమతి ఇస్తాడు. ఆరోజు కూడా మళ్ళీ ఇదే కన్ఫ్యూషన్"

"ఎగ్జాట్లీ" ఆమెతో ఏకీభవిస్తూ తలాడించాడు అతను.

"నిజానికి ...ఇప్పుడు దీన్ని మా నాన్నకు తిరిగి ఇచ్చేసి... నాకు ఇలా లంచం డబ్బులతో ఇంకెప్పుడూ ఏమీ ఇవ్వకు అని చెప్పాలి. కానీ..." కళ్ళుదించేసుకుని లోగొంతులోనే కొనసాగించింది రాధిక" నాకు అంత ధైర్యం లేదు. చెపుతావు కానీ, నా పొజిషన్‌లో నువ్వు ఉన్నా అంత ధైర్యం చెయ్యలేవేమో. ఐడియల్ పర్సన్‌గా ఉండాలి అనుకోవడం చాలా సులభం కానీ నిజంగా ఉండటం ఎంత కష్టమో ఇప్పుడు తెలుస్తోంది"

అంతటి వేడిగాలిలోని చైతన్యకు ఒళ్ళు ఝుల్లుమన్నాయి. ఆమె ఓడిపోతున్నట్లు మాట్లాడినా నిజం మాట్లాడింది. ఆమె పరిస్థితిలో తను ఉన్నా అంతేనేమో. *అందరూ అంతే. కాస్త తప్పు చేసినవాడెవ్వడైనా కనిపిస్తే వాడి తప్పును భూతద్దాల్లోంచి చూసి ప్రపంచం చరిత్రనూ, పుస్తకాల్లోని ఎన్నెన్నో తత్వాలనూ, వేదాంతాలనూ ఉద్ఘాటించి, ఇసుమంతయినా తప్పు చేయని గొప్పవారి చరిత్రను, తప్పులు చేసి చేసి నాశనమైనవారి కథలనూ పోల్చి చూసి ఆవేశపడిపోయి ఆవేదన చెందిపోయి రొష్టుపడిపోతారు. కానీ తరతరాలుగా క్షీణించుకుపోతూ వస్తున్న మానవజీవితంలో ప్రతి మనిషీ ఓడిపోతున్నవాడే ఓటమిని ఒప్పుకోలేనివాడే*

"ఈ చైనును నా దగ్గరే పెట్టుకుంటాను. ఎప్పుడూ వేసుకోను. ఇంకా ఇలాంటివెన్ని కొనిచ్చినా అవేవీ 'నావి' అనుకోను. ఐ థింక్... అందుబాటులో ఊరించే సరదాలు, సుఖాలు ఉన్నా వాటిని అనుభవించకుండా ఉండటం చాలా కష్టం. అయినా ఆ స్థాయికి చేరుకుంటాను. ఆరోజు ఇచ్చేస్తాను వీటిన్నిటినీ ఛారిటీకు. అప్పుడు అది ఎస్కేపిజం అవ్వదు... నువ్వు అన్నట్లు పాపాలు కడిగేసుకోవడానికి కాదు కదా. ఎందుకంటే నేనెప్పుడు అసలు పాపమో, పుణ్యమో వీటితో అనుబంధమే ఏర్పరచుకోలేదు కదా..." గొలుసును హ్యాండుబ్యాగులో ఉంచేసుకుంటూ స్థిమితంగా చైతన్యవేపు నవ్వింది ఆమె.

"ఎవరు చెప్పారు నీకు ఇదంతా" మురిసిపోతూ అడిగాడు చైతన్య.

"అంటే ఏంటీ నీ ఉద్దేశ్యం?" ఆమె కోప్పడింది

"నువ్వు ఇంతగా ఆలోచించగలవా? మైగాడ్ అయామ్ సర్ప్రైజడ్"

ఎండలో ఎర్ర మిరపకాయలా ఆమె కోపం చిట్లింది. "నేను దద్దమ్మను అనే కదా నీ ఫీలింగ్. ఇడియట్. నీకే పేద్ద తెలివితేటలు ఉన్నాయని ఈగో. ఏమైనా అంటే చే గువెరా ఇలా చేసాడు, మార్క్స్ ఇలా చెప్పాడు, దోస్తవెస్కీ ఏం రాసాడు, వివేకానందుడి ప్రవచనాలు, ఫ్రాయిడ్ ఇంటర్ప్రెటేషన్స్, వాడెవ్వడూ... నీ... నీ" పేరు గుర్తుకు రాక ఆమె తడబడుతుంటే.... "నీషే" అని అందించాడు చైతన్య. అతని పెదవులపై పాకుతున్న వెక్కిరింత నవ్వును ఆమె పసిగట్టింది.

"ఆ ఎవడో ఒకడూ. వీళ్ళందరి పుస్తకాలు చదివి చెపుతావు కానీ నీకసలు సొంతంగా ఆలోచించేంత సీను లేదు"

"అవును మరి మీలాంటి మేధావుల ముందు మేమెంత? అవునూ... నీకు తెలుసా? ఇప్పుడు నువ్వు చెప్పిన విషయమే చాలామంది స్పిరిట్యువల్ ప్రీచర్స్ కూడా చెప్పారు... లైక్ ఓషో." నేను ఇక వినను అన్నట్లు రాధిక చెవులు మూసుకోబోతుంటూ బలవంతంగా ఆమె చెవులు కట్టిపెడుతూ.. "విను... విను... రోడ్డు పక్కన, చెట్లక్రింద ఎందరో అభాగ్యులు, అనాథలు ఉండగా సిద్ధార్థుడే బుద్ధుడిగా ఎందుకు కొలవబడ్డాడు? ఎందుకంటే... అతను అన్నీ పరిత్యజించి వచ్చాడు కాబట్టి. సాక్రిఫైస్ చేయడానికి, రెలింక్విష్ చేయడానికైనా అసలు మనిషికి ఏమైనా ఉండాలి కదా. కోరికలు తీర్చుకోవడానికి మార్గమూ, అవకాశమూ ఉండి కూడా కోరకుండా ఉండటమూ, మెటీరియల్ వెల్త్.... అదే.. ఐహిక సుఖాలు, భోగాలు అనుభవిస్తూ కూడా వాటిల్లోనే జీవితం కోల్పోకుండా నిగ్రహించుకోవడమే గొప్ప అన్ని దాదాపు అన్ని వేదాంతాలు చెపుతాయి. నువ్వూ ఇప్పుడు అదే చెప్పావు... కాకపోతే జస్ట్ లంచం డబ్బుల గురించి చెప్పావనుకో.. ఎనీవే ఇదంతా నీకు ఎలా.." అబ్బురంగా ఆమె ముఖాన్ని తడుముతూ అడిగాడు.

"మరేం అనుకున్నావ్ నేనంటే" అల్లరిగా కళ్ళెగరేసింది రాధిక.

అతనూ నవ్వేసాడు. "ఒకటి చెపుతా విను...."

"అప్పట్నించీ వింటూనే ఉన్నాగా..."

"ష్. చుప్.... విను... మనం అందరం మారిపోతాం. పదేళ్ళ క్రితం మనం ఎలా ఉండేవాళ్ళమో తలుచుకుంటే ఇప్పుడు ఎంత మారిపోయామో తెలుస్తుంది. అలానే ఈ రోజు ఉండేవాళ్ళమో తలుచుకుంటే ఇప్పుడు ఎంత మారిపోయామో తెలుస్తుంది. అలానే ఈ రోజు మన ఆలోచనలు, ప్రవర్తన అన్నీ కూడా భవిష్యత్తులో మారిపోయి అప్పుడు వెనక్కు తిరిగి చూసుకుంటూ మన ఈ రోజు చాలా

సిల్లీగా అనిపించొచ్చు. నేను కోరుకునేది ఒక్కటే. నువ్వు మాత్రం మారొద్దు. ఎప్పటికీ ఇలానే ఉండిపో... బికాజ్ యూ ఆర్ బెస్ట్ ద వే యూ ఆర్ నౌ" అతని కంటి పాపల్లో తాను తడిసిపోతుండటం చూసుకుంది రాధిక.

"మరి నువ్వు కూడా మారిపోకూడదు మరి" ఆమె అనుమానానికి ఫక్కుమన్నాడు చైతన్య. ఆమె అనుమానం మాత్రం తీరలేదు.

****

# 6

"రాధీ. రాధీ...... లే.......... ఇక్కడే నిద్రపోయావే" రాజు కుదుపుతో కళ్ళునులుముకుంటూ మేలుకుంది రాధిక. అర్ధరాత్రి దాటింది.

"నువ్వేంటి ఇలా కంప్యూటర్ ముందు.." మానిటర్‌లో తెరిచి ఉన్న తన మెయిల్ బాక్సులోకి తొంగిచూస్తున్న అతని చూపులను పసిగట్టి హడావుడిగా దాన్ని క్లోజ్ చేసింది రాధిక. ఆ లిప్తపాటులోనే గమనించింది, చైతన్య నుంచి ఏ మెయిలూ రాలేదని.

"జెన్నీతో కాసేపు ఛాట్ చేసాను.......... మధ్యలోనే నిద్రొచ్చేసింది" కాస్త నిజం దాచేస్తూ అతడికేసి చూసింది. ఆమెను పట్టించుకునే స్థితిలో లేనట్లు చిరాకు అతడి ముఖంపై.

"పో... ముఖం కడుక్కోపో......... అంత జిడ్డు........ కనీసం ఏసీ అయినా ఆన్ చేసుకోకపోయావా?" అలసటగా మంచం మీద వాలిపోతూ టీవీ స్విచ్ ఆన్ చేసాడు రాజు.

"బానే ఉంది...... సడన్‌గా అలా నిద్రపోతానని నేనైనా అనుకున్నానా? అలా అయితే కంప్యూటర్ ముందు ఎందుకు పడుకుంటానూ...?" అతను పెంచుతున్న సౌండులో తన మాటలు వినడని తెలిసినా గొణుక్కుంటూ బాత్రూమ్‌లోకి అడుగుపెట్టింది రాధిక. చల్లటి నీళ్ళు ముఖంపై జల్లుకుంటూ ఎదురుగా ఉన్న అద్దంలో చూసుకుంటూ తనరూపం కరిగిపోతున్నట్లు తోచింది అమెకు. ఎందుకు చైతన్య మెయిల్ చెయ్యలేదు? వివేకానందకు హఠాత్తుగా ఏమైనా..?? ఆలోచన పూర్తిచేసేందుకు భయపడింది. ఒకసారి అతనికి ఫోన్ చేస్తే? కానీ రాజు ఎదురుగా ఎలా? వేరెవరికైనా అని చెప్పొచ్చు. కానీ తమ మాటలు విని అతనికి అర్థమయిపోతుందే అతనికి వినపడకుండా హాల్‌లోకి వెళ్ళి ఫోన్ చేయొచ్చు. అయినా ఇలా అర్ధరాత్రి ఎవరికి ఫోన్ రాజు అనుమానపడొచ్చు. అసలు ఇదంతా ఎందుకు..... అతనితో చెప్పే చేస్తే? ఎలాగూ తెలుసుకదా అతనికి, వివేకానంద గురించి. ఏమైనా మిగతా పేషెంట్ల బాగోగుల గురించి ఇలా అర్ధరాత్రుళ్ళు ఫోన్ చెయ్యను కదా, ఈ పసివాడి గురించి మాత్రం ఏమిటి ప్రత్యేక శ్రద్ధ అని అతను ఆలోచించవచ్చు. అనుమానపడొచ్చు? ఏమో........ మానవతా దృష్టితో, స్నేహభావంతో ఆలోచించొచ్చు అర్థం చేసుకోవచ్చు. కానీ ఆ 'ఏమో' అనే అనిశ్చితి ఆమెలో సముద్రంలా ఎగిసి ఎగిసి పడి కుదురుగా ఉండనివ్వలేదు.

*ఒక మనిషి ఎప్పుడు ఎలా ఆలోచిస్తాడు అనేది ఎవ్వరూ తేల్చలేని మిస్టరీ.* గదిలోంచి టీవీ సౌండు బాత్రూం తలుపుల కింద పారి అసలే సందేహాల్లో కొట్టుమిట్టాడుతున్న ఆమెను మరింత ఇబ్బంది పెట్టింది. న్యూస్ ఛానెల్ థీం మ్యూజిక్ వినిపించేసరికి ఆమెకు రాజు ఎందుకు ఇంత సౌండు పెడుతున్నాడో అర్థం కాలేదు. అతను మమూలుగా శబ్దం లేకుండ 'మ్యూట్'లో పాటలు చూడటమే కానీ ఇంత వాల్యూంతో వార్తలు వినడం అసాధారణమే. టీవీ సౌండు మరింత పెరిగింది... "రాధీ..... రాధీ......" అని ఆత్రుతగా రాజు గొంతు ముఖాన్ని తువ్వాలులో అద్దుకుంటూ ఏమిటని ఆమె అడుగుతు గదిలోకి వస్తుండగానే.. "ఇతనేగా........ మీ......." ఇక చెప్పలేనన్నట్లు టీవీ వైపు చూసాడతను. అటు చూసిన ఆమె కళ్ళల్లో అపనమ్మకం షాక్ కొట్టింది. చైతన్యను చూపిస్తున్నారు.

మసక మసకగా ఉన్న గదిలో.. బహుశా అతనికి తెలియకుండా తీసిన వీడియోలా.. మసక మసకగా అయిన అతని గొంతు స్పష్టంగా మ్రోగుతోంది. కళ్ళనే కాక చెవులనూ నమ్మలేకపోతోంది రాధిక. అతను డబ్బులు అడుగుతున్నాడు. లక్షల్లో టీవీ స్క్రీన్ అడుగున అక్షరాలు ఎర్రచీమల్లా పరుగెడుతున్నాయ్." మా ....... ఛానెల్ సీక్రెట్ కెమెరాకు చిక్కిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపాలిటి ఇంజినీర్"

"మరో అవినీతి పెద్ద చేప" "లంచావతారం అరెస్టు" "రకరకాల పదాలతో చైతన్యను గురించి చెడుగా అక్షరాలే అయినా, పదాలే అయినా రాధిక ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మేది కాదు. కానీ........ ఆమె కళ్ళారా చూస్తోంది. చెవులార వింటోంది. అతనే లంచమే అడుగుతున్నాడు. స్పష్టంగా అతనే.

*మార్పు అనేది జరిగేంతవరకూ తెలియదు. లిప్తపాటులో కళ్ళెదుట మారే దృశ్యం కావొచ్చు, సంవత్సరాలతరబడి పెరిగిపోయే మనిషి కావొచ్చు, జీవితాలూ చరిత్రలను దాటుకుని సాగిపోయే కాలం కావొచ్చు........ ఒక్కసారి మునుపటి రూపాన్ని గుర్తుచేసుకుంటేనే కానీ ప్రస్తుతం ఎంత మారిపోయిందా అనేది అర్థం కాదు.*

కారు అద్దం మీద హోరుమని కురుస్తున్న వాన నీటిని తొలిగించేస్తున్న వైపర్ల మధ్యనుంచి చురుగ్గా ట్రాఫిక్‌ను గమనిస్తూ డ్రైవ్ చేస్తోంది రాధిక. వర్షం ధాటికి దొరికిన ప్రతి బిల్డింగ్, షాపు ఆవరణలో తలదాచుకుంటున్నారు జనం. అద్దం మీద తొలిగిపోతున్న నీటి చారల్లో తన చుట్టూ ఉన్న ప్రపంచమంతా జారిపోతున్నట్లు అనిపిస్తోంది రాధికకు. ఇలాంటి వర్షం అంటే ఒకప్పుడూ తనకెంతో ఇష్టం. ముఖ్యంగా చేతో కలిసి ఉన్న ఆ రోజుల్లో. ఏమయిపోయాయి ఆ రోజులన్నీ? అసలు మంచి కాలాలు అలాగే ఉండిపోవెందుకు? అంతకంటే మంచి అనుభవాన్ని కోరుకుంటూ మనమే వాటిని వదిలేసుకుంటున్నామా?

*తృప్తి పడుతూనే ఉన్నా మరింత తృప్తి కావాలన్న ఆశ ప్రతి మనసులోనూ అంతర్లీనమైన బలహీనత.*

ఇలాంటి వానల్లో....విశాఖ సముద్రం ఒడ్డున........ చున్నీ అంచుతో తలకప్పుకుంటూ.... తడి ఇసుకుల్లో అలాగే ఉండిపోక తలదాచుకునే స్థలం కోసం వెతకడమెందుకు... మళ్ళీ అది దొరకగానే... అరే వర్షంలో తడిస్తే ఎంత బావుంటుందో అని ఆమె అంటే 'ఆశపోతు' అంటూ తలమీద మెట్టుతూ నవ్విన చే ముఖం ఆమెకు గుర్తుకువచ్చింది. ఆ రోజు అతని ముఖం ఎంత అందంగా ఉండింది? తన బిడియం పక్కన పెట్టి........... ఆ ముఖాన్ని తన ముఖానికి అదుముకుని తనలో కలిపేసుకోవాలన్నంత కోరికను పుట్టించిన అందం. అంతా ఆ కళ్ళలోని నిజాయితీ. నవ్వులోని స్వచ్ఛత. ఎంత బయాలజీ చదివినా ఎక్కడా ఏ పుస్తకంలోనూ రాయలేదే, మనిషికి అందం వ్యక్తిత్వంలోంచి వస్తుందని. అదే చే. కాదు కాదు......... చైతన్య. లంచం అడుగుతూ. ఎంత అసహ్యంగా ఉంది ఆ ముఖం. తలుచుకుంటేనే ఒళ్ళు కంపరమెక్కింది. ఆమెకు వివేకానందతో అతను తన క్లినిక్‌కు వచ్చినప్పుడు మరి ఆ ముఖంలో అంతటి మార్పు కనిపించలేదే? మళ్ళీ మళ్ళీ గుర్తుకు చేసుకుంది రాధిక 'జూనియర్' అంటూ అతడు వీవాను తనకు చూపిస్తున్నప్పుడు, 'క్లాసులో ఫస్ట్' అని వాడి గురించి గొప్పగా చెబుతున్నప్పుడు. ఒక ఆప్తమిత్రుడు, ఒక మురిసే తండ్రిగా మాత్రమే అతడినిని చూసింది....కాబట్టి అందంగానే కనిపించాడు. కానీ లంచగొండిగా మాత్రం అదే ముఖం కఠినంగా కనిపించింది. ***అసలు రూపం తెలియనతవరకూ ప్రతిమనిషీ మంచివాడేనా?***

అసలు అలా ఎలా మారిపోతాడూ మనిషి? ఈ ప్రశ్నకు సమాధానమూ చెనే చెప్పాడు............ ఆ అక్షయ తృతీయ రోజున సింహాచలం గుడి క్యూలో..... సంవత్సరం మొత్తం చందనం చాటున దాచిన లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాన్ని ఆ ఒక్కరోజే పన్నెండు గంటలపాటు నిజరూపదర్శనం కోసం చూడనిస్తారని చెప్పి ఆ దర్శనంలో కోరుకున్నదేదైనా తప్పకుండా తీరుతుందని చైతన్యను పట్టుపట్టి గుడికి తీసుకువెళ్ళింది రాధిక.

"రాధీ......... ఆ భంగిమను ఏమంటారో తెలుసా?"

"ష్‌గుడిలో ఏంటా మాటలు..........చెంపలేసుకో" అతనెవరి గురించి కామెంట్ చేస్తున్నాడా అని నమస్కారంలో నొక్కుకున్న చేతివేళ్ళకు అటూ ఇటూ చూసింది రాధిక.

"అబ్బా........నేనేం తప్పు మాట అనట్లేదు. అదిగో ఆ దేవుడు నిలుచున్న పొజిషన్‌ను మన ఆర్కిటెక్చర్‌లో త్రిభంగ అని......." అతని మాటలు గుడిగంటల్లో జనం రొదను తట్టుకుంటున్నా ఆమె వినే ఉద్దేశ్యంలో లేదు. మూర్తి దర్శనం కోసం కళ్ళు విప్పార్చుకుని చూస్తోంది. భక్తులందరినీ త్వరత్వరగా కదలమంటున్నారు క్యూకు అటూ ఇటూ ఉన్న గార్డులు. ఆమెకు ఇంకొన్ని అడుగుల దూరంలోనే ఉన్నా జనం మధ్యలోంచి ఆమెకు ఏమీ సరిగా కనిపించడం లేదు. తనకంటే ఐదు అంగుళాలు పొడవున్న చె అంటే ఆమెకు విపరీతమైన కోపం వచ్చింది. దేవుడు ఈ క్షణమే అతడి ఎత్తును తనకూ తన పొట్టితనాన్ని అతనికీ ఇచ్చేయకూడదా అనుకుంది.

"పోనీ....నేను ఎత్తుకోనా?" ఆమె ఆలోచనను పసిగట్టినట్టు వంగి గుసగుసలాడాడు చే. ఇక మాట్లాడొద్దన్నట్లు మోచేత్తో అతని డొక్కలో పొడుస్తూ...... తనకొచ్చిన మంత్రాలను మననం చేసుకుంటూ దర్శనం చేసుకుంది రాధిక. *దేవుడు దగ్గరకు వెళ్ళిన ప్రతివాడూ తప్పకుండా ఏదో ఒకటి కోరుకోవాలనే అనుకుంటాడు. కానీ అదేమి విచిత్రమో చాలా సార్లు తాము కోరుకోవాలనుకున్నదేమిటో లిప్తపాటు మరచిపోతారు. అది కావాలా? ఇది కావాలా? అదీ ఇదీ కావాలా? తేల్చుకునే అయోమయంలోనే భక్తి పోయి ఆశ పుట్టుకొస్తుంది.*

"సో హ్యాపీనా" క్యూలోంచి బయటపడుతూ అంతసేపూ జనం మధ్య ఉక్కపోసేసి వంటికి అతుక్కుపోతున్న చొక్కాను గాలికి సర్దుకుంటూ అడిగాడు చైతన్య

"చాలా" అతని ముఖంలోకి తృప్తిగా చూసి నిశ్శబ్దంగా పెదవులు విచ్చుకుంది రాధిక.

"ఏయ్ ఏయ్.. అలానే నవ్వుతావా ఇంకోసారి.......... కావాలంటే మళ్ళీ ఇదే క్యూలో వస్తాను"

"చాల్లే ఊర్కో.......... హహ....... ఏమిటా బొట్టు? కుంకుమ పెట్టుకోవడం కూడా రాదా?"

"ఆc............ నా కేమైనా రోజూ ఇదే పనా..." విసుగ్గా నుదురు తుడిచేసుకోపోయాడు చైతన్య. ఆమెకోసం వచ్చాడు కానీ అతడికి దేవుడూ, గుళ్ళూగోపురాల్లో అట్టే నమ్మకం లేదు. అలా అని అపనమ్మకమూ లేదు. 'నేను ఎథిస్ట్‌ను కాను.... ఆగ్నోస్టిక్‌ను' అని చెప్పుకుంటాడు......... కాస్తంత ఎవ్వరైనా దేవుడి ఊసెత్తితే. అతడితో వాదన పెట్టుకోకుండా......... అతడు తుడిచేసుకున్న కుంకుమను తన చున్నీతో మరింత చక్కగా తుడిచేసి, ఇంటికి తీసుకెళ్ళడానికి గుడిలోంచి తాను తీసుకున్న కుంకుమలోంచి ఒక చుక్క అతడి కళ్ళమధ్య అద్దింది.

"ఇదేంటి....నువ్వే తుడిచేసి.........మళ్ళీ నువ్వే దిద్దుతున్నావ్"

"అబ్బబ్బ............ఎప్పుడూ ఏదో ఒకటి అడుగుతూనే ఉంటా"

"ఆc మర్చిపోయా.... ఇంతకీ దేవుడ్ని ఏం కోరుకున్నావో చెప్పనే లేదే"

"నీకు కాస్త బుద్ధి ఇమ్మని........."

మే నెల అయినా అంతకుముందు రెండు రోజులు అకాల వర్షాలు కురవడంతో చల్లబడిన వాతావరణానికి అక్కడికి వచ్చిన భక్తులందరూ ఖాళీ దొరికిన చోటల్లా చల్లగాలులకు సేదతీరుతున్నారు. మెట్ల పక్కగా ఉన్న ఒక దిమ్మ మీదకు నడుస్తున్న రాధిక బుంగమూతి పెట్టుకుని అనుసరించాడు చైతన్య. మాట్లాడకుండా ప్రసాదాన్ని పంచుకున్నారు. ఇద్దరూ. వచ్చేపోయే మనుష్యులను చూస్తూ ఇద్దరూ ఒకేసారి పరధ్యానంలోకి క్రుంగారు. *మన చుట్టూ ఉండేవారిని గమనిస్తే మనం కూడా అందులో ఒకరిమని మర్చిపోతాం ఒకోసారి. ఎవళ్ళెవరివో ముఖాలు చిత్రంగానూ, వారి నడిచే పద్ధతి తేడాగానో వారి చూపులు బాలేవనో ఏమిటేమిటో అనిపిస్తాయి.*

"ఇంతకీ ఏమంటావ్ చే" చాలాసేపటినుంచీ అడగాలనుకున్న ప్రశ్నను ఇక దాచుకోలేనట్లు ఠపీమని అడిగేసింది రాధిక. అతడికేమీ అర్థం కాలేదు.

"అదే మొన్న అన్నావ్ కదా....... యూఎస్ కు రాను అని...." విషయం గుర్తు చేసింది ఆమె. అతని భృకుటి ముడిపడింది.

"మళ్ళీ ఏమిటి రాధీ.......... ఆ రోజే డిస్కస్ చేసుకున్నాం కదా" దాదాపు నెలరోజులుగా తమ ఇరువురు మధ్య చీటికి మాటికి తలెత్తుతున్న వివాదాస్పద విషయాన్ని తల్చుకోకూడదు అనుకున్నా అతడి మనసు అతడి అదుపు తప్పింది. ***జీవితం చాలా కఠినమైనది. కలలను అంత సులభంగా తీరనివ్వదు.*** ఇంకొన్ని నెలల్లో అతడి ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తవబోతోంది. రాధిక హౌస్ సర్జెన్సీ దాదాపు సగం పూర్తవుతోంది. ఇద్దరూ కలిసి జీవించాలి అనుకున్న భవిష్యత్తులో ఇప్పుడు రెండు దారులు ఎదురవుతున్నాయి ఇద్దరికీ. ఆమెకు ఒకదారి. అతనికి మరొకటి. చేతులు పట్టుకుని కలిసి ఒకే దారిలో వెళ్ళాలంటే ఒకరి కలకోసం వేసుకున్న దారి భగ్నం ఆమె ఇప్పుడు దైవ సన్నిధిలో కోరుకున్నది అదే.. తమ రెండు దారులూ కలిపే మార్గం చూపమని.

"నువ్వు అనుకున్నట్లేమీ కాదు.......... జస్ట్ ఒక సిక్స్ సెవన్ ఇయర్స్. తర్వాత మళ్ళీ ఇక్కడికే వచ్చేద్దాం" అతడి వేపు తిరిగి భాసిపట్టు వేసుకుని కూర్చుంది రాధిక.

"సిక్స్ కాదు సెవెన్ కాదు ఒక్క సంవత్సరం కూడా నాకు ఈ దేశాన్ని వదిలి రావాలి అని లేదు. నాకు అక్కడి లైఫ్ స్టైల్ నచ్చదు"

"అరే. అక్కడకు వెళ్ళకుండానే నచ్చదు అని ఎలా...."

"సీనియర్లు వెళ్ళినవాళ్ళు లేరా? రెలేటివ్స్‌లో కూడా కొంతమంది వెళ్ళారు. ఈ మధ్యే ఏవో కొత్త కొత్త కోర్సులు వస్తున్నాయి ఐటీ, కంప్యూటర్ లాంగ్వేజస్.... ఏవేవో చేసి వెళుతున్నారు........... నాకు జీవితంలో దగ్గరగా ఉండే జీవితం ఇష్టం. వారానికో సినిమా చూడాలి అనిపిస్తుంది. ఈ బీచ్ ఇష్టం. అనుకున్న వెంటనే ఇంటికి వెళ్ళి నాన్నచేత తిట్లయినా తినాలనిపిస్తుంది. జస్ట్ ఫర్ సమ్ మనీ.......... ఇవన్నీ వదులుకోలేను......."

"మనీ ఒకటే కాదు......... కెరియర్ ఒకటి ఉంది కదా"

"ఏం కెరియర్? నాకెప్పుడూ పెద్ద పెద్ద డ్రీమ్స్ లేవు. టాప్ కంపెనీ ఎక్సిక్యూటివ్ అవ్వాలనీ, పెద్ద ఎంటర్ప్రెన్యూరింగ్ చెయ్యాలనీ నాకెందుకో ఎప్పుడూ అనిపించలేదు. అదేమైనా తప్పా? నాకు చేతనైనంతలో మా పేరెంట్సుకు, నా ఫ్యామిలీకి కంఫర్టబుల్ లైఫ్ ఇచ్చేందుకు నేను ఇక్కడే ఏదో జాబ్ చూసుకోగలను. అయామ్ ష్యూర్ అబౌట్ దట్..... ఏం అలా బ్రతకాలి అనుకోవడం తప్పా?"

అతనికి మరింత దగ్గరగా చేరి అతని చేతిమీద తన చేతిని నొక్కింది రాధిక.

"తప్పు అని నేనెక్కడన్నాను చే. బట్ నువ్వు ఊహిస్తున్నదానికంటే బెటర్‌గా క్వాలిఫై అవొచ్చుకదా నువ్వు ఓ పెద్ద యూనివర్శిటీలో ఎం.ఎస్ చేస్తే. నువ్వే చెప్పు......... అప్పుడు మీ పేరెంట్స్‌ను నువ్వు ఇంకా బెటర్‌గా చూసుకోవచ్చు. పోనీ పేరెంట్స్ ఫ్యామిలీ పక్కన పెట్టు.... నువ్వు సొసైటీకు ఎన్నో మంచి పనులు చేయాలి అనుకుంటావ్ కదా. నువ్వు బెటర్ పొజిషన్‌లో ఉంటే అవి ఇంకా బాగా చెయ్యొచ్చు కదా"

"సొసైటీ నుంచీ దూరంగా వెళ్ళిపోయి సొసైటీను బాగు చెయ్యడమా........ ఫన్నీ" అతడు వెక్కిరింతగా నవ్వాడు. ఆమె భంగపడింది.

"అది కాదు రాధీ. నాలుగు డబ్బులు ఎక్కువ సంపాదించి తర్వాత ఇక్కడి పేదవాళ్ళకు, గతిలేనివాళ్ళకు దానం ఇవ్వడం, ఛారిటీల్ స్థాపించడం ఇదేనా 'సొసైటీ'ను బెటర్ చెయ్యడం అంటే.."

"ఏం కాదా?" సూటిగా చూసింది ఆమె.

"కాదు అనట్లేదు. దట్స్ జస్ట్ ఎ మైనర్ థింగ్. అడుక్కునేవాడికి రోజూ రూపాయి ఇవ్వడం కంటే అసలు వాడిని అడుక్కోకుండా చెయ్యడం అసలైన ఛాలెంజ్. నువ్వు దానం చేస్తే ఏదో ఉద్ధరించానని నీ ఈగో సాటిస్ఫై అవుతుందేమో కానీ అసలు సమస్య నశించిపోదు. ఈ విషయం నీకూ తెలుసు. మళ్ళీ ఏమిటి ఈ ఆర్గ్యుమెంట్స్?

"నో నో...... లెటజ్ ఆర్గ్యూ. నథింగ్ రాంగ్. కన్విన్స్ మీ. అసలు ఏం చేద్దాం అనుకుంటున్నావ్ నువ్వు"

"ఇంతవరకూ ఎప్పుడూ చెప్పలేదా నేను?" బాధపడ్డాడు చైతన్య. రాధిక మొండిగా చూసింది "చాలాసార్లు చెప్పావనుకో. కానీ అది వేరు. ఇప్పుడు లైఫ్, ఫ్యూచర్ నిర్ణయించుకునే టైం. సో నువ్వు ఇప్పుడు చెప్పేవే ఫైనల్. చెప్పు"

ఆమె మొండితనం చూసి అతనిలోని మొండితనమూ చిక్కబడింది.

"నీకు లోకం తెలీదు రాధీ.........అలా చూడకు........... నేను నిజం చెబుతున్నా. ఎప్పుడూ మీ నాన్న నీకే ప్రాబ్లం లేకుండా అన్నీ అరేంజ్ చేసి పెట్టారు. నువ్వు బ్రిలియంట్ స్టూడెంట్‌వే. కాదనను. కానీ నువ్వు నీ సబ్జెక్టు పుస్తకాలు తప్పించి ఏం చదువుతావ్? మన రాష్ట్రంలో, దేశంలో రాజకీయాలు ఎలా అయిపోతున్నాయో తెలుసా నీకు? మన కల్చర్ ఎలా నాశనం అవుతోందో గమనించావా? మన చుట్టూ ప్రతిచోటా ఎంత 'ఎక్స్‌ప్లాయిటేషన్' ఉందో నీకు తెలుసా? ఎప్పుడో అక్కడక్కడా న్యూస్ పేపర్లలో చిన్న బిట్ వార్తలు చదవడం కాదు. మా ఊరిలో ఇప్పటికి కూడా నీళ్ళ ట్యాంకుల కోసం బారులు తీరే జనాలున్న కాలనీలు ఉన్నాయి నేను చిన్నగా ఉండేప్పుడు......... మా అమ్మకూడా అలానే క్యూలో నిలుచుని ప్లాస్టిక్ బిందెల్లో నీళ్ళు తీసుకొచ్చేది. మా ఫ్యామిలీ కాస్తంత ఆర్థికంగా నిలదొక్కుకుని బెటర్ ఇల్లు తీసుకోవడానికి పదేళ్ళు పట్టింది. ఈ వేళ ఆ కాలనీల్లో బిందెలు పట్టుకు తిరుగుతున్నవాళ్ళు కూడా ఒక పదిపదిహేనేళ్ళ తర్వాత మాలాగ కాస్తంత బెటర్ పొజిషన్‌లో ఉండొచ్చు. ఉండకపోవచ్చు. కానీ, వాళ్ళ స్థానంలో వేరే జనం నిలబడతారు నీళ్ళకోసం క్యూల్లో. నువ్వు అన్నట్లుగానే............ మా ఊర్లోనూ సొసైటీ కోసం మంచి పనులు చేసే గొప్పవాళ్ళూ ఉన్నారు. ఒక పెద్దమనిషి.. అతనికి సినిమా థియేటర్లూ, జ్యువెలరీ షాపులూ, షాపింగ్ కాంప్లెక్సూ ఉన్నాయి. అతడే కొన్ని కాలనీలకు ట్యాంకుల్లో నీళ్ళు పంపిస్తాడు, తన స్వంత ఖర్చుతో. అమెరికాలో సెటిల్ అయిన ఇద్దరు ఎన్నారైలుకూడా ఉన్నారు మా ఊరినుంచి. ఒకరు..... గుడి కట్టిస్తే...... ఇంకొకరి ధర్మమా అని చుట్టుపక్కల మూడు పల్లెటూళ్ళలో స్కూళ్ళు వెలిసాయి.."

"ఎగ్జాట్లీ.... సీ........... అదే నేను చెప్పేది.... మనం కూడా అలానే....." రాధిక కళ్ళు మెరిసాయి.

"ష్.......... నన్ను చెప్పనీ! ఆ మాత్రం చిన్నపాటి దయ చూపేందుకు ఆ మనుష్యులకు కావల్సినన్ని ఆస్తులు, వనరులు సమకూర్చుకోవడానికి ఒక జీవితం పట్టింది. ఆ ఎన్నారై చేయిస్తున్న మంచి పనుల్లో, మధ్యలో డబ్బులు స్వాహా చేసిన వాళ్ళూ ఉన్నారు. నిజానికి.... వాళ్ళెవ్వరూ ఇవేవీ చేయనక్కరలేదు. అవును. ఎందుకు చేయాలి? సమాజంలో అందరికీ మంచినీరు ఇవ్వడం గవర్నమెంటు బాధ్యత"

"కమాన్...........చే.......లెట్స్ టాక్ ప్రాక్టికల్" ఎన్నో సార్లు అతడినుంచి ఇలాంటి వాదనలు విని, తాము ఏ రకంగానూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి గురించి అతడు మళ్ళీ చెప్పబోతున్నాడని ఆమె ఆందోళన కలిగింది.

"ఏం నేనేమైనా గ్రహాంతరవాసుల గురించి మాట్లాడానా? మీ ఇంట్లో ఒక పనిమనిషిని పెట్టుకున్నావనుకో....... ఆ మనిషి సరిగా పని చేయకపోతే ఏం చేస్తాం? నెలనెలా ఆ మనిషికి జీతం ఇస్తూ........ ఆ పైన నీ పనులు మళ్ళీ నువ్వే చేసుకుంటూ, దానికోసం నీ జీవితం కాస్తంత త్యాగం చేసుకుని కష్టపడతావా? అప్పుడు అది ఛారిటీ అవదు........ స్టుపిడిటీ అవుతుంది. ఇదీ అంతే. ఈ గవర్నమెంట్ మనం అందరం కలిసి నియమించుకున్న పనిమనిషి. ఎంత కాదు అనుకున్నా... మనం అంతా దానికి జీతాలు ఇస్తున్నాం. ఇప్పుడు ఈ గుడికి మనం వచ్చినందుకు......... నేను వాడిన బైకు కొన్న డబ్బుల్లో కొంచెం, రోడ్ టాక్స్‌లో కొంచెం, దారిలో మనం త్రాగిన కూల్‌డ్రింకుల్లో కొంచెం, ముఖం కడుక్కునేందుకు కొనే సోపుల్లో, మనం వేసుకున్న బట్టల్లో....... అన్నిటిలోని టాక్సులు కట్టి మరీ ఈ

సోకాల్డ్ గవర్నెన్స్ బాడీను పోషిస్తున్నాం. ఈ డబ్బులన్నిటినీ సక్రమంగా ఉపయోగించి వాళ్ళు చెయ్యాల్సిన డ్యూటి చేస్తే....... ఇంకొకరెవ్వరో....... ఎన్నారై ఆర్ ఎనీ రిచ్ ఫెలో వచ్చి ఇలాంటి సంఘ సంస్కరణ, దేశోద్దారణ చెయ్యాల్సిన అవసరమే ఉండదు. మా ఊరి ఎమ్మెల్యే కానీ, చివరకు మున్సిపల్ కమీషనర్ కానీ సరిగ్గా తల్చుకుంటే వారంరోజుల్లో ఊరందరికీ మంచినీళ్ళు వస్తాయి. కానీ జరగదు. ఎందుకంటే ఎన్నెన్నో అక్రమాలు... కరప్షన్స్...." అతని మాటతీరులో ఆవేశం పెరిగింది.

"ఐ హావ్ హర్డ్ ఆల్ దిజ్ మెనీ టైంస్. కానీ మనం ఏం చేస్తాం? ఏం చేయగలం?" ఆమె గొంతులో చిరాకు దాగలేదు. అయినా అతను పెద్ద పట్టించుకోలేదు.

"ఏం? ఎందుకు ఏమీ చేయలేం? అమెరికానో ఇంకో దేశమో వెళ్ళి కోట్లు సంపాదించి ఇక్కడికొచ్చి కాస్తంత దానం చేయగలిగేంత దూరం ఆలోచించేదానివి..... ఇక్కడే ఉండి ఈ ప్రజలకోసం పోరాడో, రెప్రజెంట్ చేసో అంతకంటే ఎక్కువ మంచి పనులు చేయొచ్చు కదా"

"దట్స్ నాట్ మై జాబ్. ఒకవేళ చెయ్యాలని ఉన్నా నాకు అలాంటి అడ్మినిస్ట్రేటివ్, రెప్రజెంటేటివ్ వ్యవహారాలు తెలియవు. ఓకే... చేతకావు. అది నా తప్పా? నేను చదువుకున్నది మెడిసిన్......... నాకు తెలిసేది వైద్యం చేయడం ఒక్కటే........ ఇంకేమీ కాదు"

"ఎస్కేపిస్ట్‌లా మాట్లాడకు. వీధిగూండాలూ, అక్షరం ముక్క రానివాళ్ళందరూ నాయకులూ, మంత్రులూ అయి చేస్తున్న పనులు.......... మన దేశంలో చదువుకున్న ఏ మనిషీ చేయలేనంతవేమీ కావు. అందరూ పోటీలు పడి రాంకులూ పర్సంటేజీలు సంపాదిస్తున్నామే. ఆ తెలివి అంతే కేవలం మన జీతం డబ్బులకోసమేనా? ***కష్టపడటం ఇష్టం లేనప్పుడు చేతకాదు అని తప్పించేసుకోవడం చాలా సులభం"*** చాలా అసంతృప్తిగా ఆమె కళ్ళలోకి చూడలేనట్లు ఆమె నుంచి చూపు మరల్చుకున్నాడు.

ప్రతిరోజూ తప్పని అస్తమయంలోకి విధిలేక జారుకుంటున్నాడు సూర్యుడు. ఆకాశంలోకి నిరాశలా పుట్టుకొస్తోంది చీకటి.

"సో........ ఇప్పుడు ఏం చేస్తావ్....... ఇక్కడే ఉండి ఏ తీవ్రవాదివో, నక్సలైటువో అయ్యి పోరాటం చేస్తావా? చే........ నువ్వు చేగువేరా అలా అంతా చదివి ఇన్స్పైర్ అవడం.. అది తప్పు కాదు. బట్ కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించు. నువ్వొక్కడివే ఇలాంటి వ్యవస్థను మార్చలేవు కదా"

"థౌజండ్ టైంస్ చెప్పి ఉంటాను. ఉయ్ డోంట్ నీడ్ టెర్రరిజం హియర్. ఏ గన్నూ, హింసా అవసరం లేదు. మనం ఉన్నది డెమోక్రసీ ఉన్న దేశంలో. పోరాడేందుకు ఇక్కడ నియంత ఎవడూ లేడు... జనమే ఇక్కడి విలన్స్. అవును.

అంతా జనం చేస్తున్నదే. ఎవ్వడూ ఏమీ చెయ్యడు కానీ అంతా బావుండాలి అనుకుంటాడు. నాకు చేతైనంతలో ..... మా ఊరికో లేక వీధికో రెప్రజెంటేటివ్ అయి గవర్నమెంట్ ద్వారా జరగాల్సిన పనులన్నీ ప్రజలకు అందేట్లు చేయగలిగితే చాలు. అదే నా సక్సెస్. ఇవ్వాళ నేను ఒక్కడే కావొచ్చు....... కానీ మన దేశంలో ఎందరో నాకంటే ఎక్కువ చదువుకున్నవాళ్ళూ, ఎక్స్‌పోజర్ ఉన్నవాళ్ళూ ఉన్నారు.

ఖచ్చితంగా వాళ్ళలో కొందరైనా నాలా ఈ డ్యూటీ తీసుకుని...." ఇక మాటలు రానట్లు ఉద్వేగంతో అతడి గొంతు పూడుకుపోయింది. మామూలుగా అయితే ఇలాంటి సందర్భాల్లో ఆమెకు అతడంటే ప్రేమ వెల్లువికేది. అతడిని గాఢంగా హత్తుకోవాలి అనిపించేది. కానీ ఈ వేళ ఆమెలో ఏదో గజిబిజి. గుండె అంతా బరువైన వాక్యూం నిండినట్లు తోచింది. ఉన్నత ఆశయాలు ఆకాశంకంటే అందని ఎత్తులో ఉంటాయి. రాధిక మనసులో ఎన్నెన్నో ఆలోచనలు, భయాలు. ముళ్ళను మోస్తున్నట్లు అనిపించింది.

"బట్ అయామ్ వెరీ డిసప్పాయింటెడ్ రాధీ. నీకు ఇవన్నీ నాతో ఉన్న ఈ మూడు సంవత్సరాలుగా తెలుసు. నేనేమిటో నా ఐడియాస్, ఐడియల్స్ ఏమిటో తెలుసు. ఎన్నిసార్లు ఎంకరేజ్ చెయ్యలేదు. కానీ తీరా ఇప్పుడు లైఫ్‌లో మనం మాట్లాడుకున్నవి చేయాల్సిన టైం వచ్చేసరికి నువ్వు ఇలా మాట్లాడడం........"

ఆమె కళ్ళల్లో నీళ్ళు ఊరుతున్నాయి. చుట్టూ జనం, దూరంగా గుడిలో దేవుడు. ఇక్కడ బలహీనపడకూడదని కళ్ళు నొక్కేసుకుంది.

"ఏమో చే. అప్పుడు అంతా ఇవి జరుగుతాయేమో అనిపించాయి. కానీ ఇప్పుడు ఆలోచిస్తుంటే..........అసలిదంతా జరిగే పనేనా అనిపిస్తోంది. ఓ.కే............... నీ కాన్ఫిడెన్స్ నేను కాదు అనను. మే బీ నువ్వు అన్నట్లు నాకు నిజంగా లోకం తెలియకపోవచ్చు. నువ్వు చెప్పినవన్నీ నువ్వు అఛీవ్ చేస్తే నాకు మాత్రం సంతోషం, ప్రౌడ్ కాదా? బట్..... ఇప్పుడు నా కెరియర్ ఏంటి? ఇక్కడికంటే అడ్వాన్స్‌డ్... మెడికల్ సిస్టమ్ ఉన్న కంట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలి అనుకుంటున్నాను...... "

"చెయ్.. ఎవరు వద్దన్నారు? అప్పుడు నాకూ గొప్పే కదా. మా రాధి ........ పేద్ద డాక్టరు......" అతని ముఖంలో నవ్వు తన్నుకొచ్చింది.

ఆమె కళ్ళు మాత్రం మరింత ఎర్రబడుతున్నాయి.

"కానీ ఎలా? యూ ఎస్‌కు వెళ్ళాలి అంటే మా ఇంట్లో అంత సులభంగా పంపించరు. నాకు ఖచ్చితంగా పెళ్ళి చేసే ఎవరో ఒకరి ప్రొటెక్షన్‌లో ఉంచి కానీ అలా వదిలెయ్యలేరు కదా! నువ్వేమో యూ ఎస్ రాను అంటున్నావ్. ఎలా మరి......"

కొన్నిరోజులుగా ఆమె చెపుతూ వస్తున్న సమస్యే అయినా ఈ సారి ఆమె గొంతు తీక్షణతతో వణకడం అతను పసిగట్టాడు. అతనికీ మెల్లగా అవగతమవుతోంది. ఇప్పటి చిన్న నిర్ణయాలు జీవితాన్ని అమాంతం మార్చివేయగలవని. ***పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదు. కానీ నచ్చే పరిష్కారం దొరకడం చాలా కష్టం.*** అతడికిప్పుడు మూడు దారులు స్పష్టంగా తోస్తున్నాయి. ఒకటి ఆమె అమెరికాలో చదువు త్యాగం చేసుకుని ఇక్కడే ఉండిపోయి, తనూ - ఆమె ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించుకుని కలిసి ఉండడం. రెండు: తన ఆశయాలు వదులుకుని, ఆమెను పెళ్ళిచేసుకుని ఆమెతోనే జీవితం అనుకుంటూ తనూ విదేశాలకు వెళ్ళడం. మూడు ఒక ఏడెనిమిదేళ్ళు ఎవరి భవిష్యత్తును వారు వెదుక్కుంటూ పయనించి కలిసి ఉండే విషయం ఆ తర్వాత ఆలోచించడం. ఏడెనిమిదేళ్ళ ఎడబాటు అంత సామాన్య విషయం కాదు అని ఇద్దరికీ తెలుసు.

***ప్రేమకోసం యుగాలయినా వేచి ఉండొచ్చు అని కవులు, కళాకారులు చెప్పొచ్చుగాక, కానీ నిజానికి వచ్చే సరికి ఒక సంవత్సరమైనా......... కొన్ని నెలలైనా అనిశ్చితంగా ఎదురు చూడటం అవివేకమే.***

"నేనో మాట చెప్పనా.?" నిర్ణయానికి వచ్చినట్లు భారంగా ఊపిరి పీల్చుకున్నాడు చైతన్య. బేలకళ్ళతో చూసింది రాధిక.

"ఐ కాంట్ కాంప్రమైజ్ ఇన్ మై ఆమ్బిషన్స్. అలానే నీ ఆశలు చంపుకొమ్మని చెప్పను. ఐథింక్...... అవర్ పాత్స్ ఆర్ నాట్ టుగెదర్"

రాధిక గుండె పొలమారింది. అతను గుప్పిళ్ళు అదుముకుని ధైర్యం నిలుపుకుంటున్నాడు.

"నువ్వు అంటున్నావుగా........ థింక్ ప్రాక్టికల్ అని. ఏమో ఇప్పుడు ఆలోచిస్తుంటే, మేబీ, ఇఫ్ వి ఆర్ టు గెదర్........ నేను అనుకున్న ఏ పని చేసేప్పుడైనా నువ్వు ఇది ఇంప్రాక్టికల్, డ్రీమీ అని నిరుత్సాహపరుస్తావేమో అనిపిస్తోంది"

ఆమె మనసు మీద ఆ మాట ఒక మేకులా దిగబడింది. ఇంకా ఏం అంటాడో అని వెర్రిగా ఎదురు చూసింది.

"నా ఉద్దేశ్యంలో నీ ఫ్యూచర్ ప్లాన్స్ కూడా సిల్లీగానే అనిపిస్తాయి. ఏం ఇండియాలో చదువుకున్న డాక్టర్స్ అందరూ పనికి రారా? అక్కడెక్కడో చదువుకుంటేనే నాలెడ్జి వస్తుందా? వెల్......... ఇది జస్ట్ ఏజ్ ఎ లేమ్యాన్ టు యువర్ ఫీల్డ్ నా అభిప్రాయం. కానీ నువ్వు చెబుతున్నావు అంటే నీకే నాకంటే ఎక్కువ తెలిసి ఉంటుంది కదా నీ మెడికల్ ఫీల్డ్ గురించి. కానీ రాధీ.... కొన్నేళ్ళు అక్కడ చదువుకుని తిరిగి వచ్చేస్తాను అనుకునే నీ నిర్ణయం ఆ కొన్నేళ్ళ తర్వాత మారదని ఏమిటి? ఎంతమందిని గురించి వినలేదు. ఇలానే వెళతారు..... తిరిగొచ్చి ఇక్కడే ఉండి దేశాన్ని ఉద్ధరిస్తాం అని. కానీ అలా వచ్చిన వారిని వేళ్ళమీద లెక్కబెట్టొచ్చు.

మనం ఎంత కాదనుకున్నా అందరం స్వార్ధపరులమే. ఆఫ్ట్రాల్ హాలీవుడ్ సినిమాల్లో చూస్తేనే అనిపిస్తుంది.......... ఛ...... ఇక్కడిదీ ఒక బ్రతుకేనా అని...... వాళ్ళ రోడ్లు, రైళ్ళు, లైఫ్ స్టైల్, వాతావరణం అంత మోజును కలిగిస్తుంది. కొన్నాళ్ళు ఆ జీవితానికి అలవాటు పడ్డాక ఇక్కడికి వెనక్కు రావడం అనుకునంత సులభం కాదేమో. లేదు లేదు......... నీ విల్‌పవర్‌ను నేను అనుమానించడం లేదు. నేనైనా అలానే ఆలోచిస్తాను.......... సో....... ఇవన్నీ చూస్తుంటే....... మనం కలిసి ఉండడం ఈజ్ హైలీ ఇంప్రాక్టికల్ అండ్ ఇంప్రాబబుల్ అని......"

ఆమె వెక్కిళ్ళు వినిపించి ఉలిక్కిపడి చూసాడు అతను. ఆమె ముఖం అరచేతుల్లోకి నొక్కుకుపోయి ఉంది. ***ఆడదానికి అదొక అదృష్టం, అనుకున్నప్పుడు ఏడవగలదు.*** వర్ణించలేని కళ్ళతో ఆమెను అసహాయంగా చూస్తూ దగ్గరకు చేరాడు చైతన్య.

"ఈ మాట నేనేమీ ఈజీగా చెప్పెయ్యడం లేదు రాధీ. నువ్వు ఏడవగలుగుతున్నావ్. నాకు ఆ స్వాతంత్ర్యం కూడా లేదు. నిజానికి నీకంటే ఎక్కువ, నన్నే బాధిస్తుంది ఈ నిర్ణయం. నువ్వేమో వేరే దేశంలో ఉంటావు. రోజుకు గంటలు గంటలు చదువు, పని. కానీ నేను ఇక్కడే...... ఈ ఊరు, గాలి, సముద్రం ప్రతిదీ నిన్నే గుర్తు చేస్తాయి......."

"మరి ఎందుకు ఇలా మాట్లాడుతున్నావ్. మనకు ప్రాబ్లం వస్తే మనం అనేదే లేకుండా చెయ్యడం సొల్యూషనా? వాట్ నాన్సెన్స్" ఆమె మాటతోనే కొట్టినంత పని చేసింది.

"సరే.. పోనీ నువ్వు చెప్పు వేరే సొల్యూషన్ ఏంటో... ఐ థింక్ వి ఆల్రెడీ మేడ్ ఎ మిస్టేక్. ముందే ఇవన్నీ ఆలోచించుకోకుండా ఏవేవో పిచ్చి కలలు కన్నాం."

"వాట్....... మిస్టేకా? పిచ్చి కలలా? అసలు నీకు బుద్ధి ఉందా? ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా?" ఆమె శరీరం ఒక రకమైన ఉన్మాదానికి లోనయ్యింది. తాము ఇద్దరూ కలిసి వెళ్ళాలి అనుకున్న ప్రదేశాలు, చేయాలి అనుకున్న గొప్ప పనులు, ఊహించుకున్న చిలిపి సరదాలు, కట్టుకున్న ఇల్లు, కనాల్సిన పిల్లలు....... అన్నీ అన్నీ ......... కురిసిపోయాక ఇగిరిపోతున్న మేఘాల్లా మాయమైపోతున్నట్లు అనిపించాయి ఆమెకు "అడ్డమైన ఫిలాసఫీలు, పుస్తకాలు చదివి నీ బుర్ర బూజుపట్టింది. విడిపోవడం, మరచిపోవడం అంత సులభం అనుకుంటున్నావా? వేరే మనిషితో నేను ఉండగలనా?"

"ఖచ్చితంగా ఉంటావు" ఆమెలా ఆవేశపడిపోకుండా స్థిమితంగా చెప్పాడు చైతన్య. తానేం విన్నదో నమ్మలేకపోయింది రాధిక.

"నువ్వు ఒప్పుకోవచ్చు. కాని దిసీజ్ ట్రూ. ఒక మనిషి లేకపోతే ఒకరు ఉండలేకపోవడం అనేది ఒట్టి ట్రాష్. మనం జీవితంలో మొట్టమొదట ప్రేమించేది, ఎప్పటికీ ప్రేమించేది అమ్మా నాన్నలను. వాళ్ళు చచ్చిపోతే కూడా మనం బ్రతుకుతాం. ఒకే..... సపోజ్. ఈ ఆర్గ్యుమెంట్స్ ఏమీ లేకుండా......... రేపు నేను ఏ బస్ కిందో పడి చచ్చిపోయాను అనుకో....."

"స్టాపిట్ చే."

"నో.....చెప్పనీ......... ఏం అలా జరగకూడదా... ఎప్పుడైనా ఎవ్వరికైనా ఏమయినా జరగొచ్చు. ఏ బస్ దిగుతున్నప్పుడో నేను క్రిందపడి........"

సోడాబుడ్డి కళ్ళజోడేసుకున్న ప్రవీణ్ అమీబాలా ఆమె జ్ఞాపకాల్లో విలవిల్లాడాడు.

" నీకు అసలు ఏం మాట్లాడాలో తెలియదు. మూర్ఖుడివి నువ్వు.." అతడి పక్కన ఉండబుద్ధికాక గబుక్కున లేచేసి వడివడిగా మెట్లు దిగడం మొదలెట్టింది.

హఠాత్తుగా ఆమె తనను అలా వదిలి వెళ్ళడం అతని ఆశ్చర్యం అనిపించింది. వెళ్ళి సర్ది చెబుదాం అనుకున్నాడు. కానీ అతనికీ బాధగానే ఉంది. ఎక్కడకు వెళుతుందో చూద్దాంలే అనుకున్నాడు. మొండిగా అక్కడే కూర్చుండిపోయాడు. ఒక్కొక్క అడుగుకూ వేల వేల

ఆలోచనలు చేసింది రాధిక. అతను కావాలి. కానీ.... అతనిలో నిరాశ ఒద్దు. అసలెలా మారిపోయాడు. అసలు మార్పు ఎలా వస్తుంది. తట్టుకోలేక మళ్ళీ వెనక్కు వెళ్ళి ఆమాటే అడిగింది.

"తప్పదు రాధీ. మారాలి. మార్పు లేకపోతే మనిషే లేడు. నువ్వూ మారాలి" ఈసారి ఆమె పక్కన నడుస్తూ మెట్లు దిగాడు అతను.

"మారని మనిషి బండరాయితో సమానం. అభిప్రాయాలు, ఇష్టాలు అన్నీ మారుతాయి. చిన్నప్పుడు మా మాస్టార్లను చూసి పెద్దయ్యాక వీళ్ళంత తెలివైనవాడిని అయితే చాలు అనుకున్నాను. కొన్నేళ్ళు పోయాక..... ఆ మాస్టర్లు అలానే ఉన్నారు. నేను చదివినదానికన్నా వాళ్ళు చదివిందే చాలా తక్కువ అనిపించింది. ఓస్...... ఆఫ్టాల్ వీళ్ళను ఇమిటేట్ చెయ్యాలి అనుకున్నానా అని నా చిన్నతనం నాకే నవ్వొస్తుంది. ఏదైనా అంతే........ ఈ రోజు వెనక్కు చూసుకుంటే కొన్నేళ్ళ క్రితం నాటి మనం మనకే స్టుపిడ్‌గా కనిపిస్తాం. భవిష్యత్తులోనుంచి చూసుకోగలిగితే ఈనాటి మనకెంతో ముఖ్యం అనుకున్నవి అర్థరహితం అనిపించొచ్చు.... వి ఆల్ ఛేంజ్......... ఆఫ్ కోర్స్... మన బేసిక్ నేచర్, వ్యక్తిత్వం మారదు అనుకో......" అతను చెబుతుంటే చెవులు అప్పగించుకుని వింటూ గుడి నుంచి బయటపడింది రాధిక. అదేమిటో అతను చెప్పేది ఒప్పుకోకూడదు అనుకున్నా ఒప్పుకోకుండా ఉండలేకపోతోంది. కొన్నాళ్ళ క్రితం ఎప్పటికీ మారకు అన్న ఇతనే మారిపోవాలి అంటున్నాడే

"మరి అలా అయితే........సొసైటీ గురించి నీ అభిప్రాయాలు, అమెరికాకు రాకూడదు అన్న నీ నిర్ణయం కూడా మారొచ్చుగా......" అమాయకంగా అడిగింది.

అతను నవ్వేసాడు. అంతే.

"కానీ ఇలా అయిపోతావు అని ఎప్పుడూ అనుకోలేదు"

"నేనూ అనుకోలేదు. కానీ....... యస్..... ఇట్ హ్యాపెన్డ్"

"ఏం అయినా మనిషి అసలు వ్యక్తిత్వం మారదు అన్నావుగా. మరి...... ఇదేమిటి? కరప్ట్ గవర్నమెంట్ నుంచి జనాన్ని రక్షించాలి...... అదీ ఇదీ అని. నువ్వే ఈ వేళ ఒక కరప్ట్‌గా......." ఎంత దాచుకుందాం అనుకున్నా ఆమె గొంతులో కాస్తంత అసహ్యం పెల్లుబికింది. టీవీలో లంచం అడుగుతూ కనిపించిన అతడి ముఖం పదే పదే గుర్తుకువస్తోంది. కాస్త మాసిన గడ్డంతో, నిద్రలేని కళ్ళతో ఓడిపోయిన మనిషిలా ఉన్నాడు అతను. "అతను చాలా హానెస్ట్ అని ఎన్నోసార్లు చెప్పావ్....... అయినా 'పాపం' నువ్వేం చేస్తావులే, నేనుకూడా ఒకప్పుడు ఇద్దరు ముగ్గురిని కంప్లీట్‌గా రాంగ్ ఎస్టిమేట్ చేసి మోసపోయాను" ప్రొద్దున ఆ న్యూస్ క్లిప్ చూసాక రెండుమూడుసార్లు అన్నాడు రాజు. చే వ్యక్తిత్వం ఇలా బజారున పడటం అతను వెక్కిరిస్తున్నాడో, సంతోషిస్తున్నాడోకానీ, తను చే గురించి పూర్తిగా మోసపోయానని అతడు సానుభూతి చూపితే మాత్రం తట్టుకోలేకపోయింది. ఇక ఎప్పటికీ చైతన్య ముఖం చూడకూడదనిపించింది. కానీ వివేకానందతో తన బాధ్యత గుర్తుకువచ్చింది. కేవలం వృత్తిపరంగా తాను డాక్టరు అతను ఒక పేషెంట్ తండ్రి. అంతే అనుకుంది. కానీ సాయంత్రం కాకుండానే అతడే ఫోన్ చేసి......... ఆమెతో చాలా చెప్పాలి అని........ ఎలాగైనా కలుద్దామని అని ఆర్థంగా అడిగేసరికి.......కాదనలేకో, కుతూహలం అదుపు చేసుకోలేకో అతడు రమ్మన్న రెస్టారెంట్‌కు వెళ్ళింది. అతడితో తనను ఇప్పుడు ఎవరైనా చూస్తే ఏమీటనే బెరుకు లేదు ఆమెలో ఇప్పుడు. అతడెందుకు అలా పతనమయిపోయాడో ఆత్రుత తప్ప.

"సో......... ఇన్నాళ్ళూ ఇలానే చేస్తున్నావా? కార్పొరేషన్‌లో ఇంజినీర్ అంటే......... కనీసం గవర్నమెంట్ సర్వీస్‌లో నిజాయితీ పనిచేస్తూ నువ్వు అనుకున్నట్లు బ్రతుకుతున్నావ్........."

"అలానే ఉందాం అనే అనుకున్నా. కానీ సిస్టమ్‌ను మార్చేలోగా సిస్టమే నన్ను మార్చేసింది" ఆమె ప్రశ్నలకు సమాధానాలన్నీ సిద్ధంగా ఉన్నట్లు టపీమని చెప్పాడు అతను. వినేందుకు తాను సిద్ధమని చేతులు ముడుచుకుని చూసింది రాధిక. వాళ్ళు కూర్చున్న రెస్టారెంట్ కిటికీ అద్దమ్మీద వెలిసిపోయిన వర్షం మిగిల్చిన తేమ మెల్లగా ఆవిరవుతోంది.

"నేను లైఫ్‌లో రెండు తప్పులు చేసాను....." అవమానమో, ఓటమిభారమే గుటకలో మింగుతూ చెప్పాడు చైతన్య." రాజీపడాల్సిన చోటపడలేదు, పడకూడని చోట కాంప్రమైజ్ అయ్యాను"

అతని మాటల్లో తాను వింటున్నది నిజాయితీనేనా అని ఆమె తనను తను ప్రశ్నించుకుంటూ వినసాగింది. *ఒక మనిషి మీద ఒక్కసారి నమ్మకం సడలితే అతడి ప్రతి చర్యా అనుమానాస్పదమే.*

"మొదటిది నీకూ తెలుసు.... నీకోసం నేను కాంప్రమైజ్ అయి ఉండాలి. బట్ ఐ వాజ్ ఎ స్టుపిడ్ దెన్"

గతం చెప్పొద్దన్నట్లు చూసింది రాధిక. అతను అర్ధం చేసుకున్నాడు.

"ఆ తర్వాత రెండు మూడేళ్ళలోనే తెలిసింది, నా సోకాల్డ్ 'ఐడియలిజమ్' ఎందుకూ పనికిరాదు. బాగుచేయలేనంతగా ఈ వ్యవస్థ చెడిపోయిందని అందులోకి దిగాకే తెలిసింది. నేను ఎంచుకున్న మార్గం, నా ఆశయాలలో నాకే నమ్మకం తగ్గింది. అసలే నిన్ను దూరం చేసుకున్నానని నేనంటే నాకే కోపం. అందుకు కారణమైన ఆశయాలంటే ద్వేషం పుట్టింది. ఐ రిపెంటెడ్ నేనంటే నాకే కోపం. ఐ రిపెంటెడ్ ఫర్ ఎవ్విరిథింగ్. అలాంటి టైంలో..... ఒక రాంగ్ డెసిషన్ తీసుకున్నా. ఐ మ్యారీడ్ ఎ రాంగ్ ఉమన్" పెదాల్లో తడి ఆరిపోతున్నట్లు అరచేత్తో నోరు తుడుచుకున్నాడు చైతన్య.

ఈ మాటలు తాను వినొచ్చోకూడదో తెలియలేదు రాధికకు. అతని వ్యక్తిగతం జీవితం. భార్య గురించి. కానీ రాంగ్ ఉమన్ అంటాడేమిటి? అంతగా ఏం చేసి ఉంటుంది.

"నీలిమ........ అనీ........ మాకు బంధువుల అమ్మాయే వరసౌతుందని సంబంధం చూసారు..............నీలిమ" ఆమెను తలుచుకుంటుండగానే అతడి ముఖం పాలిపోతోంది.

## 7

"**తన గురించి** చెప్పాలీ అంటే అసలు ఎక్కడ ఎలా మొదలు పెట్టాలో తెలియడం లేదు. నీకు అర్థమయ్యేట్లు ఎలా చెప్పను..." ఇబ్బందిని చేతుల్లో నలుపుకున్నాడు చైతన్య.." ఓకే .. సింపుల్‌గా చెప్పాలీ అంటే... నీకు కంప్లీట్ ఆపోజిట్ నీలిమ. నువ్వు ఎంత సెన్సిటివో తను అంత థింక్‌హెడ్."

"వొద్దు నాకేం చెప్పొద్దు" టిష్యూ పేపర్‌ను వేళ్ళతో చింపేస్తూ అతడి మాటలను తిరస్కరించింది రాధిక. నొచ్చుకుంటూ చూసాడు చైతన్య. బాధ అనిపించింది రాధికకు. చిరిగిన కాగితాన్ని ఆమె వేళ్ళు అప్రయత్నంగానే అతికించే ప్రయత్నం చేస్తున్నాయి.

"ఇంకొకరి గురించి ఇప్పుడు ఎందుకు చే? అయామ్ సారీ... తను నీ వైఫే కావొచ్చు, బట్ నాకు సంబంధించినంతవరకూ ఆమె ఎలాంటిదైనా అనవసరం. నీ ఆదర్శాలు, ఆశయాలు పోయి ఇలా ఎందుకు మారిపోయావు అని నేను అడుగుతుంటే, తప్పు ఆవిడెవరిదో అనడం.." తల అడ్డంగా కదుపుతూ "నాకు కరెక్ట్ అనిపించడం లేదు" అంది రాధిక.

"వాట్ డూ యూ మీన్? నేను ఏదో నా వైఫ్ గురించి చెడ్డగా చెప్పి సింపతీ సృష్టించుకుంటున్నాను అనుకుంటున్నావా?" అతని కోపంలో తనకు తెలిసిన చే ను చూసింది రాధిక. *మనిషి నిజమయిన అస్థిత్వం ఆ కోపమే.* అతడు మరింత కోప్పడితే చూడాలి అనే కోరిక పుట్టింది ఆమెలో.

"కాదా మరి. లైఫ్ ఈజ్ వన్స్ ఓన్ రెస్పాన్సిబిలిటీ. ఎవరి జీవితం ఎవరూ మార్చెయ్యరు. అలా మార్చేసేట్లు ఉంటే, ఇక నీ బుద్ధి ఏమయినట్లు. మంచిపని చేసేప్పుడు, ఉదాత్తమైన ఆలోచనలు ఉండేవారిని డిస్కరేజ్ చేసేవాళ్ళు, తప్పుదారి పట్టించేవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. అలా అయితే ప్రపంచంలో ఇలా ప్రతివాళ్ళూ తమ తప్పులకు ఇంకొకరు కారణం అని సాకులు చెప్పొచ్చు."

ఆమె కోరిక తీరింది. అతడి కోపం పెరిగింది.

"యూ ఆర్ టాకింగ్ నాన్సెన్స్. నా జీవితం గురించి నావైపు నుంచి ఆలోచించకుండా లైఫ్ గురించి నీకున్న సెట్ ఆఫ్ రూల్స్‌తో ఎలా కొలుస్తావు? ఇదేమైనా ఫిజిక్స్ థియరీనా? ప్రతి మనిషీ ఒకేలా ఎలా జీవిస్తాడు. నీకు ననుకున్నవన్నీ అనుకున్నట్లు జరిగాయి, నాకు జరగలేదు. దట్ డజన్ట్‌మీన్ యూ ఆర్ సక్సెస్ అండ్ అయామ్ ఫెయిల్యూర్ ఇన్ లైఫ్"

చైతన్య నోటివెంట హఠాత్తుగా ఓటమి మాట వినడం ఆమెకు నచ్చలేదు. అతను ఒక ఫెయిల్యూర్ అని తాను అనుకోకపోయినా అతడి గురించి అతడే భావించుకుంటున్నాడేమో అనిపించింది రాధికకు. *ఓడిపోయానేమో అనే అనుమానం మనిషిని ఓటమికన్నా కృంగదీస్తుంది.*

"యూ ఆర్ నాట్ ఎ ఫెయిల్యూర్ చే" ఒక వ్యక్తిగా అతడేమిటో ఖచ్చితంగా తెలిసిన నమ్మకంతో చెప్పింది రాధిక. చాలా గొప్ప విషయం విన్నట్లు చూసాడు అతను. ఆ మాట మళ్ళీ వినాలి అనిపించింది. కానీ అడిగేందుకు అభిమానం అడ్డుపడింది. నీరసంగా నవ్వాడు.

"డిప్రెస్డ్‌గా కనిపిస్తున్నానా? ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్నాను అనుకుంటున్నావు కదూ'!?' అతడి గొంతు బొంగురుపోయింది.

మళ్ళీ వాన మొదలయ్యింది. కిటికీ అద్దం అవతలనుంచి తలదాచుకునేందుకు పరుగులు తీస్తున్న జనంవేపు చూపు మరల్చుకున్నాడు చైతన్య. అతడికేదో చాలా చెప్పుకోవాలి అని ఉందనిపించింది రాధికకు. ఏదో చెప్పుకోవాలి అనే కోరికతో అతడు వణికిపోతున్నట్లు అనిపించింది రాధికకు.

"నేను ఫెయిల్యూర్‌నే రాధికా. ఐనోదట్. ఒప్పుకోకపోవడం నన్ను నేను మోసం చేసుకోవడమే. అఫ్‌కోర్స్ ఆ మోసం కూడా నాకు బాగా అలవాటు అయిపోయిందిలే"

"ప్లీజ్.... డోంట్ బీ సో హార్ష్ ఆన్ యువర్‌సెల్ఫ్" రాధికకు చాలా బాధగా అనిపించింది. తనకు తెలిసిన చే ఒక హీరో. ఒక మంచి పుస్తకం. ఒక శాస్త్రం. అభిప్రాయబేధాలు వచ్చినా మనసులు మధ్య అభిమానాలు పోవు. చైతన్యను ఓడిపోయినవాడిగా చూడలేకపోతోంది ఆమె.

"ఈ వేళ టివీలో నన్ను చూపించిన క్లిప్పింగ్ నేనూ చూసాను. ఎంత అసహ్యంగా కనిపిస్తున్నానో తెలుసా? అసలు అది నా ముఖమేనా అని నాకే అనుమానం వచ్చింది"

అతడి మాటలు విని రాధిక ఆశ్చర్యపోయింది. ఇప్పటికీ తమ ఇద్దరి ఆలోచనలూ ఒకేలా ఉన్నాయే? 'నన్ను చూసుకోవడానికి అద్దం ఎందుకూ?' ఒక చిలిపి సమయంలో తన కంటిపాపల్లో చూసుకుంటూ తలదువ్వుకున్న ఆనాటి చే గుర్తుకువచ్చాడు ఆమెకు. తాను అతడితోనే ఉండి ఉంటే అతను ఇలా అయిపోయేవాడు కాడేమో. తప్పు ఒప్పులు చెప్పేందుకు ఎవ్వరూ లేకపోయారేమో.

"మొదటిసారి లంచం తీసుకున్నప్పుడు చాలా అసహ్యం వేసింది నామీద నాకే. ఆరోజు నిన్నెంతగా తలుచుకున్నానో తెలుసా? ఐ డెస్పరేట్లీ నీడెడ్ ది పర్సన్ హు కెన్ స్లాప్‌మీ. నిజం. నువ్వే. నాకు అందుబాటులో ఉంటే, నీ దగ్గరకు వచ్చి చెంపదెబ్బ కొట్టించుకోవాలి అనిపించేంత కోరిక పుట్టింది ఆరోజు"

"ఇంతకూ ఎందుకు తీసుకున్నావ్ ఆ లంచం?" అతడి బాధను అర్థం చేసుకుంటూనే తను తెలుసుకోవాల్సిన విషయాన్ని అడగకుండా ఉండలేకపోయింది రాధిక.

"ఒక కోటీశ్వరుడు. తన బంగళా కట్టేప్పుడు రోడ్డు మీద కొంచె ఎన్క్రోచ్ చేసాడు. రూల్స్ ప్రకారం అయితే ఆ గోడ కొట్టెయ్యాలి. కానీ అతను మినిస్టర్ లెవెల్‌లో ప్రెషర్.."

"ప్రెషర్ అయితే... డబ్బు తీసుకోవడం ఎందుకు?"

"నీకు అర్థంకాదు రాధిక. నేను సర్వీస్‌లో చేరిన సంవత్సరం ఇలాంటి ప్రెషర్స్ నెలకు ఒక పదీ ఇరవై వస్తుండేవి. అన్నిటినీ తట్టుకున్నాను. రిజల్ట్? డిపార్ట్‌మెంట్‌లో నేను అందరికీ శత్రువుని. నా మీద ఎటు చూసినా జోకులు. నేను పిలిస్తే ఎవ్వరూ సరిగా పలకరు. నా సబార్డినేట్స్ కూడా. ఏమైనా అంటే... నా సుపీరియర్స్ కూడా వాళ్ళనే సపోర్ట్ చేస్తారు. ముఖం మీద అడిగినవాళ్ళూ ఉన్నారు'ఈ మాత్రానికి ఇక్కడెందుకు జాబ్. .. ఏ ప్రయివేట్ కంపెనీకో వెళ్ళొచ్చుకదా' అని"

"యూ కుడ్ హేవ్ డన్ దట్"

"ఏమో... నేను అలా ఆలోచించలేదు. అసలు ఆ జాబ్ ... నేను తీసుకోవాల్సింది కాదు" అతడు చెప్పేదంతా ఎదురుప్రశ్న వేయకుండా వినసాగింది రాధిక.

"ఇట్స్ నాట్ సో ఈజీ. స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఎంతసేపూ దేశాన్ని ఉద్ధరించడం, సొసైటీని మార్చడం గురించేకానీ నా లైవ్లీహుడ్, కెరియర్ ఏమీ ఆలోచించుకోలేదు. దేశాన్ని మార్చేంత పెద్ద పనిలో పర్సనల్ లైఫ్ ది ఏముందిలే అనుకున్నాను. బట్... ఒకసారి ఆ డిగ్రీ అయిపోయాక... ప్రపంచం దృష్టిలో నేనెవరు అని చూసుకుంటే ఏముంది? ప్రతి సంవత్సరం కాలేజీల నుండీ విసిరివేయబడ్డ వేలమంది గ్రాడ్యుయేట్లలో నేనూ ఒకడిని. అంతే. నాకున్న మెరిట్స్‌తో పెద్ద పెద్ద జాబ్స్ రాలేదు. రావుకూడా. ఐ డోంట్ బ్లేమ్ దెమ్. ఎప్పుడూ మార్కులూ, పర్సెంటేజీలు పట్టించుకోని నన్ను అలాంటి కంపెనీలూ పట్టించుకోలేవు. కాగితం సర్టిఫికెట్లను చూసి మనిషి తెలివిని అంచనా చేసే జాబ్ వరల్డ్‌లో నేను అంత ఎలిజిబుల్ గ్రాడ్యుయేట్‌ను కాను. ఒక వైపు నా స్నేహితులు, నా జూనియర్స్ అంతా కూడా ఏదేదో అయిపోతున్నారు. సంపాదించేస్తున్నారు. నేను ఇంకా ఇంట్లో డబ్బులు అడుగుతూ ఫ్రీలాన్సింగ్ ప్రాజెక్టులు చేసుకోవడానికి సరి అయిన అవకాశాలు మనుష్యులు కలిసిరాలేదు. ఇప్పుడు చెప్పకూడదేమో కానీ... చెప్పక తప్పదు. అప్పుడు నువ్వే నా పక్కన ఉంటే పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉండేదేమో. తెలుసు... నువ్వు అమెరికాలో ఉన్నావనీ, పెళ్ళి అయ్యిందనీ అంతా తెలుసు. అయినా సరే... ఒక్కసారి నీతో మాట్లాడితే చాలు అనిపించింది. ఇంకెవ్వరూ నన్ను అర్థం చేసుకునే వాళ్ళు లేరు. సిగిరెట్ త్రాగే ప్రతిసారీ నీ తిట్లే గుర్తుకు వచ్చేవి. ఆ తిట్లను గుర్తుచేసుకోవడానికే రోజుకు వంద సిగిరెట్లు తాగిన సందర్భాలూ ఉన్నాయి"

రాధికకు గుండెమంటగా అనిపించింది. తలభారమయ్యింది. ఒక అపరాధభావం అణుచుకోలేనంతగా ఆమె మనసులో ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది.

"ఐ హోప్ యూ కెన్ అండర్ స్టాండ్ దట్ స్టేట్.. డాక్టరువు కదా. చదివీ చూసీ ఉంటావ్ ఇలాంటి డిప్రెషన్ గురించి. ఎనీవే... ఆ రోజులను మళ్ళీ ఇప్పుడు గుర్తుచేసుకోవడమెందుకులే. అలాంటి సందర్భాల్లో, మా నాన్న చాలా ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. అమ్మకు హెల్త్ ప్రాబ్లమ్స్... ఇవన్నీ చూస్తూ నేను డబ్బనేదేదీ సంపాదించలేకపోతుంటే నా మీద నాకే అసహ్యం వచ్చింది. అప్పుడప్పుడు నేను దేశం గురించీ ఆలోచించలేదు, సంఘం గురించీ బాధపడలేదు. కేవలం నా గురించే బాధపడ్డాను. స్వార్ధంగా 'నా జీవితం ఎలా' అనే ఆలోచించాను. స్వార్ధంలేని మనిషి ప్రపంచానికి ఏమీ చెయ్యలేడు అనిపించింది. అదిగో... ఎగ్జాట్లీ ఆ మొమెంట్స్‌లో..." వింటున్నావా అన్నట్లు రాధిక వేపు చూసాడతను. అప్పుడే ఆరుతున్న వాటర్ కలర్ పెయింటింగ్‌లా ఉంది ఆమె.

"గోపాలరావుగారనీ... నాకు మామయ్య వరసౌతారు. అమ్మవేపు చుట్టాలు. నాకు అసలే బంధువులెవ్వరితో అంతగా పరిచయాల్లేవు. ఆయనకూడా దాదాపు అందరితో సంబంధాలు తెంపుకున్న వ్యక్తే. ఎందుకంటే ఆయన చాలా ఎక్కువ సంపాదించేసాడు: డబ్బు. అలాంటివాడిని బంధుత్వం పేరు మీద అందరూ ఏవో ఫేవర్స్ అడుగుతూనే ఉంటారు కదా. అందుకని ఆయనే అందరితో కలవడం చాలా తగ్గించాడు. నాన్నగారెప్పుడో ఆయనకు తారసపడితే, నా గురించి చెబితే తన ఇన్ఫ్లుయెన్స్‌తో నాకు ఏదైనా గవర్నమెంట్ జాబ్ ఇప్పించగలను అన్నాడట. ఏ అవసరం లేకుండా, అలాంటి మనీమైండెడ్ మనిషి ఇంకొకరికి సహాయం చేస్తాను అంటే నేను నమ్మలేదు. కానీ ఇంట్లో ప్రెషర్. ఇదేదో తేల్చుకుందాం అని ఆయననే కలిసాను. ఐ మస్ట్ సే.... హి మైట్ బీ ఎ కరప్ట్ పర్సన్. బట్ ఎన్ హానెస్ట్ మ్యాన్"

రాధికకు ఆ వివరణ అర్ధంకాలేదు. నీతిలేని తనం, నిజాయితీ ఒకే మనిషిలో ఎలా ఉంటాయా అని ఆలోచించింది... తన ప్రశ్నకు బుజువు తన ఎదురుగానే ఉందని మరచిపోతూ. *సత్యం కళ్ళెదుటే ఉన్నా చూసేందుకు కన్నులు చాలవు.*

"ఆయనను ఫ్రాంక్‌గా అడిగాను.... ఏ ప్రతిఫలం ఆశించి నాకు ఉద్యోగం ఇప్పించాలి అనుకుంటున్నారు అని... ఆయనా ఫ్రాంక్‌గా అడిగారు, తన కూతురును పెళ్ళి చేసుకుంటావా అని. తనే నీలిమ"

ఇదేదో చాలా పాత కథల్లోనూ, సినిమాల్లో విన్న విషయంలా అనిపించింది రాధికకు. ఆ మాట అడగలేదు కానీ, జీవితం కథను అనుసరించడంలో తప్పు లేదు కదా అనిపించింది. *ఫిక్షన్ ఫాలోస్ లైఫ్. లైఫ్ ఫాలోస్ ఫిక్షన్.*

"ఇదేదో పాత సినిమా కథలా అనిపించొచ్చు. నాకూ అప్పుడు అలానే అనిపించింది. సమాజంలో ఆయనకు ఉన్న ఆస్తీ, పలుకుబడీ, స్టేటస్‌కు నాలాంటివాడిని అల్లుడిగా చేసుకోవాలి అనుకోవడం అర్ధంలేనిది. బహుశా ఆ అమ్మాయికేమైనా డిఫెక్ట్, ప్రాబ్లం ఉందేమో అనుకున్నా. గోపాలరావుగారు నాకు నీలిమతో పరిచయం కూడా చేసాడు. ఐ స్పోక్ విత్ హర్. ఇంకొకరితో పోల్చి చెప్పలేను కానీ, షి ఈజ్ బ్యూటిఫుల్ ఇన్ హర్ ఓన్ స్టైల్. ప్లెజెంట్ పర్సన్. ఎక్కువగా మాట్లాడదు. కానీ మాట్లాడే రెండు మూడు మాటల్లోనే చెప్పాలనుకున్నదంతా చెపుతుంది. లైఫ్ అంటే పెద్ద ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నట్లు చెప్పదు, సింపుల్ గర్ల్. నేనూ ప్రాక్టికల్‌గా ఆలోచించాను. ఎలాగూ ఎవరో ఒకరిని పెళ్ళి చేసుకోవాలి. నా కోసమే అయినా, నిన్ను మరచిపోవడానికైనా. వైనాట్ హర్ అనుకున్నా..."

"ఇంతకీ నా గురించి ఆమెకు చెప్పావా" అడగకుండా ఉండలేకపోయింది రాధిక.

"వాట్ డూ యూ మీన్?" చురచురమని చూసాడు చైతన్య.

"అదే ఆ అమ్మాయితో, నా గురించి ఏమైనా చెప్పావా?"

"చెప్పాను. తను ఏమీ డీటైల్డ్‌గా అడగలేదు. షి సెడ్ ఇట్స్ ఓకే"

నీలిమ గురించి అమాంతంగా గౌరవం కలిగింది రాధికలో. మరి అంత మంచి అమ్మాయిని 'రాంగ్ ఉమన్' అన్నాడేమిటి చే?

"ఆ ఉద్యోగం అందుకున్నాను. నీలిమతో నా ఆశయాలగురించి చెప్పాను. తనకు అవన్నీ ఏం ఎగ్జైటింగ్‌గా అనిపించలేదు. కానీ నా లైఫ్ నా ఇష్టం అని చెప్పింది. ఐ థాట్ నెగిటివ్ ఆలోచనలు లేకుండా న్యూట్రల్ గా ఉంది కాబట్టి, మా లైఫ్ బానే ఉంటుంది అనుకున్నాను. అక్కడే రాంగ్ ఎస్టిమేట్ "అతని కళ్ళల్లో బాధ " ఒక మనిషిని ఒక నిముషంలో అర్ధం చేసుకోవచ్చు అని నమ్మే నేను, కొన్ని రోజులు మాట్లాడినా నీలిమను సరిగా అర్ధంచేసుకోలేకపోయాను. తన మాటలకు ఆలోచనలకు పొంతనే లేదు. ఉండదు. ఎందుకో తెలియదు కానీ, షి డజంట్ లైక్ మీ. నేనేం చేసినా తనకు నచ్చదు. ఒకవేళ తనకు నచ్చేదే నేను చేసినా, నేను చేసిన కారణాన అదీ నచ్చకుండా పోతుంది. ఉద్యోగం కోసమే తనను పెళ్ళిచేసుకున్నాను అన్నట్లు ప్రవర్తించేది. ఆ ఉద్యోగంలో మిగతావారిలా ఎందుకు సంపాదించట్లేదు అనేది. నేను లంచం తీసుకోను అంటే,'నీకు అలాంటి మోరల్స్ కూడా ఉన్నాయా?' అని అపహాస్యం చేసేది. నీకు తెలుసుకదా, అసలే నాకు కోపం ఎక్కువ, ఓపిక తక్కువ. అయినా నేను చాలా కంట్రోల్ చేసుకునేవాడిని. నేను ఆ కంట్రోల్ తప్పితే

ఇంట్లో ఎప్పుడూ గొడవే. తనకు నేనేం చేసినా నచ్చకపోవటానికి కారణం... తనకూ పెళ్ళికి ముందు ఏదో చిన్నపాటి లవ్..'' ఇక చెప్పలేనట్లు మాటలు మింగేసాడు చైతన్య.

''అదేమిటీ... ఆ విషయం తను ముందుగా నీతో చెప్పలేదా?'' క్షణం క్రితమే నీలిమపట్ల పెంచుకున్న గౌరవం క్రుంగిపోతుండగా అడిగింది రాధిక.

''గోపాలరావుగారే చెప్పారులే... అందుకే అన్నాను ఆయన హానెస్ట్ అని. సర్లే, లైఫ్ హాస్ టు మూవ్ అన్ కదా. నేను నిన్ను మరచిపోచూసినట్లే తనూ ప్రయత్నిస్తుందీ, ఇద్దరమూ ఒకే బాధను అనుభవించాము కాబట్టి ఇద్దరమూ ఒకరినొకరు బాగా అర్థంచేసుకోగలము అనుకున్నాను. కానీ తన లవ్ ఫెయిల్యూర్‌కు తన రియాక్షన్ అలా నెగెటివ్‌గా ఉంటుందని అనుకోలేదు. *ఒకే ఎమోషన్ ఒక్కొక్క మనిషిని ఒక్కోరకంగా మార్చేస్తుంది.* తను కోరుకున్నది దొరకలేదని బాధ, దక్కించుకోలేకపోయానని తనమీద తనకే ద్వేషం. .. మెల్లగా షి స్లిప్డ్ ఇంటు ఎ కైండ్ ఆఫ్ మ్యాడ్‌నెస్. అది ఎంతవరకూ వచ్చిందంటే... రిచ్‌లైఫ్ ఇవ్వలేనని నన్ను ఎగతాళి చెయ్యడమే కాక, నేను లంచాలు తీసుకుంటూ ఆ డబ్బులు ఇంకెవ్వరో ఆడదానికి ఇస్తున్నాననే అనుమానం.... పేరనోయియా.. అయిపోయింది. అలాంటప్పుడు నేను చేసిన ఇంకో తప్పు: అమ్మ అయితే తను మారుతుంది అనుకోవడం.. మనకు అదేమిటో... లిటరేచర్, సినిమాలు... వీటి ఎఫెక్ట్ ఏమో అమ్మ అంటే చాలా పవిత్రమైనది. ఎలాంటి ఆడదైనా అమ్మ అయితే ఉత్తమురాలు... ఎక్సెట్రా.. ఎక్సెట్రా.... అనుకుంటాం కదా. అంతా ట్రాష్. ప్రెగ్నెంట్ అయినప్పటినుంచీ తను అన్‌బేరబుల్‌గా తయారైంది. ఐ స్టార్టెడ్ హేటింగ్ హర్. చెబితే నమ్మవేమో కానీ, 'నీ బిడ్డను మోయనా చంపెయ్యనా' అని అడిగేంతగా మారిపోయింది''

అతడి ముఖం ఎర్రటి రంగులోకి జేవురించడం చూసి రాధికకు భయమేసింది. *ఆడదాని క్రౌర్యం చవిచూసిన మగవాడు గ్రహణం చాటు సూర్యుడే*

''తప్పు మొత్తం తనదే అని నేను అనను. తను అలాంటి మాటలు అన్నప్పుడు, ఐ లాస్ట్ మై కూల్. దాదాపు చెయ్యిచేసుకున్నాను కూడా...'' ఆమె కళ్ళలోకి చూసే ధైర్యంలేనట్లు తలదించుకున్నాడు చైతన్య.

అతను ఒక ఆడదానిని కొట్టడమా? అసాధ్యం. ఊహించుకోలేకపోయింది రాధిక. కానీ అతనే నేరం అనీ, నేరస్థుడనని అంగీకరిస్తున్నాడే?

''నేను అలా ప్రవర్తించాల్సింది కాదు... బట్ ఐ వాస్ హెల్ప్‌లెస్. ఆడదాన్ని కొట్టడం తప్పు, మగ అహంకారం అదీ ఇదీ అంటారు కదా. మేల్ అంటే ఈగో అనేట్లు చెబుతారు. కానీ మగతనంతోనూ కాస్తంత సెన్సిటివిటీ ఉంటుంది. ఒక జీవాన్ని కడుపులో మోసే ఆడదానికి ఎంత అటాచ్ మెంట్ ఉంటుందో ఆఫ్‌కోర్స్ నేను నీకు చెప్పక్కర్లేదులే..'' అతడెక్కడ తన ప్రెగ్నెన్సీ వివరాలు అడుగుతాడేమోనని రాధిక కంగారు పడింది. కానీ తన సున్నితభావాలను చెప్పుకునే ఆత్రుతలో చైతన్య ఆమెను పట్టించుకోలేదు ''పుట్టే పిల్లల గురించి తండ్రికి కూడా ఎంతో ఆత్మీయత ఉంటుంది. తన ప్రతిరూపం ఒకటి పుట్టబోతుందంటే ఎంత టెన్షన్‌గా ఉంటుందో నేను నీకు చెప్పలేను ఒక్కోసారి బాధ అనిపిస్తుంది.... నావలనకదా ఒక ఆడదానికి ఇంత కష్టం. ఆ తొమ్మిది నెలలూ ఆడదాని కష్టాలు చూస్తే ఏ సహాయమూ చెయ్యలేని హెల్ప్‌లెస్ స్టేట్ చాలా చిరాకు పుట్టిస్తుంది. అలాంటి టైంలో ఆ బిడ్డను చంపెయ్యనా... అని తను అంటే... కోపాన్ని కంట్రోల్ చేసుకోలేకపోయాను.... అందుకు నేను ఎన్నిక్షమాపణలు చెప్పుకున్నా ఏం లాభం? తనకెందుకు ఆ బిడ్డ అంటే అసహ్యమో కానీ... పుట్టిన బిడ్డకు పాలు ఇవ్వనని మొండికేసుకుంది...''

రాధికకు ఎదచాటున అసహ్యం పెల్లుబుకింది. ఒక ఆడదానిలో ఇంత క్రౌర్యమా?

*సృష్టిలో సువాసన వెదజల్లే పుష్పాలతో పాటు విషపు ముళ్ళూ ఉంటాయి.*

''ఇలా చెప్పుకుంటూ ఉంటే ఏంటో ఉంటుంది కానీ..... వాట్స్ ద యూజ్. నువ్వు చెప్పు.... పర్సనల్ లైఫ్ ఇలా ఉంటే ఇంకా మనిషిలో ఆదర్శాలూ, ఆశయాలూ ఏం మిగులుతాయి? నీలా నేను దేవుడూ దెయ్యమూ నమ్మను కానీ, మంచితనం నిజాయితీ అంటే చాలా నమ్మకం. మనం మంచిగా ఉంటే మనకు అంతా మంచే జరుగుతుంది అని ఎక్కడో సబ్‌కాన్షస్‌గా బలమైన నమ్మకం. ఆ నమ్మకం పోయింది. లైఫ్ అంటే నా లవ్ పోయింది. దటీజ్ హారిబుల్ స్టేట్. ***జీవితాన్ని ప్రేమించకుండా జీవించాల్సి రావడం దుర్భరం.*** కానీ తప్పదు. అప్పటికే వివేకానంద పుట్టాడు. యూనో.... వై ఐ గేవ్ హిమ్ దట్ నేమ్...''

రాధిక లయ తప్పింది.

''నేను సాధించలేని ఐడియల్ లైఫ్‌ను వాడయినా సాగిస్తాడు అనుకున్నా. ఈ సిస్టమ్‌లో వాడూ నిలబడాలి అంటే... వాడికి అన్నీ బెస్ట్ ఇవ్వాలి అనుకున్నాను. బెస్ట్ ఎడ్యుకేషన్ ఆపర్చ్యునిటీస్. వాడు నాలా ఐడియలిజం మాత్రమే ఉండే ఆ ఆశయాలను ఆచరణలో పెట్టలేని రిసోర్సెస్ లేనివాడు కాకూడదు. అందుకు ఎంతకాదు అనుకున్నా డబ్బు అవసరం. ఒకవేపున నేను ఉన్న సిస్టమ్ అంటే కోపం. ఈ సిస్టమ్‌లో ఇలా ఉంటేనే నేను కోరుకున్నది సాధించగలను అనే కొత్తరకం ఆలోచనలు. పైగా మంచిగా ఉండి సాధించిందేముంది అనే వెర్రికోపం. అందుకోసం.... నేనూ అందరిలా అయిపోయాను. కానీ... ఐ థింక్ ఐ విల్ బీఏ వెరి గుడ్ ఫాదర్. బెస్ట్ మదర్‌ను కనీసం గుడ్ మదర్‌ను ఇవ్వలేకపోవచ్చు. ఆఁ ... చెప్పలేదు కదా... వాడు పుట్టిన కొన్నాళ్ళకు గోపాలావుగారు చనిపోయారు. నీలిమ వాళ్ళ అన్న సింగపూర్‌లో సెటిల్డ్. అతను పూర్తి డబ్బు మనిషి. మొదట్నించీ నేనంటే పడదు. గోపాలావుగారు చనిపోయాక నీలిమ సింగపూర్ వెళ్ళిపోయింది''

''అంటే డైవోర్స్..?''

''నేను అడిగాను.... కానీ తను ఇవ్వనంది...''

''అదేంటీ... తనకు నువ్వంటే ఎలాగూ ఇష్టం లేదు అంది కదా!?''

''అందుకే ఇవ్వడం లేదు''

రాధికకు ఏమీ అర్థం కాలేదు

''నీకు అర్థం కాదులే. డైవోర్స్ ఇస్తే నేను ఇక ఫ్రీ అవుతానుగా. అది ఇష్టం లేదు. షి వాంట్ మీ టు సఫర్''

ఇలాంటి కొన్ని సంఘటనలు గురించి ఇదివరకే విన్న రాధికకు మెల్లగా నీలిమ మనస్తత్వం అవగతమయింది. ***తాము సుఖంగా ఉండకపోగా తమతో ఉన్నవారెవ్వరినీ సుఖశాంతులతో ఉండనివ్వకూడదని కొందరు మనుష్యులలో ఒక వికృత స్వభావం.***

''అపుడప్పుడూ వస్తుంది.. వివేకానందమీద ఎనలేని ఆప్యాయత కనబరుస్తుంది. వాడు తనకు అలవాటు అయ్యేలోగా ఈసడించుకుని వెళ్ళిపోతుంది. నాకు వాడంటే ఇష్టం అని తెలిసినకొద్దీ వాడిని నాకు దూరం చెయ్యాలని ప్రయత్నిస్తోంది. ఈ మధ్యే... ఈ క్యాన్సర్ గురించి తెలిసి...''

ఏం అడిగితే ఏం వినాల్సివస్తుందో అని భయమేసింది రాధికకు. ఇబ్బందిపడుతూనే చెప్పాడు అతను

''అతనికి అలాంటి జబ్బు రావడానికి నేనే కారణం అని నిందించింది''

''వాట్? హౌ ఈజ్...?'' అసహ్యించుకోవడానికి కూడా మాటలు దొరకలేదు రాధికకు.

''ఈ క్యాన్సర్ జెనెటిక్ ప్రాబ్లం వల్ల కూడా రావొచ్చని నువ్వే చెప్పావుగా. తనూ ఎక్కడో ఇంటర్నెట్‌లో చదివిందట. ఆ క్యాన్సర్ జీన్స్ నా నుంచే వచ్చాయని.... వెల్... ఆ మాటలలో సెన్స్ వెతకడం వేస్ట్..... అసలు తప్పునాది, వీవా పరిస్థితి తెలిస్తే తను వస్తుందేమో అని ఫోన్ చేసి చెప్పి తప్పుచేసాను...''

ఇక అతడు మాట్లాడలేదు.

ఆమెకూ మౌనమే శరణ్యం అయింది. అంతేసేపూ నిలిచి కురుస్తున్న వాన చప్పుడులోంచి చలి అలుముకుంటోంది. ఇద్దరి మధ్య కొన్ని నిమిషాలు మహానదిలా నిండుగా పారాయి.

అతడంటే ఆమెలో ఇప్పుడు ఏ కోశానా అసహ్యం లేదు. అతడి పతనాన్ని ఆమె అర్థం చేసుకుంది. *అర్థం చేసుకోవడం క్షమించడంకంటే అతిముఖ్యం.*

ఆమె అర్థం చేసుకుందని అతడికి తెలిసింది. మనసు ప్రశాంతమయింది.

"చే.." ఆమె పిలుపులో అతడికి సుపరిచితమయిన స్నేహం తీయబడింది...

"వాటెవర్ హ్యాపెండ్ ఈజ్ హ్యాపెండ్.. ఇప్పుడు మనముందున్న పెద్ద సిట్చ్యువేషన్ వీవా హెల్త్..."

రాధిక మాటలో 'మన' అనే పదం అతడి మనసును ముద్దాడింది.

"వీవా మదర్ గురించి అవన్నీ మర్చిపో ఇప్పుడు నువ్వు. ఐ విల్ డూ ఆల్ ది బెస్ట్ ఐ కెన్.. టు టేక్ కేర్ ఆఫ్ వీవా" తనంతట తానుగా ఇవ్వలేని జన్మకు ప్రతిగా ఈ పసివాడికి జీవితాన్నిచ్చే శక్తినిమ్మని తాను నమ్మే భగవంతుడిని కోరుకుంటూ చెప్పింది రాధిక.

*బాధ్యత జీవితాన్ని మరింత రంజింపజేస్తుంది. ఇష్టమైన వ్యక్తిని ఇష్టంగా చూసుకోవడమే బాధ్యతవడం అనిర్వచనీయమైన అనుభూతి.* రాధికకు ఎంతోకాలంగా అణిచి పెట్టుకున ఆనందాలన్నీ వివేకానంద చిన్న చిన్న చేష్టల్లో పెల్లుబుకుతూ ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి. ఒకసారి హాస్పిటల్ మొత్తం చూపించమంటే, చేయి పట్టుకుని అతడిని తీసుకువెళ్ళింది. తన గుప్పెట్లో అతడి చిన్న చేయి ఒక పావురంలా ఒదిగి ఉంటే అసలు ఆ పసివాడిని వదలబుద్ధి అయేది ఆమెకు. రకరకాల పరీక్షలోసం ఆ పసి చేతుల్లో సూదులు గుచ్చుతుంటే తాను ఇష్టపడి చదువుకున్న వైద్య శాస్త్రం అంతా చాలా క్రూరమైనదిగా తోచేది. చైతన్య అవినీతి కేసునుంచి తప్పించుకోవడానికి మరింత మందికి లంచాలు ఇవ్వడం గురించి చెబుతూ మనదేశంలో న్యాయవ్యవస్థ బలహీనతలను ఆవేశంగా మాట్లాడుతూ ఉంటే కూడా ఆమె కళ్ళు మరింత దయగా విచ్చుకోవడం, ఆమె మాట మరింత తీయబడటం, నడక మెత్తబడటం ఎవ్వరూ గమనించనైనా లేదు. వివేకానంద గురించి ఆమె ఏమైనా చెప్పబోతే రాజు పెద్దగా పట్టించుకునేవాడు కాడు. తన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇబ్బందుల గురించి ఆమె విన్నా వినకున్నా ఏదో చెప్పుకుపోతుండేవాడు. శారీరక కాంక్షలకు లోబడి ఆమె ముఖానికి దగ్గరగా జరిగినప్పుడు కూడా అతను ఆమెలో ఆనందంతో విరిసిన అందాలను గురించలేదు. రాజు అలా తన చెంతజేరినప్పుడు ఒకప్పటిలా ఆమెలో అతనంటే ప్రత్యేకమైన ఇష్టమూ లేక, తనలోనూ ఆ తృష్ణ రగలక.... అతడికి సహకరించలేకపోయింది. అలాంటి తిరస్కారాలు అప్పుడప్పుడూ అలవాటే అయిన రాజు పెద్దగా పట్టించుకోలేదు కానీ, ఆమె ఆ సమయంలో కూడా వివేకానందకు చేయబోయే సర్జరీ గురించే ఆందోళన చెందడం అతనికి అర్థం కాలేదు. అతనికి తెలిసిన ఆమెలో, వృత్తిపరంగా ఇంకే పేషెంటు గురించీ పడక గదిలో మాట్లాడటం అతను ఎరగడు. చైతన్యకు పుట్టినవాడు కాకుండా వేరే అబ్బాయి అయితే ఆమె ఇంతగా కలవరపడేదా? అనే అనుమానం అతని పెదవుల చాటునే రగులుకుంది. కానీ ఆ మాట అనలేక, పోనీ ఒకసారి ఇంటికి తీసుకురాకూడదా అన్నాడు.

"అదే.. ఆ అబ్బాయిని" చైతన్యను కూడా తీసుకురమ్మందామా అని ఆలోచిస్తూ అన్నాడు రాజు.

రాజు చాలా నచ్చేసాడు రాధికకు. ఆమె చాలాసార్లు అనుకున్నా అడగలేకపోయిన మాట అది. తన ఇంటికి ఒక చిన్న స్నేహితుడిని తీసుకు వస్తే, ఇతడెవరు, ఇతడి పట్ల నీ అభిమానం ఎందుకు అని... ఆ ఇంట్లో ప్రతి మనిషీ, గోడా ప్రశ్నిస్తాయన్న ఆమె సంశయం రాజు మాటతో తేలికయిపోయింది.

"రేపు లంచ్‌కు పిలుచుకురానా?" వివేకానందకు తాను ఏమేమి వండి పెట్టొచ్చో ఆలోచిస్తూ అడిగింది.

"లంచ్‌కు వద్దులే.. డిన్నర్ బెటర్. మధ్యాహ్నం నేను రాలేను కదా" మెరిసిపోతున్న ఆమె చెంపల మీదకు చేతులు పోనిస్తూ అన్నాడు రాజు.

"కానీ వాడు త్వరగా నిద్రపోతాడు. ఎయిట్ కల్లా ఇంటికి పంపించాలి కదా, మన డిన్నర్ టైం టెన్ దాటుతుంది కదా?" వీవాను పిలుచుకురమ్మంటే చైతన్య ఒప్పుకుంటాడా? లేక తను రాకుండా వీవాను మాత్రమే పంపుతాడా? చైతన్యను కూడా ఆహ్వానిస్తే రాజు సహించగలడా? అమ్మా నాన్న ఏమనుకుంటారో? ఛ.. మానవ సంబంధాలు ఇంత కాంప్లెక్స్‌గా ఎందుకు ఉండాలి? అంతా మనలో మనం సృష్టించుకున్నదే

ఆమె ఆ ఆలోచనల్లో ఉండగానే రాజు మెల్లగా ఆమెను ఆక్రమించుకున్నాడు. ఆమెకు ఏమీ తెలియడం లేదు. అతడి స్పర్శ, శబ్దం, రుచి, వాసన, రూపం వేటినీ ఆమె మనసు అనుభవించట్లేదు... అన్నీ ఆమె శరీరానికి అనుభవమవుతున్నా. ఆమె నిర్లిప్తత అతడికి అర్థమయ్యింది. చిరాకు వేసింది. అయినా తన కోరికను తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. అతడిని నిరాశపరచలేక, ఆమె లేని ఉత్సాహం నటించింది. చేతివేళ్ళతో అతడి వీపును తనలోకి లాక్కుంది. కష్టపడి ఒక చిన్నపాటి మూలుగును గొంతులో మ్రోగించింది. అతను మోసపోలేదు. కానీ మోసపోయినట్లు నటించాడు. కోరిక తీర్చుకున్నాడు. అంత తృప్తిగా అనిపించకపోయినా అలసటలో అదేమంత లోపంగా తెలియలేదు అతనికి. అర్థాకలికన్నా సగం సుఖం మేలు. కాకపోతే ఆ రెండూ ఒకటే. చూసే దృష్టే వేరు.

హఠాత్తుగా రాధికలో ఒక ఆశ పుట్టుకుంది. సరిగ్గా ఈ ఘడియే, తనలో ఒక జీవం ఆవిర్భవించి ఉంటే! గతంలోలా కాకుండా తొమ్మిదిమాసాలూ పెరిగి బయటకు వస్తే? ఇంకెప్పుడూ అలాంటి ఆశలు పెంచుకోకూడదనుకున్న రాధిక మళ్ళీ వాటికి బానిసయ్యింది.

"ఆ రాధీ... ఒకటి అడుగుతా... ఏం అనుకోవుగా...?" నిద్రకు ఉపక్రమిస్తూ రాజు ఆమెకు దూరం జరిగాడు. తన కలలలోకాన్ని అడ్డుకుంటున్నందుకు చిరాకుపడుతూ ఏమిటని చూసింది. "సీరియస్‌గా .. ఏం అనుకోకూడదు. నాకు తెలీకనే అంటున్నా.. మళ్ళీ తిట్టకూడదు.."

"ఏంటో చెప్పు" విసుగును అణుచుకునే ప్రయత్నమైనా చెయ్యలేదు ఆమె. అతను ఇంత 'ఫార్మల్'గా మాట్లాడటమేమిటి? అదీ ఒక ఆడామగా ఉండగలిగిన అత్యంత సాన్నిహిత్యపు క్షణాల తర్వాత?

"ఈ అబ్బాయి... అదే వివేకా.."

పేరు వినగానే ఆమె చెవులు విప్పార్చుకుంది.

"తనకు ఏం జబ్బు అన్నావ్?"

ఛ. ఇన్ని రోజులుగా మొత్తుకుంటున్నాను... ఆ మాత్రం కూడా గుర్తుపెట్టుకోలేదా? మళ్ళీ చెప్పింది రాధిక.

"అదీ... అదీ..." నసుగుతూనే ఆమె కళ్ళల్లోకి చూడలేనట్లు పక్కకు తిరుగుతూ, "ఇట్స్ నాట్ ఎనీ ఇన్ఫెక్షియస్ కదా... ఐ నో కేన్సర్ ఇన్ఫెక్ట్ అవదని విన్నాను. కానీ ష్యూర్ గా .. ఒకరినుంచి ఒకరికి స్ప్రెడ్ అవదు కదా..."

రాజు చదువు, విజ్ఞత, మనసు అన్నీ వృధా అనిపించాయి ఆమెకు. ఈ పళంగా అతడి పక్కలోంచి లేచి ముఖం చూడకుండా వెళ్ళిపోవాలి అనేంత కోపాన్ని అదుపు చేసుకుంది.

"అంటే నా భయం అని కాదు... అంకుల్, ఆంటీ ఏమనుకుంటారో... ఆ అబ్బాయికి సర్వ్ చేయడానికి టేబుల్, ప్లేట్స్ వేరేగా..."

"రాజూ..." అతను గ్రహించాడు ఆ పిలుపులోని తీక్షణత... ఇంతవరకూ ఇంట్లో వాళ్ళేం అనుకుంటారో అనే బెరుకు స్థానే ఒక బలమైన నిర్ణయం రాధికను ఆవహించింది. అతనితో నింపాదిగా చెప్పింది:

"రేపు వీవా మనింటికి డిన్నర్‌కు వస్తున్నాడు"

*ఖచ్చితమైన నిర్ణయం తీసుకోగలిగినప్పుడు మనిషి తనకు తానే నచ్చుతాడు. తనకు తాను నచ్చిన మనిషి ఏమైనా సాధించగలడు.*

''సో ఎప్పుడు అడ్మిట్ చేస్తావ్ వీవాను ఇన్‌పేషెంట్‌గా?'' కొత్తగా వివేకానందకు ఇచ్చిన ఏంటీ కేన్సర్ డ్రగ్స్ పనితీరును అతనిలో పరీక్షించాక అడిగింది రాధిక. చైతన్య దిగాలుగా వివేకానందవేపే చూస్తున్నాడు. క్యాన్సర్ ఎంత తీవ్రమైనదో దాన్ని తరిమికొట్టే మందులూ అంతటివే. కేన్సర్‌ను పోరాడే క్రమంలో మనిషినీ నీరసపరిచేస్తాయి. ఆ మందులు వాడుతున్నప్పటినుంచీ వివేకానంద ముఖంలో కళ తగ్గింది. చెంపలు నల్లబడిపోతున్నాయి. నాలుక అంతా చేదు రుచితో నిండిపోయి, తిండి సహించక ఏడుపు, అందులోంచి అలసట. కానీ *పసివాడు ఎప్పుడూ ఓటమినొప్పుకోని వీరుడు. పెద్దవారిలాగా మానసికంగా బలహీనపడటం పసివారికి అంతగా తెలియదు.* అలాగే వివేకానంద కళ్ళల్లో మాత్రం ఉత్తేజం దూకుతుంటోంది..

''తప్పకుండా సర్జరీ అవసరమా? ఇలాగే మందులతో...'' ఇప్పుడే ఇలా క్షీణించిపోతున్న వివేకానంద పరిస్థితిని, ఆపరేషన్ తర్వాత ఊహించుకోలేకున్నాడు చైతన్య. అతడు అలా భయపడటం, రాధిక ధైర్యం చెప్పడం... వాళ్ళు కలిసిన ప్రతిసారీ నిత్యకృత్యం అయిపోయింది. ఇప్పుడూ అలానే ధైర్యం నూరిపోసింది రాధిక.

''ఏంటో నువ్వు చెపితే బానే ఉంటుంది కానీ, ఇంటికి వెళ్ళి ఒక్కడినే కూర్చుని ఆలోచిస్తే మళ్ళీ భయమేస్తుంది'' నిజాయితీగా ఒప్పుకున్నాడు చైతన్య.

*భయాన్ని నిజాయితీగా ఒప్పుకునే మగవాడు ఆడదానికి చాలా నచ్చుతాడు.* రాధిక అతడిని ఆర్ద్రతగా చూస్తూ,

''అసలు నిన్నెవ్వరు ఆలోచించమన్నారు... నీకు చెప్పానా... వీవా గురించి నాకొదిలెయ్ అని'' చిన్న పిల్లలా తగువు పెట్టుకుంది. ఆమె ముఖంలో తన ఈడు స్నేహితురాలెవ్వరో కనిపించినట్లు వీవా ఫక్కుమన్నాడు. *తండ్రిని పరిహసించేవాళ్ళంటే కొడుకులకు 'హీరో వర్షిప్' !*

''యూ జస్ట్ డోంట్ వర్రీ... రేపో ఎల్లుండో తనను ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేస్తాం. వారంలో సర్జరీ. ఆ తర్వాత ఒక వారానికి డిస్చార్జ్. ఒక మూడు నెలలు డ్రగ్స్ వాడితే... ఆ తర్వాత అసలు ఇలాంటి సిట్యువేషన్ ఒకటి వచ్చిందని కూడా మరిచిపోతారు'' అంటూ వివేకానంద జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి నిమురుతూ, అప్పుడే గుర్తుకొచ్చినట్లు చైతన్యకు సైగ చేసింది. అతడు వివేకానంద చేతికి తన సెల్‌ఫోన్ ఆడుకోవడానికి ఇచ్చి కాస్త దూరం పంపాడు.

''సర్జరీ కోసం తనకు జుత్తు తీసేస్తారు'' ఇబ్బందిపడుతూనే చెప్పింది రాధిక,

''అది తనకు డిప్రెసివ్‌గా అనిపించొచ్చు కదా... అందుకే అడ్మిట్ చేసేముందు మనమే ఏదో ఒకటి చెప్పి గుండుచేయిస్తున్నామని...'' పసివాడికి మంచికోసమే అయినా అబద్ధం చెప్పాల్సి వస్తోందన్న విషయం ఆమెకు నచ్చట్లేదు.

''నువ్వోటి గమనించావా?'' ఆమె కళ్ళల్లోకి నవ్వుతూ చూసాడు చైతన్య. తాను మళ్ళీ అతడిని కలిసినప్పటినుంచీ అతను ఈ మధ్య కొంచెం హుషారుగా ఉండటం ఆమె ఎరుగకపోలేదు. అతడెప్పుడూ అలా ఉంటేనే బావుంటుంది.

''వీవా విషయంలో ఏ పనికైనా 'మనం' అంటున్నావ్ నువ్వు'' సంతోషంతో ఝల్లుమంటున్న అరచేతులను అదుపుచేసుకోవడానికి వీవాను పొదుపుకుని, ''చాలా థాంక్స్'' కళ్ళలో ఛమక్కుమంటున్న తడి తెరలో నవ్వాడు.

ఆమె కాదనలేకపోయింది. *సహాయానికి బదులొచ్చే కృతజ్ఞత 'ఫార్మాలిటీ' అయితే ప్రేమకు వచ్చే కృతజ్ఞత తీపి గుర్తు. దాచుకోకుండా ఉండలేనంత మధురం.*

ఇంకా ఏదో చెప్పబోతున్న రాధిక సెల్‌ఫోన్ మ్రోగడంతో ఎవరా అని చూసుకుంది,

''ఏం డాక్టర్‌గారూ, అప్పాయింట్ మెంట్ తీసుకోలేదు, కలవొచ్చా?!'' జగన్ గొంతులో తమ్ముడి అల్లరి.

"మీకేంటి సార్. ఎప్పుడొస్తున్నారు?" అంత హఠాత్తుగా అతను ఫోన్ చేయడమేమిటా అని విస్తుబోతూనే అడిగింది.

"ఏం లేదు, కుసుమను చెకప్ కోసం మీ హాస్పిటల్ కే తీసుకొచ్చా. పైనే గైనకాలజిస్ట్ దగ్గర ఉన్నాం.. మీరు బిజీగా లేకపోతే ఓసారి..." నసిగాడు జగన్.

ఇంటి దగ్గర ఎప్పుడూ కలిసే బంధువులే అయినా, ఏదో పనిమీద వచ్చి పనిలోపనిగా తనను కలవడం రాధికకు నచ్చదు. తనను కలవాలంటే అదే ఉద్దేశ్యంతో రావాలి కానీ, పనిలోపనిగా ఏమిటి? పైగా తను పనిలో ఉన్నప్పుడు. కానీ ఆ మాట అనలేక రమ్మంది. ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్నట్లు ఇక బయలుదేరడానికి కదిలాడు చైతన్య.

"ఆఁ మరచిపోయా.. ఈవినింగ్ ఫైవ్‌కు ఒకసారి వీవాను నాతో పంపగలవా. ఒకసారి మా ఇంటికి తీసుకువెళ్ళాలి. నైన్ కల్లా పంపేస్తాను" అతను కాదు అనడనే ఆశతో చూసింది.

ఆమె ఆశ తప్పలేదు. తనను పిలవకుండా వివేకానందను మాత్రమే ఆహ్వానిస్తుందనే విషయం అతడినేమీ నొప్పించలేదు. *పెళ్ళయిన ఆడదాని స్వాతంత్ర్యం ఎంత తక్కువో అతడికి అప్పుడు అర్థమయింది.*

"యస్ డాక్టర్" కనుబొమలు ఎగరేసి నవ్వేస్తూ వెనుదిరిగాడు.

అతడలా తనను 'డాక్టర్' అంటూ అలా నవ్వినప్పుడల్లా, తరుముకుని మరీ జబ్బమీద గిచ్చేసిన రోజులు గుర్తుకొచ్చాయి ఆమెకి. అసహాయంగా కుర్చీలో వాలిపోయింది. *గడిచిపోయాక తిరిగిరామని చెప్పి వెక్కిరించే శాడిస్టు క్షణాలే జ్ఞాపకాలు.* అతడు తనను అలా ఆటపట్టిస్తుంటే ఎంత బావుండేది? రాజు కూడా అప్పుడప్పుడూ సరదాగా జోకులు వేసినా అవి అంత సహజంగా ఉండవు. తానో జోక్ చేస్తున్నాను, నవ్వడానికి సిద్ధంగా ఉండండని ముందుగా హెచ్చరిస్తున్నట్లు మాట్లాడుతూ, జోక్ చేసాక నవ్వలేదా అన్నట్లు గుచ్చి గుచ్చి చూసి, నవ్వేంతవరకూ జోక్‌ను వివరించి ఇక చాలు బాబోయ్ అని నవ్వును సమర్పించుకునేట్లు చేస్తాడు. అసలు చైతన్యకి తనకూ గొడవరాకుండా ఉంటే, రాజు అనేవాడిని తాను ఎప్పటికైనా ఇష్టపడేదా? మంచివాడే. కానీ. *ఆ 'కానీ'లోనే మనిషి ఉనికి. కానీ అనే సందేహం, అనుమానం లేకుండా ఒక మనిషి గురించి చెప్పగలిగితే కానీ అతను ఖచ్చితంగా నచ్చినట్లు కాదు. సరిగా నచ్చని మనిషిని బాగా నచ్చినట్లు తనను తానే మోసం చేసుకోవాల్సి రావడం...*

"ఏంటక్కా... డిస్టర్బ్ చేస్తున్నామా?" కుసుమను భుజం పట్టుకుని మెల్లగా లోపలకు తీసుకువస్తున్న జగన్ పిలుపుతో రాధిక ఉలిక్కిపడింది.

"అక్కా.. నువ్వు చైతన్యతో అప్పుడేదో రెస్టారెంట్లో ఉండగా కుసుమ చూసిందంట... ఎవరూ అని అడిగితే.. ఏదో సర్ది చెప్పాను. అతను క్లినిక్‌కు పేషెంట్ కారణంగానే వస్తున్నా, నాన్నకూ బావకూ నచ్చకపోవచ్చు..."

కుసుమను తీసుకువెళ్ళేపుడు జగన్ చెప్పిన మాటలు రాధికలో అంతులేని కోపాన్ని రగిల్చాయి... ఒక మనిషి తన బ్రతుకు తను బ్రతకడానికి లేకుండా ఇది చెయ్యి, ఇలా చెయ్యి, అదొద్దు... అందరూ ఏదో ఒకటి చెప్పేవాళ్ళే. *సమాజం అంటే ఎక్కడో ఉండదు, స్వంత ఇంట్లో, స్వంత మనుష్యులందరిలోనూ ఒక జబ్బులా వ్యాపించి ఉంటుంది. బయటివాళ్ళు ఏదో అంటారని స్వంత మనుష్యులు, ఆ స్వంత మనుష్యులు ఆ భయంలో ఏం అనుకుంటారో అని స్వంత బుద్ధి భయం. ఆ బుద్ధి భయానికి మనసు ఎప్పుడూ బందీనే.*

"వివేకానంద సర్జరీ తర్వాత చైతన్యతో కొంచెం దూరంగా ఉంటే మంచిది" జగన్ మాటల తర్వాత రాధిక నిర్ణయం

"పాపం అతడేం తప్పుచేసాడు? నేనేం తప్పు చేస్తున్నాను. ఒకప్పుడు ప్రేమించుకుంటే ఇక స్నేహంగా ఉండకూడదా? విడిపోయిన ప్రేమికులు శత్రువుల్లా ముఖం తిప్పుకునే ఉండాలా?" అంతలోనే ఆమెలో ఒక తిరుగుబాటు.

'కుసుమ చూసి ఎవరూ అని అడిగిందా? ఇంకెవ్వరెవ్వరు చూసారో. అయినా రాజుకు తెలుసుకదా.... చైతన్యతో నేను ఫ్రెండ్లీగా ఉన్నానని.. ఇంకెవ్వరేమనుకుంటే ఏం? కానీ.. ఏమో... ఎలాంటెలాంటి మాటలు వస్తాయో' *ఒప్పుకున్నా ఒప్పుకోకున్నా ప్రతిమనిషీ భయానికి బానిసే.*

ఎవరితోనైనా ఇదంతా చెప్పుకుని సలహా అడిగితే బావుణ్ణనిపించింది ఆమె. కానీ ఎవరితో చెప్పుకోవడం. *ఆత్మీయులను దూరం చేసుకోవద్దు అని చెప్పగలిగేది ఆత్మే. కానీ ఆ ఆత్మకు ఎప్పుడూ ఇంకో ఆత్మీయుని వత్తాసు కావాలి.* ఇదంతా ఒక విషవలయం. పోనీ చైతన్యతో మొహమాటం లేకుండా ఇదంతా చెపితే?

నవ్వుతాడు. 'నువ్వు... నువ్వు.. చివరకు.. మిగతావారేమంటారో అని భయపడుతున్నావా? ఎంత మారిపోయావ్ రాధికా' అంటాడు. ప్రతి మాటలోనూ తనను ద్వేషిస్తాడు. అతను తనను ద్వేషిస్తాడు.. అనే ఊహే ఆమెకు చిరాకు పుట్టిస్తోంది.

"ఆంటీ... ఇదే కదా బ్రెయిన్" తన న్యూరో అనాటమీ పుస్తకాన్ని చూస్తున్న వివేకానంద ప్రశ్నతో ఆమె ఆత్మావలోకానికి తెరపడింది. హాస్పిటల్ నుండి వచ్చేస్తున్నప్పుడే చైతన్య వచ్చి వివేకానందను ఆమెకు అప్పగించి తొమ్మిదిగంటలకల్లా ఆమె ఇంటికి వచ్చి తనే వాడిని పికప్ చేసుకుంటానని చెబితే.. అతను ఇంటికి వస్తే రాజు, నాన్న ఏం మాట్లాడి అతడిని నొప్పిస్తారో అనే భయంతో తనే వీవాను డ్రాప్ చేస్తానని చెప్పినప్పుడు చైతన చూపు తన వ్యక్తిగత స్వేచ్ఛను పరిహసించినట్లు అనిపించింది ఆమెకు. వివేకానందను కలుద్దామని చెప్పిన రాజు ఆఫీస్‌లో ఏదో పని అని చెప్పి మాటనిలుపుకోలేదు. అతడి చర్య ఆమెకేమీ వింత అనిపించలేదు. ఏదో మాటవరసకైతే ఆహ్వానించాడు కానీ, నిజంగా ఒక పసివాడితో నిర్మలంగా కాలం గడిపేందుకు కావలసినంత అమాయకత్వం అతడిలో ఏనాడూ లేదు. *మనసులో వికారపు ఆలోచనలు ఉన్న మనిషి ఎవ్వడూ పసివాళ్ళతో స్నేహం చెయ్యలేడు.* వివేకానందకు ఉత్సాహం కలిగించేందుకు తన ఇంట్లో చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మలూ గ్రటా ఏమీ లేవని అప్పుడే తోచిన ఆమె, అతడికి తన చిన్నప్పటి పుస్తకాలు చూపించింది. ఆమె మెడికల్ పుస్తకాల్లోని బొమ్మలన్నింటినీ విచిత్రంగా చూసేస్తున్నాడు.

"స్వీట్స్ తినొచ్చా ఈ అబ్బాయి?" ఒక ప్లేటులో రకరకాల తీపి పదార్థాలు సర్ది తీసుకు వచ్చిన పూర్ణిమ వివేకానంద దగ్గరగా కూర్చుంటూ అడిగింది. ఆ అబ్బాయి ఒక పేషెంటు, తెలిసిన వాళ్ళ అబ్బాయి అని మాత్రమే చెప్పింది. ఆ తెలిసినవాళ్ళు ఎవరూ... ఎక్కడ తెలుసూ అని ప్రశ్నిస్తూనే.. లేక లేక చూసిన పసివాడికి రాజమర్యాదలు చేస్తోంది పూర్ణిమ. వాడికి ఏం పెట్టాలన్నా.... పేషెంటు కదా... పథ్యం ఏమైనా ఉందా అని ఆమె అనుమానం.

"అమ్మా... అదేమీ షుగర్ జబ్బు కాదు.. మరీ అయోమయంగా అడుగుతావ్?" తల్లిని విసుక్కుంటూనే ఆమె తెచ్చిన ప్లేటులోంచి ఒక కాజా ఎన్నిక చేసి వివేకానందకు అందించింది. అతడు అంతగా నచ్చనట్లు ముఖం చిట్లించాడు.

"ఏం కావాలో నువ్వే తీసుకోరా" చనువుగా ప్లేటును అతడి ముందుంచింది పూర్ణిమ. అతడి చేతివేళ్ళు అటూ ఇటూ తచ్చాడి కంటికి ఇంపుగా కనిపిస్తున్న ఎర్రరంగు హల్వా ముక్క తీసుకున్నాడు.

"నాకు తెలుసు... రంగు తప్ప రుచి తెలియదు ఈ ఈడులో..." పిల్లల స్వభావాన్ని సరిగ్గా ఊహించిన గర్వంతో నవ్వింది పూర్ణిమ. నిజమే అనిపించింది. తల్లి అతడిని ముద్దు చేసే పద్ధతి చూసి తల్లి అంటే ఆమెకూ ముద్దొచ్చింది.

"సరే.. ఎప్పుడు భోంచేస్తారు? రైస్ చెయ్యనా.. లేక చపాతీలు.." తన గోలలోకి తాను పడిపోయింది పూర్ణిమ. ప్రపంచ యుద్ధం జరుగుతున్నా ఆమె ఆలోచనలు వంటిల్లు, వంటమీదే ఉంటాయని బాగా తెలిసిన రాధిక ఉసూరుమంది. అసలు వివేకానందకు నచ్చేవి ఏవో తనే దగ్గరుండి చేసిపెడదాం అనుకుంది. కానీ కిచెన్‌లోకి వెళ్ళడానికైనా వాడిని క్షణం కూడా వదిలిపెట్టలేకుంది. తొమ్మిదిగంటలకల్లా వాడిని పంపెయ్యాలి కాబట్టి ప్రతి క్షణం అమూల్యంగా తోస్తోంది.

"రైసే చెయ్యమ్మా. చపాతీలూ అవీ పిల్లలకు సరిగా అరగవు" చపాతీలకంటే అన్నం అయితే బాగా కలిపి ముద్దలు పెట్టొచ్చనే ఆలోచనను మార్చి చెప్పింది రాధిక.

"సర్లే... ఆ చెప్పడం మరచిపోయా.. ఇంతకు ముందు సుష్మ ఫోన్ చేసింది.." వివేకానంద ఇష్టపడని కాజాను రాధికకు ఇచ్చి, మిగతా వాటిలో తనకు కావాల్సింది ఎన్నుకుంటూ చెప్పింది పూర్ణిమ.

"అదేమిటీ..? ఎప్పుడూ...?" తన సెల్‌ఫోన్ తన దగ్గరే ఉందికదా అని చూసుకుంది రాధిక

"సెల్‌ఫోన్ కనెక్ట్ అవలేదట. ఇంట్లో ఫోన్‌కు చేసింది. నువ్వు ఉన్నావా అని అడిగింది. ఏదో పనిమీద ఈకాలనీకే వచ్చారట. వీలైతే ఇటు వస్తాను అంది" గొణుక్కుంటూ వెళ్ళిపోయింది పూర్ణిమ.

చాలా కోపం వేసింది రాధికకు. అందరూ ఇలా 'పనిలో పనిగా' తనను కలవడమే కానీ, కేవలం తనను కలవడం కోసమే రావడం లేదేమిటీ అని ఉక్రోషం వచ్చింది.

"ఏంటీ... అంతా నీ ఇష్టమేనా? ఇంకెవ్వరి దగ్గరకో వచ్చి.. అక్కడ నీకు బోర్ కొడితేకాని మేము గుర్తుకు రామా..?" వెంటనే సుష్మకు ఫోన్ చేసి తగువు పెట్టుకుంది.

"కూల్ అవ్వు. నువ్వేమో సూపర్ బిజీ కదా. ఫోన్ సిగ్నల్ కలవకపోతే ఏదైనా సర్జరీలో ఉన్నావేమో అని.." సంజాయిషీ ఇచ్చుకోబోయింది సుష్మ

"ప్రతివాళ్ళకూ ఇదొక సాకు దొరికింది. ఏం మాట్లాడినా నా సర్జరీ గురించే.." రాజు చీటికీ మాటికీ సర్జరీ లేదా అని అడిగే పద్ధతి గుర్తుచేసుకుని మరింత కోప్పడింది రాధిక.

"సర్లే.. టెన్ మినిట్స్‌లో వచ్చేస్తాను. ఫేస్ టు ఫేస్ కొట్టుకుందాం. ఆంటీ బూరెలు, పూతరేకులు ఏవైనా చేసిందా..?" ఫోన్‌లో ఆమె కారు స్టార్ట్ చేసిన శబ్దం కూడా వినిపించిది రాధికకి.

"ఎప్పుడూ స్వీట్లు గొడవే. సరే రా... నీకొక స్మాల్ ఫ్రెండ్‌ను పరిచయం చేస్తాను" హల్వా అంటుకున్న వేలిని చప్పరిస్తున్న వివేకానందకు టిష్యూ పేపర్ అందిస్తూ అంది రాధిక.

"స్మాల్ ఫ్రెండా? అదేంటి లిల్లీపుటా? ఎవరూ?"

"నువ్వు రా..డ్రైవింగ్ అపుడు ఫోన్ మాట్లాడక" అంటూ కాల్ కట్ చేసింది రాధిక. రాధికకు హఠాత్తుగా చాలా హాయిగా అనిపించింది. చైతన్య గురించి తన ఇష్టాన్ని బాగా తెలిసిన వ్యక్తి సుష్మే. వివేకానందను చూసి ఖచ్చితంగా ఆమె ఉద్విగ్నతకు లోనవుతుంది. సుష్మతో అయితే చైతన్యకూ తనకూ మధ్య మళ్ళీ చిగురుస్తున్న స్నేహం గురించి సరిగా అర్థం అవుతుంది. తన ఆకాశం పిచ్చితో సహా మొత్తం తెలిసిన ఆమె తనను ఎప్పుడూ తప్పుగా అనుకోదు.

రాధిక అంచనా తప్పుకాలేదు. చైతన్య అనే పేరు వినగానే సుష్మ వాళ్ళ కాలేజి రోజులను గుర్తుకుచేసుకుని సరదా పడిపోయింది. వివేకానంద కళ్ళూ ముక్కూ చెవులూ అన్నీ చైతన్య వాటితో పోల్చి చూసి భలేగా సంతోషపడింది. ఎప్పుడో తెలిసిన మనిషి చాలాకాలం తర్వాత ఒక పిల్లవాడిలా కనిపిస్తే ఎవరికైనా సంభ్రమంగానే ఉంటుంది. సైకాలజీ వృత్తిలో భాగంగా పిల్లలను ఆకట్టుకోవడానికి ఎన్నో చిన్న చిన్న ఆటలూ, పజిల్సూ నేర్చుకున్న సుష్మ అన్నిటినీ వివేకానందమీద ప్రయోగించి అతడిని విపరీతంగా సంతోషపెట్టేసింది. రాధికకు ఈర్ష్య వచ్చి ఇక చాల్లే అంటూ సుష్మ వాక్ప్రవాహాన్ని అడ్డుకుంది.

"వీడు పెద్దయాక అయితే సైంటిస్టు లేదా సీరియల్ కిల్లర్ అవుతాడు" అని తేల్చేసింది సుష్మ... తన సెల్‌ఫోన్ లోంచి బ్యాటరీను ప్యానెల్‌నూ విడదీసి పరీక్షిస్తున్న వివేకానందను చూసి.

"చుప్... ఏంటా మాటలు?" సుష్మకు ఇష్టమైన స్వీట్లు అందిస్తూ చిరాకుపడింది రాధిక.

"మనస్తత్వం అలానే ఉంటుంది. వాళ్ళ నాలెడ్జ్  సరి అయిన దారిలో పడితే సైంటిస్టు... కాకపోతే మనుష్యులను ముక్కలుకింద విడదీసి.."

"ఆపు... నువ్వూ నీ ప్రొఫెషనూ... ఎందుకొచ్చిన సైకియాట్రీ అంటే విన్నావా? ఇలా అయిపోయావ్. చిన్నపిల్లాడిని కూడా అనలైజ్ చేసి థియరీలు చెబుతున్నావ్.."

"అసలు చైల్డ్ సైకియాట్రీ స్పెషలైజ్ చేద్దాం అనుకున్నా. తెలుసుగా... ఇండియాలో గిరాకీ తక్కువ. అంతా నీలా ఆలోచించి పిల్లలకు అవసరమైనప్పుడు కూడా ఎక్స్‌పర్ట్ హెల్ప్ ఇవ్వరు. ఈ రోజుల్లో పిల్లల మీద ఎంత స్ట్రెస్ ఎఫెక్ట్ ఉందని? వాటికి తోడు ఈ వీడియో గేమ్స్, టెక్నాలజీ... అసలు మాట్లాడే తోడు లేక మెకానికల్‌గా..." సుష్మ ఇంకా అనర్గళంగా చెప్పుకుపోతుండగా రాధిక ఫోన్ వైబ్రేషన్‌లో వణికింది. చైతన్య. టైం చూసుకుంది రాధిక. ఇంకా ఎనిమిది కూడా కాలేదు.

"నేను డ్రాప్ చేస్తాను కదా చై..." ఆన్సర్ చేస్తూ అన్న రాధికకు చైతన్య ఆయాసంగా ఊపిరి శబ్దం వినిపించింది.

"ఇఫ్ యు డోంట్ మైండ్ మీ అడ్రస్ చెబుతావా. వీవాను నేనే వచ్చి తీసుకువెళతాను."

"ఎందుకు చై.."

"ప్లీజ్.. అర్జెంటుగా రిలేటివ్స్ దగ్గరకు వెళ్ళాలి. తనను తీసుకువెళ్ళాలి" ఇంకేమీ అడగొద్దు అన్నట్లు అర్థించాడు. ఆ మాటల్లో ఊపిరి శబ్దమే ఆమెకు భయం పుట్టించింది.

"ఈజ్ ఎవ్విరి థింగ్ ఆల్రైట్?" అంటూనే తమ ఫ్లాట్ చిరునామా చెప్పింది.

"ఫైన్. టెన్ మినిట్స్‌లో వస్తాను" వేరే ఏం మాట్లాడేందుకు ఆస్కారం ఇవ్వక ఫోన్ కట్ చేసాడు చైతన్య.

"ఏమయ్యింది" రాధిక ముఖంలోని ఆందోళన చూసి ప్రశ్నించింది సుష్మ.

"ఏమో.. చైతన్య.. హి ఈజ్ ఏక్టింగ్ స్ట్రేంజ్" అంటూనే, ఇంకొన్ని నిముషాల్లో వెళ్ళిపోతాడు అనే ఆలోచనతో వివేకానందకు ఇంకా ఏమేం ఇవ్వాలి అనే ఆత్రుత అలుముకుంది ఆమెలో. ఇప్పుడైనా రాజు ఒకసారి వస్తే బావుంటుంది అనిపించింది ఆమెకు.

ఇంట్లో సమయానికి తండ్రి కూడా లేడు. వీవాను తీసుకెళ్ళడానికైనా చైతన్య వచ్చినప్పుడు వాళ్ళలో ఎవరు ఉన్నా మర్యాదగా ఉండేది కదా. రాజుకు ఫోన్ చేద్దామని సెల్ చేతులోకి తీసుకోగానే, ఒక మెసేజ్ కనిపించింది ఆమెకు. చైతన్య నుంచే..

'నీలిమ ఈజ్ బ్యాక్. షి ఈజ్ విత్ మీ'

చైతన్య మాటల్లోని తేడాకు కారణం అప్పుడు అర్థమైంది రాధికకు. ఆవిడ హఠాత్తుగా ఎందుకు వచ్చి ఉంటుంది? వివేకానంద కేన్సర్ గురించి తెలిసికూడా వదిలేసి వెళ్ళిపోయిందిగా? బహుశా మనసు మార్చుకుందేమో. ఎంతైనా తల్లికదా. ఇకనుంచి వివేకానందను దగ్గరుండి చూసుకోవాలి అనుకుని ఉంటుంది. చైతన్య చెప్పిన ప్రకారం అయితే నీలిమ గురించి అలా ఆలోచించడం సరి అయినది అనిపించడం లేదు. కానీ ప్రత్యక్షంగా చూడకపోవడం వలన నీలిమ క్రౌర్యం అంత తీవ్రంగా ఆమెకు తెలియడం లేదు.

ఏం జరిగిందని సుష్మ అడిగితే విషయం చెప్పింది. చెప్పేసాక ఎందుకు చెప్పానా అని నాలుక్కరుచుకుంది. చైతన్య కుటుంబ విషయం. వ్యక్తిగతమైన కష్టాలు. ఎవరికీ చెప్పననే నమ్మకంతోనే కదా అతడు తనకు చెప్పాడు. తానేమో ఎవరికీ చెప్పదనే నమ్మకంతో తన స్నేహితురాలు, పైగా మానసిక నిపుణురాలు కదా అని చెప్పేసింది.

*రహస్యాలు ఎప్పుడూ స్నేహితులద్వారానే విస్తరిస్తాయి.*

*ఎవరికీ చెప్పొద్దని ఒక స్నేహితుడుకి, అతడు ఇంకొకడికి, అక్కడనుంచి ఇంకొకరికి.... చివరకు అందరికీ తెలిసిపోతాయి. అందరూ రహస్యం అనే చెప్పుకుంటారు. ఇంకెవ్వరికి చెప్పొద్దనే మాట తీసుకునే చెబుతారు. నీకు తప్ప ఇంకెవ్వరికీ చెప్పడంలేదు అనే నమ్మకంతోనే లీక్ చేస్తారు.*

"రాధీ... నువ్వు మరీ పాజిటివ్‌గా ఆలోచిస్తున్నావేమో. మేబీ, ఆవిడ అప్పుడు చైతన్యతో గొడవపెట్టుకుందేమో!?" వివేకానందను సోఫాలో పద్ధతిగా కూర్చోబెడుతూ సాలోచనగా అంది సుష్మ.

"గొడవా..ఎందుకూ?" భృకుటి ముడివేసింది రాధిక

"అరే..ఇమాజిన్...అబ్బాయికి క్యాన్సర్ అని తెలిసి అందుకు హజ్బెండ్ జీన్స్ కారణం అని అక్యూస్ చేసేంత మనిషి, సడెన్‌గా వచ్చి వాడెక్కడకి వెళ్ళాడు అని అడిగితే, ఒక ఫ్రెండ్ ఇంటికి డిన్నర్‌కి పంపించాను అంటే ఊరుకోకుండా, అర్జెంటుగా ఆ ఫ్రెండు ఇంటినుంచి అబ్బాయిని తీసుకురా అంటోందంటే.... షి వాంట్స్ టు నో హు యు ఆర్, అండ్ మే బీ, నీకూ చైతన్యకు ఉన్న రిలేషన్‌ను తప్పుగా అర్థం చేసుకుని, ఏమైనా గొడవ.." వివేకానంద విడతీసేసిన తన సెల్‌ఫోన్ బ్యాటరీను సరిచేసుకుంటూ అంది సుష్మ.

ఆమె మాటలు వింటే రాధికలో చిన్నపాటి భయం పుట్టింది. ***అపార్థంతో రగిలే ఆడదాని మాట క్రూర జంతువుకన్నా ప్రమాదకరం.*** చైతన్య చెప్పినట్లు ఆవిడ నోటికెలా పడితే అలా మాట్లాడే వ్యక్తే అయితే, ఇప్పుడు ఇంటిదగ్గర ఏం అంటుందో... అమ్మ ఎంత కంగారు పడుతుంది. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితిలో రాజు, తండ్రిలేకపోవడం ఇప్పుడు మంచిదే అనిపిస్తోంది ఆమెకు.

"సారీ.. ఏమో నేను ఎక్కువ ఆలోచిస్తున్నానేమో. మేబీ తను అర్జెంటుగా కొడుక్ను చూడాలి అనుకుని ఉండొచ్చు..... లేకపోతే తనను తీసుకుని ఇద్దరూ ఎక్కడికైనా వెళ్ళాలి అని ప్లాన్ చేసుకుని ఉండొచ్చు" రాధిక ముఖకళవళికలు మసకబారుతుండడం చూసి ధైర్యంగా మాట్లాడింది సుష్మ. కానీ ఆమెకు తెలియకుండానే రాధికలో ఇంకొక భయానికి బీజం పడింది.

"అదేమిటి? వీవాను ఎక్కడికి తీసుకువెళతారు? ఎల్లుండి నుంచి అడ్మిట్ చెయ్యమని చెప్పానే.. పదిరోజుల్లో సర్జరీ.."

"ఏమో.. ఆవిడ తనను ఇక్కడ కాకుండా పారిస్‌లో ట్రీట్ మెంట్ ఇప్పిద్దాం అనుకుంటోందేమో" యధాలాపంగా అనేసిన సుష్మ రాధిక వేళ్ళు వివేకానంద భుజాలను పొదివిపట్టుకోవడం చూసి ఆగిపోయింది. ఆమెకు ఆ అబ్బాయికి మించి ఇప్పుడు ప్రపంచంలో ముఖ్యమైనది మరేదీ లేదు.

"కాదు సుష్మా... ఆవిడ మంచి మదర్‌లా అనిపించట్లేదు. సరి అయిన ట్రీట్ మెంట్ ఇప్పిస్తుందో లేదో" తనకు ఇష్టమైన బొమ్మను ఇంకెవ్వరితోనూ పంచుకునేందుకు ఇష్టపడని పసిమనసులా గుబులుపడిపోయింది రాధిక.

ఆమెను అనవసరంగా భయపెడుతున్నానని నొచ్చుకుంటూ,

"ఓకే ...వీవా.. ఇటు చూడు.. ఇది నవ్వు" తన బొటనవేలిమీద కలంతో మూడు చుక్కలు పెట్టి ఒక ముఖంలా బొమ్మ గీసి దాన్ని కదుపుతూ అతడి పొట్టమీదకు పొడిచింది సుష్మ. కిలకిలా నవ్వాడు వివేకానంద. అది చూసి రాధిక కూడా నవ్వేసింది. ***పసివాడి నవ్వు ఒక అందమైన అంటువ్యాధి.***

"మరి ఇది నేను..." ఇంకో వేలిమీద బొమ్మ గీసి ఆటకొనసాగించింది సుష్మ. ఆటల్లో నిమిషాలు ఎగిరిపోయాయి. కాలింగ్ బెల్ ఠంగుమనగానే రాధిక ముఖం వివర్ణమైంది. వంట్లోకి సత్తువ కూడదీసుకుని తలుపు తీసింది.

చైతన్య, చాలా ఇబ్బందిగా నవ్వుతూ,

"హలో.." అన్నాడు. అతడి పక్కన, ముదురు నీలిరంగు చీరలో, గోధుమ రంగు వర్చసులో, తెలివైన కళ్ళతో, అందమైన రహస్యంలా....

"మై వైఫ్" పరిచయం చేసాడు చైతన్య.

ఆవిడ సున్నితంగా చేతులు జోడించి నమస్కరించింది.

"లోపలకు రండి" దారి తీస్తూ జరిగింది రాధిక.

చైతన్య ఇబ్బందిగా లోపలకు రాబోయాడు.

"ఘూస్.." అతడి భుజం మీద చిన్నగా చరిచి నవ్వింది నీలిమ.. తన జోళ్ళు తీసుకునేందుకు మోకాళ్ళు మడిచి, ఆసరాగా అతడిని పట్టుకుంటూ. ఆ పట్టులో అతడంటే ఆమెకు చాలా ఆప్యాయత నమ్మకం ఉన్నట్లు తోచాయి రాధికకు.

"ఫర్లేదులే" రాధిక అంటున్నా ఇద్దరూ చెప్పులు విడిచి వచ్చారు.

"డాడీ.." సంతోషంగా ఎదురొచ్చిన వివేకానంద, నీలిమను చూసి మాటరానట్లు ఆగిపోయాడు. ఆవిడ మోకాళ్ళ మీదకు వంగి, అతడిని దగ్గరకు తీసుకుంది. ఎలా ప్రవర్తించాలో తెలియని సందర్భంలో ఇరుక్కున్నట్లు వేలితో చెవినొక్కుకుంటూ పెదాలు సగం తెరిచి అయోమయంగా చూస్తూ నిలబడిపోయాడు వివేకానంద. చేతులతో అతడిని తన దగ్గరకు లాక్కుని, ఆప్యాయంగా ముద్దులు కురిపించి ఎత్తుకుంది నీలిమ. గువ్వలా ఆ కౌగిట్లో ఒదిగిపోయాడు వివేకానంద.

"తను సింగపూర్ నుంచి ఈవినింగే వచ్చింది, అర్జెంటుగా వీవాను చూడాలంటే.." నసుగుతూ సంజాయిషీ ఇచ్చాడు చైతన్య.

"కూర్చోండి.." అంటూ ఇద్దరికీ సోఫా చూపిస్తూ, "తను సుష్మ.. మీకు గుర్తుంది కదా.. నా క్లాస్‌మేట్" సుష్మను పరిచయం చేసింది రాధిక.

అతడు గుర్తుచేసుకుంటున్నట్లు కళ్ళు రెపరెపలాడించాడు. కానీ గుర్తురాలేదు. ***ఆడపిల్లను పెళ్ళి అయిన పది సంవత్సరాలకు చూస్తే వేరే కొత్తమనిషిని చూసినట్లే.*** సుష్మను చూసి నీలిమ ముఖం ముడుచుకోవడం రాధిక గమనించలేదు. అదరూ మర్యాదపూర్వకంగా హలో చెప్పుకున్నాక,

"మీ గురించి ఆయన చాలా చెప్పారండీ. ఈవేళ మీరే వీవాకు సర్జరీ చేస్తున్నారంటే.. మాకు చాలా రిలాక్స్‌డ్‌గా ఉంది" వివేకానందను ఒళ్ళోనే కూర్చోపెట్టుకుని అతడి లేత చేతివేళ్ళను తనవేళ్ళతో మెల్లగా సవరిస్తూ అంది నీలిమ.

అంతవరకూ ఆమె నోటివెంట ఏ కఠినమైన మాట వినాల్సివస్తుందో అని భయపడిన రాధిక మనసు తేలికపడింది. వీవా ఇక తన సంరక్షణలో కోలుకుంటాడు. చైతన్య, నీలిమ కలిసిపోతారు. ప్రపంచం అంతా రంగులమయం. జీవితం ఒక సుందరస్వప్నం. ***మంచి ఆలోచనలు ఆటంబాంబులాంటివి. అణువు స్పందిస్తే చాలు అల్లుకుపోతాయి.***

"ఏం తీసుకుంటారు..? అమ్మా" అంటూ పూర్ణిమను పిలిచి, వాళ్ళకు అతిధి మర్యాదల ఏర్పాట్లు చూసింది రాధిక. పక్కపక్కన కూర్చున్న చైతన్య, నీలిమల మధ్య ఏ అరమరికలు లేని జంటలా కనిపించారు రాధికకు. మాటల్లో కాలం తెలియనేలేదు.

మరుసటిరోజునుంచీ వివేకానందను హాస్పిటల్‌లో అడ్మిట్ చేయడమేకాక, తానే దగ్గరుండి చూసుకుంటానని చెప్పి, రాధికను మరీ మరీ అభినందిస్తూ నిష్క్రమించారు వాళ్ళు.

వివేకానంద వాళ్ళతో వెళ్ళిపోతుంటే వెలితిగా అనిపించినా, సరి అయిన సంరక్షణలో అతడు చేరినందుకుసంతోషించింది రాధిక.

"రాధీ.. అయామ్ సారీ... నాకెలా చెప్పాలో తెలియడం లేదు" ఆమె భుజం మీద చేయివేసింది సుష్మ.

"హ్మా...నీకేమైంది ఇప్పుడు" సరదాగా టీవీ ఆన్ చేసింది రాధిక.

"చైతన్య నీకు నిజం పూర్తిగా చెప్పలేదు" సుష్మ గొంతులో తడబాటు.

"వాట్?"

"తన వైఫ్.. అదే నీలిమ.. షి ఈజ్ ఎ పేషెంట్ ఆఫ్ మైన్.." స్పష్టంగా చెప్పింది సుష్మ.

తానేం విన్నానో నమ్మలేకపోయింది రాధిక. ***ప్రపంచం చాలా చిన్నది. కానీ గుప్పిట్లో పట్టేంత ఇరుకు అని అందులో ఇరుక్కున్నప్పుడు కానీ తెలియదు.*** నీలిమ చివరకు సుష్మకు తెలియడమేమిటి?

"వీవా గురించి, చైతన్య గురించి... నీలిమ గురించి.. నీకన్నా ఎక్కువే తెలుసు నాకు. పాపం నీలిమ"

పాపమా? మానసిక క్షోభకు గురవుతున్నది నీలిమా?

❋ ❋❋

□

*నీతులు ఉన్నది మనుష్యులు తప్పడానికే. తప్పులో చిన్నదీ పెద్దదీ అని ఏదీ ఉండదు. తప్పు తప్పే. తప్పు చేసేముందు 'ఇదేమంత పెద్దది కాదులే' అని ఆత్మవంచన చేసుకుంటూ తప్పుచేయడం మానవ స్వభావం. అత్యంత దయామయులూ, మంచివాళ్ళు కూడా ఆ బలహీనతను అధిగమించలేరు.*

"ఒక డాక్టరుగా ఒక పేషెంటు వివరాలు ఇంకొక డాక్టరుకు కూడా చెప్పకూడదు, కానీ, ఒక ఫ్రెండ్‌గా ఈ విషయం నీకు చెప్పకుండా ఉండలేకపోతున్నాను" వివేకానందను నీలిమ తీసుకువెళ్ళిపోయాక ఆమె గురించి సుష్మ చెప్పిన మాటలు రాధికలో లెక్కలేనన్ని ప్రశ్నలను పుట్టించాయి. అందులో ముఖ్యమైనది, మొదటిది, ప్రతి మనిషినీ ఎన్నోసార్లు వెంటాడి వేటాడే ప్రశ్న:

నా జీవితగమనాన్ని నిర్దేశిస్తున్నది ఎవరు?

ఈ ప్రశ్న ఆమెకు ఎన్నిసార్లు వచ్చిందో గుర్తులేదో కానీ ఏ ఒక్కసారీ సరయ్యైన జవాబు మాత్రం చిక్కలేదు. ఆలోచించీ తర్కించీ తలనొప్పీ అలసటా నిద్రా తప్ప.

"మరీ. నీకున్న చీమ మెదడుకు ఇంత కాంప్లికేటెడ్ విషయాలు ఆలోచిస్తే తలనొప్పి రాదేంటి?" వెన్నెలతో పచ్చపొడిపించుకున్న ముఖంతో నవ్విన చైతన్య గుర్తుకు వచ్చాడు. ఒళ్ళంతా ఝల్లుమ్మంది. ఆమె జీవితంలో ఎప్పటికీ మరచిపోని ఒక అద్భుత సమయం అది. కవి కాని చైతన్య రాధిక కోసం అందించిన దృశ్యకావ్యం ఆ రాత్రి.

కార్తీక పౌర్ణమి.

వెన్నెలను తప్పించుకుందామన్నా కుదరదు. ఊరంతా పరుచుకుంటుంది. నేలంతా పారుతుంది. కిటికీల్లోంచి చూస్తే మిగిలిపోతుంది. డాబా మీద పడుకుని కప్పుకుంటే ఒదిగిపోతుంది. కానీ వెన్నెలను అలా ఫ్రేము చేసిన చిత్రపటంలా కాకుండా అంతులేకుండా చూడాలని ఆశపడింది రాధిక. ఇంట్లో అబద్ధం చెప్పి తనతో రాగలిగితే అలాంటి అందాన్ని ఆ రాత్రే చూపిస్తానన్నాడు చైతన్య. హాస్పిటల్‌లో సీనియర్లతో కలిసి నైట్ డ్యూటీ చేసి సర్జరీలు చూస్తానని నారాయణమూర్తిని నమ్మించింది. ఆయనే స్వయంగా ఆమెను హాస్పిటల్ దగ్గర వదిలిపెట్టాడు. పావుగంట తర్వాత చైతన్య ఆమెను దొంగిలించుకుపోయాడు.

"తప్పదు. అమెరికా వెళ్ళాలి అంటావు. అక్కడైతే పదమూడేళ్ళ పిల్లలు కూడా తల్లితండ్రులకు చెప్పి మరీ బోయ్ ఫ్రెండ్స్‌తో క్లబ్బులకూ, పబ్బులకూ వెళతారట. ఒకదేశంలో ఒప్పయినది ఇంకో దేశంలో తప్పెలా అవుతుందీ? అక్కడైనా ఇక్కడైనా మనుష్యులు ఒక్కతే, నీతులు మాత్రం వేరెలా అవుతాయీ?" తండ్రికి అబద్ధం చెప్పినందుకు పశ్చాత్తాపంతో ఆమె మూతిముడుచుకుని కూర్చుంటే ఒప్పించచూసాడు.

"కానీ, మనం చెప్పి వెళ్ళడం లేదుకదా" బైక్ తోలుతున్న అతని నడుమును పట్టుకుందామా ఒద్దా అని సంశయిస్తూ అడిగింది ఆమె.

ఇంట్లో చెప్పకుండా రాత్రిపూట ఒక అబ్బాయితో వెళ్ళడం ఎక్కువ తప్పా, ఆ అబ్బాయిని కౌగిలించుకోవడం ఎక్కువ తప్పా తేల్చుకోలేకపోయింది ఆమె.

"ఆఁ చెబితే ఒప్పుకుంటారు మరి? చూడు రాధీ, నిజ్జంగా మన దేశ సంస్కృతీ సాంప్రదాయం కట్టుబాట్లు ప్రకారం అయితే, పధ్నాలుగేళ్ళకల్లా అమ్మాయికి పెళ్ళిచేసేసేవాళ్ళు. అబ్బాయికయినా పదహారు పదిహేడేళ్ళకే పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు కదా.. ఏవో చిన్నప్పటి పురాణకథల్లో విన్నాను. నూనుగు మీసాలు రాగానే పెళ్ళి, పాతికేళ్ళలోపు పిల్లలు, ఓ యాభైయ్యేళ్ళొచ్చేసరికి మునిమనవల్ని చూసుకుని

అంతా వదిలిపెట్టి సన్యాసం తీసుకుని వెళ్ళిపోవడం.. అప్పుడే కదా బ్రహ్మచర్యం, గృహస్థ ధర్మం, సన్యాసం అన్ని స్టేజీలు సరిగా జరిగేది. ఏంటీ వింటున్నావా?'' తన వీపు మీద తలవాల్చుకున్న రాధిక స్పర్శ చల్లగా తగిలింది అతనికి.

''ఊఁచెప్పూ..'' ఈసారి వేరే ఆలోచనలేకుండా అతడిని అల్లుకుంది రాధిక.

''రెండొందలేళ్ళ ఇంగ్లీషు రూల్‌లో మనం మన సంప్రదాయంలో మంచివి వదిలేసుకుని, వాళ్ళ కల్చర్‌లో పనికిరానివి నేర్చేసుకున్నాం. మన హిందూ సంస్కృతిలో మనుషులను దూరం చేసి క్షోభ పెట్టే కులమతాల గొడవలను మాత్రం స్మరించుకుంటూ వెస్టర్న్ కల్చర్‌లోని మంచి విషయాలను మాత్రం అసహ్యించుకుంటున్నాం. ఫర్ ఎగ్జాంపుల్, తప్పుదారి పట్టకుండా కట్టుబాట్ల ప్రకారం అవి తీర్చుకోవడానికి సరి అయిన వయస్సులో జతకట్టించడం, ఆ వయస్సులోనే సరి అయిన ప్రేమ పుట్టడంతో ఆ జంట జీవితాంతం సంతోషంగా ఉండగలిగేది. కానీ బ్రిటిష్ రూల్‌లో పేదరికం వలన ఉద్యోగం, లైఫ్‌లో సెటిల్ అవడం అలాంటివాటికోసం ఆ పెళ్ళివయసు పెరిగిపోయింది. పధ్నాలుగేళ్ళ నుంచీ దాదాపు పాతికేళ్ళవరకూ దాదాపు ఒంట్లో హార్మోన్స్ గొడవను తట్టుకుని ప్రతిమనిషీ నిలబడడం అసాధ్యం కాకపోవచ్చు. కానీ ఆకలి వేసినప్పుడు శరీరానికి సరి అయిన తిండి పెట్టకపోవడం ఎంత తప్పో హార్మోనల్ అర్జ్‌ను తీర్చకపోవడమూ తప్పే. తమ శరీరాన్నే సంతోషపెట్టలేని మనిషి మిగతావారికేం చేయగలడు? ఈ ప్రాబ్లంను తప్పించుకోవడానికే వెస్టర్న్ కల్చర్‌లో డేటింగులూ గట్రా మొదలయ్యాయి. పెళ్ళిలాంటి కమిట్ మెంట్ తీసుకునే వయసు వచ్చేంతవరకూ శరీరాన్ని అయినా తృప్తిపరచుకునేందుకు అక్కడివారికి ఆ కల్చర్ వెసులుబాటు కలిపించింది''

మాటల్లోనే బైక్ దిగి మెల్లగా ఇసుకలో అడుగూ అడుగూ వేసుకుంటూ నడుస్తున్నారు ఇద్దరూ.

''అందుకే నువ్వూ అమెరికా వచ్చెయ్. అక్కడైతే వీలైనప్పుడల్లా బీచ్‌కు వెళ్ళొచ్చు'' ఆశగా అతడి భుజం పట్టుకుని లాగింది.

''ఇదిగో.. ఈవేళ ఏదో మంచి వెన్నెల, రొమాంటిక్‌గా ఉంది. మధ్యలో అమెరికాలాంటి టాపిక్‌లు తీసుకువచ్చి మూడ్ చెడగొట్టొద్దు'' భృకుటి ముడివేసాడు చైతన్య.

''నువ్వేకదా, ఇక్కడికంటే అక్కడైతే ఫ్రీడం ఉంటుంది అంటున్నావ్'' మెల్లగా చెప్పులు తీసేసి పాదాలకింద ఇసుక చల్లగా తగులుతుంటే ఆస్వాదించింది రాధిక

''నేను జస్ట్ ఇండియన్ కల్చర్‌కూ వెస్ట్‌కూ తేడా చెబుతున్నాను. దట్ డజంట్ మీన్ ఐ విల్ రన్ అవే ఫ్రమ్ హియర్''

''రన్నింగ్ అవే.. జస్ట్ ఫర్ బెటర్ లైఫ్'' ఆమె మాటను మధ్యలోనే తుంచేసి కోప్పడ్డాడు చైతన్య: ''ఏంటి బెటర్? బెటర్ లైఫ్ బెటర్ ఎడ్యుకేషన్ బెటర్ ఇస్కమ్... ఇలా ఎక్కడ బెటర్ ఉంటే అక్కడికి వెళ్ళిపోవడమేనా? మన ఇంట్లో అమ్మవంటకంటే పక్కింటి ఆంటి వంట బావుంటే రోజూ అక్కడికి వెళ్ళి తింటామా? మన స్వంతది కానిదేదీ బెటర్ కాదు. ఇదిగో ఇప్పుడు నువ్వున్నావు, నీకంటే ఆ టైటానిక్ సినిమా హీరోయిన్ బావుంటుంది.. చూట్టానికి, మరి అయితే నేను నీతో ఎందుకు ఉండాలి? అమెరికా వెళ్ళి రోజూ ఆ కేట్ విన్ స్లెట్ ఇంటిముందు పడిగాపులు కాయొచ్చుకదా. ఏమో.. ఎవరికి తెలుసు. అలా జరగొచ్చుకదా. కానీ ఛాన్స్ వదులుకుని నేను నీతో ఎందుకు ఉంటానూ.. అంటే నాకు నువ్వే కావాలి మరి'' ఆమెను తనవేపు లాక్కున్నాడు.

సముద్రం అంతా ఉన్మాదం వచ్చినట్లు ఉప్పొంగుతోంది. ఎంత ఎగసినా నేలను దాటలేక ఇబ్బంది పడుతోంది. నల్లరాళ్ళ గుట్టలమీదకు నడిచారు ఇద్దరూ. ఒక అల ఎగిరింది. రాధిక జుట్టు చెదిరింది. ముఖం మీదకి తుంపర జల్లు కొట్టింది. భావోద్వేగంతో ఆమె పెదవులు కంపించాయి. చైతన్య చేతిని బిగించి పట్టుకుంది. ఆకాశంలో మబ్బులన్నీ పచ్చగా ఉన్నాయి. బంగారుగనిలా చంద్రుడు. కచేరీ చేస్తున్న సంగీతంలా సముద్రం. ఎప్పుడో చాలా తక్కువ సందర్భాల్లో, ఇక ఈక్షణమే చచ్చిపోతేచాలు అనేంత ఆనందం వేస్తుంది మనసుకు. ఏమయిపోతానో అన్న భయంతో మరింత అతనికి దగ్గరగా జరిగింది రాధిక. ఆమె ప్రకృతినే చూస్తోంది. అతడు ఆమె మీదనుంచి చూపు తిప్పుకోలేకున్నాడు. కొన్ని నిముషాలు ఇద్దరూ అలానే ప్రతిమల్లా ఉండిపోయారు. మెల్లగా తేరుకుంది రాధిక.

"అసలు లైఫ్ ఇంత కాంప్లికేటెడ్‌గా ఎందుకు ఉండాలి చే" చలిగాలినుంచి భుజాలను అరచేతులతో కప్పుకుంటూ అడిగింది. చనువుగా ఆమెను తన ఛాతీకేసి అదుముకుంటూ, "ఏం కాంప్లికేటెడ్? సీ.. ఇక్కడ ఆకాశం, సముద్రం, వెన్నెల, నువ్వూ, నేనూ, ప్రకృతీ, మానవులు.. అదిగో ఆ సముద్రంలో ఉండే చేపలూ... అంతా నార్మల్‌గానే ఉందిగా. ఇప్పుడేంటీ, ఎప్పటినుంచో లైఫ్ ఇంతే. ఏం మార్పు లేదు" అన్నాడు

"కదా.. నాకూ అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. ఈ సముద్రం చూడూ. మనిషి ఎంత చేసినా ఇలాంటిదొకటి సృష్టించగలడా? మన సిటీలో రోడ్లూ, పెద్ద పెద్ద బిల్డింగులూ అన్నీ దీనిముందు ఎంత ఇన్ఫీరియర్‌గా అనిపిస్తాయో. మనకు కావాల్సింది మంచి ఆరోగ్యం, తిండి, ఆనందం అంతేకదా. సింపుల్‌గా అంతటితో ఆగిపోక ఎందుకు ఎక్కువ ఆశపడి ఇలా టెన్షన్‌గా బ్రతుకుతాం?"

జీవితంలోని ప్రాథమిక సూత్రాలను ప్రశ్నించే శిశువులా ఆమె అడుగుతుంటే అబ్బురంగా చూస్తుండిపోయాడు అతను

"అసలు మన లైఫ్ మన కంట్రోల్‌లో ఉండదెందుకు? సీ.. ఇప్పుడూ ఈ వెన్నెలను నేను చూడాలి అంటే అందుకు నువ్వు కావాల్సివచ్చావు. అంటే ఈ రోజు నువ్వు అనేవాడివి నాకు తెలియకపోతే ఈ బ్యూటిఫుల్ మొమెంట్ సాధ్యమయ్యేది కాదేమో. కానీ మనం ఇలా రావడానికి మా డాడీను నేను లిటరల్‌గా ఛీట్ చెయ్యాల్సి వచ్చింది. దానికి కారణం, నువ్వన్నప్పుడు మనం అమెరికాలాంటి దేశంలో పుట్టకపోవడం. అంటే, నేను మానాన్నను మోసం చెయ్యడానికి ఇంకెవరో మనదేశంలో అలా కల్చర్‌ను మోరల్ పోలీసింగ్‌ను చెయ్యడం కారణం. వాళ్ళలా చెయ్యడానికి బ్రిటిష్ రూల్‌లో నిజమైన హిందూ సంస్కృతి కలుషితమవడం కారణం అని అంటావ్. అంటే ఎవరో వ్రాసిన గ్రంధాలూ, ఇంకెవరో చేసిన రాజ్యమూ, ఇంకొకరి నమ్మకమూ, అపనమ్మకమూ ఇవన్నీ కలిసి ఈరోజు మనం గడుపుతున్న ఈ కాలాన్ని ఇలా శాసించాయి. ఇక మన లైఫ్ అంతా మన కంట్రోల్‌లో సాగుతోంది అనుకోవడం ఏంటి..?"

"చాలు చాలు... నువ్వు ముందిటురా" తనకు పక్కన భాసింపట్టు వేసుకుని కూర్చున్న ఆమె చేతిని పట్టుకుని తనవేపు లాక్కున్నాడు చైతన్య.

"ముందు నేను అడుగుతున్నవాటికి ఆన్సర్.." ఆమె అతడిని సున్నితంగా తోసివేసింది.

"ఓకే చెబుతాను. కానీ ఒక కండీషన్. నేను ఏం చెయ్యమంటే అది చెయ్యాలి. నేనేం చేసినా నో అనకూడదు" తన కళ్ళల్లోని మెరుపుతో ఆమె కళ్ళను గుచ్చుతూ కొంటెగా నవ్వాడు అతను.

"ఓయ్... ఏద్ మిస్చీఫ్ కనిపిస్తోంది. నేనొప్పుకోను.." ఇంకో అడుగు దూరం జరిగింది ఆమె. అడుగున్నర దగ్గర జరిగాడు అతను. సముద్రపు తుంపరలను అణిచేస్తూ అతడి శరీరం చల్లగా తగిలినా వెచ్చగా తోచింది ఆమెకు. ఇంకో అడుగు దూరం జరగాలి అనుకుంది. కానీ అణువైనా కదలలేకపోయింది. ఆమె వెనుకచేరి నడుము మీంచి పొట్టమీదుగా చేతులు పోనిచ్చి తనమీదకు వాల్చుకున్నాడు అతను. ఊపిరితో ఎగసిపడుతున్న అతడి ఛాతీమీద తల ఆన్చుకుని ఆకాశం వంక చూసింది ఆమె. అతడికి మాత్రం మొత్తం నలుపే కనిపిస్తోంది. ముఖాన్నంతటినీ కప్పేస్తున్న ఆమె జుత్తును వేళ్ళతో మెల్లగా స్పృశించాడు. మబ్బులన్నీ వెన్నెలతో నిండిపోయి భారంగా కదులుతున్నాయి. అతను ఆమెపై తన పట్టుబిగించాడు. అరచేతిని పైకి పోనిచ్చి అతడి చెంపను తడిమింది రాధిక. నలభై ఎనిమిదిగంటల వయసు గడ్డం గరకుగా గీసుకుంది. అరచేతుల్లోని గిలిగింతకు అతడిమీద నవ్వుకున్నట్టు కదిలింది.

"ఊఁహ్..ఒక్క నిముషం.." ఏదో గుచ్చుకున్నట్లు అతడు ఆమెను కొంచెం దూరం జరిపాడు. ఆమె చూస్తుండగానే అతను ప్యాంటు వెనుక జేబులోంచి పర్సును, ఒక చిన్న చాకుని తీసి పక్కన ఉంచాడు. విస్తుబోతూ చాకును పట్టుకుని ఆమె ప్రశ్నించబోతుండగానే,

"నువ్వింకా చిన్నపిల్లవు. ఇలాంటి అందమైన ప్రదేశాల్లోనే అన్‌వాంటెడ్ అపాయాలు రావొచ్చని తెలీదు కదా. ఏమో.. ఏ తాగుబోతో, రౌడీలో వస్తే.." చాకును తీసిపొడిచేస్తానన్నట్లు నటించాడు చైతన్య.

"నీకంటే రౌడీలా?" నవ్వేస్తూ చాకు తీసి పక్కన పెట్టేసింది రాధిక. *ప్రేమికుడు ఉన్న ప్రతి ఆడదీ వేలరక్షకులు ఉన్న మహారాణితో సమానం.* తనమీద వేరొకడు చెయ్యేస్తే నిజంగానే పొడిచేస్తాడా? బాబోయ్. ఒక్క ఘడియకూడా వృధా చేయకుండా మళ్ళీ అతడి ఛాతీమీద వాలిపోయింది.

"ఇంతకీ నేను అడిగిందానికేం చెప్పవేం..?" అతడి చేతిని తన చేతుల్లోకి తీసుకుని, అరచేతుల్లోని రేఖలపై మళ్ళీ వేలితో బొమ్మలు గీస్తూ అడిగింది రాధిక.

"ఊఁ చెబుతా.. నువ్వు కాయిన్‌కు ఒక వైపే చూస్తున్నావ్. నువ్వన్నట్లు మన లైఫ్‌లో ఎప్పుడు ఏం జరిగాలో మన చేతుల్లో ఉండకపోవచ్చు, కానీ మన జీవితగమనం మాత్రం ఖచ్చితంగా మన కంట్రోల్‌లోనే ఉంటుంది" ఆమె భుజానికీ చెంపకూ మధ్యలో తన చుబుకం వాల్చుకుంటూ, "నువ్వు ఒక పరీక్షకు వెళతావు, అక్కడ ఎవ్వరో సెట్ చేసిన క్వొశ్చిన్ పేపర్‌కు నువ్వు ఎలా ఆన్సర్ చేసావు అనేదాన్ని బట్టి నీ లైఫ్ మారిపోతుంది. సో.. నీ లెఖ్ఖ ప్రకారం నీ లైఫ్ క్వొశ్చిన్ పేపర్ సెట్ చేసినవాడో, లేకపోతే వాడు ఆ ప్రశ్నలు అడిగేందుకు కారణమైన సబ్జెక్టును శోధించి, ప్రతిపాదనలు చెప్పిన శాస్త్రవేత్తల జీవితాలే నీ జీవితాన్ని నియంత్రిస్తున్నాయి. కరెక్టే.. అదిగో.. ఆ అలలు చూడూ... "అతని చెంపకు తన చెంపను ఆనిస్తూనే చూసింది రాధిక. యుద్ధంలో చచ్చేందుకు దూసుకొచ్చే సైనికుల్లా ఉరుకుతున్నాయి.

"ఆ అలలకంటే దూరంగా చూడూ... అక్కడ సముద్రమూ ఆకాశమూ కలిసిపోతున్నాయే..." అక్కడకు వెళితే బావుణ్ణనే కోరికను అదుపుచేసుకుంటూ చూసింది రాధిక.

"అక్కడెక్కడి నుంచో ఒక అలపుట్టి, దాని వైబ్రేషన్స్‌ను ఇక్కడదాకా తంతుంది. నువ్వు చెప్పిన మన పూర్వీకులు, హ్యూమన్ కల్చర్, హిస్టరీ అంతా అదిగో అక్కడ. ఈవేళ మనం ఆ యుగాల సముద్రంలో జస్ట్ చిన్న కెరటాలు మాత్రమే. సముద్రంతో పోల్చి చూస్తే అల నథింగ్. మిగతా అన్ని అలలూ ఎలా వెళితే అదీ అలా వెళ్ళాల్సిందే ఎదురు తిరిగి ఇంకో వేపుకు పారలేదు. కానీ, అలా అందరి తరహాలో వెళుతున్నప్పటికీ దానికంటూ ఒక ప్రత్యేకమైన ఐడెంటిటీ ఉంటుంది. చూడు చూడు... ప్రతి అలా ఒకోరకంగా ఉంది. కొన్ని మధ్యలోనే మాయం అవుతున్నాయి, కొన్ని ఇదిగో ఈ ఇసుకను ముట్టుకునేంత దూరం వస్తున్నాయి. తన వెనుక అలల బలహీనతలను కూడగట్టుకుని అనామకంగా నశించుకుపోయేవి కొన్ని, తన పుట్టుకకు కారణమైన వాటి బలాన్ని సమీకరించుకుని ఎగసిపడేవి కొన్ని. మనమైనా అంతే. మానవ చరిత్రలో బలహీనతలనూ, వైఫల్యాలనూ..."

"ఏంటి చే... ఇంత ప్యూర్ తెలుగు మాట్లాడుతున్నావు?"

"చుప్.. మధ్యలో అడ్డంరామాకు.." చెంపమీద ఒక బలమైన ముద్దుతో ఆమెను శిక్షించాడు. బలహీనమైన చెంపదెబ్బతో తనకు నచ్చిందని చెప్పింది ఆమె.

"సరే చెప్పు చెప్పు.." ముద్దుకంటే మాటలే ముఖ్యమనిపించాయి ఇద్దరికీ.

"సో.. అలా అలలా, మన లైఫ్ఇంతకుముందు వారి లైఫ్ వల్లో, మన చూట్టూ ఉన్న మిగతావారి జీవితాలవలనో 'ఇన్‌ఫ్లుయెన్స్' అవుతున్నా, మన ఐడెంటిటీ మనమే నిలుపుకుంటూ, ఎలా బ్రతకాలీ అనే డెసిషన్ మనమే తీసుకుంటు బ్రతకడమే మన చేతుల్లో ఉన్నది. ఎవ్వరు ఎన్నివిధాలుగా మన జీవితగమనాన్ని మార్చాలి అని ప్రయత్నిస్తున్నా, మనం అనుకున్నట్లే మనం బ్రతకగలిగితే అది చాలు."

"కానీ ఎలా...? మనం అనుకున్నట్లు మనల్ని బ్రతకనివ్వకుండా ఎన్ని శక్తులు అడ్డుపడతాయి? సాటి మనుష్యులు, ఫేట్, గాడ్.." అలలనే చూస్తూ అంది రాధిక.

"అదిగో అదే చెప్పేది అవన్నీ కూడా నీ ఆశయాల్నీ, రిజల్ట్‌నూ మారుస్తాయేమోకానీ నీ గమనాన్ని కాదు. గేమ్ గెల్చామా ఓడామా కాదు మనం అనుకున్నట్లు ఆడటమే మజా... ఫర్ ఎగ్జాంపుల్... ఇప్పుడు మనం ఒక గేమ్ ఆడుదాం. అందులో నువ్వూ ఓడవు నేనూ ఓడను... " మెల్లగా పెదవులు ఆమె చెంపలమీంచి పెదవుల దగ్గరకు చేర్చాడు.

"నో... అమెరికా రా... అక్కడైతే ఓకే" ముఖం తిప్పేసుకుంది రాధిక."నోవే... కేవలం ముద్దు ఇవ్వడం కాదు, ఇండియాలో, వైజాగ్ బీచ్‌లో, వెన్నెల్లో నిన్ను కిస్ చెయ్యడమే థ్రిల్. నీలాగ నేనెప్పుడు కాంప్రమైజ్ అవ్వను"

"అయితే నేనూ అవ్వను ఫో" మూతిముడుచుకుని ఆకాశం వేపు చూపు తిప్పేసుకుంది రాధిక.

"హూ.. నా దగ్గర నేర్చుకున్నవి నా మీదే ప్రయోగమా? అంతేలే గురువును మొట్టమొదటగా ఎక్స్ప్లాయిట్ చేసేది స్టూడెంటే" ఇంకే కోరికా లేనట్లు చేతిమీద తలవాల్చుకుని తనూ ఆకాశం కేసి చూసాడు చైతన్య. సముద్రం నుంచి విడివడి కలుసుకున్న రెండు అలల్లా అలానే ఉండిపోయారు ఇద్దరూ... వెన్నెలను సూర్యుడు పంపేసేవరకూ.

✵ ✵✵

ఇన్ని సంవత్సరాల తర్వాత తలుచుకున్నా ఆ క్షణం చాలా తాజాగా అనిపించింది రాధికకు. నిజమే. అతని దగ్గర నేర్చుకున్న గొప్ప విషయాలన్నీ అతడిమీదే ప్రయోగించింది తను. కానీ అవి ఖచ్చితంగా అమలు చేసేందుకు తనకు పరీక్షకాలం ఇదే అనిపించింది. సుష్మ నీలిమ గురించి ఎంతో చెప్పింది. ఒక డాక్టరుగా చెప్పకూడనివే అయినా స్నేహితురాలికోసం చెప్పకుండా ఉండలేనంటూనే... నీలిమ గురించి చైతన్యకు కూడా తెలియనన్ని విషయాలు. చైతన్య అన్నట్లు ***తాము ఎంచుకునే పద్ధతులవలన మనుష్యులు మారిపోతారు.*** ఒకే మనసుకు రెండు పార్శ్యాలు ఉంటాయి.

మనోబలం రాధిక, బలహీనత నీలిమ.

ఒకే ఆకాశం క్రింద ఇద్దరు స్త్రీలు. అందమైన కలగా ఆకాశాన్ని రాధిక కప్పుకుని పడుకుంటున్న వయసులోనే, తన బట్టలన్నీ విప్పేసుకుని నగ్నంగా పడుకుని ఆ విచ్చలవిడితనంలో తన స్త్రీత్వాన్ని చూసి గర్వపడిన వైల్డ్‌బ్యూటీ నీలిమ. పదిహేనేళ్ళ ప్రాయంలో, ఊరికి దూరంగా ఒక్కతే వెళ్ళి, ఎవ్వరూ రాని నది ఒడ్డున, ఎవరైన వచ్చేస్తారేమో అనే ఉత్కంఠత నడుమ, బట్టలు విడిచిపెట్టి పరుగెట్టింది నీలిమ. ప్రకృతి మొత్తాన్ని తన అందాన్ని చూసుకోమని సవాలు చేసింది. ఎదుగుతున్న ఎదకు స్వచ్ఛమైన గాలి తగిలితే చిన్నపిల్లలా కేరింతలు కొట్టింది. అంతటి అనంతమైన ఆకాశమూ తన ఆడతనాన్ని కప్పలేకపోతోందని హొయలుపోయింది. అప్పుడప్పుడే ఒంటికి తెలుస్తున్న శృంగారాన్ని కేవలం తనకూ ప్రకృతికీ మాత్రమే అర్పించుకోదలిచింది. ఆడయినా, మగయినా, మనుష్యులు తమ మొట్టమొదటి శృంగార చర్య తమ శరీరంపై తామే ప్రయోగించుకుంటారు. జంతువులు ఏమీ చేసుకోలేని 'స్వయం తృప్తి' మనిషి స్వంతం. అదేమిటో ఎలా చెయ్యాలో తెలుసుకున్న నీలిమ, తనమొట్టమొదటి 'ఆ ప్రయోగాన్ని' కళ్ళుమూసుకుని ఆకాశం కింద అనుభవించింది. తనకు తానే చేసుకున్న శృంగారంలో భావప్రాప్తిని పొందాక ఆకాశాన్నే చూసింది.

"సైకియాట్రిస్ట్‌గ ఎందరో పేషెంట్ల వియర్డ్ ఎక్స్‌పీరియన్స్ విన్నాను కానీ, వాట్ షి డిడ్ సౌండెడ్ వెరీ హీరోయిక్" నీలిమ గురించి చెబుతూనే సుష్మ గొంతులో తొణికిసలాడిన మెచ్చుకోలు రాధిక గమనించకపోలేదు.

***తాము అనుకున్నట్లు బ్రతకడం అందరి మనుష్యులకూ సాధ్యం కాదు. వందమంది క్రూరమైన మనుష్యులకు ఏం జరిగినా ఫర్లేదు కానీ, ఒక సున్నితమైన మనసు గాయపడితే జరిగే అనర్థాలు అనంతం.***

✵ ✵✵

ప్రపంచంలో కల్లా సున్నిత మనస్కులు కళాకారులు. కళాకారులు అంటే ప్రపంచం దృష్టిలో శిల్పాలు చెక్కినవారో, సంగీత సాధన చేసేవారో , రచయితలూ , సినీనటులూ , పారేసే వస్తువులతో చిత్తరువులు చేసేవారూ... ఇలాంటివారే కావొచ్చు. కానీ వీళ్ళంతా తమలోని కళను వ్యక్తపరిచేవాళ్ళు. వ్యక్తపరిచేందుకు జీవితంలో సహకారం , సమయం కలిసివచ్చిన అదృష్టవంతులు. కానీ భాగ్యం లేక తమ కళను వ్యక్తపరచే విద్య నేర్వలేకపోయిన దురదృష్టవంతులు ఉంటారు. రవి వర్మ కాదగినవాడు గవర్నమెంటు ఆఫీసులో లెక్కలు చూస్తూ మిగిలిపోవచ్చు , మైకేల్ జాక్సన్‌లాంటివాడు హోటళ్ళలో దోశలు పోసుకుంటూ , ఎమ్మెస్ సుబ్బలక్ష్మిలా సంగీతంతో బ్రతికే అవకాశంలేక బ్యాంకు ఉద్యోగం చేసుకుంటూ పిల్లల స్కూలు ఫీజుగురించి ఆలోచించడంలో మునిగిపోయేవాళ్ళు ఎందరో ఉంటారు. కళను వ్యక్తపరిచే మార్గం లేకపోయినంత మాత్రాన మనిషిలోని కళ చచ్చిపోదు. ప్రతి శిశువూ ఒక కళాకారుడే , కానీ బాల్యంనుంచి పెరిగేప్పుడు సరి అయిన ఊతం దొరకనప్పుడు కళ దూరమైపోతుంది. తాము కోల్పోయిన కళనే తమ పిల్లల్లో చూసుకుని ఎదగనిచ్చే తల్లితండ్రులు కొందరు. తాము కోల్పోయిన కళపట్ల ద్వేషాన్ని పెంచుకుని తమ పిల్లల్లోంచి కళను వేరుచేసి , ఈసడించి, కర్కశంగా దారులుమూసేసే మూర్ఖులు ఇంకొందరు. దురదృష్టవశాత్తూ అలాంటి బాల్యం అనుభవించింది నీలిమ. పాట వినిపిస్తే ఆగిపోయేది. రోడ్డు మీద చూసిన కుక్కపిల్లను గోడమీదో కాగితం మీదో ప్రతిసృష్టించాలని ప్రయత్నించేది. టీవీలో ఎవ్వరు ఎలా నర్తించినా అనుకరించడమే కాక రకరకాల కదలికలను కలబోసి కొత్త నృత్యాన్ని పుట్టించేది. నాలుగైదేళ్ళు తల్లితండ్రులిద్దరికీ చేష్టలు ఎంతో ముద్దునిచ్చాయి. తర్వాత అలవాటయిపోయి చిరాకు అనిపించాయి. నీలిమ తల్లికి వంటింట్లో కూరమాడిపోవడానికి కారణం పసిపాదాలు నేలపై నర్తించడమే అనిపించింది. నీలిమ తండ్రి గోపాలరావుకు ఒక కాంట్రాక్టు దక్కని అసహనం అంతా ఆమె పాడే పాటను తొక్కేసింది.

నాలుగో తరగతిలో తాను చెప్పినట్లు బొమ్మ వెయ్యలేదని డ్రాయింగ్ టీచర్ తిట్టింది. భారతదేశపు జెండా బొమ్మ అది. జెండా కర్ర సరిగ్గా ఎనిమిది ఇంచీలున్నాయా లేదా అని ప్రతి పిల్లవిద్యార్థి పుస్తకంలో రూళ్ళకర్ర పెట్టి మరీ కొలిచిన ఆవిడ నీలిమ అందించిన డ్రాయింగుబుక్ చూసి కళ్ళు తేలేసింది. ఆమె రూలు ప్రకారం అయితే జెండా వెడల్పు రెండున్నర ఇంచీలు బారుగా వేసి ఒక పావు ఇంచీ కిందుగా జెండా మడత పడినట్లు ఇంకో అర ఇంచీ పొడవు ఉండాలి. కానీ నీలిమ జెండా వంపుగా ఎగురుతున్నట్లు వేసింది. పైగా జెండా క్రింద నీడ అనిపించేట్లు పెన్సిల్‌తో నలుపుగా గీసింది. తాను జీవితాంతం నమ్మిన దేవుడిని ఎవరో కించపరిచినట్లు కించపరిచినట్లు భావించింది ఆవిడ.

కళ అంటే ఏ మాత్రం తెలియనివాళ్ళే ఎక్కువభాగం కళను అమ్ముకుని బ్రతికేవారై ఉంటారు. ఇంకేమీ చేతకాక, కష్టంలేని పని చేసి కాస్తం సంపాదించుకుందాం, అని డ్రాయింగు టీచరు అయిన ఆవిడకు నీలిమలోని సృజనాత్మకత కోపం తెప్పించింది. కర్కశంగా పసిపిల్ల బొమ్మవేసిన కాగితం మీద ఎర్ర ఇంకుతో ఇంటూకొట్టేసి సున్నా మార్కులేసి , " ఇదిగో ఇలా వేస్తే , మీకందరికీ ఇదే గతి " అంటూ క్లాసులో మిగతాపిల్లలకు అందరికీ చూపించి పుస్తకాన్ని నిర్లక్ష్యంగా నీలిమమీదకు గిరాటువేసింది. పిల్లలందరూ నవ్వారు, పగలబడి. అందులో అంతకుముందే బొమ్మను చూసి " ఇలా పిచ్చిపిచ్చిగా బొమ్మ వేస్తే మేడం కొడుతుందిగా " అని చిన్నతనం నుంచే బానిసత్వం పుణికిపుచ్చుకున్న దద్దమ్మలు మరీ గట్టిగా నవ్వారు. ముఖం లేని సమాజంలో కాస్తంత వ్యక్తిత్వం నిలుపుకునేవారంటే వ్యక్తిత్వంలేనివారందరికీ చెప్పలేనంత కసి ఉంటుంది. నీలిమకు వారి నవ్వుకన్నా , తన స్నేహితురాళ్ళ నవ్వు మరీ ఆశ్చర్యమనిపించింది. తన డ్రాయింగును టీచరు ఇలా కొట్టివేయడానికి కొంతసేపటి క్రితం వారకూ వాళ్ళు "ఎంత బావుందో" అని , తమకూ అలా బొమ్మగీయడం నేర్పవా అన్నవారు హఠాత్తుగా తాము మెచ్చుకున్నదాన్నే అవమానిస్తూ నవ్వుతున్నారు. స్నేహాలన్నీ అబద్ధాలు అనిపించాయి ఆమెకు. తనను తాను తప్ప ఎవ్వరినీ నమ్మకూడదు అనిపించింది. తర్వాత ఆమె ఎన్నో బొమ్మలు వేసింది. కానీ ఎవ్వరికీ చూపించేది కాదు. తాను కూడా కాసేపు చూసి తర్వాత చించి ముక్కలు చేసి పారేసేది. అవన్నీ చూసి ఎవ్వరు తనను వెక్కిరిస్తారో అనే భయం.

చించిన ముక్కలను అన్నిటినీ ఒక్కచోట పారెయ్యదు. స్కూల్‌బ్యాగులో పెట్టుకుని బడికి వెళ్ళేప్పుడు దారంతా అక్కడొకటి ఇక్కడొకటిగా విసిరేసేది. ఎట్టి పరిస్థితుల్లోనూ తన సృజనాత్మకతనూ, ఆలోచనలనూ , అభిరుచులనూ ఎవ్వరూ తెలుసుకోకూడదు అనిపించేది.

పసితనంలో ప్రతివారికీ ప్రాణప్రదమైన ఆటవస్తువు ఒకటి ఉంటుంది. దాన్ని ఇంకెవ్వరికీ ఇవ్వరు, చూపరు, ముట్టుకోనివ్వరు. నీలిమకు ఆటబొమ్మ తన మనసే అయ్యింది. తిరస్కారాలూ, నిర్లక్ష్యం, నిరాదారణ, పరిహాసాలకు అలవాటు పడిపోతూ సమాజంలో మెల్లమెల్లగా రాటుదేలినట్లు పెరిగుతూనే ఆమె తన సున్నితభావాలను మాత్రం తన గుండెలోనే ఇరికించుకుంది. ఇంట్లో నర్తించడం, పాటలు పాడడం ఆగిపోయాయి. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు తల్లితండ్రులు. స్నానాలగదిలో నీటితో ఆడుకుంటూ అమ్మాయి వగలు పోవడాన్ని నిర్జీవమైన గోడలు మాత్రమే చూసాయి. పెదవులు కదల్చకున్నా మనసులోనే పాటలు పాడుకునే కోకిల తమ మధ్యే ఉందని ఆమె చుట్టూ ఉండేవారెవ్వరికీ తెలియనైనా లేదు. వయసు పెరిగేకొద్దీ ఆమెకు ప్రపంచం అంతా ఒక అబద్ధంలా అయోమయంగానే అనిపించేది. తనకు రెండవసారే చదవడానికి విసుగు అనిపించే పాఠాలను స్కూలులో మాస్టార్లు ప్రతిసంవత్సరమూ ఎలా జపిస్తారో కదా అనిపించేది. రెండవ ప్రపంచయుద్ధం ఏ సంవత్సరంలో జరిగిందో కాస్తంత తేదీ తప్పు చెబితే ఎవ్వరు కొడతారో అని భయపడే తోటివిద్యార్థులు అస్సలు అర్థం లేనట్లు కనిపించేవారు.

ప్రపంచాన్ని ఆమె ద్వేషించలేదు. జాలి పడింది. కానీ తనను తాను ద్వేషించుకుంది, అలాంటి జాలిపడాల్సిన స్థితిలో బ్రతుకక తప్పడం లేదే అని. అందరిలానే స్కూలు యూనిఫారం వేసుకున్నా, అందరిలానే దినచర్యలు గడుపుతున్నా తనకు తానో ప్రత్యేకమైన వ్యక్తిగా భావించుకుంది. ప్రత్యేకతను ఎవ్వరైనా గుర్తించకపోతారా అని అప్పుడప్పుడూ ఆశపడేది. తల్లితండ్రులతో మొదలైన దురదృష్టం - ఆమెను స్నేహితుల రూపంలోనూ వెక్కిరించింది. సమయం పంచుకోవడానికి దొరికనంత సులభంగా మనసు పంచుకోవడానికి మనుష్యులు దొరకరు. మంచి స్నేహితులు దొరకని మనిషి ఒక ద్వీపంలా మిగిలిపోవాల్సి వస్తుంది.

తన ఊసులు తనతోనే పంచుకున్న నీలిమ పదమూడేళ్ళ ప్రాయానికే భరించలేనంత ఒంటరితనంలోకి కూరుకుపోయింది. జీవితం అంటే విసుగు పుట్టింది. ముసలివాళ్ళనో తన తల్లితండ్రులనో చూస్తే అసలు మనుష్యులు ఇన్నేళ్ళు బ్రతికి ఏం సాధిస్తారా అనే ప్రశ్న ఆమెను పీడించుకు తినేది. జీవితంలో ఇంకేదో కొత్తగా జరగితే బావుండునని ఆమె ఎంతగా ఎదురుచూసినా అదే ఇల్లు, అదే ప్రొద్దున్న రాత్రి , అదే రకం స్కూలు, అన్నిటికీ మించి అదేరకం మనుష్యులు... అదేరకం మనుష్యులు... అదేరకం మనుష్యులు. వీటన్నిటికీ మించి అదే రకంగా "తను". యుగాలతరబడి మనుష్యులను నలిపేసిన రాజ్యాలను ఎదిరిస్తూ పుట్టుకుచ్చే విప్లవాలకుమల్లే ఆమె జీవితంలోనూ ఒకరోజు మార్పు ఎర్రగా తన్నుకువచ్చింది. ఒక స్త్రీగా విచ్చుకుంది.

ఇక నుంచి తాను ఏమిటో నీలిమకు మెల్లగా అర్థమైంది. సరదాగా బుగ్గగిల్లే చుట్టాలు కూడా తాకకుండా గౌరవం ఇవ్వడం గమనించింది. అబ్బాయిలు భయపడుతూ ఓరకంట చూడటం ఓరకంటనే గుర్తించింది. వేసుకునే బట్టలు మారాయి. ఇంట్లో కొత్తకొత్త ఆంక్షలు మొదలయ్యాయి. కొత్తవి అయితే చాలు ఆంక్షలు అయినా బావుంటాయి. శరీరంతో పాటు హార్మోన్లు కొత్తగా పనిచేయడం మొదలెట్టాయి. ప్రపంచంలోని కళలన్నీ తన శరీరంలోనే ఉన్నాయని తోచేది నీలిమకు. ***ఆడపిల్లకు అద్దం ఒక చేయితిరిగిన చిత్రకారుడి కాన్వాసు.*** రోజూ తనలోనే కొత్తకొత్త చిత్తరువులు చూసుకుంది. దురదృష్టమో అదృష్టమో, అల్లాఉద్దీన్‌కు అద్భుతదీపం దొరికనట్లు ఆమెకు ఒకరోజు స్కూలులో తన బెంచీ సొరుగులో ఒక పుస్తకం దొరికింది.

సాహిత్యం.. మనిషిని ఉన్నత శిఖారలకు చేర్చగలదు. అట్టడుగు లోయల్లోకీ తొక్కివేయగలదు. రెండవ రకం సాహిత్యం పుష్కలంగా ఉన్న పుస్తకం అది. బయాలజీ క్లాసులో ఆడబొద్దింకలూ, మగ బొద్దింకలూ మధ్య జరిగే సృష్టికార్యం బోరుగా అనిపిస్తే పుస్తకంలో అబ్బాయీ అమ్మాయిల శారీరక కలయికల వర్ణనలు ఆమెకు ఎంతో కొత్తగా వింతగా అనిపించాయి, మొదట చాలా వికారం అనిపించింది. తన శరీరంలో ఇంత అసహ్యం ఉందా అనిపించింది. ఒక మగాడి శరీరం తనకు ఎన్నెన్ని చెయ్యగలదో తెలిసింది. మగవాడి

మనసు అంటే ఏమిటో తెలియని ఆమెకు రకరకాల మగ శరీరాలమీద మాత్రం కుతూహలం పెరిగింది. మెల్లగా సభ్యసమాజంలో తాను వినని ఎన్నో మాటలను తెల్సుకుని ఉత్సాహపడింది. తన శరీరంలో బట్టల చాటున ఉండే నాలుగైదు అంగాలకు అన్ని రకాల పేర్లు ఉన్నాయని తెలిస్తే ఆశ్చర్యమనిపించింది. ఒంటరిగా ఉన్నప్పుడు పాటలు తలుచుకోవడం మరుగునపడిపోయింది. ***ఒక మనిషి బాగుపడడానికి సవాలక్ష అడ్డంకులు సృష్టించే సమాజం అదే మనిషి చెడిపోవడానికి మాత్రం అయస్కాంతంలా లాగేస్తుంది.*** సంగీతం నేర్చని ఆ బండబూతులను ఇష్టంగా తనలో తానే మాట్లాడుకునేది. విజ్ఞానం మనిషికి ప్రశాంతతని దూరం చేస్తుంది. తన శరీరంతో తాను ఏమేమి చెయ్యొచ్చో క్షుణ్ణంగా తెలుసుకున్న ఆమె ఆలోచనలను చర్చించేందుకు తహ తహలాడింది. కానీ మనిషికీ మృగానికీ ఉన్న ఒక తేడా. భావుకత్వం. తాను చేసేది ప్రపంచం దృష్టిలో బూతు అయినా తన దృష్టిలో ఒక అపురూప జ్ఞాపకం కావాలని ముచ్చటపడింది. మొట్టమొదటిసారి తన శరీరంలో రగులుతున్న ఆడతనపు కోరికలను తానే తీర్చుకోవడానికి, ఊరవతలి అందమైన నది ఒడ్డుకు పరుగెత్తింది. అదీ, వర్షం పడీ పడనట్లున్న సాయంత్రం. ఆమె భావప్రాప్తిని వొళ్ళంతా కళ్ళుచేసుకు చూసిన ఆకాశానికే ఆర్గజం వచ్చినట్లు వర్షంలో ఆమెను కమ్మేసింది.

***చాలామంది మనుష్యులకు తామేంటో తమకే తెలియదు. కానీ ప్రపంచంలోని మిగతా మనుష్యులందరిగురించీ తెలిసినట్లు ప్రవర్తిస్తారు. బడ్డీకొట్టువాడు కూడా తాను న్యూస్ పేపర్లో చదివిన అమెరికా అధ్యక్షుడి మనస్తత్వం అంతా తనకు తెలిసినట్లు మాట్లాడుతాడు. దానికి కారణం అజ్ఞానమూ అవివేకమూ కాదు. స్వచ్ఛమైన భయం. తనగురించి తాను తెలుసుకోవాలంటే ఆత్మసాక్షిగా ఆలోచించగలగాలి. ప్రక్కవాడిని మోసం చేసినంత సులభం కాదు. ఎవరిని వారు మోసం చేసుకోకూడదు.*** ఆత్మవంచన లేకుండా నీలిమ ఒప్పుకుంది. తనకు ఇక జీవితంలో సంతోషమూ ఉత్సాహమూ ఏమైనా ఉంటే అది ఎవరో ఒక మగవాడి వలనే రావాలని అలాంటి మగవాడిని దక్కించుకునేందుకే తన ఆడతనం ఉన్నదనీ నిశ్చయించేసుకుంది.

బాల్యం ప్రాకితే యవ్వనం పరుగులు తీస్తుంది. వయసుకు మించిన ఆలోచనలను చేసిన నీలిమ అంతే త్వరగా తన చుట్టూ ఉండే మనుష్యులనూ బేరీజు వేయడం మొదలెట్టింది. మగవాడికి తన శరీరమే కానీ మనసు అవసరం లేదని ఎందరో ఆకలిచూపులను చూసి అంచనా వేసింది. ఆకలిచూపులన్నిటినీ పెట్టుబడిగా చేసుకుని కుదిరినంతమంది అబ్బాయిలతో స్నేహం చేసింది. చివరకు స్కూలు మాష్టార్లు కూడా ఆమెను విద్యార్థినిలా కాక తమ ఈడు ఆడమనిషిలా భావించేవారు. ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసి మాట్లాడాలంటే భయపడేవారు. ***కొంటెతనానికి తెలివి జోడిస్తే.. తీక్షణత ఒక అందమైన మెరుపులాంటిది. చూడటానికి బాగానేఉన్నా కళ్ళకు నొప్పేస్తుంది. అలాంటి మెరుపును చేతుల్లోకి తీసుకుని నొక్కేస్తే కానీ మనిషి అహం తృప్తి చెందదు.*** అమ్మాయిలను ప్రేమించడమూ, శారీరకంగా అనుభవించడమూ ప్రతిమగాడికీ అహాన్ని చల్లార్చే అంశాలు. అహాన్ని శాంతింపజేయడానికి తనను చేరిన అబ్బాయిలందరినీ రకరకాలుగా ఊరించి వేధించి ఏడిపించింది నీలిమ, తన ప్రాయం పెరిగి వయసు మరిన్ని అందాలను తన శరీరంపైకి తెస్తున్నకొద్దీ. ఎంత చేసినా పురుషుడి శారీరిక బలమ్ముందు తన తెలివితేటలు వ్యర్థం అని బాగా తెలిసిన ఆమె ఎవ్వరికీ ఒంటరిగా చిక్కేది కాదు. రామాయణంలోని మాయలేడిలా తన స్కూలు, కాలనీ, ఊర్లోని అబ్బాయిలందరినీ ఆటలు డించింది. అమె కోసం బ్లేడుతో చేతులు కోసుకోబోయినవారూ, రైల్కిందపడి చస్తామన్నవారూ ఎందరో ఉన్నారు. ఆమె ఎవ్వరినీ నమ్మలేదు. వాళ్ళూ అలాంటి పనులేమీ చేయలేదు, నిజంగా ఆమె పట్ల వాళ్ళకంత ప్రేమ లేదు కనుక, ఎంతటి మాయలేడి ఆటలైనా రాముడిని వెంట రప్పించుకునేందుకే.

నీలిమకు రాముడు తారసపడ్డాడు. ఆమెకప్పుటికి పదిహేడేళ్ళు. అతడికి ఇరవై. చూసేందుకు అస్సలు బావోడు. మరీ సన్నగా, విరిగిపోయిన పాలలా, ముందు పన్ను కొంచెం పెద్దవి కూడా. ఆమె ఊరివాడే పక్కింటికి పక్కింటి వాళ్ళ దూరపు చుట్టమే. ఢిల్లీలో చదువుతూ శెలవులకు వచ్చాడు. గుడిలో ఆమెను చూసాడు. మరుసటి రోజు మార్కెట్లో ఆమెకు ఒక కాగితం అందించాడు. నీలిమ ముఖాన్ని దాదాపు పాతిక బొమ్మలుగా గీసాడు. అతని కళ ఆమెకు నచ్చింది. మరుసటి రోజు మరొక కాగితం ఇచ్చాడు, ఆమె కాలేజీ

బయటే. ఆమెను వర్ణిస్తూ అందమైన అక్షరాల్లో హిందీ పాటలు.. తనకు తెలుగులో కవిత్వం రాదని క్రింద సంతకం. చాలా కాలం తర్వాత కూనిరాగాలు తీసింది నీలిమ.

ఒకరోజు ఒంటరిగా ఇంటికి వెళుతున్న ఆమెను అతడు అరగంటసేపు మౌనంగా వెంబడించాడు. చివరకు ఆమెను అడగకుండా కౌగిలించుకుని పెదవులపై గాఢంగా చుంబించేసాడు. కోపం నటించి ఛీత్కరించుకుంది అమె. అతనొకటే మాట అన్నాడు "నాతో కాకపోతే నీ అందానికి విలువే లేదు, నటన పక్కనపెట్టి సాయంత్రం నది ఒడ్డుకు రా. రాకపోతే స్వచ్ఛమైన లవ్‌మేకింగ్ మిస్సవుతావు" అనేసి వెనిదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

అతని చొరవలో ఆమెకు నిజాయితీ కనిపించింది. అతడి బాహ్యాసౌందర్యం ఆమె పట్టించుకోలేదు. మనస్ఫూర్తిగా ప్రేమించేసింది. సాయంత్రం వెళ్ళింది. అతడు ఏమీ చెయ్యలేదు. చాలా సేపు అలానే చూస్తుండిపోయాడు. ఆమె కళ్ళు దించేసుకున్నా అతడి చూపులు గుచ్చుకున్నాయి. మళ్ళీ కొన్ని కాగితాలు ఇచ్చాడు. నీలిమ బొమ్మలే. అతను గీసినవే. ఈసారి ముఖమే కాదు ఆమె శరీరం అంతా ఉంది. తనను తాను ఊహించుకోలేనంత శృంగార భంగిమల్లో. అతడి కళ్ళు ఆమెకు అద్దం కంటె గొప్పవిగా తోచాయి. ఇంకొన్ని కాగితాలు ఇచ్చాడు. తాను శరీరంపై ఏమేమి చెయ్యాలి అనుకుంటున్నాడో అన్నీ కవిత్వంలా. సిగ్గుతో పారిపోయింది నీలిమ. కాగితాలన్నిటినీ భద్రంగా పొదువుకుని. ఏ కళనూ సరిగా అభ్యసించలేదే అని అప్పుడు తనను తిట్టుకుంది. అతడు ఒక రెండు రోజులు కనిపించలేదు. ఆగలేక , సాయంత్రం ఆమే నది ఒడ్డుకు వెళ్ళింది. అతను ఉన్నాడు. కొన్ని కాగితాలు ఇచ్చాడు. ఈసారి బొమ్మల్లో నీలిమతో పాటు అతనూ ఉన్నాడు. ఇద్దరూ నగ్నంగా ప్రేమించుకుంటున్న బొమ్మలు. అతడేమి చేయాలి అనుకుంటున్నాడో అర్థమైంది. తాను అతడి శరీరానికి ఏం చెయ్యాలి అని గీసాడో, ముందు ఆ పనిని ఆమే మొదలెట్టింది. ఆచొరవ ఊహించని అతను ఒక్కసారిగా నీరుగారిపోయాడు. ఎంత ప్రేమలో అయినా తానే జయించాలి అన్న కోరికతో ఉన్న ఆమె అతడిని వశం చేసుకుంటూనే అతడికి లొంగిపోయింది. ఆమె నేర్చుకున్న బూతు సాహిత్యం అంతా స్వచ్ఛమైన మనసుభాష ముందు అందమే అయింది. పరస్పరం కోరుకున్న స్త్రీ పురుషుల మధ్య ప్రపంచం అంగీకరించే సభ్యత ప్రతి క్షణమూ చచ్చిపోతూనే ఉంటుంది. అతడు ఉన్న నాలుగురోజుల్లో కుదిరినన్నిసార్లు కలిసారు. తాను జీవితంలో స్థిరపడేవరకూ మళ్ళీమళ్ళీ కలుసుకోవడం అంత మంచిది కాదని, కోరికలను అదుపు చేసుకుని నిగ్రహంగా ఎదురుచూద్దామని చెప్పాడు.అతడు ఢిల్లీ వెళ్ళిపోయాడు.

తనను మరచిపోతాడెమో అని ఆమె అనుకుంది.కానీ అతను మోసం చేయలేదు. పోస్ట్ బాక్స్ నెంబరుతో ఉత్తరాలు పంపేవాడు. రోజుకొక ఉత్తరమైనా వచ్చేది. శని ఆదివారాలు ఫోన్లు తప్పనిసరి. మెల్లగా ఇంటర్నెట్ అనే ఆధునిక విజ్ఞానం వారిని మరింత దగ్గరగా నిలిపింది. పోటోలు పంపుకునేవారు. ఆమె పెళ్ళీడుకు వచ్చేసరికిగానీ తండ్రిగా తన బాధ్యత గుర్తుకురాలేదు గోపాల్రావుకు. వెంటనే అంతకాలం తాను సంపాదించిన ఆస్తులూ, కుల గౌరవాలనూ బేరీజు వేసి ఆమెతో జతకట్టేందుకు ఏ మగవాడు సరితూగగలడా అని ఆలోచించడం మొదలెట్టాడు. మొదటిసారి నీలిమకు భయం వేసింది. తన నగ్న శరీరాన్ని ఇంకొకరు చూస్తాడంటే భరించలేకపోయింది. వేరే మగవాడి నగ్న దేహాన్ని తనలో ఇముడ్చుకోవాలంటే కంపరంగా అనిపించింది. అసలు ప్రేమ లేకుండా ప్రపంచంలో ఆడామగా ఎలా కలిసి పిల్లలను పుట్టిస్తున్నారో అర్థం చేసుకోలేకపోయింది. తల్లికి నిజం చెప్పేసింది. ఆవిడ నీలిమ చెంపలు పగలకొట్టి తండ్రితో చెప్పొద్దని, జీవితంలో ఇంకెవ్వరికీ ఈ విషయం చెప్పొద్దని ఉచితసలహా ఇచ్చింది. ఆ అబ్బాయిని ఎట్టిపరిస్థితిలోనూ ఇంటి అల్లుడిగా ఒప్పుకోలేమనీ, సమాజంలో చాలా కట్టుబాట్లు అడ్డుతగులుతాయనీ నచ్చజెప్ప చూసింది. తండ్రికి తెలిస్తే అబ్బాయిని ఏమైనా చేయవచ్చనీ భయపెట్టింది. ***భయం ధైర్యానికి అమ్మలాంటిది.*** ఆ రాత్రి నీలిమలో ఒక మొండి ధైర్యం పుట్టింది.

మరుసటిరోజు గోపాల్రావును గోముగా అడిగి కొత్తబట్టలు కొనుక్కోవడానికి డబ్బులు తీసుకుని రైల్వేస్టేషన్‌కెళ్ళి ఢిల్లీకు వెళ్ళే రైలు ఎక్కింది. జీవితంలో మొదటిసారి ఒంటరిగా, జనరల్ కంపార్ట్ మెంటులో దూరప్రయాణం. బోగీలో ఆకతాయిలు అల్లరిపెట్టినా

చలించలేదు ఆమె. ఎక్కడా ఏమీ తినలేదు. డబ్బులు చాలా ముఖ్యమని తెలుసు. ఢిల్లీలో దిగాక ఏ ఆటోవాడినీ నమ్మక, బస్టాపుల్లో ఉన్న ఆడవాళ్ళను అడిగి అడ్రసు నిర్ధారించుకుని, ఐదుబస్సులు మారి ఎప్పుడూ ఉత్తరం రాసే చిరునామాను సరిగ్గా చేరుకుంది. ఆఫీసుకు బయలుదేరుతున్న అతడు ఆశ్చర్యపోయాడు. విషయం ఫోనులో చెబితే తాను వచ్చేవాడిని కదా అన్నాడు. తన ధైర్యాన్ని నిజాయితీని తానే పరీక్షించుకోదలిచానంది ఆమె. అప్పుడు గుర్తుకువచ్చింది ఆమెకు ఆకలి. ఇరవైనాలుగుగంటల్లో వాళ్ళు పెళ్ళిచేసుకుని, కొత్త ఇంటికి మారారు. అతడు తన బంధువులకు ఎవ్వరికీ తన కొత్త ఇంటి చిరునామా చెప్పనైనా లేదు. ఒక అద్భుతమైన జీవితం - ఆవిష్కరింపబడింది. ఆమె ఆడతనమంతా అర్పించి జీవితాన్ని పండించుకుంది. మొదటి నెల తప్పాక కూడా అతడికి రహస్యం దాచింది. గబుక్కున ఏ నాలుగోనెలకో అతనే తడిమి చూసి కనిపెడితే ముఖంలో ఎలాంటి ఆశ్చర్యం వస్తుందో ఊహించుకుని తనలో తానే నవ్వుకుంది. రెండో నెలలోనే, ఒకరోజు ఆమె మార్కెట్ నుంచి వచ్చేసరికి ఇంట్లో గోపాల్రావు దర్జాగా కూర్చుని ఉన్నాడు. అతడు ఒక వార నిల్చుని ఉన్నాడు. మౌనంగా పక్కకు వెళ్ళిపోయాడు గోపాల్రావు.

" అయాం సారీ. నిజం చెబుతున్నాను. మీ నాన్నా నాకు చాలా డబ్బులు ఆఫర్ చేస్తున్నారు. మా ఫామిలీ చాలా కష్టాల్లోంచి బయటపడుతుంది. ఒప్పుకోకపోతే ఇంకా ప్రాబ్లంస్ వస్తాయి. నువ్వు ఇక వెళ్ళిపో. ఇదంతా జస్ట్ ఒక మంచి కల. నాకు నువ్వంటే ఏం కోపం లేదు " నింపాదిగా అన్నాడు అతను.

ముఖం మీద ఎంగిలి ఊసింది. చెంపలు వాయించింది. ఏడిచింది. క్రిందపడి నేలకేసి తలబాదుకుంది. పిచ్చిపట్టినట్లు ఏడ్చింది. ఎక్కిళ్ళు వచ్చి ఊపిరాడక తన్నుకుంది. కళ్ళుతెరిచేసరికి తన ఊరి హాస్పిటల్లో ఉన్నట్లు తెలుసుకుంది. పొట్టలోంచి పెరిగేందుకు ఏమీ లేదని, అబార్షను చేయించారనీ తెలిసింది. కళ్ళెదురుగా తెల్లటి హాస్పిటల్ సీలింగ్, అందులో తెల్లటి ఫాను. ఆకాశం , ప్రేమ, మగాడు ...అన్నీ గుర్తుకువచ్చి ఒక్కసారి మళ్ళీ ఏడ్చింది. తర్వాత ఎవ్వరితో ఏమీ మాట్లాడలేదు. మూగదానిలా ఉండిపోయింది. ఆకలి వేయకున్నా ఎప్పుడూ ఏదో ఒకటి తినడం మొదలెట్టింది. తల్లి ఏం చెప్పినా నోరెత్తకుండా పని చేసేది. నేర్పిన వంటలన్నీ నేర్చుకుంది. టీవీ పెడితే కళ్ళు అప్పగించేది. రాత్రి ఎవ్వరు నిద్రపోయినా టీవీలో ఎక్కడో జరిగే జీవితాల కథలను చూస్తూ మెలకువగానే ఉండేది. పెళ్ళిళ్ళకు తీసుకెళితే పట్టుచీరలు కట్టుకునేది. కానీ కళ్ళక్రింద నల్ల చారికలు ఆమెను ముసలిదానిగా చేసాయి. ఒక్క నెల ఒక యుగంలా గడిచింది.

ఒకరోజు గోపాల్రావు ఒక ఫోటో చూపించి అతడే నిన్ను పెళ్ళి చేసుకోబోతున్నాడు అని చెప్పాడు. మాట్లాడుకొమ్మని ఒకసారి అనుమతి ఇచ్చారు. తనను చైతన్యగా పరిచయం చేసుకున్నాడు అతను. ముక్తసరిగా మాట్లాడి , పలకరింపుగా నవ్వి ఊరుకుంది. అతడు పెళ్ళికి ఒప్పుకున్నాడు. కట్నమెంతో అమ్మ చెబితే వింది. ఒక్కసారిగా అణిచిపెట్టుకున్న కసితో రగిలిపోయింది. ముక్కూమొహం తెలియని ఈ మగాడితో రోజూ నేను పడుకోవడమా, అతనికి పిల్లలను కనడమా అని తనమీద కోపం వచ్చింది. పలకరించిపోదామని వచ్చిన ఒక దూరపు బంధువు ఎదుట పైటజార్చింది. అతడి చూపుల్లో తొట్రుపడిన ఆకలిని రెచ్చగొట్టింది. మూడునిముషాల్లో, వేసుకున్న బట్టలు వంటిమీద ఉండగానే అతడిని తనలో ఇముడ్చుకుంది. తన శరీరంపై కసి తీర్చుకోవడంలో మొదటి అడుగు వేసింది. ఒక్క నెలలో, పెళ్ళి అయ్యేలోపల , సమయం సందర్భం కుదరినప్పుడు ఎవ్వరు అందుబాటులో ఉంటే మగవాడికి తన శరీరం అర్పించి, వాడు తనమీద రొప్పుతుంటే ఆత్మహత్య చేసుకున్న బాధ అనుభవిస్తూ తృప్తి చెందింది. చైతన్య చేయి తనను తాకేలోపల తనంటే తనకే అసహ్యం కలిగే స్థాయికి దిగజార్చుకుంది. తాను ఎంత చెడిపోయినా అతడిని మాత్రం సుఖపడనివ్వకూడని బలమైన నిర్ణయం తీసుకుంది. భర్తను భార్య అనకూడని దుర్భాషలాడింది. డబ్బుకు పెళ్ళి చేసుకున్నావుగా , పడుకుంటే ఎంతిస్తావు అని అతడి అహాన్ని గుచ్చిగుచ్చి పొడిచింది. ఒకరోజు అతడి కోపం తారాస్థాయికి చేరుకుంది. ఆమెపై చేయిచేసుకుని మరీ ఆక్రమించుకున్నాడు. శరీరమే కానీ మానసిక నిగ్రహం కోల్పోయిన మగాడిగా అతను ఓడిపోయాడు.

బలాత్కారం చేసానే అనే పశ్చాత్తాపాన్ని అతడిలో రగిల్చి రోజూ సూటిపోటిమాటలతో మనసు విరిచింది. ***ఎంతటి క్రూరులనైనా ప్రేమతో శిక్షించే కఠినత్వం ప్రకృతిది.*** అతడి బలాత్కారమే ఆమెలో కొత్త జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్నాక తనే పశ్చాత్తాపంతో కుమిలిపోయింది. నెలల బిడ్డను చంపేద్దామనుకుని ఒక మాత్ర వేసుకుంది. మరుసటి నిముషంలోనే దాన్ని వాంతి చేసేసుకుంది. హత్య చేయలేక నిస్సహాయురాలైంది. మరో మగాడికి తన శరీరాన్ని ఇచ్చే ధైర్యం చేయలేకపోయింది. కడుపులోంచి ఎవరో తనను ప్రశ్నిస్తున్నట్లు అనిపించేది. ఆ ప్రశ్న తన ప్రమేయం లేకుండా సహజంగానే చనిపోతే బావుండునని కోరుకుంది. అదేపనిగా మెట్లు ఎక్కడం దిగడం చేసింది. బరువులు ఎత్తే పనులు చేసింది. అయినా ఐదవ నెలవచ్చేసరికి ఇక ఓటమినొప్పేసుకుని  బిడ్డ కోసం మౌనంగా ఎదురుచూసింది. గోపాల్రావు చచ్చిపోయేసరికి ఇక తన జీవితం తన ఇష్టం అనుకుని, పుట్టే బిడ్డతో పరాయిదేశంలో బంధువుల చాటుకు పారిపోయి కొత్త జీవితం అనుభవించే కలలు కంది. ప్రసవం తర్వాత ఆత్రంగా చూసుకుంటే తెలిసింది,  బిడ్డ జీవితాంతం ఉండకపోవచ్చని. అంతా తన తప్పే అనిపించింది. కానీ ఒప్పుకోలేదు. తాను  మాత్ర నాలుకనైనా తాకనిచ్చి ఉండాల్సింది కాదేమో అని తనను తాను నిందించుకుంది. తన వైరితనాన్ని వెక్కిరిస్తూ చచ్చిపోయే  ప్రాణిని ముద్దాడేందుకూ చెంతకు తీసుకునేందుకూ అమెకు మనసొప్పలేదు. జీవితం అంటె వల్లమాలిన కసి. తన ఉనికి అంటే అసహ్యం. తనను కావాలి అనుకునేవారంటే భయం. పారిపోయింది. అప్పుడప్పుడూ తన కసి తగ్గినప్పుడు బిడ్డను చూడబుద్దేసి ఒకసారి వచ్చిపోతుంది. పిచ్చిపట్లేట్లనిపిస్తే, మానసిక నిపుణురాలు అయిన సుష్మను కలిసింది. ఆమె సలహాలతో మందులతో కాస్తంత నెమ్మదించి అప్పుడప్పుడూ  బిడ్డను ప్రేమించ చూసింది. కానీ మనసులో దహించేస్తున్న చేదు జ్ఞాపకాల ఉన్మాదనాదాలు ఆమెకు తలనొప్పిని, వికారాన్ని కలిగించడం మానలేదు. ప్రేమను అసహ్యం నిరంతం ఓడిస్తుంటే అసహాయంగా చేయకూడదనుకున్న పనులను చేస్తూనే చిత్రవిచిత్ర అనుమానాలు పెంచుకుంటూ అంతులేని కార్చిచ్చులా తగలబడిపోతోంది నీలిమ.

" హే వాటీజ్ దిస్ , యూ ర్ వెరీ మూడీ "

జెన్నిఫర్ కుదుపుతో తేరుకుంది రాధిక. సుష్మ నోటివెంట తాను విన్న నీలిమ జీవితం అంతా తాను స్వయంగా చూసినట్లే, అనుభవించినట్లే తోస్తోంది ఆమెకు. కొన్ని కథలు, సినిమాలు, జీవితాలు అంతే. ***ఉల్లాసపరిచేవాటికంటే కలవరపరిచేవే ఎక్కువసేపు మనసుపై తమ ప్రభావం చూపిస్తాయి.*** చెప్పాల్సినదంతా చెప్పేసి  "జస్ట్ నువ్వు ఆమెతో కేర్‌ఫుల్‌గా ఉంటావు అని చెబుతున్నాను. ఏజ్ ఎ పేషెంట్ వి కెన్ సింపథైజ్ హర్. కానీ, అలాంటి మానసిక సమస్యలు ఉన్న వ్యక్తులతో రియల్ లైఫ్‌లో ఇంటరాక్షన్ కొంచెం ప్రమాదకరమే. వాళ్ళకు మనం మంచే చేసినా మనపట్ల లేనిపోని కక్ష పెట్టుకోవచ్చు, లేదా, మనం భరించలేనంత కృతజ్ఞతతోనూ విసిగించొచ్చు. నే చెబుతున్నా కదా, పూర్తి సైకలాజికల్ డిజార్డర్స్ ఉన్న పేషెంట్లనైనా ఎలా ప్రవర్తిస్తారో ఊహించొచ్చు కానీ, ఇలాంటి బోర్డర్‌లైన్ పర్సనాలిటీ ప్రాబ్లం ఉన్నవాళ్ళతో కష్టం. చైతన్యతోకానీ, వివేకానందతో కానీ నీకు ప్రత్యేకమైన అనుబంధం ఉన్నట్లు తెలిస్తే నీలిమ ఎలా అయినా రియాక్ట్  కావొచ్చు. జాగ్రత్త " సుష్మ ఫోన్ చేసి మరీ తర్వాత చెప్పిన  మాటలు, రాధికకు నీలిమ కథతో పాటు గుర్తొచ్చి కలవరపెడుతున్నాయి. విషయం అంతటి కంటే "జాగ్రత్త" అనే ఒక్క మాట మరీ ఎక్కువగా ఆందోళన కలిగిస్తోంది. నీలిమకు లేని అదృష్టం రాధికకు ఉన్నది: మంచి స్నేహితులు!  జీవితంలో అతి ముఖ్యమైన వయసులో చైతన్య,  తర్వాత కొంతకాలం పెళ్ళి అయిన కొత్తలో రాజు, అతడితో స్నేహం తగ్గుతుండగానే జెన్నిఫర్ , ఆమెనుంచి దూరంకాగానే , మళ్ళీ చే, సుష్మ , ఇప్పుడు అదనంగా ఇండియాకు వచ్చిన జెన్నిఫర్. తనకు జరిగినట్లే నీలిమకూ కూడా ప్రతి దశలోనూ మంచివారి స్నేహం లభించి ఉంటే ఈనాడు అసలు ఎవ్వరికీ ఏ కష్టమూ ఉండేది కాదు కదా అనిపించింది రాధికకు. అంతలోనే తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చింది.  ***అవతలి మనిషి అలా ఉండకపోతే మన జీవితం ఇంకోలాగ ఉండకపోయేది కదా అనేది ప్రతి జీవితానికీ వర్తిస్తున్నది.*** ఈ మాటగురించే కదా చేకూ

తనకూ ఎంతో చర్చ జరిగినది. ఎవ్వరు ఎలా ఇన్‌ఫ్లూయెన్స్ చేయబోయినా తాను అనుకున్నట్లు తాను బ్రతకడమే కదా తాను సాధించాల్సిన స్థితప్రజ్ఞత.

"రాధీ.. దిసీజ్ టూ మచ్. యు ర్ ఇన్ డీప్ థాట్స్ వితౌట్ టెల్లింగ్ మీ" సిప్ చేస్తున్న బీర్‌ను పక్కన పెట్టేసి రాధిక పక్కనే సోఫాలో కూలబడింది జెన్నిఫర్.

బీరువాసన నచ్చకపోయినా అంత తిరస్కారం అనిపించలేదు రాధికకు. అదే బీరు రాజు నోటివెంట నచ్చలేదు ఆమెకు. ***మనిషిని మనిషి అలవాట్లకూ గుణాలకు అతీతంగా ఇష్టపడటం చాలా అరుదుగా జరుగుతుంది.*** అమెరికాలో తగ్గించిన అలవాటే అయినా, ఇండియాకు వచ్చి ఇక్కడి వేడి వాతావరణానికి అపసోపాలు పడిపపోతే , రాధికే రాజుకు చెప్పి మరీ తెప్పించింది. దారిలో ప్రతిచోటా కనిపిస్తున్న మద్యం షాపుల్లో ఆడవాళ్ళు స్వేచ్ఛగా వెళ్ళి మద్యం కొనుక్కోలేరు అంటే జెన్నిఫర్ తెగ ఆశ్చర్యపోయింది. న్యూస్‌పేపర్ పేజ్ 3 అంటూ మందుగ్లాసులు పుచ్చుకు తిరుగుతున్న హై సొసైటీ ఆడాళ్ళను చుసి, మరి ఇదేమిటీ అని మరింత ఆశ్చర్యపోయింది.

తాను ప్రేమించిన వ్యక్తితో వస్తాననీ, ఇండియాలోనే భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్ళి చేసుకుంటాననీ చెప్పిన ఆమె ఒంటరిగానే వచ్చింది, విషయం ఎంత అడిగినా చెప్పడం లేదు. కాస్త బీరు పడితే ఆమే నోరువిప్పుతుందిలే అని ఇంతసేపూ ఎదురుచూసిన రాధిక మళ్ళీ ప్రశ్నించింది, ఆమె ప్రేమించిన వ్యక్తి ఏమయ్యాడని?

"హి ఈజ్ గాన్ " సోఫా మీద తల వెనక్కు వాల్చి సీలింగ్ చూస్తూ చెప్పింది జెన్నిఫర్.

అట్టే అడగలేదు రాధిక. మనసుకు చాలా బాధవేసింది. జెన్నిఫర్‌ను ఇలాంటి స్థితిలో చూడటం ఇది మొదలు కాదు. ***ఎంత నొప్పికి అలవాటుపడిపోయిన మనసుకయినా ప్రతి కొత్త గాయమూ అశనిపాతమే.***

" హె లెట్ మీ అండ్ వెంట్ అవే" వొళ్ళంతా వాలిపోతున్నట్లు రాధికకు కాస్త దగ్గరగా జరుగుతూ అంది జెన్నిఫర్. ఎక్కడ కొన్నదో కానీ, పక్కా భారతీయ చేనేత ఖాదీ చొక్కా వేసుకుని ఉంది ఆమె. రోజాలాంటి ఆమె మేనిఛాయకు ఆకాశంరంగు కుర్తా చక్కగా నప్పింది. ఫెమినిజం అభిమాని జెన్నిఫర్ బ్రా ధరించకపోవడమే కాక తన ఎత్తైన ఎదను సగర్వంగా ప్రదర్శించేట్లు వస్త్రాలు ధరిస్తుంది. అమెరికాలో అలాంటివారు చాలా ఉండటంతో అదేమంత భిన్నంగా అనిపించలేదు కానీ, తన ఇంట్లో ఆమె అలా ఉండటం అంతగా నచ్చలేదు రాధికకు. ఇటుకలూ సిమెంటుతో కట్టిన గోడలు మారితేనే సంస్కృతి మారిపోయినట్లు అనిపిస్తుంది.

"బట్ హి ఈజ్ నాట్ ఎ బ్యాడ్ మ్యాన్" మళ్ళీ బీరు సిప్ చేసింది జెన్నిఫర్. ఈ మాట రాధికకు ఆశ్చర్యం కలిగించింది. ఇంతకుముందు ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైనప్పుడల్లా తాను డేట్ చేసిన మగవాడు చాలా మోసగాడు అనో , అబద్ధాలకోరు అనో నానా తిట్లు తిట్టి రొస్టుచెందే ఆమె ఈసారి తనను వదిలేసిన అతడిని మంచివాడే అని కితాబు ఇవ్వడం మొదటిసారి.

"హి డిడ్ నాట్ ఛీట్ మీ , హి డిడ్ నాట్ లై టు మీ , బట్ హి టోల్డ్ మీ వెరీ ఫ్రాంక్లీ .." జెన్నిఫర్ కళ్ళల్లో తడి తొణికిసలాడింది, " హి హానెస్ట్లీ టోల్డ్ మీ, దట్.. దట్.. హి డజంట్ లౌ మీ" ముక్కు ఎగబీల్చుకుంది. ***ఏడుపుకు మాత్రం భాషాభేదం లేదు.***

ఇష్టపడని అతను ఆమెతో అమెరికానుంచీ ఇండియా రావడమేమిటీ, పెళ్ళి చేసుకుందాం అని చెప్పడమేమిటీ? అదే అడిగింది రాధిక.

" హి సెడ్ హి గాట్ కన్‌ఫ్యూజ్డ్. హి థాట్ హి లవ్ డ్ మీ, బట్ ఇట్ సీమ్స్ ఇట్స్ జస్ట్ సం అట్రాక్షన్. ఆల్ అట్రాక్షన్ ఈజ్ గాన్ ఆఫ్టర్ సం టైం... " అతను తన తెలివిని మెచ్చుకోవడం, తన అందానికి దాసోహమవడం , తనతో శారీరిక సుఖం పొందడం అన్నీ జరిగాక, ఇక తనలో కొత్తగా తెలుసుకోవాలసినదీ, ఆకర్షించేదీ ఏమీ లేక బోరు కొట్టేసింది విడిపోతే మంచిదేమో అనడం గుర్తొచ్చి , ఎక్కిళ్ళల్లో విషయం అంతా చెప్పింది జెన్నిఫర్.

ప్రేమ పేరుతో ఆడదాన్ని పూర్తిగా అనుభవించీ ఆస్వాదించీ మోజు తీరాక విషయాన్ని నిజాయితీగా ఒప్పేసుకునే మగవాడు మంచివాడో కాదో తేల్చుకోలేకపోయింది రాధిక. విన్నాక తనకే మనసంతా వికారంగా తోస్తోంది, పాపం జెన్నిఫర్ ఎలా తట్టుకుంటోందో అనిపించింది.

"ఇటీజ్ వెరీ ఇన్సల్టింగ్ రాధీ. వెరీ హ్యూమిలియేటింగ్ ఆఫ్ ఆల్ థింగ్స్ ఇన్ లైఫ్ ఫైనలీ అయాం నథింగ్ బట్ ఎ బోర్ . ఎ బోరింగ్ ఫీమేల్ .. దట్స్ వాట్ అయాం " ఒంట్లో శక్తి లేనట్లు రాధిక భుజం మీద వాలేసింది జెన్నిఫర్. భుజం మీది చీరచెంగు తడిసిపోవడం తెలుస్తోంది రాధికకు.

"వాటీజ్ దిస్ జెన్నీ , జస్ట్ బికాజ్ ఒన్ మేన్ లూజెస్ ఇంట్రెస్ట్ ఇన్ యూ దట్ డజంట్ మీన్ యూ ర్ ఎ బోర్. రియల్లీ యూ ఆర్ జెం ఎ పర్సన్. ట్రస్ట్‌మీ. యూ ర్ వెరీ సెన్సిటివ్, దట్స్ నాట్ అ క్రైం ఆర్ సిన్ టు బీ వన్ " చెబుతోందే కానీ , రాధికకే అనుమానం వేస్తోంది. ***సున్నితమైన మనస్తత్వం ఉండడం కన్నా శాపం లేదేమో మనిషికి.*** తాను, జెన్నిఫర్, చే, నీలిమ.. అందరూ తమ తమ సున్నితమైన ఆలోచనలూ, భావాల కారణంగానే అసంతృప్తిని అనుభవిస్తున్నాము. ***అన్ని జబ్బులకూ విరుగుడు ఉన్నట్లే మనస్తత్వం బండబారిపోవడానికి ఏదైనా డ్రగ్ ఉంటే సరిపోయేది. ఏ మనిషి ఏడ్చేవాడు కాడు.***

"టెల్ మీ ట్రూత్, యామ్ ఐ ఎవర్ బోరింగ్ ఫర్ యూ?" ఎర్రబడిపోయిన కళ్ళు తుడుచుకుంటూ అడిగింది జెన్నిఫర్. ప్రేమలో తిరస్కరింపబడ్డాక తనమీద తనకే నమ్మకం పోవడం చాలా సాధారణం.

"నో వే , సీ .. యూ నో వాట కైండ్ ఆఫ్ ఫ్రెండ్స్ పర్సన్ అయాం, డూ ఐ హావ్ మెనీ ఫ్రెండ్స్? " ఆమెను ఓదారుస్తూ చేతిలోంచి బీరుక్యాను తీసివేసేసింది రాధిక.

"నో యూ ఆర్ ఆల్‌వేజ్ రిజర్వ్‌డ్. లైక్ ఎ లోన్లీ ఫ్లవర్" విషయం తనను వదిలేసిన వ్యక్తి గురించి మళ్ళేసరికి ఆమె ముఖం అప్పుడే కాస్త తేటబడింది.

"అండ్ యూ నో ఐ థింక్ థౌజెండ్ టైమ్స్ టు మేక్ సమ్ వన్ ఎ ఫ్రెండ్, డోంట్ ఐ? " ***ఇంకొరిని ఓదార్చేప్పుడు ప్రతి మనిషీ తనతో పోల్చి చూసి అంతా సవ్యంగానే ఉందని చెప్పడం సర్వసాధారణం.***

"యస్ . ఇఫ్ ఓన్లీ యూ ఎంకరేజ్‌డ్ ఎ లిటిల్ మచ్.. హౌ మెనీ మెన్ ఇన్ ఒహాయో హాస్పిటల్ వుడ్ బీ డైయింగ్ టు బీ యువర్ ఫ్రెండ్స్ ..." కాస్త అతి చనువుగా ప్రవర్తించిన ఒకరిద్దరు సీనియర్ డాక్టర్లను మాటలతోనే దూరం జరిపేసిన రాధికను గుర్తుచేసుకుంది జెన్నిఫర్

"సో. ఎ పర్సన్ లైక్ మీ, కన్సిడర్స్ యూ ఏజ్ వన్ ఆఫ్ మై బెస్ట్ ఫ్రెండ్ ఈజన్ట్ ఇట్? "

తిండిమానేసి మొండికేసిన పసిపిల్ల ఏడుపు మానాక అన్నమ్ముద్దను ఒప్పుకున్నట్లు తలూపింది జెన్నిఫర్.

"వాట్ డస్ దట్ మీన్ ? "

" వాట్ ? " రాధిక ప్రశ్నకు ప్రశ్నతో బేలగా చూసింది జెన్నిఫర్.

"దట్.. యూ ర్ ఎ వెరీ స్పెషల్ పర్సన్. అండ్ ఓన్లీ లక్కీ పీపుల్ లైక్ మీ ఆర్ ఫార్చ్యునేట్ ఫర్ యువర్ ఫ్రెండ్షిప్ "

" నో వే. యూ ఆర్ ట్విస్టింగ్ ది స్టేట్‌మెంట్. ఇట్స్ మీ ఫార్చ్యునేట్ అండ్ లక్కీ అండ్ ఇట్స్ యూ హు ఆర్ స్పెషల్ " మళ్ళీ దుఃఖం ముంచుకువచ్చినట్లు రాధికను కౌగిలించేసుకుంది జెన్నిఫర్. ఆమెను ఇప్పుడు ఏడవనివ్వడమే ఉత్తమం అనిపించి భుజం నిమురుతూ ఊరుకుంది రాధిక. తాను ఎవ్వరికీ అక్కర్లేదు అనే భావం అంతా కన్నీళ్ళలో కరిగిపోగా, తనను అభిమానించేవారు ఉన్నారనే నిజాన్ని గుర్తెరుగుతూ తేటపడింది జెన్నిఫర్.

"యూ డింట్ టెల్ మీ, హూ ఆర్యూ థింకింగ్ అబౌట్?" *స్వంత బాధమరచిపోయిన తర్వాతనే తనను ఓదార్చిన వ్యక్తి బాగోగులు పట్టించుకోవాలన్న స్ఫురణ కలుగుతుంది.*

"నథింగ్" నీలిమ గురించి చెప్పాలి అనిపించలేదు రాధికకు . "ఇట్స్ అబౌట్ ది సర్జరీ ఆఫ్ ఎ నైన్ ఇయర్ ఓల్డ్ బోయ్.." వివేకానంద బ్రైన్‌ట్యూమర్ గురించీ, వారం రోజుల్లో అనుకున్న ఆపరేషన్ గురించీ చెప్పింది రాధిక. *స్నేహితుల దగ్గరైనా ఆలోచనలగూర్చి పూర్తి నిజమూ చెప్పక, అబద్ధమూ చెప్పక, సగం నిజం దాచేయడంలో అట్టే తప్పులేదు. కానీ దాచేస్తున్నదేదో ఉందని స్నేహితులు ఇట్టే కనిపెట్టేస్తారు.* అలానే శంకించిన జెన్నిఫర్ రాధికను తడుముకోకుండా అడిగేసింది, ఎందుకు ఈ ఒక్క పేషెంటు అంతే అంత - ఆత్మీయంగా భావించుకుంటున్నావని. చైతన్య గురించి చెప్పకతప్పలేదు రాధికకు. అంతకాలం తాను ఎవ్వరితోనూ పంచుకోలేని మధుర జ్ఞాపకాలన్నిటినీ, చైతన్య వ్యక్తిత్వాన్నీ, అమలినమైన తమ ప్రేమనూ, తాము అనుభవించిన సముద్రాన్నీ, వెన్నెలనూ, తాము విభేదించుకున్న ఆశయాలనూ, ఐడియాలజీనీ....అన్నిటినీ రాధిక వివరిస్తుంటే మోకాళ్ళను కడుపులోకి లాక్కుని చుబుకాన్ని చేతుల్లో వాల్చుకుని శ్రద్ధ గా విన్నది జెన్నిఫర్.

"హే.. ఇఫ్ యూ డోంట్ మైండ్ చైతన్యా సీమ్స్ లైక్ ఎ గ్రేట్ మ్యాన్. ఈజ్ హి అవైలబుల్?" ప్రేమించడం అనే వ్యసనం నరనరానా జీర్ణించుకుపోయిన జెన్నిఫర్ అడగకుండా ఉండలేకపోయింది.

"డంబ్. అయాం టెల్లింగ్ హి ఈజ్ ది ఫాదర్ ఆఫ్ దిజ్ కిడ్ ఇన్ ఇండియా ఇట్ మీన్స్ వన్ ఈజ్ మ్యారీడ్ . సో డోంట్ బిల్డ్ స్టుపిడ్ హోప్స్" స్నేహితురాలి ఆత్రానికి నవ్వుకుంది రాధిక.

"కమాన్ యూ డింట్ టెల్‌మీ, హూ ఆర్యూ థింకింగ్ అబౌట్? ఆర్ దె సెపరేటెడ్, ఈజ్ షి అలైవ్..?"

"దె వర్ జస్ట్ హేవింగ్ సం డిఫరెన్సస్, బట్ నౌ దె ఆర్ ఫైన్ , ఇన్ఫాక్ట్ ఐ మెట్ హర్ టూ. షి ఈజ్ వెరీ కన్సర్న్డ్ అబౌట్ ది చైల్డ్ " నీలిమ గురించి మాత్రం చెడుగా చెప్పడానికి మనస్కరించలేదు రాధికకు. సర్జరీ గురించి ఇంకా ఏదో చెప్పబోతున్న ఆమెకు , ఇంట్లో కాలింగ్ బెల్ మ్రోగడం వినిపించింది. గెస్ట్ రూంలోంచి వచ్చి తలుపు తెరిచేసరికి,

"సర్‌ప్రైజ్" అంటూ రాజు.

అతను వస్తాడని అస్సలు ఊహించలేదు రాధిక. సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రాజెక్టులు సంపాదించేందుకు ఢిల్లీ వెళ్ళిన అతను , సరిగా ఫోన్‌లో మాట్లాడటం కూడా తగ్గించేసి మూడురోజులు అవుతోంది. పనిలో పడితే అతనికి లోకంలో ఎవ్వరూ గుర్తుండరని తెలిసిన రాధిక , భోజనం చేసావా, నిద్ర పోయావా అని ఎస్ ఎం ఎస్ లు ఇస్తుంటే మొక్కుబడిగా " అయాం ఫైన్. యూ టేక్ కేర్" అనే ఒకే ఒక బదులువస్తోంది. జెన్నిఫర్ వస్తోంది అని చెప్పినా బదులు లేకపోయేసరికి అతడింకో మూడురోజులవరకూ రాడేమో అనుకున్న రాధికకు , అతను రావడమే కాక , చేతిలో రెండురకాల గిఫ్ట్ ప్యాకులతో కనిపించేసరికి అశ్చర్యమేసింది.

" ఏంటోయ్ అలా చూస్తున్నావ్. జెన్నీకు పెళ్ళీ అదీ ఇదీ అన్నావ్. వాళ్ళ కోసమే ఈ గిఫ్ట్. ముంబయిలో మ్యారేజ్ గిఫ్ట్ సెట్ అని అమ్ముతున్నారు ఒక ప్యాకేజిలాగా, వినాయకుడి పెయింటింగూ, పట్టుబట్టలూ , దీపం సమ్మెలూ..ఇంకా..." చప్పున్న అతడిని ఊరుకొమ్మన్నట్లు పెదవులపై వేలుంచి సైగచేసి, ప్యాకెట్లను పట్టుకుని అతడిని తమ బెడరూంలోకి లాక్కెళుతూ అసలు విషయం చెప్పి ఇప్పుడు జెన్నిఫర్‌తో పెళ్ళిమాట గుర్తుచేయొద్దని చెప్పింది.

"అయ్యోపాపం. ఏంటో అమ్మాయి. ఇప్పటికి ఒక హాఫ్ సెంచరీ లవ్ ఫెయ్‌ల్యూర్స్ అయ్యుంటాయి కదా" జోక్‌గా అని రాధిక ముఖంలో చురుక్కుమన్న కోపం చూసి నవ్వకుండా ఊరుకున్నాడు.

"టోటల్లీ ఇన్‌సెన్సిటివ్ నువ్వు. ఎప్పుడు బుద్ధి వస్తుందో ఏమిటో. సర్లే..వెళ్ళిన పని ఓకేనా? " హడావుడిగా తడి స్నానానికి గీజర్ ఆన్ చేసింది.

"అంటీ అంకుల్ ఎప్పుడు వస్తారు?" జగన్ ఇంటికి వెళ్ళిన అత్తమామలు గురించి కనుక్కుంటూనే స్నానానికి వెళ్ళాడు అతను. జెన్నిఫర్‌తో రాజు వచ్చిన విషయం చెప్పడానికి వెళ్ళింది రాధిక. చాలా దీర్ఘాలోచన చేస్తున్నట్లు అలాగే కూర్చుని ఉంది ఆమె.

" హే.. ఐ గాటెన్ ఐడియా.. ఇఫ్ యూ హేవ్ నో ప్రాబ్లం " రాధికను చూడగానే ఉత్సాహపడిపోయింది ఆమె.

చెప్పమన్నట్లు కళ్ళెగరేసింది రాధిక. "ఐ థాట్ ఆఫ్ లీవింగ్ టు యూఎస్ ఇమ్మీడియట్లీ వెన్ దట్ మ్యాన్ డంపడ్ మీ. బట నౌ ఐ థింక్ మై విజిట్ హియర్ షుడ్ సర్వ్ ఎ గుడ్ పర్పస్. ఐ విల్ వర్క్ విత్ యూ ఇన్ ది సర్జరీ ఆఫ్ దిజ్ బోయ్ , వివేకానంద " తన అభిప్రాయం చెప్పేసి రాధిక సమాధానం కోసం ఎదురుచూసింది జెన్నీ.

క్లిష్టమైన సమస్యకు పరిష్కారం దొరికినట్లు అనిపించింది రాధికకు. వివేకానంద సర్జరీలో తన హాస్పిటల్‌లో ఎవ్వరి సహాయం తీసుకోవాలా అని ఆమె ప్రతిక్షణమూ తర్జనభర్జనలు పడుతూనే ఉంది. తమ హాస్పిటల్‌లోనైనా , వేరే హాస్పిటల్‌లోని ఎంత సీనియర్ సర్జన్ అయినా వాళ్ళతో సర్జరీ విషయంలో తను కలిసి పనిచేసేటప్పుడు ఇద్దరికీ సరి అయిన పార్ట్‌నర్ షిప్ రిలేషన్ ఉండటం ఎంతో అవసరం. కొత్తగా ఈ ఊరికి వచ్చిన రాధికకు ఎవ్వరితోనూ ఇంకా అంతటి పరిచయం ఏర్పడలేదు. జెన్నీతో అయితే ఆమె ఎన్నో సర్జరీలు విజయవంతంగా చేసిన అనుభవాలు ఉన్నాయి. చెరో కన్నూ విడివిడిగా చూసినా మెదడుకు ఒకే దృశ్యంలా కనిపించినట్లు ఇద్దరూ సర్జరీను అంత చక్కగా చేయగలరు. తానే ఆమెను అడుగుదామనుకున్న వరం అడిగేలోగానే ఇచ్చిన జెన్నీను చూస్తే చాలా ముచ్చటేసింది.

" థాంక్యూ వెరీ మచ్ " అంటూ ఆమె చేతుల్లో చేతుల్లేసి కృతజ్ఞతలు అర్పించుకుంది రాధిక.

" కమాన్. థాంక్స్ బిట్‌వీన్ యూ అండ్ మీ. ఒన్ కండీషన్, ఐ విల్ గో టు ఎ టూర్ సదర్న్ ఇండియా ఇన్ దిజ్ వీక్. యూ హేవ్ టు అరేంజ్ సం గైడ్ ఫర్ మీ.. ఐ విల్ బీ బక్ అ కపుల్ ఆఫ్ డేస్ బిఫోర్ సర్జరీ .. ఓకే ? "

కొత్తకొత్త ప్రదేశాలు చూడటం అంటే జెన్నీకు ఎంత ఇష్టమో తెలిసిన రాధిక, వీవా సర్జరీ లేకుంటే తానూ ఆమెతో కలిసి సంతోషంగా తాను చూడాలి అనుకున్న దక్షిణాది గుళ్ళూ, జలపాతాలూ అన్నీ చూసేదాన్ని కదా అని బాధపడుతూ, రాజు వచ్చిన విషయం చెప్పి ఆమెకు కావాల్సిన ఏర్పాట్లు అతనితో చేయిస్తానని చెప్పి, రాజుతో కలిసి డిన్నర్‌కు అని ఆమెను హాల్‌లోకి తీసుకువెళ్ళింది.

" హలో జెన్నీ.. హౌ ఆర్యూ " అప్పటికే ఫ్రెష్‌గా స్నానం చేసి వచ్చి కూర్చున్న రాజును కనుబొమలు ముడేసింది రాధిక. సాధారణంగా అయితే పదిసార్లు పిలిస్తే కూడా డైనింగ్ టేబుల్ దగ్గకు రాకుండా, భోజనం తన దగ్గరకే పంపమనే వ్యక్తి, ఇంటికి అతిధులు వచ్చినప్పుడు , పార్టీల్లోనూ మాత్రం అత్యంత స్నేహశీలిగా , తానే అతిధిమర్యాదలన్నీ తెలిసినవాడిలా ప్రవర్తించి జెంటిల్ మేన్ అనిపించుకునే ప్రయత్నం చేయడం ఆమె గమనించి ఎన్నిసార్లు వెక్కిరించినా అతను మారడు. " మనం ఎంత వెధవలో మనకూ, మన ఇంట్లో వారికీ తెలిస్తే ఫర్లేదు కానీ ఊరంతా తెలిస్తే ఎలా ?" అని ఒక అర్థంలేని లాజిక్ చెబుతాడు. ***తన దృష్టిలో తాను ఏమిటీ, తన వాళ్ళ దృష్టిలో తను ఏమిటీ అనేదాని కంటే తనకేమీ కానివారి దృష్టిలో ఉన్నతంగా ఉండటం కోసమే ఎక్కువగా పాటుపడటమే మనిషి నేర్చుకున్న నాగరికత.***

జెన్నిఫర్ అడిగిన సౌత్ ఇండియా టూరు గురించి చెప్పగానే ఏర్పాట్లన్నీ చేస్తానని చెప్పాడు రాజు. భోజనం అయ్యాక, తాను బసకు ఏర్పాటు చేసుకున్న స్టార్ హోటెల్‌కే వెళతాను అంది జెన్నిఫర్.

"కమాన్.. వాట్స్ దట్, యూ కెన్ హ్యాపీలీ స్టే హియర్" ఎంత రాత్రి పార్టీ అయినా ఎవ్వరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయే అమెరికా సంస్కృతి ఆమెను ఇబ్బందిపెడుతోందేమో అని వారించచూసింది రాధిక. అమెరికానుంచీ ఈ ట్రిప్‌కు అన్నిచోట్లా ఆన్‌లైన్ బుకింగులు చేసేసుకున్నాననీ చెబుతూనే ,

" సీ అయ్ హేవ్ టు బీ మైసెల్ఫ్, జస్ట్ బికాజ్ దట్ మేన్ ఈజ్ నాట్ విత్ మీ ఐ కాంట్ ఛేంజ్ మై ప్లాన్స్, లెట్ మీ బీ ఇండిపెండెంట్, ఐ విల్ మీట్ యూ టుమారో" అంటూ వాళ్ళదగ్గరనుంచి శెలవు తీసుకుంది జెన్నీ.

"ఏమయినా వీళ్ళకు ఈ ఇండిపెండెంట్ లైఫ్ అంటే చాలా మోజు కదా " పడకలో తలవాలుస్తూ అన్నాడు రాజు.

" ఏదోలే, స్వతంత్రభావాలవల్లే కదా అందరూ దేశంలో కెరియర్స్ బిల్డ్ చేసుకుంటున్నాం. సరేకానీ వెళ్ళిన పని ఏమయ్యింది, ప్రాజెక్ట్ ఓకేనా? " పడుకునే ముందు స్నానం చేయాలి అనిపించి తువ్వాలు తీసుకుంది రాధిక.

" ఇదిగో సీరియస్ విషయాలన్నిటినీ ఇలా బాత్రూంలోకెళ్ళేముందు అడగక. ఒక్కనిముషం కూర్చో కొంచెం మాట్లాడాలి" ఆమె చెయ్యి పట్టుకు మంచం మీదకు గుంజాడు. సర్దుకుని కూర్చుంది రాధిక.

" మలేషియా నుంచి ఒక ఔట్ సోర్సింగ్ ప్రాజెక్టకు అప్లయ్ చేస్తున్నాము. కాకపోతే మిగతా కంపెనీలకంటే మన కంపెనీలోనే ఇన్ఫ్రాస్ట్రక్చర్ కొంచెం తక్కువగా ఉంది. అఫ్‌కోర్స్ ఉన్న రిసోర్సెస్‌తోనే ప్రాజెక్టు పూర్తి చెయ్యొచ్చు, కానీ, ఈ ప్రాజెక్టు ఇచ్చేవాళ్ళు మనల్ని అంతగా నమ్మరు కదా, కాబట్టి షో ఆఫ్ కోసం అయినా ఇంకొక ఆఫీస్ డెవలప్ చేద్దాం అనుకుంటున్నాం, నా వాటాగా ఇంకొకటి పెట్టాల్సి రావొచ్చు , నా షేర్స్ అమ్మేద్దామా అనుకుంటే ఇప్పుడు రేట్స్ అంత బాలేవు "

"నా పేరుమీద ఔట్ స్కర్ట్స్‌లో మొన్నే నాలుగు ఫ్లాట్లు కొన్నాం కదా, అవి అమ్మెయ్యొచ్చు కదా" న్యూస్‌పేపర్లలో చూస్తున్న రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను గుర్తుకుచేసుకుంటూ అడిగింది.

" అదే.. కాకపోతే అంకుల్ ఏమయినా అనుకుంటారేమో. అందులో రెండు ఫ్లాట్లు అయితే నీ మనీ , ఒకటి నాది, ఇంకోటి అంకుల్ హెల్ప్‌తో కదా కొన్నాం " నసిగాడు రాజు

" ఏంటిది? ఇన్ని డిఫరెన్స్‌హియేషన్స్ ఏమిటి? నాదీ నీదీ మా నాన్నదీనా! భలే మాట్లాడుతావ్. ఇలా లెక్కలేసే స్థితిలో ఉన్నామని తెలిస్తే ఎవరైన మనకు డైవోర్స్ అవుతోంది అనుకుంటారు" నవ్వులాటగానే అన్నా తన మాట తనకే నచ్చలేదు రాధికకు.

"జోక్‌కాదు. లెక్కలెక్కే. ఏమో రేపెప్పుడైనా మాటామాటా వస్తే ఇది నా డబ్బు అనొచ్చు కదా"

"ఎవరూ ? "

"ఎవరైనా "

"బీ స్పెసిఫిక్ "

"అరే..జస్ట్ పాజిబిలిటీ ఉంటుంది కదా"

"ఎన్నిసార్లు చెప్పాలి రాజూ. లైఫ్‌లో అన్నిటినీ ఇలా రిస్క్ ఎసెస్‌మెంట్స్, పాజిబులిటీస్ అంటూ అతిగా ఆలోచించి రిలేషన్‌షిప్స్‌ను ఇన్సల్ట్ చేయొద్దని"

"ఇప్పుడు నేనేం అన్నానని, ఎన్ని ఫామిలీస్‌లో చూడటం లేదు. అంతెందుకు సుధీర్‌కుమార్ వాళ్ళు నీకు కూడా తెలుసుకదా, మొన్న వాళ్ళ కంపెనీకు లాస్ వస్తే వాళ్ళ ఓన్ ఫాదరే బ్లేం వీడి మీద తోసేసా.. "

" స్టా పిట్..హౌ కెన్ యూ కంపేర్ అదర్ ఫామిలీస్ విత్ అవర్స్"

"ఎమోషనల్‌గా చూస్తే తప్పే రాధీ. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే.. "

" హూ.. ప్రాక్టికల్.. !"

"ఇదిగో నువ్వలా వెక్కిరింతగా నవ్వొద్దు. సెక్సీగా కనిపిస్తావు "

" టాపిక్ మార్చొద్దు. నేనేం ఐస్ అయిపోను. సీరియస్‌గా అడుగుతున్నాను. ఇంతకీ ఫ్లాట్లు నీకు కావాలా ఒద్దా?"

"మహా ప్రసాదం, అంతకన్నానా. కాకపోతే ఒకటి, ఇప్పుడే చెబుతున్నా, కావాలంటే అంకుల్‌తో కూడా మాట్లాడుతాను రేపు, మీకు బిజినెస్ ప్లాన్ నచ్చి అందులో ఈ డబ్బు ఇన్‌వెస్ట్‌మెంట్ గా అనుకుని కన్విన్స్ అయితేనే ఇవ్వండి, అప్పుడు లాస్ గీస్ వస్తే నన్ను మాత్రమే అనకూడదు మరి "

"మాకెందుకు ఇన్‌వెస్ట్‌మెంట్ అలా ఇన్‌వెస్ట్ చేసేట్లయితే డొక్కు కొత్త కంపెనీలోనే ఎందుకూ , ఏ మైక్రోసాఫ్ట్‌లోనో చేస్తాం కదా. నువ్వు కాబట్టే నేనైనా నాన్నైనా ఆ మనీ ఇచ్చేది. లాజిక్ మాత్రం తట్టదే మన బుర్రకు "

"తట్టకేం కాదు. నేనూ లాజిక్ పాటించే నిన్ను అడుగుతున్నాను లేకపోతే ఏ బ్యాంక్ ఇవ్వదు చెప్పు.. లోను? వడ్డీ కట్టలేక అడుగుతున్నానా ఏమిటి? ఏదో మనవాళ్ళ ప్రాపర్టీలు అయితే.. రా"

"ఆగాగు అక్కడ.. మనవాళ్ళు అనేది రోజా చిన్నపిల్లాడు హోంవర్కు వ్రాసినట్లు రోజుకు ఒక వందసార్లు వ్రాసి గోడమీద అతికించి రోజూ చదువుకో .అప్పటికి కానీ నీకు అది గుర్తు ఉండదు" ఇక మాటల్లేనట్లు బాత్రూంవేపు అడుగులేసింది.

"రాధీ... ఒక్క మాట " మళ్ళీ చెయ్యి పట్టుకున్నాడు అతను.

ఏమిటని నిలబడిపోయింది.

"ప్రొద్దున్నేమైనా సర్జరీలు ఉన్నాయా ? "

కోపం తన్నుకొచ్చింది ఆమెకు. "ఎప్పుడూ అర్థరాత్రి ఏమిటీ చెత్త ప్రశ్నలు ?"

"అలా కాదు తొందరగా నిద్రపోవాలేమో , మార్నింగ్ ఎర్లీగా లేవాల్సిన వర్క్ ఏమైనా ఉందేమో అని.." తనేమి అన్నా చిరాకుపడతావెందుకున్నట్లు చిన్నబుచ్చుకున్నాడు అతను.

"లేదు. నథింగ్ లైక్ దట్. ఏంటి చెప్పు?"

"వుడ్ యూ లైక్ టు హేవ్ ఎ డ్రింక్, లిటిల్ బిట్ ఆఫ్ రెడ్ వైన్ "

ఆల్కహాల్ అనే మాటెత్తితే చైతన్యను అయినా చిరాకు పడిన రాధిక, అమెరికాలో మాత్రం చలికి, మంచి హుషారు సమయంలో కాస్తంత రెడ్‌వైన్ రుచిచూసేందుకు ఇష్టపడుతుంది. పెళ్ళైన సంవత్సరం తర్వాత వచ్చిన క్రిస్‌మస్ శెలవులకు లేక్-టాహోలో జరుపుకున్న హనీమూన్‌నాడు రాజు బ్రతిమిలాడి మరీ ఒప్పించి ఆమెకు అందించిన రుచి . తాము బస చేసిన కాటేజ్ గది కిటికీలోంచి చూస్తే ఎటు చూసినా మంచు. ఆకాశాన్ని వెనక్కు తోసేసిన మంచు పర్వతాలు. కిటికీ అద్దాలన్నీ గదిలో హీటర్ ఉన్నప్పటికీ మంచుతో చెమ్మబడిపోయి ఉన్నాయి. అలాంటి వాతావరణంలో రాజు, రెడ్‌వైన్ ఆమెకు ఎంతగానో నచ్చాయి. తర్వాత అప్పుడప్పుడూ, రాజుతో మనసుకు నచ్చినప్పుడల్లా కాస్తంత రుచి చూస్తూనే ఉంది. కానీ ఇండియాకు వచ్చాక అతను ఇలా అడగడం ఇదే మొదటిసారి. ఫ్లాటు ఇస్తానందుకు బదులుగా కాస్త రొమాన్స్ ఆఫర్ చేసాడా అని అనుమానం వేసింది. భర్తను అంతగా శంకించడానికి ఆమె మనసే ఒప్పుకోలేదు. కానీ అతను రెండు విషయాలూ ఒకే రోజు ప్రస్తావించకుంటే ఈ అనుమానమే వచ్చేది కాదు కదా. రెడ్‌వైన్ రుచి మారనట్లు రాజు కూడా రోజులాగే అస్సలు మారిపోకుండా ఉంటే ఎంత బావుండేదో అనిపించింది ఆమెకు. టెక్నాలజీలో సాధించిన ప్రగతితో ఎలాంటి గదిలో అయినా ఏసీ మిషన్లతో అలాంటి చలి వాతావరణం సృష్టించుకుని వెచ్చబర్చుకునే పనులు ఎన్ని అయ్యినా చెయ్యొచ్చు కానీ, ప్రకృతిసిద్ధమైన అందానికి కలిగే స్పందనలను మాత్రం ఏమిచ్చి కొనుక్కోగలం?

"ఏంటి.. ఓకేనా ? " షర్ట్ తీసివేస్తూ అన్నాడు రాజు. రాధికకు పూర్తిగా అర్థమయ్యింది. వైన్ తర్వాత అతను ఒక మాట అనకూడదని కోరుకుంది. కానీ అతను అన్నాడు " షల్ వి హేవ్ సెక్స్?" అని. మనసుకు ఎంత నచ్చజెప్పుకున్నా యాంత్రిక జీవితం మనసుకు రుచించదు. *మనకంటికైతే తామరాకు మీద నీటిబొట్టు చూడటానికి బావుంటుంది కానీ తడిని ఆస్వాదించలేని ఆ ఆకు బాధ దానికే తెలియాలి.*

"ఒక మాట అంటాను ఏమీ అనుకోరుగా?"

"చెప్పండి"

"నువ్వు అనోచ్చా? "

"ఊ"

"మరి నన్నూ అలా సంబో సంబో...ఛ.అంత తెలుగుపదం నాకు రాదు కానీ, నన్ను కూడా నువ్వు అనే పిలవాలి మరి "

"..."

" నీ స్మైల్‌బావుంది "

"..."

"సారీ.. పెళ్ళిచూపులకొచ్చి ఫ్లర్ట్ చెయ్యకూడదేమో! "

"అంటే వేరేచోట అయితే చేస్తారా.. సారీసారీ.. చేస్తావా "

"లేదు.. నాకు ఫ్లర్ట్ చెయ్యడం అంత రాదు. అంతా నా వైఫ్ కోసమే రిజర్వ్ చేసి పెట్టుకున్నా"

" .. "

"వెల్ యూ ర్ వెరీ ఇంటలిజెంట్"

"సడెన్‌గా అలా ఎందుకు అనిపించింది? "

"అంతసేపటినుంచి నేను ఆన్సర్స్ అయితే ఎక్స్‌పెక్ట్ చేసి తెలివిగా నీనుంచి ఆన్సర్ రాబట్టాలి అని ట్రై చేస్తున్నానో నీకు అర్థమై కూడా అర్థం కానట్టు మాటను స్కిప్ చేస్తున్నావుగా "

"....."

" అదిగో మళ్ళీ.. ఈ సైలెన్సే చాలా డేంజరస్. సరే నేను డైరెక్టుగా అడిగేస్తున్నాను. ఈ పెళ్ళి నాకు ఇష్టమే. డోంట్ ఎక్స్‌పెక్ట్ మీ టు టెల్ రొమాంటికల్లీ వాట్ ఆల్ ఐ లైక్‌డ్ ఇన్ యూ, బట్ ఐ లైక్‌డ్ ఎవ్విరిథింగ్ ఐ అబ్జర్వ్‌డ్ ఇన్ యూ సోఫార్ అండ్ ఐ థింక్ వి మేక్ ఎ గుడ్ పెయిర్. సో... "

".... "

"సో.... ఐ వుడ్ లైక్ టు మ్యారీ యూ.."

"మరీ ఇంత ఇంగ్లీషులో మాట్లాడుతావా ఎప్పుడూ?"

"వెల్ తెలుగులో అయితే ఇంత ఫ్రీగా చెప్పలేని. సిగ్గో చేతకానితనమో అడ్డొస్తుంది ..మన భాషలో అయితే"

"... "

"కమాన్ దిసీజ్ నాట్ ఫెయిర్. నేను ఇంత ఫ్రాంక్‌గా చెప్పేసాను. ఇంకా నీ ఒపీనియన్ మాత్రం చెప్పట్లేదు"

"ఊ.. ఎలా చెప్పాలో తెలియట్లేదు"

"ఒకే... ఐ విల్ హెల్ప్ యూ. ఫస్ట్లీ, నేను నచ్చానా?"

"అంటే..?"

"పోనీ.. నేను కనీసం ఒకేనా ? మరీ బ్యాడ్ కాదు కదా"

"నాట్ బ్యాడ్ ఐమీన్ బెటర్ దేన్ ఓకే"

"థాంక్స్, నన్ను పెళ్ళి చేసుకోవడం ఓకేనా?"

"అదే చెప్పలేకున్నాను "

"ఎనీ ప్రాబ్లం?"

"ఒక్క విషయం చెప్పాలి. ఇంట్లో కూడా అంతగా తెలియదు. నేను ఒకప్పుడు ఒకతన్ని ఇష్టపడ్డాను.."

"..."

"వి వర్ బెస్ట్ ఫ్రెండ్స్. వి థాట్ వి లవ్డ్ ఈచ్ అదర్. మ్యారేజ్ చేస్కుందాం అనుకున్నాం. బట్ ఇట్ డిడ్ నాట్ వర్క్. ఆఫీలింగ్స్ ఇప్పుడేమీలేవు. వి ఆర్ నాట్ ఈవెన్ ఇన్ టచ్ ఎనీ మోర్"

".... "

"నాకు ఎవ్వరు హజ్‌బెండ్ అయినా ఈ నిజం చెప్పాలి కదా"

"ఏమీ అనుకోను అంటే , ఒక విషయం అడగనా ప్లీజ్ ఏమీ అనుకోకూడదు. ఎనీ డెసిషన్ వి టేక్ నౌ విల్ ఛేంజ్ అవర్ లైవ్స్ కదా. నాకు ఈ విషయం తప్పక తెలియాలి.  మీరు నన్ను తిట్టుకున్నా ఫర్లేదు, కానీ ప్లీజ్ నా స్థానంలో ఉండి ఒకసారి ఆలోచించి సమాధానం ఇవ్వండి.. "

" ఇంత చెప్పక్కర్లేదు  ఆల్‌రెడీ మీరు నన్ను మీరు , అండీ అనడం మొదలెట్టేసారు"

"నో ఐ హేవ్ టు టెల్ యూ. నేను చాలా చిన్న టౌన్‌లో పెరిగినవాడిని. అమెరికా వెళ్ళున్నా కానీ నా మైండ్‌సెట్ చాలా న్యారో. నాకు ఇంతవరకూ వేరే ఏ అమ్మాయితోనూ అఫైరూ ఏమీ లేదు. మీ గురించి నేను ఇలా ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు. బట్, ఐ జస్ట్ వాంటు నో వన్ థింగ్. లవ్‌లో ఎమోషనల్‌గా ఉండో క్లోజెనెస్ అంతా,  మీరు ఇప్పుడు విడిపోయారు కాబట్టి, దగ్గరితనం పోయి ఉంటుంది. హౌ క్లోజ్ వర్ యూ ఫిజికల్లీ...?'

"............"

"ప్లీజ్.. కోప్పడకండి. మీ వైపునుంచి ఆలోచిస్తే నేను చాలా నీచంగా అడిగాను అనిపించొచ్చు. బట్, అబ్బాయిగా నాకూ కొన్ని డ్రీమ్స్, వాల్యూస్ ఉన్నాయి కదా"

"ఓకే.. యూ వాంట్ టు మ్యారీ ఒన్లీ ఎ వర్జిన్?"

"....... "

" నా గురించి నేను ఇలా చెప్పుకోవాల్సి వస్తుంది అనుకోలేదు. యస్, అయాం ఎ వర్జిన్ , అండ్ మీరు ఇలా ఫ్రాంక్‌గా అడగడం నాకు నచ్చింది.."

"ఇప్పటికైనా విల్ యూ మ్యారీ మీ ?"

"మీరు చాలా సెల్ఫిష్, ఐ థింక్ మ్యారేజ్‌లో సెల్ఫిష్‌నెస్ చాలా అవసరం"

"భలే తెలివిగా చెప్పారుకానీ, ఇంతకీ దీని అర్థం యస్ అనే కదా"

*మనిషికి నిద్ర ఒక శత్రువుకూడా. మెలకువలో అణగదొక్కేసుకున్న ఎన్నో పాత జ్ఞాపకాలను, గుర్తుకు తెచ్చుకోవడానికి ఇష్టపడని సంగతులనూ మూసుకున్న కనురెప్పల చాటున సినిమా లాగా కట్టి చూపిస్తుంది. మనసు వన్స్‌మోర్ అడగకపోయినా రిపీట్ టెలికాస్ట్ చేస్తూనే ఉంటుంది, మెలకువ వచ్చేంతవరకూ.*

రాధిక చూసేసరికి, అప్పుడే తెల్లవారిపోయింది. మంచంలో కొంచెం అవతలగా సన్నటి గురకలో రాజు. వొంటిమీద బట్టల్లేకుండా నిద్రపోయేలా చేసిన రెడ్‌వైన్‌నూ, తరువాత రాజూ తానూ ఇచ్చిపుచ్చుకున్న యాంత్రికమైన సుఖాన్నీ గుర్తుకుచేసుకుని మెల్లగా నైటీ తొడుక్కుంది. అద్దంలో, స్త్రీ శరీరానికి కావలసిన సుఖం దక్కుతున్నా సుఖం లేనట్లు వాడిపోతున్న తన ప్రతిబింబం జీవితంలో వెలితిని కర్కశంగా గుర్తుకుచేస్తోంటే, చూపు మరల్చుకుని మళ్ళీ నిద్రపట్టక , జెన్నిఫర్ ఎలా ఉందో కనుక్కుందామని ఫోన్ కోసం వెదికింది. ఛార్జింగ్ ప్లగ్‌లోంచి తీయగానే, తెల్లవారు ఝామునే వచ్చిన ఒక మెసేజ్ కనిపించింది. చైతన్య నుంచి.

"అయాం క్లూ లెస్. నీలిమ వివేకానందను వేరే డాక్టరుకు చూపిస్తానని మెసేజ్ పెట్టేసి, నేను ఇంట్లో లేనప్పుడు తనను ముంబైకు తీసుకువెళ్ళిపోయింది. విల్ హి బీ ఓకే విత్ అదర్ డాక్టర్స్ ? "

*మనిషి కోరుకున్నదల్లా కోరుకున్నట్లే జరిగిపోదు కాబట్టే విధి, దేవుడు గ్రటా అనే నమ్మకాలు పుడతాయి.*

**11**

"నాకేం చెయ్యాలో ఏమీ తెలియట్లేదు" మాట పూర్తికాకుండానే చైతన్యలో ఏడుపు బద్దలైంది. *మగవాడి కంట నీరు దుఃఖానికే పరాకాష్ట జీవితంలో ఆదర్శంగా తీసుకునే బలమైన వ్యక్తిత్వం ఉన్న మనుష్యులు మన ఎదుటే ఏడవడం జరుగుతున్నప్పుడే గుర్తుకువస్తుంది జీవితం అంటే భయం.* చాలా భయపడిపోయింది రాధిక. ముక్కులోకి జారిపోతున్న కన్నీళ్ళల్లో అతని ఊపిరి మునిగిపోతూ ఫోనులో ఇగిరిపోతోంది.

"అసలు ఇలా ఎలా చేస్తుంది? ఇంక మూడు రోజుల్లో సర్జరీ.. రేపు అడ్మిట్ చేస్తాం అనుకున్నప్పుడు ఇప్పుడు డాక్టరును మార్చడం ఏమిటి?" అతను మాట వణికిపోతోంది.

ఇంకో పేషెంటు గురించి ఎవరైనా ఇలాంటి పనిచేసి ఉంటే రాధిక పెద్ద పట్టించుకునేది కాదు. క్లిష్టమైన ఆపరేషను దగ్గరపడేప్పుడు పేషెంటు తాలూకు మనుష్యులు చిత్రవిచిత్రంగా ప్రవర్తించడం ఆమెకు ఎన్నోసార్లు అనుభవమైన విషయమైన విషయమే. కానీ నీలిమ వివేకానందను తీసుకువెళ్ళిపోవడానికి కారణం వేరే అనిపిస్తోంది ఆమెకు.

"కమాన్ చే, హోల్డ్ యువర్ సెల్ఫ్. మధ్యాహానికల్లా తను నీకు కాల్ చేస్తుందిలే" ముంబైలో నీలిమ వివేకానందను ఏ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళపోతుందా అని ఊహించజూసింది రాధిక. తనకన్నా మంచి డాక్టర్లు అక్కడ ఖచ్చితంగా ఉంటారు, వివేకానంద క్యాన్సర్‌ను వాళ్ళు పూర్తిగా నయం చేస్తారు. అప్పుడు ఆ అబ్బాయిని మళ్ళీ చైతన్య దగ్గరకు తీసుకు వస్తుందా లేక తనతో పాటు సింగపూరు తీసుకువెళ్ళిపోతుందా? అలా అయితే వివేకానందను తను ఇక మళ్ళీ చూడలేదేమో!? చివరిగా చూసినప్పుడు ఇదే చివరి సారి అని తెలిస్తే ఎంత బావుండేది. అస్సలు వదిలేది కాదుకదా ఒక వేళ ముంబైలో నీలిమ మంచి డాక్టరును కలవకపోతే? ఏమో, డబ్బుకోసమే పెద్ద పెద్ద హాస్పిటళ్ళు కడుతున్న ఈ రోజుల్లో సరి అయిన ప్రజ్ఞ లేని సర్జన్ ఎవరైనా అత్యుత్సాహంతో ఆపరేషన్ తప్పుగా చేస్తే? ప్రాణం? ఒకవేళ ప్రాణం దక్కినా సైడ్ ఎఫెక్ట్స్? ఊహించుకోవడానికే భయమేసింది రాధికకు. చైతన్యకు మరి ఇంకెంత భయం వేయాలో?

"ఎవిరిథింగ్ విల్ బీ ఫైన్, భయపడకు చే" వృత్తిరీత్యా ఎందరికో చెప్పే మాటే ఆత్మీయంగా చెప్పింది రాధిక.

"ఏమో.. ఏమీ అర్థం కావట్లేదు. నిజంగా మిగతా డాక్టర్ల సర్జరీతో ప్రాబ్లమ్స్ ఏమీ రావుకదా" అతడి మాట ఇంకా వణుకుతూనే ఉంది.

`ఊఁ..` అని తల ఊపింది రాధిక. *తన చేతుల్లో ఏమీలేదని తెలిసినా పిడికిట్లో విధిని బంధించేందుకు మనిషి చేసే నిరంతర ప్రయత్నమే జీవితం.*

"రాధికా.. ఏమీ అనుకోకపోతే ఒక చిన్న రిక్వెస్ట్" ముక్కు ఎగబీల్చుకుని అడిగాడు చైతన్య.

అడగమని మౌనంతో సమాధానం ఇచ్చింది

"ఒక్కడినే ఉండాలంటే భయంగా ఉంది.. ఎక్కడయినా సరే కాసేపు నీతో కూర్చుని మాట్లాడొచ్చా?"

*పెద్ద పెద్ద ఆశయాలనయినా సాధించుకోవచ్చు కానీ చిన్న చిన్న కోరికలను తీర్చుకోవడమే చాలా కష్టం.*

రాధికకు ఏమీ తోచలేదు. ఉదయం ఐదున్నర అవుతోంది. రాజు గదిలో నిద్రపోతూనే ఉన్నాడు. తమ్ముడి ఇంటికివెళ్ళిన అమ్మా నాన్న సాయంత్రానికి కానీ రారు. *చుట్టూ అడిగేవారు ఎవ్వరూ లేకపోయినా అంతరాత్మ గీసిన గీతలు దాటడం చాలా కష్టం.* ఇప్పుడు ఎలా వెళ్ళడం? ఎవ్వరికని చెప్పడం? ఏమని చెప్పడం? పాత స్నేహితుడూ, మాజీ ప్రేమికుడూ అయిన మగవాడి దగ్గరకు ఒంటరిగా వెళ్ళడం, అది ఏ పని గురించి అయినా సరే వీళ్ళందరి దృష్టిలో చాలా పెద్ద విషయం. తప్పొప్పులు బేరీజు వెయ్యాల్సిన ప్రశ్న. ఇప్పుడు రాజును నిద్రలేపి ఇలా వెళ్ళాలి అంటే ఏమనుకుంటాడో! పోనీ అతనినీ తనతో రమ్మంటే!? ఆ సన్నివేశాన్నే ఊహించుకోలేకపోయింది రాధిక. రాజును తప్పుపట్టడం ఇష్టం లేక, ఒకసారి అతని స్థానంలో తననూ, తన స్థితిలో అతడు ఉంటే ఎలా ఉండేదో అని ఆలోచించింది. ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే అతడు తనను నిద్రలేపి, "నా ఒక్కప్పటి బెస్ట్‌ఫ్రెండ్ అండ్ గర్ల్‌ఫ్రెండ్ చాలా డిస్ట్రెస్‌లో ఉంది, ఓదార్చడానికి నేను ఉంటే బెటర్ నేను వెళ్ళనా, నువ్వూ వస్తావా?" అంటే తాను ఎలా ప్రవర్తిస్తుంది? ఎంత తర్కించుకున్నా ఆ పరిస్థితుల్లో తానయితే ఏం చేస్తానో ఆమెకు తెలియలేదు. ప్రతిమనిషీ *ఇంకొక మనిషి స్థానంలో తనను ఊహించుకుని మనగలిగితే మన ప్రపంచమే స్వర్గం.* పోనీ, ఇంకాస్త తెల్లారాక హాస్పిటల్‌కు వెళుతున్నానని చెప్పి చైతన్యను కలవచ్చుకదా. అటువంటి ఆలోచన వచ్చినందుకు తనమీద తనకే కోపం వచ్చింది రాధికకు. *మనఃస్సాక్షికి కట్టుబడేవాళ్ళు అబద్ధం చెప్పే ధైర్యం చేయలేరు. కానీ నిజం దాచడం అనే మరింత పిరికి చర్యకు దిగజారిపోతారు.*

"నైన్ తర్వాత కలుద్దామా?" లిప్తకాలంలో జరిగిన మానసిక సంఘర్షణలో ఓడిపోతూ అడిగింది రాధిక.

"ఓ సారీ.. దిసీజ్ వెరీ ఆడ్ టైం కదా! రియల్లీ సారీ చూసుకోలేదు" ఒక చిన్న కోరికతో ఆమెను తానెంత ఇబ్బందిపెడుతున్నానో అప్పుడే స్ఫురించింది చైతన్యకు. *అతడి క్షమాపణ ఆమెలో పశ్చాత్తాపాన్ని పుట్టించింది. తాను ఎంత సిద్ధపడినా ఒక స్నేహితుడికి అవసరం వచ్చినప్పుడు తోడు వెళ్ళనీకుండా చేస్తున్నంత అర్థరహితమైనదా తన జీవితం అనిపించింది.*

"ఇంతకీ ఎక్కడ?" చైతన్య ఇంకో కొత్త సమస్యను ప్రశ్నించాడు. ఈసారి ఆలోచించాలంటేనే భయం వేసింది రాధికకు. మునుపొకసారి రెస్టారెంట్లో కలిస్తేనే జగన్ చూడడం, కుసుమ ప్రస్తావించడం గుర్తుకు వచ్చి.. అంతటి చల్లటి ఉదయంలోకూడా ఆమె పెదవులు తడారిపోయాయి. ఉదయం తొమ్మిదిగంటలకు ఒక స్నేహితుడిని కలిసేందుకు సరి అయిన ప్రదేశమే ఆమెకు తెలియలేదు కానీ ఖచ్చితంగా తన ఇంట్లోనో అతడి ఇంట్లోనో మాత్రం కుదరదు అని అర్థమయింది.

"ఏంటి మేడమ్ అప్పుడే ఫోన్లు ... బిజీనా?" ఎప్పుడు నిద్రలేచాడో కానీ రాజు బెడ్రూంలోంచి వస్తున్నాడు. హఠాత్తుగా ఏమీ తోచక, "హాస్పిటల్ నుంచి" అనేసింది రాధిక ఫోన్‌కు చేయి అడ్డుపెట్టలేదే అని తర్వాత స్ఫురించింది. కానీ చేయగలిగిందేమీ లేదు. ఆ చిన్నపాటి అబద్ధంతో ఇటు తనకూ, అవతల ఆ మాట విన్న చైతన్యకూ తమ మధ్య అగాధం లోతు ఎంత పెద్దదో స్పష్టంగా

స్ఫురించింది. ఫోన్ లైన్ కట్ అయినట్లు బీప్ మనే శబ్దం చెవుల్లో వినపడగా మనసంతా నీరసం అయిపోయి సోఫాలో వెనక్కు వాలిపోయింది రాధిక. వెంటనే అతని దగ్గరనుంచి ఒక మెసేజ్.

"ఇట్స్ ఓకే. అయి విల్ టేక్ కేర్ ఆఫ్ మై సెల్ఫ్. నీ పరిస్థితిని అర్థం చేసుకోగలను. అదే ప్లేసులో నేను ఉంటే ఈ మాత్రం మాటలు కూడా కుదిరేవి కావేమో. నీ పొజిషన్‌లో నేను ఉండేట్లయితే ఇప్పుడు ఈ మెసేజ్ కూడా డిలీట్ చేస్తాను"

అతను ఆమెకు చాలా నచ్చాడు. ఒకప్పటిలాగానే వెన్నెల్లో సముద్రాన్ని చూపించిన చే గుర్తుకు వచ్చాడు. తనను తానే కౌగిలించుకుంటున్నట్లు చేతులతో ఎదకప్పుకుంటూ సోఫాలో వాలి పడుకుంది. ***ప్రేమను వ్యక్తపరచడానికో, ప్రదర్శించడానికో ఎన్నో అడ్డుగోడలు ఉండొచ్చు కానీ ప్రేమించడానికి అవేమీ ఉండవు.***

"హలో డాక్టర్ రాధికగారా?"

"యస్ ప్లీజ్..." ఒక సర్జరీ ముగించుకుని తన ఛాంబర్ వేపు వెళుతున్న రాధిక ఫోన్ ఆన్సర్ చేసింది.

"నేను చైతన్య వైఫ్‌ను"

నీలిమ గొంతులో వెటకారం, ఉన్మాదం కలిపి ధ్వనించాయి.

"చెప్పండి" నింపాదిగా కూర్చుంది రాధిక.

"మా అబ్బాయి సర్జరీ గురించి అడుగుదామని ఫోన్ చేసాను మేడమ్" తను ఎదురుగా లేకపోయినా నీలిమ అందమైన ముఖంలో ఇలాంటి అతి తెలివిని ఊహించుకోలేకపోయింది రాధిక. ఏం మాట్లాడాలో తెలియలేదు. వివేకానందను తీసుకుని ఆమె ముంబై వెళ్ళిందని ప్రొద్దునే కదా చైతన్య చెప్పాడు. మళ్ళీ ఈ ఫోన్ కాల్ ఏమిటీ? తిరిగి వచ్చేసిందా?! అసలు ముంబై వెళ్ళడం చైతన్యతో ఆవిడ చెప్పిన అబద్దమా? ఇక్కడే ఉండి చైతన్య ప్రమేయం లేకుండా ఈవిడే దగ్గరుండి తన చేత వీవాకు సర్జరీ చేయించదలిచిందా? ప్రశ్నలతో సతమతమవుతోంది రాధిక.

"చైతన్య మీతో ఏమైనా చెప్పాడా?" నీలిమ గొంతులోంచి ఏ భావమూ తెలియడంలేదు. **ముంచేసే నది కూడా అందంగానే ఉంటుంది.**

నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో తేల్చుకోలేకపోయింది రాధిక. అవునంటే తనకూ చైతన్యకూ మధ్య కేవలం డాక్టరూ పేషెంటు తాలూకు బంధం కాకుండా స్నేహం ఉందని బాధపడుతుందేమో ఏది ఏమయినా నిజానికి కట్టుబడడమే మంచిది అనుకుని "మీరు బాబును ముంబై తీసుకెళ్ళారటగా!?" అనేసింది రాధిక

"ఓ..సో రెగ్యులర్ టచ్‌లో ఉన్నారన్నమాట"

కోపాన్ని అదుపు చేసుకుంది రాధిక. తన వేపు నుంచి మాట జారకూడదు.

"అయామ్ సారీ ఐ మీన్, ఇప్పుడే ముంబైలో.. హాస్పిటల్‌లో వివేక్‌ని చూపించి వస్తున్నా. ఈసరికే ఈ విషయం మీకు తెలిసి ఉంటుందని నేను అనుకోలేదు...."

"జస్ట్ మీరు ముంబైకు తీసుకువెళ్ళారని మాత్రం తెలుసు. మిగతా డీటైల్స్ ఏమీ తెలియదు" నీలిమ పెడర్థం తీసే అవకాశం ఇవ్వకుండా ఠపీమని చెప్పింది రాధిక

"ఓహో, అలాగా! ఇంతకీ అబ్బాయికి సర్జరీ చేస్తే సక్సెస్ అయ్యే ఛాన్సెస్ ఎంత అన్నారు?"

నీలిమ ప్రశ్నలో సాధారణంగా తన పిల్లాడి ఆరోగ్యం గురించి ఒక తల్లిపడే ఆదుర్దాకంటే, డాక్టరుగా తన పరిజ్ఞానాన్నీ సామర్ధ్యాన్ని పరీక్షించే ఉద్దేశ్యమే వినిపించింది రాధికకు.

"అలా పర్సంటేజీ ఎలా చెప్పగలమండీ. ఇలాంటి సర్జరీలు చాలా చేసాం. మోస్టీ నైన్టీ పర్సెంట్ సక్సెస్ అవుతాయి. ఓ పదిశాతం పేషెంట్లకు మాత్రం ఒక్కో స్టేజీలో ఒకోరకం అనుకోని కాంప్లికేషన్స్..."

"సో.. అంటే మీరు పూర్తి అశ్యూరెన్స్ ఇవ్వలేరన్నమాట!?" కవ్వించేలా అడిగింది నీలిమ.

*మూర్ఖత్వాన్ని అయినా ఒప్పించొచ్చు కానీ మొండిమాటను ఎవరు ఎదుర్కోగలరు?*

"హ్మ్మా.." నీలిమ మాటలకంటే ఆ నిట్టూర్పుకు కోపం వచ్చింది రాధికకు. "సారీ, మీ పేషెంట్‌ను అలా మీ పర్మిషన్ లేకుండా తీసుకువచ్చేసాను. బట్, ఈరోజుల్లో చిన్న చిన్న ట్రీట్ మెంట్‌కు కూడా సెకెండ్ ఒపీనియన్ తీసుకోవడం నార్మలే కదా" నీలిమ సంజాయిషీ ఇస్తున్నట్లు చెపుతుంటే మౌనం వహించింది రాధిక. వివేకానందగురించి కాకుంటే ఇంకా ఇటువంటి వ్యక్తితో మాటలు కొనసాగించే ఆసక్తి ఆమెకు ఏ మాత్రం లేదు. తన అప్పాయింట్‌మెంట్ కోసం వెలుపల ఇంకొందరు పేషెంట్లు వేచి ఉన్నారనే ఆలోచన ఆమెను మరింత ఇబ్బంది పెడుతోంది.

"సో.. హూ ఈజ్ ది సెకెండ్ ఒపీనియన్?" సంభాషణను తొందరపెట్టింది రాధిక.

"వెరీ గుడ్! దె ఆర్ గివింగ్ సెంట్ పర్సెంట్ ఆష్యూరెన్స్" గొప్పగా చెప్పుకుంది నీలిమ

ఎంత సాధించినా మనిషి విధికి బానిసే. వైద్యుడికి వృత్తిలో నైపుణ్యంతోపాటు తాను మానవమాత్రుడను మాత్రమే అనే వివేకమూ ఉండాలి అని ఖచ్చితంగా నమ్మే రాధిక, విధికి భయపడని సాటి డాక్టరు, ఎంత గొప్పవాడైనా సరే, నమ్మదు. మరి అంత ఖచ్చితంగా నీలిమకు భరోసా ఇచ్చిన అలాంటి వైద్యుడి చేతిలో వివేకానంద పడుతున్నాడంటే ఆమె కాస్త కలత చెందింది.

"ఒక రెండు రోజుల్లో జర్మనీ నుంచి ఒక స్పెషలిస్టు వస్తారట. ఆయన చాలా తక్కువ కేసులను మాత్రమే టేకప్ చేస్తారు. హి ఈజ్ వెరీ ఎక్స్‌పెన్సివ్, ఏదో నేను కాబట్టి అఫర్డ్ చేయగలుగుతున్నాను. పాపం చైతన్యకు ఇవన్నీ హ్యాండిల్ చెయ్యడం తెలియదు"

భర్తను పరాయిస్త్రీ ఎదుట తక్కువచేసే మాట్లాడేంత హీనబుద్ధి నీలిమలో ఉంటుందని అనుకోని రాధిక ఆశ్చర్యపడింది. అంతటి అందమైన ముఖం వెనుక ఇంతటి వికృతమైన మనసా. ఎంతవారలైనా మోసపోయేది ముఖం చూసే మరి.

"అసలే పాపం ఈ మధ్య అదేంటో లంచం తీసుకున్న కేసులో ఉన్నారు. అలాంటి మనీతో వివేక్‌కు సర్జరీ అంటే నాకు నచ్చదు"

***జీవితంలో కల్లా ఇబ్బందికరమైన స్థితి మనకు కావలసినవాళ్ళను మన ఎదుటే కించపరుస్తుంటే బదులు చెప్పుకోలేని స్థానంలో ఉండటం. అలాంటప్పుడు కోపం అవతలివారి మీద కంటే, అసలు ఇలాంటి స్థితి తీసుకొచ్చే తప్పుచేసిన ఆత్మీయులమీదా, వారిని ఆ తప్పు చేయకుండా నియంత్రించలేకపోయిన మన మీదే కలుగుతుంది.***

"ఓ సారీ.. మీ టైం వేస్ట్ చేస్తున్నట్లున్నాను. జస్ట్ మీకు ఈ విషయం చెప్పడం కర్టసీ అని చెబుతున్నాను. థ్యాంక్స్ ఫర్ ఎవ్విరిథింగ్ ఇంతవరకూ వీవాను బాగా చూసుకున్నారటగా" వ్యంగ్య ఏ మాత్రం తగ్గలేదు నీలిమ కంఠంలో.

వివేకానందను ఇక తాను చూడబోవడం కల్ల అని అర్థమవుతుండగా "వెల్ కమ్" అంటూ బదులు చెప్పింది రాధిక.

"ఒన్స్ ఎగైన్ అయామ్ వెరీ సారీ, బాబును ఇలా సడెన్‌గా తీసుకుపోయినందుకు. యూనో, ఏజ్ ఎ మదర్ ఐ యామ్ వెరీ వరీడ్ ఒక మదర్‌గా నా వైపునుంచి ఆలోచిస్తే మీరూ అర్థం చేసుకోగలరు.. ఓ ఓ అయామ్ వెరీ సారీ, మరచిపోయాను.. పాపం, మీకు పిల్లలు లేరటగా. చైతన్య చెప్పాడు. వెరీ సారీ ఇఫ్ ఐ అఫెండెడ్ యూ. ఉంటాను మేడమ్ బై థ్యాంక్యూ" విషం జల్లుతూ కాల్ కట్ చేసింది నీలిమ.

ఒంట్లోంచి రక్తమంతా ఎవరో పీల్చేసినట్లు నీరసపడిపోయింది రాధిక. చాలా కోపం వచ్చింది. చైతన్యపై. అసలు ఆ విషయం ఎందుకు చెప్పాలి అతను. ఏమని చెప్పి ఉంటాడు? "పాపం తనకు పిల్లలు లేరు" అని ఉంటాడా? పాపం అని ఉంటాడా? మెల్లగా రాధిక కోపం తనమీదకే మళ్ళింది. తనకు ఇలా జరిగి ఉండాల్సింది కాదు. ప్రెగ్నెన్సీ ఉన్నప్పుడు జాగ్రత్తగా మసలుకుని ఉంటే బావుండేది.

"మేడమ్ పేషెంట్‌ను పంపమంటారా..?" అటెండర్ పిలుపుతో తన భావాలన్నిటినీ తుడిచేసుకుంది రాధిక. పంపించమని తల ఊపి, సెల్ ఫోనులో కాల్ వచ్చిన నెంబరును నీలిమ పేరుతో సేవ్ చేసుకుంటూ అనుకుంది: మరెప్పుడూ ఆమెతో మాట్లాడకూడదని.

"హేయ్ అయామ్ ఇన్ కన్యాకుమారి. ఇట్స్ సో బ్యూటిఫుల్ ఐ విష్ యూ.."

"కమాన్ డోంట్ సే దట్ అగైన్ అండ్ అగైన్.. యూ నో దట్ ఐ కాంట్ కమ్ జస్ట్ లైక్ దట్"

"సో.. వాట్ హ్యాపెండ్ టు దట్ బోయ్.. వివేకానంద?"

జెన్నిఫర్ మాట విన్నాక కాస్త మనశ్శాంతిగా అనిపించింది రాధికకు. నీలిమ ఫోన్‌లో ఎంత వంకరగా మాట్లాడినా వివేకానంద ఆరోగ్యం గురించి తపనపడకుండా ఉండలేకపోయింది రాధిక. అందుకే తనకు పరిచయం ఉన్న కొందరు డాక్టర్ల ద్వారా ఆ ముంబై హాస్పిటలూ, ఆ సర్జను గురించి మరింత వాకబు చేసి అటువంటి సర్జరీ చేసేందుకు వారు తగినంత సామర్థ్యం కలిగినవారేనని తెలుసుకుని చైతన్యకు చెప్పేసరికి అతనికీ కాస్త ధైర్యం వచ్చింది. అతనూ ముంబై వచ్చి సర్జరీ జరిగేంతవరకూ ఉంటానంటే నీలిమ తిరస్కరించిందని బాధపడుతూ ఉంటూ ఫోనులోనే సముదాయిస్తున్న విషయం చెప్పింది రాధిక.

"యూ ఇండియన్స్ ఆర్ టూ కాంప్లికేటెడ్. వై కాంట్ హి జస్ట్ కంప్లైంటు టు కాప్స్ అండ్ గెట్ హిజ్ చైల్డ్ బ్యాక్?" అంతా విన్న జెన్నిఫర్ ధాటిగా ప్రశ్నించింది.

"ఇట్ డజంట్ వర్క్ దట్ వే. ఇట్ టేక్స్ లాట్ ఆఫ్ టైం ఇఫ్ కోర్ట్స్ అండ్ లీగల్ ప్రొసీడ్యర్స్ ఇంటర్వీన్. అండ్ దిసీజ్ నాట్ ద టైం ఫర్ ఆల్ దట్ వేర్ వీవాస్ లైఫ్ ఈజ్ ఎట్ స్టేక్" వ్యకిగత పంతాల కంటే ప్రాణం ముఖ్యం అని రాధిక గుర్తుచేసింది.

"హ్మ్.. రైట్ యూ ఇండియన్స్ ఆర్ సెన్సిబుల్ ఇన్ సచ్ మేటర్స్" వెంటనే భారత కుటుంబ వ్యవస్థలో తల్లితండ్రులూ పిల్లల మధ్య చాలాకాలం ఉండే బంధాలను గుర్తుచేసుకుంటూ అంది జెన్నిఫర్.

"అయామ్ సారీ. యూ ఆఫర్డ్ టు అసిస్ట్ దిస్ సర్జరీ, బట్..." అదేపనిగా ఈ సర్జరీ కోసం తన టూరును కొన్ని రోజులు పొడిగించుకున్న జెన్నిఫర్ మంచితనం వృథాప్రయాస అయిందే అని బాధవేసింది రాధికకు. *ప్రయత్నం చేసి ఓడిపోవడంకంటే ప్రయత్నం చేసే అవకాశమే రాకపోవడం నిరుత్సాహకరం.*

"కమాన్.. ఇట్స్ ఓకే.. అయామ్ ఎనీవే హేవింగ్ గుడ్ టైం హియర్. హే ఐ నీడ్ టు టెల్ యూ ఎ థింగ్.." జెన్నిఫర్ గొంతులో ధ్వనించిన ఉత్సాహాన్ని గుర్తించి కంగారుపడింది రాధిక. ఈసారి కేరళలో మళ్ళీ ఇంకో మగవాడితో మోసపోబోతోందేమో అని అనుమానం వేసింది. సకల దుర్వ్యసనాలకంటే ప్రేమదాహం తీవ్రమైన బలహీనత.

"ఐ గాట్ ఎకాల్ ఫ్రమ్ స్కాట్లాండ్ వి బోత్ వన్స్ థాట్ ఆఫ్ డూయింగ్ సమ్ డీప్ లెవెల్ రిసెర్చ్ అబౌట్ మెడ్యుల్లరీ" ఒకప్పుడు తానూ, జెన్నిఫర్ కలిసి చిన్నపిల్లల్లో అరుదుగా సంభవించినా ఇంతవరకూ సరి అయిన చికిత్సలేని మెదడులోపలిభాగాలకు వచ్చే క్యాన్సరు తొలిగించేందుకు కొత్తరకం సర్జరీ ప్రక్రియలనునేర్చుకుందాం అనుకున్నారు. చాలా కొద్దిమంది సర్జన్లకే లభించే ఆ ట్రైనింగ్ ప్రోగ్రాములో వీరిద్దరికీ అవకాశం వచ్చినా, ఆరునెలల ట్రైనింగ్ తర్వాత స్కాట్లాండులోని ఇన్‌స్టిట్యూటులోనే రెండేళ్ళపాటు పనిచెయ్యాలని రూలు ఉండడంతో స్వదేశానికి తిరిగి వచ్చేసే ఉద్దేశ్యంలో ఉన్నందుకు రాధిక, పెళ్ళిచేసుకునే ఆలోచన చేస్తున్నందుకు జెన్నిఫర్ ఆ

అవకాశాన్ని అందుకోలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ ఆ ప్రోగ్రాములో చేరి స్కాట్లాండుకే వెళ్ళిపోతున్నానని చెప్పింది జెన్నిఫర్. ఇష్టపడిన పని పొందడం సాధారణంగా అయితే సంతోషమే కానీ, జీవితంలో విరక్తితో ఏదో పారిపోతున్నట్లుగా అలా పని కల్పించుకోవడం రాధికకు నచ్చలేదు.

"అఫ్‌కోర్స్.. అయామ్ టేకింగ్ దిస్ ఆపర్ట్యునిటీ టు ఎస్కేప్ ఫ్రమ్ ఆల్ మై బ్యాడ్ మెమరీస్. బట్ ఐ డోంట్ హేవ్ ఎ బెటర్ ఆప్షన్. డూ ఐ...?" జెన్నిఫర్ ప్రశ్నకు రాధిక దగ్గర సమాధానం కరువైంది.

"రాధీ.. ఐ థింక్ ఐ విల్ లీవ్ ఇండియా ఫ్రమ్ హియర్ ఇట్సెల్ఫ్. ఇఫ్ యూ ప్రామిస్ నాటు టు గెట్ ఆంగ్రీ ఎట్ మీ, ఐ వుడ్ లైక్ టు టెల్ యూ సంథింగ్"

"డూ ఐ ఎవర్ గెట్ ఆంగ్రీ? దట్ టూ ఎట్ యూ? టెల్ మీ"

"యూ షుడ్ రియల్లీ నాట్ గెట్ యాంగ్రీ"

"స్టాప్ ఫస్సింగ్ అండ్ టెల్ మీ"

"ప్రామిస్ మీ"

"ప్రామిస్"

"ఐ లవ్ యూ"

"వాట్?"

"యూ హర్డ్ మీ... ఐ సెడ్ ఐ లవ్ యూ డియర్"

ఎలా ప్రతిస్పందించాలో తెలియలేదు రాధికకు. హనీ, లవ్, డియర్, డార్లింగ్, షుగర్... ఇలాంటి తియ్యటిమాటలన్నీ అమెరికాలో ముఖప్రీతికోసమూ, మర్యాదకోసమూ అనేయడం కూడా సాధారణమే అయినా తాను ఎప్పుడు అలాంటి పదాలు వాడలేదు, తనను ఎవ్వరూ అలా సంబోధించలేదు. ***కొన్ని పువ్వులను మొదటిసారి వాసన చూసినప్పుడు ఇదీ అని చెప్పలేని ఒక వింత అనుభూతి కలుగుతుంది. ఇష్టమో అయిష్టమో తెలుసుకోవాలంటే మళ్ళీ వాసన చూడాల్సిందే***

"ఐ డోంట్ అండర్ స్టాండ్" వివరించమని అడిగి చెవులు రిక్కించింది రాధిక.

***ఒక పసిపాప మొదటిసారి సముద్రానికి వెళ్ళినప్పుడు చేతికి శంఖం చిప్ప దొరికితే ఆతంగా చెవినాన్చుతుంది. ప్రకృతిలో ఎప్పుడూ చుట్టూ ఉండే గాలే అయినా ఆ శంకంలోంచి సుడులు చుట్టుకుంటూ వస్తే ఒళ్ళంతా ఝల్లుమటుంది. ఊహించని రకం ప్రేమను గురించి తెలుసుకున్నట్లు.***

"ఓకే.. ఇట్స్ టఫ్ టు మేక్ యూ అండర్ స్టాండ్ లైక్ దిస్. చెక్ యువర్ మెయిల్. బై" నదిలా మెత్తగా నవ్వుతూ ఫోన్ పెట్టేసింది జెన్నిఫర్.

మాట ఏ భాషలో ఉన్నా ఆలోచన మాత్రం మాతృభాషలోనే సాగుతుంది. జెన్నిఫర్ మాటలు రాధిక ఆలోచనల్లో ఊగిసలాడుతున్నాయ్:

"నాకు అసలు ప్రేమ అంటే తెలుసా అని అనుమానం వచ్చేది ఒక్కోసారి. మా దేశంలో చాలా చిన్న వయస్సులోనే ఆడామగా మధ్య చనువు ఏర్పడేందుకు సంఘం, సమయం అనుకూలిస్తుంది. పదమూడేళ్ళకే నాకు సెక్స్ అంటే తెలుసు. పధ్నాలుగేళ్ళకే అనుభవించాను. అప్పటికి ప్రేమ అంటే ఏమిటో స్పష్టంగా తెలియకపోయినా మరొకరి స్పర్శలో కేవలం ఒంట్లోని అవయవమే కాకుండా మనసుకూడా స్పందించాలని అర్థం అయింది. మీ దేశంలోలా, మాకు అమ్మా నాన్నల బంధం అంత పటిష్టం కాదు. నేను చూస్తుండగానే మా అమ్మ

ప్రేమించానని చెప్పుకున్న మగవాళ్ళు ముగ్గురు. అదేదీ నాకు కూడా తప్పుగా అనిపించలేదు. మా నాన్నయితే మాకు ఒక సినిమా తారలా పరిచయం అంతే. అప్పుడప్పుడు చూస్తాం. మాటమాటకూ ఐ లవ్‌యూ అని చెప్పుకోవడం ఒక పడికట్టు పదప్రయోగమే తప్ప ఇంకేమీ కాకపోయింది. నాకు ఎందుకు ఈ పిచ్చి పట్టిందో కానీ, నా నుంచి ఏ ప్రతిఫలం ఆశించకుండా నన్ను చాలా ఇష్టపడే మనిషి ఎవరైనా ఉంటారా అనిపించింది. అసలు నాకే కాదు ఎవరికైనా ఇంకొకరు అలా ఉంటారా అనిపించింది. ఎప్పుడూ ఎక్కడా ఎవ్వరూ అటువంటివారు కనిపించలేదు. మగవాళ్ళందరికీ మొదట నచ్చేది నా శరీరం. చూట్టానికి బావున్న దాన్ని తాకాలని కోరిక. తాకినదాన్ని ఇంకా రకరకాలుగా అనుభవించాలనే తపన. ఆ కోరికకు ప్రేమ అనే పేరు ముసుగు. ఇంకొంతమందికి నా తెలివి నచ్చుతుందంటారు. ఆ తెలివితో నేను మాట్లాడే మాటలూ, నే చేసే చేష్టలూ వారిలో ప్రేమను రగులుస్తాయి. అవన్నిటినీ తీర్చుకోవడం మళ్ళీ శరీరంతోనే. ప్రేమకోసం శరీరాన్ని ఎంత వెచ్చించినా శారీరకమైన తృప్తి కలుగుతుంది కానీ మనసులో ఎప్పుడూ ఏదో ఒక వెలితి. అలాంటి అసంపూర్ణమైన నేను నాకే నచ్చలేదు. ఇక నన్ను ప్రేమించాను అని చెప్పుకున్న వారికేం నచ్చుతాను. బహుశా వాళ్ళు అందరూ నన్ను వదిలేసి వెళ్ళిపోవడానికి కారణం పరిచయం అయినప్పటిలా నేను లేకపోవడమూ, ఉండలేకపోవడమూ అనుకుంటాను. అలాంటప్పుడే నువ్వు పరిచయం అయ్యావు. పరిచయస్తులూ, స్నేహితులూ, ప్రేమికులూ అందరూ కూడా సమయ విభజన చేసుకుని బంధాలు నడుపుకుంటున్న రోజుల్లో నీ వ్యక్తిగత సమయాన్ని వదులుకుని మరీ నన్ను ఆదుకున్నావు. ఆత్మహత్యాప్రయత్నం చేసిన రోజున నీలా నన్ను తిట్టినవారు జీవితంలో ఎవ్వరూ లేరు. మా అమ్మ కూడా నన్ను అలా తిట్టలేదు. సమయానికి మందులు, ఆహారం సమకూర్చడం అనేది కేవలం హాస్పిటల్‌లో నర్సుల్లా డ్యూటీలు చేసేవారే అనుకునే నాకు ప్రతిచర్యంలోనూ ప్రేమ చూపించొచ్చని నీ ఆతిథ్యంలో తెలిసింది. నువ్వు ఎవ్వరూ ఏమిటీ అని ఆలోచించకుండా అప్పుడే నేను నిన్ను ప్రేమించేసాను. ఆ ఆలోచన కలిగినప్పటినుంచీ నాలోనే ఎన్నో ప్రశ్నలు. శారీరకంగా ఒక మగవాడిని కోరుకునే నేను మానసికంగా నిన్ను కోరుకోవడం ఏమిటని? ఎందుకు పుట్టిందో మరి మెల్లగా నీ శరీరం అంటే కూడా ఇష్టం పుట్టింది. నువ్వు నవ్వుతూ ఉంటే చూస్తూ ఉండిపోవాలి అనిపించేది. నీకళ్ళు చాలా అందంగా ఉన్నాయి అనిపించేది. నీ పెర్‌ఫ్యూమ్ సువాసనే అన్నిటిలోకీ ఉత్తమం అనిపించేది. నువ్వు కట్టుకునే చీరే నేనూ కట్టుకోవాలి అనిపించేది. అంతవరకే కానీ, సాధారణంగా కనిపించినంత అందాల్ని వెతికి అన్వేషించి అనుభవించాలి అనే సెక్స్‌పరమైన వాంఛలేమీ కలగలేదు. నువ్వు ఏదో అంటావని కాదు, నిజంగా అంతకుమించి నాకేమీ అనిపించలేదు. కానీ ఎప్పుడూ నీతో ఉండాలి అనిమాత్రం అనిపించేది. జీవితం నీతో పంచుకోవాలి అనిపించేది. ఒక వయసు తర్వాత మనిషికి శరీరం మీద కోరిక, వ్యామోహం ఉండవని నువ్వయినా ఒప్పుకుంటావు కదా. చిన్నపిల్లలూ, వృద్ధులూ ఉంటారుగా ఎంతో ఆత్మీయంగా. ప్రతిక్షణాన్నీ పంచుకుంటూ బ్రతుకుతూ మనం బయాలజీలో చదువుకున్న ప్రథమ జీవరాసులయిన అమీబా యూగ్లీనాలా ఎసెక్సువల్ జీవితం చాలు అనిపించింది. తోడుగా నువ్వుంటే కానీ ఎలా కుదురుతుంది? నువ్వేమో ఒక భారతీయ మహిళవు. అందునా పెళ్ళయినదానివి. ఈ మాట అంటే నువ్వు నన్ను ఎక్కడ అసహ్యించుకుంటావో అని భయపడ్డాను. ఇలాంటి కుదరని ప్రేమనుంచి నన్ను నేను దూరం చేసుకోవడానికి నచ్చకపోయినా, దొరుకుతుందనే ఆశలేకపోయినా వేరే మగవాళ్ళలో ప్రేమకోసం అన్వేషించాను. ఏమైనా శారీరికంగా సుఖపడ్డాను, మానసికంగా సంతోషించాను కానీ నిర్మలమైన ఆనందం మాత్రం కలుగలేదు. నీతో ఉంటే ఒక రకమైన ఆధ్యాత్మక అనుభూతి. అది ఇంకో మనిషితోనో శరీరంతోనో రాదు అనిపిస్తోంది. ఎందుకో ఈమాట నీతో చెప్పాలి అనిపిస్తోంది. దయచేసి నన్ను ఏవగించుకోకు. నువ్వు అనుకునేటట్లు ఏ రకమైన విపరీత ప్రవర్తనా లేదు నాలో. అయామ్ నాట్ ఎ లెస్బియన్ నార్ బై సెక్సువల్. స్వచ్ఛమైన ప్రేమలో జాతి, వయసు అంతరాలు ఎలా ఉండవో, అలాగే లింగబేధం కూడా ఉండకపోవచ్చని నమ్మాలి నువ్వు. నీనుంచి నేను కొత్తగా ఏమీ ఆశించట్లేదు. నువ్వంటే నాకు ఎంత ప్రేమో నీకు తెలియాలి అని చెబుతున్నాను అంతే. ఐ లవ్ యూ అన్‌కండీషన్లీ... యూ ఆర్ ఎ మ్యాన్ ఆర్ ఉమన్ ఐ డోంట్ మైండ్ ఐ సీ యూ అబోవ్ ఆల్ దట్ రేస్, జెండర్, ఏజ్ డెఫినిషన్స్... యువర్స్ జెన్నీ.

ఈమెయిల్ సారాంశం అంతా గుర్తుచేసుకున్నాక తన కళ్ళలో తడి తడుముకుని ఆశ్చర్యపడింది రాధిక.

"రాధీ... తను ఎంత పని చేసిందో తెలుసా?"

అతని గొంతులో ఆవేశం ఆయాసపడుతోంది.

"ఎవరూ .. ఏమిటీ?" రాధిక గుండె వేగం హెచ్చింది. ఎవరూ అనే తన ప్రశ్నకు జవాబు నీలిమేనేమో అని తన అనుమానం. రాజుకోసం ఎదురుచూస్తూ తల్లితండ్రులతో పిచ్చాపాటీ మాట్లాడుతూ సమయం గడుపుతున్న రాధిక చైతన్య ఫోను రాగానే వారిచెంతనుంచి విడివడి బాల్కనీలోకి నడిచింది.

"తనే.. వీవాను మళ్ళీ వదిలేసింది" భగ్గుమంది అతని మాట

"వాట్?"

"బ్లడీ బిచ్.. నాకొద్దు వీడు అని నాకు మెసేజ్ పంపి, ఒక్కడినే వాడిని హైదరాబాద్ ఫ్లైట్ ఎక్కించేసింది"

ఒక మగవాడు ఆడదాన్ని తిట్టకూడని మాట తన ఎదురుగా అతనే అంటున్నా రాధికకు కోపం రాలేదు. ***ఆడతనాన్నే అవమానించే తప్పిదాలు చేస్తే సాటి ఆడది కూడా ఆడతనాన్ని గౌరవించదు.***

"అదేమిటీ?" తనమీది గెలుపుకోసమో, చైతన్యనుంచి వివేకానందను దూరం చేయడానికీ ఎలాంటి పని అయినా చేయగల నీలిమ ఇలా ఎందుకు చేసిందో అర్థంకాలేదు రాధికకు.

"అదే పనిగా వెళ్ళిందిగా అతనెవరో జర్మనీ డాక్టరు అని, అతను చాలా ఖచ్చితంగా చెప్పాడట, సర్జరీ అయితే చేస్తాను కానీ ఆ తర్వాత బహుశా బుద్ధి మాంద్యం రాకుండా కాపాడలేను అని నానుంచి తీసుకువెళ్ళి సర్జరీ చేయించి అలా జరిగితే తప్పు తనదౌతుందని భయపడింది" ఎక్కడికో హడావుడిగా నడుస్తున్నాడేమో, అతడి ఊపిరి వేగంగా ఉంది.

"మరి వీవాను ఒక్కడినే పంపెయడం ఏమిటీ? తనేమైంది?" నీలిమ ప్రవర్తనను అర్థం చేసుకో చూసినప్పుడల్లా తనకు తలనొప్పి వస్తోందని గ్రహించింది రాధిక. బాల్కనీలో అంతకుముందే కురిసిన వాన జల్లులకు మొక్కల కుండీలలోంచి మట్టివాసన మూలుగుతోంది. శ్వాసలో ప్రకృతిని పీల్చుకుంది రాధిక.

"చెప్పాను కదా తనకు వాడంటే ఇష్టమూ లేదు, ప్రేమా లేదు. కేవలం నామీద కక్షతీర్చుకునేందుకు తన చేతికి దొరికిన ఆటవస్తువు వాడు. ఇప్పుడు వాడి లైఫ్ రిస్క్‌లో ఉందని తెలిసేసరికి మళ్ళీ తనకు వాడు అక్కర్లేదుట. వాడిని చూస్తుంటే శవాన్ని చూసినట్లు అనిపిస్తోందట"

"స్టూపిడ్ చే ఏంటా మాటలు" మనుష్యులు అంత కఠినంగా మాట్లాడగలరని రాధిక ఎరుగదు.

"థర్డ్ పర్సన్‌గా వినడానికే నీకు అలా ఉందే, మరి డైరెక్టుగా తన నోటివెంట విన్న నాకు ఎంత కోపం రావాలి? బ్లడీ ఉమన్. ఐ విల్ కిల్ హర్. జస్ట్.. నాకేమైనా అయితే వీవాను ఎవరు చూసుకుంటారు అనే ఆలోచన ఆపుతోంది" విచక్షణ కోల్పోని ఆవేశమే అతనిలో ఆమెకు మొదటినుంచీ నచ్చిన గుణం. మనిషి తనను తాను అదుపు చేసుకుంటే ప్రపంచానికి అంతకుమించి వేరే మేలు ఏదీ ఉండదు.

"ఓకే ఓకే.. నువ్వు టెన్షన్ అవకు. ఇప్పుడేమయిందీ? వీవా మళ్ళీ మన దగ్గరకే కదా వస్తున్నాడు. అనుకున్నట్లుగానే సర్జరీ చేస్తాను" కోల్పోయిన బాధ్యత మళ్ళీ భుజాల మీదకు పెరుగుతున్నట్లు అనిపించింది రాధికకు. ఇప్పుడు జెన్నిఫర్ కూడా లేదే! ఆమె మెదడు వేగంగా పనిచేయడం మొదలెట్టింది. అయినా జర్మనీనుంచి వచ్చిన ఆ స్పెషలిస్టు అలా అనడం ఏమిటీ? బుద్ధిమాంద్యం అనే కాంప్లికేషన్ అందరు పేషెంట్లలోనూ రాదు కదా. లీగల్ నోటీసులకూ, కోర్టుకేసులకూ భయపడి వైద్యం చేసేప్పుడూ, చేసాక

తలెత్తబోయే ప్రతి కాంప్లికేషన్ గురించీ వివరంగా చెప్పి, వాటన్నిటికీ సిద్ధమని పేషెంటు తాలూకు బంధువుల దగ్గరనుంచి సంతకాలు తీసుకునే విధానంలో ఖచ్చితమైన పద్ధతి పాటించే విదేశీ డాక్టరు చెప్పిన సాధారణ జాగ్రత్తలు విని నీలిమ అతిగా ఊహించుకుని భయపడిపోయి ఉంటుంది అనిపించింది రాధికకు.

''ఇంతకూ తను ఎక్కడ ఉంది ఇప్పుడు?'' మళ్ళీ నీలిమ ఎదురయే ప్రసక్తి లేకపోతే బావుండునని అప్రయత్నంగానే కోరుకుంటూ అడిగింది.

''ఏమో .. ఎక్కడ చస్తుందో నాకెందుకు. ముంబైలోనే ఉందో, లేక వచ్చిన చోటికే వెళుతుందో లేక మళ్ళీ ఇక్కడికే వచ్చి వీడి ఆపరేషన్ అయ్యేవరకూ ఎక్కడైనా చాటుగా ఉండి, బాగయ్యాక మళ్ళీ తీసుకెళ్ళే ప్లాను వేసినా ఆశ్చరం లేదు'' ఆమెను బాగా అర్థం చేసుకున్నట్లు చెబుతున్న అతడిపట్ల సానుభూతి కలిగింది ఆమెకు. బహుశా నీలిమ గురించి తనకు తెలిసిన విషయాలన్నీ అతడికి తెలిసి ఉండకపోవచ్చు. ఆమె తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాలన్నిటినీ పంచుకునే ఉంటే చైతన్యకు మించిన స్నేహితుడు నీలిమకు మరొకరు ఉండేవారు కాదు కదా అనిపించింది రాధికకు. మనుష్యులలో నమ్మకం కోల్పోయాక తమ బాధలన్నీ ఏ సైకియాట్రిస్టుకో చెప్పుకునేటప్పుడు అనిపించదేమో, ఆ వైద్యుడూ ఒకమనిషేనని, అదే నమ్మకాన్ని తన స్నేహితులలోనూ వెదకవచ్చని.

''బెంగుళూరు ఫ్లైట్ ఇంకో గంటలో వచ్చేస్తుంది. పాపం వాడు ఒంటరిగా ఎంత కంగారుపడుతున్నాడో. ఫ్లైట్ అటెండెంట్‌కు చెప్పిందంట, వాడికి జబ్బు ఉందీ జాగ్రత్తగా చూసుకోమని, పైగా ఏదయినా ప్రాబ్లం వస్తే కాంటాక్ట్ చేయమని నా నెంబరు కూడా ఇచ్చిందని, పెద్ద కేర్ తీసుకునట్లు సిగ్గులేకుండా చెప్పింది. నేనేమో ట్రాఫిక్‌లో ఉన్నాను. కారు రిపేరు. ఆటోపట్టుకుని వెళ్ళేసరికి.. ఆటో..'' అతడి పరుగు ఎందుకో అర్థమయింది రాధికకు.

''నువ్వు కంగారు పడకు, మా ఇంటినుంచి ఎయిర్ పోర్ట్ దగ్గరేగా, నేను వెళతాను'' వెంటనే కారుతాళాల వేపు నడిచింది. ''అదేమిటమ్మాయ్ భోజనానికి కూర్చోబోతూ..'' నారాయణమూర్తి ఎదురొచ్చాడు. ''గంటలో వచ్చేస్తాను నాన్నా. ఏదో ఎమర్జెన్సీ కేసు'' తడుముకోకుండా అబద్ధం చెప్పేసి వడివడిగా చెప్పులేసుకుంది.

''నీకేం ప్రాబ్లం కాదుకదా. లేదు వేరే ఫ్రెండ్స్ ఎవరికైనా చెబుదామా అనుకుంటున్నాను, కానీ వాడికి వాళ్ళెవ్వరూ తెలియదు. స్ట్రేంజర్స్ దగ్గరకు వెళతాడేమో అని బయం'' అతడి మాటలు గాలికి కొట్టుకుపోతున్నాయి. అతనెక్కిన ఆటో వేగం అనుభవం అయింది ఆమెకు.

''అబ్బా.. ఏంటిది ఫార్మాలిటీనా? నేను చూసుకుంటాను బై'' లిఫ్ట్ దిగుతూనే పార్కింగ్‌లో ఉన్న కారువైపు వెళ్ళింది. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా కారు నడవడం వస్తే కాలమే చేతుల్లో ఉన్నంత ధీమా. యాక్సిలరేటర్ తొక్కుతూ దూసుకుపోతుంటే రోడ్డుమీద పరుగులు తీస్తున్న ఒక్కో వాహనంలోని మనిషిలోనూ ఎంతటి ఆలోచనా వేదనా ఉంటాయో కదా అనిపించింది. ఇళ్ళగోడలు, కార్లు.. అన్నీ మనసుల చుట్టూ కోటలు.

విమానాశ్రయం చేరుకునేసరికి ముంబై నుంచి ఫ్లైట్ ఇంకా ల్యాండ్ అవలేదనేసరికి కాస్త మనసు కుదుటపడింది ఆమెకు. ఏమీ తోచక లాంజ్‌లో కూర్చుంది. ప్రయాణాలు ఎంత ఇష్టమో వీడ్కోళ్ళు అంత బాధాకరం ఆమెకు. ***మరుసటి నిముషం ఏం జరుగుతుందో తెలియకపోయినా సుదూర ప్రాంతాలకు వెళుతూ మళ్ళీ కలుద్దాం అనుకోవడం మనిషి మూర్ఖత్వమో! విశ్వాసమో!?*** మరి వివేకానంద ఈసారి రాగానే వెంటనే హాస్పిటల్‌లో అడ్మిట్ చేసెయ్యాలి. వీలైతే జెన్నిఫర్‌కు సర్జరీలో అసిస్ట్ చెయ్యడం కుదురుతుందేమో అడగాలి. మళ్ళీ జెన్నిఫర్‌కి ఎదురుపడాలంటే ఆమెకు ఇబ్బందిగా అనిపించింది. ప్రాణస్నేహితురాలు అయినా అంత నిజం చెప్పాల్సింది కాదు. మనసులోపలి భావాలన్నీ వెలిబుచ్చేసుకుంటూపోతే ఇక ముఖాలు చూసుకోవడం ఎలా? అరచేతుల్లో సన్నగా వణుకు మొదలైంది ఆమెకు. ఎదురుగా ఇద్దరు విదేశీమహిళలు చేతుల్లో చేతులేసుకుని వెళుతున్నారు. ఛ, అసలు ఏమనుకుంది జెన్నిఫర్ తనను గురించి. ఆమె

మాటలు విన్నప్పుడు అంతగా ఆలోచించలేదు కానీ ఇప్పుడు ఆలోచిస్తే కాస్తంత జుగుప్సగా అనిపిస్తోంది. తనను అలా ఎలా ఊహించుకుంది ఆమె. ఎంత మానసికమే అయినా ప్రేమలో కాస్తంత శారీరక వాంఛ ఉంటుంది కదా. ఆ తృష్ణ తీరనిదే ప్రేమ ఎలా సంపూర్ణం అవుతుంది. ప్రతి సృష్టి జరగనిదే ఇద్దరి కలయికకు అర్థం ఏమీటి? ప్రపంచమంతా స్వలింగ సంపర్కాలూ వాటి హక్కులూ అంటు ఆధునికత పేరిట గొంతు చించుకుంటున్నా, పురాతన సాంప్రదాయాల్లో ఉన్నదేనని చరిత్రకారులు పాతపుస్తకాలూ, శిల్పకళల ఆధారాలూ చూపుతున్నా తనదాకా వచ్చేసరికి కానీ ప్రకృతి వైపరీత్యం అంటే ఏమిటోఎవ్వరికీ అర్థం కాదు" ఐ లవ్ యూ అన్కండీషన్లీ.. యూ ఆర్ అ మ్యాన్ ఆర్ ఉమన్ ఐ డోంట్ మైండ్ ఐ సీయూ అబోవ్ ఆల్ దట్ రేస్, జెండర్, ఏజ్ డెఫినిషన్స్.." జెన్నిఫర్ మాటలు గుర్తొచ్చాయి ఆమెకు. నిజంగా మనిషి మనిషిని అతడి బేసిక్ ఎలిమెంట్స్‌కు / కనీస బాహ్యగుణాలకు అతీతంగా ప్రేమించడం సాధ్యమా?

"హేయ్.. ఏంటీ నన్ను అంత మిస్ అవుతున్నావా?" ఆలోచనల్లోంచి ఉలిక్కిపడి చూసింది రాధిక. నవ్వుతూ ఎదురుగా ఉన్నాడు రాజు.

"అదేంటి ఎప్పుడూ లేనిది ఇలా.. కనీసం ఫోన్ అయినా చెయ్యలేదే నన్ను రిసీవ్ చేసుకోవడానికి వస్తున్నట్లు"

అతడి కళ్ళలోకి సూటిగా చూడలేకపోయింది ఆమె. ముంబై నుంచి వస్తున్న విమానం ఐదునిముషాల్లో ల్యాండ్ అవనున్నట్లు అనౌన్స్‌మెంట్ కనిపిస్తుండగా రాజు ఆమెకేసి నడుస్తున్నాడు..!!

# 12

*మన కారణంగా నవ్వుతున్న ఒక ముఖాన్ని నిరుత్సాహపరచడం అంటే మన అద్దం మీద మనమే మసి పూసుకున్నట్లు.* హఠాత్తుగా విమానాశ్రయంలో ఎదురయిన రాజుకు తాను అతడికోసం రాలేదని ఎలా చెప్పాలో తెలియక ఇబ్బందిపడింది రాధిక. విప్పారిన ముఖంతో ఆమెను సమీస్తూ,

"అబ్బ.. గుర్తుందా నీకు, దాదాపు ఫైవ్ ఇయర్స్ అయ్యింది. నువ్వు ఇలా నాకోసం ఎయిర్ పోర్ట్‌కు రావడం. ఫైవ్ ఇయర్స్ బ్యాక్ నేను డెట్రాయిట్‌కు వెళ్ళినప్పుడు కదా..." రాజు చెబుతుండగానే ఒక ముదురుపచ్చ టీ షర్టులో ఉన్న ఒక అమ్మాయి వారి పక్కకు వచ్చి సందిగ్ధంగా నిలబడింది. ఆమెను అప్పుడే గమనించిన రాజు, హడావుడిగా "షి ఈజ్ మై వైఫ్" అంటూ ఆమెకు రాధికను చూపుతూ, "మిస్ అవంతికా కురియన్, చెప్పాను కదా.. కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఇద్దరం మీటింగ్ నుంచి కలిసే వస్తున్నాం" ఆమెను పరిచయం చేసాడు. అతను నిత్యం చెప్పే ఎన్నెన్నో బిజినెస్ విషయాలు, ఎందరెందరో పేరలో ఈవిడ గురించి ఎప్పుడు ఏం విన్నానో గుర్తుకు రాకపోయినా చిరునవ్వుతో షేక్ హ్యాండ్ అందించింది రాధిక.

"నైస్ మీటింగ్ యూ మేమ్. రాజు ఆల్వేస్ ఫీల్స్ ప్రౌడ్ అబౌట్ యువర్ కెరియర్" తన భార్య చాలా గొప్ప డాక్టర్ అని రాజు ఎన్ని గొప్పలు చెప్పుకుంటాడో ఆమె వివరిస్తుంటే బెంగుళూరు విమానం ల్యాండ్ అవుతోందో మో అని క్రీగంట గమనిస్తూ నవ్వు ముఖంతో ఆమెకు జవాబిచ్చింది రాధిక. తన లగేజ్ తీసుకున్నాక మళ్ళీ కలుద్దామని అవంతికకు వీడ్కోలు ఇచ్చి "అబ్బ.. ఈవిడతో నాలుగు ముక్కలు మాట్లాడితే చాలు తల తినేస్తుంది. అసలు ఎక్జిక్యూటివ్ మీటింగుల్లో ఆమె మాట్లాడుతుంది చూడూ..." అంటూ రాధిక భుజం పై చేయి వేసి కేఫటేరియా వేపు నడిచాడు. కాఫీ తాగేలోగా వీవా వచ్చేస్తే బిక్కుబిక్కుమంటూ ఉండిపోతాడేమోనని రాధికకు కలవరంగా ఉంది.

"ఔనూ.. ఏంటి సర్జరీలేమీ లేవా? నన్ను రిసీవ్ చేసుకోవడానికి ఈ బిజీ ఈవినింగ్ టైంలో ఎందుకు ఇంత కష్టపడి వచ్చావ్? ఒక గంటాగితే వచ్చేసేవాడిని కదా" ఆమెకు కాఫీ అందిస్తూ కుర్చీలో కూర్చున్నాడు రాజు. రాధికకు గుండెలో కలుక్కుమంది. అప్పుడప్పుడూ కోపం తెప్పించినా రాజు ఆమెకు చాలాసార్లు పసివాడిలానే కనిపిస్తాడు. అతని కోసం రాలేదని చెబితే అతడు ఎంత నిరుత్సాహపడుతాడో అని బాధపడింది. అంతలోనే తాను ఎందుకు వచ్చానో తెలిస్తే అతను ఏం అనుకుంటాడో అనే అనుమానం ఆమెను మరింత నొప్పించింది. చుట్టుపక్కల ఎవరో టీనేజ్ అమ్మాయిల అబ్బాయిల గుంపు సందడిగా మాట్లాడుకుంటున్నారు. ఎవరో అబ్బాయి కాఫీ ఒలకబోసాడు. అమ్మాయి "ఫ...యూ" అంటూ అతడిని ఇంగ్లీషు బూతుల్లో తిడుతూ నవ్వుతోంది. అతడు అంతకంటే పచ్చి బూతుల్లోనే ఆమెను సమాధానపరుస్తున్నాడు. ***పొగిడే మాటకయినా తిట్టే సందర్భానికయినా చివరకు సరదా పలకరింపుకు కూడా సెక్స్‌కు సంబంధించిన పోలికలనే ఉదహరించేంత ఎదిగిపోయిన ఆధునిక ప్రపంచంలో చిన్నపాటి స్నేహాన్ని వివరించేందుకు తను కష్టపడటమేమిటి*** అనిపించింది రాధికకు.

"రాజు.. రాజు కాస్త బుర్రపెట్టి ఆలోచించు. అసలు నువ్వెప్పుడొస్తున్నావో కూడా నాకు చెప్పలేదు. మరి నువ్వొచ్చే ఫ్లైట్ నాకెలా తెలుస్తుంది" అతడికి బాధ కలిగించే నిజమే అయినా నవ్వుతూ సరదాగా చెప్పడానికి ఆమె సిద్ధపడిపోయింది.

"ఓ ఔను కదా! మరి ఎవరి కోసం...?" కణత మీద తట్టుకున్నాడు రాజు రాధిక వివేకానంద పేరెత్తగానే అతని ముఖం వివర్ణమయిపోయింది.

"మరీ అలా చేసిందా ఆవిడ" నీలిమ చర్యను విన్న అతనూ ఆశ్చర్యపోయాడు. "హ్మ్మ్.. ఏమోలే, అలా చచ్చిపోతాడు అనే పిల్లాడిని లవింగ్‌గా చూసుకోవడం కష్టమే కదా. ఇంక బాగుచెయ్యలేనంత లాస్‌లో ఉన్న బిజినెస్‌ను ఎంత తొందరగా మూసేద్దామా అని మేమైనా అనుకుంటాం కదా.." కాఫీ సిప్ చేస్తూ ఆమె కేసి చూసి మాటలాపేసాడు రాజు.

***పరాయివాళ్ళు తప్పు మాట మాట్లాడితే కోపం వస్తుంది. అవే మాటలు మనవాళ్ళు అనుకున్న వాళ్ళు మాట్లాడితే విరక్తిపుడుతుంది.*** తనను కోప్పడుతుంది అనుకున్న రాధిక మౌనంగా తలవంచుకునేసరికి రాజుకు ఏమీ పాలు పోలేదు. సారీ చెబుదామా అని ఆలోచించాడు. ***నిజాయితీగల క్షమాపణ మెరుపులా మెరిసి పోతే కంటితుడుపు మాట ముసురులా విసిగిస్తుంది.*** అతడు మాటను సరిదిద్దుకునే ప్రయత్నంలో మరింత నిస్సారమైన మాటలు మాట్లాడుతుంటే బెంగుళూరు నుంచి వచ్చిన విమానంలోంచి ప్రయాణికులు రావడం గమనించి అటు వెళ్ళేందుకు సిద్ధమయ్యింది రాధిక.

"ఒక్క ఫైవ్ మినిట్స్ ఆగు, అదిగో ఫ్లైట్ కూడా వచ్చేసింది వీవాను రిసీవ్ చేసుకున్నాక ఇద్దరం కలిసి వెళ్ళొచ్చు.."

"అదేంటీ? మరి ఆ అబ్బాయిని వాళ్ళ ఫాదర్‌కి అప్పగించాలి కదా. అతనెంత లేటుగా వస్తాడో మరి" రాజు మాటల్లోని ఎత్తిపొడుపు రాధిక గమనించినా గుర్తుపెట్టుకోదలుచలేదు. ***అవతలివారు నోరు జారినా మన మాట అదుపు చేసుకుంటే ఒక పెద్ద గొడవను జయించినట్లే.***

"పోనీ... వీవాను మనతో పాటు తీసుకువెళదాం..చే.." ఆమె పిలుపులోని చనువుకు అతడు కళ్ళు చికిలించాడు. ఆమె పిలుపును సర్దుకుంది, చూపులు మరల్చుకుంది.."చైతన్య ఇంటికి వచ్చి బాబును తీసుకువెళతాడు.." మాట పూర్తిచేసింది.

"వద్దులే..." అతని సమాధానం చప్పున వచ్చింది.... అద్దంలాంటి ఆమె మనసు మీదకు రాయిలా.

"ఐమీన్.. ఇప్పటికే పాపం అతను కంగారు పడుతుంటాడు. మళ్ళీ రూటు మారి మన ఇంటికి రావడం, అక్కడ అంకుల్ ఆంటీ..." నసిగాడు రాజుకు.

పరీక్షల కోసం చదువులు చదివి మార్కులకోసం ఆలోచించేలా మెదడును సానపెట్టి పెరిగిన తరంలోంచే వచ్చిన రాధికకు చప్పున ఒక మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలా అనిపించింది ఈ పరిస్థితి.

ఎ:చైతన్య తమ ఇంటికి రావడం అతనికి ఇష్టంలేదు. బి: చైతన్యకు ఎదురుపడటం అతనికి ఇష్టంలేదు. సి: చైతన్య, వీవాలలో ఎవ్వరినీ కలవడం అతనికి నచ్చదు. డి: అసలు తనునుంచి చైతన్య లేక వీవా ప్రస్తావన రావడం అతడు జీర్ణించుకోలేడు.

***జవాబు చెప్పుకుంటే మనసు చచ్చిపోతుంది, ప్రశ్న వదిలేస్తే జీవితం పోతుంది.***

"రాధీ నేనోటి అడుగుతాను ఏమీ అనుకోవుగా..."

"ఏంటీ వండర్? నువ్వు.. నువ్వు .. ఆఫ్ ఆల్ ది పీపుల్ ఇన్ దిస్ వరల్డ్, ది ఫ్రాంక్, అవుట్ స్పోకన్ మిస్టర్ చైతన్య మాట్లాడటానికి సంశయించడమూ, సందేహపడటమూ, తటపటాయించడమూనా... అయ్యారే! ఏమి ఈ విధి వైపరీత్యం"

"హమ్మో హమ్మో ఏమీటి ఈ నాటకాల భాష? పేషెంటుకెయాల్సిన ఇంజెక్షనేమైనా నువ్వే వేసుకున్నావా?"

"మా ఇంట్లో పాత వీసీయార్ అమ్మేసి సీడీ ప్లేయర్ కొన్నాం. ఫస్ట్ సినిమా.. దానవీరశూర కర్ణ తెచ్చారు మా నాన్న"

"హమ్మా... లంచం డబ్బులేనా?"

"మహాప్రభూ మళ్ళీ మొదలెట్టకు. సినిమా వేస్తే కూడా చూడకూడదా నేను? ఇక ఇంట్లో టికెట్ కొనమంటావా ఏమిటి, లేక నాన్న తెచ్చిన ఆ సీడీ ప్లేయర్ పగలగొట్టాలా? మరీ చెపుతావు.... నువ్వేసుకున్న ప్యాంటు షర్ట్ కూడా ఒక కరప్ట్ ఆఫీసర్ల పొలిటీషియన్లకు, ఎవరో కరప్ట్ ఇండస్ట్రియలిస్ట్ లంచం ఇచ్చి ఫ్యాక్టరీలు పెట్టి మాన్యుఫేక్చర్ చేసిన బట్టలను అమ్మేందుకు మధ్యలో ఎంతో మంది కరప్ట్ ఆఫీసర్లకు లంచాలు ఇచ్చి షాపులు నడుపుకున్న రీటైలర్స్ దగ్గరనుంచి కొన్నావు. అంత కరప్షన్ ఉన్న ఈ బట్టలు విప్పేసి న్యూడ్‌గా తిరుగుతావా ఏమిటి?"

"ఓహ్.. థాంక్యూ ఫర్ ఎన్‌లైటెనింగ్ మీ. యూ ఆర్ గ్రేట్ ఇన్ యువర్ అనాలిసిస్. ఉండు.. వెంటనే ఈ 'కరప్ట్' బట్టలు విప్పేస్తా... "

షర్ట్ బటను విప్పదీస్తూనే "అవునుగానీ మరి నీ చుడీదారూ.." అంటూ ఆమె మెడకింద బట్టల్లోకి దూసుకుపోతున్న శరీరం మీద చూపులు గుచ్చాడు.

"డర్టీ ఫెలో.. షేమ్ లెస్" నిండుగా చున్నీ కప్పేసుకుంటూ అతడి భుజం మీద బలంగా గిచ్చేసి కోప్పడిపోయింది రాధిక.

సిగ్గులేనితనాన్ని కొనసాగిస్తూ చొక్కాలో రెండవ బొత్తాం కూడా తీసేసాడు చైతన్య. అతని ఛాతీమీంచి ఉబుకుతున్న మెత్తటి వెంట్రుకులను పట్టుకుని ఠపీమని లాగింది రాధిక. చైతన్య అరుపుకు బీచ్‌లో అటూ ఇటూ నడుస్తున్న ప్రేమికుల జంటల్లోంచి కొన్ని తలలు వీరివేపు చూసాయి. మోకాళ్ళలో తలదాచేసుకుని "నాకేం తెలీదు" అనేసింది రాధిక. దూరంగా ఒక బండచాటున ఉన్న నీడలో ఇసుకలో గుంట చేసుకుని అందులో కూర్చుని మాగన్నుగా నిద్రపోతున్న ఒక కుక్కపిల్ల ఈ ప్రేమికుల గోలేమిటన్నట్లు చిరాగ్గా మోరపైకెత్తి మళ్ళీ పడుకుంది. ఒక పాలిథిన్ కవరులో మడిచిపెట్టుకున్న తన తెల్లటి ఆప్రానును సరిచూసుకుని దాని మీద పడుతున్న ఇసుక రేణువులను తట్టివేసి డెర్మటాలజీ పుస్తకం మధ్యలో జాగ్రత్తగా పెట్టింది రాధిక. ఆమెనే ఓరకంట గమనిస్తున్నాడు చైతన్య. పరీక్షల కారణంగా వారం రోజులపాటు నిద్ర తక్కువై పుస్తకాలు తప్ప మరేమీ చూడని అతని కళ్ళకు ఆమె మెరిసిపోతున్న ముత్యంలా అనిపించింది. మెల్లగా ఆమె కాలివేలికి తన కాలివేలిని తాకిస్తూ.

"ఏంటీ ప్రపంచంలో ఏమిటేమిటో జరిగిపోతున్నాయి?" అని నిట్టూర్చాడు. చెవులు రిక్కించింది ఆమె.

"మిలెనియమ్ పోయి కొత్త మిలినియమ్ వచ్చేసింది. సెల్‌ఫోన్లు వస్తున్నాయి. ఇంటర్నెట్లో వీడియో ఛాట్ కూడా వస్తోంది. కాల్ సెంటర్లొస్తున్నాయి. ఇంకా ఏమిటేమిటో జరుగుతున్నాయి. మన రిలేషన్‌షిప్ మాత్రం అలానే ఉంది. కాస్త స్పైస్ అప్ చేద్దాం... రాధీ ఒకే ఒక ముద్దు.." అంటూ దగ్గర జరిగాడు అతను.

"హమ్మా.. టాపిక్ ఎక్కడ్నుంచి ఎటు తీసుకొచ్చావ్? నీ అతితెలివి నాదగ్గర కుదరదు. నో.వే"

"టూ మచ్ మన పరిచయం అయిన రెండేళ్ళ యానివర్సరీ సందర్భంగా అయినా"

"ఊహూ.."

"ఏంటి నీ ప్రాబ్లం. పెళ్ళీ గిళ్ళీ అయితే ఇప్పుడే చేసేసుకుంటా, అదిగో ఆ సముద్రం సాచ్చిగా, అస్తమిస్తున్న ఆ సన్ సాచ్చిగా"

"బాబోయ్ క్ష పలకదా నీకు"

"ఖర్మ... ఏదో జోక్ గా అన్నాం"

"హె హె... నాకు నవ్వురాలేదు"

అతని చేతులు ఆమె నడుం దగ్గరకు రాబోయాయి వేళ్ళు తగలకుండానే ఆమె కిసుక్కుమంది. అతను గిలిగింతల బాంబులేసేందుకు వేళ్ళను మరింత ముందుకు జరిపాడు. "కొడతాను చే... అలాంటివన్నీ చెయ్యకు"

ఇసుకలో దాచిన కాళ్ళతో అతడు విడిచిపెట్టిన బూటును అవతలకు విసిరేసింది. మిగిలిన ఇంకో బూటును అతడే విసిరేసుకున్నాడు.

"అబ్బా అల్లరి ఆపు చే" మురిపెంగా విసుక్కుంది రాధిక. ఒక్కోసారి అతడిని చూస్తే తన తమ్ముడు జగన్ బాల్య చేష్టలు గుర్తుకొస్తాయి. ఆడదిగా ఎదిగే ప్రతి బాలికా పోగొట్టుకునే చిన్న నాటి బొమ్మ ఆమె తమ్ముడు. లింగ బేధాలు తెలిసీ తెలియని వయసులోని గిల్లికజ్జాలు భక్తుడూ దేవుడూ దొంగాట ఆడుకున్నట్లు ఉంటాయి. అలా తమ్ముడు గుర్తొస్తున్నాడు అనే మాట ఒకసారి చైతన్యతో చెబితే "ఇదిగో ఇలాంటి సాకు పెట్టి నువ్వు నన్ను తమ్ముడూ అని పిలిస్తే వినేందుకు చాలా బ్యాడ్‌గా ఉంటుంది" అనడం, అసలు అలా ఎందుకు అనిపిస్తుంది అతనికి కూడా తనలో తన కుటుంబసభ్యులు ఎవరైనా గుర్తుకువస్తారా అని అడిగితే "నాకు నువ్వు తల్లి, చెల్లి, పిల్లీ అన్నీనూ" అని హాస్యమాడిన సందర్భం గుర్తుకొచ్చి నవ్వుకుంది రాధిక.

"అదేమిటి.. నేనేమీ చెయ్యకుండానే నవ్వుతున్నావు" విసిరేసుకున్న బూట్లు తెచ్చుకుంటూ విస్తుబోయాడు చైతన్య.

"ఏదో గుర్తుకువచ్చిందిలే"

"ఏదోనా? ఎవరోనా? " కనుబొమలు మెలేసి చూసాడు అతను.

డిసెంబర్ మధ్యాహ్నాల్లో ఆకాశం రంగు చాలా వెచ్చగా అనిపిస్తుంది, రాత్రుల చలి ప్రభావం వల్ల. ఆ ముదురు వెచ్చ ఆకాశం క్రింద వొళ్ళారబెట్టుకుంటున్నట్లు మగతగా పడుకుని ఉన్న సముద్రాన్ని మౌనంగా చూస్తూ ఉండిపోయింది రాధిక.

"ఏమిటీ ఎవర్ని గుర్తుచేస్తుకుంటున్నావ్?" అతడు గోలపెట్టాడు.

నిశ్శబ్దంగా సముద్రం, గోలగా అతను. ఆమెకు ఒళ్ళంతా ఏదోలా అనిపించింది.

"ఆర్యూ ఆల్రైట్? నాకేదో భయమేస్తోందిరా" సరదాగా పిల్లి తల నిమిరినట్లు ఆమె జుత్తు మీద చేయిపోనిచ్చాడు అతను. కళ్ళను విశాలంగా చేసుకుని నవ్వింది ఆమె. వానపడేటప్పటి మట్టి వాసన గుర్తుకు వచ్చింది అతనికి. ఆమె జోక్ చేయడం లేదని అప్పుడు అర్థమయ్యింది అతనికి. మాటలు కరువయ్యినట్లు మౌనంగా ఆమెనే చూస్తుండిపోయాడు. కాలం వారి కాళ్ళక్రింద ఇసుకరేణువులై నిలిచిపోయింది.

"చే.. నువ్వంటే నాకు నమ్మకమూ ప్రేమా లేకపోవడం ఏం లేదురా"

"ఛ ఏం మాటలవి.. ముద్దు ఇవ్వకపోతే మాత్రం అంత మాటంటానా?"

"నన్ను మాట్లాడనీ"

"సరే చెప్పు. నువ్వు మాట్లాడు అని ఆజ్ఞ వేసేంతవరకూ ఇక నేను నోరత్తనంటే" పెదవుల మీద చూపుడు వేలు పెట్టుకుని భాసింపట్టు వేసుకున్నాడు. అతడినలా చూస్తే ప్రేమలో మాటలు తడబడతాయని చూపులు ఆకాశంలోకి ఎగరవేస్తూ.

"ప్రేమ అనేది ఎంత మనసులకు సంబంధించినదే అయినా ఫిజికల్ ఎక్స్‌ప్రెషన్ కోసం కోరిక ఉంటుందని నాకూ తెలుసు. ఒక మాటు చెపితే తప్పుగా అనుకోవుగా, సెక్సువల్ యాక్ట్ గురించి కానీ, సెక్సువల్ బిహేవియరిజమ్స్ గురించి కానీ నీకంటే నాకే ఎక్కువ తెలుసు"

చైతన్య కళ్ళు తేలేసాడు. అతడి తలపై మెట్టుతూ కిలకిలమంది రాధిక" అదేరా బాబూ జువాలజీ నుంచి ఈ రీప్రొడక్షన్ చదువుతూనే ఉన్నాను కదా. ఫోరెన్సిక్ సైన్సెస్‌లో అన్ని రకాల సెక్సువల్ పర్వర్షన్స్ కూడా చదవాలి మరి. ఇక గైనకాలజీ ఎండోక్రైనాలజీ.. ఇలా ఇవన్నీ చదివిన నాకు నీకంటే ఖచ్చితంగా ఎక్కువే తెలుసుంటుంది కదా"

"అబ్జెక్షన్. నేను రొమాన్స్ అంటుంటే నువు సెక్స్ గురించి మాట్లాడి ననేదో పర్వర్ట్‌లా చిత్రీకరించడం ఏం బావోలేదు"

"అరే చుప్ చెప్పేది విను. ఊరికే గోల" బలవంతంగా అతడి చేతిని అతడి నోటిని మీద నొక్కి పెట్టి కొనసాగించింది రాధిక " అవన్నీ ఒకటే. ఫస్ట్ టచ్, తర్వాత కిస్, తర్వాత ఫోర్ ప్లే, ఆ తర్వాత ఇంటర్ కోర్స్..."

"అన్యాయం అన్యాయం. మరీ ఇంత శాస్త్రీయ పదాలు మాట్లాడి మన రిలేషన్ షిప్ ఏదో జంతువుల మేటింగ్ ఎఫైర్‌లా"

"మ్యాన్ ఈజ్ ఎ సోషల్ ఏనిమల్ అని నువ్వేగా చాలాసార్లు ఆవేశంగా అన్నావ్"

"ఆс... అన్నాం అంటే అన్నాం. అది ఎప్పుడో ప్రపంచం గురించో సిద్ధాంతాల గురించో మాట్లాడేప్పుడు. ఇలా రొమాన్స్, తిండిలాంటి పర్సనల్ టేస్టులు ఉన్న విషయాల్లో కూడా అలా జంతువులతో పోల్చుకుంటే నిన్ను బదులు ఏ పిల్లిపిల్లనో ముద్దెట్టుకోవచ్చు " తన మాటను ఊహించుకోవటానికి తనకే సహించినట్లు ముఖం చిట్లించాడు చైతన్య.

"ఆс అదే అదే నా పాయింటు కూడా. పిల్లి పిల్లకూ నాకూ తేడా ఏమిటి? పిల్లి పిల్లను చూస్తే ఊరికే అలా నిమిరితేనో, ఒళ్ళో పెట్టుకుంటేనో చాలు అనిపిస్తుంది. మనుష్యుల్లో పసిపిల్లలను చూస్తే బుగ్గ మీద ముద్దు పెడితే చాలు అనిపిస్తుంది. మరి అమ్మాయిని చూస్తే మాత్రం ముద్దే కాకుండా సెక్సువల్‌గా ఇంకా చాలా చెయ్యాలి అని ఎందుకు అనిపిస్తుంది అని అడుగుతున్నాను"

"వాటే నాన్సెన్స్ క్వొశ్చన్. ఏ స్పీషీస్ ప్రాణి అదే స్పీషీస్ ప్రాణితోనే జతకట్టడమే కదా ప్రకృతి సిద్ధం"

"ఎగ్జాట్లీ సో, మనం కూడా స్పీషీస్ జంతువులం. ప్రేమ పేరిట ఈ ఫిజికల్ ఎక్స్‌ప్రెషస్ అంతా కూడా జస్ట్ మేటింగ్ లాంటిదే"

అతడిని తన మాటే పట్టించినందుకు ఉత్సాహపడిపోయింది రాధిక. *విశ్వ మేధావులను ఒప్పించడంకంటే మొండి మనస్తత్వం ఉన్న స్నేహితుని ఒప్పించడమే గొప్ప గెలుపు.*

"ఇదిగో ఇంతకుమునుపు ఒకసారి ఇదే ఆర్గ్యుమెంట్ వచ్చింది. అప్పుడూ ఇప్పుడూ నాది ఒకటే మాట. నేను నిన్నే ఎందుకు ముద్దు అడుగుతా. మా క్లాసులో నీకంటే సూపర్‌గా ఉండే అమ్మాయిలు ఇంకా బోలెడు మంది ఉన్నారు. వాళ్ళందరికీ మనమంటే చాలా క్రేజ్ కూడా" గొప్పలు పోయాడు చైతన్య.

"కరెక్టే జూలో ఎర్ర చింపాంజీను చూస్తే ఎవరికైనా అరటిపండు ఇచ్చి ఫోటో దిగాలని ఉంటుంది" ఆమె మాట పూర్తికాకముందే అతడు ఆమెను అక్కసుగా గిచ్చే ప్రయత్నం చేయడం ఆమె చేతివేళ్ళు అడ్డుకోవడం జరుగుతున్నాయి.

"ఉండు టాపిక్ డైవర్ట్ చెయకు. ఇంతకీ నా క్వొశ్చన్ ఏంటంటే, జంతువుల్లా మనకూ ఉన్న హార్మోనల్ అర్జ్ వలన పుట్టే కోరికలను, మనుష్యులుగా మనం పెంచుకున్న విజ్ఞానం, నాగరికత, బుద్ధి, వీటన్నిటితో అదుపు చేసుకుంటూ మనసుకు నచ్చిన వారితోనే ఆ కోరికలన్నీ తీర్చుకుందాం అనుకుంటాం కదా"

ఒప్పుకుంటునట్లు తలపంకించాడు చైతన్య...

"ఒకవేళ మనిషికి పాపం తనకు నచ్చే ఇంకో మనిషి దొరకకపోతే ఏం చేసేవాడు? అప్పుడిక మనసుకు స్థానమే లేదు కదా"

"అబ్బా అలా ఎలా కుదురుతుందీ. ఇంత పెద్ద ప్రపంచంలో ఆఫ్టాల్ ఒక్క మనిషికి తనకు నచ్చే ఇంకొక్క మనిషి దొరకకుండా ఎలా జరుగుతుంది?"

"అరే ఎందుకు జరగకూడదూ. ఫేట్ అను, డెస్టినీ అను. ప్రపంచం ఎంత పెద్దది అయినా అందులో ఒక మనిషిగా ఎవరి ప్రపంచం వారికి ఉంటుంది. ఫర్ ఎగ్జాంపుల్ నా ప్రపంచం అంటే ఇల్లూ, కాలేజ్ ఇంతే కదా. అంటే నాకు నచ్చే మనిషి ఈ ప్రపంచంలోనే దొరకాలి. నీతో పరిచయం ఎంత యాక్సిడెంటల్‌గా జరిగిందో చూడు. సపోజ్, ఆ రోజు నువ్వు అసలు నేను ఉన్న క్యాంటిన్‌కే రాలేదు అనుకో, మన ఇద్దరి మధ్య ఆ చిన్నపాటి ఇంట్రడక్షన్ కూడా జరగలేదు అనుకో అప్పుడు ఇదే ప్రేమను వేరేవారితో పంచుకుంటుండే వాళ్ళమా?"

"నో వే.. మా కాలేజ్‌లో నాకు తెలిసిన మిగతా అమ్మాయిలెవ్వరికీ నీ అంత తిక్కలేదు. వాళ్ళెవ్వరూ నాకు నచ్చే ఛాన్సేలేదు"

"ఛే అయామ్ సీరియస్"

"నేనేమైనా జోక్ చేస్తున్నానా? ముద్దు అడిగితే థియరీలు చెప్పేంత అబ్నార్మల్ సైకీ ఉన్న అమ్మాయి నాకు తెలిసి మా గ్రూపులో ఎవ్వరూ లేదు. నువ్వు అలా ఉంటావ్ కాబట్టే నువ్వు నాకు ఇష్టం"

"ఓకే అలాగే అనుకుందాం. నాక్కూడా నీలాంటి ఆవేశపరుడూ, పొగరబోతూ ఇంకెవ్వరూ కనిపించకే నచ్చలేదు"

"పోన్లే నా ఆవేశంవలన నాకు ఈ మాత్రం లాభం వచ్చింది" నిష్టూరంగా అన్నాడు చైతన్య.

అతడి గిల్లికజ్జాలకు ప్రతిస్పందించే ఆసక్తిలేనట్లు, "ఒకవేళ ఇంకో టెన్, పోనీ కనీసం ఫైవ్ ఇయర్స్ అసలు ఇలా మనకు నచ్చినవాళ్ళు దొరకనే లేదు అనుకో. మనమేమీ సన్యాసులము కాము కదా శరీరాన్నీ హార్మోన్స్‌నూ ఈ ఏజ్‌లో అదుపు చేసుకోవడానికి. అప్పుడు మనం కూడా జంతువుల్లాగా కేవలం కోరిక తీర్చుకోవడానికి, ఎవరినో ఒకరిని కాస్తంత నచ్చారు అని మనఃస్సాక్షిని మోసం చేసుకుని వారితోనే ఈ సరదాలు అనుభవించేవారమేమో కదా. తలుచుకుంటేనే భయం వేస్తోంది. మన ప్యూరిటీ, ఛేస్టిటీ కాన్సెప్ట్లు అన్నీ కాలం మనకు అనుకూలంగా ఉన్నప్పుడేనా అనిపిస్తోంది. ఇప్పుడు నువు ఉన్నావ్, నాకు ఈ చనువు నీతో ఉంది. అదే నువ్వనే వాడివే లేకపోతే ఇంకొక మగవాడితో కూడా ఇలానే ఉండేదాన్నేనా?" మోకాళ్ళపై చుబుకాన్ని ఆన్చి ఆమె దీర్ఘంగా సముద్రం ఆకాశం కలిసేచోటికేసి చూసింది. "నేనెక్కడికిపోతాను? ఛస్తే కూడా దెయ్యంలాగా నిన్నే పట్టుకోనూ..."

రాధిక మాట్లాడలేదు. సాయంత్రం అవుతుండడంతో సముద్రంలోని అలలు మెల్లగా బలం పుంజుకుంటున్నాయి. అందులో ఎన్ని అమీబాలు ఉన్నాయో అనిపించింది. ఒక అమీబ రెండయితే మరి మొదటిది ఏమయినట్లు? బయాలజీ క్లాసులోని ప్రవీణ్ గుర్తుకు వచ్చాడు. అప్పుడు అతను చచ్చిపోకుండా ఉంటే, ఈ వేళ ఇదే మెడికల్ కాలేజీలో తనతో కలిసి చదువుకునేవాడు కాడూ?! ఈ రోజు చైతన్య స్థానంలో అతను ఉండేవాడా? మనసు విడిచే కుబుసం ప్రశ్నలు. ఆమె దిగులు ఏమిటో ఎందుకో పూర్తిగా అర్థమవకపోయినా ఏదో కోల్పోవడాన్ని గురించి ఆమె బాధపడుతోందని మాత్రం అర్థంచేసుకున్నాడు చైతన్య. ఇంక మాటలు లాభం లేదన్నట్లు, ఆమెకు దగ్గరగా జరిగి వెనకనుంచి ఆమె భుజాల చుట్టూ చేతులేసి శాలువాలా తనను ఆమెకు కప్పాడు.

"ఛే.."

"ఊ..."

"రేపేంటో మనకు తెలియదు. కానీ నాకొకటి అనిపిస్తోంది."

"ఊ..."

"ఇలా నువ్వు నాతో తప్ప ఇంకెవ్వరితోనూ ఉండలేవు"

"ఏంటి అంత నమ్మకం?"

"అదంతే" తన మెడవంపులో వెచ్చగా తాకుతున్న అతడి చెంపవేపు ముఖం తిప్పి, చెవి మీద చిన్నగా పెదవులతో శబ్దం చేసింది. ***ముద్దు శబ్దం రుచి కన్నా మధురం.*** అతనికి అరికాలినుంచి ఒళ్ళంతా ఏదో హాయి పాకినట్లనిపించింది.

"రాధీ.. నీ దిక్కుమాలిన థియరీ ప్రకారం మనం అసలు కలవలేదు అనుకో, నీతో ఇలా ఇంకెవ్వడు ఉన్నా, వాడికి ఇలా మాత్రం ముద్దు పెట్టకు. ప్రామిస్?"

"చూడు మగబుద్ధి, నేనేమో నిన్ను నమ్ముతున్నాను. నువ్వేమో నన్ను అనుమానిస్తున్నావ్"

"మరే.... ఆఫ్టాల్ మగవాడిని. నా ఆడదాన్ని ఇంకొకడు ప్రేమిస్తే కుళ్ళుకోనూ? తను వాడిని నన్ను ప్రేమిస్తునట్లే ప్రేమిస్తే అస్సలు తట్టుకోలేను"

"పిచ్చోడా" ఆమె అతడి చెవి దగ్గర నిశ్శబ్దంగా నవ్వింది

"నీకు లేదేంటి పిచ్చి మరి" అతడు ఆగకుండా ఆమె చెంపను చుంబించేసాడు.

సముద్రంలో, ఆకాశంలో వారితోపాటు ఇంకా ఎన్నో జీవరాశులు ప్రేమించుకుంటూ ఎవరి లోకంలో అవి వున్నాయి.

"చాలా థాంక్స్ రాధీ. సమయానికి..." వివేకానందను ఒక గాజు బొమ్మలా తన ఒడిలో పదిలంగా ఉంచుకున్న చైతన్య, అతడి తేలికపాటి అరచేతులను తన చేతులతో తడిమిచూసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యాడు.

"ఇదిగో నువ్వలా ప్రతిదానికీ థ్యాంక్సూ సారీలు చెపితే, నేనూ నిన్ను మిస్టర్ కృష్ణచైతన్య అనో చైతన్యగారూ అనో పిలవాల్సివస్తుంది" గేరు మారుస్తూ అంది రాధిక. శంషాబాద్‌లో ఎంతసేపటికీ తగ్గని ఒక దట్టమైన ట్రాఫిక్ జామ్‌లో నిమిషానికి అరమీటరు వేగంతో మందకొడిగా సాగుతోంది వారి కారు ప్రయాణం.

ఆమె మాటలకు నవ్వేస్తూనే, తమ కారు ముందు మిగిలిన కాస్తంత ఖాళీలో అడ్డంగా బైకులను ఇరికిస్తున్న వాహనదారులను చూస్తూ నిట్టూర్చాడు చైతన్య. ఈ దేశాన్నీవ్యవస్థను మార్చడం అసాధ్యం అని తెలిసి ఓడిపోయానని నిర్వీర్యపడిపోయిన చైతన్య చెప్పడం గుర్తుకువచ్చింది రాధికకు. ట్రాఫిక్‌ను ఇంకా జామ్ చేసి ఒకరిమీద ఒకరు అరుచుకుంటున్న వారిని చూడలేక కళ్ళు తిప్పేసుకుంది.

***అస్తవ్యస్తంగా సాగిపోతున్న వ్యవస్థలో సర్దుకుపోయే నెపంతో తామూ అస్తవ్యస్తంగా మారిపోయే మనుష్యులున్నంత కాలం మన దేశానికి పతనమే మోక్షం.*** చైతన్య, తానూ చేయలేనిదేమైనా సాధిస్తాడేమోనని వివేకానంద వేపు చూసింది రాధిక. అతను రోడ్డువారగా నిలువెత్తున ఉన్న సినిమా కటౌట్లను, మొబైల్ ఫోన్లు అడ్వర్టైజ్ మెంట్లనూ ఉత్సాహంగా చూస్తున్నాడు. వీడు పెద్దయాక ఏమవుతాడో మరి? చైతన్య కోల్పోయిన దేశభక్తీ, ఐడియలిజమూ పుణికిపుచ్చుకుంటాడో లేక తండ్రిలా సమాజంలో సర్దుకుపోవడం కోసం వీడూ అందరిలానే తయారవుతాడా? రెండవ ఆలోచనకు రాధిక మనసుకు వికారంగా అనిపించింది. ***మన పిల్లలు గొప్పవాళ్ళుకారేమో అనే ఆరాటం, తమలానే చేతకానివాళ్ళలా మిగిలిపోతారేమో అనే అనుమానం పిల్లలు లేకపోవడం కంటే భయంకరం. ప్రతి తరమూ తమ క్రితం తరం ఏమీ చేయలేకపోయిందని నొచ్చుకుంటూ తమను ఏమీ చేయనివ్వకపోయిందని పితూరీలు చెప్పుకుంటూ తమ తర్వాతి తరం ఏదో చేస్తుందని ఆశగా చూస్తూ చివరకు ఆ తరమూ ఏమీ చేయలేదని గ్రహించేసి చెడిపోతున్న తరాల్లో తామూ ఒకటై నశించిపోవడమే భారతీయుల అస్థిత్వం.***

"రేపు తనను అడ్మిట్ చేసేస్తాను, ఎప్పుడు పెట్టుకుందాం సర్జరీ?" ఆశయాలనూ ఆదర్శాలనూ ఆశగా ఎక్కుతున్న ఆమె ఆలోచనలను భగ్నం చేస్తూ ఈతిబాధలను గుర్తుకుతెచ్చాడు చైతన్య.

''ఐదురోజులు, తప్పితే వారం. నాతో అసిస్ట్ చెయడానికి ఒహాయోలో నాతో పన్జేసిన ఒక డాక్టరును అనుకున్నాను. కానీ ఇదిగో ఈ ముంబై ట్విస్ట్ వల్ల తను ఇప్పుడు రిటర్న్ వెళ్ళిపోయింది'' వివేకానందని కలిసిన వెంటనే జెన్నిఫర్‌కు మెసేజ్ ఇస్తే ఆమె ఇక ప్లాను మార్చుకోలేనని అశక్తత వ్యక్తం చేయడాన్ని గుర్తుచేసుకుంది రాధిక.

''ఒహ్ అయామ్ సారీ'' కళ్ళునొక్కుకున్నాడు చైతన్య.

''కమాన్, ఇందులో నీ తప్పేం ఉంది'' ట్రాఫిక్ కాస్త తెరిపిన పడుతుండడంతో మెల్లగా కారు వేగం పెంచింది రాధిక. మగత కమ్ముతున్నట్లు వివేకానంద మెల్లగా కళ్ళు మూసుకున్నాడు. అతడికి జో కొడుతూ చైతన్య:

''అంతా నా ఇనెఫిషియన్సీనే. తనను నమ్మి కదా ఇంట్లో వీడిని తనతో వదిలిపెట్టాను. ఆఫీస్‌కు వెళ్ళి వచ్చేలోగా ఇలా తీసుకెళ్ళిపోతుందని కోలేదు. బ్లడీ బి...''

''ప్లీజ్ చే'' అతడి తిట్టును మధ్యలోనే కొట్టేసింది రాధిక. *చెడ్డవారిని తిట్టడానికయినా మంచివాళ్ళు చెడ్డగా మాట్లాడితే వినడానికి మనసు చివుక్కుమంటుంది.* ఆమె భావం అర్థమయి అతనూ నొచ్చుకున్నాడు. కనుబొమలపై పుట్టుకొస్తున్న చెమట చుక్కను తుడుచుకుంటూ,

''ఒక పది సంవత్సరాల క్రితం నేను ఎలా ఉండేవాడినో తల్చుకుంటే నాకే ఆశ్చర్యంగా ఉంది రాధీ'' అతని పిలుపును ఆమె అభ్యంతరపెట్టలేదు. అతనూ తడుముకోలేదు. చాలాకాలం తర్వాత వారి మధ్య చనువు సహజంగా సాగిపోతోంది. ''మా ఫ్రెండ్స్ సినిమా హీరోయిన్ల గురించి అయినా తప్పుగా మాట్లాడితే సహించేవాడిని కాదు'' వివేకానంద పూర్తిగా నిద్రలోకి జారుకున్నాడని నిర్ధారించుకుని కొనసాగించాడు. ''మా హాస్టల్లో క్లాస్‌మేట్స్ అయిన అమ్మాయిల గురించి కూడా రకరకాల బూతు బొమ్మలు వేసి అవమానకరమైన వ్యాఖ్యలు వ్రాసి ఉంటే, అదే పనిగా సున్నాలు కొట్టించి వాటిని చెరిపివేయించినవాడిని. అఫ్‌కోర్స్, ఆ కొత్తసున్నం తెల్లగోడలమీద మళ్ళీ నా పేరూ బొమ్మా కలిపి అంతకంటే బూతురాతలు వ్రాసారనుకో'' రాధిక కూడా అతని నవ్వులో శృతి కలిపింది.

''ఇంతగా ఆడవాళ్ళ మీద సెక్సువల్ ఫ్రస్టేషన్, వాళ్ళను ఏం తిట్టాలన్నా సెక్సువల్‌గా తిట్టడం ఏమిటో అర్థం అయేది కాదు. చివరకు సాటి మగవాడిని తిట్టడానికి కూడా వాడి కుటుంబంలోని స్త్రీలనే టార్గెట్ చేస్తాం కదా'' తనూ అందరిలానే మారిపోయానని నిజాయితీగా ఒప్పేసుకుంటున అతడిని మెచ్చుకోలేక తిరస్కరించలేక వింటూ డ్రైవ్ చేయసాగింది రాధిక

''ప్రపంచ చరిత్రలో ఏ యుద్ధాలు చూసినా గెలిచిన వారు ఓడిపోయిన వారి స్త్రీలను అపహరించడం బలాత్కారం చేయడం, ఇదే తంతు. మొదట ఇదంతా సెక్సువల్ ఫ్రస్టేషన్ అనుకున్నా. తర్వాత అర్థమయ్యింది. *మగవాడు ఆడదానికన్నా మానసికంగా బలహీనం* అని. నీలిమను చూసాక అనిపిస్తోంది. తన సైకలాజికల్ శాడిజం ముందు నా మనోబలం అంతా వృధా. అలా *ఆలోచనతో ఏమీ చేయలేనప్పుడు ప్రకృతి రీత్యా తనకు వచ్చిన శారీరిక బలంతో ఆడదాన్ని ఓడిద్దామని విఫలప్రయత్నం చేస్తాడేమో మగవాడు.* శీలం, సెక్స్‌వాలిటీ, ఆడది వీటికి ఎక్కువ విలువ ఇస్తుందని తెలుసు కాబట్టే మాటతోనైనా చర్యతో అయినా ఆ విషయంలోనే ఆమెను అవమానపరచాలని.. ''నీలిమను తాను తిట్టిన బూతులతో తనలో ఆత్మహత్య చేసుకుంటున్న సంస్కారాన్ని తలుచుకుని బాధపడ్డాడు చైతన్య.

''చే.. నేనొకటి అడుగుతా నిజం చెబుతావా'' అతని మాటలు విన్నాక ఒక ప్రశ్న అడగకుండా తనను తాను నియంత్రించుకోలేకపోతోంది రాధిక. వివేకానంద ప్రశాంతంగా నిద్రపోతుండడం ఆమె మళ్ళీ సరిచూసుకుంది.

''నువ్వు నీలిమను..?'' సుష్మ చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకుంటూ ''రేప్'' అనే ప్రశ్నను అడగడం ఎలాగా అని ఇబ్బంది పడింది.

''ఊ ఏమిటి?'' అడగమన్నట్లు రెట్టించాడు చైతన్య.

ఆమె మరింత తటపటాయించింది. నువ్వు లంచం తీసుకున్నావా అని అడిగినంత సులభంగా నువ్వు ఒక ఆడదాన్ని, నీ భార్య అయినా సరే, బలాత్కారం చేసావా అని అడగలేకపోతోంది ఆమె. సుష్మ ఆ విషయం చెప్పినప్పుడు ఆమె కొంచెం దిగ్భ్రాంతికి లోనయినా ఎక్కువ ఆలోచించదలచలేదు. మానసిక స్థిరత్వం లేని నీలిమ లాంటి మనిషి ఇంకో వ్యక్తికి చెప్పిన విషయం తనదాకా వచ్చేరికి కాస్తంత మారి ఉంటుందిలే అని తన మనసుకు తానే సర్దిచెప్పుకుంది. ఆ మాట అస్సలు నిజం కాదేమో, ఒకవేళ కాస్తంత నిజమే అయినా మిగతా అంతా నీలిమ కల్పితమే అయి ఉండకూడదా అనుకుంది. చే అనే వ్యక్తి ఔన్నత్యంలో ఆమెకు అంతటి నమ్మకం మరి. ఇప్పుడు ఆ ప్రశ్న అడిగితే అతడి జవాబు విని అతడితో ఎప్పటిలానే ప్రవర్తించగలనా అని భయం పట్టుకుంది. ఇంత ఆలోచించకుండా అసలు మాట ఎందుకు జారానా అని చాలా విచారం వేసింది

"నన్ను అంటావ్ కదా మరి నువ్వేంటి ఇంత ఫార్మల్‌గా. ఎలాంటి విషయమైనా ధైర్యంగా అడిగేయ్, ఇంతకంటే పోగొట్టుకునే ఇమేజ్ ఏమీ లేదులే నాకు ఇప్పుడు" వైరాగ్యమూ ఆత్మ నిందనా కలిపి నవ్వాడు అతను.

"నా ఫ్రెండ్ ఒకరు సైక్రియాట్రిస్ట్. కో ఇన్సిడెంట్లీ, నీలిమ తన పేషెంటట... "సుష్మ ద్వారా తాను వినదంతా చెప్పింది తప్పు చేస్తున్నాను అని ఆమెకు అనిపించలేదు. ఒక పేషెంటు తాలూకు వ్యక్తిగత విషయాలు ఒక డాక్టరు వెల్లడించకూడదు. అయినా ఆత్మీయురాలిగా సుష్మ తనకు చెప్పింది. అదే కారణంగా తను చైతన్యకు చెబుతోంది. నీలిమ గతం, ఆమె అనుభవించిన వేదన తెలిస్తే చైతన్య ఆమెను ఇక ద్వేషించడమో. వాళ్ళు మళ్ళీ కలుస్తారేమో. ***ఇంకొకరి జీవితాలను బాగుచేద్దామని చేసే పనులే ఒక్కోసారి మన జీవితాన్ని ముక్కలు చేస్తాయి. సదుద్దేశ్యాలు జిల్లేడుపూలవంటివి. చూసేందుకు నిర్మలమైనా ఎక్కువగా ప్రేమిస్తే ప్రాణాలే తీస్తాయి.***"తన గురించి ఇంత డీటైల్స్ నాకు తెలీవు. బట్ యస్, ఐ రేప్డ్ హర్" అంతా విన్నాక నీలిమతో తాను జంతువులా బలప్రయోగం చేసిన విషయాన్ని అంగీకరించాడు చైతన్య. ***నిప్పు ఎలా కాలుతుందో తెలిసి, ఆ నొప్పికి ఎంతగా సిద్ధపడి ముట్టుకున్నాక కూడా ఆ మంట అనుభవం అలానే ఉంటుంది.*** నీలిమ పట్ల తాను హేయంగా ప్రవర్తించిన విషయాన్ని చైతన్య ఒప్పుకుంటే అప్పుడు ఎలా ప్రతిస్పందించాలో ముందుగా చాలా బేరీజు వేసుకున్నా, తీరా ఆ సందర్భం వచ్చేసరికి తన మనసును తాను అదుపు చేసుకోలేకపోయింది రాధిక. అరచేతుల్లోంచి ప్రాణమంతా జారిపోతున్నట్లు అనిపిస్తుంటే, ట్రాఫిక్ తక్కువగా ఉన్నవేపు చూసుకుని కారు ఆపింది. ఆ క్షణం కారులో అతను తన ప్రక్కన ఉండటం ఆమెకు చాలా అసౌకర్యంగా అనిపించింది. తాను ఇష్టపడి ఒకప్పుడు తన సర్వస్వం అర్పిద్దామనుకున్న మనిషి తండ్రి, తమ్ముడు, కొడుకు ప్రియుడు అన్నీ అతనే అనుకున్న మగవాడు. అతని ఛాతీమీద చెవి పెట్టి విన్న గుండెలయ ఆమెకు గుర్తుకు వచింది. ఎంత మంచి మనిషి ఇంత బలహీనంగా ఎలా ప్రవర్తించగలిగాడు? ***అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మనిషికి ఆ శిఖరానికే ఒక విలువ లేదని తెలిస్తే! ప్రేమించిన వ్యక్తి చచ్చిపోయినా పర్లేదు కానీ ప్రేమించిన వ్యక్తిత్వమే పతనమయిపోతే ప్రేమకిక అర్థం ఏముంటుంది.***

"బట్ రాధీ, షి ప్రొవోక్డ్ మీ టు బిహేవ్ సో. ఆ రోజు నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను..."

జీవితంలో మొట్టమొదటిసారిగా ఆమె చైతన్య మాటలను పట్టించుకోవడం మానేసింది.

"ఇతడిని నేను ప్రేమించాను. కానీ అతడు ఇతడు కాడు. ఇతను చే కానే కాదు" ఆమెలో ఆలోచనలు మాట్లాడుతునాయి. ఆమె మనసు ఆమె మాటలనే వింటోంది. అతడి సంజాయిషీలు ట్రాఫిక్ రణగొణ ధ్వనుల్లో కలిసిపోతున్నాయి.

*న్యాయస్థానాలలో కూడా చిన్న తప్పులకు అయితే నిజాయితీగా తప్పునుఅంగీకరిస్తే శిక్ష తగ్గుతుంది కానీ క్షమించరాని నేరం చేసినప్పుడు ఆ నేరానికి ప్రేరేపించిన సందర్భాలూ, వ్యక్తులగురించి విశదీకరించినా, ఆ నేరం చేయక మునుపు సదరు ముద్దాయి ఎంతటి*

*సచ్ఛీలుడని తెలుపుకున్నా అతడే నేరాన్ని అంగీకరించినా శిక్ష తప్పదు. మనిషి చేసే నేరం మానవత్వానికే పాపంలా అంటుకునే చర్యలు అవి. తప్పుకూ, నేరానికి పాపానికి తేడా క్షమాపణే.* ఎన్ని కారణాలు చెప్పిన ఒక ఆడదానిగా చైతన్య మరో ఆడదానితో ప్రవర్తించిన తీరు తెలిసాక అతడిని క్షమించలేకపోయిఇంది రాధిక. అతడి వాదన అంతా సమర్ధనీయమే ఎక్కడో అనిపిస్తున్నా అంతరాత్మ ఎటూ తేల్చుకోలేకపోయింది. అంత క్షమించలేని పాపం చేసినా అతడిని ద్వేషించలేకపోయింది కూడా.

ప్రేమించలేకపోయింది కూడా.

*ప్రేమించినవాళ్ళు దేవుడితో సమాధానం. ఎంత అసహ్యించుకున్నా, తిట్టుకున్నా "అసలు నువ్వు లేనే లేవు" అని ఉనికినే తిరస్కరించినా అంతర్లీనంగా వారిగురించి ఆలోచనలను ప్రేమిస్తూనే ఉంటాం.*

హాస్పిటల్ వార్డులో చేరిన మొదటి రోజున వివేకానందకు చైతన్య చక్కెర వేసి ఇడ్లీలు తినిపించడం చూసిన ఆమె ఆశ్చర్యపోయింది. కాలేజ్ రోజుల్లో తన టిఫిన్ బాక్సుల్లో ఆ కాంబినేషన్ చూసి మొదట పరిహసించిన అతను, ఆ తర్వాత రుచి చూసి మెచ్చుకుని అప్పుడప్పుడూ అదే కోరుకోవడం, ఈనాడు తనపిల్లాడికి అదే అలవాటు చేయడం.. అతనిలో తాను ఎంతగా నిండిపోయి ఉందో అర్థమయ్యేట్లు చేసాయి ఆమెకు. ఆపరేషన్ చేసే రోజు దగ్గరయే కొద్దీ ఆమెలో వ్యక్తిగతమైన భావాలన్నీ పక్కకు తొలిగిపోయి, వివేకానందను కేవలం ఒక పేషెంటుగానే చూడాల్సి వచ్చింది. ఎందరో పసివాళ్ళకు ఇంజెక్షన్లు ఇవ్వడం, రక్తంలాగడం అన్నీ చూసినా చేసినా వివేకానంద దేహంపై కూడా అవే పనులు అలానే చేయవలసివచ్చినప్పుడు మొదట ఒక ఆడదానిగా, తల్లికాలేని తల్లి మనసులో విలవిలలాడిపోయింది. *మనిషిని ధృడం చేయడానికి కాలం చూడలేని దృశ్యాలు చూపిస్తుంది.* ఒక్క రోజులోనే తన ఆ తల్లి మనసును కట్టడి చేసుకుని శక్తివంతమైన చేదు యాంటీబయాటిక్ మాత్రలను మింగనని వాడు మారాం చేస్తుంటే ఇంట్రావీనస్ రూట్ ద్వారా ఇప్పించింది. రాధిక వస్తోందంటే ఒకప్పుడు చేతులు చాచి ఆహ్వానించే ఆ పసివాడు ఆమె గొంతు వినపడితే ఏడుపు మొదలెట్టేంతగా భయపడిపోయాడు. జెన్నిఫర్ స్థానంలో హాస్పిటల్లోనే సీనియర్ అయిన సర్జన్‌ను ఈ ఆపరేషన్‌లో తనకు సహాయంగా ఉండమని కోరింది రాధిక. ఆయనకు అరవై ఏళ్ళు. మెదడుకు సంబంధించిన సర్జరీల్లో ముప్పై ఏళ్ళ అనుభవం. చాలా అరుదయిన కేసులో లేక సమాజంలో అతి ముఖ్యమైన వారి కేసులో తప్ప ఇంకేవీ ఒప్పుకోడు. తనకన్నా వయస్సులోనూ అనుభవంలోనూ చాలా చిన్నదైన రాధికతో కలిసి సర్జరీ చేయడానికి, అదీ కేవలం సహాయకుడిగా, ఆయన ఒప్పుకోవడం హాస్పిటల్‌లో మిగతా డాక్టర్లకు ఆశ్చర్యం కలిగించింది. తన రిసెర్చి మెటీరియల్‌లో చాలా ముఖ్యమయిన నోట్స్‌ను ఆయనకు అందించి ఆయన వ్రాస్తున్న పుస్తకాలకు సహాయం చేసేందుకు రాధిక ఒప్పుకున్న విషయం వారెవ్వరికీ తెలియదు. అంతా సవ్యంగా జరిగిపోయినా సర్జరీకు ఒక్క రోజు ముందు... ఆమెకు చాలా భయం అనిపించింది. వైద్య వృత్తిలో సంవత్సరాలపాటు జనన మరణాలు చూస్తుండటంతో ఒకప్పటిలా దేవుడిలో, ముఖ్యంగా విగ్రహారాధనలో ఆమెకు నమ్మకం కాస్త తగ్గింది. క్లిష్టమైన సర్జరీలు చేసిన తొలిరోజుల్లో ఎంతో వేడుకున్న తర్వాత కూడా ఆపరేషన్ విఫలమయినపుడు భగవంతుడే లేడు అనుకుంది. తానేమీ కోరకపోయినా అద్భుతాలు జరిగి, ఇక ఆశలొదిలేసుకున్న కేసుల్లో అనూహ్యంగా పేషెంట్లే ఏదో అతీత శక్తి తోడ్పడినట్లు పుంజుకోవడం చూసినపుడూ కర్మ సిద్ధాంతం నిజమే అనుకుంది. కొన్నాళ్ళకు ఆ రెండు రకాల అనుభవాలూ అలవాటు అయిపోయి ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. ఒక సిద్ధాంతానికి లోబడి ఏదీ జరగదు అని నిశ్చయించేసుకుంది. చాలా కాలం తర్వాత ఆమెకు అలాంటి అతీత శక్తి తోడు అవసరం అనిపించింది. ధ్యానం చేసినట్లు తనలో తానే ఒక వరం అడిగింది మరుసటి రోజు సర్జరీలో ఏ అవాంతరాలు కలిగించొద్దని. ఆ రోజు యాదృచ్ఛికంగా రాజు ఇంట్లోనే ఉండిపోవడంతో, తనను హాస్పిటల్ దగ్గర డ్రాప్ చెయ్యమని అడిగింది. ఆమెకు ఈ సర్జరీ ఎంత ప్రత్యేకమయినదో తెలిసిన అతను మారుమాట్లాడకుండా వచ్చాడు. *మనసును ఎంతో అర్థం చేసుకున్నా దాన్ని గాయపరచే ప్రేమికులకన్నా మొక్కుబడిగా అయినా అడిగింది చేసిపెట్టే మనుష్యులు ఉండటమే ఒకోసారి చాలా నయం అనిపిస్తుంది.* నిద్రలేని కళ్ళతో ఎదురొచ్చిన చైతన్యకు ధైర్యం చెప్పి, ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్ళేముందు వివేకానందను

కలవడానికి వెళ్ళింది. పచ్చటి గౌనులో, జాయిగా గీసేసిన గుండులో వివేకానంద నర్సు చేయి పట్టుకుని నడిచి వస్తుంటే ఆమెకు ఒళ్ళు ఝల్లుమంది. అతడు పెద్దయి తనతో చాలా గొప్పమాటలు చెబుతున్నట్లు తోచింది. ఖచ్చితంగా చైతన్య చెయ్యలేని మంచి పనులు వీడు చేస్తాడు అనిపించింది.

"ఆంటీ రేపు నాకు ఇంజెక్షన్ ఒద్దు" రాధికను చూడగానే బేలగా అన్నాడు వాడు.

"ష్యూర్. అంతే కాదు. నేను నీకోసం పెద్ద బొమ్మ కొనిస్తాను" వాడిని అక్కున చేర్చుకోవాలి అనిపించినా, స్టెరిలైజ్ చేసిన బట్టల్లో ఉన్న వాడిని ఎక్కువగా ముట్టుకోకూడదు అనే విషయం స్ఫురణకు వచ్చి సుతారంగా వేలితో బుగ్గను తాకింది.

"ప్రామిస్?!" ఆశగా చూసాడు వాడు.

తన తల మీద తన అరచేతిని ఆన్చి కనురెప్పలు మూసి తెరచి ఒట్టేసుకుంది రాధిక

నర్సు తీసుకు వెళ్ళిపోతుంటే వెనక్కు చూస్తూ బలహీనగా నవ్వాడు వాడు.

పావుగంట తర్వాత థియేటర్‌లో ఆపరేషన్ టేబుల్ మీద, అతను వివేకానంద కాడు. పచ్చటి వస్త్రంలో ఒళ్ళంతా కప్పివేయబడిన ఒక బాలుడు. తల మాత్రమే కనిప్‌సితోంది. కత్తి దిగవలసిన చోట సన్నగా మార్క్ చేయబడి ఉంది. సీనియర్ సర్జన్‌తో కలిసి రాధిక సర్జరీకు ఉద్యక్తురాలైంది.

*కర్త కర్మ క్రియ అన్నీ మనిషే*

## 13

**గడియారంలో ముళ్ళు కదలడం లేదు.** కానీ సమయం మించిపోతోందని తెలుస్తోంది. అంతరాత్మ ఉండగా గడియారం ఎందుకు? ఆపసోపాలు పడుతూ పరుగెత్తుకు వెళ్ళాను. నేలమీద నీళ్ళు పారుతున్నాయి. వర్షం మురిగిపోయిన వాసన. ఆకాశంలో సూర్యుడు ఆరెంజ్ ఐస్ క్రీములా కరిగిపోతున్నాడు. ఎడమ కాలిబూటు లేసు వదులయిపోయింది. అడుగు తడబడుతోంది. కింద పడనేలేదు. అయినా కుడి దవడ చాటున ఒక రుచి పుడుతోంది. ఉప్పగా ఎంతసేపు పరుగెత్తను? చేతికి ఉన్న వాచిలో ముళ్ళు ఇంకా కదలడం లేదు. నాలుకకు తగులుతూ ఒక విరిగిపోయిన పన్ను. దోసిట్లో ఉమ్మేసుకున్నాను. ఒకటి కాదు రెండు పళ్ళు. రెండవ పన్నులో ఇంకొక పన్ను అతుక్కుని ఉన్నట్లు ఉంది. రక్తం రుచి మాయం. నవ్వితే తొర్రిగా కనిపిస్తానా? స్కూల్ బెల్ మోగుతోంది. స్కూలేమిటి, నేనిప్పుడు కాలేజ్ కదా! కాలేజ్ బెల్ మ్రోగుతోంది. ఆ ప్యూన్ బెల్లుకొట్టీ కొట్టీ ముసిలివాడు అయిపోయి అలాగే చచ్చిపోతాడేమో ఏముంటుంది వాడి జీవితంలో అర్థం. లైఫ్ లో ఏం సాధించావురా అంటే, నలభయ్యేళ్ళపాటు ఒకే స్కూలులో ఒకే బెల్లు ఒకేరకంగా మ్రోగించాను అంటాడేమో. అదే పెద్ద అఛీవ్ మెంట్. ఛీ వెధవ బ్రతుకు. వేస్ట్ లైఫ్. వెధవ బ్రతుకు. కానీ బెల్లు మోగించేది స్కూల్లో ప్యూన్ కదా. ఇది కాలేజ్. వీడు వాడు కాడు. ఇక్కడి ప్యూన్ ఊరికే అలా ఒక మీట నొక్కీ నొక్కీ చచ్చిపోతాడు. అసలు వీళ్ళంతా ఇలా ఎలా బ్రతికేస్తారు. ఇంత అర్థరహితంగా ఇంత అనర్థవంతంగా! అదిగో కనిపిస్తోంది క్లాస్ రూం అక్కడే, అక్కడే, అందులోనే... పరీక్ష. నాకు. ఎవరికి? నాకు. అదే ఏ నీకు? పేరు, వయసు వగయిరా వివరాలతో, చిన్నపాటి ముఖాన్ని అతికించిన ఒక వ్యక్తికి పరీక్ష. ఆ వ్యక్తే నేను. ప్రపంచానికి కావలసిన వ్యక్తి మొత్తం ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటోలో ఇరుక్కుపోయి ఉండాల్సిందే "ఏమిటి లేటు" అని ఇన్విజిలేటర్ తిడతాడేమో పుస్తకాలు తగలబడిపోతున్నాయి.

ఏమిటీ లేటు" అని ఇన్విజిలేటర్ తిడతాడేమో. పుస్తకాలు తగలబడిపోతున్నాయి.

ఎవ్వరూ ఏమీ అనలేదు. హమ్మయ్య. ఏదీ కొశ్చిన్ పేపర్? ఈ కాగితాన్ని చింపి బయట నీళ్ళల్లో పడవలు వేస్తే? ఏమిటీ ప్రశ్నలు. ఆ.. నాకు సమాధానం తెలుసు. పెన్ను, పెన్ను ఏదీ? ఓకే నాకు సమాధానం వచ్చు. ఇదిగో పెన్ను. అదిగో ఆన్సర్ షీట్. గడియారంలో ముళ్ళు ఇప్పుడు కదులుతున్నాయి. అయ్యయ్యో నా వేళ్ళేవీ? చేతులు ఉన్నాయి. కానీ వాటికి వేళ్ళు ఏవీ? నో నో.. నాకు ఇప్పుడు ఏమీ వద్దు. చేతి వేళ్ళు కావాలి. అన్నీ కూడా అక్కర్లేదు. కుడి చేతి బొటన వేలు, చూపుడు వేలు చాలు. కలం పట్టుకోగలిగితే చాలు. చేతుల్లోంచి వేళ్ళు మొలుస్తున్నాయి. వంకరటింకరగా ఒక పద్ధతి లేకుండా వేటినీ పట్టుకునే శక్తి లేకుండా ప్రశ్నాపత్రం అలాగే ఉంది. కాలం ఆగడం లేదు.

ఎన్ని రాత్రులని ఈ పీడ కల? అతని జీవితంలో ఈ పీడకల వచ్చినప్పుడలా కోపం వస్తుంది. ప్రపంచం అనే వ్యవస్థను ఒక మనిషిగా తన ఎదుట తీసుకువస్తే చంపేసేంత కోపం కానీ ముఖం లేని రాక్షసత్వం ప్రపంచం మనిషికి మనిషిలా ఎదురుపడేంత ధైర్యం దానికి ఎప్పుడూ లేదు. అందుకే ప్రపంచానికి అతడొక పేరు పెట్టుకున్నాడు.

కృష్ణచైతన్య.

అదే. తన పేరే. ప్రపంచం దృష్టిలో తన గుర్తింపు ఏమిటో అదే దాని గుర్తింపు కూడా. ప్రపంచాన్ని తిట్టుకోవల్సి వస్తే తనను తాను తిట్టుకోవడమే, ప్రపంచంలో ఎక్కడయినా తప్పు జరుగుతుంటే దానికి కారణం తనే. అలాంటి తప్పు. జరిగిందీ అంటే అది కేవలం ఒక వ్యక్తి అసమర్ధత. తప్పు చేసినవాడయినా, బలి అయినవాడయినా, మౌనంగా చూస్తూ ఉండిపోయినవాడయినా అందరూ వ్యక్తులే. తనలాంటి వ్యక్తులే తనకు  విభిన్న రూపాలేతను మారనిదే వారు మారరు. వారు మారనిదే ప్రపంచమూ మారరు. ఇన్ని విషయాలు  తెలిసాయి కానీ ఈ మార్పు ఏమిటో ఏ దిశగా ఉండాలో తేల్చుకోలేక ప్రశ్నల్లో చిక్కుకుపోయినవాడు కృష్ణ చైతన్య. ***ఒక పసివాడికి మొదటిసారిగా ఎదురయ్యే ప్రతి సాధారణమైన అనుభవమూ ఒక అద్భుతమే. నీరు చూసి చూసి విసుగెత్తినవాడికి ఆ నీటినుండి పుట్టే ఒక బుడగను చూస్తే ఆశ్చర్యం. ఇదేదో నీటికంటే గొప్పదయి ఉంటుంది అనిపిస్తుంది. అంతలోనే ఆ బుడగ పగిలిపోతే క్షణం కాలమయినా అందంగా హొయలు పోయిన బుడగ గొప్పదో, తనకంటూ ఒక ఆకారం లేక బకెట్లలో, చెంబుల్లో, గ్లాసులో, కాలువల్లో ఎలాపడితే అలా నిరంతరంగా సాగే నీరు గొప్పదో అర్ధం కాదు.*** ఆలోచనలతో ఎదిగే చైతన్య మస్తిష్కంలో ఇలాంటి సందేహాలూ, అనుమానాలూ ఎన్నో.

చిన్నప్పుడు స్కూలు పుస్తకాల్లో ఆర్కిమెడీస్ సూత్రాలు చదివినప్పుడు, మిగతా పిల్లలు అందరూ దాన్ని బట్టీయం వేస్తుంటే, ఇలాంటి ఆలోచన తనకు ఎందుకు రాలేదా అని నిందించుకున్నాడు. తమ ఇంటి ఎదురుగా నందివర్ధనం పూవులు రాలుతుంటే వాటి అందాన్ని గుర్తించే తాను న్యూటన్‌లా అవి క్రిందకే ఎందుకు రాలుతున్నాయో ఆలోచించలేదే అని తన బుద్దిని తిట్టుకునేవాడు. ప్రతి పాఠ్యపుస్తకంలోనూ రకరకాల శాస్త్రాలు, చారిత్రాత్మక సంఘటనలు చదివినప్పుడల్లా కేవలం ఒక్క వ్యక్తి నుంచి పుట్టే ఒక్క ఆలోచన, చర్య మానవ జీవనాన్ని ఎంతగా మార్చగలవో కదా అని అభిప్రాయపడేవాడు. కానీ అలాంటి వ్యక్తులు కొందరే ఎందుకు ఉంటారో అర్ధమయ్యేది కాదు. తను మాత్రం ఆ కొందరికి అతీతుడననీ, చరిత్రను తిరగవ్రాయగలదేదో చెయ్యాల్సిన బాధ్యత తనపై ఉన్నదనీ నిర్ధారించుకుని తాను చెయ్యవలసిన పని ఏమిటో అని అన్వేషించేవాడు. కొత్తగా ఏది చదివితే దాన్ని ప్రేరణగా తీసుకుని ఒక ఆశయం పెట్టుకునేవాడు. ఎందరో మహానుభావులు, ఎందరినని ప్రేమించడం, ఎవరిని అనుసరించడం.

జీవితం చాలా క్లిష్టంగానూ తికమకగానూ తోచేది ఆ అబ్బాయికి, అల్వా ఎడిసన్ గురించి చదివినప్పుడు తానూ ఏదో వస్తువు కనిపెట్టాలి అనీ, లెక్కల్లో రామానుజం గురించి చదివితే ఏదైనా కొత్త ఈక్వేషన్ కనిపెట్టాలి అనీ, జగదీష్ చంద్రబోస్ గురించి చదివితే మొక్కల్లో ఇంకే మర్మముందో ఛేదించాలనీ.. ఎన్నెన్నో ఆశలు ఉక్కిరి బిక్కిరి చేసేవి. స్కూలు పుస్తకాలన్నీ చందమామ కథల్లా త్వరత్వరగా చదివేసాడు. మాష్టారు పాఠం చెప్పని అంశాల్లో కూడా సమాధానాలు చెప్పగల అతడికి తరగతిలో ఎప్పుడూ మొదటి ర్యాంకే. వాళ్ళ

కుటుంబం అప్పట్లో నర్సీపట్నంలోని ఆర్డనరీ లక్ష్మీపురం అనే ఊరిలో ఉండేవారు. బంధువుల సహాయంతో ఒక కిరాణాషాపు, దాంతో పాటు చిన్నపాటి బట్టల దుకాణం నడుపుకునే అతని తండ్రికి తమ వంశంలో ఎవ్వరూ సరిగా చదువుకోలేదనే బాధ ఎప్పుడూ పీడిస్తూ ఉండేది. తన స్థితికి సంతృప్తి చెందని మనిషికి అందుకు కారణం వేరెవరూ కాదు తనే అనే జ్ఞానం కలగడం నరకం. చైతన్య తండ్రి ఎప్పుడూ ఆ నరకంలో బందీనే. చిన్నప్పుడు ఏనాడూ బడికి వెళ్ళి చదువుకోవడంలో శ్రద్ధ చూపించక, ఆకతాయి తిరుగుళ్ళు తిరగడంతో పధ్నాలుగేళ్ళకే బడిమానిపించి తండ్రితో పాటు ఒక చిన్న మూటలో చీరలు, పంచలు కట్టుకుని సైకిలు మీద ఊరూరా తిరిగి అమ్మే వ్యాపారంలో ప్రవేశపెట్టారు. మాష్టార్ల దగ్గర అర్ధంలేని, బుర్రకెక్కని పాఠాలు వినడం కంటే ఏదో ఆటలా అనిపించే ఈ వృత్తే బావుంది అనిపించింది ఆయనకు. పద్దెనిమిదేళ్ళకే ఆ వ్యాపారంలో లాభాలు, తద్వారా సొంత ఊర్లోనే ఒక చిన్న కొట్టు, పెళ్ళి, అందుకు కట్నంగా ఒక కిరాణా షాపు, బుర్రకెక్కని పాఠాలు వినడం కంటే ఏదో ఆటలా అనిపించే ఈ వృత్తే బావుంది అనిపించింది ఆయనకు. పద్దెనిమిదేళ్ళకే ఆ వ్యాపారంలో లాభాలు, తద్వారా స్వంత ఊర్లోనే ఒక చిన్న కొట్టు, పెళ్ళి, అందుకు కట్నంగా ఒక కిరాణా షాపు, బంధువులందరి దృష్టిలో "ప్రయోజకుడు" అనే డిగ్రీ.. ఇరవయ్యేళ్ళకల్లా జీవితంలో చాలా సాధించేసిన తృప్తి వచ్చేసింది ఆయనకు. తనలాగా బడి అంటే ఇష్టంలేని కొందరి స్నేహితులు తన తర్వాత బడిమానివేయడం, చిన్నా చితకా వ్యాపారాలు, వ్యవసాయాల్లో ఎదుగూబొదుగూ లేకుండా ఉండడం చూస్తే తాను మరింత ప్రయోజకుడనే గర్వమూ కలిగేది. కానీ, చదువునే నమ్ముకుని హైస్కూళ్ళకూ, ఆ తర్వాత కాలేజీల్లోకీ వెళ్ళిన ఇద్దరు ముగ్గురు స్నేహితుల గురించి మాత్రం ఏమీ బోధపడేది కాదు. అంత విసుగయిన చదువుకోసం అప్పులు చేసి వాళ్ళ కుటుంబాలు పేదగా ఉండడం ఏమిటో అర్ధం అయ్యేది కాదు. ఆయనకు తెలిసిన ప్రపంచం తన ఊరు వ్యాపారం, దగ్గర్లోని పట్టణం. అంతే. చదువుకుని చిన్నపాటి ఉద్యోగస్తులయిన స్నేహితులు పండగలకీ ఊరికొచ్చినప్పుడల్లా వారి స్థితిగతులు పెరుగుతుండడం చూసాడు. వాళ్ళ వేషభాషలతో తనను పోల్చి చూసుకుంటే తాను పేదగా కనిపించడం మొదలయ్యింది. మెల్లగా ఆ స్నేహితుల నోటివెంట సిటీ విశేషాలూ, అక్కడి జీవనశైలీ వినడంతో వారి జీవితాలతో పోల్చి చూసుకుంటే తన జీవితం చాలా అల్పమయినదిగా కనిపించసాగింది. ***పక్కవాడి సుఖసంతోషాలన్నీ మనకూ దక్కేవే కానీ తమే ఆ అవకాశాలను చేజార్చుకున్నాం అని తెలుస్తుంటే జీవితంలో విరక్తి కలుగుతుంది.*** ఆయనకు చాలా తొందరగా ఆ విరక్తి పుట్టేసింది. ఎంత అమ్మినా ఈ చిన్న ఊర్లేనే కదా వ్యాపారం, అంతకు మించి ఏం సాధించగలను అనే నీరసం. ఉన్న ఊరు వదిలి ఇంకోచోట ఏం చేద్దామన్నా లోకానుభవం. విద్యావిజ్ఞానంలేని తనలో తనకే విశ్వాసం లేదు. స్నేహితులలో ఒకరు విదేశాలకు కూడా వెళ్ళివచ్చి ఆ విశేషాలు చెబుతుంటే అలాంటి జీవితం అంతా అందుకునేందుకు తనకూ అవకాశం ఉండినా, తానే చేజార్చుకున్నాననీ బాధపడ్డాడు. చదువుకుంటే ఏదో జ్ఞానమూ, వివేకమూ, బుద్ధీ ఇలాంటివి వస్తాయని అందరూ అంటారేకానీ డబ్బు, మెరుగయిన జీవనమూ, ఉపాధీలాంటి భౌతిక సుఖాలు వస్తాయని చిన్నప్పుడు తనకు ఎవ్వరూ చెప్పలేదే అని బాధపడ్డాడు. అతను అలాంటి ఆత్మనిందాపూర్వక మనోస్థితిలో ఉన్నప్పుడే కృష్ణచైతన్య పుట్టాడు. మనవడిని ముద్దాడబోయిన తన తండ్రిని చూసేసరికి భయం పట్టుకుంది. తన తండ్రిని అనుసరించి తనకీ గతి పట్టింది, తనను అనుసరిస్తే తన కొడుకు ఏమవుతాడోనని తన కొడుకు మంచి విద్యావంతుడు అవ్వాలంటే ఏం చెయ్యాలి అని చదువుకున్న ప్రతివాడినీ అడిగాడు. కేవలం ఒక బడిలో చేరిస్తే సరిపోదని, స్నేహితులు, చుట్టుపక్కలవారు అందరిలోనూ విద్యకు అనుకూలం అయిన వాతావరణం ఉండాలని సలహాలు వచ్చేసరికి, కేవలం చైతన్య చదువుకోసం మకాం పట్నానికి మార్చేసి, వ్యాపారనిమిత్తం మాత్రం రోజూ డెబ్భైకిలోమీటర్లు ప్రయాణం చేసి స్వంత ఊరికి వెళ్ళడం చేసేవాడు. అంత కష్టపడుతున్న ఆయనకు చైతన్య ఎప్పుడూ మంచి మార్కులు తెచ్చుకోవడం, పిల్లవాడికి మంచి భవిష్యత్తు ఉంటుందని మాస్టర్లు చెప్పడం వింటే తన కష్టం ఏమీ తెలిసేది కాదు. చదువుకు సంబంధించి చైతన్య ఏం కోరినా ఏ మాత్రం బదులు అడుగక తెచ్చి ఇచ్చేవాడు. చైతన్య పుస్తకాల పురుగులా తయారయి పుస్తకాల దొంతర్ల మధ్యే ఒక్కోసారి నిద్రపోతే, ఆ పుస్తకాలను తీసుకుని అక్షరం అక్షరం కూడి చదువుకుని వాటి మర్మమేమిటో తెలియక,

అక్కడక్కడా వచ్చే బొమ్మలను మాత్రం చూసి తన అజ్ఞానికి బాధపడుతూనే కొడుకును చూసి గర్వించేవాడు. తండ్రి ఉద్దేశ్యాలు వేరయినా ఆయన ఇచ్చిన ఆ ఆసరాతో చైతన్య అతి చిన్న వయస్సు నుంచి గొప్ప గొప్ప పుస్తకాలు చదవగలిగాడు. చైతన్య చురుకుదనం చూసి ఎంతో ముచ్చటపడిన మాస్టార్లలో ఇద్దరు ముగ్గురు స్కూల్ లైబ్రేరీలో పిల్లలకు అందనంత ఎత్తు అలమారల్లో ఉండే సైన్సు మ్యాగజైన్లనూ, ఖరీదయిన పుస్తకాలనూ ఇవ్వడమే కాక ఫలానావి చదవమంటూ సలహాలు ఇచ్చేవారు. దీపంలో నిప్పు పరిమాణం వత్తి సైజుతో ముడిపడినట్లు చిన్న వయస్సులోనే అంత ఎక్కువ చదివిన చైతన్య ఆలోచనలూ, చేష్టలూ అన్నీ వయసుకు మించిపోయి దాదాపు అతడి బాల్యాన్ని హరించేసాయి.

స్కూలు దగ్గరకు ఐస్కీము బండీవాడు వస్తే మిగతా చిన్నపిల్లల్లా ఐస్ క్రీము తినడం కాక దాన్ని తయారు చేయడం ఎలా, దాన్ని అమ్మేలోగా కరిగిపోకుండా ఐసు ఎలా ఉంటుంది, అసలు నీరు ఐసు అయితే ఎందుకు గట్టిపడుతుంది ఇలాంటి ప్రశ్నలతో సతమయ్యేవాడు. పుస్తకాలు ఎంత మంచివో అంత చెడ్డవి. జీవితం గురించి చెబుతాయేమో కానీ జీవించలేవు. కాగితాలలో ముద్రించబడిన అక్షరాలలోనే జీవితం అనుకుంటున్న చైతన్య ఆలోచనలలో పెనుమార్పులు తీసుకువచ్చిన వ్యక్తి ఒకడు అతనికి ఏడవ తరగతి తర్వాత పరిచయం అయాడు. వింత ఏమిటంటే అతడికి ఒక పేరు పెట్టుకున్నాడు: "బుద్ధ"

బుద్ధ కనిపించకపోతే చైతన్య జీవితం ఇంకోలా ఉండేది ఏమో. కేవలం ఒక మనిషి మనుగడ ఇంకో మనిషిని ఎంతయినా ప్రభావితం చేస్తుంది.

"ఎక్స్క్యూజ్‌మీ సర్" మృదువుగా వినిపించిన గొంతుతో తన జ్ఞాపకాల ఈతలోంచి తల ఎత్తి చూసాడు చైతన్య. అంతసేపూ అతడి శరీరాన్నే కానీ మనసును ఇమడ్చుకోలేని హాస్పిటల్ లాంజ్‌లోని ఒక చివర కుర్చీలో దాదాపు నిద్రపోతున్నట్లు ఉన్న తన వాలకాన్ని గమనించుకుని సర్దుకున్నాడు. వివేకానందకు సర్జరీ జరుగుతుండగా పరి పరివిధాల వెళుతున్న మనసును నియంత్రించుకునేందుకు ధ్యానం చేద్దామని కళ్ళు మూసుకుంటే పీడకలలూ, గతం అన్నీ మెదలడమేమిటి.... ఇంతకాలంగా ఇంతగా గుర్తుకురానివన్నీ ఈ సమయంలో మళ్ళీ మదిలో మెదలడమేమిటని చిరాకు పడుతూనే తనను పిలిచిన వ్యక్తికేసి చూసాడు. ఒక పదహారు పదిహేడేళ్ళ అబ్బాయి. బాగా ఉన్నవారి కుటుంబంలోంచి వచ్చినవాడిలా బ్రాండెడ్ జీన్సూ, టీ షర్టూ, చేతిలో అత్యాధునికమయినసెల్ ఫోనూ, ఎవరో విదేశీ పాప్ గాయకుడిని అనుకరిస్తున్నట్లున్న హెయిర్ స్టయిలూ.. అలాంటి వాళ్ళ ఊసే గిట్టని చైతన్య తన భావాలను బయటపెట్టడం ఇష్టంలేనట్లు ముఖం తిప్పేసుకుని, వీవా సర్జరీ గురించి తనకు విషయం చెప్పేందుకు రిసెప్షనిస్ట్ కానీ నర్సు కానీ వస్తోందేమో అని కారిడార్ వేపు చూస్తూనే "యస్ ప్లీజ్" అన్నాడు ఆ అబ్బాయితో.

"కెన్ ఐ హావ్ ఎ మినిట్ విత్ యూ, ఇఫ్ యూ డోంట్ మైండ్" అతను చాలా వినమ్రంగా అడుగుతున్నా ఎందుకో అతని స్వరంలోని ఆంగ్లం చైతన్యకు నచ్చలేదు. అమెరికన్ యాసను నేర్చుకోవడానికి ఆ యువకుడి ప్రయత్నం అంతా అసహజంగా ధ్వనించింది. ఇతనికి తనతో పనేమిటి అని ఆశ్చర్యపోతూనే, "యస్ ప్లీజ్" అన్నాడు చైతన్య.

"మీ బ్లడ్ గ్రూప్ ఏమిటి సర్?" ఆ యువకుడు చనువుగా చైతన్య కూర్చున్న కుర్చీ పక్క కుర్చీ చేతిమీద స్టయిల్‌గా వాలుతూ అడిగాడు.

"వై డూ యూ వాంట్ టు నో?" తీక్షణంగా అడిగాడు చైతన్య.

"డోంట్ గెట్ మీ రాంగ్ సర్. అయామ్ సారీ మీరు ఇక్కడ ఎందుకు ఉన్నారో కూడా తెలియలేదు. బట్ అయామ్ జస్ట్ కన్సర్న్డ్"

"అబౌట్ వాట్?"

"ఎ చైల్డ్"

ఉలిక్కిపడ్డాడు చైతన్య. తన బాబుగురించి కాదు కదా!

"ఒక చిన్న పిల్ల సార్" అమ్మాయి అనగానే తన వివేకానంద గురించి కాదు అని అర్థమయి ఊపిరి పీల్చుకుని విన్నాడు చైతన్య "ఇంకా మాటలు కూడా సరిగా రావు. షి ఈజ్ సఫరింగ్ ఫ్రమ్ థలసీమియా. మీకు ఐడియా ఉండే ఉంటుంది. జెనెటిక్ డిఫెక్ట్ కారణంగా బ్లడ్ సరిగా ఫార్మ్ అవదు. సో రిపీటెడ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషెన్స్ ఇవ్వాలి. తనది అసలే రేర్ బ్లడ్ గ్రూప్. వాళ్ళ పేరెంట్స్ ట్రీట్ మెంట్ అఫర్డ్ చెయ్యగలరు కాబట్టి అసలు ఇంతకాలం సర్వైవ్ అవుతోంది. ఎంతమనీ ఇచ్చినా బ్లడ్ బ్యాంక్ వాళ్ళు ఇంకో గ్రూపు బ్లడ్ అయినా డొనేట్ చేసి రీప్లేస్ మెంట్ చెయ్యమని అడుగుతున్నారు. అఫ్‌కోర్స్ వాళ్ళు అడిగేదీ కరెక్టే కదా సర్. ఎవ్వరూ డొనేట్ చెయ్యకుండా కొనుక్కుంటూ పోతే ఒక సంవత్సరానికంతా కొనుక్కోవడానికి కూడా ఎక్కడా బ్లడ్ దొరకదు కదా"

తనకు తెలిసిన విషయాలే అయినా ఆ అబ్బాయి అప్పుడే కనుక్కున్నట్లు ఉత్సాహంగా చెబుతూ వింటే వినబుద్దేస్తోంది చైతన్యకు. ఏ కొత్త విషయం తెలుసుకున్నా అందరికీ తను ఇలానేగా ఆవేశంగా తానే కనుక్కున్న విషయంలా చెప్పేవాడు అని గుర్తుకు చేసుకున్నాడు. ఒక ఇరవయ్యేళ్ళ క్రితం తనే అలాంటి మాడ్రన్ డ్రస్సులు వేసుకుని మాట్లాడుతున్నట్లు అనిపిస్తోంది. వస్త్ర వేషధారణ మారినంత మాత్రాన తరాల్లో మనస్తత్వాలు మారిపోవు.

"సో, ఇఫ్ యూ కెన్. ఐ మీన్ మీకేమీ ప్రాబ్లం లేకపోతే మీ బ్లడ్ గ్రూప్ ఏమైనా సరే డొనేట్ చేస్తారేమో అని.." అంటూనే అతను చైతన్య ముఖంలోకి చూసి" మీరేం కంగారు పడక్కర్లేదు. బ్లడ్ డొనేషన్ ఈజ్ అబ్జల్యూట్లీ సేఫ్ మీ నుంచి మరీ ఎక్కువేమీ తీసుకోరు.." అంటూ అందరికీ అలవాటుగా చెప్పే రక్తదానంలోని గొప్పదనం గురించి చెప్పబోయాడు.

"ఇంతకీ ఆ అమ్మాయి నీకు ఏమవుతుంది?" అడగకుండా ఉండలేకపోయాడు చైతన్య.

చాలా తేలికగా నవ్వాడు అతను. "జస్ట్ అక్వైంటెన్స్ సర్. టూ మంత్స్ బ్యాక్ బైక్ యాక్సిడెంట్ అయ్యింది, నాకూ మా చెల్లెలికీ" తన ఎడమ మణికట్టు దగ్గర మానిపోతున్న గాయం చూపుతూ" అప్పుడు మాతోపాటు వార్డులో ఉన్న ఈ పిల్ల, వాళ్ళ పేరెంట్స్ పరిచయం అయ్యారు. మాకు నయమయిపోగానే డిస్చార్జ్ అయిపోయాం. కానీ తన గురించి ఏదో ఒకటి చేయాలని మంత్లీ ఒకసారి వచ్చి బ్లడ్ డొనేట్ చేస్తున్నాం. నేను ఇప్పుడే ఇచ్చాను. మా చెల్లెలు ఈసారి రాలేకపోయింది. ఏదో ఉమెన్ ప్రాబ్లం" ఆ వయసు అబ్బాయి చెల్లెలి ఆడతనపు ఇబ్బంది ఏమిటో అర్థం చేసుకున్నాడు చైతన్య. రక్తం కోల్పోయే వయసు.

"ఈ మధ్య బ్లడ్ డోనర్స్ క్లబ్‌లో వాలంటీర్‌గా కూడా చేరాను. ఇలా కుదిరినప్పుడల్లా అందరికీ చెబితేనే కదా పబ్లిక్‌లో అవేర్‌నెస్ పెరిగేది అదేంటో బయట ఎక్కడ చెప్పినా అందరూ విన్నట్లే ఉంటారు కానీ, అదేపనిగా హాస్పిటల్‌కు వచ్చి డొనేట్ చెయ్యాలంటే టైం వేస్ట్ అనుకుంటారు. అదే ఇక్కడే ఉండే విజిటర్స్, పేషెంట్ రిలేటివ్స్ అయితే" పనిలో పనిగా" మంచిపని చెయ్యొచ్చు అని ఎక్కువ ఇంట్రెస్ట్ చూపుతారు అని.. " తననే మెరుస్తున్న కళ్ళతో చూస్తుండిపోతున్న చైతన్యకు ఇంకేం చెప్పాలో తెలియనట్లు ఊరుకున్నాడు ఆ అబ్బాయి.

ఆ అబ్బాయిని అడుగుదామని పెదవి చివరివరకూ పొడుచుకువచ్చిన ఒక ప్రశ్నను మనసులోనే మింగేసాడు చైతన్య "ఇవన్నీ చేస్తే నీకేం వస్తుంది?" ఎంతమంది అడిగారు ఈ ప్రశ్న తనను. మహానుభావుల చరిత్రలను చదివినప్పుడల్లా ఎన్నిసార్లు తనలో పుట్టినదీ ప్రశ్న? ప్రశ్న ఒకటే. కానీ ఇంతవరకూ సరి అయిన సమాధానం ఒకటంటూ లేదు. ఆత్మసంతృప్తి కోసం కొందరు, ఆవేశం చల్లార్చుకోవడం కోసం కొందరు, అహం తీర్చుకోవడానికి కొందరు. చివరకు అబ్సెషన్‌లా కొందరు. వీటిల్లో ఏదో ఒక కారణమే మనిషిని తక్కిన అన్ని జంతువుల్లోకీ ఉత్తమంగానూ, ఉత్కృష్టంగానూ నిలిపేది. మరి ఇవేమి లేనివాళ్ళు? స్కూలు బెల్లు మళ్ళీ మ్రోగుతున్నట్లు అనిపించింది చైతన్యకు. ఆ ప్యూనుకు ఇటువంటి ప్రశ్న ఎప్పుడూ ఎందుకు తలెత్తదు. తలెత్తినా తనలాంటివాడు ఎందుకు కోల్పోయాడు?

తర్వాత మాట్లాడుదాం అని ఆ కుర్రాడికి చెబుతుండగానే అతని ఆలోచనలు తన జీవితంలోని అతి ముఖ్యమయిన రోజుల్లోకి జారుకున్నాయి.

పెళపెళలాడే ఎండ. అతనికి నీడ అవసరంలేదు. భూమిని ముంచేస్తుందా అనేంత వాన. వీధి కుక్కల చాటునే అతడు. సమాజానికి అఖర్లేనదంతా అతనికి ఆహారం. బుద్ధ.

ఎండాకాలంలో స్కూళ్ళు చాలా ప్రొద్దున్నే మొదలవుతాయి. ఉదయం ఏడుగంటలకల్లా మధ్యాహ్నం ఒకటికంతా ముగించేసి ఇళ్ళకు పంపేస్తారు. మధ్యలోనే టిఫిన్ కోసం ఇచ్చిన బ్రేక్ టైంలో పిల్లలు ఇళ్ళల్లోంచి తెచ్చుకున్న కేరియర్‌లలో స్నేహం పంచుకుంటారు. చైతన్యకు నచ్చని తిండిపదార్థాల్లో మొదటిది పప్పు. అంత ఉదయాన్నే కష్టపడి ఇడ్లీలు చేసింది. ఆ స్కూలు సమయానికి చట్నీ చెయ్యలేకపోయిన అతడి తల్లి, రాత్రి మిగిలిన పప్పుతో కొంచెం కారంగా మిరపకారలు తగిలించి టిఫిన్ బాక్సులో ఉంచి పంపింది. ఆల్జీబ్రా లెక్కలు చూసుకుంటూ బాక్సు చూసిన చైతన్య పప్పు కళ్ళబడటంతో ముఖం చిట్లించుకున్నాడు. అయినా తిందాం అనుకుంటే, అప్పుడే పాస్తున్న వాసన. క్లాసులో అతను కిటికీ పక్కగా కూర్చుంటాడు. ఉదయం ఎండ తగులుతుంటే వేడిగా అనిపించినా, మాస్టారు బోర్డు మీద వ్రాసేప్పుడు రాలే చాక్‌పీసు పౌడరు ఆ కిటికీ నుంచి ఏటవాలుగా నేలమీదకు పాకే నీరెండలో చుక్కలు చుక్కలుగా ఏదో తమాషాగా కనిపిస్తుంటే చూడొచ్చని. ఆ ఎండ తగిలే పప్పు పాచి ఉంటుంది అనిపించింది అతనికి. అసలే నచ్చని తిండి. పైగా పాచిపోతోంది. దాని వాసన తగిలి ఇడ్లీలు కూడా అదే వాసన ఓడుతున్నాయి. బాక్సు మూసేసి ఆకలి చంపుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్ళేప్పుడు అనిపించింది, తినకుండా అలాగే తీసుకెళితే అమ్మ కోప్పడుతుందని. ఆ కోపాన్ని తప్పించుకోవడానికి మొత్తం వివరం చెప్పాలి. వంద ప్రశ్నలకు బదులివ్వాలి. ఇదంతా ఎందుకు, అసలు మిగిలిన తిండి పారేస్తే పోలేదా అనిపించి, తమ ఇంటికి మెయిన్ రోడ్డు మీదనుంచి కాకుండా ఒక సందులోంచి వెళ్ళాడు. అక్కడ మామూలుగా ఎవరూ రారు. దుర్గంధభరితమైన కుళ్ళు కాలువకు మూత ఉండదు. అన్ని ఇళ్ళ పెరళ్ళే ఆ సందును ఆనుకుని ఉండడంవలన ప్రతి ఇంటి చెత్తా అక్కడే పడుతుంది. ఆ చెత్త దగ్గర తన బాక్సును ఖాళీ చేసాడు. మరింత పెరిగిన మధ్యాహ్నం ఎండలో అతను పారబోసిన ఇడ్లీలు తళుక్కుమన్నాయి. ఇంకొక మూడుగంటలు గడవడం చేత పప్పు మరింత పాచి అంత మురికి కాల్వ కంపులో కూడా తన ప్రత్యేకతను చాటుకుంటూ వాసనేసింది. చెత్తలోంచి ధూళి లేచి ఎగిరేందుకు విఫలయత్నం చేసి నేలరాలిపోతుంటే, పక్కనే ఉన్న చిన్ని నీటిగుంటమీద ఆయిల్ తెరలో రామన్ ఎఫెక్ట్‌లోలా రంగులు తేలుతుంటే ఒక ఘడియ సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండిపోయాడు చైతన్య. ఆ నీటిగుంటలో ఒక నీడ తన వెనక ఎవరో వస్తున్నట్లు అనిపించి ఉలిక్కిపడి చూసాడు. అస్థిపంజరంలాంటి ఒళ్ళు వేసుకుని ఒక మనిషి.

కళ్ళచుట్టూ గుంతలు ఉన్నా కనుపాపలో ఎర్రటి జీవం. అట్టలు కట్టుకున్న జుత్తు, విరిగిన పళ్ళు, మొలకు ఎన్నాళ్ళనుంచో అతుక్కుపోయినట్లున్న చిన్నపాటి గుడ్డముక్క అతను తన వేపే అడుగులేస్తుంటే భయపడిపోయి ఒక్క ఉదుటున సందులోంచి మెయిన్ రోడ్డు మీదకు పరుగెత్తాడు. జనం మధ్యలోకి రాగానే సురక్షితంగా అనిపించి వెనక్కు చూసాడు. ఆ ఎముకలగూడు తను పారేసిన ఇడ్లీలను దోసిళ్ళలోకి తీసుకుంటున్నాడు. మీద ఉన్న పాచిపోయిన పప్పుతో సహా. ఇప్పుడు ఆ ఇడ్లీలమీదకు పక్కన ఉన్న నీటిగుంట తాలూకు ఆయిల్ కూడా అతుక్కోవడం చైతన్య గమనించాడు అతను చూస్తుండగానే ఆ మనిషి అదే చెత్తలో ఒక మూలగా కూర్చుని సావకాశంగా ఒక్కొక్క ఇడ్లీనే తినసాగాడు. అతని ముఖంలో ఏ తడబాటూ లేదు. ఏ మలినమూ గ్రహించినట్లు లేడు. "చెడిపోయిన వస్తువులు తింటే సూక్ష్మజీవులు కడుపులో చేరి ఎన్నెన్నో జబ్బులు వస్తాయి" స్కూలులో ఆరోగ్యశాస్త్రం చెప్పే మాస్టారు చూపించే పోస్టర్లూ, వివరించే జబ్బులూ అనీ గుర్తుకువచ్చాయి. కానీ ఆ మనిషికి అవి చెప్పే ధైర్యం చేయలేకపోయాడు. బాగా దిగాలు పడిపోయి, ఆ రాత్రి ఏమీ చదవకుండా అతని గురించే ఆలోచిస్తూ నిద్రపోయాడు. కలలో అతడు రక్తం కక్కుకుని చనిపోవడం చూసాడు.

ఉదయం లేచిన వెంటనే త్వరత్వరగా స్కూలుకు బయలుదేరాడు. దారిలో ఆ సందు చివర వేచి చూస్తే.. అతడు కనిపించలేదు. శవంగా ఏ మూలపడ్డాడో అని కొంచెం ధైర్యం చేసి సందులోపలకు వెళ్ళిచూసాడు కనిపించలేదు. ఆ రోజు అతనికి ఆకలి వేయలేదు. కానీ టిఫిన్ పారవేయబుద్ధి కాలేదు. యాంత్రికంగా తిన్నాడు. ఆ మనిషి చచ్చిపోయాడా? తాను పారబోసిన తిండి తినే చచ్చిపోయినట్లయితే, అతని చావుకు కారణం ఎవరు? చాలా భయం వేసింది. అతను చచ్చిపోతే న్యూసుపేపర్లలో వార్త వస్తుందా? పోలీసులు వస్తారా? ఎందుకో తెలియలేదు కానీ, అలాంటివేమీ జరగవు అనిపించింది. ఇంట్లో మనిషి చచ్చిపోతే పదిమంది మాట్లాడుకుంటారు, పెద్ద వ్యక్తులు విషాహారం తిని చస్తే అపరాధపరిశోధకులు, సైంటిఫిక్ ల్యాబ్‌లు ఇన్నిటి సహాయంతో చావుకు కారణం వెతుకుతారు. మనిషి హోదాను బట్టి అతడికి న్యాయం ఎందుకు మారుతుంది? అసలు ఇలా ఒక మనిషి ఒక మురికిగుంట పక్కన బ్రతికేస్తుంటే ఎవరూ పట్టించుకోలేందుకు? మున్సిపాలిటీలో చెత్త ఏరేవాళ్ళు, రోడ్లు ఊడ్చేవాళ్ళు ఉంటారుగా.. వారయినా ఎందుకు ఇతడిని ఏమయినా చేయలేదు. అసలు మునిసిపాలిటీ గురించి, వాళ్ళ డ్యూటీల గురించి టెక్స్ట్ పుస్తకాల్లో చదువుతున్నాను, అప్పుడప్పుడూ ఖాకీ యూనిఫాం వేసుకున్న వాళ్ళను చూస్తున్నాను కూడా అయినా.. ఊర్లో అంత చెత్త ఎలా పోగయింది. పుస్తకాల్లో వ్రాసినట్లు జరగాల్సినవి ఎందుకు జరగలేదు.

చైతన్యలో చాలా కొత్తరకం ప్రశ్నలు మొదలయ్యాయి. పుస్తకాల్లో ఉన్నదల్లా నిజం కాదేమో అనే అనుమానం పుట్టుకు వచ్చింది. పుస్తకాలకు మించిన చదవవలసినదేదో చుట్టూ ఉండే మనుష్యులలోనూ, వారి జీవితాల్లోనూ ఉందని రూఢి అయ్యింది. మొదలుపెట్టాడు. చదవడం స్నేహితులను, మాస్టార్లను, తల్లితండ్రులను, ఆరోగ్యాన్ని చెప్పే మాస్టారు జేబులో తొంగిచూసే సిగరెట్టు పెట్టె కనిపించింది. క్రమశిక్షణ అంటూ అందరినీ హడలు కొట్టే హెడ్మాస్టరు అరటి తొక్కను రోడ్డు మధ్యలో పారవేయడం ఏమిటీ అనిపించింది. తమకయితే సినిమా టిక్కెట్లూ, ఇంటర్వెల్‌లో కూల్ డ్రింకులూ కొనడానికి వందరూపాయలు వెచ్చించే తండ్రి ఆకలేస్తోంది అంటూ చేయిజాచే బిచ్చగత్తెకు కేవలం ఒక రూపాయి ఇచ్చి దాంతోనే ఆమె బ్రతికేస్తుంది అనుకోవడం ప్రశ్నలు రేపింది. పుస్తకాలకంటే వార్తా పత్రికలు అద్భుతమైనవిగా తోచాయి. ఒక్కడూ ఒకరోజు చెప్పిన మాట ఇంకోరోజు తనే ఒప్పుకోడు.

మనుష్యులు చచ్చిపోవడం అతి సాధారణం అయిన విషయం అనిపించింది. ఒక దినపత్రికలో ఒకరోజు మళ్ళీ చూసాడు, ఆ ఎముకలగూడులాంటి మనిషిని తమ ఊరి శివార్లలోని చెత్తకుప్ప దగ్గర అతడేవో ఏరుకుని తింటుండగా ఎవరో విలేఖరి ఫోటో తీసి, మానవజీవితం గురించి ఆర్ద్రంగా కవిత వ్రాసి ప్రచురించాడు. ఉరుకులు పరుగుల మీద సైకిలు తొక్కుకుంటూ అక్కడకు వెళ్ళిచూసాడు.

ఆ మనిషి ఉన్నాడు. బ్రతికే పసివాడిలా నిద్రపోతూ. కొంచెం దూరంగా కొన్ని పందులు. కాలువ మురికి ఓడుతూ పెద్దవి అసహ్యంగా ఉన్నా, చిన్నవి చూడముచ్చటగా ఉన్నాయి. రెండింటిలోనూ అవే మురికి, అదే కంపు. పందిపిల్లను చూస్తే ముచ్చట వేస్తుంది, ఊరపందిని చూస్తే చూపు తిప్పుకోబుద్దేస్తుంది, పందిలా బ్రతికేస్తున్న మనిషిని చూస్తే "నేనేమీ చూడలేదు" అని మనసును మోసం చేసుకునేంత బాధ వేస్తుంది. జీవితం ఒకటే. శరీరాలే వేరు. ***శరీరాలకు అతీతంగా జీవిని, జీవితాన్ని ప్రేమించడం సాధిస్తే మనిషి సార్థకం.***

యాధృచ్చికంగా అంతకు కొన్ని నెలల క్రితమే చైతన్య బుద్ధుడి గురించి చదివాడు. అప్పటికే సైన్సు ఎక్కువ చదివి దేవుళ్ళ మహిమలయందు ఏ నమ్మకమూ లేని నాస్తికుడిలా తయారయిన అతడికి మనిషికి మించిన శక్తి ఏదో ఉంటే తప్ప ఆ పందుల మధ్య అలా ఒక వ్యక్తి అత్యంత హేయమయిన స్థితిలోనూ బ్రతకగలడా అనిపించింది. దేవుడున్నాడా లేడా అనే మీ మాంసను పక్కనపెట్టి వ్యక్తిగత జీవితం గురించి ఏ ఆశలూ కోరికలూ లేకుండా బ్రతకడం అంటే ఆ మనిషిలా ఉండటమే అని, అతనికి "బుద్ధ" అని నిక్ నేమ్ పెట్టుకున్నాడు.

అప్పటికి చైతన్య ఎనిమిదవ తరగతిలోనే ఉన్నాడు. కానీ అప్పటికే అతనిలో ఐహిక సుఖాలంటే విరక్తి. ఏవి సాధించాలని తన కొడుకుకు విద్యను అందిస్తున్నాడో ఆ విద్య ద్వారా తన కొడుకుకు అటువంటి కోరికలే లేకుండా పోయాయె తెలియని అతని తండ్రికి

మాత్రం చైతన్య వింత ప్రవర్తన అర్థం అయ్యేది కాదు. కొత్తబట్టలు కొనిచ్చినా ఎక్కువగా వేసుకోడు. స్కూల్ యూనిఫారం తప్పితే మిగతా బట్టలకూ ఇస్త్రీ కూడా ఉందా లేదా అని చూసుకోడు. అతను అడిగితే కొత్త సైకిల్ కొనిద్దాం అనుకుంటే అదేమీ కోరక తాను బట్టలు అమ్మేందుకు వాడిన పాత డొక్కు సైకిలుపైనే తిరిగేవాడు. ఏ ఒక్కరోజూ వంట బాగోలేదని వంక పెట్టగా చూడలేదు. ఎంత వర్షం పడినా ఎక్కడా ఆగకుండా తడుచుకుంటూ వచ్చేస్తాడు. వారానికొకసారి అయినా తన బుద్దుడు ఉన్నాడా అని చూసుకు వచ్చే చైతన్యకు ఒకసారి అతను కనిపించలేదు. పదవ తరగతి స్కూలు ఫస్ట్ వచ్చాక ఇంటర్ చదువులకోసం విశాఖపట్నంలో హాస్టల్‌లో ఉండేందుకు వెళ్ళేటప్పుడు కూడా అతని కోసం వెదికాడు. కానీ జీవితంలో మళ్ళీ ఆ మనిషి కనిపించనేలేదు. కంటికి దూరమయినా ఆ మనిషి రూపం చైతన్య మనస్సుపై చాలా చిక్కగా అల్లుకుని అతని ఆలోచనా స్రవంతిని అమితంగా నియంత్రించింది. ***మానవ చరిత్రను తిరిగి రాసేదయినా మనిషిని నిర్వచించేదయినా ఆలోచనే. ఒక అంటువ్యాధిలా మనిషినుండి మనిషికే ప్రవహిస్తుంది.***

"చే"

ఆలోచనలన్నీ ఇగిరిపోతుండగా కళ్ళ ఎదుటగా మసకగా కనిపిస్తున్న పాదాలవంక చూసాడు చైతన్య. ఆపరేషన్ థియేటర్ నుంచి స్టెరిలైజ్ చేసిన బట్టల శుభ్రత గుప్పుమమంటుండగా అశ్వినీదేవతలా కనిపించింది రాధిక. అసంకల్పితంగానే కుర్చీలోంచి పైకి లేవబోయాడు చైతన్య. కళ్ళతోనే వారిస్తూ అతడి పక్క కుర్చీలో కూర్చుంది రాధిక. ఆమె ముఖం చూసి వివేకానంద పరిస్థితిని అంచనా వేయడానికి అతను ప్రయత్నం చేస్తుండగానే,

"టెక్నికల్‌గా ఆపరేషన్ ఏ ఇబ్బంది లేకుండా జరిగింది. వీవా మాత్రం ఇంకా అనస్థీషియా ఎఫెక్ట్‌లోంచి మేల్కోవడానికి ఒక గంట పడుతుంది. నువ్వు కాని తనను ఈలోగా చూడాలి అంటే.. " చూస్తావా అనే ప్రశ్న ఆమె కనుగొనలనుంచి ఆశపెట్టింది. ఎందుకో చైతన్యకు గుండెదడ పెరుగుతున్నట్లు అనిపించింది. వివేకానందను చూడకపోయినా, ఆపరేషన్ తర్వాత తలకు కట్టుతో, ఒంట్లోకి సూదులు సెలైన్లు వెళుతూ ఉంటే ఎలా ఉంటాడో ఊహించుకున్న చైతన్యకు ధైర్యం చాల్లేదు.

"ఫర్లేదు చూద్దాం రా" చేయి పట్టుకుని అతడిని లేవదీసింది రాధిక. అతను ఊహించినట్లే బెడ్‌లో సుకుమారంగా పడుకుని ఉన్నాడు వివేకానంద. ఒంట్లోని రక్తం అంతా గడ్డకట్టినట్లు బుగ్గలు పాలిపోయాయి. శ్వాస తగిలి లేత పెదవులు సన్నగా కంపిస్తున్నాయి. తల చుట్టూ కట్టు ఉండడంతో ముఖం మరింత చిన్నదిగా అనిపిస్తూ తాకడానికి కూడా భయమేసేంత సుకుమారంగా కనిపిస్తోంది. ఎంతో బాధను దాచుకున్నట్లు పిడికళ్ళు బిగుసుకుని ఉన్నాయి. చైతన్యకు ఉద్వేగంతో కన్నీరు పొంగింది. పరిసరాలు మరచిపోయాడు. పరిస్థితి మరిచిపోయాడు. వర్తమానం తాలూకు ఆనవాలు స్ఫురించలేదు. రాధిక ఒకప్పటి తన మనిషిలానే అనిపించింది. ఆ రోజుల్లో తనకు ఆమెతో ఉన్న చనువు ఇప్పుడు ఉందా లేదా అని ఆలోచించక, హఠాత్తుగా ఆమెను పొదివి పట్టుకుని, గద్గదమయిన స్వరంతో "చాలా థాంక్స్ రాధీ" అనేసాడు. ఆమెకు ఏం చేయాలో తెలియలేదు. అతడి చేతులు ఆమె వీపు మీద అసహాయంగా వాలిపోతున్నాయి. తన భుజం కన్నీటితో తుడవడం తెలుస్తోంది ఆమెకు. "నువ్వు లేకపోతే.." అతని మాటలు వెక్కిళ్ళలో ఇగిరిపోయాయి. అటుగా వస్తున్న నర్సు ఒకరు ఎవరో పేషెంటు తాలూకు వ్యక్తి తమ డాక్టరును అలా కౌగిలించుకోవడం చూసి ఏమయినా అవాంఛనీయ సంఘటన జరుగుతోందా అన్నట్లు పరుగున సమీపించింది. ఆమె ముఖంలోని ఆందోళన చూసి, పరవాలేదన్నట్లు చేతితో సైగ చేస్తూ, మెల్లగా చైతన్య భుజాన్ని నిమురుతూ "ఇట్స్ ఓకే.. చే ఇట్స్ ఓకే" అంది. అతడి మనసు కరిగిపోతూనే ఉంది. ఆమె చేతులు చాలడం లేదు "నా చే ఇలా ఏడవడమా" హృదయాంతరాలలో సంవత్సరాలనుండి గూడు కట్టుకున్న అభిమానం కట్టలు తెంచుకుంది. అతడిని మరింతగా దగ్గరకు తీసుకుంది. నర్సు తనేమీ చూడలేదన్నట్లు చప్పున చూపు తిప్పేసుకుంటూనే క్రీగంట కుతూహలం నిలుపుకుంది. ఒకరినొకరు పొదువుకుని ఒదుగుకున్నారు.

*ఇద్దరి జీవితాలను తాను ఎంత మారుస్తున్నాడో ఏమీ తెలియక అమాయకంగా నిద్రపోతున్నాడు వివేకానంద.*

## 14

**అమీబా. అమీబా. రూపు లేని జీవం.** ఎటు కాలు మెదిపితే అటు పొడుచుకువచ్చే ఆకారం. జీవితం అంటే నిరంతరం మారిపోతూ ఉండటమే అనేందుకు సజీవమయిన ఉదాహరణ జీవితమే. మనిషికి పాఠాలు చెప్పే ప్రథమ గురువు ప్రకృతి. పాఠాలను అర్థం చేసుకునేందుకు మనం నేర్చుకునే భాష "చదువు" . మబ్బులు ఆకాశంలో అచ్చంగా అమీబాల్లానే కదులుతుంటాయి. ఏ పుస్తకమూ ఈ విషయం చెప్పదు కదా. నిజాన్ని నిజంలా చెబితే శాస్త్రం. ఒక నిజాన్ని మరో నిజంతో పోలిస్తే కవిత్వం. పేర్లు మార్చి మార్చి అసలు చదువు అంతా ఒకటే అనే విషయాన్నే దాచేస్తున్నాయి చదువులు. మబ్బూ మబ్బూ ఒకదానిలొకొకటి ఢీ కొట్టుకుంటే ఒక పెద్ద కొత్త మబ్బు రావొచ్చు లేదా అదేలాంటి అనేకమయిన చిన్న మబ్బులుగా విడిపోవచ్చు. అచ్చంగా సెక్స్‌లా లేదూ! ఆడామగా శరీరాలు ఒక ఆత్మ అవ్వొచ్చు క్రోమోజోమ్స్ విడిపోయీకలిసిపోయీ పిల్లరాక్షసులు పుట్టొచ్చు.

ఫక్కున నవ్వేసింది రాధిక. కళ్ళల్లోంచి నీళ్ళు చెమ్మగిల్లాయి. ముఖమంతా తడిసిపోతోంది. ఆమె తలపైన షవర్ ఆగకుండా కురుస్తూనే ఉంది. తనకూ చైతన్యకూ మధ్య జరిగిన మాటలూ, అల్లుకున్న లోచనలూ కలగలసిపోయి ఆమె జ్ఞాపకాలలో ఎగసిపడుతుంటే, చల్లటి నీటి ధారల్లో ఆమె నగ్నత్వం నానుతోంది. వివేకానంద ఆపరేషన్ పూర్తయ్యాక తన జీవితం సార్థకం అయ్యిందనిపించేంత తృప్తిగా ఉంది ఆమె. ఎక్కువ సంతోషం కలిగినప్పుడు దాన్ని పంచుకోవడానికి ఒక్కోసారి మనుష్యులు సరిపోరు. ఆమెకు వాన కావాల్సివచ్చింది. లోహపు మబ్బులాంటి షవర్‌ను ఆశ్రయించి చిన్నపిల్లలా తడిసిపోతుంటే చైతన్య కౌగిలి గుర్తుకొచ్చి ఎద మొద్దుబారిపోయింది. అతను కౌగిలించుకున్న క్షణం అతనిలోని వేదనా, తనలోని లాలన తప్ప మరే ఆలోచనా లేదు. కానీ క్షణం గడిచిపోయిన కొంత సమయం తర్వాతనుంచి తలుచుకుంటుంటే వింతగా అనిపిస్తోంది. ఆసందర్భంలో అతను తనమీద, సరిగ్గా చెప్పాలంటే తన శరీరమ్మీద చేతులు వేయడం గమనించిన నర్సు ఆందోళనగా అడ్డుకోబోతే వారించిన తనే ఇప్పుడు అదే నర్సు దృష్టినుంచి తనను చూసుకుని విస్తుబోతోంది. ***మనిషి ప్రతిరూపం అతని కళ్ళలోంచి కనిపించే పద్ధతికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది సమాజం కళ్ళల్లోంచి చూస్తే. తనలోలేని కల్మషాలూ, తను ఆపాదించుకోని అర్థాలూ అన్నీ తోస్తాయి తనను తాను వేరే మనిషిలా విశ్లేషించుకుంటే.*** అతనేమిటి తనను అలా కౌగిలించేసుకున్నాడు. నిజమే వివేకానందను అలా చూసి తట్టుకోలేకపోయాడు. కానీ మరీ పరిసరాలు చూసుకోనక్కర్లేదా ? అది నేను పనిచేసే చోటు. నాకంటూ ఒక గౌరవం, గుర్తింపు ఉన్న ప్రదేశం. అక్కడ అలా చేసేసాడేమిటి? ఛ. ఏమిటి నాకు ఇంత అహం. అదీ చే దగ్గర. "నువ్వు పే....ద్ద డాక్టరువయితే నేనే కదా హ్యాపీ " ఎన్నిసార్లు ఆ కళ్ళు నన్ను ప్రోత్సహించాయి. అసలు ఆ మాటలే లేకపోతే తన ఆశయసాధనకోసం అంత పట్టుదల ఎక్కడినుంచి వచ్చేది. చే నాకు గురువూ, నాన్న కూడా.

"నాన్నా ?! హవ్వ హవ్వ.. పిచ్చిపిచ్చిగా మాట్లాడొద్దు. ఇన్సెస్ట్ అవుతుంది అప్పుడు "

"బోడి ఫ్రాయిడ్ థియరీలు చెప్పొద్దు. అమ్మ, నాన్న, పిల్లలు అన్నీ ఒకే మనిషిలో చూడొచ్చు, అదీ సెక్స్‌లో కూడా"

" అబ్బా..సెక్స్ గురించి మాట్లాడటమే. నువ్వు. దెయ్యం వేదాలు వల్లించినట్లు, వర్జిన్ సెక్స్ సైకాలజీ థియరీలు చెప్పడం"

"సెక్స్ గురించి వర్జిన్‌కు తెలిసినంతగా ఎవ్వరికీ తెలియదు. పుట్టబోయే బిడ్డగురించి తల్లికి తెలిసినట్లు" జవాబు చెప్పలేక, తన వాదనలో ఓటమినొప్పుకోలేక, తనను మెచ్చుకోకుండా ఉండలేక, అసలు తొణకనట్లు బెణకనట్లు నటించలేక అవస్థపడిన చైతన్య

ముఖకళవళికలు గుర్తుకువచ్చి ఆమె కళ్ళలో నవ్వుతడి ఊరింది. తడిని తనలో కలిపేసుకుంటూ షవర్ నీరు ఆమె ఒంటిమీదినుంచి జారిపోయింది. ఆ రోజు కూడా అతను నన్ను కౌగిలించుకున్నాడు. కౌగిలింతలేవీ శృంగార పూరిత ఉద్దేశ్యాలతో పుట్టినవి కాకపోయినా బిగికౌగిళ్ళల్లో స్పందించేది మనసు మాత్రమే కాదు. చర్మంచాటు నరాలూ కూడా. అతని చెవికీ మెడకీ మధ్య ఒక రకమయిన వాసన ఆమెకు సుపరిచితం. తలస్నానం చేసినప్పుడు ఒకరకంగా, నూనె పెట్టినప్పుడు ఒకరకంగా. అతని అరచేతులు చాలా మందం. ఎక్కువ చెమటపట్టేవి. ఎప్పుడూ చల్లగా అనిపించేవి. అతని ఛాతీచాలా గట్టిగా ఉంటుంది. సమాజం, విలువలూ అన్నిటినీ పక్కనబెట్టి అతనితో శారీరిక సాన్నిహిత్యాన్ని కౌగిళ్ళనుంచి ఇంకాస్త పెంచుదామని ఎన్నిసార్లు తనకే అనిపించినా పెళ్ళి తర్వాత సగర్వంగా, ఇతను నావాడు అని అనిపించుకున్నాక , నేను అతనిదాన్ని అని అందరితో అనిపించుకున్నాక... అప్పుడు...ఏమిటేమిటో ప్లాన్లు. ***రేపు బ్రతుకుతాను అని ఖచ్చితంగా చెప్పలేని మనిషి శరీరాన్ని తృప్తి పరుచుకునేందుకు భవిష్యత్తులో ముహూర్తాలు నిర్మించుకోవడమే కాబోలు జంతువునుండి ఎదగడం అంటే. శరీరంతో జంతువులా చేసే చర్యలన్నిటినీ మనసుతోనూ చేయగలిగిన శక్తి మనిషికి పెద్ద శాపం.***

మనసుతో రాధిక చైతన్యతో కౌగిళ్ళకంటే చాలా ఎక్కువే చేసింది. అతడితో కూడా సిగ్గువిప్పుకుని చెప్పుకోలేనన్ని అందమయిన కలలుకన్నది. తన దేహంలో మెడవరకే పరిమితమయిన అతని చూపులు మెడక్రిందకు జారితే అతనెలా ఉద్రేకపడతాడో ఊహించుకుని గర్వపడిన క్షణాలు గుర్తుకువచ్చి స్నానంలో సన్నగా కంపించింది రాధిక. తప్పు తప్పు. ఇప్పుడు అవన్నీ గుర్తుకుచేసుకోకూడదు. అసలు అంత నిర్దయగా అతను తనను ఎలా కాదనగలిగాడు? ఏవో ఆశయాలనీ.. వాటికోసం తనను ఒద్దు అనుకుంటాడా ! ఎంత పొగరుబోతు. పొగరు కాదు మూర్ఖత్వం. మూర్ఖత్వంతోనే అసలు ఇదంతా జరిగింది. అతనేకానీ ఆ రోజు తన మాట విని ఉంటే, ఆచరించ సాధ్యంకానీ ఆశయాలను వదులుకో సిద్ధపడిఉంటే.. "నాకో పెద్ద ఫాంటసీ ఉంది తెలుసా. మన పెళ్ళయ్యాక ప్రతిరోజూ ఇద్దరం కలిసి స్నానం చెయ్యాలని "ఒక చలికాలం సాయంత్రం అతను తన చెవిదగ్గర జల్లిన చిలిపి గుసగుసలు ఆమె జ్ఞాపకాల్లో ఘల్లుమన్నాయి. హడావుడిగా షవర్ ఆఫ్ చేసి బయటపడింది. అతను తనను మళ్ళీ కౌగిలించుకోవాల్సింది కాదు. ఆ క్షణంలో స్ఫురించలేదు కానీ ఇప్పుడు మెల్లగా గుర్తుకువస్తోంది రాధిక. అతడి చేతులు ఇప్పటికీ అలానే ఉన్నాయి. తడిగా, మందంగా. అతడి చెంపలకింద అదే చెమట వాసన. అతను తనను కౌగిలించుకున్నప్పుడు ఎవరయినా ఫోటో తీసిఉంటే బావుండేది. ఎలా ఉన్నామో. అసలు అలా ఎలా ఉంటామో ఎప్పుడూ చూసుకోనేలేదు. మబ్బూ మబ్బూ కలిస్తే ఏమవుతుంది.. అతని సమాధానాన్నే గుర్తుకుచేసుకుంటూ హడావుడిగా చీర చుట్టుకుని పరధ్యానంగా మంచంలో మోకాళ్ళు ముడుచుకుని కూర్చుంది. కౌగిలిలో చే ఛాతీ స్పర్శతాలూకు జ్ఞాపకం ఆమె ఎదలోపలినుంచి వెచ్చగా మండుతోంది. తప్పు కదా... ఇంకొక మగవాని స్పర్శను గుర్తుకుచేసుకోవడం. మనసును, మాటను, చూపును తలుచుకున్నా తప్పులేదు కానీ శరీరాన్ని తలుచుకోవడమే ! ఏదో తెలియని అపరాధ భావంతో ఆమెలో గుబులు పుడుతుంది

"బిజీనా, ఆయన ఏమిటో మాట్లాడాలి అంటున్నారు" ఆమె ఆలోచనలకు విశ్రాంతినిస్తూ తలుపు తీసుకుని గదిలోకి వచ్చింది పూర్ణిమ. మూడురోజులనుండి ముఖ్యమయిన విషయం మాట్లాడాలి అంటున్న తండ్రితో వివేకానంద సర్జరీ అయ్యాక మాట్లాడుదాం అని చెప్పిన సంగతి గుర్తుకుచేసుకుని తల్లిని పదమని చెప్పి, చైతన్య ఊసులను గదిలోనే వదిలేసి బయటపడింది.

అమెరికానుంచి వచ్చాక ఏ ప్రస్తావనను అయితే తప్పించుకోజూస్తోంది, ఆ వేళ దానికి దొరికిపోతానని ఆమెకు తెలియలేదు.

" నా మాట వినురా" నారాయణరావు స్వరంలో హఠాత్తుగా ప్రేమ ఎక్కువవడం రాధిక గమనించకపోలేదు. ఆయన ఇక తనను ఎలా అయినా ఒప్పించేస్తాడని ఆమెకు అర్థమవుతోంది. "ఈ కాలేజ్‌లోనే చేరరా", "అబ్బాయి మంచివాడు రా" ,"ఈ పెళ్ళికి ఒప్పుకో రా" తన జీవితానికి సంబంధించి ముఖ్యమయిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సందర్భాల్లో ప్రేమ కురిపించి తను ఆయన

మాటే వినేట్లు చేసుకోవడంలో తండ్రి సిద్ధహస్తుడు అని ఆమెకు ఎన్నోసార్లు అనుభవమే అయినా ప్రతిసారీ ప్రేమముందు బలహీనపడిపోతుంది. ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ తన మాట నెగ్గించుకోవలని పట్టుదలగా ఉంది.

ఇంతటికీ కారణం అయిన వ్యక్తి ఫోటోఉన్న పుస్తకం వాళ్ళిద్దరి మధ్య టేబుల్ పైన రెపరెపలాడుతోంది. అదే వ్యక్తి నిలువెత్తు బొమ్మ ఉన్న ఒక క్యాలెండర్ గోడమీద మేకుకు ఉరేసుకుని ఉంది. ప్రపంచం కళ్ళతో చూస్తే వ్యక్తి ఒక స్వామీజీ. ఆధ్యాత్మిక గురువు. నారాయణరావు దృష్టితో చూస్తే అతను "అవతార పురుషుడు". అమ్మ మాటల్లో అయితే "దేవుడు". తన దృష్టిలో అతను కేవలం మరో వ్యక్తి. చైతన్యకాని తన పక్కన ఉంటే ఎంత బావుండేది అనిపించింది.

"నిజంగా చెప్పాలంటే నాకు ఇష్టం లేదు నాన్నా" అంతకన్నా ఖచ్చితంగా ఎలా చెప్పాలో తోచలేదు ఆమెకు

"ఏంటమ్మా. ఎన్నిసార్లు అడిగినా అలా అంటావ్. జస్ట్ నాకోసం ఒప్పుకో. తర్వాత చూడు నువ్వే చాలా హ్యాపీగా ఫీల్ అవుతావ్" నారాయణరావు పట్టు వదలకుండా రాధికను ఒప్పించచూస్తున్నాడు. మాట్లాడకపోయినా తనూ ఆయన పక్షమే అన్నట్లు చూస్తోంది పూర్ణిమ. ***మనగురించి వ్యతిరేకంగా మాట్లాడేవారు శత్రువులు, మనకోసం మాట్లాడేవారు మిత్రులు, మనగురించి ఏమీ మాట్లాడని వారు ఏమీ కానివారిగానే మిగిలిపోతారు.*** తల్లినుంచి కూడా తనకు మద్దతుకుదరకపోవడంతో, ఈ స్వామీజీ సేవ నుంచి ఎలా తప్పించుకోవాలో అర్థంకాలేదు రాధికకు. అతనికి చాలా మహిమలు ఉన్నాయి అంటుంది తల్లి . అతని దగ్గరకు వెళ్ళివస్తే మనసుకు ప్రశాంతత, ఏదో బలీయమయిన ఆధ్యాత్మిక శక్తి తోడుగా ఉన్నట్లు అనిపిస్తుందనీ తండ్రి, ఆయన చెప్పినట్లు చేస్తేనే వ్యాపారంలో లాభాలు వస్తాయని తమ్ముడూ, ఆయనను అప్పుడప్పుడూ దర్శించుకోవడానికి వెళితే అక్కడకు వచ్చే మిగతా భక్తులతో పరిచయాలు పెరుగుతాయని రాజు... ఇలా తన కుటుంబంలో అందరూ ఒక్కొక్క కారణంతో స్వామీజీ భక్తబృందాల్లో కలిసిపోతుంటే తాను మాత్రం దూరంగా ఉండిపోయిన రాధికను, స్వామీజీ నిర్వహిస్తున్న హాస్పిటల్లో హానరరీ కన్సల్టెంట్‌గా ఉండేందుకు ఒప్పుకొమ్మని ఒత్తిడి చేస్తున్నాడు నారాయణరావు. నయంకాని జబ్బులు ఉన్న రోగులను కూడా తన దర్శనభాగ్యంతోనే ఆరోగ్యవంతులు చేసే శక్తులున్న స్వామీజీ మళ్ళీ వైద్యశాస్త్రం చదువుకున్న డాక్టర్లూ, హాస్పిటలూ నిర్మించాల్సిన అవసరం ఏముందీ అంటుంది రాధిక.

"నువ్వు అనుకున్నట్లు కాదురా. నిజం. ఈ ఎక్స్‌పీరియన్స్ విను. పోయినసారి అక్కడకు ఎవరో మళయాళ సినిమా నటుడు వచ్చాడు. యాక్సిడెంట్ వల్ల కాళ్ళు ఇక తీసేయాల్సిన పరిస్థితి. స్వామీజీ ఇలా తాకారు, అతను వీల్ చైర్ లోంచి నడుస్తూ.." నారాయణరావు చెబుతుంటే ఆమెకు ఇక వినబుద్ధి కాలేదు. దేవుడు స్వామీజీ కాదు చైతన్య ఏమో. ఇలాంటిదేదో జరుగుతుందని అప్పుడే ఎలా ఊహించగలిగాడు. తొమ్మిదేళ్ళ క్రితం విడిపోయేప్పుటి తమ సంవాదంలోని అతని మాటలు ఆమె గుర్తుకుచేసుకుంది.

"హలో చైతన్య ఉన్నారా"

"..వాడు ఎక్కడికో బయటకు వెళ్ళాడమ్మా. మీరు ఎవరు ?"

"నా పేరు, రాధిక"

"క్లాస్‌మేటామ్మా?"

"వైజాగ్‌లో ఫ్రెండ్స్ అండీ. మీరు .."

"చైతన్య ఫాదర్‌ను"

"నమస్తే అంకుల్. తను వస్తే నేను కాల్ చేసానని చెబుతారా ప్లీజ్"

"తప్పకుండామ్మా"

"హ..లో.."

"ఎవరు కావాలండీ .."

"చై..త..... "

"వాడు ఎవరో ఫ్రెండ్స్‌తో బయటకు వెళ్ళాడమ్మా.. ఎవరూ.."

" రాధిక అనీ. మార్నింగ్ అంకుల్ మాట్లాడారు ఆంటీ"

"చెప్పారు. ఆయన కూడా ఇంట్లో లేరు. వచ్చాక చెబుతానమ్మాయ్"

-- - - - - - - - - -- - - - - - --- --------

" చైతన్య ఇంకా రాలేదా అంకుల్? "

"ఎవరూ..రాధికేనా ? వచ్చాడమ్మా..చెప్పాను .."

"... "

"మీ నెంబరు ఉన్న పుస్తకం వైజాగ్‌లో మరచిపోయాడంట. ఈసారి చేస్తే నెంబరు తీసుకోమన్నాడు"

"కొంచెం వ్రాసుకుంటారా అంకుల్.."

-- - - - - - - - - -- - - - - - --- --------

"హలో.. అమ్మాయ్. తను ఫోన్ చేయలేదా ? ఇంట్లో ఎస్టీడీ లేదు. బయటకు వెళ్ళి చేస్తాను అన్నాడే"

"ఓ థ్యాంక్స్ అంకుల్"

-- - - - - - - - - -- - - - - - --- --------

"హలో.."

"చే"

"ఇంతకుముందు ఫోన్ రెండు రింగులు కొట్టి ఆగిపోయింది. నువ్వేనా కాల్ చేసింది"

ఫోనుల్లో ముఖాలు కనిపించవు కదా అని సంతోషపడింది రాధిక. అతను ఖచ్చితంగా గుచ్చిగుచ్చి చూసి అదే మాట అడిగితే తన పిరికితనాన్ని ఎలా దాచుకునేది ?

"బాగా లేట్ అయ్యింది కదా. ఇంట్లో మీ పేరెంట్స్ నిద్రపోతుంటే డిస్టర్బ్ అవుతారనీ.." అలా వివరించుకోవడం ఆమెకే నచ్చలేదు.

"మరి అయితే అసలు డయల్ చేయడమెందుకు?" చైతన్య మాట అతని చూపుకంటే తీక్షణంగా ఉంది. ఫోను కాబట్టి అతనికెదురుగా తన ముఖం లేనందుకు కాస్తంత ఊరట చెందింది రాధిక.

"పొద్దున్నుంచీ మూడుసార్లు కాల్ చేసాను"

"నాన్న చెప్పారు" అతని గొంతులో ముభావం.

"మరి నువ్వెందుకు ఫోన్ చెయ్యలేదు?" అడుగుదాం అనుకున్నా అడగలేదు రాధిక. ఏమాత్రం గొడవకు తీసే మాటనయినా తనవేపు నుంచే రాజీపడాలని నిర్ణయించుకునే ఫోన్ చేసింది. కానీ అడగాలి అనుకున్న ప్రశ్నకు తానే ఇంకొంచెం కారణం అందిస్తూ

"నా నెంబర్ కూడా ఇచ్చాను" అంది. అసలు అతను తన నెంబరు ఉన్న పుస్తకం మరచిపోవడం కేవలం ఒక సాకు. నిద్రలోలేపి అడిగినా తప్పున చెప్పగల నెంబరు. అతని ఊసులెన్నిటినో గిలిగింతలకు గురవుతూ మోసుకొచ్చిన నెంబరు అది. అతను మరచిపోవడం అసాధ్యం.

"నాన్నకు ఊరికే అలా చెప్పాను" నిజాయితీగా ఒప్పుకున్నాడు

"ఎందుకలా?"

"అరే...ఏదో గబుక్కున అలా అనేసాను"

"నాకు ఫోన్ చేయడం ఇష్టం లేకనే కదా..." ఆమె అడగాలి అనుకుంది కానీ, అతను అవునంటాడని భయపడింది.

"ఎలా ఉన్నావ్ ?" అతను మాట కదిపాడు

"బానే ఉన్నా.. నువ్వు"

"వెరీ ఫైన్" అతని "వెరీ"లో ఎత్తిపొడుపు ఏమయినా ఉందా అని ఆమె ఆలోచించింది.

"ఎగ్జామ్స్ ఎప్పుడు ? అదే అమెరికాకు .." పలకరింపు కోసం అడిగినట్లు అడిగాడు

"ఫోర్ మంత్స్‌లో"

"ఒకే... ఆల్ ది బెస్ట్"

***వీడ్కోలు చెప్పేస్తున్న మనిషితో వెళ్ళొద్దని అడగాలి అనుకునేది పసిపిల్లలు, ప్రేమికులు మాత్రమే. ప్రేమలో స్వాభిమానం తృణప్రాయంలా తోస్తుంది.*** ఆమె కన్నీళ్ళను అదుపు చేసుకుంటూ," ప్లీజ్ చే అలా మాట్లాడకు" అనగలిగింది

"కమాన్,ఇప్పుడు నేనేం అన్నాను?"

***గుండెకుగాయం చేసే మాటకు అమాయకత్వం రంగుకూడా పూస్తే అది విషపుబాణమే.***

"ఎంత హర్టింగ్‌గా మాట్లాడుతున్నావో తెలుసా?" ఆమె గొంతు గద్గదం అయిపోయింది.

"అయాం సారీ" అతని క్షమాపణలో యాంత్రికత్వం ఘనీభవించింది .

"ఎందుకు చే, నేనంటే అంత కోపం..?" కన్నీళ్ళను వెక్కిళ్ళల్లో మింగుతూ అడిగింది రాధిక. తను ఉన్న గదిలోకి ఎవరూ రాకుండా ముందే గొళ్ళెం పెట్టుకుని సిద్ధంగా ఉంది. ఏడుపు ముఖాన్ని ప్రపంచానికి చూపడం ఎంత అవమానం?! ఆమె బాధ వింటున్నా అతను బదులు చెప్పలేదు.

"చే.." ఆర్తిగా పిలిచింది ఆమె.

"ప్లీజ్ నన్ను అలా పిలవొద్దు"

తాను ఏం విన్నానో నమ్మకం కుదరలేదు రాధికకు. ఫోన్‌లో ఇద్దరి ఊపిరిలూ వేదనగా విసురుకున్నాయి. ఆమె ఫోన్ కట్ చేసేసింది. మేఘం వర్షించినట్లు భోరుమంది. అతనంటే కోపం వచ్చింది. తలగడలోకి గోళ్ళతో రక్కింది. అతని ఊసే ఒద్దనుకుంది. తనను తాను నిందించుకుంది. ఇక ఎపట్టికీ అతనితో మాట్లాడకూడదు అనుకుంది. ఫోన్ రింగయ్యింది. ఆమె నిర్ణయాలన్నీ నశించిపోయాయి.

"అయాం సారీ రాధికా" ఆన్సర్ చేయగానే అతని మాటలో నిజయితీ ఆమె గ్రహించింది. ఇప్పటికీ అతను తనను "రాధీ" అని పిలవడం లేదు! ఆమె మౌనంతో బెట్టు చేసింది.

"నువ్వంటే నాకు నిజంగా కోపం వచ్చింది?" అతని మాట మరీ నచ్చుతోంది ఆమెకు.

"ఇంకా ఉందా?"

"ఏంటి?"

"అదే కోపం"

"దాన్ని కోపం అనడం కరెక్ట్ కాదేమో అసలు. ఏమని చెప్పాలో తెలియట్లేదు. ఒకరకంగా అది నేనంటే నాకే కోపం.కాదు కాదు. విరక్తి. నమ్మకం పోయింది"

ఆమె చెవులు రిక్కించింది.

"నాకు నీకంటే క్లోజ్ ఎవరూ లేరు" ఈసారి అతని గొంతు వణికింది.

"ఐనో" రిసీవర్‌నే అతడిగా ఊహించుకుని మెడకింద పొదువుకుంది

"మరి అలాంటి నువ్వు నన్ను ఇంప్రాక్టికల్ అనడం.. నా ఎయిమ్స్, ఆంబిషన్స్ అంటే నాకే అనుమానం వచ్చేట్లు చేసాయి. ***మనిషిని డిఫైన్ చేసేది అతని కలలే కదా.*** నా కలలే తప్పు అంటే నేనే తప్పు కదా. ఆ మాట నేనంటే..? మొత్తం తెలిసిన నువ్వే అలా అంటే నాకు ఎలా ఉంటుంది చెప్పూ... "

"అందుకని నాలుగు నెలలు మాట్లాడకుండా ముఖం చాటేస్తావా ?"

"ముఖం చాటెయ్యడం ఏమిటీ? బుకిష్‌గా మాట్లాడకు. ఇకనుంచి మన దారులు వేరు అనుకున్నాం కదా" ఆఖరుసారిగా తాము గుడి దగ్గర మాట్లాడుకున్న మాటలను గుర్తుకుచేసాడు అతను.

"అయితే ? వేరే దారుల్లో వెళ్ళేవాళ్ళు మాట్లాడుకోరా?"

"ఈ ఆర్గ్యుమెంట్ అంతా అప్పుడే అయ్యింది కదా. నువ్వు యు.ఎస్.లో, నేను ఇక్కడా.. కుదరదు. మెమరీస్ హాంట్ చేస్తుంటాయి. కాంప్రమైజ్ అవ్వాలి అనుకుంటాం. కాలేం. కాకుండానే ఉండలేం. టార్చర్‌లా ఉంటుంది. అందుకే గుర్తుకుచేసుకోకుండా ఉండటం బెటర్ కదా"

"అయితే ఈ నాలుగు నెలల్లో నన్ను మరచిపోయావా " సంభ్రమంగా అడిగింది రాధిక

".... "

"నిజంగా నా ఫోన్ నెంబర్ నీకు గుర్తు లేదా?"

తడుముకోకుండా ఒప్పజెప్పాడు అతను.

"చూసావా. ఇట్స్ ఈజీయర్ సెడ్ దేన్ డన్"

"నాకు తెలుసు. ఇప్పుడు కాకపోతే ఇంకో సంవత్సరం, రెండు మూడు..అప్పటికి మరచిపోతాంలే" చాలా యధాలాపంగా అనేసాడు అతను.

"నీకు తెలీదు.." చే అనే పిలుపును దిగమింగుకుంటూ, "నా పరిస్థితి అలా కాదు. ఇంకో రెండు నెలల్లో పెళ్ళి చెయ్యాలి అనుకుంటున్నారు నాన్న. ఒక్కత్తినే యు.ఎస్ పంపనంటున్నారు "

"అయితే చేసుకో మరి" తడుముకోలేదు అతను.

"డోంట్ జోక్"

"అయాం నాట్"

"..... "

"సీ నీకు యు.ఎస్ వెళ్ళడానికి వీసాలాగ పెళ్ళి అవసరం అయినప్పుడు చేసుకోకతప్పదు కదా"

"ఎవరో ముక్కూమొహం తెలియనివాడినా?"

"వెల్... నీకు నచ్చవచ్చు వేరే ఎవరైనా "

"స్టూపిడ్. ఎంత ఇన్సల్టింగ్‌గా మాట్లాడుతున్నావో తెలుసా ? ఇట్స్ నాట్ ఈజీ. భర్తగా నిన్ను ఊహించుకున్నాను" అభిమానం చంపుకుని చెప్పింది ఆమె.

" ....... "

"డూ యూ నో వాట్ దట్ మీన్స్? డూ యూ నో వాట్ దట్ మీన్స్ టు ఎ ఉమెన్?"

" .... "

"నీకోసం నీకిష్టమయిన వంటలు నేర్చుకోవాలి అనుకున్నాను. మన ఇల్లు ఎక్కడ ఎలా ఉండాలో అనుకున్నాను. ఏ చీర, ఏ డ్రస్సు వేసుకుంటే నీకు నచ్చుతుందో అవే కొనాలి అనుకున్నాను. డామ్స్ ఇడియట్ .. ఐ వాంటెడ్ సెక్స్ విత్ యూ " కోపంలో ఆమె సిగ్గు చచ్చిపోయింది. తీక్షణతను వెరచి అతను మౌనంగానే ఉండిపోయాడు.

"డూ యూ నో వాట్ దట్ మీన్స్ టు ఎ ఉమన్ ? నీకు తెలియకపోతే తెలుసుకో. ఫిజికల్‌గా అది జస్ట్ రీప్రొడక్షన్. కానీ ఐ కాంట్ ఇమేజిన్ డూయింగ్ ఇట్ విత్ సంవన్ ఎల్స్. అంతా చెబితే పచ్చిగా ఉంటుంది. నీకు మాత్రం అర్థం కావట్లేదా ? ఉమన్‌కు ఆక్ట్‌తో అయిపోదు. షి హేజ్ టు క్యారీ ది చైల్డ్ ఆఫ్ దట్ మాన్ ఫర్ మంత్స్. ఇష్టంలేనివాడితో కళ్ళుమూసుకుని కొన్ని క్షణాలు గడపడమే నరకం! ఇక జీవితాంతం అంటే అది చావుతో సమానం "

"రాధీ రాధీ..." అతను తనను అలా పిలుస్తున్నాడని గుర్తెరగలేనంత ఆవేశంలో ఉంది ఆమె. "ఐ కెన్ అండర్ స్టాండ్ ఇట్. ఇదేదో ఆడదానివి కాబట్టి నీకే నీ బాడీ గురించి ఎక్కువ వాల్యూస్ ఉంటాయనుకోవద్దు. ఈ దిక్కుమాలిన పురాణాలూ, కవులూ అందరూ కలిసి శీలం, పవిత్రత ఇవన్నీ ఎదో ఆడదానికే కానీ మగాళ్ళకేమీ లేనట్లు పిచ్చిరాతలు రాసారుగానీ, సెక్సువల్ ఎక్స్‌ప్రెషన్‌కు సంబంధించి విలువలూ , నీతులూ మగవాళ్ళకు కూడా ఉంటాయి. వెల్ .. మిగతా అందరి సంగతేమో కానీ నాకు మాత్రం ఉంది. నేను కూడా చాలా ఊహించుకున్నాను. నీతో మాత్రమే కుదిరేవి. బట్ అయాం ష్యూర్, ఇవేవి మన లైఫ్ ఆంబిషన్స్ కంటే గొప్పవి కావు. అవేవి కుదరనప్పుడు ఇంకే ప్రేమా, అఫెక్షనూ నిలవవు. నాలుగురోజులకు మోజులన్నీ తీరిపోయాక నాకంటే శత్రువు లేనట్లు కనిపిస్తాను నీకు"

"ఏంటీ? మోజా...? ఓకే ..ఒకే" ఆమెలో మెల్లగా అత్మాభిమానం బుస కొట్టింది. సిగ్గువిడిచి మాట్లాడినందుకు ఎంత చులకనయిపోయాను.

"నువ్వు తిట్టుకున్నా కోపగించుకున్నా అదే నిజం. నా ఎయిమ్స్‌ను ఫూలిష్? అనే నీతో నేను ఎక్కువరోజులు ఇలానే ఉండలేను. సెల్ఫిష్ ఆంబిషన్స్ ఉన్న నువ్వు నన్ను యాక్సెప్ట్ చెయ్యలేవు"

"వాట్ ? సెల్ఫిష్?" విస్తుబోయింది రాధిక. అతను తనను అంత మాట అంటాడా? కానీ అనేసాడు. ఆమె మనసును తాకేసేంత తీవ్రమయిన మాట.

"యస్. ఈ అమెరికా వెళ్ళి పెద్ద చదువులు చదివి ఇక్కడికొచ్చి సేవ చెయ్యడాలు..అన్నీ ఒట్టి కబుర్లు. ఇవేవీ జరగవు. విషయం నీకూ తెలుసు. కానీ తెలియనట్లు, తెలిసినా వాటిని నువ్వు అధిగమిస్తానన్నట్లు నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావు. *వ్యక్తి బాగుపడితే సమాజం దానంతట అదే బాగుపడుతుంది అనడం ఒట్టి హిపోక్రసీ. ఒకడు ధనవంతుడు అయితే పదిమందికి ఉద్యోగాలు వస్తాయి, కలెక్టివ్ ప్రొడక్టివిటీ, రిచ్‌నెస్ పెరుగుతుంది...అన్నీ ఎస్కేపిస్ట్ మాటలు. అలా అయితే ప్రపంచంలోని పేదరికాన్నంతటినీ పదిసార్లు నిర్మూలించగలిగేంత డబ్బూ, శక్తియుక్తులూ ఇప్పటికీ ఈ ప్రపంచంలో చాలామందికి ఉన్నాయి. కానీ ఎవ్వరూ ఏమీ చెయ్యరు.* మా నాన్న

చిన్నప్పుడు ఓ పని చేసేవాడు. నాకు తొమ్మిదిన్నరరూపాయలు పెట్టి కూల్‌డ్రింక్ కొంటే, మిగిలిన అర్థరూపాయినీ దా..నం చేసి ఎవర్నో ఉద్ధరించినట్లు భావించేవాడు. రేపు నువ్వయినా అంతే.. మీ నాన్న లంచాలు తీసీతీసీ పాపభీతితో ఏ ఛారిటీలోనే చేరుతాడు, నువ్వూ ఓ పైసా ఇస్తావు. నీ చదువుతో ఈ సొసైటీలో ఉండే రిచ్ అండ్ ఫిల్తీ కరెప్ట్ పీపుల్‌కు మెరుగైన వైద్యసేవలు అందించగా వచ్చిన డబ్బులో కాస్తంత ఛారిటీ చేసి ప్రపంచాన్ని బాగుచేసాను అనుకుంటావు. ఇవన్నీ నేను చూడలేను. చూస్తూ నిన్ను ప్రేమించలేను. ఇలా దూరంగా ఉంటే కనీసం అసహ్యించుకోకుండా అయినా ఉంటాను. అది బెటర్ కదా...''

ఆపకుండా మాట్లాడిన అతనిలోని ఆవేశం ఆమె కళ్ళకు కట్టినట్లు కనిపించింది. తాను ప్రేమించినది ఈ ఆవేశమే. కానీ అది తననే దహించేంత తీక్షణమని ఎప్పుడూ ఊహించలేదే ? *నిప్పును ప్రేమించిన క్రొవ్వొత్తికి మిగిలేది విషాదాంతమే.*

''అయాం సారీ ఇది నీకు హర్టింగ్‌గా ఉండొచ్చు. కానీ ఇలా మాట్లాడటంలో నాకేమీ సంతోషం లేదు కదా. నీకు నేను ఎంత ఇంపార్టెంటో నాకు తెలుసు. అలాగే నాకు నువ్వు ఎంత ఇష్టమో కొత్తగా చెప్పక్కర్లేదు కదా. కానీ ఇట్స్ జస్ట్ నాట్ ఫీజిబుల్ ఫర్ అజ్ టు బీ టుగెదర్. *ఆశయాలకు అడ్డం వస్తే కన్నవాళ్ళను వొద్దనుకుని, ఇల్లొదిలి పారిపోయే పిల్లలున్న ప్రపంచంలో ఉన్నాం.* లెట్స్ థింక్ ప్రాక్టికల్. నువ్వు ఇంకొకరిని పెళ్ళి చేసుకుంటే చూస్తూ నేను జెలసీ ఫీలవకుండా ఉండలేను. అందుకే ఇంకెప్పుడు నాకు ఏమీ చెప్పొద్దు. బెటర్ లెట్స్ ఫర్గెట్ ఈచ్ అదర్ ఫర్ సం టైం''

ఆమెకు మాత్రం అప్పటికీ కోపమో. బాధా తీరలేదు. *కలిగినంత వేగంగా మానవు కదా గాయాలు.*

''ఒక్క విషయం. అప్పుడప్పుడు సరదాకోసం నేను ఓ పని చేసేవాడిని. ఎప్పుడయినా గుంపులుగుంపులుగా జనాలు ఉన్నప్పుడు కళ్ళు కొంచెం ఫోకస్ మార్చుకుని చూడు. తేడాలేకుండా అన్ని జీవితాలూ బ్లర్డ్‌గా, ఇన్‌సిగ్నిఫికెంట్‌గా కనిపిస్తాయి. అలా చూసినప్పుడంతా నేను అనుకునేవాడిని, నేను , రాధిక మాత్రం ఎప్పుడూ ఇలా అయిపోం అని. నువ్వు ఏమీ సాధించవు, అన్నీ అబద్ధాలు అనే నా మాట ఒట్టి అబద్ధం అని నువ్వు ఎంచుకున్న మార్గమే కరెక్ట్ అనీ నువ్వు ప్రూవ్ చేస్తే నేను ఓడిపోవడానికి సంతోషంగా ఎదురుచూస్తాను. ప్లీజ్..బిలీవ్ ఇన్ యువర్ సెల్ఫ్ అండ్ గో ఎహెడ్ విత్ యువర్ లైఫ్? ''

రోషమని అందుకుంది రాధిక ''నో.. ఏదో మహాత్ముడిలా మాట్లాడకు. అనాల్సిన గొప్ప మాటలు చాలానే అన్నావ్, నేను విన్నాను. నేనెప్పుడూ నువ్వు ఓడిపోవడం, నేను గెలవడం ఇలా అనుకోలేదు. వీ ఆర్ నాట్ ఇన్ ఎనీ కాంపిటీషన్ అబౌట్ లైఫ్. ఎనీవే... నీకు చెప్పడం వేస్ట్. పిచ్చిపిచ్చి పుస్తకాలు చదివి చదివి...నువ్వు చివరకు ఒక పుస్తకంలా తయారయ్యావు. ఐ మే లవ్ ఎ మ్యాన్ లైక్ యూ బట్ నాట్ ఎ బుక్ లైక్ యూ . గుడ్ బై '' విసురుగా కాల్ కట్ చేసి తలగడలో ముఖం దాచేసుకుంది రాధిక.

*చరిత్రలో మనుష్యులు, సంస్కృతులు, సంప్రదాయాలు నశించినా పుస్తకాలుమాత్రమే నిరంతరాయంగా జీవిస్తాయని ఆరోజు ఆమెకు తెలియలేదు.*

* * *

'' మొత్తానికి అంకుల్ అయితే హ్యాపీ అన్నమాట '' కారు లాక్ చేస్తూ అడిగాడు రాజు

'' కాదా మరి. ఈసరికి ఆశ్రమంలో తన ఫ్రెండ్స్ అందరికీ గొప్పగా చెప్పేసుకుంటుంటారు. మా అమ్మాయిని నేనే ఒప్పించాను అని'' పొట్ట మీదకు పైటను మరింతగా సర్దుకుంటూ, కారు అద్దం మీద ప్రతిఫలిస్తున్న తన రూపాన్ని చూసుకుంది రాధిక. ఊదారంగు సిల్కుచీరలో హుందాగా కనిపిస్తోంది ఆమె. వంపు తిరిగి ఉన్న అద్దంలో ఆమె ప్రతిబింబం కాస్తంత వెడల్పుగా విచ్చుకున్నట్లు కనిపించింది. పదేళ్ళక్రితం ఎంత సన్నగా ఉన్నానో కదా పెదవి విరుచుకుంది ఆమె. ఐదుసార్లు అమ్మతనాన్ని పొందుపర్చుకుని కోల్పోయిన ఆమె శరీరం ఒకప్పటి అందాలనూ కోల్పోతోంది.

"పోనీలే, నీకు కూడా ఒక ఎక్స్ట్రా డెజిగ్నేషన్ వచ్చినట్లే కదా. నువ్వు పెద్ద పట్టించుకోకున్నా, ...... స్వామీజీ హాస్పిటల్‌లో కన్సల్‌టెంట్ అంటే పేషెంట్స్ కూడా క్రేజ్‌గా ఫీలవుతారు" కోటు బటన్ సరిజూసుకుంటూ ముందుకు కదిలాడు రాజు.

"నేను డాక్టరు, వాళ్ళు పేషెంట్స్. ఏమైనా హెల్త్ ప్రాబ్లం, అదీ నా స్పెషలైజేషన్‌కు సంబంధించినది అయితేనే నాదగ్గరకు వస్తారు. సినిమా స్టారులాగా వాళ్ళకూ నాకు మధ్య క్రేజ్ ఎందుకు?" చుర్రుమని సమాధానం ఇస్తూనే అతని మోచేతిని పట్టుకుని మెట్లు ఎక్కింది.

"అబ్బా.. నువ్వు ఇంకా ఏ కాలంలో ఉన్నావ్. అప్పుడెప్పుడో చెప్పావ్ కదా మెడికల్ ఎథిక్స్ ప్రకారం అయితే డాక్టర్లు ప్లస్ మార్కు..."

"ప్లస్ కాదు. రెడ్ క్రాసు మార్క్"

"అదేలే. అది కూడా వేసుకోకూడదు , తమ ఇల్లు, క్లినిక్ దగ్గర తప్ప ఇంకెక్కడా బోర్డులు కూడా పెట్టుకోకూడదు అని. ఇంతకుముందు చూసాం కదా, రోడ్ మీద బైకు నెంబరుప్లేట్ల మీద కూడా డాక్టరు సింబల్స్" గ్రహణం మొర్రికి శస్త్ర చికిత్స నిపుణుడు" అని ఆటోల వెనుక ప్రింటెడ్ యాడ్స్!! తలుపు దగ్గర ఇన్విటేషన్ కార్డులు తీసుకుంటున్న వ్యక్తికి తమ కార్డును అందించి లోపలకు దారితీసాడు రాజు.

ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ దిగ్గజం తన ఫాంహౌస్‌లో ఇస్తున్న ప్రయివేట్ పార్టీకు వచ్చారు వాళ్ళిద్దరూ. పార్టీ ఇస్తున్న వ్యక్తి తనకు అస్సలు పరిచయం లేకపోయినా, వ్యక్తి సహాయసహకారాలు రాజుకు చాలా అవసరం కావడంతో అతడిని అనుసరించింది. అప్పటికే మెల్లమెల్లగా చేరుతున్న జనంలో ఎక్కువమంది సూట్లలో చేరి వైన్ గ్లాసులమధ్య చర్చించుకుంటున్నారు.

"ఎవరో ఏదో చేస్తున్నారని , మనం కూడా మన వాల్యూస్ వదిలేసుకుంటే ఎలా రాజు. ఇలా అయితే అందరూ పతనం..." గుసగుసగానే అయినా విలువలను తక్కువజేసి మాట్లాడే అతడికి సమాధానం ఇవ్వకుండా ఉండలేకపోయింది రాధిక.

"పతనం! ఎంత పెద్ద మాట. సర్లే, తర్వాత మాట్లాడుకుందాం" అంటూ తమకు పార్టీ ఇస్తున్న వ్యక్తిని చూపుతూ అటు నడిచాడు రాజు. అతను చెప్పాలనుకున్నది చెప్పేస్తాడు, అవతలి వారికి వివరించేందుకు అవకాశమూ ఇవ్వడు. ఎప్పుడూ ఇంతే. మనసులో విసుక్కున్నా ముఖం మీద నవ్వు పులుముకుంది రాధిక. తమను రిసీవ్ చేసుకున్న వ్యక్తితో పరిచయ వ్యవహారాలు ముగిసాక రాజు తనను అతని మిగతా కొలీగ్స్‌కు పరిచయం చేస్తుంటే, ఆమె ధ్యాస అంతా అంతకుముందు రాజు అన్న మాట మీదే సాగింది.

నిజంగా చైతన్య ఇలా ఎలా ఊహించగలిగాడు. తన జీవితం అంతా ముందే చూసినట్లు. నిజమే.. రోజు తన ప్రస్థానంలో రెండు దారులు. గమ్యం ఒకటే. తాను ఎంచుకున్న దారిలో తన ప్రయాణం అద్భుతం. అన్నీ విజయాలే. కానీ గమ్యం ఏమయింది? డాక్టరు అయ్యాక చిన్నచిన్న పల్లెల్లో గ్రామీణులకు కూడా మంచి వైద్యం అందించే హాస్పిటల్ ఒక్కటయినా నిర్మించాలి అన్న తన ఆశయం అసలు స్ఫురణకే లేనంతగా తలమునకలయిపోయింది వృత్తిలో. వారం క్రితం కూడా వార్తాపత్రికల్లో ఒక కథనం. ఈ సంవత్సరం విషజ్వరాలతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఐదువందల మరణాలు. తాను చదువుకున్న ఊరికి కేవలం వందమైళ్ళ దూరంలో జరుగుతున్న దారుణం. నెలల పసికందుల్లో మరణాల శాతం ఇంకా వందల్లోనే ఉంది. గర్భిణీల మరణాలు ఇంకా పదుల సంఖ్యల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అన్నీ చేస్తునట్లే ఉంది. కానీ నేనేం చేసాను ? నేనేం చేసాను.

"సో యూ ఆర్ ది వన్. మై ఫాదర్ ఇన్ లా ఈజ్ ఎ పేషెంట్ ఎట్ యువర్ హాస్పిటల్. హి సేజ్ యూ ఆర్ ఎ వెరీ కంపాషనేట్ డాక్టర్" రాజు స్నేహితుల్లో ఒకరు హలో చెబుతూనే రాధిక గురించి గొప్పగా చెప్పడంతో రాజు ముఖంలో ఆనందం చిమ్ముకొచ్చింది. రాధికకు మాత్రం ఏదో వెలితిగా తోచింది. అతని మామగారు ఎవరో వివరాలు అడగగానే, అతను ఆయనకు వచ్చిన జబ్బు తాను చేసిన సర్జరీ వివరాలు అన్నీ గభాలున చెప్పాడు. ఆ పేషెంటును గుర్తుకుచేసుకుంది రాధిక. ఒక మాజీ రాజకీయ నాయకుడు. చట్టం దృష్టిలో నిరూపరించబడని అవినీతి ఆరోపణలు అతని ఆస్తి. తన దగ్గరకు పేషెంటుగా వచ్చినప్పుడు కూడా

అతనితోపాటు రౌడీలాంటి ఒక అనుచరుడు ఉండటం ఆమె గమనించింది. తనకు లభిస్తున్న పొగడ్తలు అన్నీ చైతన్య శాపాల్లాంటి హెచ్చరికలను గుర్తుచేసి వెక్కిరిస్తున్నట్లు అనిపించేసరికి ఇబ్బందిపడిపోయి త్వరగా గ్రూపులోంచి తప్పించుకుంది.

"ఏంట్రా హెడేక్‌గా ఉందా" మెల్లగా ఒకవారగా తీసుకువెళుతూ అడిగాడు రాజు. రాజు పిలుపులోని "రా"కు తండ్రి పిలుపులోలా ఏదో అవసరమే తోచింది ఆమెకు. పడకగదిలో అతనికి మాత్రమే అవసరమయితోనో, లేక నలుగురి ఎదుటా తాము ప్రేమమయ దంపతులు అనే మాట అనిపించుకోవడం కోసమో తప్ప అతను అలా పిలవడని ఆమెకు తెలుసు.

"వెళ్ళిపోదామా?" అతని చూపులు మాత్రం పార్టీలో ఇంకెవరెవరినో పలకరిస్తుండటం చూసింది ఆమె.

"వొద్దులే, యూ క్యారీ ఆన్. ఐ విల్ సిట్ సంవేర్" అంది, హాలు వెలుపల బాల్కనీలో పచార్లు చేస్తున్న కొందరినీ, వాళ్ళ వెనుకల విస్తారంగా ఉన్న తోటనూ చూస్తూ.

' పోనీ, నువ్వు అలా తోటలోకి వెళ్ళావా? గార్డనెర్? ఎవరితోనైనా నీకు మొక్కల గురించి చెప్పించమంటావా?" అన్నాడు, తనకు ఆతిధ్యం ఇస్తున్న వ్యక్తి వద్దకు వెళ్ళజూస్తూ.

"మా వైఫ్‌కు గార్డెనింగ్ చాలా ఇష్టం. మీ గార్డెన్ బ్యూటిఫుల్ అంటోంది.." అంటూ పొగడ్తలతో వ్యక్తితో మరింత సాన్నిహిత్యం సంపాదించుకోవడానికే అలా అడుగుతున్నాడా ? రాజు ప్రతి మాటలోనూ స్వార్థపూరిత కోణంగురించి ఆలోచిస్తున్నందుకు తన మీద తనకే జాలి వేసింది. ***అవతలి వ్యక్తిలో చెడు ఉంది అనుకోవడమంటే మనలో ఏదో చెడు ఉన్నట్లే.***

"ఐ విల్ టేక్ కేర్ అన్నానుగా.. యూ గో" కోటు మీదనుంచి అతని వీపులోకి వేళ్ళు గుచ్చి అతని సుతారంగా ముందుకు తోసింది.

రాధిక తనను అలా ముద్దుగా తోయడం ఎవరైనా చూస్తే బావుండునని కోరుకుంటూ ముందుకు కదిలాడు రాజు. అతను కలిసిపోతున్న జనంపట్ల చూస్తుంటే, దాదాపు అందరూ ఒకేలా అనిపించారు. చైతన్య చెప్పినప్పుడు ఒకసారి కళ్ళు ఫోకస్ మార్చుకుని చూసింది. అందరూ మసకమసకగా, ఒకేరకం సూట్లు వేసుకున్న ముద్దల్లా కదులుతున్నారు. ఆడవారు మాత్రం రంగురంగు చుక్కల్లా ఉన్నారు..అదీ కేవలం వస్త్రధారణద్వారా వచ్చిన రంగు. ఇంకెవరో చూస్తుంటే తనూ వీళ్ళల్లో ఒకతే కదా. హాల్‌ను పరికించి చూస్తూ మెల్లగా వెలుపలకు నడిచింది. ఒక్కొక్కరి ఒంటిపై ఉన్న బట్టలు, ఆభరణాలు , ఎలక్ట్రానిక్ వస్తువుల విలువకల డబ్బుతో ప్రాణాపాయ స్థితిలో వైద్యం కొనుక్కోలేక ముగిసిపోయే ఎన్నో జీవితాలను బ్రతికించవచ్చు. తమకు ప్లేట్లలో సర్వ్ చేసిన ఆహారం, గ్లాసుల్లోని విదేశీ మద్యం.. వీటి ఖర్చుతో దాదాపు ఒక సంవత్సరంపాటు ఒక బీద కుటుంబం మూడు పూటలా పౌష్టికాహారం తీసుకుంటే అసలు వాళ్ళకు వచ్చే ఎన్నోరకం జబ్బులు నశిస్తాయి.

"గార్డెనింగ్ దేఖేంగే మేడం?" అతిధులకు తోట చూపడానికి నియమింపబడిన పనివాడొకడు రాధికకు ఎదురుపడ్డాడు.

"ఫర్లేదు, ఊరికే అలా నడుస్తానులెండి" నెరిసిన అతని తలవంక చూస్తూ అంది రాధిక.

మర్యాద అలవాటు లేనట్లు అతను చిత్రంగా చూసాడు.

"నయా హైబ్రీడ్‌వాలా క్రోటన్స్ హై మేడం వహా పే" ఆమె వొద్దంటున్నా తన బాధ్యత అన్నట్లు ఆమెకు దారిచూపాడు అతను. అతని వయసును అంచనా వేసింది రాధిక. యాభై ఉండొచ్చు. కానీ డెబ్బైయేళ్ళవాడిలా ముఖం మీద ముడతలు. చెంపలు లోపలకు ఉన్నాయి. చుట్టలు అలవాటు కాబోలు పెదవులు బండబారి ఉన్నాయి. అతని నడకలో మాత్రం యువకుడి చురుకుదనం ఉంది. ఈ పార్టీ లోపల ఉన్న మనుష్యులు తినకుండా విసిరిపారేసిన తిండి అంత విలువ ఉండదు తన జీవితం అనేవిషయం సుస్పష్టంగా తెలిసినా, చేదు నిజానికి ఏ మాత్రం చింతలేనట్లు అంతకుమించి తన జీవితానికి సుఖం లేనట్లు సాగిపోతున్న అతడిని అంటుకునే ఆమె ఆలోచనలు సాగాయి. ***ఎదిగేందుకు అవకాశం ఉన్న మనిషికే జీవితంలో ఎదగాలి అనే కోరిక ఉంటుంది. ఒక స్థాయి చేరుకున్నాక ఇక***

*చాల్లే అని తృప్తి చెందేసేక మనిషి సామాజికంగానేకాక మానసికంగానే ఎదగడం ఆగిపోతుంది.* తోటమాలి జీవితానికి తన జీవితానికి అట్టే తేడా లేదేమో. ఏ పరాయి ప్రాంతం పల్లె నుంచి వచ్చాడో మరి, తెలుగు మాట్లాడటం కూడా రాకపోయినా హైదరాబాద్ శివార్లనోనైనా ఈపాటి ఉద్యోగం, అదీ చెట్లమధ్య, సంపాదించుకుని మూడు పూట్లా తిండికి లోటు లేకుండా సాగిపోవడమే అతని జీవితానికి పెద్ద విషయమూ, విజయమూ కావొచ్చు. అతను పసివాడిగా ఉండేటప్పుడు ఏం కలలు కన్నాడో. గోదావరి ఒడ్డున పసి పాదాలతో పరుగెత్తిన తను ఏం అనుకుంది ? ఆకాశంలోని మబ్బులను దగ్గర నుంచి చూడాలి అనుకుంది. ఐదవ తరగతిలో ఖగోళ శాస్త్రం చదివినప్పుడు, విమానాల గురించి చదివినప్పుడు ఏదో ఒకరోజు విమానం ఎక్కితే మబ్బులను దగ్గరనుంచి చూడొచ్చు కాబట్టి ఎప్పటికయినా విమానం ఎక్కాలి అనే కోరిక కలిగింది. ఇంకా పైతరగతుల్లోకెళ్ళాక, ఆకాశానికంటే పైన ఊహకు అందని శూన్యంలో ఎన్నో గ్రహాలూ , అందులోనూ ప్రపంచాలూ ఉండొచ్చు అని తెలిసినప్పుడు ఎప్పటికయినా స్పేస్ సైన్స్ చదివి రాకెట్లలో గ్రహాలుదాటి రహస్యాలను ఛేదించాలి అనే ఆశతో ఎదిగింది. కొన్నాళ్ళకే అంతు తెలియని రహస్యాలకంటే మన చుట్టూ నిత్యం ఉండే పురుగూ పుట్రా, కప్పలూ, బొద్దింకలలో కూడా ఎవరు కూర్చారో తెలియనంత నేర్పుగా శరీర నిర్మాణమూ, జీవమూ, పరిణామక్రమమూ ఉందని చదివాక ఈ సృష్టి రహస్యాలగురించిన ఆసక్తితో మనసు వికసించింది. ఇష్టమయిన స్నేహితుడిని కబళించిన మృత్యువునే ఎదిరించేంతగా జీవశాస్త్రం చదవాలన్న పట్టుదలతో అందులో ప్రవేశించాక... అంతే అక్కడితో ఎదుగుదల ఆగిపోయింది. కలలు కోల్పోయింది. చిన్నప్పటిలా ఇప్పుడు మబ్బులు ఒక అద్భుతం అనిపించవు. ఆవిరి ఘనీభవించడమే కదా. నక్షత్రాల వెనుక దాగిన రహస్యాలలో అంత ఆసక్తి లేదు. మానవజీవితమే అంతు లేకుండా ఉంది ఇక గ్రహాంతరవాసులు ఎవరైతే ఏమిలే అనే నిర్వేదన. మృత్యువును ఎదిరించడం తన జీవితకాలంలో తను చేయలేని పని అని అర్థం అయిన వాస్తవిక జ్ఞానం.

*"ప్రాక్టికాలిటీ".*

*ఈ ఒక్క పదమే మనిషి జీవితాన్ని అదుపు చేస్తోంది. ఇంతకు మించి ఇంకేమీ చేయలేము, ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే.. అనే భావం కలగడంతోనే జీవితానికి తెర. ఈ జీవితం ఇలా సాగిపోతుంది చాల్లే అనే నిర్లిప్తత. మనకిక చాల్లే అంటూ మనల్ని మనమే మోసం చేసుకోవడం మనసుతోపాటు మనకొచ్చే జబ్బు.*

కొన్నేళ్ళ చదువు తర్వాత తనలో కలిగిన తృప్తి అనే అబద్ధపు ఆలోచనలను నెమరువేసుకుంది రాధిక. బంధువులూ స్నేహితులూ అందరి దృష్టిలో వాళ్ళ ఊహకు అందనంత పెద్ద డాక్టరు అవగానే, తాను నిజంగా చాలా సాధించేసిన భావనతో, ఇక ఎంత చదివినా ఇలా చదువుకుంటూ ఉండటమేనా కాస్త మన దేశంలోవారికీ సేవ చేద్దాం అని రాజు చెప్పగానే, సేవ అనేది నిజంగా అమలుకాని మాటే అని తనకూ తెలిసినా తెలియనట్లే వచ్చిన సందర్భాన్ని గుర్తుకుచేసుకుంది. *మనిషికి తన చేతకానితనానికి కారణంగా చూపడానికి ఇంకొక్క మనిషి సరిపోడు. చాలా మంది మనుష్యులు కావాలి. ఎందరు కుదిరితే అందరూ. నిందించుకోవడానికి మనుష్యులు సృష్టించే పరిస్థితులు కావాలి. అందుకే సమాజానికి మనిషి అవసరం కన్నా మనిషికి సమాజం అవసరం ఎక్కువ.* తప్పు తనలో పెట్టుకుని రాజును, తండ్రిని, తల్లిని, భారతదేశంలోని సామాజిక పరిస్థితులను విసుక్కునే తను అంటే తనకే చిరాకు పుట్టింది రాధికకు. ఎవరు ఆపుతారు తనను? నిజంగా తన ఆశయాలను తను అనుకున్నట్లు కొనసాగించాలి అనుకుంటే అందుకు ఎదురుతిరిగిపోరాడలేదెందుకు ? ఆశయాలు అవసరాలు కావు కాబట్టి. తోటమాలి చూపించిన మొక్కలను చూడబుద్ధికాక వెనుదిరిగింది ఆమె.

"నేను ఓడిపోయాను" లంచం తీసుకున్నందుకు దొరికిపోయినప్పుడు పోగొట్టుకున్న ఆశయాలగురించి చెబుతూ చూపులు దించుకున్న చైతన్య తన ఎదురుగా ఉన్నట్లు తోచింది. ఓడిపోయింది అతను కాదు,తను. *ఓటమిని తెలుసుకున్నవాడు మహర్షి. గెలుపును భ్రమించేది అల్పజీవి.* అత్యల్పంగా ఇగిరిపోతున్న ఆత్మను బరువైన శరీరంలో మోసుకుంటూ, పార్టీ జరుగుతున్న బంగళావేపు కదులుతున్న

రాధికకు ఎవరో మనుష్యుల గుసగుసలు వినిపించాయి. ఎడమవేపున గుబురుగా ఉన్న పొదలకవతల ద్రాక్షతీగల కోసం కట్టిన చిన్నపాటి పందిరినీడల చాటున ఎవరో ఆడది ఒక మగవాడిని అతుక్కుని ఉంది. అంతటి మసక వెలుతురులోనే ఆమె ఎర్రటి చీర బంగారు జరీ తళుక్కుమంటోంది. ఈ కాస్త పార్టీ చాటునే అంత ఆగలేని విరహమేమిటో అనుకుని తనదారిన కదిలింది రాధిక. గుసగుసల్లో తనకు సుపరిచితమైన స్వరం వినిపించడంతో ఆమె అడుగు ఆగింది. రాజు? తన అనుమానం అర్థరహితం అనుకుంది. కానీ తేల్చుకోకుండా ఉండలేక అటు చూసింది. మనిషి అటువేపు తిరిగిఉండడంతో ముఖం కనిపించడం లేదు. కానీ ఒడ్డూపొడుగూ అవే. బ్రౌన్ సూటు వేసుకున్నవాళ్ళు ఈ పార్టీలో చాలామందే ఉండొచ్చు. రాజుగురించి ఘడియలో వేలవేల ఆలోచనలు పుట్టాయి. అతను అమాయకుడు. కాస్త స్వార్థం ఎక్కువ అంతే. తాను కన్యనా కాదా అని ముఖం మీదే అడిగిన నిజాయితీపరుడు. సంకుచితస్వభావం ఉన్నా విషయం నిర్మొహమాటంగా ఒప్పుకుంటాడు. కొన్ని విషయాల్లో తనను తాను తెలివయినవాడు అనుకునే మొద్దు. అమ్మానాన్న అంటే ఎంతో మర్యాద. ప్రతిరోజూ తన సర్జరీలగురించి కనుక్కుంటాడు. చాలా కేరింగ్. వివేకానందను ఇంటికి తీసుకురావద్దు అన్నాడే కానీ పాపం క్యాన్సర్ పేషెంట్‌నుంచి జబ్బులు రావు అని తెలియదు కదా. అనాథలను దత్తత తీసుకుందాం అంటే మొహం చిట్లించాడే! అది లేనివాళ్ళపట్ల అతని దృక్పథం. నేను అంటే ఎంత ఆత్మీయంగా ఉంటాడు. పాపం అబార్షన్ అయిన ప్రతిసారీ తనూ ఎంత క్రుంగిపోయాడో కదా. పిల్లలకు పేర్లు పెట్టుకుని, నిరాశపడి. కొలీగ్స్ పరామర్శలకు చిరాకుపడి...అంత జరిగినా తనను ఏమీ అనలేదు. తనే పిల్లాడిలా ఉంటాడు. నీళ్ళలో తడిసినప్పుడు టెడ్డీబేర్‌లా ముద్దుగా ఉంటాడు. ఆమె అలాంటి ఆలోచనల్లో ఉండగానే ..

"డోంట్ గో రాజూ " గుసగుసల్లోంచి స్త్రీ కంఠం స్పష్టంగా వినబడింది.

గుండెలయ పొలమారుతుండగా దూరంగా జరిగి వారి మీదే చూపు నిలిపింది రాధిక. దేవుడా.. అతను కాదు. వేరే ఎవరో రాజు కావాలి. ఆమె ప్రార్థనలు ఎక్కువసేపు కొనసాగలేదు. నీడల్లోంచి ముందుగా ఆవిడ వచ్చింది. వెంటనే పోల్చుకుంది రాధిక. వివేకానందకోసం తాను విమానాశ్రయంలో ఎదురుచూస్తున్నప్పుడు రాజు పరిచయం చేసిన, అవంతికా కురియన్. ఆమెకు ఇంకెవరయినా ప్రియుడు, భర్త ఉన్నాడేమో! అతని పేరు ఇంకేదయినా రాజు కాకూడదా. మనిషిలోని అర్థంలేని "నాన్సెన్స్" అంతటికీ ఒక పేరు పెడితే అదే ఆశ. అవంతిక బంగళాలోకి వెళ్ళిపోయాక, ఒక నిముషం తర్వాత నీడల్లోంచి వ్యక్తి వెలుపలకు వచ్చాడు. తననెవరూ చూడడం లేదు కదా అన్నట్లు బిత్తరచూపులు చూస్తూ. అతని కళ్ళలో మోసం. అపరాధనాభావం తళుక్కుమంటున్నాయి. దూరంనుంచే గమనిస్తున్న రాధిక కళ్ళల్లో ఆకాశం గడ్డకట్టినట్లు శూన్యం.

# 15

"బావున్నాడు కదూ"

"చా... లా.."

"నీకు గుర్తుందా, మన చిన్నప్పటి ఫోటోల్లో మనం కూడా ఇలానే ఉండేవాళ్ళం"

" ఊ...అవును. అన్ బిలీవబుల్"

" ఏంటీ ?"

"ఎలా ఉండేవాడివి ఎలా అయిపోయావ్?"

"ఛా.. మరి నువ్వు మాత్రం మారలేదేంటి?"

"పోరా.. "

" హహ.. పాపం వీడికీ నా టార్చరే "

"ఏంటా మాటలు "

"ఆఫ్‌కోర్స్ మే బీ నాఅంత టార్చర్ ఉండదులే.."

"పజిల్‌లా మాట్లాడకుండా విషయం చెబుతావా"

"రెండో పిల్లాడి బ్రతుకు ఎంత కష్టమో నీకేం తెలుసు?" జగన్ తన చేతిలోని గంటా పదినిముషాల వయసున్న పిల్లాడిని రాధికకు అందించాడు

"అంత కష్టాలేంపడ్డావో నువ్వు?" అపురూపంగా అందుకుంది రాధిక. జూనియర్ జగన్ వాడు. తప్పు చేసిన చూపులతో పార్టీలో కలిసిపోయిన రాజుకు ఎదురుపడి ఏం అడగాలో తెలియక, ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితిలో ఉండగానే కుసుమకు అనుకోకుండా నొప్పులు మొదలయ్యాయని ఫోన్ రావడంతో కారణం చెప్పి పార్టీలోంచి బయటపడి హాస్పిటల్‌కు వచ్చింది రాధిక. అపుడే పుట్టిన కొడుకుని చూసుకుని జగన్ గర్వడిపోతుంటే తమ్ముడు ఆనందాన్ని పంచుకుంటూ తానూ చిన్నపిల్ల అయిపోయి కాసేపు రాజు సంగతి మరచిపోయింది.

"ఎన్నని చెప్పను ? ఏ పని చేసినా అన్నిటికీ కంపేరిజన్స్, ఎగ్జాంపుల్స్. అమ్మానాన్నా కాకుండా నాపైన ఇంకొక అజమాయిషీ అదే నీకయితే ఎంత అదృష్టం. నిన్నెవ్వరైనా ఏమయినవా అంటే చిరాకును తీర్చుకోవడానికి ఒక హెల్ప్‌లెస్ చైల్డ్‌గా నేను ఉన్నా.." ఆపకుండా చెప్పుకుపోతున్న జగన్‌వంక చూస్తుంటే ముచ్చటగా అనిపించింది రాధికకు.

అతని ముఖంలో మీసాలు దట్టంగా ఉన్నాయి. దవడల మీద గడ్డం గరుకుగా పెరిగిపోతోంది. పెద్ద మగవాడు అయిపోయాడు.

ఒక పిల్లిపిల్ల తోకపట్టుకుని, అది కోపంగా మ్యావ్‌మనగానే భయపడిపోయి ఏడుపులంకించుకున్న అతని బాల్యచేష్టలు గుర్తుకువచ్చాయి రాధికకు.

వీడేనా వాడు ? "అమ్మా అక్కను కళ్ళుమూసుకోమను" నిక్కరు మార్చుకునేప్పుడు తన వేపు చూసి ఫిర్యాదు చేసిన పిల్లాడు వీడేనా ?

"సరేకానీ హానెస్ట్‌గా చెప్పు, వీడు నాలా ఉన్నాడా, కుసుమలా ఉన్నాడా?" రాధిక చేతుల్లో ఉన్న అబ్బాయి ముఖం మీదకు కళ్ళు వాల్చుతూ అడిగాడు జగన్.

వెచ్చగా నిద్రపోతున్న వాడి వంక దృష్టిసారించింది ఆమె. తెల్లమబ్బు బొమ్మలా ఉన్నాడు. ఒకప్పుడు చైతన్య పోలికలతో ఒక పిల్లాడిని చూడాలి అనుకుంది. తర్వాత రాజుకే మనసావాచా కట్టుబడినప్పటినుంచీ అతని పోలికలతో పుట్టే పిల్లాడు ఎలా ఉంటాడో అనుకుంది. ఇప్పుడు ఎవరో ఒకరు బిడ్డ అంటూ ఒకరు ఉంటే చాలు అనేంత కోరికను పుట్టింది వీడిని చూస్తే.

"చెప్పూ... ఎవరి పోలిక ?" జగన్ తన మోచేతిని కుదిపేసేసరికి ఉలిక్కిపడింది రాధిక

"ఆగరా సరిగ్గా చూడనీ " పిల్లాడి ముక్కుకేసి చూస్తూ అంది రాధిక.

జగన్? ముక్కు సూటిది, కుసుమ ముఖంలో కళ్ళూ ముక్కూ బుగ్గలూ అన్నీ గుండ్రమే. ఈ పిల్లాడేమో రెండు కవళికలూ కొంచెంకొంచెం పంచుకున్నట్లు ఉన్నాడు.

"చెప్పు చెప్పు .." రాధిక చేతుల్లోంచి వాడిని తన చేతుల్లోకి లాగేసుకోబోయాడు జగన్.

అతడి విసురుకు అబ్బాయి నిద్ర చెడింది. అసౌకర్యం కాస్తా ఏడుపులోకి మారింది. వాడిని ఊరుకోబెట్టడానికి దోసిళ్ళల్లోనే జోకొడుతూ,"ఇప్పుడే చెబుతున్నా, వీడికి మూడు బర్త్ డేలు అయ్యేంతవరకూ కుసుమ పర్మిషన్ లేకుండా వీడిని ముట్టుకోవడానికి కూడా

లేదు. బిడ్డాకూ బిల్డింగుకూ తేడా తెలీదు నీకు'' కన్‌స్ట్రక్షన్ రంగంలో తన ప్రతిభాపాటవాలను అనుక్షణం గొప్పగా చెప్పుకునే జగన్ అహాన్ని గిచ్చి అల్లరి పెడుతూ నవ్వింది రాధిక.

''హే...యాక్చువలీ నీ పోలికలో తప్పేమీ లేదు'' ఆమె ఎత్తిపొడుపును లెక్కచేయలేదు జగన్.

''రియల్లీ హా..?'' నిద్రలోకి జారుకుంటున్న బిడ్డను ఒడిలో అమర్చుకుంటూ అడిగింది రాధిక. పక్క గదిలో గాఢంగా నిద్రపోతున్న కుసుమ గురక చిన్నగా వినిపిస్తోంది. పేరుకు హాస్పిటలే అయినా, ఎగ్జిక్యూటివ్ ఛాంబర్‌లా రెండు ఏసీ రూములు తీసుకున్నాడు జగన్. ధనవంతులు పిల్లలకూ, కాన్పులకూ ఎంతయినా ఖర్చు పెడతారని వీలైనన్ని సౌకర్యాలు సమకూర్చి అంతకు అంతా సొమ్ము చేసుకునే హాస్పిటల్ అది.

''యూ సీ, ఒక బిల్డింగ్‌కోసం ఎలా డిజైన్ గీసుకుని, ఎక్కడ ఎంత ఖర్చులో కడదాం అనుకుంటామో అలాగే బిడ్డను ఎప్పుడు కనాలి, ఏం పేరు పెట్టాలి, ఎలా పెంచాలి అనుకుంటాం. మనం బిల్డింగ్‌ను అయితే కడతాం కానీ, అందులో ఉండే మనుష్యుల మనస్తత్వాన్ని బట్టి బిల్డింగ్‌కు ఒక ఐడెంటిటీ ఏర్పడుతుంది. ఫర్ ఎగ్జాంపుల్, బయటినుండి చూస్తే ఈ హాస్పిటలూ, పక్క ఉండే స్టార్ హోటలూ దాదాపు ఒకటే కదా. లోపలి ఆర్కిటెక్చర్, అందులో జరిగే పనులను బట్టి వేరు అవుతాయి. సేం అలానే పిల్లాడిని మనం కని పెంచినా వాడి బుద్ధులూ, స్వభావాలూ మన కంట్రోల్‌లో ఉండవు కదా... ''

''ఆగాగు. ఇదంతా నీ సొంత చాదస్తమేనా ?''

ఎలా కనిపెట్టావ్ అన్నట్లు చూసాడు జగన్. ''నువ్వు ఎప్పుడూ తిడుతుంటావే..... స్వామీజీ ఆయన డి స్కోర్సెస్‌లో...'' విషయం బయటపెట్టాడు.

''ఓహో ఆయన భక్తులకు ఇలాంటి ఎగ్జాంపుల్స్ ఇస్తారా ?''

''మరి.. అప్పుడే కదా బాగా అర్థమయ్యేది. ఒక్కోసారి లైఫ్‌ను సారా వ్యాపారంతో కూడా పోల్చి చెబుతారు. నవ్వొద్దు. అక్కడకొచ్చి వింటే చాలా బావుంటుంది ''

ఖాళీగా కూర్చుని ఉదాహరణలతో జీవితాన్ని గురించి ఉపదేశాలవ్వడం మంచి వృత్తే అనిపించింది రాధికకు. కానీ ఆమాట పైకి అనలేదు.

''ఇంతకీ ఏం పేరు అనుకున్నావ్?''

''ఏమో అప్పుడే ఏం అనుకోలేదు. రేపు సిద్ధాంతికి వీడు పుట్టిన టైం నిముషాలూ, సెకెండ్లతో సహా కరెక్టుగా చెబితే కొన్ని అక్షరాలు చెబుతాడు. లెటర్స్‌తో స్టార్ట్ అయ్యే నేం చూసుకోవాలి ..'' జగన్ చెబుతుంటే అడ్డగించింది రాధిక

''చాలా మారిపోయవురా. నీకోటి గుర్తుకు చెయ్యాలని ఉంది...'' అతని సమాధానం కోసం ఆగకుండానే జ్ఞాపకాన్ని గుర్తుకుచేసుకుంటూ'' ఫోర్త్ క్లాసులోనే కదా, నాన్న నిన్ను బాగా కొట్టింది ''

''ఒక ఫోర్త్ క్లాసులోనేనా..ఎన్నిసార్లని? చివరకు ఇంటర్మీడియట్ మ్యాథ్స్ ఎగ్జాం ఢమాల్ అన్నప్పుడు కూడా కొట్టాడుగా''

''అలా కాదురా.. బా.....గా కొట్టారు''

''కొట్టడా మరి . నువ్వు ఆడపిల్లవు కాబట్టి నీ దెబ్బల కోటా కూడా నాకే కదా. అందుకే సెకెండ్ చైల్డ్ బ్రతుకు కష్టం అనేది. పోనీలే వీడి పరిస్థితి బెటర్. పెద్దోడు కూడా అబ్బాయే కాబట్టి వీడికి నా అంత కష్టాలు ఉండవు'' మళ్ళీ కొడుకును ముట్టుకోబోతుంటే కళ్ళతోనే వార్నింగ్ ఇచ్చింది రాధిక

''అదికాదు. అప్పుడు నిన్ను పబ్లిక్ లో కొట్టారు''

జ్ఞాపకాలు అతని చెంపల్లోకి ఎరుపును తెచ్చాయి.

"గుర్తుందా, మన ఊరి గుడి గోడల మీద నువ్వు పాస్ పోసావ్ అనీ..." పకపకా నవ్వింది రాధిక.

సిగ్గు,అవమానం, రోషం, నవ్వు అన్నీ కలగలిసి అతడి ముక్కు ఎర్రబడింది. తన చేతుల్లోని పిల్లవాడి ముక్కు బహుశా వీడి పోలికే అని అప్పుడు అనిపించింది రాధికకు.

"చాలు చాలు, ఇంక చెప్పొద్దు" చుట్టుపక్కల ఎవ్వరూ లేరు కదా అన్నట్లు చూసాడు జగన్.

"అది కూడా, ......మ్మ మొక్కు కోసం అందరూ ముడుపులు కట్టే చెట్టు కొమ్మలు ఎక్కి, భక్తులు పాలు పోసే పాము పుట్టలో పాస్ పోసావ్ కదా" దృశ్యాన్ని గుర్తుకుచేసుకునేసరికి రాధికకు నవ్వు ఆగలేదు. అమాంతంగా జగన్‌ను నిక్కరు తొడుక్కున అల్లరి పిల్లాడిలా ఊహించుకోగలిగింది.

"ఛూ.. ఊరుకో.. కుసుమకు తెలిస్తే, నాచేత ఇప్పుడు కూడా పాపపరిహారం చేయిస్తుంది"

"ఆరోజు నాన్న చేయించారు కదా, గుడి చుట్టూ పొర్లుడు దండాలు పెట్టించి.." పిల్లాడిని పక్కన ఉన్న ఉయ్యాలలో ఉంచి వచ్చి అరచేతుల్లో నోరు నొక్కుకుంది. అయినా కళ్ళల్లోంచి కారిపోయింది నవ్వు.

"నీకో దండం తల్లీ.. ఏదో చిన్నతనం. ఇప్పుడెందుకు అవన్నీ"

"మరే! అలాంటి నువ్వు పెద్ద భక్తుడిలా మాట్లాడుతుంటే"

"నీకో విషయం తెలుసా, పురాణకథల్లోని మహామహా భక్తులందరూ మొదటి నాస్తికులే"

"ఛ.. వయసులోనే నీకు నాస్తికత్వం తెలిసిపోయిందారా? అసలు పదమన్నా తెలుసారా అప్పుడు"

ఉక్రోషంతో పెదవులు నొక్కుకున్నాడు జగన్.

"అవునూ..ఇన్నాళ్ళూ ఈ డౌట్ రాలేదు, ఇప్పుడు అనిపిస్తోంది. అసలు అలాంటి పని ఎందుకు చేసావు ?" అతడి జబ్బమీద చరిచి అడిగింది

"ఛ ఊరుకో. ఇప్పుడు ఈ డిస్కషన్ ఏంటి?" మాట తప్పించుకోవడానికి జేబులోంచి సెల్‌ఫోన్ తీసి ఏమైనా మిస్డ్‌కాల్స్ ఉన్నాయా అన్నట్లు చూసాడు. ఏమీ లేవు. అయినా ఊరుకోక, కాంటాక్ట్ నంబర్లు అటూ ఇటూ తిరగేసాడు. టాపిక్ మార్చేయాలన్న అతని ఉద్దేశ్యం అర్థమై ఫోన్ లాగేసుకుంది రాధిక.

"ప్లీజ్ చెప్పవా.. నేనుఎవ్వరితోనే చెప్పను" కొంచెం బ్రతికిమాలింది.

" ఏం లేదక్కా...ఏదో అర్జెంటుగా వస్తేనూ..." నసిగాడు

" రోజూ అదే చెప్పావు. నాన్న చితకబాదాడు. ఇప్పుడు తెలిసినా ఏం అనడులే"

" ష్లూ.. ఏంటీ రోజు. అల్లరిపిల్లలా..."

"చెప్పమంటుంటే..." పట్టువదల్లేదు రాధిక.

" ఏం లేదు"

"అబ్బ చెప్పరా.. "

"అరే.. ఏమీ లేదన్నానా. అదెందుకో అలా చెయ్యాలి అనిపించింది చేసాను అంతే. మే బీ జస్ట్ థ్రిల్ కోసం "

"దాంట్లో థ్రిల్ ఏముందిరా?" చీటికీమాటికీ "పాస్ పోయడం" అనే పదప్రయోగం పలకడానికి తనకే పిల్లతరహాగా అనిపించింది రాధికకు. తమ్ముడికీ తనకూ మధ్య ఎక్కడో ఒక అదృశ్యమైన గోడ ఉంది. చిన్నప్పుడు అవలీలగా మాట్లాడేసిన విషయాలేవీ మాట్లాడలేకపోవడమే పెద్దమనిషి అవడం అంటే. జగన్ కూడా ఖచ్చితంగా అలాంటి ఇబ్బందితోనే ఆమెకు విషయం చెప్పలేకపోయాడు. ఆ రోజు తాను ఎందుకు అలాంటి పని చేసాడు.

పామును చూడాలి అనేది ఒక కారణం. కానీ అందుకోసమే అయితే చెట్టు ఎక్కి పుట్టలోకి ఒంటేలు పోయడం ఏమిటి?

అక్కవేసిన ప్రశ్నలకు తనలో తానే జవాబు వెతుక్కున్నాడు. కారణం తెలియలేదుకానీ, చెట్టుపైనుంచి చూస్తే పుట్టలో గుండ్రటి , లోతయిన రంధ్రాలు, చీకటిగా, రహస్యంలా, లోపలినుంచి పాము ఉందో లేదో అనే భయం, భయంలోని థ్రిల్‌ను అనుభవించలానే ఆత్రుత... అన్నీ రెచ్చగొట్టాయి.

తన జ్ఞాపకాల్లోంచి రంధ్రాలను తుడిచివేయడానికి ప్రయత్నిస్తూ రాధికతో మాటలు మార్చాడు.

"ఇంతకీ బావ ఎప్పుడు వస్తాడు? "

రాజు ప్రస్తావనరాగానే రాధిక మనసు మొద్దుబారిపోయింది. అతనిగురించి మరచిపోయానే. ఎంత హాయిగా. అవంతికా కురియన్‌తో గడుపుతున్నాడేమో ! ఉంటే ఉండనీ. నాకేమిటి నాకు కాకపోతే ఎవరికి కావాలి? రాత్రికి ఇంటికి వెళ్ళగానే విషయం తేల్చేయాలి. కానీ ఎలా? ఏమని అడగడం, ఎలా అడగడం ?

చెట్టుచాటున నీడల్లో నువ్వు వేరే ఆడదానితో ఏం చేస్తున్నావ్ అని అడగాలా, నువ్వు చేస్తున్న పని తప్పు ఇక మానెయ్ అని చెప్పాలా?

తప్పు అని అతనికి తెలియదా? తెలిసే చేస్తున్నాడు. నాకు తెలియదు అనుకుని చేస్తున్నాడు. తెలిసిపోయిందని తెలిస్తే మానేస్తాడా? క్షమాపణ చెప్పి మారిపోతాడా? ఏమో అతడిని ప్రతి నిముషం కనిపెట్టిఉండలేనుగా. ఒకసారి దొరికిన దొంగ ఇంకోసారి దొరకకుండా మరింతగా ఆరితేరిపోతాడు.

సరి అయిన ప్రశ్న అడగలేకపోతే సరి అయిన సమాధానం ఏమిటో ఎప్పటికీ తెలియదు. ప్రశ్న ఏమిటో తెలియక తికమకపడిపోయింది రాధిక.

జగన్ ఫోన్ వైబ్రేషన్ మోడ్‌లో వణికింది. "తనే " అంటూ రాధికతో చెప్పి, " బావా ..ఫోర్త్ ఫ్లోర్‌లో..." అంటూ తామున్న గదికి రమ్మని రాజుతో మాట్లాడాడు. రాజు వస్తున్నాడు అంటే ఆమెకు చాలా గుబులుగా ఉంది. కళ్ళల్లో ఇప్పుడు తప్పు ఉండదు. కళ్ళు ఇప్పుడు ఎలా చూసినా తన కంటికి మాత్రం మోసమూ, ద్రోహమే కనిపిస్తుంది. ఎలా అతడిని చూడటం చప్పున లేచేసింది రాధిక. అతను వచ్చేస్తున్నాడు. తనతో మాట్లాడుతాడు. తనను చూస్తాడు. కళ్ళు వొద్దు. చూపులు వొద్దు. కానీ ఎలా? జీవితాంతం తప్పుని చూపులే కదా. ఏమో, ఇప్పుడు మాత్రం ఒద్దు. మోసాన్ని భరిస్తూ ఏమీ జరగనట్లు మాట్లాడటం తన వల్ల కాదు.

ఏమయినా అడిగేస్తాను. మాట జారుతాను. జగన్ వింటాడు. కుసుమకు తెలుస్తుంది. నాన్నకు తెలుస్తుంది. అమ్మ బాధపడుతుంది. రాజువాళ్ళ పేరెంట్స్‌కూ తెలుస్తుంది. ఒక్క మాట జారితే, ఇందరి ఎదుట తమ గౌరవం కుప్పకూలిపోదూ. ఎవరో పరాయివాళ్ళుకాదే వీళ్ళంతా నాగురించి ఏం అనుకుంటారు, అతడిని మందలిస్తారా, వెనకేసుకొస్తారా? ఛ అసలు వీళ్ళందరికీ ఎందుకు తెలియాలి, రాజుతో మాత్రమే తేల్చుకుంటే పోతుంది కదా. ఏం పోతుందో ఎలా పోతుందో తేల్చుకోలేకపోతోంది రాధిక. కనీసం మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలా దీనికి నాలుగయిదు సమాధానాలూ తోచడం లేదు. ప్రస్తుతానికి ఈ ప్రశ్నను వదిలెయ్యడమే ఉత్తమం అనిపించింది.

ఏదో కాల్ వస్తున్నట్లు తన ఫోన్ అందుకుని, జగన్‌ను వదిలి గదిలోంచి వెలుపలకు వచ్చింది. ఎవరికయినా కాల్ చేస్తే, వాళ్ళతో మాట్లాడుతూ ఉన్నట్లు ఉంటే, రాజు తనను పలకరించడు కదా. కానీ ఎవరికి ఫోన్ చెయ్యాలో తెలియలేదు. రాత్రి పన్నెండున్నర అవుతోంది. వొద్దు...అతనిని గురించి ఆలోచించొద్దు అని మనసు వారించేలోపలే ఏదో బలీయమయిన శక్తి ఆదేశించినట్లు అసంకల్పితంగానే చైతన్యకు డయల్ చేసింది. ఫోన్ రింగవుతోంది. ఒక్కొక్క రింగు పూర్తయ్యేలోగా కాల్ కట్ చేద్దాం అనుకున్నా ప్రస్తుతానికి అక్కడినుంచి పారిపోవాలి అనే ఆత్రుతముందు అభిమానం నెగ్గడం లేదు.

*సమస్యనుంచి పారిపోవడం ఎప్పుడూ మరో కొత్త సమస్యను పుట్టిస్తుంది. రాతి యుగాల చరిత్రనుండి నేర్చుకుంటున్నా అదే తప్పు మళ్ళీ చేస్తుండడం మన నైజం.*

కారిడార్ చివరనుండి రాజు రావడం గమనించింది. అతను దగ్గరకు రాగానే అతనితో మాట్లాడాలి అనే ఊహ కలగగానే ఆమె పెదాలు ఎండిపోతున్నాయి. ఇన్నాళ్ళూ అతడిని ఎంత ఆత్మీయంగా అల్లుకుంది. చిన్నపాటి లోపాలు కనిపించినా, ఒక మంచి స్నేహితుడే కదా. టెడ్డీబేర్‌లా ముద్దొచ్చిన మనిషి. అతని శరీరంక్రింద నగ్నత్వంలో నలిగిన రాత్రులు స్ఫురణకు వచ్చాయి. మొద్దుబారినట్లు అయిపోయింది. అతను వొచ్చేస్తున్నాడు.

"ఏంటోయ్ బయటే ఉన్నావ్?" పెదవులు తెరవలేదు కానీ కనుబొమలతోనే పలకరిస్తున్నాడు. అవే కళ్ళు, గంట క్రితం ఎంత మోసాన్ని నింపుకున్నాయి. భయంకరమయిన ఊసరవెల్లులు కూడా మోసపూరితమయిన కళ్ళముందు దిగదుడుపే.

"పద" అంటూ భుజంపై చేయి వేసి లోపలకు దారితీసాడు. స్పర్శను విసిరికొట్టాలి అనిపించింది. ఫోన్‌ను చెవికి అతికించుకుని స్థాణువులా నిలబడింది.

"ఏవరూ?" ఫోన్‌ను వేలితో చూపుతూ సైగల్లో ప్రశ్నించాడు.

"ఏదో కేసులే" చైతన్య ఆన్సర్ చేయకపోయేసరికి కాల్ కట్ చేస్తూ అబద్ధమాడేసింది. ఇప్పుడు ఇతనితో ఎంతసేపు ఇలా? వెళ్ళిపోవాలని పాదాల్లో ఎంత ఆరాటంగా ఉన్నా అతడినే అనుసరిస్తూ వెళ్ళింది.

జగన్ తన పిల్లాడిని చూపించి మురిసిపోయాడు. బావామరదులిద్దరూ సరదా మాటల్లో మునిగిపోతే పిల్లవాడిని పట్టుకుని కుసుమ పక్కన నిర్వేదంగా కూర్చుండిపోయింది. పిల్లాడికంటే అలసటగా నిద్రపోతోంది కుసుమ. భయంకరమైన ఒంటరితనం ఆవహించినట్లు అనిపించింది రాధికకు. పొత్తిళ్ళలోని పిల్లాడి పిడికిలిని మెల్లగా తెరచి తన చూపుడు అతని అరచేతుల్లో ఉంచింది. వెంటనే వాడి వేళ్ళు బలంగా చుట్టేసుకున్నాయి. "గ్రాస్ఫరిఫ్లెక్స్" మనిషి అంతర్లీనంగా చాలా అభద్రతా భావంతో ఉంటాడు. పుట్టినప్పుడు అది బాహాటంగా వెలిబుచ్చుతాడు. ఆసరా దొరికితే పట్టేసుకునే ఈ అసంకల్పిత ప్రతీకార చర్య, శిశువులో బలంగా ఉండి ఎదుగుదలలో బలహీనపడి క్రమేపీ మాయమవుతుంది. కానీ మానసికంగా మాత్రం ఎప్పుడూ ఏదో ఆసరా కోసం ఆరాటం ఉండనే ఉంటుంది. తనకూ ఇలాంటి పిల్లాడు ఒకడు ఉంటే బావుండననే కోరిక ఆమెలో బలంగా అలుముకుంది. మొట్టమొదటిసారి పీడియాట్రిక్ వార్డుకు వెళ్ళినప్పుడు, ఇన్‌క్యూబేటర్లలో బలహీనంగా ఉన్న పసిగుడ్డులను చూసినప్పటినుంచి వాళ్ళంటే ఒకరకమయిన మోజు. లేబర్ రూములో కాన్పులు చేసిన రోజుల్లో తొలిసారి గాలి పీల్చుకోవడానికి పిల్లలు పడే ప్రయాస, వాళ్ళను ఏడిపించడానికి అదే పనిగా పిర్రమీద కొట్టి వాళ్ళు ఏడిస్తే చాలు అని ముద్దు పెట్టుకునే తల్లులు, వేలు పెదవులకు తాకగానే తల్లి స్తనం ఏమో అని ఆత్రుతగా చుట్టేసే గులాబీరేకుల్లాంటి పెదవులు... అన్నీ అన్నీ గుర్తుకొచ్చాయి ఆమెకు.

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనిపించేంది ఆ తొలి క్షణాల్లోనే. కుక్కపిల్ల ఉన్నంత ముద్దుగా కుక్క ఉండదు. పసిగా ఉన్నప్పుడు పందికూడా ముచ్చటగానే ఉంటుంది. మనిషికూడా అందుకు మినహాయింపు కాదు కదా అనిపించింది ఆమెకు.

ఈ పిల్లవాడు పెరిగి పెద్దయ్యాక ఎంత దుర్మార్గుడవుతాడో. ఏమో. మగ పిల్లాడు. ఆడదాన్ని ఎలా చూస్తాడో. ఇలా ఎప్పుటికీ పసిగానే అమాయకంగానే ఉండిపోవచ్చు కదా. జన్మతః సంక్రమించే స్వచ్ఛతను పోగుట్టుకుంటూ పెరగడం ఎందుకు. తన ప్రశ్నలు తనకే అర్థరహితం అనిపిస్తుండగా పిల్లాడిని భద్రంగా కుసుమ పక్కనే ఉన్న ఉయ్యాలలో ఉంచి మెల్లగా పక్కగదిలోకి వెళ్ళింది.

"హే.. నేనే వద్దాం అనుకుంటున్నా. ఒక చిన్న విషయంరా" రాజు తన వేపు వస్తుంటే స్థాణువులా నిలబడిపోయింది. "పార్టీలో కొన్ని బిగ్ హెడ్స్ కలిసాయి. ఫాంహౌస్ నుంచి వాళ్ళ ఫ్లాట్‌లో ఒక సిట్టింగ్‌కు పిలిచారు. మధ్యలో మిమ్మల్ని చూసి పోదామని వచ్చా.

వాళ్ళే నన్నిక్కడ డ్రాప్ చేసారు. కారులో నువ్వు ఇంటికి వెళ్ళిపోతావా? అలా అయితే క్యాబ్ పిలుస్తా లేక నేను నిన్ను డ్రాప్ చేసి కారు తీసుకువెళ్ళేదా?" హడావుడి పడ్డాడు రాజు.

అతనితో ఇలాంటి సందర్భాలు తనకు కొత్తేమే కాకపోయినా ఆ సాయంత్రం తాను చూసిన సంఘటనను గుర్తుకుచేసుకుని అనుమానపడింది రాధిక.

ఎవరు ఈ ఫ్రెండ్స్? ఎక్కడికి వెళుతున్నాడు? రాత్రంతా ఇంటికి రాకుండా గడిపేంత డిస్కషన్స్ నిజంగా వ్యాపార సంబంధమయిన స్నేహాలేనా? మహా అయితే ఆఅవంతికతో గడుపుతాడు. గడపడం అంటే కబుర్లేనా. ఖచ్చితంగా కాదు. సెక్స్. అంతేగా. ఏమో. ఆమె కాకుండా ఇంకొకరు ఉంటారేమే. ఎవరైతే ఏం, అతని శరీరం ఇంకెవరితో ఉంటే తనకేం? లేదా పెళ్ళిలో శరీరాలపై హక్కు ఉంటుంది కదా. మనిషికీ జంతువూకూ అడవికీ సభ్యసమాజానికీ ఉన్నది చిన్న తేడానే కదా. రాత్రంతా అడవిలో జంతువులా గడిపేసి పొద్దున్నే సమాజం తాలూకు మనిషిలా తనదగ్గరకు వచ్చి చాలా ముచ్చటగా మాట్లాడుతాడు.

"ఛీట్ గెట్ అవుట్ అండ్ డోంట్ కం బ్యాక్"

అరిచి గోల చెయ్యాలి అనే అవేశాన్ని అదుపుచేసుకుంటూ, "ఐ విల్‌గో. యూ టేక్ కేర్" అంది. అతడితో ఇప్పుడు ఇంటిదాకా వెళితే దారిలో కారులో ఏ గొడవ మొదలవుతుందో! సరే మరి అంటూ కాస్తంత ప్రేమ నటించేసి అతను వెళ్ళిపోయాడు. నిస్పత్తువగా కూర్చుండిపోయింది రాధిక.

" ఏంటీ..ఏమైనా ప్రాబ్లమా?" ఆమె పక్కనే కూర్చుంటూ అడిగాడు జగన్.

ఏమీ లేదే అన్నట్లు చూసింది. "లేదు..తను లేకుండా ఒక్కతే వొచ్చావ్. తనతో వెళ్ళనంటున్నావ్. సరిగ్గా మాట్లాడను కూడాలేదు" ఆమెను నిశితంగా గమనిస్తూ అన్నాడు

***ముఖం ఒక నమ్మకద్రోహి. మనం చెప్పినట్లే ఉంటున్నట్లు మనల్ని నమ్మిస్తుంటుంది కానీ మనసులోని ఊసులన్నీ తేటతెల్లంగా ప్రపంచానికి చెప్పేస్తూ ఉంటుంది.***

మాట్లాడలేనట్లు మౌనం వహించింది రాధిక.

"అక్కా నువ్వు ఏమీ అనుకోనంటే ఒకటి చెబుతా" కుసుమకు పొరపాటున కూడా వినిపించకూడదు అన్నట్లు గొంతు తగ్గించి అన్నాడు జగన్.

అతని ప్రవర్తన చాలా వింతగా తోచింది రాధికకు. చాలా రోజులు, కాదు కాదు, సంవత్సరాలయ్యింది అతనూ తనూ ఆ-త్మీయంగా మాట్లాడుకుని.

"నువ్వు గమనించావో లేదో, ఎన్నిరోజులయ్యింది తెలుసా నువ్వు నన్ను ఓరే అంటూ చనువుగా కసురుకుని?" జగన్ కూడా అదే విషయం చెబుతుంటే ఆశ్చర్యపోయింది.

"ఇందాక బావతో మాట్లాడుతుంటే ఇదంతా గుర్తొచ్చింది. మనం ఇలా చిన్నప్పటి విషయాలు తల్చుకోవడం, పోట్లాడుకోవడం, వెక్కిరించుకోవడం అంతా తమాషాగా ఉంది. ఐ థింక్ నువ్వు అన్నేళ్ళు మాకు దూరంగా అమెరికాకెళ్ళడం, పెద్ద డాక్టరు అయ్యి వచ్చాక సొసైటీలో నువ్వు హయ్యర్ పొజిషన్‌కు రావడం, నా ఆస్తులు పెరగడం.. ఎంటో ఇవన్నీ మనలను మనమే చాలా దూరం చేసుకున్నట్లు అనిపిస్తున్నాయి"

వీడు ఇలాకూడా ఆలోచించగలడా? మనిషికీ బిల్డింగుకూ తేడా లేదనేవాడు మనసుల గురించి, కోల్పోతున్న మానవ సంబంధాలగురించీ చెప్పడమే!

"నువ్వు వచ్చినప్పటినుంచీ గమనించా. అబ్బాయిని చూస్తున్నప్పుడూ, వాడిని నాకివ్వకుండా అల్లరి చేస్తున్నప్పుడూ ఎంత హ్యాపీగా కనిపించావో తెలుసా. నిన్ను అలా చూసి ఏజెస్ అయినట్లుంది. ఇప్పుడు బహుశా నువ్వు మూడీగా ఉండటనికి కారణం ... "

చెప్పలేనట్లు తటపటాయిస్తున్న జగన్? చేతిమీద చేయి వేసి," అలా ఏం లేదురా ..మూడురోజులుగా సరిగా నిద్రలేదు అందుకే అలా ఉన్నా" రాధిక మాటను కొనసాగించనివ్వలేదు జగన్.

"నన్ను చెప్పనీ. ఒకవేళ నేను అనుకునేది తప్పు అయినా పర్లేదు. ఇందాక బావతో మాట్లాడేప్పుడు తను కూడా ఏదో ఇబ్బందిగా కనిపించాడు. ఐ థింక్... మీకు పిల్లల్లేరని బాధపడుతున్నా.." ఇక చెప్పలేనట్లు మాట మింగేసాడు.

" ప్లీజ్ ఆ టాపిక్ వొదిలేయ్" తన గొంతులోని నిస్సత్తువ రాధికకే స్పష్టంగా వినపించింది.

"ఇలా అవాయిడ్ చేస్తే ఏంవొస్తుంది. సారీ, నిన్ను హర్ట్ చెయ్యాలని అనట్లేదు. కానీ నాకొక చిన్న ఆలోచన వొచ్చింది" జగన్ కుర్చీను ఆమెకు ఎదురుగా లాక్కుని ఆమె చేతులు పట్టుకుని కొనసాగించాడు. "ట్రస్ట్‌మీ. పిల్లలు ఉంటే నువ్వు చాలా హ్యాపీగా ఉంటావు. నీ హెల్త్ ప్రాబ్లమ్స్. ఏమిటో నువ్వు డీటైల్డ్‌గా చెప్పినా నాకు అంత అర్థం కాదు. ఒకసారి బావ చెప్పాడు, మీరు అడాప్షన్ కూడా కన్సిడర్ చేసారు అని, కానీ తనకు అంత ఇష్టం లేదు. ఎంతయినా జెనెటిక్‌గా మన పిల్లలు మన పిల్లలే కదా అంటాడు"

రాజు తర్కాలు ఆమెకు తెలియనివేమీ కాదు. అయినా జగన్‌కీ అతనికీ మధ్య ఇన్ని మాటలు గడిచినట్లు మొదటిసారిగా తెలుసుకుంటోంది.

"ఇప్పుడే ఒక ఆలోచన వస్తోంది. వీడితో మాకు ఇక చాలు అనుకుంటున్నాం. కానీ, మీకోసం కావాలంటే ఇంకొక పిల్లాడ్ని.." రాధిక చేతులను తన పెద్ద చేతుల్లో పొదువుకుంటూ అన్నాడు.

" ఏంట్రా ఈ ప్రపోజల్?. కుసుమ ఏం అనుకుంటుంది" అసంకల్పితంగానే అనేసింది రాధిక.

"అంటే నీకు ఓకేనా?" జగన్ కళ్ళు మెరిసిపోయాయి

"లేదు..లేదు. అలా అనలేదు"

"ఏంటి ప్రాబ్లం? నేనేమీ త్యాగం చెయ్యడం లేదు. కొంచెం కూల్‌గా ఆలోచించు. మాకు ఇక చాలు అనుకున్నప్పుడు ఇంకొక్క పిల్లాడ్ని కని, మీకు ఇస్తాం. పిల్లలను నువ్వు ఎంత బాగా చూసుకుంటావో నాకు తెలీదా? అయినా మా ఇంట్లో పెరిగేవాడు మీ దగ్గర పెరుగుతాడు అంతేగా. పైగా బావ చెప్పినట్లు వేరేవాళ్ళ జీన్స్ అవీ కావు . పిల్లలకు మేనమామ పోలిక అదృష్టం అనుకోవడం కామనే కదా"

అతని మాటలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి సమాధానం కోసం తడుముకుంది రాధిక.

"ఇట్స్ నాట్ ఎట్ ఆల్ ఏ ప్రాబ్లం. కుసుమను నేను కన్విన్స్ చేస్తాను. తను ఏం అనుకోదు. తనకు ఎలాగూ పిల్లలను మోయడం కనడం చాలా ఇష్టం. చూసావుగా, సిజేరియన్ ఒద్దని నేచురల్ డెలివరీనే ఛూజ్ చేసుకుంది. నీకోసం పిల్లాడిని కనమంటే ఏం అనుకోదు"

రాధికకు మాటలు కరువయ్యాయి. కొన్నినెలలక్రితం కుసుమ కారు దిగుతుంటే సహాయం చెయ్యలేదని, ఆడవారిని అర్థంచేసుకోలేని మొద్దు మనిషి అని అతడిని తిట్టిన సందర్భం స్ఫురించింది. అలాంటి వ్యక్తి తన మాతృత్వాన్ని గురించి ఇంత ఆలోచించి, ఇంత పెద్ద సహాయం చెయ్యాలి అనుకోవడం ఆమెకు చాలా వింతగా తోచింది.

"రాజుతో కూడా నేను మాట్లాడుతాను. వేరేవాళ్ళను అడాప్షన్? అంటే పెద్దయ్యాక ఆస్తులూ గొడవలూ ఉంటాయి. మన ఇంటి పిల్లాడికి అయితే అవేమీ ప్రాబ్లంమ్స్ కావు.. "

"ఊరుకోరా" అతడి వాక్ప్రవాహానికి అడ్డుకట్టవేస్తే కరిగిపోయింది రాధిక. అతను మరింతగా ఆస్తులగురించి మాట్లాడటం మొదలెడితే మళ్ళీ చిరాకు పుడుతుందేమో అని భయంకూడా వేసింది. *ప్రతి మనిషిలోనూ మనకు నచ్చేవీ నచ్చనివీ కలిసి ఒక ప్యాకేజీలా*

*వస్తాయి. నచ్చనివాటినే గ్రహించి బాధపడినన్ని రోజులూ నచ్చే అంశాల్ని చూసే అవకాశాన్ని పోగొట్టుకుంటాం.* తమ్ముడిలోని సున్నిత భావాలను ఇన్నిరోజులుగా పట్టించుకోనందుకు నొచ్చుకుంటూ,

"చాలా థాంక్స్‌రా. ఆ మాటే చాలు. నువ్వు ఎంతసేపూ నాగురించీ, మన గురించీ ఆలోచిస్తున్నావ్ కానీ, అలాంటి పని చేస్తే పిల్లాడి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పు. వాడు మమ్మీ అని నన్ను పిలవాలా కుసుమను పిలవాలా?" అని ప్రశ్నించింది

"నిన్నే పిలుస్తాడు. ఇంక మీకు ఇవ్వడమెందుకు?" అయోమయంగా అడిగాడు

"సో రాజునూ నన్నూ పేరెంట్స్‌గా అనుకుంటాడు. అంటే ఎప్పటికీ మీరు తన పేరెంట్స్ అని తెలియదా?"

సమాధానం చెప్పలేక తడబడ్డాడు జగన్.

"మీరు చెప్పకపోయినా, ఎవరో ఒకరు చెపుతారు కదా. అప్పుడు వాడు ఎంత కన్ఫ్యూస్ అవుతాడో ఆలోచించు. నేను ఒక మాట అంటే మీ దగ్గరకు పారిపోయి వచ్చేసినా వచ్చేస్తాడు. ఎవరో తెలియని పిల్లాడిని అడాప్ట్ చేసుకున్నా పేరెంట్స్ ఎవరో తెలియక కొంచెం రిలాక్స్‌డ్‌గా ఉంటాడు కానీ పక్కపక్కనే ఉంటే ..ఒద్దులే. చూసినకొద్దీ చాలా ప్రాబ్లమ్స్ తెలుస్తాయి. అయినా నా ఒక్కదాని సంతోషం కోసం ఇంత కాంప్లికేషన్ ఎందుకు?" అంటూ కళ్ళు చెమర్చేలోగానే కర్చీఫ్ అందుకుంది.

పెదవి విరిచాడు జగన్ "ఎక్కువ చదువుకుంటే ఇదే ప్రాబ్లం. అన్నిటికీ ఓ తెగ ఆలోచిస్తారు" మూతి ముడుచుకున్నాడు.

ఆనందబాష్పాల్లో ఫక్కుమంది రాధిక.

"నీ ఇష్టం. ఇంకా ఇంకా బాగా ఆలోచించు. సడెన్‌గా చెప్పాను కాబట్టి ఏదో ఆవేశంలో అన్నాను అనుకుంటున్నావేమో. నువ్వు ఎప్పుడు యస్ అన్నా కుసుమతో మాట్లాడి ఒప్పిస్తాను" అంటూ ముక్కుగోక్కున్నాడు. అతడిని దగ్గరకుతీసుకుని తల మీద మొట్టి, ముక్కు గిల్లి అల్లరి చేయాలి అనిపించింది రాధికకు. రాజు మీది కోపాన్ని దాచుకోవడం కంటే తమ్ముడిపై ప్రేమను అదుపు చేసుకోవడం మరింత కష్టంగా తోచింది. ఆమెను కష్టంనుంచి బయటపడెయ్యాలన్నట్లు ఫోన్ మ్రోగింది. డిస్‌ప్లేలో చైతన్య పేరు చూసి, పక్కకువెళ్ళి ఆన్సర్ చేసింది

"ఏమిటీ ఈ టైంలో ?" నిద్రనుంచి లేచినట్లు తేటగా ఉంది అతని గొంతు.

"వీవా దగ్గరే ఉన్నావా? నేనొక కేసు గురించి హాస్పిటల్‌కు వస్తున్నాను" అతని కోసమే వెళుతున్నానని చెప్పేందుకు అభిమానపడింది.

"అవునా. నీకు కుదిరితే ఇటు వస్తావా? వీడికి ఈవినింగ్ కాస్త ఫీవర్ వచ్చింది. డ్యూటీ డాక్టర్ చూసాడు. ఇప్పుడు తగ్గిపోయింది. అప్పటినుంచీ నిద్రపోతూనే ఉన్నాడు"

"సరే ఒక హాఫ్‌అవర్‌లో వస్తాను" అని చెప్పి, జగన్ దగ్గర కూడా శెలవు తీసుకుంది.

కారు తీస్తున్నప్పుడు ఒక ఆలోచన బాధించింది. అర్థరాత్రి, రాజుకూ, జగన్‌కూ అబద్దం చెప్పి ఒక పాత మిత్రుడిని కలుసుకోవడానికి వెళుతోంది. సమాజం దృష్టిలో రాజు చేసిన తప్పే తాను చేస్తున్నట్లే కదా. *"ఎక్కువ చదువుకుంటే అంతే ఎక్కువ ఆలోచిస్తారు"* జగన్ మాటను తల్చుకుని, తన ఆలోచనలను చంపేసుకుంటూ యాక్సిలేటర్ తొక్కింది.

*బాగా ఆలోచించి నిర్ణయించుకోవలసిన విషయాలన్నీ ఎప్పుడూ చాలా తేలికయినవిగా కనిపించి మోసం చేస్తూనే ఉంటాయి.*

"ఇట్స్ ఓకేలే.. కాస్తంత టెంపరేచర్ రైజ్ అయ్యింది అంతే. బ్లడ్ ట్రాన్స్ఫ్యూషన్, సర్క్యులేటరీ డిస్టర్బెన్స్ అన్నీ ఉన్నాయి కదా, ఇంకో టూ త్రీ డేస్ అలా ఉండొచ్చు. సీరియస్ ఫీవర్ ఏం కాదు. ఒకవేళ అయితేకూడా యాంటిబయాటిక్స్ డోస్ పెంచితే సరిపోతుంది" వివేకానంద కేస్ షీట్ చూసి భరోసా ఇచ్చింది రాధిక.

ఆందోళనగా చూస్తున్న చైతన్య ముఖంలో శాంతిఛాయలు విచ్చుకున్నాయి. "ఇదే మాట ఇంతకుముందు డ్యూటీ డాక్టరు కూడా చెప్పారు. కానీ నువ్వు చెపితేనే హ్యాపీ" వివేకానంద నిద్రలో దొర్లిపోతాడేమోనని ముందు జాగ్రత్తగా బెడ్కు రెండువైపులా ఉన్న గార్డులను సరిగా అమరుస్తూ నవ్వాడు చైతన్య. వివేకానంద ముఖాన్ని నిదానంగా గమనించింది. ఇప్పుడే చూసొచ్చిన జగన్ కొడుకు ముఖం కంటే పరిణితి కనిపిస్తోంది. పదేళ్ళ తేడాలోనే చాలా పసితనాన్ని కోల్పోయిందా ముఖం.

"పిల్లలు ఎప్పుడూ ఇలానే ఉండిపోతే బావుణ్ణు కదా" గొణిగినట్లు అంది.

చప్పున తలతిప్పి చూసాడు చైతన్య. అతని కళ్ళలోని మెరుపును ఆమె ఇట్టే పసిగట్టింది. "ఏంటీ ఏదయినా కవిత్వం చదివొచ్చావా?" ఆమె చెబితే వినొచ్చన్న ఆశతో అడిగాడు. జీవితాన్ని చదివాను అందాం అనుకుంది కానీ మరీ సినిమా డైలాగులా ఉన్నట్లనిపించి మాట మింగేసి నవ్వుకుంది.

"చాలా హ్యాపీ మూడ్లో ఉన్నట్లున్నావ్?"

ఎందుకో కానీ చైతన్య మాట అనగానే నిజంగానే ఉల్లాసంగా అనిపించింది రాధికకు.

"నువ్వు ఇక్కడే పడుకుంటావా?" గదిలో ఒక పక్కగా ఉన్న అతని పడకను, పక్కనే ఉన్న పుస్తకాలనూ గమనిస్తూ అడిగింది. వెంటనే తనది ఎంత మూర్ఖమైన ప్రశ్నో తోచింది. వీవాకు అటెండెంట్గా అతను తప్ప మరెవ్వరూ లేరు కదా. అతను ఏం చదువుతున్నాడో అని పుస్తకాలను అందుకుంది.

"డోంట్ ఎక్స్పెక్ట్ టు సీ కమ్యూనిజం ఆర్ వార్ స్టోరీస్" అతను అంటుండగానే అందంగా బైండ్ చేసిన ఒక పుస్తకాన్ని తెరచి చూసింది. దాదాపు ముఫయ్యయిదేళ్ళ క్రితం నాటి "చందమామ" సంచిక. పేజీలు పాతబడిపోయి ఉన్నాయి. అలాంటివి పది కూర్చి బైండు చేసి ఉన్నాయి.

"నాకోసం నేను చదవడం మానేసాను. వీడికి చెప్పడం కోసం అలాంటివీ, పంచతంత్రాలూ ఎట్సెట్రా" అని అతను అంటుంటూ, చందమామ కథలోని బొమ్మలను అబ్బురంగా చూస్తూ అక్కడే కూర్చుంది రాధిక. పుస్తకం ప్రచురితమయినప్పటికి ఆమె అక్షరాలు కూడా నేర్చి ఉండదు. చైతన్య కూడా అంతేగా అనుకుని "ఎక్కడ కలెక్ట్ చేసావు?" అని అడిగింది.

"క్వొశ్చిన్ అడగకపోతేనే బెటర్ ఏమో" ఇబ్బందిగా చూసాడు అతను

"మాట అన్నావూ అంటే అబద్ధం చెప్పడం ఇష్టం లేదనేగా"

"ఎట్ ది సేం టైం నిజం చెప్పడం కూడా ఇష్టం లేదు "

"ఎందుకనీ?"

"బావోదు "

"అంటే.."

"బాధ కలిగిస్తుంది "

"ఎవరికి?"

"డజ్ ఇట్ మేటర్? ఇద్దరిలో ఎవ్వరికి బాధ అయినా ఇంకొకరికీ తప్పదు కదా"

"ఓయ్ సినిమాడైలాగా" తను అంత తేలికగా మాట్లాడినందుకు తనే విస్తుబోయింది రాధిక.

అతనూ తేలికగా నవ్వేశాడు. "నువ్వు ఏం మారలేదు. పదమూడేళ్ళూ ఇలానే అందరితో ఆర్గ్యూ చేస్తూ గడిపావా?"

అతను అన్నాకే స్ఫురించింది రాధికకు. అతనినుండి దూరమయ్యాక అంతగా ఎవ్వరితోనూ తను వాదించలేదు. నాలుగు మాటలు మాట్లాడితే విషయం మార్చేసేవాడు రాజు.

"ఇంతకీ మీ ఆయన గురించి చెప్పనే లేదు" ఆమె లోచనలను అనుసరిస్తున్నట్లు అడిగాడు అతను.

"ఇంతకీ ఈ చందమామ పుస్తకాలు ఎక్కడివో చెప్పనే లేదు" ప్రస్తావన దాటిపోనివ్వలేదు ఆమె

"చెప్తాను. కానీ స్పోర్టివ్‌గా తీసుకో. నువ్వు అమెరికా వెళ్ళిపోయిన తొలిరోజుల్లో నీ గురించే తెగ ఆలోచించేవాడిని కదా. టైంలో మా లెక్చరర్ ఒకతను ట్రాన్స్‌ఫర్ అయి ఇల్లు ఖాళీ చేస్తూ ఈ పుస్తకాలు పారెయ్యబోయాడు. అవి తీసుకున్నాను. ఇలా బైండ్ చేయించి నీకు మెయిల్ చేద్దాం అని.."

"ఎందుకూ?" కళ్ళు మిటకరించింది రాధిక

"నవ్వకూడదు"

"చెప్పవోయ్"

"అవన్నీ చూసి నువ్వు నన్ను మిస్ అయ్యి మీ ఆయన్ను వదిలి వచ్చేస్తావనీ" జోక్ చేసినట్లు నవ్వినా అతడి కళ్ళలో నిజమైన బాధ.

ఆమెకు నవ్వురాలేదు. చాలా గుబులుగా అనిపించింది.

"యూ నో..ఏవో సిల్లీ లవర్ బోయ్ ఐడియాలు. తర్వాత పెద్ద త్యాగశీలిలా మీకు పిల్లలు పుట్టినట్లు తెలిస్తే గిఫ్ట్ చేద్దాం అనుకున్నా. చివరకూ వీడికి పనికొస్తున్నాయి.." ఆమె చేతుల్లోంచి పుస్తకం తీసుకుని పక్కన ఉంచాడు.

చాలా ఉక్కగా అనిపించి చెంపలు తుడుచుకుంది రాధిక. "జ్వరం వస్తుందని ఏసీ ఆఫ్ చేశాను" వివేకానందను చూపుతూ అన్నాడు

"ఏమైనా తిన్నావా అసలు" అతని గొంతులో శక్తి తక్కువయినట్టు తోచింది ఆమెకు.

టైం చూసుకున్నాడు. ఒంటిగంట దాటి ఇరవైనిముషాలు.

ఈ సమయంలో ఇదేం ప్రశ్న అన్నట్లున్న అతడి చూపును అర్థం చేసుకుని, "ఐ మీన్ రాత్రి డిన్నర్ చేశావా వీడికి జ్వరం అని పక్కనే ఉండిపోయావా?" వివరించింది రాధిక.

"ఏవో బిస్కట్లు తిన్నాలే. హే ....కాఫీ తాగుదామా" మంచం పక్కన టేబుల్‌పై ఉన్న ఫ్లాస్క్ వేపు చేయిజాస్తూ "అవునూ నైట్ డ్యూటీ ఏమయినా ఉందా?" అన్నాడు.

"నేనొక కేసుగురించి మళ్ళీ త్రీ ఓ క్లాక్‌కు రావాలి. ఈలోగా ఇంటికి వెళ్ళబుద్దెయ్యడం లేదు" అతడితో మాట్లాడటానికే వచ్చానని చెప్పుకోవడానికి మాత్రం ఆమె అహం అడ్డుపడుతూనే ఉంది

"ఓ పని చేద్దామా? ఇఫ్ యూ డోంట్ మైండ్" ఫ్లాస్క్ మూత తీద్దామా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నట్లు చెప్పాడు.

"చెబితే కదా మైండ్ చెయ్యాలో వొద్దో తెలిసేది "

"ఒక గంట సేపు ఎక్కడికయినా వెళ్ళొద్దమా? ఈ రూంలో సఫొకేటెడ్‌గా ఉంది కాస్త ఫ్రెష్ ఏయిర్"

"ఈ టైంలో ఎక్కడికి?"

"ఊరికే అలా కారులో అలా టాంక్‌బండ్ చుట్టూ ఓ రౌండ్"

ఆమె తటపటాయించింది

"సారీ. ఎవరైనా చూస్తారు అని భయపడితే వొద్దులే "

అతను  మాట యధాలాపంగానే అన్నా ఆమె అహాన్ని రెచ్చగొట్టింది.

అవతల రాజు ఎవరితో ఎక్కడ ఏం చేస్తున్నాడో తెలియదు కానీ తాను మాత్రం కేవలం ఒక స్నేహితుడితో స్నేహంగా గడపడానికి భయపడాలా అని కోపం వచ్చింది. ఒకవేళ ఎవరైనా చూస్తే మాత్రం ఏం? చూడనీ..మొండిధైర్యం వచ్చింది.

"ఒకే .కానీ నేనే డ్రైవింగ్" పర్సులోంచి కారు తాళాలు తీసి నవ్వింది.

***క్షణికమయిన ఆవేశంకంటే క్షణికమయిన ధైర్యం చాలా ప్రమాదకరమయినది.***

***ఆత్మాభిమానంకోసమో అహం కోసమో, ఎందుకు చేస్తున్నామో తేడా తెలియని సందర్భాల్లో తీసుకునే నిర్ణయాలు ఆత్మగౌరవానికి తీవ్రమయిన గాయాలు చేస్తాయి.*** ఎవరూ చూసినా ఫర్వాలేదు అనుకుని  రాత్రి ఆమె అతడిని కారులో తీసుకువెళుతుంటే, అస్సలు చూడకూడని వ్యక్తి చూసి చాలా పెడర్థాలు తీయొచ్చు అనే ఆలోచన ఇద్దరికీ కలుగలేదు.

పార్కింగ్‌లోంచి రాధిక తన కారును రివర్స్ తీస్తుంటే, అప్పుడే అక్కడకు వచ్చింది ఒక కారు.

కారు లోంచి అసూయ నిండిన చూపులు వాళ్ళను వెంబడించాయి.

వివేకానందను చూద్దామని మనసు మార్చుకుని వచ్చిన నీలిమ మెల్లగా వాళ్ళ కారును అనుసరిస్తూ తన కారును నడిపింది.

# 16

**"ఏంటీ అంత సైలెంట్‌గా ఉన్నావ్?"** కారు కిటికీలోంచి చెవుల మీదకు దూకేస్తున్న గాలిని ఆస్వాదిస్తూ డ్రైవ్ చేస్తున్న రాధిక, పక్కన స్తబ్దుగా ఉన్న చైతన్యను పలకరించింది.  పగలంతా జనాభా క్రింద నలిగి అలసిపోయిన నెక్లస్ రోడ్డు వెన్నెలకోసం అర్రులు చాస్తూ విస్తరించుకుని ఉంది. రాత్రిళ్ళు షికారు కెళ్ళేవారినుంచి సొమ్ము చేసుకోవడానికి ఆవులింతలు అణుచుకుంటూ ఐస్క్రీం బండ్లు తోసుకుంటున్నారు కష్టజీవులు.

"ఏం లేదు. నువ్వు చాలా డిఫరెంట్‌గా కనిపిస్తున్నావ్" కళ్ళ మధ్యలో వేళ్ళు నొక్కుకుంటూ కన్నార్పకుండా ఆమెనే చూస్తున్నాడు చైతన్య.

"అచ్చా ఏంటో ఆ డిఫరెన్స్?" రియర్ వ్యూ మిర్రర్‌లో తన కళ్ళను చూసుకుంది రాధిక.

***మనిషికి తనలోని మార్పు తెలియజేయడానికి అద్దం చాలదు కాబట్టే స్నేహితులు ఉంటారు.***

"చెప్పడం కష్టం"

"ఏంటీ.. నా చేత పదిసార్లు అడిగించుకోవాలనా? పోవోయ్..." సుతారంగా స్టీరింగు తిప్పుతూ నాలుకతో బుగ్గచాటున నవ్వును నొక్కుకుంది.

"హహ...నువ్వస్సలు మారలేదు" సీటును కాస్త వెనక్కు వాల్చుకున్నాడు చైతన్య.

"మళ్ళీ అదేంటి?"

"వెల్.. అప్పుడు కూడా నవ్వును ఇలాగే దాచుకునేదానివి"

అతడు ఏ రోజులను గుర్తుచేస్తున్నాడో తానూ గుర్తుచేసుకుంది రాధిక. చల్లగాలి మరింత తేటగా అనిపించింది.

"మే బీ.. దట్ మీన్స్ నాకు అవే మేనరిజమ్స్ ఉన్నాయి అని. నేను డిఫరెంట్‌గా కనిపించడం నా మ్యానరిజం వలనా లేక పర్సనాలిటీ, ఐ మీన్, క్యారెక్టర్ మారిపోయిందనా?"

"రైట్ నువ్వు మారిపోయావ్. ఇంతకుముందు ఇంత ఇంటలిజెంట్‌గా మాట్లాడేదానివి కాదు. ఇంకా స్టుపిడ్‌గా..."

"చే...కమాన్"

"ఒకే.. ఐ మీన్" వెనక్కు వాల్చుకున్న సీటు మళ్ళీ సర్దుకుని ముఖ్యమైన విషయం చెప్పబోతున్నట్లు ముందుకు వాలాడు చైతన్య. కారు వేగం తగ్గించి రోడ్డుకు బాగా ఎడమవైపు డ్రైవ్ చేయసాగింది రాధిక.

"నువ్వు నాకంటే చాలా పెద్దదానివి అయిపోయినట్లు అనిపిస్తోంది" స్టీరింగ్‌పై చేతులు తేలికగానే ఉంచినా, మాట్లాడుతూ తనవంకే చూస్తున్నట్లు అనిపించినా ఆమె చూపులు మాత్రం రోడ్డును వదలకపోవడాన్నే గమనిస్తూ అన్నాడు చైతన్య.

"వాట్ డూ యూ మీన్. థర్టీ ప్లస్ బాబూ. అందరూ ఆంటీ అంటారు. అప్పటి పడుచుపిల్లగానే ఎలా ఉంటాను. తమరేదో ఇంకా అలా ఉండిపోయినట్లు... అవునూ నువ్వు కూడా ఇప్పుడు సొసైటీలో 'అంకుల్' కదా " కళ్ళు చికిలించి నవ్వింది రాధిక.

"అబ్బా, నాతో కంపేరిజన్ కాదు, నేనేం చెబుతున్నాను అంటే.. "

"చెప్పండి అంకుల్" తమషాగా నవ్వేసింది ఆమె. కారు వేగం తక్కువలోనే ఎక్కువయ్యింది.

"అప్పుడు నువ్వు ఒక అందమైన, తెలివైన అమ్మాయివి. గర్ల్. ఇప్పుడు .. యూ ఆర్ ఎ ఫుల్ బ్లోన్ ఉమన్. అమ్మాయికీ ఆడదానికీ ఎంత తేడా?"

"ఒహో.. అలానా! అంకుల్" అతడిని వెక్కిరిస్తున్నట్లు మాటను సాగదీసింది.

"చూడూ ఒకప్పుడు నువ్వు ఇలా అల్లరి చేస్తే చుప్ అని నోరుమూయించేసేవాడిని, ఇప్పుడు అలా అనాలంటేనే ఏదోలా ఉంది"

మౌనంగా వినసాగింది రాధిక.

"నువ్వంటే ఒకప్పుడు ఇష్టం, అభిమానం, ప్రేమ, గౌరవం అన్నీ ఉండేవి. ఇప్పుడు గౌరవమే అన్ని భావాలనూ డామినేట్ చేస్తోంది. ఐ ఫీల్ ఎ బిట్ ఇన్‌ఫీరియర్. నేనెప్పుడు అలా అంత హెల్ప్‌లెస్‌గా ఏడవలేదు తెలుసా. లేదు లేదు, ఏడిచానులే..అప్పుడెప్పుడో.. ఒక్కడినే ఉండిపోయినప్పుడు, పిచ్చికోపం వచ్చినప్పుడు. కానీ ఇంకొకరి ఎదుట ఏడవాలి అంటే ఎంత అహం అడ్డొచ్చేదో? ఆ రోజు, మనం గుడిలో విడిపోయినప్పుడు నువ్వు ఏడిచావ్. నాకు మాత్రం ఒక్క కన్నీటి చుక్క కార్చాలంటే ఎంత ఈగో అనిపించిందో. అలాంటిది మొన్న హాస్పిటల్‌లో నిన్ను అలా పట్టేసుకుని..." రాధిక వింటోందా అని చూసుకుని, ఆమె ముఖంలోని నిర్మలత్వం చూసి కొనసాగించాడు "అలా ఏడ్చేసానూ అంటే, సబ్‌కాన్షస్‌గా నేను నీకంటే సుపీరియర్ అనే భావం పోబట్టే. నాకంటే నువ్వు పెద్దదానివి అనుకోబట్టే "

"సరే సరే.. ఇప్పుడెందుకు అదంతా..." కారు మెల్లగా రోడ్డువారగా ఆపింది రాధిక

"హే..ఎందుకు ఆపుతున్నావ్? అలసటా? నేను డ్రైవ్ చెయ్యనా?"

"నోనో, ఏదో సీరియస్‌గా చెబుతున్నావ్ కదా డిస్ట్రాక్షన్ ఎందుకూ అని.."

"ఒద్దు.. ఇక్కడ ఈ టైంలో ఇలా ఆపి మాట్లాడుకోవడం బావోదు. లెట్స్ గో బ్యాక్. హాస్పిటల్‌లోనే బెటర్" కంగారుగా రోడ్డు మీదకు చూసాడు. అప్పుడప్పుడూ వచ్చేపోయే కార్లు తప్ప ఇంకే జనసంచారం కనిపించలేదు. తమ కారుకు వెనుకగా, చాలా దూరంలో, లైట్లు ఆఫ్ చేసుకుని ఉన్న కారును అతను గమనించలేదు.

"ఇలా సెక్లూడెడ్‌గా ఉన్నప్పుడు ఎవరైనా మనలను చూస్తే బావోదు" అతని కళ్ళల్లో ఇంకా అదే కంగారు.

"అరే మనమేమైనా అడవిలో ఉన్నామా, సిటీనే కదా" తేలికగా తీసుకుంది రాధిక.

"అడవి అయితే ఇంత భయం ఉండదు. వేరే ఎవరో ఎందుకూ, నైట్ పెట్రోల్ పోలీసులు చూసినా బాగోదు. మనం ఎవరూ, ఈ టైంలో ఇక్కడ ఏమిటీ అని యక్షప్రశ్నలు వేస్తారు, నాలుగు లంచం డబ్బుల కోసం మోరల్ పోలీసింగ్ చేస్తారు, లెట్స్ గో.." ఇక వివరించలేనట్లు చెప్పాడు.

అతడి మాటకు ఎదురు చెప్పడం ఇష్టం లేనట్లు, గేరు వేసి యాక్సిలరేటర్ తొక్కింది. అతని చూపుల్లో గాభరా తగ్గడం గమనిస్తూనే "ఐ థింక్, నీకంటే నేను పెద్దదానిలా అనిపించడానికి కారణం నేను మెచ్యూర్డ్‌గా ఉండటం కాదేమో, నువ్వు ఇమెచ్యూర్డ్‌గా అయిపోవడం ఏమో!?" అంది.

"అంటే .." ఆమె మాటకు అతనిలో కాస్తంత రోషం పుట్టింది.

"అప్పట్లో..అర్థరాత్రి ఎవరు చూస్తారూ ఏమిటీ అనే భయం లేకుండా నన్ను బైక్ మీద కూర్చోబెట్టుకుని సముద్రం ఒడ్డుకు తీసుకెళ్ళి వెన్నెల చూపించావ్. ఎవ్వరైనా అల్లరి చేసే అన్‌వాంటెడ్ ఎలిమెంట్ వస్తే ఎదుర్కోవడానికి ఒక కత్తి కూడా పట్టుకొచ్చావు..." ఆమె చెబుతుంటే ఆ జ్ఞాపకంతో అతడి ముఖం విప్పారింది.

"యూ నో, ఎన్నిసార్లు తలుచుకున్నానో తెలుసా! ఆ వెన్నెల, ఆ సముద్రం. వాటన్నిటికన్నా దేన్నయినా ఎదుర్కుంటాను అనేట్లుండే నీ మనస్తత్వం. ఇప్పుడేంటి ఇలా భయస్థుడిలా.." ఆమె గొంతులో బాధ కలుక్కుమంది.

"ఇదేం భయం కాదు రాధీ. అప్పుడయినా ఇప్పుడయినా నా కన్సర్న్ నీ గురించే. ఇక్కడ ఇదే టైంలో ఇంకెవరో అమ్మాయితోనో, నా వైఫ్‌తోనే, కనీసం అప్పట్లోలా మనిద్దరం ఇంకా పెళ్ళి చేసుకోని కపుల్‌లా ఉంటేనో పర్లేదు. కానీ ఈ ఏజ్‌లో మనకున్న సోషల్ ఐడెంటిటీస్‌తో ఇలాంటి ఏకాంతాల్లో కనిపించడం ఇద్దరికీ మంచిది కాదు. ఇంట్లో మొగుడూపెళ్ళాలు తిట్టుకునే చిన్న విషయాన్ని కూడా రాద్ధాంతం చేసి పబ్బంగడుపుకునే మీడియా ఉన్న రోజుల్లో ఉన్నాం. ***ఇవ్వాళ జనానికి తమ లైఫ్ ఏంటీ అనేదానికన్నా పక్కవాడి లైఫ్ ఏమిటీ అనేదే ముఖ్యం అయిపోయింది.*** ఐ జస్ట్ డోంట్ వాంట్ యువర్ నేం టు బీ మేడ్ స్కాండల్స్"

కారు కదులుతున్నప్పటి నుంచీ అతడి మాట తేటపడటం ఆమె గమనిస్తూనే ఉంది. అతడి మాటా నిజమే అన్నట్లు మౌనం వహించింది.

"ఆరోజు కత్తి పట్టుకురావడం ఏదో హీరోయిజంలా అనిపించిందేమో, నాకయితే ఇప్పుడు ఆలోచిస్తే ఆవేళ నేను చాలా ఇమ్మెచ్యూర్‌గా ప్రవర్తించాను అనిపిస్తోంది. అది నా అహంకారం కాకపోతే నిజంగా ఓ ముగ్గురు రౌడీలు మీదపడితే ఒక చిన్న కత్తి పట్టుకుని నేనేం చెయ్యగలను. పైగా నేనేమీ మార్షల్ ఆర్ట్స్ ఎక్స్‌పర్ట్‌ను కూడా కాకపోతిని. అప్పుడయినా ఇప్పుడయినా నిన్ను కాపాడుకోవడమే నా ముఖ్య ఉద్దేశం. నేనేమీ మారలేదు "

"ఏమో చే, నాకలా అనిపించడం లేదు. ఎనీవే, ఆర్గ్యుమెంటు పెట్టుకుంటే మనిద్దరి మధ్య ఎప్పుడూ ఏ విషయమూ ఒక కొలిక్కి రాదు, సొ లెట్స్ లీవిట్ హియర్"

"గుడ్" అంటూ ఆమెనుంచి చూపు తిప్పేసుకుని తమ కారు వేగం అందుకోలేక వెనకబడిపోతున్న హుస్సేన్ సాగర్ వేపు దృష్టిసారించాడు. ఒక కారు కిటికీలోంచి ప్రపంచం అంతా చిన్నచిన్న స్లైడ్ షో లా సాగిపోతున్నట్లు అనిపించింది. మాటలు కరువయిన కాలంవారిద్దరి మధ్య ఘడియల్లో ఉసూరుమంది. వాళ్ళ కారు వెనుక నీలిమ కారు నీడలా అనుసరిస్తూనే ఉంది.

"చే .. నిన్నొకటి అడిగితే ఫ్రాంక్‌గా చెబుతావా?" చల్లగాలి ఇక చాలు అన్నట్లు కారు అద్దాలు పైకితీస్తూ ఏసీ ఆన్ చేసింది రాధిక.

"ఇలా ఇరుకుగా కారులో కాకుండా అప్పట్లోలా సముద్రం ఉంటే ఎన్నయినా చెప్పేవాడిని, అదేమిటో చుట్టూ ప్రకృతి ఉంటే ఫ్రాంక్‌నెస్ దానంతట అదే వస్తుంది" సరదాగా అన్నాడు చైతన్య. కుదరని విషయాన్ని తలుచుకోవడం ఇష్టం లేనట్లు నవ్వుతో ఆ ప్రసక్తిని తుడిచేసింది రాధిక. ఆధునికతలో అత్యంత అమూల్యమైనదీ, ఎంతో వ్యయప్రయాసలు ఓర్చితే కానీ దొరకనిదే ప్రకృతి.

"ఇంకొక వారం రోజుల్లో వివేకానందను డిస్చార్జ్ చేస్తాం. ఆ తర్వాత వీక్లీ చెకప్స్. ఒక రెండు నెలల తర్వాత అదీ అవసరం ఉండదు. ఆ తర్వాత ఏంటి ?"

"అంటే?" ఆమె ప్రశ్న అర్థం కాలేదు చైతన్యకు.

"వీవా హెల్త్ వాజ్ ది మోస్ట్ అలార్మింగ్ ప్రాబ్లం కదా. *అత్యంత తీక్షణమైన కష్టం కలిగినప్పుడు జీవితం అంతా కష్టాన్ని ఎదుర్కోవడానికే ఖర్చు పెడతాం, ఆ కష్టం పోతే చాలు ఇక లైఫ్ అంతా మన కంట్రోల్‌లో ఉంటుంది అనేంతగా అనుకుంటాం* కదా"

"రైట్.. " తలపంకించాడు చైతన్య.

"మరి కష్టం తీరిపోయిన తర్వాత లైఫ్ ఏమిటి?" అంతకంటే సూటిగా ఎలా అడగాలే తెలియలేదు ఆమెకు. ***క్లిష్టమయిన పరిస్థితులు దాటేసాక మనిషికి మనసూ, జీవితమూ మొద్దుబారి పోయినట్లు అనిపిస్తాయి. పరీక్షలు ముగిసిన రోజు, ఆప్తులను కోల్పోయిన బాధనుంచి బయటపడిన రోజు, మరణం అంచుదాకా వెళ్ళి బ్రతికిన క్షణమూ తర్వాత నుంచి కొత్త రకంగా జీవించాలనే ఆలోచనలను రేకెత్తించినా నిర్ణయాలు చాలా త్వరగా జీవితగమనంలో మరుగునపడిపోతాయి.*** ఆ విషయం బాగా తెలిసినవాడు చైతన్య .

"యస్. ఈ రెండు నెలలనుంచి ఏవేవో అనుకున్నాను. ఇక నుంచయినా కరప్షన్ మానేసి హానెస్ట్‌గా ఉండాలి, వీలైతే నీలిమను కన్విన్స్‌చేసి , మనసు మార్చి ఫ్యామిలీను స్థిరపర్చాలి, వీవాను ఇంకా అపురూపంగా పెంచుకోవాలి... ఎక్సెట్రా ఎక్సెట్రా... కానీ ఐ డోంట్ థింక్ దెర్ విల్ బీ మచ్ ఛేంజెస్. లైఫ్ అలానే, మునుపటిలాగానే సాగిపోతుంది"

"అదేమిటీ, మార్పు కోసం ప్రయత్నించవా?"

"ఓపిక లేదు రాధీ. ఓపిక కంటే కూడా నమ్మకం లేదు. మనకేదో కష్టం వచ్చి మనం మారిపోయినంత మాత్రాన చుట్టూ ప్రపంచం అంతా మనపట్ల సానుభూతి చూపించో, కన్సర్న్ చూపించో మనల్నిమనం అనుకున్నట్లు బ్రతకనిస్తుందా. ఒక వ్యక్తి జీవితం అతడి చేతుల్లో ఉండే రోజులు కావు కదా ఇవి"

"అర్థం కాలేదు"

"సీ... వీవాను స్కూల్‌లో చేర్చాల్సి వచ్చినప్పుడు ఎంతెంతగా వెదికానో తెలుసా? మనకు లేని, కోరుకున్న రకం ఎడ్యుకేషన్‌ను వీడికి అందించే మంచి పాఠశాల ఎక్కడ ఉంటుందో అని. వీడు పుట్టకముందే , చిన్నచిన్నపిల్లలు కిలోల కిలోల బ్యాగులు మోసుకుంటూ , బస్సుల్లో ఆటోల్లో అలసి డస్సిపోతూ, రోడ్డు మీద అర్థనగ్నమైన హీరోయిన్ల వాల్‌పోస్టర్ల ముందు నడుచుకుంటూ, అర్థంపర్థంలేని చదువుల్లో ర్యాంకులకోసం పోటీలు పడుతూ పెరుగుతూ ఉంటే అనుకునేవాడిని 'నాకు పుట్టే వాడికి మాత్రం ఇలా కాక, స్వచ్ఛమైన బాల్యం అందేలా చూసుకోవాలి' అని. కానీ ఏం చేయగలిగానని, నా మొహం. ఎంత వెదికినా అన్ని చోట్లా అదే రకం స్కూళ్ళు, వీడికీ అదే రకం చదువులు. నేను కోరుకున్నట్లు వాడిని పెంచాలి అంటే, వాడి చుట్టూ సరి అయిన పెంపకంలో లేని మరే పిల్లాడినీ చేరనివ్వకూడదు. వాడిని ప్రపంచం కంటపడకుండా ఎప్పుడూ నా ఇంట్లోనే దాచేసుకోవాలి అనిపిస్తుంది. అదెలా కుదురుతుందీ? రేప్పొద్దున ఈ ప్రపంచాన్ని ఫేస్ చెయ్యాల్సింది వాడే కదా. మన పిల్లలనే మనం కోరుకున్నట్లు పెంచుకోనివ్వని ప్రపంచంలో ఇంకా మనం అనుకున్నట్లు బ్రతకాలి అనుకోవడం చాలా కష్టం, ఇంపాజిబుల్"

"ఏంటి ఇంత నిర్వేదం? ఎప్పుడూ అంతే ఏడు చేపల కథలా, నువ్వెందుకు ఇలా ఉన్నావ్ అంటే నా పక్కవాడు ఇలా ఉన్నాడు కాబట్టి, వాడి పక్కవాళ్ళు, వాళ్ళందరి పక్కవాళ్ళూ అలా ఉన్నారు కాబట్టి అని ఎవరెవరినో, సిస్టంనో బ్లేం చేస్తావ్. అవును ప్రపంచం చాలా దిగజారిపోతుంది. అయితే ఏం, ఉన్నంతలో మన విలువలు కాపాడుకోలేమా?"

"ఉన్నంతలోనా.." నవ్వేసాడు చైతన్య "విలువలకు అంత ఇంత అని కొలతలు ఏమిటి ? ఎయిదర్ యూ హేవ్ దెం ఆర్ యూ డోంట్. కొంత ఉండటమేమిటి?"

"మన విలువలకు ఎంత వరకూ ప్రాముఖ్యత ఇవ్వగలం, ఎంతవరకూ నిలుపుకోగలం అనేదాన్ని బట్టి లైఫ్‌లో కాంప్రమైజ్ ఉండాలి కదా"

"అది మనలను మనం మోసం చేసుకోవడమే తప్ప మరేమీ కాదు. డోంట్ ఈవెన్ యూజ్ దట్ వర్డ్ కాంప్రమైజ్. ఇప్పటికే చాలా మంది నోటివెంట విన్నాను కానీ నువ్వు కూడా అలా మాట్లాడితే నాకు నువ్వు నచ్చవ్" కోపంతో అతని ముక్కుపుటాలు వణికాయి.

"అయితే ఎక్కడా కాంప్రమైజ్ కాలేవు కాబట్టి నువ్వు అనుకున్నట్లు బ్రతకలేను అంటావ్. ఎలాగు నువ్వు అనుకున్నట్లు బ్రతకలేవు కాబట్టి ఇక ఎలా బ్రతికినా ఒకటే అంటావ్ అంతేనా ?"

"అబ్జల్యూట్లీ" సూక్ష్మాన్ని ఆమె గ్రహించినందుకు సంతోషించాడు చైతన్య.

దీర్ఘాలోచన ఏదో ఆవహించినట్లు నొసలు ముడివేసుకుంది రాధిక. కొన్ని గంటల క్రితం పార్టీలో దొంగచూపులతో ఎదురుపడిన రాజు ముఖమూ, అతడి పక్కన నవ్వుతూ తాను తీసుకున్న ఫోటోలు కళ్ళముందు మెదిలాయి. రాజుతో తన సంతోషం అంతా "కాంప్రమైజ్?" అయిన జీవితమేనా? అంటే రాజీపడిన జీవితం ఎప్పటికీ కోరుకున్న జీవితం అంత స్వచ్ఛం కాదా? జవాబు బాగా తెలిసినట్లే ఉన్నా అసలు స్ఫురించనట్లు భలేగా మోసం చేస్తుంది మనసు.

"వీవాకు ఇలా ఆపరేషన్, క్రిటికల్ అని నువ్వు చెప్పినప్పుడు వాడికి నేను అనుకున్న బాల్యం కూడా ఇవ్వలేకపోయేనే అని ఎంత బాధపడ్డానో తెలుసా. నీలిమ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలి అయినా వాడికిక తల్లిప్రేమను తెలియపరచేలా చేయాలి అని నిర్ణయించుకున్నాను కూడా. కానీ ఏమీ కుదరవు. మనిషి మారరు. మళ్ళీ వీడికి అదే బాల్యం" అతని మాటల్లో నైరాశ్యం రాత్రికే గుబులు పుట్టించింది.

"మరి ఎలా చే. మనం ఏం చెయ్యలేమా? ఇక ఎప్పటికీ ఇలా తిట్టుకుంటూ బ్రతకాల్సిందేనా?"

"ఏం చెయ్యగలం చెప్పు? మార్గాలు లేవు అని కాదు కానీ అన్నీ చాలా క్లిష్టమైన, దాదాపు అసాధ్యమయినవి. తీరా ఈ జీవితాన్ని బాగుచేసేందుకు ఏమయినా కఠిన నిర్ణయాలు తీసుకుని సాహసంగా, మొండిగా ఇంకేం చేసినా ఆ చర్యల వలన ఈ ఉన్నపాటి కాస్తంత జీవితం కూడా దూరమయిపోతుందేమో అని భయం. సబ్‌కాన్షస్‌గా భయమే మనల్ని ఏ పనీ చేయనివ్వదు"

" పోనీ......జస్ట్ ఊరికే మాటవరసకే అనుకో. ఇప్పుడు మొండిగా ఏం చేస్తే నీ లైఫ్ నువ్వు అనుకున్నట్లు ఉండొచ్చు"

"రియల్లీ నాకు ఎక్కువ ఛాయిసస్ లేవు. జీవితాన్ని చెడగొట్టుకోవడంలో చాలా దూరం వచ్చేసాను. దశాబ్దం జీవితం వెనక్కు తిప్పితే కానీ అది సాధ్యం కాదేమో..."

"అంటే..."

"మళ్ళీ కాలేజ్ డేస్‌లోకి వెళ్ళి, ఈ ప్రపంచాన్ని తిట్టడం, దేశాన్ని బాగుచెయ్యడంలాంటి పిచ్చి ఆవేశాలకు లోనుకాకుండా బుద్ధిగా నువ్వు చెప్పినట్లు మార్కులు తెచ్చుకుని..ఏదీ ప్రొఫెసర్ల అజ్ఞానాన్నీ, మీడియోక్రిటీనీ భరించి, కుప్పలుతిప్పలుగా డబ్బులు సంపాదించగలిగే విదేశీ ఉద్యోగమేదో సంపాదించి, డబ్బులతో.... వెయిట్ వెయిట్.. ఐ థింక్ అయాం టెల్లింగ్ రాంగ్, అలా చూసినా అదేదో దేశంలోనే

ఇదేలాంటి జీవితమే కదా. మే బీ, ఇంకొంచెం ఎక్కువ ఆధునికత, కొంచెం బెటర్ ఎకనామికల్, సోషల్ కండిషన్స్ అంతే కదా. నాకు అది చాలదే ఏమో మనకెవ్వరికీ అంత ఛాయిస్ లేదులే. మనం అనుకున్నట్లు బ్రతకాలి అంటే నాగరికత లేని ఏ ఒంటరి ద్వీపానికో, అడవికో పారిపోయి ఆటాలాగా బ్రతకాలేమో " జోక్ చేసినట్లు నవ్వేసాడు చైతన్య.

"ఆదిమానవుడిలా బ్రతకడమే గొప్ప అనుకునేట్లయితే ఈవేళ మనకు ఈ కారూ, ఏసీ, అసలు నువ్వు నేను మాట్లాడుకోవడానికి ఒక భాష కూడా అనవసరం కదా" అతడి హాస్యాన్ని ఆస్వాదించే పరిస్థితిలో లేదు ఆమె మనఃస్థితి. ఆమె కంటిరెప్పల చాటున ఎగిసిపడుతున్న అయోమయాన్ని అతడు ఇంకా గుర్తించలేదు.

"చెప్పు చే, రేపటినుంచి నీ లైఫ్ నువ్వు అనుకున్నట్లు ఉండాలి అంటే నువ్వేం చెయ్యాలి?" తన ప్రశ్నకు సమాధానం కావలసినదే అన్నట్లు మొండిగా అడిగింది రాధిక

"ఈ జాబ్ రిజైన్ చేసి, సంపాదించిన ఈ కరప్ట్ మనీతోనైనా సరే నా పిల్లాడికి నేను ఇవ్వలేకపోయిన బాల్యాన్ని ఇంకా చాలామంది పిల్లలకు ఇవ్వగలిగే ఒక స్కూలు స్థాపించి, చిన్నప్పట్నించీ వాళ్ళకు ఈ ప్రపంచంలో తమ ఐడెంటిటీ నిలుపుకుంటూ ఎలా బ్రతకాలో నేర్పించి.... హూ... ఎందుకులే...ఇవన్నీ జరిగేవి కావు" నిట్టూర్చాడు చైతన్య.

"వెరీ గుడ్ ఐడియా. జరగవు అని ఎందుకు అనుకుంటున్నావ్? వై డోంట్ యూ ట్రై టు డూ ఇట్?" వాళ్ళ కారు హాస్పిటల్‌ను సమీపిస్తుండగా మళ్ళీ రోడ్డు వారగా ఆపింది. ఈసారి చైతన్య ఆందోళన చెందలేదు. రాధిక మాటగురించి తప్ప ఇంకేమీ ఆలోచించే స్థితిలో లేనట్లు తలపంకించాడు.

"నా మీద నాకెప్పుడూ నమ్మకం ఉంది రాధీ. నేనొక్కడినే వెళ్ళి ఎవరెస్టు శిఖరాన్ని పదిసార్లు ఎక్కిదిగి రమ్మన్నా సాహసం చేస్తాను. ఎందుకంటే అది కేవలం నా శరీర, మానసిక ధృఢత్వానికీ, ప్రకృతికీ సంబంధించిన వ్యవహారం మాత్రమే. కానీ ఇలా ప్రపంచాన్నో, సొసైటీనో బాగు చేద్దాం అనుకోవడం మాత్రం ఫూలిష్. ఇక్కడ ఉండే కుళ్ళును కడగడానికి నడుం బిగించే లోపలే సెకను సెకనుకూ కుళ్ళు రెట్టింపు అవుతుంటుంది. నేను కొన్ని ఏళ్ళపాటు శ్రమించి పిసరంతటి మార్పును తీసుకువస్తే, ఒక్క క్షణంలో అలాంటి వేల మార్పులను నాశనం చేసేంతగా చెడిపోతుంటుంది వ్యవస్థ ..."

"పోనీ...చెడిపోనీ..."

"అలా అయితే అంత తపనపడీ, శ్రమించీ మార్పు కోరుకోవడం ఎందుకు? తెగులు పడుతుందీ అని తెలిసిన మొక్కను పెంచడం ఎందుకు?"

"వీవాకు మాత్రం ఇంత కష్టపడి పరేషన్ ఎందుకు చేసావ్? మనందరిలా తనూ ఎప్పుడో ఒకప్పుడు చచ్చిపోవాల్సిన మనిషే కదా, వాడినిపుడు ఇంత శ్రమకోర్చి బ్రతికించడం ఎందుకు..గాడ్ బ్లెస్ హిం.. అయాం సారీ ఏదో మాటవరసకు అన్నాను" చేతులతో చెంపలను అంటించుకుంది. సమాధానం కరువై మిన్నకుండిపోయాడు చైతన్య. కారు ఇంజన్ అతడి ఆలోచనల్లా స్థిరంగా రగులుతోంది.

***"వెళ్ళు చే.. నువ్వు అనుకున్నట్లు బ్రతకడానికి ప్రయత్నించు. ఇట్స్ నౌ ఆర్ నెవర్. మహా అయితే ఏమవుతుందీ, ఓడిపోతావ్. కానీ, దట్స్ బెటర్. ఇలా ప్రతిక్షణం నిన్ను నువ్వు అసహ్యించుకుంటూ ఈ సెల్ఫ్ హేట్‌రెడ్‌తో నువ్వు సాధించేదేమీ లేదు"*** అనునయంగా అతడి చేతి మీద చేయి వేసి నిమిరింది రాధిక. "ఠాగూర్‌లాంటి వ్యక్తి కూడా ఇలాగే అనుకుని వెనక్కు తగ్గి ఉంటే ఈ ప్రపంచంలో ఒక శాంతినికేతన్ లాంటిది ఉండదు కదా. ఏమో నువ్వూ అలాంటి పాఠశాలను స్థాపించగలవేమో" అతనేదో చెప్పడానికి పెదవి విప్పడం గమనించి, మాట్లాడవద్దని వేలితో సూచిస్తూ," అదంతా ఆ రోజుల్లో, ఈ రోజుల్లో కుదరదు అని అనకు. గొప్ప చరిత్రలు ఎప్పుడూ అనామకంగా కొట్టుకుపోవు. ఇన్ని శతాబ్దాల మానవజీవితంలో భూమ్మీద మనిషి అనేవాడే మిగలడేమో అనేంతగా అకృత్యాలూ, అరాచాకాలూ, విపరీత పోకడలూ ఎప్పుడూ ప్రతి జెనరేషన్‌లోనూ జరుగుతూనే ఉంటాయి కానీ వాటితో పాటు అంకురాలూ

పుడుతూనే ఉంటాయి. నువ్వే చెప్పేవాడివి కదా వికృతస్వభావాలు కలిగినవాళ్ళూ, దుర్మార్గులూ చేసే కీడు కన్నా ఉన్నతమైన మనసున్నవారు చేయని మంచి వల్లే ప్రపంచం ఎక్కువ నాశనం అవుతుందని. నువ్వు మాటవరసకు అన్నావేమో కానీ, అదే అసలు నిజం. ప్లీజ్ డోంట్ డూ దిస్ టు యువర్ సెల్ఫ్ అండ్ టు ది వరల్డ్ అరౌండ్ రేప్పొద్దున వీవా బ్రతకాల్సిన ప్రపంచం ఇదే కదా" ఆమె ఆఖరు మాట అతడిలో చాలా అలజడిని రేపింది. ***పిల్లలను పెంచడంలో, వాళ్ళకు ఆస్తులు, ఐశ్వర్యాలు సమకూర్చిపెట్టడంలో తల్లితండ్రులుగా తమ జీవితాలనే వెచ్చించే మనుష్యులు తాము ఈ ధ్యాసలో పడి వ్యవస్థపట్ల తమ బాధ్యతలు విస్మరించడం నిత్యకృత్యం. పెరిగే ప్రతి కొత్త తరం కుళ్ళిపోతున్న వ్యవస్థలో ఎదురీత కొట్టడానికి తర్ఫీదు అవుతుందే కానీ కుళ్ళు లేని కాలాన్ని చూడలేదు.***

"రాధీ.. నేనొక్కటి అడుగుతాను ఫ్రాంక్‌గా చెబుతావా?" ఏదో నిర్ణయానికి వచ్చినవాడల్లే స్థిరంగా అడిగాడు చైతన్య. సమాధానం అతడికి తెలుసు అన్నట్లు చూసింది రాధిక. అతడు అడగడమూ ఆమె చెప్పలేకపోవడమూనా?

"మీ హజ్బెండ్ .. రాజు...ఆర్యూ హ్యాపీ విత్ హిం?" అతని కళ్ళు ఆమె మనసును కోసేసేట్లు చూస్తున్నాయి. తత్తరపడింది రాధిక. హఠాత్తుగా అతను అలా అడిగాడేమిటి? అదీ ఈ రోజే? ఒకరోజు క్రితం అయితే ఆమె తడుముకోకుండా సమాధానం చెప్పేదేమో కానీ ఆవేళ మాత్రం సమాధానం రాక ఆమె పెదవులు ఎండిపోయాయి. "ఎందుకు అలా అడుగుతున్నావ్?" అతి కష్టం మీద నోరుపెగల్చుకుంది.

"ఎందుకో తప్పకుండా చెబుతాను, బట్ నేను అడిగినదానికి చెప్పు"

"యా..అయాం హ్యాపీ" అసంకల్పితంగానే అబద్ధం ఆడగలగడమే ఆత్మాభిమానం ఏమో అనిపించింది రాధికకు.

"ఓకే.. దెన్. నేను ఇక్కడ దిగిపోతాను. ఐ విల్ ట్రై టు డూ ఏజ్ యూ సెడ్ ఎన్నాళ్ళు, ఏళ్ళు అవుతుందో కానీ నేను అనుకున్నది సాధిస్తాను. అప్పుడే నీకు మళ్ళీ కనిపిస్తాను. ప్లీజ్... ఈ లోగా నువ్వు నాకు కనిపించకు" గుండె కోసేంత తీక్షణంగా వెలువడ్డాయి అతని మాటలు. కొయ్యబారిపోయింది రాధిక. అతడు అనాలోచితంగా అంత మాట అనడు. కోపం వచ్చిందా, తనంటే చిరాకు కలిగిందా? అతని కోసం ఎంత తాపత్రయపడితే అతను అంత దూరం అయిపోతానంటాడే?

"ఇప్పుడు నేనేం అన్నానని, అంత కోపం...?" అనునయంగా అడిగింది ఆమె.

"ఛ చ నీ మీద నాకెందుకు కోపం. జస్ట్ ఐ వాంటెడ్ టు బి కేర్‌ఫుల్ దట్ ఐ డోంట్ మెస్ అప్ యువర్ లైఫ్" సౌమ్యంగా బదులిచ్చాడు అతను. అర్థం కానట్లు చూసింది రాధిక. చనువుగా అతనే కారు ఇంజన్ ఆఫ్ చేసాడు. కనుచూపుమేరలో హాస్పిటల్‌లోకి వచ్చేపోయే వాహనాల కదలికలు ఉండటంతో అంత రాత్రిలోనూ జనసమ్మర్ధంలో ఉన్నట్లే ఉంది వారికి.

"నువ్వు ఎంతసేపూ నాలోని మంచి లక్షణాలు మాత్రమే లెక్క వేసి నన్ను ఎంతో ఇన్‌స్పైర్ చెయ్యాలని చూస్తున్నావు కానీ ఆ ప్రయత్నంలో భాగంగా జరుగుతున్న డ్యామేజ్ గ్రహించట్లేదు" సీటులోనే పూర్తిగా ఆమె వేపు తిరిగి కూర్చుంటూ అన్నాడు. వివరంగా చెప్పమని ఆమె అడిగేలోగా అతనే," మనిషిలోని ఫ్రాంక్‌నెస్‌కు కూడా ఒక లిమిట్ ఉంటుంది. ఎంత మనసు విప్పి మాట్లాడుకున్నా కొన్ని విషయాలు చెప్పుకోలేము, కానీ ఈరోజు నేను అలాంటివి కూడా చెబుతాను. నువ్వు నన్ను ఎలా అనుకున్నా ఫర్లేదు. కాసేపు ఎదురు ప్రశ్నలు వేయకుండా కూర్చుని వింటావా?" అన్నాడు. ఒప్పుకున్నట్లు కనురెప్పలతో సంకేతమిచ్చి చెప్పింది రాధిక.

"మన రిలేషన్‌షిప్, ఇన్ఫాక్ట్, నీతో నా రిలేషన్‌షిప్ నాకు మొదటి నుంచీ చాలా కన్‌ఫ్యూజింగా ఉండేది తెలుసా. ఐ థింక్ అది నీ తప్పు కాదు. నాలోనే ఏదో లోపం. నువ్వు కప్పలను కోసి చూసే వయసులో నేను మనస్తత్వాన్నీ, స్వభావాలనూ, పరిస్థితులనూ అలా డిసెక్ట్ చేసినట్లు రకరకాలుగా ఆలోచించి, చూసేవాడిని. అది విజ్ఞానం అని అప్పుడు అనుకున్నాను కానీ, ఇప్పుడు అనిపిస్తోంది నాకు సరిపడని విషయాలన్నిటినీ తెగ చదివేసి, నన్ను నేనే సైకో ఎనాలిసిస్ చేసుకునీ ఏంటో అంతా తికమకగా అయిపోయాను. ***తనను తాను అదుపు చేసుకునే శక్తి లేని మనిషికి విజ్ఞానం కంటే ప్రమాదకరమైన శత్రువు ఇంకోటి ఉండదు. న్యూక్లియర్ ఎనర్జీలాగా***

***కొంపముంచుతుంది.*** ఇదంతా ఎందుకు చెబుతున్నాను అని అలా చూడకు. చెప్పేది వింటాను అన్నావ్, విను. బాగా చదువుతాను, హైలీ యాంబిషస్, గుడ్‌ఫ్రెండ్, కేరింగ్ ఫాదర్ ఇలాంటి పాజిటివ్ విషయాలే చూస్తున్నావ్ కానీ నాలో నాకే నచ్చని ఎన్నో దుర్గుణాలు ఉన్నాయి. ఆగాగు.. నువ్వు చెప్పకు. నీకు తెలియదు. కోపం, కరెప్షన్ ...ఇలాంటి చిన్నచిన్న విషయాలే నీకు తెలుసు. నీకు తెలియనిది, కానీ ముఖ్యంగా నీకే తెలియాల్సినది ఒక బ్యాడ్ క్వాలిటీ ఉంది. అఫ్‌కోర్స్ నా దృష్టిలో అది పెద్ద బ్యాడ్ కాదు కూడా, కానీ జీవితం నాశనం చేసే అబ్‌సెషన్ నాకు సెక్స్ డ్రైవ్ చాలా ఎక్కువ. ప్లీజ్ నవ్వకు. జోక్ చెయ్యట్లేదు. ఇది ఎంత పెయిన్‌ఫుల్ కండిషనో నీకు తెలియదు. అందరికీ పద్నాలుగూ పదిహేనేళ్ళకు హార్మోనల్ అర్జ్ మొదలవ్వడం సాధారణమే. కానీ నాకు కాస్తంత తీక్షణంగానే ఉండేది. పుస్తకాలెక్కువ చదివినప్పుడు విషయాలూ ఎక్కువ తెలుస్తాయి కదా. కాబట్టి అనుభవించని ఆ శారీరిక వాంఛలన్నిటినీ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసేవాడిని. చెప్పుకుంటే చాలా అసహ్యంగా ఉంటుంది కానీ, న్యూడ్‌గా ఆడదాన్ని చూడటానికి ఎంత ఆరాటపడ్డానో తెలుసా. బూతు పుస్తకాలు, సినిమాలు... ఆ రోజుల్లో, అదీ చిన్నపాటి పట్టణంలో, పెద్దగా స్నేహితులు లేని నాలాంటి వాడికి అంత సులభంగా దొరకవు కదా. చివరకు వాటికోసం అని, మా ఊర్లో పరమ పోకిరీ పిల్లలతో స్నేహం చేసాను. సరే డీటైల్స్ ఎందుకు కానీ, పదిహేడేళ్ళ వయసులోనే, ఐ వెంట్ టు ఎ ప్రాస్టిట్యూట్. ఇప్పుడు తలుచుకుంటే చాలా కంపరంగా ఉంది కానీ, బట్ ఆ రోజు సంఘటన ఎదుర్కోపోయి ఉంటే, నీకు ఎదురయే నేను ఇంకోలా ఉండేవాడిని. ఆమె మా పక్క ఊర్లో ఉండేది. వాళ్ళ ఇంటి పక్కన ఒక మటన్ కొట్టు. ఇప్పటికి కూడా తలుచుకుంటే ఆ మాంసం వాసన తెలుస్తోంది. గ్రాఫిక్‌గా డిస్క్రైబ్ చేస్తున్నాను అనుకోకు, బట్ దిసీజ్ ఇంపార్ట్‌ఎంట్. ఆమె భర్త లారీ డ్రైవరట. ఎప్పుడోకానీ ఇంటికి రాడని, అతనికి ఇంకా రెండూ మూడు ఊర్లలో వేరే భార్యలు ఉన్నారని, అసలీవిడ కూడా భార్య కాదనీ ఏదేదో రకరకాల కథలు. నేను స్నేహం చేసిన పోకిరీ కుర్రాళ్ళల్లో ఒకడు నాకు ఆమె అడ్రస్ ఇచ్చి పంపాడు. అస్సలు నమ్మలేకపోయాను ఆమె అలా వేశ్య అని. అంత నార్మల్‌గా కనిపించింది. వెల్, పుస్తకాల నాలెడ్జి కదా! రౌడీలు అంటే చారల బనీను, వేశ్యలు అంటే ఓవర్ మేకప్ ఇలా క్లీషేడ్‌గా ఉంటారని అనుకునేవాడిని. ఐ వెంట్ టు హర్. ఐ స్పెంట్ ఫ్యూ మినిట్స్ టు హర్. నేను మొట్టమొదట పూర్తి నగ్నంగా చూసిన ఆడది తను. చాలా మంచిది. వయసులో ఏమిటో ఎలా ప్రవర్తించాలో తెలియక నేను తడబడుతుంటే తను చాలా ఆదరంగా దగ్గరకు తీసుకుంది. నమ్ము నమ్మకపో. ఆ క్షణంలో ఆమెను నేను ప్రేమించాను. రెడిక్యులస్‌గా అనిపించొచ్చేమో. కానీ నిజం. ఇప్పుడు తలుచుకుంటే కూడా ఆమె అంటే అదోలా ప్రేమ పుడుతుంది. వెళ్ళింది కేవలం శారీరక వాంఛల కోసమే అయినా, ఆమె గురించి నాకు "స్త్రీ" అని తప్ప మరేమీ తెలియకపోవడం వలన ఒక స్త్రీ ఒక పురుషుడు ప్రేమించుకోవడం సహజం కనుక ప్రేమించాను. ఇప్పుడు కూడా అదే నమ్ముతాను. ***మనం వ్యక్తిత్వాలూ, స్వభావాలూ, రూపురేఖలూ చూసి ఏరికోరి, కొందర్ని సెలెక్ట్, ఇంకొందర్ని డిలీట్ చేసి చూసి ప్రేమిస్తాం కానీ, ఒకవేళ నీ కంటికి ఒక్కరే మనిషి తెలుసు అనుకో. ఖచ్చితంగా మనిషిని నువ్వు ప్రేమిస్తావు. అంతకంటే మంచి, చెడు నీకు తెలియదు కనుక.*** కోరికలు తీర్చుకోవడానికి ఆమె శరీరం కోసం వెళ్ళిన నాకు, అదే ప్రయత్నంలో ఆమె మనసూ కనిపించింది. స్త్రీ అంటే నాకు తెలిసినది బ్రెస్ట్స్. వాటిని ప్రేమించబోతుంటే, ఆమె వారించింది. అక్కడ మాత్రం చేయి వేయొద్దని. ఆమెకు నెలల బాబు ఉన్నాడట. అవి వాడి కోసం మాత్రమేనట. ఏడుస్తూ వచ్చేసాను. తర్వాత నన్నెప్పుడు ఏ రకమైన బలహీనతా బాధించలేదు. ఆడది అంటే కోరిక కంటే కూడా గౌరవం, భయం ఎక్కువయింది. కామం అనేది పరిపూర్ణమైన ప్రేమను వ్యక్తీకరించే ఒక భావమే కానీ విడిగా దానికంటూ ఒక అస్థిత్వం లేదు అనిపించింది. పూర్తిగా నచ్చిన స్త్రీతోనే శారీరక అనుభవం పొందాలి అనుకున్నాను. పూర్తిగా అంటే, ఐ మీన్ ఇట్, షి మస్ట్ నో ఎవ్వరిథింగ్ అబౌట్ మీ అండ్ ఐ మస్ట్ నో ఎవ్విరీ థింగ్ ఆఫ్ హర్. ప్రపంచంలో మిగతా అన్ని విషయాల్లాగానే ఈ సెక్స్‌లోనూ వింత పోకడలు పోతే నాకు అర్థం అయ్యేది కాదు. - ఆడామగా కలిసినా పిల్లలు పుట్టకుండా ఉండటానికి మార్గాలు, మాత్రలూ ఏమీ అర్థం కాదు. ఆ రోజు ఆవిడతో అనుభవం తర్వాత బలంగా నిర్ణయించుకున్నాను. నేను కోరుకునే ఆడది తల్లి అయ్యాక ఎలా ఉంటుందో, అందాలొలికే నాజూకు శరీరాన్ని గర్భస్థ, బాలింత

దశల్లో కూడా చూసి ప్రేమించగలిగితేనే ప్రేమ అని. నువ్వు అనుకున్నంత సులభం కాదు ఇది. ప్రేమించిన ఆడదాన్ని అలా కడుపుతోనూ, పాలిండ్లకు అతుక్కున్న పిల్లలతో చూడగలగడానికి మగాడికి చాలా ప్రేమ అయినా ఉండాలి లేకపోతే పూర్తి నిర్లక్ష్యం అయినా ఉండాలి. పెర్వర్ట్ అనుకో, పిల్లాడు అనుకో... నిన్ను నేను చాలా సార్లు అలా ఊహించుకున్నాను. ఏ ఒక్కసారి కూడా నాకు మనసు వికారం అవలేదు. ఎలా ఊహించినా నువ్వంటె అభిమానమే తప్ప ఇంకో భావం లేదు. నిన్ను నేను ముద్దడిగిన ప్రతిసారీ నా ఉద్దేశ్యం ముద్దుతో ఆగడం కాదు. అప్పుడల్లా అనిపించేది, అప్పటికప్పుడే నిన్ను న్యూడ్‌గా చూడాలని, నీలో కలిసిపోవాలని. అయాం సారీ. భారత సాంప్రదాయం ప్రకారమో, ఇంకోదాని ప్రకారమో వేరేమగాడితో పెళ్ళయిన ఆడదానితో ఇలా మాట్లాడటం సభ్యతా, సంస్కారం ఆమోదయోగ్యం కాకపోవచ్చు. వీటన్నిటికంటే నిజాయితీగా ఉండటమే ముఖ్యం అనిపించి చెబుతున్నాను. అలా అంతగా ఊహించుకున్న నిన్ను వదులుకోవడం నాకు ఎంత కష్టం అయ్యింటుందో ఊహించగలవా? కన్యత్వాలూ, మనసూ నాకూ ఉంటాయి కదా. నువ్వు ఇంకొకరిని పెళ్ళి చేసుకున్నాక వాడెవడో నీతో అలా ఉంటాడు అంటే జీర్ణించుకోవడం ఎంత కష్టమో తెలుసా. నిన్ను ఎంత తిట్టుకున్నానో. అసహ్యించుకున్నానో. చివరకు నీకూ వేశ్యకూ తేడా లేదు అని కూడా తిట్టుకున్నాను. కేవలం నీతో పాటు విదేశాలకు రాను అన్నానని, నాతో కాక అలా వచ్చే వాడితో సంసారం చేయడం అంటే ఏమిటి మరి? కానీ అదేమిటో మరి అంత ద్వేషమో ఎక్కువ రోజులు నిలవలేదు. ఎక్కడో ఒక మూల చిన్న ఆశ ఉండేది. చిన్న పాటి శాడిజం. వేరేవాడితో గడిపాక అయినా నీకు నా విలువ తెలుస్తుందనీ, మళ్ళీ నాకోసం వస్తావనీ. కానీ అలా ఏమీ జరగలేదు. తర్వాత నిన్ను మళ్ళీ చూసినప్పుడు, నువ్వు నన్ను చూసి ముఖం తిప్పుకుంటావు అనుకున్నాను. కానీ నువ్వు అవే అభిమానం నిండిన కళ్ళతో చూస్తావు. మాట ఏదో ఉంటుంది కానీ చూపు అదే ఎన్నిసార్లు అనుకున్నానో , మే బీ మీ హజ్‌బెండ్‌కు నీకూ మధ్య అంత ఇంటిమసీ లేదేమో, నువ్వు నన్ను కోరుకుంటున్నావేమో అని. ఇన్‌ఫెడెల్ అని కాదు. ఐ నో, నీకు నేను అంటే ఉండే ఇష్టం అంత సులభంగా పోదు. నువ్వు నాకు కాల్ చేసినా, మెసేజ్ చేసినా, ఈ మెయిల్ చేసినా, వీవాను పరీక్షించేందుకు కలిసినా... ఎప్పుడు సబ్‌కాన్షస్‌గా అదే ఆలోచన. "తను నన్ను కోరుకుని ఇక నాతోనే ఉండిపోతుంది" అని. చివరకు, ఈ రాత్రి అటూ ఇటూ కానీ టైంలో నువ్వు నాతో ఇలా షికారుకు వచ్చినా అదే అనుమానం. నీ స్నేహాన్ని చులకనగా చూసి అలుసుగా అనుకున్నాను అనుకోకు. నా ఆలోచనకు లాజిక్ ఏంటీ అని అడగొద్దు. అదంతా అలా తోస్తుంది ఈ పాడు బుర్రకు. అందుకే ఫ్రాంక్‌గా అడిగేసాను నీకూ, రాజుకూ మధ్య రిలేషన్‌షిప్ ఎలా ఉందని, నువ్వు చెప్పిన సమాధానం నా మేధస్సుకు అర్థం అయినా అంతరాత్మకు అర్థం కాదు. రేపు మళ్ళీ నీగురించి ఇవే ఆలోచనలు వస్తాయి. నువ్వు చెప్పినట్లు నేను మళ్ళీ మునుపటిలా నిజాయితీగా బ్రతకడం మొదలెడితే నీకూ నాకూ మధ్య మళ్ళీ అదే రోజులు గడుస్తాయి, అప్పుడు నిన్ను ప్రేమించకుండా ఉండలేను. నిన్ను కోరుకోకుండా, నీ శారీరిక సాంగత్యం తలుచుకోకుండా ఉండలేను. నీలమపై బలప్రయోగం చేసేంతగా దిగజారిపోయిన నా విల్ పవర్ మీద నాకేమాత్రం నమ్మకం లేదు. అందుకే చెబుతున్నా, టు అవాయిడ్ ఆల్ దిస్, లెట్స్ నాట్ సీ ఈచ్ అదర్ ఆఫర్ సం టైం. రోజులో, నెలలో, సంవత్సరాలో నాకే తెలియదు. బట్, ఐ ప్రిఫర్ ఇట్ దిజ్ వే . ఏమంటావ్?"

వీళ్ళను ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి? వాడి మొహం చూడూ..ఎంత వికారంగా ఉందో. ఇక దాని అవతారం అయితే పక్కా లం...లాగ.థూ..అసలు నీతీజాతీ లేని మనుష్యులు. పైకి మాత్రం ఎంత డిగ్నిఫైడ్ ఇమోజో. వాడయినా కరప్ట్‌గా దొరికాడు. అయినా ఏముందిలే జనం ఎంతలో మరచిపోతారు. అది మాత్రం పెద్ద ప్రాణదాతలాగ, ఏంజెల్‌లాగ ఇమేజ్. ఇంట్లో మొగుడున్నాడుగా వాడినొదిలేసి వీడితోనే తిరుగుతుందా. అసలు వాళ్ళను కాదు ఈ సొసైటీను తగలెట్టాలి. నీతీజాతిలేని సొసైటీ. స్వచ్ఛంగా ప్రేమిస్తే తప్పు అంటుంది ఇలా చీకట్లో వ్యవహారం నడిపితే మాత్రం కళ్ళుమూసుకుని చూడనట్లు నటిస్తుంది. అసలు మనుష్యులందరినీ వరసగా

నిలబెట్టి కాల్చిపారెయ్యాలి. తగలెట్టెయ్యాలి. అందులో ఫస్టు వీడినీ, దాన్నీ నిలబట్టేయ్యాలి. ఇల్లీగల్ అఫైర్‌లో మళ్ళీ రొమాంటిక్? షికార్లు, ముద్దులు, కౌగిలింతలు. దొంగవెధవలు.

నీలిమ కళ్ళు ఎర్రటి జీరలతో మండిపోతున్నాయి. కాటుక కన్నీటిలో కరిగి చెంపలపై అట్టగట్టింది. ఊపిరి వేగంతో గొంతు కండరాలు ఎగసిపడుతున్నాయి. స్టీరింగ్‌లోకి ఆమె గోళ్ళు గీసుకుపోతున్నాయి. ఆమె కాలి కింద యాక్సిలేటర్ క్రుంగిపోతోంది. ఆమె కారు నూరు కిలోమీటర్ల వేగంతో నేషనల్ హైవే మీద దూసుకుపోతోంది. హఠాత్తుగా వివేకానందను చూద్దామనీ, వీలయితే మళ్ళీ తనతో తీసుకుని వెళ్ళిపోదామనీ ఎవ్వరికీ చెప్పాపెట్టకుండా వచ్చిన ఆమె హాస్పిటల్ లాంజ్‌లోనే రాధిక, చైతన్య కలిసి బయటకు వెళుతుండటం గమనించి వాళ్ళు ఎక్కడికి వెళ్ళి ఏం చేస్తారో చూద్దామనే రాటంతో తన కారు వెంబడించింది. నెక్లస్ రోడ్‌లో కాసేపు వాళ్ళ కారు ఆగినప్పుడు, చాలా మెల్లగా ఒకవారగా వెళ్ళడం చూసినప్పుడు, తను ఉన్న దూరంలోంచి వాళ్ళు కనపడకపోయినా కారులో వారు సరసాల్లోనూ, శృంగారకలాపాల్లోనూ ఉన్నారని ఊహించింది.. ఆ కారులోంచి చైతన్య దిగి వెనక్కు తిరిగి చూడకుండా హాస్పిటల్‌లోకి వెళ్ళడం, రాధిక మాత్రం పదిపదిహేను నిముషాలు అక్కడే కారులోనే ఉండి తర్వాత ఇంటికి వెళ్ళడం...అంతా అనుసరించి చూసాక, పిచ్చి ఆవేశంతో, వెర్రి కోపంతో సిటీ అంతా వదిలి హైవే మీద గమ్యం లేకుండా ప్రయాణిస్తోంది. ఒంట్లోని రక్తం అంతా ఉద్రేకంలో ఎగసిపడుతుంటే, తనలో తనకే అనుమానాలూ, ప్రశ్నలూ రేకెత్తుతుంటే అలజడి తగ్గించుకోవడానికి అన్నట్లు తెగిన గాలిపటంలా కారు డ్రైవ్ చేస్తోంది.

అసలేముంది వాడిలో? అందరిలాంటి మామూలు మగాడేగా? పెద్ద అందగాడు కూడా కాడు. ఈమె వాడినే పట్టుకుని ఎందుకు వెంపర్లాడుతోందో!?. అసలు వాళ్ళిద్దరికీ మధ్య ఏంటి అంత అట్రాక్షన్? జస్ట్ ఫ్రెండ్‌షిప్ అయితే ఇంత క్లోజ్‌గా ఉండరు కదా. కానీ పెళ్ళప్పుడు చెప్పాడు కదా. ఆమెను ప్రేమించాను కానీ తర్వాత గొడవ అయ్యిందీ, ఇక మరచిపోతాననీ. మరచిపోయేవాడు సిటీలో ఇంకెవ్వరూ డాక్టర్లు లేనట్లు వీవాను ఈమె దగ్గరకే ఎందుకు తీసుకెళ్ళాలి? ఏమో...అసలు పిల్లాడి సాకు పెట్టుకుని వీడే ఆమెలో తన పట్ల సింపతీ క్రియేట్ చేసుకుని ఉంటాడు...అంతే అయ్యుంటుంది. ఇంకా నా గురించి కూడా చాలా చెప్పి ఉంటాడు. నేను ఎవరెవరితో ఏమేం చేసానూ అని. పెళ్ళానికి క్యారెక్టర్ లేదు అని చెప్పుకుని ఏడ్చుకునికుని ఉంటాడు. బాస్టర్డ్. పాపం ఆమెకు ఈ విషయం చెప్పాలి. వీడి మాయలో పడి మొగుడిని దూరం చేసుకోవద్దు అని.

రోడ్డు మధ్యలో ఖాళీ చూసుకుని అంత వేగంలోనూ కారును యూ టర్న్ తిప్పింది. అవతలి వేపు వస్తున్న కారు ఈమె కదలికలకు తికమకపడినట్లు అటూ ఇటూ కదిలింది. ఇంకెవ్వరినీ గమనించక రాధిక ఇంటికి వెళ్ళి తను అనుకున్నట్లు ఆమెతో చెప్పాలి అనుకుంది నీలిమ.

మరీ రాత్రి అయిపోయింది. నిద్రపోయి ఉంటుందేమో . ఎంతైనా పాపం వివేకానందకు సర్జరీ చేసింది. థాంక్స్ చెప్పాలి. సారీ కూడా అడగాలి. పాపం అప్పుడు వాడిని ముంబై తీసుకెళ్ళి ఎంత తప్పు చేసాను! అక్కడ డాక్టరు సరిగ్గా ఆపరేషన్ చేయకపోతే వాడు చచ్చిపోయేవాడు కూడా. బానే ఉంటాడు కానీ మొహం చూస్తేనే మండుతుంది. అంతా నాన్న పోలిక. అన్యాయంగా నా మొదటి పిల్లాడిని అబార్షన్ చేసి చంపేసారుగా. బ్రతికి ఉంటే వాడూ ఇలానే ఉండేవాడేమో.

ఆమె కాటుక మళ్ళీ చెదిరింది. ఎక్కిళ్ళు పొంగుకొచ్చాయి.

మూడు నెలల బాబు. కాళ్ళు చేతులు అయినా పూర్తిగా రాలేదు. చంపేసారు లం..కొడుకులు. అసలు చచ్చిపోయాడు కానీ బ్రతికి ఉంటే నాన్నను చెప్పుతో కొట్టాలి. అమ్మను ఏం చేసినా పాపం లేదు. ఛూ..అదొక అమ్మ. నా పిల్లాడిని చంపేస్తావే?! డాక్టర్ రాధికా నీకు పిల్లలు లేక ఎంత అదృష్టమో తెలుసా? ఉంటే చంపేసేవాళ్ళు వీళ్ళంతా కలిసి. అవునూ ఆమెకు ఎందుకు పిల్లలు లేరు? వాళ్ళాయన చూట్టానికి బానే ఉన్నాడుగా. బహుశా పిల్లలను పుట్టించలేడేమో.. యస్..అవును..అదే అయి ఉంటుంది. కరెక్ట్. అందుకే ఇప్పుడు దానికి

చైతన్య కావలసి వచ్చాడు. వీడితో పిల్లాడ్ని కందామని ప్లాన్ వేసి ఉంటుంది. వాత్సాయనతో ఈ విషయం చెప్పాలి. అప్పుడు కుదురుతుంది దాని తిక్క. ఇంకెవ్వరూ దాన్ని గొప్ప డాక్టరు అని చెప్పుకోరు. బజారుది అంటారు. అప్పుడు తెలుస్తుంది చైతన్యకు, దానితో పోలిస్తే నేనెంత పవిత్రమైనదాన్నో. పవిత్రత అంట పవిత్రత. ఈ మొగోళ్ళందరికీ కావాల్సింది ఒక రంధ్రం. అంతే. ఇంకేమీ అవసరం లేదు. మొగాళ్ళందర్నీ వరసగా నిలుచోబెట్టి నరికెయ్యాలి. పిల్లలను పుట్టించేది గొప్ప అయినట్లు, చంపించేస్తారా? లం...కొడుకులు. తప్పు తప్పు వాళ్ళ అమ్మలను అనకూడదు. వాళ్ళ నాన్నల బుద్ధులు. అమ్మా సారీ. నిన్ను కూడా అనవసరంగా తిట్టుకున్నా. అంతా నాన్నే చేసాడు. కానీ నువ్వు చెప్పి ఉండొచ్చు కదా బాబును చంపొద్దని.

హఠాత్తుగా ఆమెకు వివేకానంద ముఖం గుర్తుకువచ్చింది. హాస్పిటల్‌లో వాడు పిడికిళ్ళు మూసుకుని నిద్రపోతుండటం కళ్ళముందు మెదిలింది. వాడికి పాలు ఇవ్వమని చైతన్య బ్రతిమిలాడటం గుర్తుకువచ్చింది. పొరపాటున నిద్రలో వాడిని తన పక్కన పెడతారేమో తనే తన స్తనంలోంచి పాలు వదిలించుకోవడం గుర్తుకువచ్చింది.

సారీరా.. తప్పు చేసాను. నీ మీద కాదు కన్నా కోపం నాన్న మీద. అయాం సారీ.

వెళ్ళాల్సింది రాధిక ఇంటివేపు కాదు, హాస్పిటల్‌కు అనిపించింది. సిటీకు ఎంత త్వరగా చేరుకుందామా అని యాక్సిలరేటర్ను మరింతగా తొక్కింది.

ఇంకనుంచీ నిన్ను వదలనురా. నేనే చూసుకుంటాను. కానీ ఎందుకురా నాన్ననే ఎక్కువ ఇష్టపడతావు? నేను ఇంత చేసినా చైతన్య వాడి కోసం ఎందుకు అంత తాపత్రయ పడతాడు ? వాడిని చూస్తే వీడికి కోపం రాదా? అసహ్యం వేయదా? వాడిలో వీడి పోలికలు చూస్తే నాకు అంత కోపమే మరి వాడిలో నా పోలికలు.. ముఖ్యంగా ఆ ముక్కు నాలాంటి ముక్కే...చూస్తే చైతన్యకు అసహ్యం వేయదా? వాడికి గోరుముద్దలు తినిపిస్తాడు, స్నానం చేయిస్తాడు. అంత ప్రేమగా. నా పోలికలు అంటే కోపం లేదూ అంటే నేనంటే కూడా కోపం లేదా? పాపం అవును తనేం తప్పు చేసాడు. నేనే బాధపెట్టాను. నాన్న కన్నా మంచోడు. బొమ్మలు గీసి ప్రేమించానని మోసం చేసిన దగుల్బాజీ కంటే ఎంత మంచోడు. పైట జారిస్తే చాలు మీద పడిపోయిన పురోహితుడికంటే కాదా? పాపం అసలు వాడు అనుకుని ఉంటే, లీగల్‌గా నన్ను ఏం చేసినా ఎవ్వరు ఆపుతారు. నన్ను రేప్ చేసాడుకదా. ఏం కాదు, చేసేలా నేనే ప్రొవోక్ చేసాను. బావుండింది. వాడిని మంచిగా చూస్తే చిరాకు. వాడిని అలా దుర్మార్గుడిగా చూడటమే బావుండింది. కానీ మళ్ళీ ఎప్పుడూ చెయ్యియినా వెయ్యలేదు. నేనేం చేసినా అలాగే మంచిగానే ఉన్నాడు. సారీరా...చైతూ...చైతన్యా. అయాం సారీ. నన్ను క్షమిస్తావా? నా తప్పేం లేదురా. అంతా నాన్న చేసిన పని. వాడే బ్రతికుంటే నీ కాళ్ళకింద కుక్కలా బ్రతికే అర్హత కూడా లేదు. వాడూ.. బొమ్మలేసే వాడు... నీ నీడను తాకే తాహతు కూడా లేదు వాడికి. నువ్వు చాలా మంచివాడిని. అయాం సారీ. ఏం చేస్తే నువ్వు నన్ను క్షమిస్తావ్? నువ్వు చెప్పినట్లే వింటాను. వీవాను బాగా చూసుకుంటాను. నన్ను ఏమైనా చేసుకో. బానిసలా ఉంటాను. నువ్వూ నేనూ వీవా అందరం కలిసి ఉందాం. మీకు వంట చేస్తాను, వాడిని స్కూలుకు తీసుకువెళతాను. మనం ముగ్గరం సినిమాకూ, షాపింగుకూ వెళతాం. మనకంటె ఇంకెవ్వడూ సంతోషంగా ఉండలేనంత సంతోషంగా ఉం..

హఠాత్తుగా ఏడుపు తన్నుకొచ్చేసింది నీలిమకు. స్టీరింగ్ వదిలేసి అరచేతుల్లో ముఖం కప్పేసుకుని భోరుమంది. బ్రేకు మీది – ఆమె కాలు అసంకల్పితంగానే నొక్కుకుంది. ఆమె కారు వెనుకగా అతివేగంగా దూసుకువస్తున్న రెండు లోడ్ లారీలకు ఏమీ అర్థం కాలేదు. రోడ్డు మధ్యలో ఆమె కారు అటు ఇటూ కాకుండా గభాలున అడ్డం తిరిగింది. ఆ లారీలు డ్రైవర్ల చేతుల్లో ఆగేంత సమయం లేకపోయింది.

# 17

"రాధీ.. ఓయ్.. లేమ్మా .. మేడం..." ముఖం మీది దుప్పటి తొలగి, వెచ్చటి ఉదయపుకాంతి కళ్ళమీద గుచ్చుకోగా కలల్లోంచి లేచింది రాధిక. చొక్కా కాలరుకు టై బిగించుకుంటూ రాజు ఆమెవేపు పలకరింపుగా కళ్ళు చికిలించాడు. నిద్రను వదలాలి అనిపించక మళ్ళీ కళ్ళు మూసుకుంది రాధిక. కాళ్ళూ చేతులూ ముడుచుకుపోయి గర్భస్థ శిశువులా ఉన్న ఆమెను చూసి ముచ్చట వేసింది రాజుకు. మెల్లగా ఆమె మీదకు వంగి, చొక్కా మడత నలగకుండా జాగ్రత్తపడుతూ, ఆమె చెంపను నిమిరి ఆమె భుజం మీద తలవాల్చాడు. ఇద్దరికీ వెచ్చగా తోచింది. తడి ఆరుతున్న అతడి జుత్తు నుండి ఇగిరిపోతున్న షాంపూ వాసన ఆమె శ్వాసల్లో ముంచెత్తింది. తలగడమీద చెదిరిపోయి నిద్రపోతున్న ఆమె జుత్తును స్పృశిస్తూ మెల్లగా ఆమె చెంప మీద పెదవులు ఆన్చాడు. ఆమె పెదవులు నవ్వులో ఒంపు తిరిగాయి. దుప్పటిలోంచి చేతులు చాచి అతడి భుజాన్ని తన వేపుకు హత్తుకుంది.

"ఏయ్.. .వదులు... షర్టు నలుగుతోంది" మెల్లగా ఆమె చేతులను తప్పించుకున్నాడు అతను. ఉలిక్కిపడి లేచింది రాధిక.

ఆమె చెంప మీద అతడి స్పర్శ ఇంకా ఊరుతూనే ఉంది. కళ్ళకు కనిపిస్తున్న రాజు ముఖాన్ని నమ్మలేకపోయింది. ఆ స్పర్శ, ఆ మాటా, ఈ ముఖమూ ఒకే వ్యక్తివా? ఒకే మనిషిలో స్పర్శ నచ్చడం, మాట నచ్చకపోవడం, ముఖం ఇబ్బందిపెట్టడం ఏమిటి?

"ఏంటి ఇంకా అలా నిద్రగా చూస్తున్నావ్? అసలు రాత్రి ఎప్పుడు వచ్చావ్, ఎప్పుడు పడుకున్నావ్? నాకు తెలియనే లేదు..చాలా టైర్డ్ అయిపోయానేమో పందిలా పడి నిద్రపోయావ్" నవ్వుతూ ఆమె ముఖం మీదకు జారిపోతున్న జుత్తును వెళ్ళతో వెనక్కు తోస్తూ ఎండకు ఆమెను చూపించాడు. తలగడలోకి ముఖం అదుముకుని నిద్రపోయిందేమో, ఆమె చెంప మీద పిల్లో కవర్‌క్లాత్ మడతలు ముద్రించుకుపోయున్నాయి. .

"సర్జరీ ఏం లేదా ఈవేళ, అసలు లేపేవాడిని కాదు, కానీ నోట్ పెట్టావు అని" అంటూ పక్కనే ఉన్న టేబుల్‌పై తన ల్యాప్‌టాప్ పక్కన ఉన్న కాగితాన్ని చూపాడు రాజు. "హేవ్ టు డిస్కస్ ఎన్ ఇంపార్టెంట్ ఇష్యూ. వేక్ మీ అప్ ఇఫ్ యూ ఆర్ లీవింగ్ ఎర్లీ" అంటూ ఎర్ర ఇంకులో తన దస్తూరీలో ఉన్న అక్షరాలు చూడగానే హఠాత్తుగా గతరాత్రి జరిగినదంతా స్ఫురణకు వచ్చి తలనొప్పి అనిపించింది రాధికకు.

"ఇంతకీ నైట్ ఎప్పుడు వచ్చావ్?" ఏదో ఒకటి అడగాలి అన్నట్లు తన మునుపటి ప్రశ్ననే కొనసాగించాడు .

"త్రీ థర్టీ అయ్యింది. నువ్వు చాలా డీప్ స్లీప్‌లో ఉన్నావ్. నిద్రపట్టక నేనూ రెండు పిల్స్ వేసుకుని పడుకున్నాను" అరచేతులతో ముఖాన్ని వెచ్చబరుచుకుంటూ మంచం దిగి బాత్రూం వేపు అడుగులేసింది రాధిక. ఆమెకు నిద్రపట్టకపోవడం చాలా అరుదు అని అతనికి బాగా తెలుసు. నిద్రమాత్ర వేసుకుని మరీ నిద్రపోయిందీ అంటే నిద్ర ఆమెకు చాలా ముఖ్యం అనీ తెలుసు. కానీ వివరాలు అడిగాని అనిపించలేదు అతనికి.

"ఓహో అందుకేనా ఇలా పడుకుండిపోయావ్? ఎండ పడ్డాక కూడా లేవకపోతే ఏంటా అనుకున్నాను. సరే.. నువ్వు రెస్ట్ తీసుకుంటావా ? చిన్న వర్కే. సాయంత్రానికి వచ్చేస్తాను, అప్పుడు మాట్లాడుకుందామా?" ల్యాప్‌టాప్ అందుకున్నాడు రాజు.

"అదేమిటీ.. అసలు దేని గురించి మాట్లాడాలి అనుకున్నానో కూడా తెలుసుకోవాలని లేదా?" జుత్తు ముడి వేసుకుంటూ చివుక్కున చూసింది రాధిక. ఆమె స్వరంలోని తీక్షణత గమనించి, అయోమయంగా చూసాడు అతను.

"రాజూ, దిసీజ్ రియల్లీ ఇంపార్టెంట్. మచ్ మోర్ ఇంపార్టెంట్ దేన్ యువర్ ఆఫీస్. ఒక్క పది నిముషాలు ఆగగలవా, స్నానం చేసి వచ్చేస్తాను, బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ మాట్లాడుకుందాం" అంటూనే అతని సమాధానం అక్కర్లేదు అన్నట్లు బాత్రూంలోకి అడుగుపెట్టింది. గీజర్ వేసుకోకుండా చన్నీళ్ళకే శరీరాన్ని అందించింది. "ఇప్పుడు ఈ విషయం తనతో చర్చించడం అవసరమా?"

"వొద్దు.. ఏం జరిగితే అది జరుగుతుంది, కామ్‌గా ఉండు"

"లేదు తేల్చేసుకో, అతనికి వేరే ఆడదానితో సంబంధం ఉండటం క్షమించరాని నేరం" మనసులో వాదప్రతివాదనలు జరిగిపోతుంటే కళ్ళు మూసుకుంది. రెండు రోజులు డ్యూటీకి రాలేననీ తెల్లవారుఘామునే హాస్పిటల్‌కు మెసేజ్ చేసిన విషయం, ఇంకెవ్వరికీ తను అందకూడదని ఫోన్ ఆఫ్ చేసి పెట్టుకోవడం గుర్తుచేసుకుంది. ఒక గంట, పోనీ రెండు గంటలు, తప్పితే ఈ పూట, ఈ రోజు... తర్వాత తన జీవితంలో చాలా పెద్ద మార్పే వస్తుందని ఆమెకు అంతర్లీనంగా తెలుస్తోంది. కానీ మార్పు ఏమిటో అందువలన తన జీవితం ఎటు సాగుతుందో మాత్రం పాలుపోవడం లేదు. బయట రాజు మనఃస్థితి కూడా అంతే అలజడిగా ఉంది. రాధిక అంత తీక్షణంగా మాట్లాడడం అతనికి వింతగా అనిపించడమే కాక ఏవో అనుమానాలనూ రేపుతున్నాయి. ***తప్పును దాచుకున్న మనిషికి మాట్లాడవలసి రావడం కంటే ప్రమాదకరమైన సందర్భం ఉండదు.*** ఆమె దేని గురించి మాట్లాడుదాం అంటోందో ఊహించేందుకు మెదడును కష్టపెడుతూనే బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేసాడు అతను. అత్తమామలు ఇంట్లో లేకపోవడం చాలా లోటుగా అనిపించింది. మాట దాటవేసేందుకయినా మనిషికి తోడు చాలా అవసరం. ఏదో తుఫానుకు సూచనలాగా ఇల్లంతా నిశ్శబ్దం అలుముకుని ఉండటంతో, భరించలేనట్లు టీవీ పెట్టాడు. తెలుగు వార్తల ఛానెల్‌లో, క్రికెట్ సందర్భంగా పొట్టి బట్టలు వేసుకుని డాన్స్ చేస్తున్న అమ్మాయిలను చూపిస్తున్నారు. దేశంలో పెద్దమనుష్యులుగా చెలామణీ అయేవారంతా వారి వెనుకే ఉండి ఉల్లాసంగా చప్పట్లు కొడుతున్నారు. స్త్రీ అందం అంతులేనిది. ఎన్నిసార్లు చూసినా తనివితీరదు. ఒకేరకం బట్టలు వేసుకుని ఒకేరకంగా నర్తిస్తున్న ఆ యువతలలో ఎంతటి విభిన్నత్వం. సోఫాలో కూర్చుని కళ్ళప్పగించాడు రాజు. పొట్టి స్కర్టు కింద తెల్లగా మెరిసిపోతున్న అమ్మాయిల కాళ్ళను చూస్తుండగా స్ఫురించింది రాజుకు, " ఒకవేళ రాధికకు నా బలహీనత తెలిసిపోయిందా?"

"ఎవరయి ఉంటారు, కణిక? అవంతిక? నవ్య? ఫరీదా? జెన్నీ..?" తను మనసుపడిన, మోజు తీర్చుకున్న అమ్మాయిల పేర్లు అన్నీ అతడి మనసులో మెదిలాయి. అంతలోనే నవ్వు వచ్చింది అతనికి. ఎట్టి పరిస్థితుల్లోనూ రాధిక మాట్లాడదల్చిన విషయం అది కాదు అనిపించింది. ***అవతలి వ్యక్తిని తక్కువ అంచనా వేయడమే తన తెలివిగా భావించుకోవడం మనిషికి వరమైన ఒక అల్పసంతోషం.***

"రాజూ" రాధిక పిలుపుతో ఉలిక్కిపడి టీవీ సౌండు తగ్గించి వెనక్కు చూసాడు. కుంకుమ రంగు కాటన్ చీరలో వెచ్చగా వెలిగిపోతూ కనిపించింది రాధిక. ఆమె వెనుకగా ఉన్న కిటికీలోంచి వస్తున్న సూర్యరశ్మి, ఆమె చీర అంచులకూ, అప్పుడే తలస్నానం చేసిన ఆమె జుత్తుకూ బోర్డర్‌లా కనిపిస్తూ ఏదో దివ్యతేజస్సులా కనిపించింది అతనికి. "బ్యూటిఫుల్" అప్రయత్నంగానే అనేసాడు అతను. అర్థం కానట్లు చూసింది రాధిక.

"హే..జస్ట్ అక్కడే అలానే నిలబడు.." అంటూ హడావుడిగా తన జేబులోని సెల్‌ఫోన్ తీసి కెమెరా ఆన్ చేసాడు. రాధిక మారు మాట్లాడేలోగా, ఆమె రూపాన్ని ఫోటో తీసాడు. అతడి ప్రవర్తన ఆమెకు వింతగా తోచింది. అంత ఉదయం పూట అతను అలా చలాకీగా ప్రవర్తించడం చాలా అరుదు.

"సీ..సీ...దిస్ విల్ బీ యువర్ బెస్ట్ ఫోటో.. ఏంజెల్‌లా ఉన్నావ్. నీ చుట్టూ హేలోలాగా లైట్ చూడూ..టూ గుడ్" హడావుడిగా ఆమెను సమీపించి తను తీసిన ఫోటో చూపించాడు. నిజంగానే నచ్చింది రాధికకు. చాలా నచ్చింది. దేవతలా కనిపిస్తోంది తను. ఇన్నేళ్ళల్లో అతను తనను ఎప్పుడూ ఇలా ఫోటో తీయలేదే! తనను వర్ణిస్తూ చైతన్య చెప్పిన మాటలన్నిటికీ దృశ్యరూపంలా ఉంది ఈ ఫోటో. ఈ ఫోటో రాజు తీయడం ఏమిటి? చైతన్య తీయకపోవడం ఏమిటి?

"బ్యాడ్ టైం, హై డెఫినిషన్ కెమెరా ఉన్న ఫోన్ అయి ఉంటే బావుండేది, ఈ ఫోటోను బ్లో అప్ చేసినా క్వాలిటీ చెడేది కాదు. కనీసం ఫోర్ మెగా పిక్సెల్ అన్నా ఉండాలి కదా." రాజు ఫోటోలోని తన గురించి కాక, అందులోకి సాంకేతిక వివరాలను చెప్పడం

మొదలెట్టడంతో ఆమె లోచనలు చెదిరాయి. ఇతను మారడు. బ్రేక్‌ఫాస్ట్‌ను ప్లేట్లలో అమరుస్తూ, తను చెప్పవలసిన విషయానికి సరి అయిన మాటలను కొలుచుకుంది. రాజు ఆమెను మళ్ళీ ఫోటో తీసే ప్రయత్నాలు మొదలెట్టాడు.

"ప్లీజ్ రాజూ, లీవిట్" చిరాకులో ఆమె కనుబొమలు ముడివేసుకున్నాయి.

"అవునూ ఏమిటీ ఏదో ఇంపార్టెంట్ విషయం అన్నావ్" సరదాగా ఆమె భుజంపై చేయి వేస్తూ అడిగాడు రాజు. సున్నితంగా చేతిని తిరస్కరిస్తూ,

"రాత్రి పార్టీలో నిన్ను నేను చూసాను రాజూ "ఎంతోసేపటినుంచి రిహార్సిల్ చేసుకున్న మాటను చాలా నింపాదిగా చెప్పింది. గొంతు అయితే వణకలేదు కానీ గుండె మాత్రం జలదరించినట్లు అనిపించింది ఆమెకు. ప్రతిస్పందన కోసం అతడి కళ్ళలోకి సూటిగా చూసింది. అతడి కనురెప్పలు ఆమె చూపుల దాడిని తట్టుకోలేనట్లు తప్పించుకో జూసాయి. ఎండకంటే తెల్లగా పాలిపోయాయి అతడి చెంపలు. " ఏ..మి.." మాట రాక తడబడ్డాడు.

"అందుకే ఇక అక్కడ ఉండలేక జగన్ దగ్గరకు వెళ్ళాను. అక్కడకు నువ్వూ వచ్చాక ఉండబుద్ధికాకే వెళ్ళిపోయాను" ఈసారి మాటల్లో ఆమె గొంతేకాదు , గుండెకూడా స్థిరపడింది. అతడి అరచేతుల్లో చెమట పుడుతోంది.

"రాత్రి నేను హాస్పిటల్‌కు వెళ్ళలేదు. వెంటనే ఇంటికి రాబుద్ధి కాక, ఒక ఫ్రెండును కలిసాను. ఇద్దరం కారులో రైడ్ వెళ్ళొచ్చాం. ఫ్రెండ్ చైతన్య. జగన్‌తో కానీ, అతనితోగానీ నీగురించి చెప్పుకుని రిలీఫ్ పొందుదాం అనుకున్నాను, కానీ, ఏమిటో మన మధ్య విషయం గురించి ఎంత క్లోజ్ అయినా ఇంకోరితో చెప్పుకోబుద్ధి కాలేదు" అతడి నిజాయితీని ప్రశ్నించే మునుపు తనగురించి అతడు ప్రశ్నించే అవకాశం ఇవ్వదలచలేదు రాధిక. ఆమె ఒక్కొక్క మాటకూ అతని ముఖంలో రంగులు మారడం ఆమె గమనిస్తోంది.

"వాటీజ్ దిస్ రాజూ? ఇలా ఎందుకు జరుగుతోంది? కెన్ యూ ఎక్స్‌ప్లయిన్?" ఇక మాట్లాడవలసింది అతనే అన్నట్లు చూసింది.

***హఠాత్తుగా మొత్తం నిజాలు చెప్పాల్సిరావడం అంటే ఉన్నపళంగా ఒంటిమీది చర్మం అంతా తగలబడిపోయి వ్యక్తిత్వం బయటపడిపోవడమే.*** మంటను భరించలేకున్నాడు రాజు.

"రాధీ.. ఏం మాట్లాడుతున్నావ్? నాకు సరిగా అర్థం కావట్లేదు. రాత్రి ఏమిటీ ..?" అప్రయత్నంగానే నటనను ఆశ్రయించాడు.

"రాజూ, నీలో చిన్నచిన్న లోపాలు చూసినా నువ్వంటే ఎప్పుడూ చులకన లేదు నాకు. ప్లీజ్, ఈ టైంలో అబద్ధం చెప్పి నువ్వంటే నాకుండే గౌరవాన్ని చంపొద్దు..." తీక్షణంగానే చెప్పింది ఆమె. నిరుత్తరుడైపోయాడు అతను. ఆమె కళ్ళలో తను గౌరవహీనుడిగా కనిపించడం జరుగుతుందని అతడెప్పుడూ ఊహించుకోనైనాలేదు. ***భార్య దృష్టిలో పతనమవడమంటే భర్త మగతనానికే ఓటమి.*** అతడి పెదవులు ఎండిపోయాయి. నీళ్ళు త్రాగాలి అనిపించింది. కానీ ఆమె చూస్తుండగా చేయి చాపి గ్లాసును అందుకునేంత శక్తి లేనట్లు నీరసించిపోయాడు. గతరాత్రి అతి దగ్గరగా చూసిన అవంతికా కురియన్ ముఖం గుర్తుకువచ్చింది అతనికి. ఆమె కళ్ళు చాలా అందంగా ఉంటాయి. చేతుల్లో ఇమిడిపోతే పువ్వులా ఉంటుంది ఆమె ముఖం. ఛీ, ఈ సమయంలో ఆమె అందం గురించి స్పందించడమేమిటి?

"అవంతిక నాకు ఒక సంవత్సరంనుంచి పరిచయం. చిన్న ఫ్రెండ్‌షిప్‌లా మొదలై.." ఆమెకు తెలిసిపోయిన తన అక్రమసంబంధం గురించి ఎంత సున్నితంగా చెప్పాలా అని వేగంగా ఆలోచిస్తూనే అతడు మాటలు కూడగట్టుకుంటున్నాడు.

"ప్లీజ్ రాజూ.. ఆ విషయాలంతా నాకు అనవసరం" అతడి మాటల్లో ఆసక్తి లేనట్లు ముఖం తిప్పేసుకుంది రాధిక. ఒక కన్నీటి చుక్క జారిపోకుండా ఆమె కంటి రెప్ప అంచును పట్టుకుని వేళ్ళాడుతోంది. అతడి ఎదుట ఏడవకూడదు అనే బలమైన నిర్ణయాన్ని నిలుపుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. "ఇఫ్ యూ డోంట్ మైండ్, ఆర్యూ ఎ వర్జిన్" పెళ్ళిచూపులనాడు తనను అమాయకంగా ప్రశ్నించిన రాజు గుర్తుకువస్తున్నాడు ఆమెకు. వీడేనా అమాయకుడు ?

"నీకూ తనకూ మధ్య రిలేషన్‌షిప్ ఎలా మొదలయ్యిందీ అనేది కాదు నాకు ముఖ్యం, ఎందుకు జరిగింది అనేదే నాకు తెలియాల్సింది" ఏం వినాల్సివస్తుందో అని భయపడుతూనే అడిగింది.

"అంటే.. ?" అతడికి ప్రశ్న నిజంగానే అర్థం కాలేదు.

"నిజం చెప్పు.. అవంతిక మాత్రమేనా, ఇంకా ఎవరైనా ...?" ఆమె పూర్తి చేయకుండానే అతనికి ప్రశ్న అర్థమై తలదించుకున్నాడు. సమాధానం అర్థమై ఆమె మనసు భగ్గుమంది.

"ఎంతమంది?" మొదటిసారి ఆమె గొంతు వణికింది. ఏడవకూడదు. నో .నో. మనసులో పెద్ద యుద్ధమే చేసుకుంటోంది రాధిక.

"ఎప్పటినుంచి...?"

అతడు తలపైకెత్తలేదు. తన ప్రశ్నతో అతను మానసికంగా నలిగిపోతున్నాడు అని అర్థం అయ్యింది రాధికకు. ఎందుకో కానీ, చాలా సంతోషం వేసింది. అతడిని ఇంకా ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసి బాధపెట్టాల్సిందే అనే ఒక వికృతమైన కోరిక పుట్టింది ఆమెలో. అతను ఆమె కళ్ళల్లోకి చూసే ధైర్యం చేయలేకపోతున్నకొద్దీ ఆమెలో కోరిక పెరుగుతోంది. ఈసారి మానసికంగానే కాదు, శారీరికంగానూ అతడిని బాధపెట్టాలి అనిపించింది. ఎంత దగా! ఎన్నేళ్ళుగా ఎంతమంది అమ్మాయిలతో గడిపి అదే శరీరంతో తనను స్పృశించాడా. ఒళ్ళంతా జలదరించింది ఆమెకు. అవంతికా కురియన్ గుర్తుకువచ్చింది. ఎర్ర జరీ చీర, ఎద కొలతలు తెలియబరిచేలాంటి జాకెట్టు, రక్తం రంగు లిప్‌స్టిక్... ఆ పెదవులను, ఆ గుండెలను ఆర్తిగా అనుభవించాడా వీడు ? మిగతా ఆడవాళ్ళు ఎవరో? ఎందుకు ఎందుకు ? తప్పు కదా. తప్పు కాదా ? మోసం కాదా. గొంతు చించుకుని, చుట్టూ ఉన్న వస్తువులన్నీ విసిరికొట్టి అతడిని ఏమైనా చెయ్యాలి అనే వెర్రి ఆవేశాన్ని అదుపు చేసుకుంది.

"ఇంతకీ ఎవరెవరు?" ఆమె మాట కన్నీటిలో ఉక్కిరిబిక్కిరైంది.

"నాకు తెలిసినవాళ్ళు ఉన్నారా?" ఆమె ప్రాణస్నేహితురాలు జెన్నిఫర్ పట్ల అలాంటి వ్యామోహం కలిగినా, శారీరికంగా ఏ సంబంధం లేకపోయినా మానసికంగా అనుభవించిన సందర్భాలు గుర్తుకువచ్చి అతడు భీతిచెందాడు. అంత నిజం చెబితే ఆమె తట్టుకోగలదా?

"నాతో ఉంటూ ఎవరినైనా ఊహించుకు..." ఇక అడగలేనట్లు ఆమె మాట మింగేసింది. ఊహించడానికీ అనుభవించడానికి మధ్య తేడా అనుభవమే. సంతోషమైనా, విషాదమైనా, వినాశనమైనా ఎలా ఉంటుందో ఊహించుకున్నప్పుడు కలిగే అనుభూతికన్నా అసలైన అనుభవం భరించలేనంత ఎక్కువే ఉంటుంది.

"సారీ. ఐ షుడ్‌నాట్ బీ ఆస్కింగ్ ఆల్ దిస్" మొహమాటపడకుండా చెంపలు వత్తేసుకుని కన్నీరు తుడిచేసుకుంది రాధిక. వారి మధ్య అన్నేళ్ళపాటు అల్లుకున్న అనుబంధం అంతా ఆమె వెక్కిళ్ళలో ఎగసిపడి పొలమారింది. తన కోసం అయితే అందుకోవడానికి కూడా సాహసించని మంచినీటి గ్లాసును ఆమె కోసం తీసుకుని అందించాడు రాజు. వొద్దంటూ చేతితోనే తిరస్కరించింది ఆమె. అయినా అతను గ్లాసును ఆమె పెదవుల దగ్గరకు అందించాడు. గ్లాసును అందుకుని నేలమీదికి విసిరికొట్టాలి అనిపించింది. గాజు పగిలిన చప్పుడు వినాలి అనిపించింది. ఒక క్షణం నీలిమ గుర్తుకువచ్చింది ఆమెకు. తనూ ఆమెలాగా సైకోసిస్ పేషెంట్ అయిపోతోందా? ఆమె చైతన్యను బాధపెట్టినట్లు తనూ రాజుని మానసికంగా చిత్రవధ చేసే! ఆలోచనకే ఆమె ఒళ్ళు జలదరించింది. రాజు అంటే అంత కోపం, ద్వేషం, అసహ్యం పెల్లుబుకుతున్నాయి ఆమెలో. కానీ అతడిని శిక్షించేందుకు తన వ్యక్తిత్వం కోల్పోవడమే ఆమెకు నచ్చడం లేదు. నేనెవరు? రాధిక. బుద్ధిగా చదువుకున్నదాన్ని. రాధిక. డాక్టర్. హైలీ క్వాలిఫైడ్ రాధిక. తన గురించి తనకు తానే మళ్ళీ మళ్ళీ పరిచయం చేసుకుంటున్నాయి ఆమె ఆలోచనలు.

స్కూలులో ఫస్టు వచ్చినప్పుడు అవార్డు తీసుకున్న ఫోటోలు. గోల్డ్ మెడల్. ఒహాయో యూనివర్సిటీ ఆలుమ్నైలో గొప్ప డాక్టర్లు, శాస్త్రవేత్తల సరసన తను దిగిన ఫోటోలు అన్నీ ఆమె మదిలో మెదిలాయి. "నువ్వు బంగారంరా" నాన్న తనను మెచ్చుకున్న క్షణం, "ఐ విల్ బీ ఇన్డెటెడ్ టు యూ ఆల్ మై లైఫ్ డాక్టర్" తన కూతురి ప్రాణాలు కాపాడినందుకు ఒక ప్రముఖుడు తనకు నమస్కారం చేస్తూ చూసిన చూపు గుర్తుకువచ్చింది. "నువు గో...ప్ప దానివి అయిపోతావ్" సముద్రం ముందు కూర్చుని చేతులుచాచి చెప్పిన చైతన్య గుర్తుకువచ్చాడు. చివరగా... తన పాస్‌పోర్ట్ ఫోటో గుర్తుకువచ్చింది. అదీ తను. సంఘంలోనే కాదు, తన అంతరాత్మలో కూడా. ఇన్నిటి మధ్యలో ఇంకొక చిన్న ఫోటో తన పెళ్ళి ఫోటో. అందులో తను, తన పక్కన ఇతను. తన పక్కన అంతే. తనలో కాదు, తన బదులూ కాదు. ఇతని కోసం తనను తాను కోల్పోవడమా? నిర్ణయానికి వచ్చినట్లు అతడు అందిస్తున్న నీటి గ్లాసు అందుకుని మెల్లగా పెదవులను తడి చేసుకుంది. మనసుతో పాటు మాటా తేటపరుచుకుని,

"రియల్లీ.. అయాం సారీ, మరీ ఎంబరాసింగ్? క్వొశ్చెన్స్ అడిగాను. నీ రొమాంటిక్ ఆర్ సెక్స్ లైఫ్ నీ పర్సనల్ డీటైల్స్ అంతా నాకెందుకు? నాకు కావల్సినదంతా ఒకే ఆన్సర్. ఇలా ఎందుకు చేసావ్?" అంటూ అతని కళ్ళలోకి స్థిరంగా చూసింది. ఇప్పటికీ ఆమె ప్రశ్న అతనికి అర్థం కాలేదు. ఎందుకు, అంటే ఏం చెప్పాలి? తనకు ఆడవాళ్ళంటే మోజు కాబట్టి అని చెప్పాలా? వాళ్ళ సౌందర్యం ఎంత అనుభవించినా తనివి తీరదని చెప్పాలా? అందమైన ఆడవారితో, సంఘానికి తెలియకుండా రమిస్తుంటే ఒక రకమైన థ్రిల్ వస్తుందని చెప్పాలా? ఆ ప్రశ్న తనకు తానే ఎప్పుడూ వేసుకోలేదు అతను. తనేమిటో తనకే తెలియని మనిషి తన గురించి ఇంకొకరికి ఏమని చెప్పగలడు ?

"సీ.. టీవీలో మోడల్స్‌ను, హీరోయిన్స్‌ను, ఎక్స్‌పోజింగ్ సాంగ్స్ అలా చూడటమే నీకు సరదా అనుకున్నాను, కంప్యూటర్‌లో పోర్నోగ్రఫీ చూస్తున్నట్లు తెలిసినా, నాకూ చూపించినా అదంతా నీ ఒక్కడికీ లేక మన ఇద్దరికీ మాత్రమే తెలిసే విషయం అనుకున్నాను. బట్ ఇప్పుడు తెలిసింది వేరు రాజూ. అవర్ ప్రైవేట్ లైఫ్ ఈజ్ నాట్ ప్రైవేట్ ఎనీ మోర్. ఈ పెళ్ళి, మన రిలేషన్‌షిప్ అంతా పోయింది"

చెమటలు పడుతుండగా చెవులు అప్పగించేసాడు రాజు.

" సరే ఒక్కమాట చెప్పు. నీకు నేను బోర్ కొట్టేసానా?" సూటిగా ప్రశ్నించింది ఆమె.

గభాలున సమాధానం ఇచ్చేసాడు రాజు "ప్లీజ్ రాధీ, ఫర్గివ్ మీ. అలా ఏం లేదు. ఐ జస్ట్ హేవ్ వీక్నెస్ ఫర్ అదర్ వుమెన్ అండ్ సెక్స్"

"ఆ మాట నాతో గా చెప్పిఉండొచ్చుగా"

"ఎప్పుడు?"

"పెళ్ళికి ముందే.ఏం నన్ను ఫ్రాంక్‌గా అడిగావ్‌గా, నాకు అంతకుముందు ఎలాంటి సంబంధాలు ఉన్నాయా అని, అలాగే నీగురించి చెప్పి ఉండొచ్చు కదా, ఒక్క ఆడదానితో కమిటెడ్‌గా ఉండలేవని!?"

"చెబితే నువ్వు నన్ను అసలు పెళ్ళి చేసుకునేదానివేనా?"

"అంటే.. మోసం చేద్దాం అనుకున్నావా?"

"నో నో.. నిజానికి అప్పటికి నేనేంటో నాకే తెలియదు "

"అంటే ?"

"నాకు కోరికలు ఎక్కువ అని నాకు తెలుసు కానీ, బ్యాచిలర్‌గా అది సహజమే కదా అనుకున్నాను. ప్రామిస్, నీతో పెళ్ళికి ముందు నాకెవ్వరితో చిన్న ఎఫైర్ కూడా లేదు"

"దట్ మీన్స్, మన మ్యారిటల్ లైఫ్ నీకు కావల్సినంతగా నిన్ను సాటిస్ఫై చెయ్యలేకపోయింది కాబట్టి నీ 'హంగర్ "ఎక్కువయ్యింది అంటావ్?"

రాధిక మాట నిజమా, అబద్ధమా తేల్చుకోలేక తలపంకించాడు రాజు.

"అంటే, ఇన్ ఎ వే, అయాం రె స్పాన్సిబుల్ ఫర్ ఆల్ దిజ్, ఐ కుడ్‌నాట్ కీప్ యూ హ్యాపీ" మళ్ళీ హృదయం భగ్నమంది రాధికకు. అతడు చెడిపోవడానికి తన లోపాలే కారణాలా? ఏం చెయ్యలేదు అతడికోసం? తనకు ఇష్టం లేనప్పుడు కూడా పడకమీద అతడికి సహకరించిందే, తనకు కావలసినప్పుడయినా అతడికి ఇష్టం లేకపోతే ఊరుకుందే అతడు కోరుకున్న బట్టలేవీ తిరస్కరించేలేదే ..అంతకంటే ఏం చేయగలదు తను. అతడు నచ్చే మెచ్చే రకరకాల డవాళ్ళలా మారిపోవడానికి తనేమీ రూపు లేని జీవి కాదు కదా. తన అసహాయత, అశక్తి తన తప్పులా?

"అలా కాదు, ఐ థింక్, బికాజ్ ఆఫ్ ది జాబ్ అండ్ పార్టీస్, ఎప్పుడూ చుట్టూ ఉండే మనుష్యుల్లో ఇలాంటీ అఫైర్స్, అలా లూజ్ విమెన్?.."

"డోంట్ సే దె ఆర్ లూజ్ విమెన్" రాధిక కోపంగా చూసింది. అతడితో గడిపినందుకు అతను వాళ్ళకిచ్చే మర్యాద అంతేనా? భర్తగా కంటే వ్యక్తిగా అతడు మరింత చులకన అయిపోతున్నాడు ఆమె దృష్టిలో.

"కమాన్ రాధికా. నీకు తెలుసు కదా, సొసైటీలో అన్ని రకాల మనుష్యులూ ఉంటారు. వాళ్ళ అవసరాల కోసమో, సరదాకోసమో మన జీవితాలనూ వాడుకోవడం..ఇట్ హ్యాపెన్స్. నేను ఏమీ గౌతమబుద్ధుడిని కాదే, చుట్టూ డిస్ట్రాక్షన్, అట్రాక్షన్స్ ఉంటే కంట్రోల్ చేసుకోలేకపోయాను. అంతే. ఇందులో నీ తప్పూ, లేక మన తప్పూ ఏమీ లేదు. ఐ జస్ట్ బికేం ప్రే ఫర్ మై వీక్నెసెస్"

"నీ బలహీనతవల్లనే తప్పు జరిగితే, ఒకసారి కావొచ్చు రెండుసార్లు కావొచ్చు రాజూ, సంవత్సరాలపాటు జరగదు "

రాజు దగ్గర సమాధానం కరువైంది.

"ఒక మాట చెప్పు రాజూ, మనకే పిల్లలు ఉంటే ఇలా జరిగేదా? వుడ్ ఇట్ హేవ్ మేడ్ ఎ డిఫరెన్స్?"

ఆ కోణంలో ఎప్పుడూ ఆలోచించని రాజుకు ప్రశ్న వింతగా తోచింది. పిల్లలు ఉంటే వారినీ ప్రేమించొచ్చు, అవంతికలాంటి ఆడవారితోనూ గడపొచ్చు రెండిటికీ సంబంధం ఏమిటో అతనికి అర్థం కాలేదు. *ఆడదానికి మాతృత్వం అంటే ఏమిటో కన్యగా ఉన్నప్పటినుండి తెలిసిరావొచ్చు, కానీ మగవాడికి మాత్రం తండ్రిగా ఉండటం అంటే ఏమిటో తండ్రి అయ్యాకే తెలుస్తుంది.*

"మనకు పిల్లలు కలగకపోవడానికి నా లోపం కాబట్టి, స్టేబుల్ ఫ్యామిలీ లైఫ్ లేదు కాబట్టి ఇలా జరుగుతోందా?" అతను అవును అనకూడదు అని కోరుకుంటూ అడిగింది రాధిక. అవునో కాదో చెప్పలేక తెలియదన్నట్లు భుజాలెగరేసాడు అతను.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలుముకుంది. గదిలో ఫ్యాను రెక్కల చాటు గాలి చప్పుడు కూడా గట్టిగా వినిపించేంతటి నిశ్శబ్దం. ఇక దారి లేని "డెడ్ ఎండ్" రోడ్డుకు వచ్చినట్లు అనిపించింది రాధికకు.

"నేను లేకపోతే నువ్వు మరింత హ్యాపీగా ఉండగలను అనుకుంటున్నావా రాజూ" ఏదో ఒక దారి వెతకక తప్పదని గొంతు పెగల్చుకుంది రాధిక. ఆమె భావం అర్థమై చప్పున చూసాడు అతను. "అదే మాట నేనూ అడిగితే ?" అన్నాడు

"అంటే ?"

"నేను లేకపోతే నువ్వు హ్యాపీగా ఉంటావా?"

"హ్యాపీ ఏమో తెలియదు కానీ పెద్దగా ఏమీ మిస్ అవ్వను" అసంకల్పితంగానే చెప్పేసింది రాధిక. అతడి అహం దెబ్బతింది. *తన ఉనికికి అర్థం లేకపోవడం కంటే మనిషికి అవమానం ఏముంటుంది?*

"అలా అయితే, నేనూ హ్యాపీగా ఉండగలను" ఆవేశంగా అన్నాడు.

ఇక కన్నీరు రానట్లు బండబారిపోయిన మనసుతో చెప్పింది రాధిక, "ఒకే దెన్, లెట్స్ పార్ట్ అవే " అని.

సంభ్రమంగా చూసాడు అతను.

"దీంట్లో ఫైనాన్షియల్ ఆస్పెక్ట్స్ చూడకు, మనకు దగ్గరగా ఉందామనే అమ్మానాన్నా ఇక్కడ ఈ ఇంట్లోనే ఉంటున్నారు, కానీ ఇల్లు ఇద్దరిదీనూ. సాయంత్రమే వాళ్ళను వాళ్ళ ఇంటికి షిఫ్ట్ అయిపొమ్మని చెబుతాను, నేను కూడా వాళ్ళతోనే వెళ్ళిపోతాను. మిగతా డాక్యుమెంటేషన్ వ్యవహారాలు నిదానంగా చూసుకుందాం" ఇక మాట్లాడేది ఏమీ లేనట్లు కుర్చీలోంచి లేచింది.

బెదురు చూపులతో రాజు కూడా లేచి, "హేయ్, డోంట్ యాక్ట్ ఇంపల్సివ్, ఏదో మాట తప్పింది. వి కెన్ వర్క్ ఇట్ అవుట్. కూర్చో.. వి విల్ సార్ట్ ఇట్ అవుట్" అన్నాడు

"ఏంటి సార్ట్ అవుట్? పరిష్కరించడానికి ఏం ఉంది. నీ లైఫ్ నీ ఇష్టం వచ్చినట్లు ఉండాలి అనుకుంటున్నావ్, ఉండు"

"అలా ఎలా మాట్లాడుతావ్? వాట్ హ్యాపెన్స్ టు ఆల్ దిజ్ ఇయర్స్ ఆఫ్ అవర్ మ్యారీడ్ లైఫ్. మా నాన్నగారు, మీ పేరెంట్స్, బంధువులు, కొలీగ్స్, కెరియర్స్, మనం... అన్నీ రిలేటెడ్ కదా. అలా వేళపడితే ఎలా ...?"

"నువ్వు అనుకునేంత కాంప్లికేషన్ ఏం లేదు రాజూ, పబ్లిక్‌లో నీ ఇమేజ్ ఏమీ చెడిపోదు. డైవోర్స్‌కు కారణాలు ఏమిటీ అని వీరెవ్వరికీ చెప్పనవరం లేదు. నా కోసం నువ్వు ఛేంజ్ కాలేవు, నువ్వు ఛేంజ్ అయినా కాకపోయినా ఇంత జరిగాక నీతో నేను కలిసి ఉండలేను. ఐ హేట్ టు షేర్ మై మ్యాన్ విద్ అదర్ విమెన్. అందులో ఆర్గ్యూమెంట్స్ అనవసరం. ప్లీజ్, పెద్ద సీన్ చెయ్యకుండా లెట్ అజ్ పార్ట్ అవే లైక్ ఫ్రెండ్స్" అంది. ఆఖరుసారి చైతన్యతో విడిపోతూ జరిపిన సంభాషణ ఆమెకు గుర్తుకువచ్చింది. "అతడితో రెండుసార్లు విడిపోయాను, ఇతనితో ఇప్పుడు. స్నేహితులుగా విడిపోదాం అనే మాట వింటూనో, చెబుతూనో విడిపోవాలని నా ఖర్మకు ఉందేమో" అనుకుంది.

*తెంచుకోవాల్సిన బంధాలు తెంచుకోగలిగినంత స్థైర్యం పొందిన మనిషిని విధి కూడా ఏమీ చేయలేదు.*

"రాధీ నేను "

"ఆఁ.. చే, ఏమనుకోకు, కొంచెం బిజీగా ఉన్నాను, నేను మళ్ళీ కాల్ చేస్తాను. సరేనా ?"

" ఒకే బై"

"చైతన్యా.. చెప్పు"

"... "

"హలో... "

"ఆఁ.."

"మాట్లాడవేం? "

" ఏం మాట్లాడాలో తెలియడం లేదు "

"అదేంటి ? "

"ఏంటిలా చేసావ్?"

"ఏం చేసాను?"

"డైవొర్స్.."

"నీకెలా తెలిసింది "

"ప్రపంచం చాలా చిన్నది, కామన్ ఫ్రెండ్స్ ఎక్కడో తగులుతూనే ఉంటారు"

" .. "

"ఎందుకు రాధీ, ఎనీ ప్రాబ్లం?"

ఆమె నవ్వింది. అతడికి అర్థం అయ్యింది.

"సారీ రిడిక్యులస్‌గా ఉంది నా కొశ్చెన్. ప్రాబ్లం లేకపోతే డైవోర్స్ ఎందుకొస్తుంది!"

ఆమె ఈసారి శబ్దం రాకుండా నవ్వింది. అయినా అతనికి వినపడింది.

"నువ్విప్పుడు ఒకే కదా!?" అతడి గొంతులో నిర్మలత్వం ఆమెకు నచ్చింది.

"బానే ఉన్నాను "

"..    .."

"ఇంకేంటి చే "

"ఎప్పుడైనా ఏదైనా అవసరం అయితే, తప్పకుండా కాల్ చెయ్యి"

"ఇక మీదట కలవొద్దు, మాట్లాడొద్దు అన్నావ్ కదా" ఆమె అల్లరిగా నవ్వింది. అలా నవ్వి చాలా కాలం అయినట్లు తోచింది ఆమెకు.

"కమాన్, అది మనసులో పెట్టుకుని ఏదైనా కష్టంవచ్చినప్పుడు పంచుకోవడానికి కూడా అభిమానపడితే ఎలా? ఎమర్జెన్సీస్‌కు ఎక్సెప్షెన్స్ ఉంటాయి కదా "

"నా డైవొర్స్ అంత ఎమర్జెన్సీ ఏం కాదులే.."

"హ్మ్మ్.. మే బీ. యూ నో బెటర్. ఎనీవే, దిసీజ్ మై నెంబర్, నేనిప్పుడు హైద్రాబాద్‌లో లేను"

"ఎక్కడున్నావో చెప్పొద్దు ప్లీజ్ "

"అదేంటి?"

"మనం కలవడం అనవసరం, ఒద్దు అన్నప్పుడు అలాంటి వివరాలు తెలుసుకోవడం ఎందుకు?"

"నామీద కోపంగా ఉందా? "

"ఎందుకూ ?"

"ట్రస్ట్ మీ రాధీ, అయాం జస్ట్ బిల్డింగ్ మైసెల్ఫ్ ఎగైన్. ఇలాంటప్పుడు డైవర్స్ అయిన నీతో చనువు నా కంట్రోల్‌కు చాలా పెద్ద పరీక్ష. అందుకే ఇప్పటికీ దూరంగా ఉండటమే ప్రిఫర్ చేస్తున్నాను "

"ఒకే..నేనేం అనలేదు కదా"

"బట్ యూ ఆర్ యాంగ్రీ విత్ మీ"

"లేదు"

"నాకు తెలీదా, ఫోన్ చేసినప్పటి నుంచీ వీవా ఎలా ఉన్నాడని కూడా అడగలేదు "

"చెప్పాపెట్టాకుండా డిస్చార్జ్ చేసి తీసుకెళ్ళి, నాకు "థాంక్స్" చెబుతూ, వాడిని జాగ్రత్తగా చూసుకుంటాను అని మెసేజ్ పెట్టావుగా"

"అందుకు కోపమా?"

"లేదు, నువ్వు మాట అన్నావూ అంటే ఐ కెన్ అండర్ స్టాండ్ ..వాడు నీ దగ్గర హ్యాపీగా పెరుగుతున్నాడని"

"సరే మరి, టేక్ కేర్, నేను ఉన్న చోట సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఒకోసారి అందవు, ఏదైనా అవసరం అయితే మెసేజ్ పెట్టు లేకపోతే మెయిల్ ఇవ్వు ఓకేనా?"

"ఓకే కానీ, నాకూ ఈ నెంబరు ఎక్కువరోజులు ఉండదు. మసాచ్యుసెట్స్ వెళుతున్నాను , అక్కడకు వెళ్ళాక కొత్త నెంబర్ మెయిల్ చేస్తానులే "

"మసాచ్యుసెట్స్? ఎం.." ప్రశ్నను మింగేసాడు అతను. అయినా చెప్పింది ఆమె.

"జెన్నిఫర్ అని నా ఫ్రెండ్‌తో ఒక రిసెర్చ్ ప్రాజెక్ట్. సంవత్సరం పడుతుంది "

"తర్వాత?"

"ఏమో... అప్పుడు ఏం చెయ్యాలి అనిపిస్తుందో అప్పుడే ప్లాన్ చేసుకుంటాను"

"హ్మ్..గుడ్. ఆల్ ది బెస్ట్. ఉండనా మరి"

"ఓకే బై.."

"హే హే.. వీవా చాలా బావున్నాడు, ఇప్పుడు వాడు.."

"చెప్పొద్దు చే"

"అయాం సారీ, బై"

"చైతన్యా,

నాకు నువ్వంటే చాలా కోపంగా ఉంది. నువ్వు మొండివాడివని తెలుసుకానీ మూర్ఖుడివి అని ఎప్పుడూ అనుకోలేదు. మనం మళ్ళీ కలవకపోతే బెటర్ అని నువ్వు చెప్పి వెళ్ళిపోయి ఇప్పటికి దాదాపు ఎనిమిది నెలలు అవుతోంది. మధ్యలో ఓ సారి ఫోన్ చేసి నా డైవోర్స్ గురించి పరామర్శించేంత స్నేహం ఉంది కానీ, నీ వైఫ్ చనిపోయింది అని ఒక్క మాట చెప్పడానికి నీకు తీరిక లేదా ? ఎవరో కామన్ ఫ్రెండ్ చెబితే వెర్రిదానిలా విని తెలుసుకున్నాను. నాకు ప్రాబ్లం వస్తే సైకలాజికల్ సపోర్ట్ ఇవ్వడానికే ఉన్నట్లు మాట్లాడుతావే, నీ లైఫ్‌లో అంత పెద్ద విషయం జరిగితే కనీసం నాతో చెప్పుకోవాలి అని కూడా అనిపించలేదా? ఏమనుకుంటున్నావ్ నీ గురించి నువ్వు? నాకు నీ సపోర్ట్ కావాలి కానీ, నీకు ఎవ్వరీ సపోర్ట్ అక్కర్లేదు అని నీ ఈగో కదా. పెద్ద హీరోలాగా ఫీలవుతావా? ఛ, పీకలదాకా కోపం వస్తోంది నిన్ను తలుచుకుంటే. అందుకే నీకు ఫోన్ కూడా చెయ్యబుద్ధి కావట్లేదు. లైఫ్ అంతా ఇట్లాగే అహంకారిలా బ్రతుకుతావా...బ్లడీ ఇడియట్.

రాధిక"

"అయాం సారీ రాధీ, నీకు చెప్పకూడదు అని ఏం కాదు. కానీ, రాత్రే ఇక మళ్ళీ కనిపించొద్దు అని చెప్పి విథిన్ ట్వెంటీ ఫోర్ అవర్స్‌లో పిల్లాడిలా నీ ఒళ్ళో చేరడం నాకు నచ్చలేదు. మనం రాత్రి కారులో షికారుకెళ్ళిన కాసేపటికే నీలిమకు యాక్సిడెంట్ అవడం, ఆమె స్పాట్ డెడ్ అవడం... అంతా మరీ క్విక్‌గా జరిగిపోయింది. యూ నో, తన డెత్ గురించి తెలిసిన క్షణం నాకు షాక్ అనిపించింది. బాధవలనో, వేదనవలనో కాదు అసలు అలాంటిది ఊహించకపోవడం వలన. నిజంగా, మనిషి చచ్చిపోతే బావుణ్ణు అని చాలాసార్లు అనుకున్నాను. చాలా సార్లు. వీవాకు పాలు ఇవ్వనని అసహ్యించుకున్న రోజు, హాస్పిటల్ నుంచి వాడిని ఎత్తుకెళ్ళిపోయిన రోజు,

తనను రేప్ చేసానని నన్ను హీనంగా చూసిన రోజులు... ఎన్నిసార్లు!!. కానీ రాధీ, తీరా ఆ మొమెంట్ వచ్చాక, తను నిజంగా చచ్చిపోయింది అని తెలిసాక నాకు సంతోషం వెయ్యలేదు. ఆమె చావును కోరుకున్నందుకు నామీదే నాకు కోపం వచ్చింది. తప్పు కదా. ఒక మనిషి చావు కోరుకోవడం. పాపం అనిపించింది, జాలి వేసింది. తనే ఉండి ఉంటే, ఏమో ,ఎప్పటికయినా మంచిగా మారేదేమో . వీవా పెద్దయ్యాక, గొప్పవాడయ్యాక ఏజ్ ఎ మదర్ తను కూడా ప్రౌడ్‌గా ఉండేది కదా. పాపం, అంతా పోయింది. ఎనీవే, ఇట్సాల్ కన్‌ఫ్యూజింగ్. ఆమె అంటే నాకు ఇష్టం లేకపోవడమో, ద్వేషం ఉండటమో దేనివల్ల అయినా కానీ తను నా లైఫ్‌లో ఒక ఇంపార్టెంట్ పార్ట్. తను చనిపోయినప్పుడు ఐ మిస్డ్ దట్ పార్ట్. అంటే ఆమెను మిస్సయినట్లే అనిపించింది. ఎందుకోకానీ దిగులుగా, ఒంటరిగా అనిపించింది. నీకు తెలుసు, అలాంటి సమయంలో నువ్వు నా పక్కన ఉంటే నీ ఒళ్ళో వాలిపోతాను. ఒక్కసారి నీ చెయ్యి నాకు దొరికితే మళ్ళీ వదల్లేను. ఐ విల్ బీ అడిక్టెడ్ టు యు. ఐ విల్ బీ డిపెండెంట్ ఆన్ యూ. అలా నీకు అడిక్ట్ అవడానికో, డిపెండ్ అయిపోవడానికీ నాకు అహం అడ్డు కాదు. అయినా నీ దగ్గర నాకు ఈగో ఏంటి రాధీ. కానీ, పెళ్ళిళ్ళు, వేరే జీవితాలు ..వీటి వల్ల మన మధ్య పెరిగిపోయిన దూరం మనం చెరిపెయ్యలేం. నా వైఫ్ చనిపోయింది కాబట్టి నీ ఫ్యామిలీ లైఫ్‌ను వదులుకుని నన్నూ, వీవాను చూసుకొమ్మని నిన్ను అడగగలనా? అది నా స్వార్థం అవదూ? అందుకే అడిగాను "ఆర్యూ హ్యాపీ విత్ యువర్ హజ్‌బెండ్?" అని. నువ్వు అవును అన్నాక మళ్ళీ నిన్ను ఆశించడం, కోరుకోవడం నేను చేయకూడని తప్పు. అందుకే తప్పుకు దూరంగా పారిపోయాను. అయినా నన్ను అంటున్నావ్ కానీ, అసలు హిపోక్రైట్‌వు నువ్వు. రాత్రి "ఆర్యూ హ్యాపీ విత్ యువర్ హజ్‌బెండ్?" అని నేను అడిగినప్పుడు, నిజం చెప్పి ఉండొచ్చు కదా. తర్వాత వారం రోజులకు మీ డైవోర్స్ అయిందీ అంటే, అంతకుముందు ఎన్ని సంవత్సరాలుగా మీ మధ్య ఎంత దూరం ఉండి ఉండాలి? ఏం ఒక్కరోజైనా నాతో మాట చెప్పకూడదా? మన మధ్య దూరానికి ప్రధాన కారణం అంతా నీ మ్యారేజే. యస్. ఎన్ని సార్లు చెప్పాలి నీకు ? మొదటగా వెళ్ళిపోయింది నువ్వు. నువ్వు మళ్ళీ వస్తావ్ అని నేను చూస్తున్నా వేరే పెళ్ళి చేసుకుందీ నువ్వు. ప్రతిసారీ మొదటి దెబ్బ నువ్వు ఇస్తున్నదే నాదేం ఉంది, నువ్వు చేస్తున్నదాన్ని తిట్టలేక తలఊపాను అంతే. నిజానికి ఈగో నాకు కాదు. ఎవరికో నేను చెప్పనక్కర్లేదు కూడా. నీకే తెలుసు. బ్లడీ ఆరగెంట్ ఉమన్!. పెద్ద డాక్టరవుతావ్ పెద్ద డాక్టరవుతావ్ అని నేను ఎంతో గొప్పగా చెబితే, నాకే అందనంత పెద్ద డాక్టరయ్యి ఎక్కడో ఫారిన్ దేశాల్లో కూర్చున్నావ్? అనుకున్నది చెయ్, నువ్వు అనుకున్నట్లే ఉండు అంటూ నాకు మాత్రం సలహాలు చెబుతావ్. మరి నీ విషయం ఏంటి? ఎంత పెద్ద డాక్టరు అయినా మన దేశంలో, మన రాష్ట్రంలో, కనీసం మనం పుట్టిన / పెరిగిన ఊర్లకు దగ్గర్లో అయినా పేదవాళ్ళకు అందుబాటులో ఉండేలాంటి హాస్పిటల్ ఎస్టాబ్లిష్ చేస్తాను అన్నావ్. అన్నీ ఒట్టి మాటలేనా?

నన్ను చూడు. ఇప్పుడు నేను ఒక పెద్ద స్కూల్ నడుపుతున్నాను. నువ్వన్నావే ఠాగూర్ శాంతినికేతన్ అని, అలాంటిది. అంతకంటే గొప్పదేమో కూడా. ఎందుకంటే ఇది నా స్కూలు. ఇక్కడ పరీక్షల కోసం మాత్రమే గవర్నమెంట్ సిలబస్. కానీ దానితో సంబంధం లేకుండా సవార్కర్, మార్టిన్ లూథర్ కింగ్, మండేలా...అన్ని దేశాల నాయకుల చరిత్రలూ చెబుతాం. ఏడవ తరగతి పిల్లలకే మార్క్స్ సిద్ధాంతాలూ, డెమోక్రసీ, ఫ్రాయిడ్ థియరీలు, కాళిదాసు కవిత్వమూ అన్నీ చెప్పిస్తాం. చదువు, స్పోర్ట్స్ ఇవి మాత్రమే కాదు , ఇంట్లో కరెంటు వర్కు, ప్లంబింగ్ వర్కు, బైకు రిపేరింగ్, వ్యవసాయం, వంట కూడా నేర్పిస్తాం. ఇక్కడ నుంచి బయటకు వెళ్ళే వ్యక్తి ప్రపంచంలో మరే వ్యక్తి తోడు లేకున్నా స్వతంత్రంగా, సంతోషంగా బ్రతకగలిగే విద్యలన్నీ అలవడతాయి. ఎంపీల పిల్లలనుంచి, పేద రైతుల పిల్లలకు కూడా అడ్మిషన్లు ఉంటాయి. పిల్లలు, చెట్లు, పుస్తకాలు...ఒక స్వర్గాన్ని ఏర్పరుస్తున్నాను. అయాం ప్రౌడ్ ఆఫ్ మై సెల్ఫ్ ఫర్ఆల్ అయాం డూయింగ్. మరి నువ్వెక్కడ? మనం ఏంటీ, మన లైఫ్ ఏంటీ కాకుండా.. నాకు విషయం చెప్పలేదే, ఈ విషయం చెప్పలేదే అని ఏమిటి పిల్ల గొడవలు ? గ్రో అప్ ఇన్ లైఫ్ మేడం!!

చే"

"హౌ డేర్ యూ సే" గ్రో అప్" టు మీ?" కాల్ ఆన్సర్ చేయగానే రాధిక గొంతులోని కోపం సెల్‌ఫోన్ రిసీవర్‌లోంచి చైతన్య చెంపను కాల్చేస్తూ తగిలింది.

"హ హ.. అలా మెయిల్ చేస్తే కానీ తమరు కాల్ చెయ్యరన్నమాట"

"టూ మచ్, ఇక్కడెక్కడో ఉండిపోయాను కానీ, లేకపోతే నా చేతిలో నీకుండేది" పళ్ళు నూరింది రాధిక.

"ఇప్పుడు మాత్రం ఏమయ్యిందీ, ఇక్కడకు వచ్చి నీ ప్రతాపం చూపించొచ్చుగా "

"నిజంగానే పిలుస్తున్నావా?"

"యస్ మేడం"

ఇద్దరి పెదవులూ విచ్చుకుంటున్నాయి, కళ్ళు చెమరుస్తున్నాయి. కాసేపు మౌనంలో మాట్లాడుకున్నారు.

"ఎప్పుడు వస్తావ్ మరి?" ఇక ఆగలేనట్లు అడిగాడు చైతన్య

"రీసెర్చ్ వర్క్ ఫైనల్‌లో ఉంది. ఇంకొక నెలలో సబ్మిట్ చెయ్యాలి. అది అయ్యాక వస్తాను"

"నెల తర్వాతా, గుడ్ హే, అప్పుడు పక్క ఊరిలో గర్ల్స్ స్కూల్ ఒకటి లాంచ్ చేస్తున్నాను, నువ్వే ఇనాగరేట్ చేస్తావా?"

"ఆర్డరివ్వండి సార్, పెద్దవాళ్ళు అయిపోతున్నారు. ఆడపిల్లలను ఏడిపించేవాళ్ళంతా గర్ల్స్ ఓన్లీ స్కూల్స్ పెట్టేస్తున్నారు"

"కమాన్ నేనెప్పుడు అమ్మాయిలను ఏడిపించాను. ఇది జస్ట్ గర్ల్స్ ఓన్లీ కాదు. ఇక్కడ ఊళ్ళల్లో ఈరోజుల్లో కూడా ప్రైమరీ ఎడ్యుకేషన్ తర్వాత అమ్మాయిలను స్కూళ్ళకు పంపడానికి ఇష్టపడట్లేదు. గవర్నమెంట్ స్కూల్స్‌లో టీచర్లు కూడా సరిగ్గా బిహేవ్ చెయ్యట్లేదు అని మొన్న ఒక పనికిమాలిన టీవీ ఛానెల్ ఇక్కడెవడో ఒక హెడ్‌మాస్టర్ ఎవరో స్టూడెంట్ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించిన మైనర్ ఇన్సిడెంట్‌ను స్టేట్ ఎమర్జెన్సీలాగా ఊదరగొట్టేసారు. ఆ టీచర్‌ను అరెస్ట్ చేసేసినా, న్యూస్ ఎఫెక్ట్‌తో చాలామంది పేరెంట్స్ తమ కూతుళ్ళకు ఎడ్యుకేషనే ఒద్దు అనేసారు. అందుకే అందరూ లేడీ స్టాఫ్‌తో ఈ స్కూలు పెడుతున్నా. అయినా మీ లేడీస్ ఏం తక్కువ కాదులే, పల్లెటూళ్ళలో పనిచెయ్యడం ఇష్టం లేదని, మామూలుగాకంటే మూడింతలు సాలరీ డిమాండ్ చేసారు" సాధకబాధకాలు చెప్పుకోవడానికి ఒక మంచి తోడు దొరికింది అనే ఆనందంతో అతడి మాటలు ప్రవాహంలా దొర్లిపోతున్నాయి "నేనేమీ ఫ్రీగా ఛారిటీ చెయ్యట్లేదు రాధీ. జస్ట్ మినిమం ప్రాఫిట్ చూసుకుంటున్నాను. తక్కువ ప్రాఫిట్ అయితే గిట్టుబాటు కాదు అనే ఆలోచనతోనే మన దేశంలో ఫుడ్, ఎడ్యుకేషన్, మెడికల్ సర్వీసెస్ అన్నీ ఖరీదు అయిపోతున్నాయి. నువ్వు హాస్పిటల్ పెట్టి చూడు, ఫ్రీ సర్వీస్ ఏం అక్కర్లేదు, మినిమం ఛార్జ్ చేసినా నీకు ప్రాఫిటే. ఏసీ రూములూ, రిసెప్షనిస్టులూ, వెయింటిగ్ లాంజ్‌లో పువ్వుల దుకాణాలూ, కాఫీ షాపులూ...అలా అనవసరమైన సర్వీసులు అందిస్తూ  ఓవర్ హెడ్స్ అన్నిటినీ కూడా పేషెంట్ల మీద రుద్దుతున్నారు "

"ఏంటి సార్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నారా?" వేళాకోళం ఆడింది రాధిక.

"నువ్వు వస్తే అవసరం అవుతుందని, ఇదంతా తెలుసుకున్నాను" అతడి శ్వాసలోని నిజాయితీ ఆమెకు వెచ్చగా తగిలింది.

"ఒక మాట చే"

"అడుగూ.."

"నేను పక్కన ఉంటే కంట్రోల్ తప్పుతాను కాబట్టి మళ్ళీ కనిపించొద్దు అన్నావ్ కదా, మరి ఇప్పుడేంటి? నీ మీద నీకు అంత కంట్రోల్ వచ్చిందా ?"

"ఐ డోంట్‌నో "

"అదేంటీ?"

"నేను  మాట అన్నప్పుడు నీ లైఫ్ కానీ నా లైఫ్ కానీ మన చేతుల్లో కంటే ఇంకొకరి చేతుల్లోనే ఎక్కువ ఉన్నాయి. వి వర్ ఆన్సరబులు టు అదర్స్ అబౌట్ వాట్ హ్యాపెన్స్ బిట్వీన్ అజ్, ఇప్పుడు ఆ బాండ్స్ లేవు కదా"

"అంటే, నీలిమ చచ్చిపోవడం, రాజుతో నేను విడిపోవడం వలనే ఈ రోజు నువ్వు నాతో ఇంత ఫ్రీగా మాట్లాడుతున్నావ్, ఇలా నన్ను ఇన్వైట్ చేస్తున్నావా?"

"నీలిమ ఉన్నా లేకపోయినా నేను పెద్ద కేర్ చేసేవాడిని కాదు రాధీ, కానీ నీకంటూ ఒక మ్యారీడ్ లైఫ్‌లో నువ్వుండి, అదీ హ్యాపీగా.. అప్పుడు మాత్రం ఖచ్చితంగా నిన్ను డిస్టర్బ్ చేసేవాడిని కాదు"

"ఇది డిస్టర్బెన్స్ ఎలా అవుతుంది?"

"ఖచ్చితంగా అవుతుంది. ఇలాంటి పనులు చేసున్న నన్ను చూస్తే ప్రేమించకుండా ఉండలేవు. నన్ను ఇష్టపడే నిన్ను ఇంకొక మగాడికి భార్యగా చూస్తూ ఊరుకోలేను నేను. అబ్బా.. ఎన్నిసార్లు చెప్పాలి ఇదంతా. ఇట్స్ ఎ మ్యాన్స్ థింగ్ నీకు అర్థం కాదులే"

"చాలా పొజెసివ్ నువ్వు, బయటకు కనిపించవ్ కానీ "

"తప్పేంటి?"

అతడి మీద ఆప్యాయతతో చేతిలో ఫోన్‌ను చెవిక్రింద గట్టిగా అదుముకుంది రాధిక.

"మా తమ్ముడు తెలుసు కదా, జగన్?" అని అడిగింది

"నువ్వు చెబితే వినడమే, పరిచయం లేదు"

"వాడి మొదటి పిల్లాడిని స్కూల్‌లో వేద్దాం అనుకుంటున్నాడు, నీ గురించి చెప్పనా?"

"తనేదో బిల్డింగులూ అవీ కడుతుంటాడు అన్నావ్. అలాంటి వాళ్ళకు కార్పొరేట్ స్కూల్సే కానీ ఇలాంటివి నచ్చుతాయా?"

"మనిషి చేసే వృత్తిని బట్టి అతడి మనస్తత్వాన్ని అంచనా వెయ్యకు. లోకం దృష్టిలో తమరు కూడా ఒకప్పుడు కరప్ట్ గవర్నమెంట్ ఇంజినీరే"

"డామిట్. ఇంక ఎప్పటికీ  విషయం వదలవా ?  "నన్ను" మళ్ళీ నాకు గుర్తుకుతేకు" అతడి ముఖంలో కోపం దగ్గర నుంచి చూడాలి అనిపించింది రాధికకు.

"ఏయ్... ఇప్పుడే నీ ఫేస్‌ను ఫోటో తీసి నాకు పంపవా?"

"చాల్లే.."

"సీరియస్లీ. ఇట్స్ ఎ ఉమెన్స్ థింగ్ యూ కాన్ట్ అండర్‌స్టాండ్"

"సరే అయితే. పంపించు మీ తమ్ముడిని"

"పిల్లలను చేరిస్తే, మా నాన్న కూడా వచ్చి నిన్ను కలుస్తాడేమో "

"రమ్మనండి మేడం. ఇంకా మీ బంధువులూ, పటాలం ఎవరున్నా పంపించండి. ఐ విల్ టేక్ కేర్"

"ఐ నో, దట్ యూ కెన్ టేక్ కేర్"

ఆమె ఏ ఉద్దేశ్యంలో ఆ మాట అన్నదో అర్థం కాక ఒకక్షణం తికమకపడ్డాడు అతను.

"ఐ మీన్ ఐ వోంట్ డిజప్పాయింట్ దెమ్" మాటలు కూడదీసుకున్నాడు .

"నాకు తెలుసు చే"

ఆమె కళ్ళు చూస్తే కానీ ఆమె మాటల్లోని మర్మమేమిటో అర్థం చేసుకోలేను అనిపించింది అతనికి. ఆమె తన ఎదుటకు వచ్చి నిలబడే వరకూ అది సాధ్యం కాదు కనుక అర్థం చేసుకునే ప్రయత్నం విరమించుకున్నాడు.

"ఇంతకీ ఏం చేస్తున్నావ్" మృదువుగా అడిగింది .

"ఇంతసేపూ వీవాకు కథలు చెప్పి నిద్రబుచ్చాను. నేనూ పడుకుందాం అనుకుంటున్నాను, నువ్వేం చేస్తున్నావ్?"

"ఈ వేళ హాలిడే తీసుకున్నాను , జెన్నిఫర్ సాయంత్రం బీచ్‌కు వెళదాం అంది, వెయిటింగ్"

అతడి గుండె వేగం హెచ్చింది "రాధీ ఒక మాట అడుగుతాను ఏం అనుకోవుగా?"

ఆమె మౌనంతో అంగీకారం చెప్పింది.

"బీచ్‌కు వెళ్ళినప్పుడు ఈతకు వెళతావా? బికినీ వేసుకుంటావా?" అడిగేసాక ఎందుకు అడిగానా అని సిగ్గుపడిపోయాడు. "నువ్వా బికినీనా?" వెటకారంగా నవ్విన రాజు గుర్తుకువచ్చాడు ఆమెకు.

"లేదు, నాకు అంత ధైర్యం లేదు చే" పెదవులు బిగించుకుంటూ చెప్పింది.

"దానికి ధైర్యం ఏంటుట , కమాన్, నీకు ఇష్టం వచ్చినట్లు నువ్వు చెయ్యలేవా?"

"ఇట్స్ నాట్ ఈజీ చే. మన చుట్టూ ఒక అదృశ్యమైన జైలు ఉంటుంది. ఇన్‌హిబిషన్స్, బెరుకు, భయం..చెప్పినంత సులభంగా వదుల్చుకోలేం కదా. సముద్రం దగ్గర ఒక్కదాన్నే ఉంటే కూడా ఎవరో చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఆకాశం క్రింద బట్టలు విడవాలంటే కూడా సిగ్గుగానే అనిపిస్తుంది. ఇక ఇక్కడి బీచ్‌లో వేలమంది జనాలు ఉంటారు, అందరి మధ్య ఎలా ..?"

"కానీ అందరూ కూడా అలా బికినీల్లోనే ఉంటారు కదా" సర్ది చెప్పబోయాడు చైతన్య

"అది వాళ్ళకు సహజం, నాకు కాదు"

"నీకు ఇష్టమా కాదా? " సూటిగా ప్రశ్నించాడు అతను.

సమాధానం చెప్పలేక ఇబ్బంది పడింది రాధిక. ఇష్టాన్ని తీర్చుకోలేనంత నిస్సహాయతను ఒప్పుకోవడానికి అడ్డుపడేదే అహం.

"రాధీ, ఎప్పటినుంచి చెబుతున్నాను నీకు ? చిన్న చిన్న కోరికలు కూడా తీర్చుకోలేకపోతే ఇక జీవితంలో ఎంత సాధించీ ఏం లాభం? సరే, మా స్కూల్, నేను, వీవా అందరి ఫోటోలు నీకు మెయిల్ చేస్తాను. బదులుగా నువ్వు సాయంత్రం బీచ్‌కు వెళ్ళిన ఫోటోలు నాకు పంపించు. అక్కడ నువ్వు కోరుకున్నట్లు నువ్వు ఉంటావు అని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా .."

"చే...నువ్వా నన్ను అలా చూడాలి అనుకుంటున్నావా?" బిడియాన్ని ముక్కలు చేసుకుంటూ అడిగింది ఆమె. ఇబ్బందిపడిపోయాడు చైతన్య

"అదీ..అదీ..." నీళ్ళు నమిలాడు

"చెప్పవోయ్ ఫర్లేదు" అల్లరిపెట్టింది ఆమె. జెన్నిఫర్ తనకు బహుమతిగా ఇచ్చిన రోజునుంచి తాను పదిలంగా దాచుకున్న బికినీను వెలుపలకి తీసే క్షణం వచ్చిందని గుర్తిస్తూ అతడిని మరింత ఆటపట్టించింది రాధిక.

"మరి..అదంటే.. అలా అని కాదూ.." మాటలు వెతుక్కుంటున్నాడు అతను

"హా అలాగా...మరి ఎలా అని.. "

"స్టాపిట్ రాధీ ,చిన్నపిల్లలా బిహేవ్ చెయ్యొద్దు"

"నేను అలానే చేస్తా, ఏం"

"సరే అలా మొండి చేస్తే ఇక నేనేం చేస్తాను"

"అవును ఏం చెయ్యలేవు"

"ఏమైంది నీకు, స్టాప్ మేకింగ్ ఫన్ ఆఫ్ మీ"

"నో ఐ వోంట్, ఎన్నాళ్ళకు దొరికావు మరి"

వాళ్ళ ముచ్చట్లు సెల్‌ఫోన్ సిగ్నల్స్‌మధ్యలో విహరిస్తున్నాయి. *మాటలను ఉపగ్రహాలనుండి నియంత్రించుకునేంతగా ఎదిగిన ప్రపంచంలో కూడా ఒక స్త్రీ, ఒక పురుషుడు ఒకటవ్వడానికి కావల్సింది స్వచ్ఛమైన మనసే.*

<u>*ఉపసంహారం:*</u>

" రాధికా,

మనం చూసే మనిషి ఒకరు, అసలు మనిషి ఇంకొకరు అని నీకు తెలుసా ? ఏమో తెలిసే ఉంటుందిలే, గొప్పగొప్ప చదువులు చదువుకున్నావు కదా. కానీ తెలిసిన విషయాలను ఆలోచనల్లో పాటించడం అంత సులభం కాదులే. ఆవిషయంలో బిగ్గెస్ట్ ఫెయిల్యూర్ ఎవరో కాదు .. నేనే. నేను పాటించలేని విషయాలు నీకు చెప్పడానికి అర్హుడనా అని అనుమానపడొచ్చు, ***కానీ, ఏ తప్పు చేయనివాడికంటే తప్పు చేసిన వాడికే తప్పు గురించి సరిగ్గా తెలుసు. ఒక మనిషిని అంచనా వేయడం అంత మూర్ఖత్వం ఇంకోటి ఉండదు. ఏ మనిషీ ఎవ్వరికీ పూర్తిగా తెలియడు. శూన్యంలా ఎవ్వరికీ తెలియని, చెప్పుకోలేని కోణాలు ఎన్నో ఉంటాయి. అవి అసహ్యించుకోదగినివీ కావొచ్చు, ఆరాధించదగినవీ కావొచ్చు. బైటకు చెప్పుకోలేక, చూపుకోలేక రహస్యాలుగా దాచుకున్న వ్యక్తిత్వాన్ని బట్టి మనిషి క్యారెక్టర్‌ను ఎందుకు డిసైడ్ చేస్తావు? మనిషి అవి దాస్తున్నాడూ అంటే, ఖచ్చితంగా అవి అతనికీ తనలో నచ్చిన విషయాలే అయి ఉంటాయి. తనకే నచ్చని క్వాలిటీస్‌తో తనను డిఫైన్ చేయడం తప్పు కాదా?*** ఏంటో.. నేను చెబుతున్నది నాకే కన్‌ఫ్యూజింగ్‌గా ఉంది. నీకు తెలుసు కదా, అయాం నాట్ వెరీ గుడ్ ఎట్ వర్డ్స్. ఎగ్జాంపుల్స్‌తో బెటర్‌గా చెప్పగలను. సే .. ఒక పులి. నువ్వు ఎదురవగానే మీదపడి చంపేస్తుంది. కాబట్టి అదంటే నీకు భయం. నీ దృష్టిలో అదొక క్రూరజంతువు. కానీ, నీతో ప్రమేయం లేనప్పుడు, పులి కూడా తన పిల్లలతో ముద్దుగా ఆడుకుంటుంది, సీతాకోకచిలుకలను పట్టుకోవాలని ప్రయత్నిస్తుంది, ఒక పొయెట్‌లా ప్రకృతిని ఆస్వాదిస్తుంది. కానీ అవన్నీ .. గుడ్ క్వాలిటీస్ అన్నీ నీకు అనవసరం కదా. అది నీ పట్ల క్రూరంగా ఉంది కాబట్టి అది క్రూర జంతువు అని ముద్రవేస్తావు. ఒక పిల్లి పిల్లను తీసుకో. నువ్వు పిలవగానే మ్యావ్‌మంటూ కాళ్ళదగ్గరకు వస్తుంది. నువ్వు చెయ్యి చాస్తే చాలు, నన్ను ప్రేమించమంటూ తలపైకెత్తి అమాయకంగా చూస్తుంది. ఒళ్ళో పసిపిల్లలా నిద్రపోతుంది. కానీ అదంతా నీదగ్గరే. ఎలుక కనిపిస్తే మాత్రం మనకు పులి ఎంత క్రూరం అంతకన్నా క్రూరం అది. దాని స్వభావంలోని అంతటి క్రూరత్వాన్నీ హాయిగా మరచిపోయి సాధు స్వభావాన్ని మాత్రం చూసి మనం ప్రేమించడం లేదూ? సాటి మనిషిలో మాత్రం అలా మంచి గుణాలను మాత్రమే ఎందుకు చూడలేము? సరే, ఈ ఎగ్జాంపుల్స్ అన్నీ ఎందుకు , ఇదే కన్ఫ్యూజ్‌తో నేను చేసిన తప్పులు చెప్పనా ... ?"

టైప్ చేస్తున్న మెయిల్‌లో ఒక క్షణం విరామం తీసుకున్నాడు రాజు. తనను ఎవరైనా గమనిస్తున్నారా అన్నట్లు చురుగ్గా చుట్టూ చూసాడు. అతని పక్క సీటులో ఉన్న అమెరికన్ వ్యక్తి ఐపాడ్‌లో పాటలు వింటూ కళ్ళుమూసుకుని ఉన్నాడు. ఎయిర్ హోస్టెస్‌లు జ్యూస్ అందిస్తూ అతిథి మర్యాదలు చూసుకుంటున్నారు. అతను ఉన్న విమానం మబ్బులను చీల్చుకుంటూ సాగిపోతోంది. కిటికీలోంచి మబ్బులను ఓసారి చూసి, మళ్ళీ టైప్ చేయడం మొదలెట్టాడు:

"ఈ విషయం నీతో చాలాసార్లు చెప్పాలి అనుకున్నాను. ఎవ్వరికీ చెప్పని, చెప్పుకోలేని విషయం. మా మమ్మీగురించి. తనంటే నాకు చాలా ఇష్టం. పిల్లలకు ఎప్పుడూ తల్లితండ్రుల్లో ఒకరితోనే ఎక్కువ అటాచ్‌మెంట్ ఉండటం కామనే కదా. అలా నేను, మమ్మీస్ బోయ్‌ను. డాడీ ఎక్కువగా బిజినెస్ టూర్లు అంటూ తిరుగుతుంటారు కదా కాబట్టి నన్ను స్కూలుకు తీసుకెళ్ళడం, స్టడీస్‌లో హెల్ప్ చెయ్యడం, కరాటే, డ్యాన్స్, క్రికెట్ ఏ రకమైన ఎక్స్‌ట్రాకర్క్యులర్ యాక్టివిటీస్‌కు అయినా తనే తీసుకువెళ్ళేది. షి ఈజ్ లైక్ ఎ

హీరో టు మీ. ఎంత బిజీ ట్రాఫిక్‌లో కూడా ఫాస్ట్‌గా కారు నడపగలదు. సూపర్‌మార్కెట్లో కానీ, సినిమా థియేటర్లలో కానీ, హాస్పిటల్ రిసెప్షన్‌లో కానీ ఎవరైనా రూడ్‌గా మాట్లాడినా, సరిగా సర్వీస్ ఇవ్వకపోయినా నిలదీసేస్తుంది. బయటివాళ్ళతో ఎంత ఖచ్చితంగా ఉంటుందో నాతోకానీ డాడీతో కానీ అంత కూల్‌గా ఉంటుంది. తను ఎకనామిక్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్. పార్లమెంటులో బడ్జెట్ సెషన్స్ జరిగేప్పుడల్లా పేపరు చూసి ఏవేవో మాట్లాడేది. తనకంటే ఇంటలిజెంట్ అని డాడీ చాలా మెచ్చుకునేవారు. ఇంటర్నెట్ లేని రోజుల్లోనే షేర్లు కొని అమ్ముతూ మంచి ప్రాఫిట్స్ సంపాదించేంది. నాకు ఏ గిఫ్ట్‌లు కొన్నా ఆ డబ్బుతోనే. నా జామెట్రీబాక్స్, క్రికెట్ సెట్, వాక్‌మ్యాన్ అన్నిటికీ ఏ కంపెనీ షేర్ల లాభాలతో కొంటే ఆ కంపెనీ పేరుతో చెప్పుకునేవాళ్ళం. డాడీ, ఎకనామిక్స్, నేను తప్ప తనకు వేరే లోకమే లేదు. మూడింటిలో నేనే తనకు ఎక్కువ ఇంపార్టెంట్. నాకు చిన్న కష్టం, బాధ రాకుండా చూసుకునేది. నా విజ్‌డం టూత్ పీకించాలంటే కూడా టెన్షన్ పడిపోయేది. సరే ఇదంతా ఏంటి బోర్ అనుకోవద్దు, ఇంతకుముంది పులి, పిల్లి ఎగ్జాంపులులో లాగా ఇవన్నీ కూడా పైకి కనిపించే క్వాలిటీస్. నాకు మా మమ్మీగా తెలిసిన వ్యక్తి అంటే తనే. కానీ, ఒకరోజు ఆమెలో నాకు తెలియని ఒక కొత్త వ్యక్తి తెలిసింది. పేరు చెప్పను కానీ, మా రిలేటివ్స్‌లో బాగా దగ్గరివాడయిన ఒక వ్యక్తి మా ఇంట్లో మా మమ్మీను ముద్దుపెట్టుకుంటుంటే చూసాను. అప్పటికే నాకు సెక్స్ అంటే ఏమిటి, భార్యాభర్తలు అంటే ఏమిటి అని తెలిసేంత వయసు వచ్చింది. అతడి చేతులు మా మమ్మీ ఒంటి మీద పరపురుషుడు తాకకూడని చోటల్లా తాకుతుండటం చూసాను. ఇంట్లో ఎవరూ లేరు అనే ధైర్యం వలనో ఏమో మమ్మీ అతడితో నవ్వుతూనే బిహేవ్ చేస్తోంది. నాకు నచ్చలేదు. ఆమెను అలా చూడటం నాకు నచ్చలేదు. నవ్వుతుంటే మమ్మీ చాలా అందంగా ఉంటుంది. కానీ అప్పుడు మాత్రం తను నవ్వుతున్నా కూడా చాలా అసహ్యంగా కనిపించింది. ఎందుకు చేసానో కానీ, మమ్మీ అని పిలిచేసాను. హఠాత్తుగా నన్ను చూసి వాళ్ళిదరూ తడబడ్డారు, సర్దుకున్నారు. అరక్షణంలో అసలేమీ జరగనట్లు నన్ను పలకరించారు. అప్పుడు కూడా మమ్మీ నవ్వుతూనే ఉంది. కానీ నాకు నచ్చలేదు. నేనేం చూడలేదు అనుకుందో, చూసినా నాకేం అర్థం కాదు అనుకున్నారో కానీ ఆ రోజు తర్వాత కూడా అతను మా ఇంటికి వచ్చేవాడు, మమ్మీ నవ్వుతూనే మాట్లాడేది, డాడీతో కలిసి భోజనం వడ్డించేది, అతను ఇంట్లో ఉండగా నన్ను స్కూలుకు పంపేది. ఎక్జాట్‌గా సెక్స్ అంటే ఏమిటో తెలియకపోయినా మమ్మీ, డాడీతో తప్ప ఇంకెవ్వరితో అలా ఉండకూడదని మాత్రం తెలుసు నాకు. ఆ రోజు నుంచి మమ్మీ ఏం చేసినా నాకు నచ్చేది కాదు . తన వంట, పాట, స్పర్శ ,తనతో ఫోటో, కారులో తనపక్కన కూర్చోవడం.. ఏదీ నచ్చదు. నువ్వు చెడ్డదానివి అని గట్టిగా అరిచి చెప్పాలి అనిపించేది. కానీ అంత శక్తి వచ్చేది కాదు. అందుకే బోర్డింగ్ స్కూలుకు మారిపోయాను. హాలిడేస్‌లో కూడా ఇంట్లో కంటే లైబ్రెరీలోనో, క్రికెట్ గ్రౌండులోనో ఎక్కువ ఉండేవాడిని. కానీ అయాం సో అటాచ్డ్ టు ఫెమినైన్ లవ్. మమ్మీకు దూరం అయినా, ఆడవారి చేతులతో ముద్దలు పెట్టించుకుని భోంచెయ్యడం, వాళ్ళతో కలిసి టీవీ చూడటం, షాపింగ్ చెయ్యడం, సినిమా థియేటర్‌లో లేడీస్ క్యూ పక్కనే నిలబడి ఉండటం చిన్నప్పటినుంచి అలవాటు అయిపోయాయి. మదర్ కంటే మదర్లీ లవ్ గొప్పది. అమ్మను ద్వేషించుకున్నా అమ్మ ప్రేమ కావాలి అనిపించేది. అది కేవలం ఆడవాళ్ళతోనే వస్తుంది అనిపించేది. స్కూలులో లేడీ టీచర్లు మెచ్చుకుంటేనే మనసుకు తృప్తిగా అనిపించేది. మగపిల్లలకంటే ఆడపిల్లలతోనే తొందరగా స్నేహం కుదిరేది. అది కూడా నా వయసు కంటే కూడా నాకంటే పై క్లాసు అమ్మాయిలతో. అక్కా అంటూ వాళ్ళతో తిరుగుతూ ఉంటే ధైర్యంగా ఉండేది. ఇంకొంచెం పెద్దయ్యాక, ఈ లవ్, రొమాన్స్, సెక్స్ ఇలాంటి విషయాలు తెలిసాక కూడా నాకు అమ్మాయిలంటే ఇంకే రకమైన ఉద్దేశ్యమూ లేదు. మన సొసైటీలో ఒక వయసు వచ్చాక ఆడామగా చనువుగా ఉండటం కష్టం కదా. కానీ నాకు ఏ దురుద్దేశ్యాలూ లేకపోయినా కొందరు స్నేహితురాళ్ళతో నేను కాస్తంత చనువు చూపిస్తే నన్ను అనుమానంగా చూసి దూరం పెట్టేవారు. ఇంకొందరు అయితే నాతో కంటే తమ మనసుకు నచ్చిన అబ్బాయిలతోనే ఎక్కువ చనువుగా ఉండేవారు. చాలా లోన్లీగా అనిపించేది. పెద్దవాడిని అయినందుకు కోపం వేసేది. చిన్నపిల్లవాడిగానే ఉండిపోయి ఉంటే ఈ తారతమ్యాలు లేకుండా ఆడపిల్లలతోనే ఉండొచ్చు కదా అనిపించేది. కానీ పెరిగిపోవడం అనేది ఇర్రివర్సబుల్ ప్రాసెస్ కదా. అదే

సమయంలో మమ్మీతో క్లోజ్‌గా ఉండే అతను ఒక యాక్సిడెంట్‌లో చచ్చిపోయాడు. ఆ బాధ వలనో లేక నేను పెద్దయిపోయాననే ఏమో మమ్మీ కూడా నన్ను పట్టించుకోవడం తగ్గించేసింది. నచ్చని మనిషి అయినా తను పక్కన ఉన్నప్పుడు ఎంత ధైర్యంగా ఉండేదో అప్పుడు తెలిసొచ్చింది. పోనీ ముందులాగే మమ్మీచాటు కొడుకుగా ఉండిపోదాం అనుకున్నాను. కానీ తను పడనివ్వలేదు. ఎక్కడికయినా వెళదామంటే కూడా పెద్దయ్యాక తన తోడు ఏమిటన్నట్లు తిట్టి ఒక్కడినే పొమ్మనేది. స్నేహితురాళ్ళు కూడా తమ బోయ్‌ఫ్రెండ్ అని చెప్పుకోగలిగేవాళ్ళకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తూ అలాంటి అబ్బాయిలతోనే వెళ్ళేవాళ్ళు. ఆడది ఎప్పటికీ తోడుగా ఉండాలీ అంటే, ఏ మగవాడయితే తనతో శరీరాన్ని పంచుకుంటాడో అతడికే విలువ ఇస్తుందీ అనిపించేది. అందుకే, నేను కూడా అమ్మాయిలను ఆ ఉద్దేశ్యంతో చూడాలి అనుకున్నాను. కానీ కుదరలేదు. ఆ అమ్మాయిలందరూ నాతో ఉండే అమ్మలాంటివాళ్ళు. వంట చేస్తూనో, వడ్డిస్తూనో, పాటలు పాడుతూనో, నవ్వుతూ మాట్లాడుతూనే అందంగా ఉంటారు కానీ, రిలేటివ్‌తో అమ్మ ఉన్నట్లుగా ముద్దు పెట్టుకుంటూనో, అరమోడ్పు కన్నులతోనో, ముఖంలో కామం ఛాయలతోనో... ఊహించుకుంటేనే అసహ్యంగా తోచేవారు. అమ్మాయిలెవ్వరైనా కాస్త విచ్చలవిడిగా నవ్వినా భయంగా అనిపించేది. వాళ్ళ బట్టలు సాధారణంగా కప్పే అవయవాలను దాటితే అసహ్యంగా ఉండేది. మిగతా అబ్బాయిలందరూ కాలేజ్ గోడలకూ, పుస్తకాల మధ్యలోనూ, బెంచీల మీదా బట్టల్లేని అమ్మాయిల బొమ్మలు వేసి, వాటికి క్లాస్‌మేట్స్ ే పేర్లు, టీచర్ల పేర్లు రాస్తుంటే చాలా అసహ్యంగా అనిపించేది .కానీ అసహ్యపడి ఏం చెయ్యగలను? అదేం విచిత్రమో. నేను అంత అసహ్యపడే విషయాలన్నీ అమ్మాయిలకు సర్వసాధారణంలాగా ప్రవర్తించేవారు. గోడలూ, బెంచీలమీద రాతలు వాళ్ళు చూసి ఏం చూడనట్లే ఉండేవారు. మాతో పాటు సినిమాల్లో అర్ధనగ్న నృత్యాలూ, ముద్దులూ చూసి అదంతా మామూలే అన్నట్లు ప్రవర్తించేవారు. అలాంటి వాళ్ళల్లో ఒక అమ్మాయి నాతో చాలా స్నేహంగా ఉండేది. వాళ్ళ పేరెంట్స్ కూడా నాకు చాలా పరిచయం. అమ్మ,అక్క,చెల్లి ఏమో తెలీదు కానీ అమ్మాయి ఇంట్లోని మనిషి అంత ఆత్మీయంగా అనిపించేది. ఎందుకు జరిగిందో ఏమో, ఒకరోజు ఆ అమ్మాయి నన్ను కౌగిలించుకుంది. నాకేమీ అనిపించలేదు. నవ్వుతూనే మాట్లాడాను. ఇద్దరం చాలా సేపు మాట్లాడుకున్నాం. ఆ అమ్మాయి చెంపలూ, చేతులూ..గుర్తుచేసుకుంటుంటే స్పర్శ ఇప్పుడు కూడా ఫ్రెష్‌గా అనిపిస్తోంది. ఆ అమ్మాయి నా చెంపల మీద ముద్దు పెట్టుకుంది. నాకు నచ్చింది. అమ్మాయి నా కళ్ళలోకే చూస్తూ ఉండింది. నేనూ చాలా సేపు అలానే చూసాను. చాలా అందంగా కనిపించింది. కొంతసేపటికి తను వెళ్ళిపోయింది. తర్వాత నుండీ నాతో ఆ అమ్మాయి స్నేహం తగ్గించేసింది. కారణం ఏమిటో నాకు అర్థం కాలేదు. నెలరోజులకే అమ్మాయి మా కాలేజ్‌లో తిరుగుబోతు అని పేరున్న ఒక అబ్బాయితో చాలా సన్నిహితంగా ఉన్నట్లు తెలిసింది. అప్పుడు అర్థమైంది, ఆ వేళ ఆ అమ్మాయి శారీరిక సంబంధం కోరి నాకు దగ్గరైందని, నేను అందించలేకపోయానని కోప్పడి నన్ను దూరంచేసిందని. ఆడది నన్నే అంటిపెట్టుకుని ఉండాలి అంటే తనతో శరీరం పంచుకోవాల్సిందే అనిపించింది. నాకు అసహ్యమైన పనులన్నీ చేయడానికి నన్ను నేను కౌన్సిలింగ్ చేసుకున్నాను. కళ్ళకు కనిపించే ప్రతి అమ్మాయీ పడకలో ఉంటే ఎలా ఉంటుందో అని ఊహించుకోవడం మొదలెట్టాను. మొదట చాలా వికారంగా తోచేది. కొన్నాళ్ళకు అదే అలవాటు అయిపోయింది. అలా ఎంత ఊహించుకున్నా, అమ్మలాగా తప్పు చెయ్యకూడదు అనే బలమైన నిర్ణయం మాత్రం ఉండేది. జీవితాంతం ఒక అమ్మాయికే కట్టుబడి ఉండాలి అనే చాలా త్వరగానే పెళ్ళికి సిద్ధమయ్యాను. నా భార్య, అమ్మలా తప్పు చేసే ఆడది కాకూడదు అనే నిన్ను పెళ్ళిచూపులప్పుడు ప్రత్యేకంగా కన్యత్వం గురించి అడిగాను. నువ్వు నాకు నమ్మకంగా అనిపించావు. మళ్ళీ మా చిన్నప్పటి అమ్మ దొరికినట్లు అనిపించింది.

కానీ రాధీ, చెడ్డగుణాలు అలవాటు చేసుకున్నంత సులభంగా వదలవేమో. నువ్వు ఎంత ప్రేమించినా, నీతో ఎంత చనువుగా ఉన్నా నాకు తృప్తిగా అనిపించేది కాదు. తీరని ఆకలిలాగా ఇంకా ఆడతనం కావాలి అనిపించేది. నీ దగ్గర ఇవ్వడానికి నాకు ఇంకేమి ఉందని నిన్ను అడగగలను? నిన్ను సంపూర్ణంగా అనుభవిస్తున్నా నా ఆకలి తీరకపోతే తప్పు నాదే కదా. ఆ అర్థాకలితోనే మిగతా ఆడవాళ్ళను చూడటం మొదలెట్టాను. చెబితే నువ్వు నమ్మవు రాధికా, ఈనాటికీ నాకు ఆకలి తీరలేదు. తృప్తిపడదాం అని ఎంతగా నన్ను

నేను కంట్రోల్ చేసుకున్నా, తృప్తి రావట్లేదు. నాతో సంబంధం ఉంది అని నువ్వు అనుకుంటున్న ఆడవారితో కేవలం సెక్స్ కోసం నేను ఉండట్లేదు రాధికా!. ఒకతె చాలా అందంగా పాడుతుంది, వంట చేస్తుంది. ఇంకొకామె మా అమ్మలాగ ఎకనామిక్స్ గురించి చాలా బాగా మట్లాడుతుంది. ఇంకొకావిడ షాపింగ్ చేసేటప్పుడు మా అమ్మలానే కనిపిస్తుంది. ఇంకొకావిడను సినిమాకు తీసుకెళితే నా భుజమ్మీదే పడుకుని నిద్రపోతుంది. ఆమె అలా ఉంటే నాకు చాలా తృప్తిగా ఉంటుంది. కొన్ని నిముషాల ఆత్మతృప్తికోసం రకరకాల ఆడవాళ్ళతో సంబంధాలు పెట్టుకున్నాను. సరే, ఇప్పుడు ఇదంతా చెప్పడం, నన్ను నేను మంచివాడినని చెప్పుకోవడానికో, నా తప్పులు సమర్థించుకోవడానికో కాదు. కారణం ఉన్నంత మాత్రాన తప్పు తప్పుకాకపోదు. నావలన ఇంత తప్పు జరగడానికి కారణం నేను తప్పుగా ఆలోచించడమే. డైవోర్స్ తీసుకుని నువ్వు వెళ్ళిపోయాక నన్ను నేను అనలైజ్ చేసుకుంటేనే తప్పేమిటో ఇప్పుడు తెలిసింది.

మా మమ్మీ ఎవరితో ఎలా ఉన్నా, ఏజ్ ఎ మదర్, నాతో చాలా ప్రేమగా ఉండేది. ఒక కొడుకుగా అంతకు మించి నాకేం కావాలి? కానీ నాకు తల్లిలా కాకుండా, ఆడదానిగా ఆమెలోని లోపాలు వెతికి ఆమెను ద్వేషించాను. ఫలితం, నన్ను నేనే ద్వేషించుకునేంత దిగజారిపోయాను. నువ్వూ అదే తప్పు చేసావు రాధీ. నీకు భర్తగా నిన్ను నేను ఎప్పుడు అగౌరవపరచలేదు, తక్కువ చూడలేదు. కాదు మగవాడిగా నాలో ఉన్న ఒక బలహీనతను జీర్ణించుకోలేక, మొత్తం వ్యక్తిగానే నన్ను అసహ్యించుకున్నావే? అది కరెక్ట్ కాదు. ఎనీవే, జరగాల్సింది జరిగిపోయింది. ఇదంతా చదివి నువ్వు నన్ను అర్థం చేసుకుని క్షమిస్తావని కాదు, ఇంకోసారి ఇలాంటి తప్పు చేయవని చెబుతున్నా. ఏ వ్యక్తిని ప్రేమించినా అతను నీతో ఎలా ఉన్నాడనే చూడు, సమాజంలో ఏమిటి, మిగతా వ్యక్తులతో ఎలా ఉంటాడూ, తనతో తాను ఎలా ఉంటాడూ అవన్నీ డిసెక్ట్ చేసి చూస్తే నీకు నీ వ్యక్తి కూడా మిగలడు. నేను ఇప్పటికీ చాలామంది ఆడవాళ్ళను ప్రేమిస్తాను, కానీ నాపక్కన ఉండే నా భార్యగా నిన్నుతప్ప మరెవ్వరినీ ప్రేమించను, ప్రేమించలేను. నాకంటూ పిల్లలు పుడితే, అది నీద్వారానే ఉండాలి అనుకున్నాను. ఇప్పుడు అదంతా కుదరదు కదా. పోనీలే అదీ ఒకందుకు మంచిదే నాలాంటి కన్‌ఫ్యూజ్డ్ థాట్ ప్రాసెస్ ఉన్నవాడికి ఒక అబ్బాయి పుడితే వాడు ఎలా సఫర్ అవుతాడో. నాకే ఒక అమ్మాయి పుట్టి, అమ్మలాగో నాలాగో తనూ ఎవరెవరితోనే చనువుగా ఉంటే తండ్రిగా నేను సహించగలిగేవాడిని కాదేమో. రాధీ ఐ జస్ట్ హేట్ మై సెల్ఫ్. సారీ ఫర్ ఎవ్విరిథింగ్"

ఆఖరున సంతకంలా తన పేరు టైప్ చేయబోయి, ఏదో అడ్డుపడినట్లు ఆగాడు రాజు. రాసిన మెయిల్ మొత్తం మళ్ళీ చదువుకున్నాడు. తల్లిని గుర్తుకు చేసుకున్నాడు. ఆమె గురించి రాసినదంతా సెలెక్ట్ చేసి డిలీట్ చేసాడు. కానీ విషయం లేకపోతే ఉత్తరానికి అర్థం లేదు అనిపించింది. మొత్తంగా డిలీట్ చేసాడు. నిస్పృహగా ల్యాప్‌టాప్ మూసేసాడు. చెప్పుకోవలసిన మాటలు చెప్పలేకపోవడం అతడికి ఇది మొదటిసారి కాదు. ఆఖరు ఎప్పుడో కూడా అతనికే తెలియదు. ***తన గురించి తాను సరిగ్గా ఆవిష్కరించుకోలేని ప్రతి మనిషీ ఎంతపెద్ద ప్రపంచంలో ఉన్నా ఒంటరిగానే మిగిలిపోతాడు.*** విమానం కిటికీలోంచి చూస్తుంటే తెల్లటి మబ్బుల పడకలా ఉంది ఆకాశం. ఒంటరిగా వాటి మీద అలసిసొలసేవరకూ పరుగెత్తి పడిపోవాలి అనిపించింది రాజుకు. ***ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు అనే మాట జీవితానికి వర్తిస్తుందేమో కానీ కలలకూ, కవిత్వాలకూ కాదు.*** చిన్న కోరిక అయినా తీరదు కదా అనే దిగులుతో కిటికీలోంచి ఆకాశాన్ని చూస్తూ ఉండిపోయాడు రాజు. ఎవరు చూసినా చూడకపోయినా తనదేం అన్నట్లు ఆకాశం విస్తారంగా అలుముకునిఉంది.